॥ శ్రీ గురుభ్యో నమః ॥

పరిపూర్ణ రాజయోగ సిద్ధాంత
వ్యాసమంజరి
(ద్వితీయ సంపుటము)

రచయిత :

"పరిపూర్ణ దర్శనాచార్య" "సదానంద"

శ్రీ ఇలపకుర్తి వీరవెంకటరామచంద్రరావు

నర్సాపురం (పశ్చిమ గోదావరి జిల్లా)

వెల
రు. 15-00

విషయసూచి

1.	మానవ శ్రేష్ఠత్వము	-	5
2.	సేవాధర్మము	-	10
3.	గురుస్వరూపము	-	12
4.	గురుగీతా ప్రయోజనము	-	14
5.	గురుపూజ యెందుకు ?	-	16
6.	గురుపూజ పరమార్థము	-	22
7.	నమస్కార విధానము	-	26
8.	శిష్యునికి గురువు అవసరమైతే గురునికి శిష్యుడూ అవసరమే	-	31
9.	ఆత్మసాక్షాత్కారము - సాధన ధర్మములు	-	34
10.	రాజయోగము	-	37
11.	పరిపూర్ణ రాజయోగము	-	42
12.	అస్పర్శ యోగము	-	46
13.	యోగఃకర్మసుకౌశలం	-	49
14.	నైష్కర్మ్య సిద్ధి	-	53
15.	భక్తి జ్ఞానములు	-	60
16.	కర్త - కర్మ క్రియలు	-	62
17.	ఆత్మవస్తు నిశ్చయము అవశ్యకత	-	70
18.	పరిపూర్ణబోధమార్గంలో సాధనలేదా ?	-	75
19.	సంసారము	-	76
20.	ఆశ	-	80

A1

1. మానవ శ్రేష్టత్వము

సృష్టియందలి స్థావర జంగమ జీవులన్నియుకూడి ఎనుబది లక్షల తరగతులుగా విభజింపబడినవి. ఇందు మానవులు నాల్గులక్షల రకములని నిర్ణయించబడినది. అయితే మానవులందరూ ఒకే తరగతివారై యుండాలని స్థూల దృష్టికి గోచరిస్తుంది. అది సరికాదని కొంచెం విచారిస్తే స్పష్టమవుతుంది. మానవశబ్దము మనస్సు అను శబ్దము నపేక్షించి కల్గిన దనవచ్చును. ఐతే పశు,పక్షి,క్రిమి, కీటకతరు, లతా, గుల్మాదులయందు మాత్రము మనస్సు లేదా ? ఉన్నదికాని అల్పము అల్పశక్తి వంతము మాత్రమే అయి వున్నది. ఈ జీవులు ప్రకృతిబద్ధముగా మాత్రమే ప్రవర్తించి వానికి కావలసిన అహార పానీయములు సంపాదించుటకు తగినంతమాత్రంగానే తమ మనస్సును వినియోగించ సమర్థములై యున్నవేగాని వాని మనస్సునకు యితర సంకల్పాదికము లేమీ యుండవు. ఎట్లనగా అసంజ్ఞాజీవులు లేక ధాతుజీవులు (elements) యందు పరావాగ్రూప చైతన్యము మాత్రమే కలదు. అనగా యీ చైతన్యము ఏమాత్రమూ వ్యవహార సమర్థము గాదు. అంతస్సంజ్ఞాజీవులని చెప్పబడే తరు లతా గుల్మాదులయందు పశ్యంతి అని చెప్పబడే తెలివి లేక చైతన్యము కలదు. ఈ రెండు రకముల జీవులు స్థావరములని లేక అచరములని (అనగా ఒకచోటి నుండి మరొకచోటుకు పోజాలనివి) అందురు. ఇవి తమోగుణాధిక్యత కలవి. క్రిమి, కీటక, పక్షి, పశువు మొదలగు సంజ్ఞాజీవులకు సాంఖ్యులు (ప్రాధానీకులు) రజోవిశాలతిర్యగ్ సర్గమని పేరిడిరి. వీనియందు మధ్యమావా గ్రూపమగు చైతన్యము కలిగి వున్నవి. ఏ భావము ప్రకటించవలెనన్నను యివి తమ నోటిద్వారా ఒకేశబ్దమును వెలువరించును. మానవునియందున్న మనో వాక్ శరీరములు సంపూర్ణ వికాసముచెంది వున్నవి. మానవుడు వైఖరీవాక్ కలిగి తన భావములన్నియు, వర్ణాత్మకమగు శబ్దజాలముతో కూడిన వాక్కుద్వారా సర్వవ్యహారములు జరుపుటకు సమర్థుడై వున్నాడు.

ఒక్క ఐహిక ప్రయోజనములకు మాత్రమే గాక మానవుడు తన మానసిక శక్తులను విద్యా,ధ్యాన తపోనుష్ఠానాది సాధనలచే వికాసము చెందించి ఏకాగ్రత సాధించి పారమార్థిక విషయములను సైతము మానసిక ప్రత్యక్షము గావించుకొనుచున్నాడు. సృష్టిమూలమునన్వేషించి, మానవాతీతశక్తి మహత్వములను సాధించుచున్నాడు. తన మానసిక శక్తులను వికాసముగావించుకొని తన మానసేంద్రియమును తన స్వాధీనమందుంచుకొనగల శక్తి మానవుని కొక్కనికే గలదు. అట్లయ్యును తన మానసికశక్తులను నిర్వాణము గావించి ప్రాపంచికమగు

స్థూల భోగాదికములను మాత్రమే వినియోగించువారిని మానవులనుట సరిగాదని అట్టివారికి మానవపశువులని పేరుపెట్టబడినది. కేవలము యింద్రియ విషయములయందు మాత్రమే వర్తించు అన్ని యితర జీవోపాధులతో పాటు అన్నిజీవులకు సమానములగు జాగ్రదాద్యవస్థల యందు మాత్రమే వర్తించు వీరికిన్ని పశువులకున్నూ తేడా ఏమియు లేదని ------

శ్లో॥ ఆహార నిద్రా భయ మైధునాని
సమాన మేకం పశుభి ర్నరాణాం
జ్ఞానం నరాణాం అధికం విశేషో
జ్ఞానేన హీనః పశుభి స్సమానః ॥

తా॥ ఆహార నిద్రా భయ సంగమములు మానవులకు పశ్వాదులకు సమానమే. గాని, మానవునకు జ్ఞాన మధికము. అట్టిజ్ఞానము లేనిచో మానవుడు పశువుతో సమానుడు.

ఇందుపయోగింపబడిన 'జ్ఞాన' శబ్దమున కర్థమేమి ? జ్ఞానమనగా సామాన్యరూపమగు తెలివికాదు. అట్టి తెలివి అన్ని జీవరాసులయందు న్యూనాధిక్యతలతో నుండనేయున్నది. శరీర పోషణకై అవి ఆహార పానీయములను వెదకుకొని మానవులవలెనే సంపాదించుకొనుచున్నవి. మానవులు గృహనిర్మాణ మొనర్చుకొనునట్లే అవియును గూళ్ళో, గుహలో చూచుకొనుచున్నవి. అంతేగాక కొన్ని విషయములయందు పశ్వాదులయొక్కయూ క్రిమి,కీటకాదులయొక్కయు తెలివి మానవుని తెలివి కన్నా అధికముగనే యుంటున్నది. ఉదాహరణకు చీమకు దివ్యజ్ఞానము, కోడికి కాలజ్ఞానము. చీమ మధురపదార్థము ఎంత గహనాతిగహనమగు స్థానమునందు జాగ్రత్త పెట్టినను దానిని బహుతేలికగా గుర్తించగలదు. ఆ పదార్థమును జాగ్రత్తపరచిన మానవుడుకూడ ఎంతో శోధించిన మీదటగాని ఆ మధుర పదార్థమును కనుగొనజాలకున్నాడు. కోడి కాలమును గుర్తించి రాత్రి నాల్గుఝాములు యందు కొక్కొరోకో యని కూయుచున్నది. అనేక పరికరముల సృష్టించిన మానవుడు ఆయా పరికరముల సహాయము లేనిచో కాలమును తెలిసికొనజాలకున్నాడు. సాలెపురుగు యొక్క నేత, తేనెపట్టు, పిచ్చుకగూళ్ళు వగైరాల యొక్క నిర్మాణములు పరిశోధించినచో ఆ పనులయందు మాత్రము ఆయా జీవుల యొక్క నైపుణ్యము మానవుని నైపుణ్యము ఎన్నో రెట్లు మించుచున్నది. కనుక పైశ్లోకము నందుపయోగింపబడిన జ్ఞానమనగా లౌకికజ్ఞానము కాదని తెలియబడుచున్నది.

అయితే యీ జ్ఞానశబ్దమునకు సరియగు అర్థ మేమి? మానవమనస్సు కామనామయి మాత్రమే కాదు: సంస్కారముల మూటమాత్రమేగాదు. సంకల్ప వికల్ప ద్వయదోషాత్మకం మాత్రమేకాదు విషయ యదార్థతను గుర్తించునపుడు జ్ఞానమనీ, నిశ్చయాత్మకమగుచో బుద్ధియనీ, చింతనాయత్త మైనపుడు చిత్తమనీ, క్రియాకారమై కర్తృత్వాభిమానము పూనినపుడు అహంకారమనీ వివిధ నామములను పొందుచుండు అంతరేంద్రియ పంచకముగాదు. వాని అధిభౌతిక

వ్యవహారరూపకార్యమున్నూ గాదు. అంతఃకరణ పరిణామ రూపమగు జ్ఞానము అను ఇంద్రియము, యుక్తాయుక్త నిత్యానిత్య అత్మానాత్మ వివేకయుతమైనపుడే దాని నామము సార్థక్యత గాంచుచున్నది. కాని యీ యింద్రియమే సర్వులయందూ సామాన్యరూపముగ నుండి విషయములను గుర్తెరుగునపుడు దానికి జ్ఞానమను పేరుగూడ సార్థకముగాదు. ఉదాహరణకు ఆవు దాని దూడను లేక తన యజమానినీ గుర్తించును. జ్ఞానమునకు అధి భౌతికము ఎరుగుట. అంతమాత్రమున ఆ ఆవుయందు జ్ఞానము లేదు. జ్ఞానమను ఇంద్రియము యొక్క అల్పప్రకాశము మాత్రమే కలదు అని అనవలసి యున్నది. జ్ఞానశబ్దమును భగవద్గీత యెట్లు నిర్వచించి వివరించినదో కొంచెము తెలిసికొందుము .

శ్లో॥ అధ్యాత్మ జ్ఞాన నిత్యత్వం, తత్వజ్ఞానార్థ దర్శనం
ఏతత్ జ్ఞానమితిప్రోక్త మజ్ఞానం యదతో ఽ న్యథా

తా॥ నిత్యమగునది ఆత్మయొక్కటియే యని యెరింగి ఆత్మతత్వము యొక్క సాక్షాత్కారము పొందియుండుటయే జ్ఞానముగాని మిగతా అంతయూ నజ్ఞానమేయని భావము.

శ్లో॥ యద్జ్ఞాత్వాన పునర్మోహ,
మేవం యాస్యసి పాండవ।
యేన భూతాన్యశేషేణ,
ద్రక్ష్యస్యాత్మన్యథో మయి ॥ భ॥గీ॥ 4-35

తా॥ దేనిని తెలిసినచో తిరిగి మోహము గలుగదో దేనిని తెలియుటచే నీయందునూ నాయందునూ గూడ సకల భూతములను చూడగలవో అదియే జ్ఞానము

మరియును "సర్వభూతస్థ మాత్మానం సర్వభూతాని చాత్మని" అనగా తనయందు సర్వభూతములను, సర్వభూతములయందును తననూ చూడగల్గుటయే జ్ఞానము.

ఇట్టి జ్ఞానము మానవునియందు మాత్రమే సాధ్యము. మానవుని మనస్సుకు అతీతశక్తులున్నవి. "మనోహిజతువత్" అనగా మనస్సు-లక్కకరగించి ఏమూసలో పోసిన ఆ యాకారం ధరించినట్లు ఏ వస్తురూపంనందు మనస్సు ఏకాగ్రమగునో ఆ వస్తురూపము మనస్సు ధరించగలదు. ఆ వస్తువు యొక్క స్వరూప స్వభావములను సంపూర్ణముగ మనస్సునందు వ్యాపకము కాగా మనస్సు తన్మయమైపోవును. యిదే వస్తుసాక్షాత్కారము. 'తత్వజ్ఞానార్థ దర్శనం' అనగా యిదే. యిట్టి దర్శనము లేకుంటే జ్ఞానము లేదనే చెప్పాలి. అట్టి జ్ఞానరూపం వహించు శక్తి గల మానవ మనస్సును కేవలం ఐహికప్రయోజనములకు మాత్రమే వ్యతీతముచేసినచో కేవలము పశుసమానుడే. కాగా అట్టి జ్ఞానసముపార్జన గావించుటకై మానవులు తమ అభినివేశము ననుసరించి తత్వవిచారణయో. యోగాభ్యాసమో, మతనిర్ణయమో, భక్తియో, లేక మంత్రోపాసనయో, అంతరేంద్రియ పంచకంలోని జ్ఞానమనో బుద్ధి చిత్తహంకారాలను

పురస్కరించుకొని సాధనగావించుచున్నారు. వీరిని సాధారణ మానవు లనవచ్చును. ఇట్టి సాధకులు ఏ సాధన జేయనివారి కన్న యుత్తములేగదా ! ఈ సాధనలయందు గలిగిన ఏదో శక్తినో, మహత్తునో తమ స్వార్థప్రయోజనాలకై వినియోగించుకొని ప్రజాసామాన్యమునకు తాము గొప్ప మహాత్ములమని చాటుకొనుచు నమ్మకము కల్గించి మూఢజనులను మోసగించి ధనసముపార్జన గావించు దుష్టులే మానవరాక్షసులు.

అట్లు తాము పొందిన ఆత్మజ్ఞానమువలన కేవల జన్మరహితము కాజాలదని గుర్తించి "ఆత్మాతీతం కేవలాత్మ" అని చెప్పబడే కేవలాత్మ స్వరూపమగు పరిపూర్ణ బ్రహ్మమును తెలియజేయు పూర్ణగురువులను ఆశ్రయించి తద్వారా తరించుట మాత్రముతో తృప్తిపొందక "స్వయంతీర్థః పరాంస్తారయతి" అనే న్యాయంగా తోటిమానవుల జన్మ తరణోపాయానికై తోడ్పడుచు స్వార్థరహితముగ సమిష్టి శ్రేయోదాయక కర్మలనే ఆచరింపువారే మానవులయందలి దేవతలు. వీరే నిజమగు భూసురులు. ప్రాపంచ పారమార్థికులను యిరువురిలో యీవిధంగా మానవ పశువులు, మానవులు, మానవరాక్షసులు, మానవదేవతలు అను నాల్గు విధముల వారు గలరు.

1. మానవుడొక్కడే వ్యవహార యోగ్యమగు తన వాక్కు ద్వారా సర్వ వ్యవహారములుచేయగల సమర్థుడు.

2. మానవ మనస్సు చాల మహిమావంతము. విద్యాధ్యాన తపోనుష్ఠానాది సాధనములచే, మంత్రయోగశక్తులను సాధించుటయేగాక, తన మనస్సును వికాసము చెందించి కేవలము దేనిని తెలిసినచో తిరిగి మోహము కలుగదో దానిని తెలుసుకొనగలుగుచున్నాడు.

3. మానవ శరీర నిర్మాణమునందుగూడ కొన్ని విశిష్ఠ లక్షణములు గలవు. యితరజీవుల శరీరనిర్మాణముతో బోల్చిన వాని మెదడు బహు అల్పము. మానవుని మెదడు కున్నూ, శరీరమునకున్నూ పోల్చిచూచినచో యీ నిష్పత్తి (ratio) అధికముగానున్నది. ఇతరజీవుల శరీరముల యందలి వెన్నెముక (వానియందలి సుషుమ్న నాళ సహితముగా) భూమితో సమానాంతరముగ నుండునట్లు మాత్రమే గమనాగమనములు చేయును. ఒక మానవుడు మాత్రమే తన వెన్నెముకను నిక్కించి నిడివిగానుండి నడువగలుగుచున్నాడు. వెన్నెముక అడ్డముగా నున్నంత మాత్రమున ఆయా జీవులకు లోపమేమి ? నిడివిగానున్నంత మాత్రమున మానవునకున్న అధిక్యత ఏమి? తెలుసుకొనవలసియున్నది, ఎట్లనగా స్వాధిష్ఠాన మణిపూరక అనాహత విశుద్ధ అజ్ఞాయ చక్రములకు పైనున్న సహస్రార పద్మము యొక్క స్థానము మూర్ధ్ని. మానవుని శిరోభాగమందుగల కపాలమందలి బ్రహ్మరంధ్రము వెన్నెముకయందలి సుషుమ్నా నాళము యొక్క వూర్ధ్వ భాగమునందున్నది. బ్రహ్మలోకమునుండి అదిత్యమండలమునకు, దానినుండి బ్రహ్మరంధ్రమునకు, దానినుండి హృదయస్థానమునకును చక్కని రాజబాట ఏర్పడియున్నది. ఆత్మప్రకాశము నేరుగా యీ రాజమార్గముద్వారా మానవుని అంతఃకరణకు చేరు సౌలభ్యము ఒక్క మానవునికి మాత్రమే గలదు. మిగతా జీవరాసులయందు వానివాని బ్రహ్మరంధ్రములు అగ్ని చంద్ర, ఆదిత్య

మండలములకున్నూ వానికతీతమగు బ్రహ్మలోకమునకున్నూ అభిముఖములై యున్ననూ, బ్రహ్మరంధ్రము నుండి హృదయస్థానమునకు గల మార్గము వంపుతిరగవలసి యున్నది. కనుక వానియందలి అంతఃకరణ ప్రకాశము యొక్క అభివ్యక్తి చాల యల్పముగా నుండును. మానవునకున్న నిశితమగు సూక్ష్మప్రజ్ఞ వాని కుండజాలదు.

4. ఇరువదియైదు తెలుపులుగలవాడు మానవుడు. శబ్ద స్పర్శరూప రస గంధము లన్నిటిని సంపూర్ణముగా గ్రహించి అనంద దుఃఖములను బొందగలుగుచున్నాడు. మిగతా జీవరాసులకు ఇట్టి తర్కదృష్టి చేత వస్తుపరిశీలనాత్మకముగ చేయగల కార్యగ్రహణశక్తి లేదు. వస్తుజాతమునుండి సూక్ష్మాతి సూక్ష్మంగా కారణపరంపరను శోధించుచూపోయి అన్నిటికి అత్యంత మూలకారణమైయున్న బ్రహ్మమునే సులువుగా తెలుసుకొనగలడన్నచో, దృశ్యమానమగు సర్వవస్తువులను పరిశీలించి భౌతికవిజ్ఞానమును పెంపొందించగలడని వేరే చెప్పనక్కర లేదు. కనుక వాఙ్మనశ్శరీరేంద్రియములయందు దేని యందు పరీక్షించి చూచినా మానవాధిక్యత గోచరించుచునే యున్నది.

సృష్టిలో మానవున కెంత శ్రేష్ఠత్వమున్నదో యనిదోచును. ఐనను మానవుని అశ్రేష్ఠత్వము గూడ ఇంచుక విమర్శింతము. శ్రేష్ఠశబ్దము కూడా సాపేక్షికమేగనుక, మానవుడు వేనికన్న శ్రేష్ఠుడు? అని మాత్రమేకాని కేవల శ్రేష్ఠత్వము లేదు. పశు పక్ష్యాదులకంటె ఒక విధంగా శ్రేష్ఠతయున్ననూ దేవతల కన్న ఒక విధంగా అశ్రేష్ఠుడేగదా! ఐననూ దేవతల కన్ననూ శ్రేష్ఠుడగుటకు లేదా! పశువులకంటెను అశ్రేష్ఠుడగుటకూ మానవునికి శక్తి సామర్థ్యము లున్నవి. అందుకనువగు కర్మశరీరమున్నది పరికరములున్నవి. మానవుడొక్కడే ప్రకృతిబంధము నుండి విడివడి కేవలం యీశ్వరునితో పోటీ చేయ గల్గిన శక్తి సామర్థ్యములు గలవాడు. నిజంగా యోచించినచో పతనమై అశ్రేష్ఠుడగుటకే యెక్కువ అవకాశములున్నవి. ఎట్లన పరమాత్మ సృష్టి అనుకూల ధర్మములచే జీవితము గడిపి సృష్టికారణ వస్తువగు స్వస్వరూపమును గుర్తించి పరిపూర్ణ బొధచే జన్మరాహిత్యము పొందుటకు స్వతంత్ర సమర్థత గలవాడు. సఫలత విఫలత నాతని సాధన ప్రయత్నములపై నాధారపడియున్నవి. లేదా "భుజంగ, (కురంగ) మాతంగ, పతంగ భృంగామీనాః పంచభి రేవపంచ" అన్నట్లు శబ్దములచే లేళ్లు పాములున్నూ, స్పర్శచే ఏనుగులున్నూ, రూపముచే మిడతలున్నూ రసముచే, చేపలున్నూ గంధముచే తుమ్మెదలున్నూ ఒక్కొక్క విషయానంద వ్యామోహమువల ఒక్కొక్క జీవిపతనమై నశించుచున్నవి. శబ్ద స్పర్శ రూప, రస గంగాధి సర్వవిషయ వ్యామోహముచే ఆకర్షింపబడే మానవుడు తరించుట ఎంత కష్టము? ఏలననగా యిందే యొక్క విషయమైననూ అతని పారమార్థిక సాధనను వ్యర్థము చేయుటకు చాలు. విషయానందమునే జీవితలక్ష్యముగా గొని అధికాధిక సుఖప్రాప్తికొరకై ప్రకృతి నియమబద్ధమగు జీవితమును విడనాడి స్వేచ్ఛాను సారంగా ప్రవర్తించు మానవుడు అశ్రేష్ఠుడు మాత్రమే కాడు. పశువుతో సమానుడు మాత్రమే కాడు, పశువులకంటే హీనుడు గూడ నగుచున్నాడు.

౨. సేవా ధర్మము

మానవుడు సంఘజీవి, ఏకాకియై పర్వతవనాదులలో నుండుటకిచ్ఛగింపడు. సంఘజీవితములో ఒకరికొకరు అన్యోన్య సహకారము చేసుకొంటూ వుండటము తప్పదు. ప్రతి ఒక్కడున్నూ తన పొట్టకొరకై తానొకవృత్తి నవలంబించి పనిచేయటయు, ఆకర్మవలన లబ్ధిపొందు వారాతని పనివిలువ ననుసరించి ప్రతిఫలం ముట్టజెప్పుటయు, సామాన్యవిషయమే, ఐనా నేడు ప్రతిమానవుడున్నూ తానొక ప్రజాసేవకుడననిన్నీ లోకం తనకు ఋణపడియున్నదనిన్నీ కాని తన సేవను గుర్తించి తనకు సత్కార సన్మానములు జరుపుట లేదనిన్నీ, భావించుచున్నాడు. పుల్లలూ, బొగ్గులూ అమ్ముకొనేవాని లగాయతు ప్రభుత్వము నాయకులవరకు, అందరికీ యిదే వూహ. వీరు చేసేపని సమాజమునకు ఉపయోగించేదనుటలో ఏమాత్రం సందేహం లేదు. ఐనా వీరందరూ ప్రజాసేవకులు, దేశసేవకులు, లోక సేవకులేనా ? ఎవరు నిజమగు సేవకులు ? ఏ రూపంలో ఎట్టి ప్రతిఫలమాశించి, ఏపని చేసినా, అది సేవకానేరదు. ధనము నాశించిన వాడొకడు, కీర్తి నాశించినవాడొకడు, పెత్తనమాశించినవాడొకడు, బిరుదులాశించిన వాడొకడు, వరములాశించినవాడొకడు, పుణ్యమాశించిన వాడొకడు, ఉత్తమజన్మలాశించినవాడు మరొకడు; ఏ ఆశతో మానవుడు ఏకార్యం చేసినా, ఎవరికి ఏ విధమైన సేవచేసినా, కొంత త్యాగ మందు యిమిడియున్నా, అతడు త్యాగికాడు, ప్రజాసేవకుడు కాడు, నిస్వార్థుడూ కానేరడు. నిజమైన భక్తుడూ కానేరడు. కామ్యదృష్టి తో దైవసేవ చేసినా, ప్రతిఫలమాశించి పనిచేసే కూలివానితో సమానుడే అగుచున్నాడు. లేదా క్రయ విక్రయములుచేయు వ్యాపారస్తుడగుచున్నాడు. కనుక ఐహికాముష్మికములలో ఎట్టి సుఖమాశించినా అతడు నిజమగు దైవభక్తుడు గాని, నిస్వార్థ ప్రజాసేవకుడుగాని కానేరడు.

సేవాధర్మమును గురించి సమగ్రంగా తెలుసుకొనవలెనంటే, సేవ్యవస్తువు, సేవకుడు, సేవ అను యీ మూడింటి విషయం విమర్శించి తెలుసుకొవలసియున్నది. ఒక్కముక్కలో చెప్పాలంటే సృష్టిస్థితి లయములకు, అత్యంత మూలకారణమైన ఆత్మ లేక బ్రహ్మము మాత్రమే యుత్తమమగు సేవ్యవస్తువు. అట్టి పరబ్రహ్మమును వస్తునిశ్చయరూపంగా, సాక్షాత్కరింపజేసుకొని, తానే ఆ బ్రహ్మ స్వరూపుడనని ఆరూఢజ్ఞానము గల్గి తనయందు సర్వమూ, సర్వమునందు తానూ అను ఆత్మదృష్టిని పూనియున్నవాడే, సేవాధర్మమును సక్రమంగా నిర్వహించగలడు. అతనికి దోచు సర్వమూ అత్మస్వరూపమే. "ఆత్మనోన్యం నకించన" అనగా ఆత్మవినా ఏమి లేదు. ఆత్మకు ఆస్తి భాతి ప్రియములే స్వరూప లక్షణములు. కనుక కేవలం ఆత్మ ప్రేమ స్వరూపమే " ఆత్మవస్తు

కామాయ। సర్వం ప్రియం భవతి" (బృహదారణ్యకోపనిషత్) అనగా, ఆత్మయందలి ప్రేమచేతనే సర్వమును ప్రేమాస్పదమగుచున్నది. మరియు ఆత్మనుంచి స్థూలాతిస్థూలంగా విజృంభించిన సృష్టి యంతయు ప్రేమ స్వరూపమే. కారణం? "బ్రహ్మైవేదం విశ్వమిదం వరిష్ఠమ్" అనగా యీ విశ్వమంతయు శ్రేష్ఠమైన బ్రహ్మస్వరూపమే అంటోంది ముండకోపనిషత్. కనుక ఆత్మయే తానై యున్న బ్రహ్మజ్ఞానికి ఏవిధంగా చూచినా సర్వమును ప్రేమాస్పదమే. అతడే కరడుగట్టిన ప్రేమస్వరూపుడు. చిజ్జడము లన్నియు తానే కనుక అతడు ఏపని ఎందుకై చేసినా, తన కొరకు తానుచేసుకొన్నట్లే. అనగా బ్రహ్మము నిమిత్తం చేసినట్లే. అపుడే అది బ్రహ్మకర్మ అవుతుంది తనకంటె యితరం లేనేలేదు కనుక అతనికి "స్వ" అని చెప్పదగినదే లేదు. అథవా చెప్పవలసివస్తే అంతా "స్వ" యే అని చెప్పాలి. ఏకల్పంలోనూ "స్వార్థ" "పరార్థ" పదములు అర్థరహితమే అయిపోతున్నాయి. కనుక అతనికిక స్వార్థ ప్రయోజన మేమి యుండగలదు ? 'కిమిచ్ఛన్ కస్యకామాయ' అనగా అతడేమి సంకల్పించును ? ఏమి కొరును ? అతనిని కృతకృత్యుడనీ పూర్ణకాముడనీ అనాలి. ఐననూ అతడు నిరంతరం లోకసంగ్రహార్థం కర్మ చేయుచునే యుండును. యిట్టి వారిని గూర్చియే ఆదిశంకరులు తమ వివేక చూడామణిలో

శ్లో॥ శాంతా మహాన్తో నివసన్తి సన్తో
వసంతవ ల్లోకహితం చరంతః।
తీర్ణా స్వయం భీమ భవార్ణవం జనా ః
నహేతు నాన్యానపి తారయన్తి ॥

అని సెలవిచ్చినారు.

తా॥ శాంతులును, మహాత్ములును, సంత్ సత్పురుషులును అయిన యీ బ్రహ్మజ్ఞానులు వసంతఋతు వెట్లు సర్వ జీవోపాధులకు ఆహ్లాదకరమై ప్రమోదమును గూర్చునో, అట్లే సర్వులకు ప్రమోదమును గూర్చుచు, భయంకరమైన సంసారార్ణవమును తాము తరించి యున్నప్పటికీ, కేవలం ఇతర జనులను తరింపజేయుటయే తప్ప, అన్యాపేక్ష లేకయే, లోకమున తిరుగుచుందురు.

ఇట్టి ఆత్మదృష్టితో చేయు కృషియే సేవయని చెప్పబడును. సేవ్యవస్తువు తానేయై సేవచేయుటయే సేవా ధర్మము యొక్క ఆదర్శము. ఏరూపముదాల్చినసేవ యుత్తమోత్తమము? అన్న వస్త్రాదులు, గృహక్షేత్రాదులు ఆరోగ్య ఐశ్వర్యములు, విద్యా పాండిత్యములు, యితరులకు చేకూర్చుటకై నిస్వార్థముగ తన సర్వముగూడ కేవలకైంకర్య బుద్ధితో త్యాగము చేయుట సర్వవిధముల కొనియాడదగినదే. కాని ఐహిక సుఖ సాధనములగు యివన్నియునశ్వరములేకదా! అట్లుగాక, జనన మరణ రూపమగు యీ ఘోర సంసారబ్ధిని దాటించి శాశ్వతముగా తోటి మానవుల నుద్ధరించు సంకల్పముతో ప్రచారము గావించుచూ తమ ఆచార విచారములచే మార్గదర్శకులైన మహాపురుషుల సేవాధర్మమే పరమోత్కృష్టము.

3. గురుస్వరూపము

1) తనకు మంత్రోపదేశము చేసిన గురువు మానవాకృతిలోనున్నాడు. ఆయనయున్ను పాంచభౌతికమైన శరీరము కల్గి యెల్ల శరీరధారులకు సామాన్యమైన జన్మ మృత్యుజరా వ్యాధులకు లోనై యున్నాడు. గురు అనగా పెద్దది. స్వరూప మనగా తనయొక్క రూపము. అనగా తనయొక్క తొలి రూపము. తొలిరూపమనగా సృష్టికి పూర్వము వున్నది. ఆ రూపమే సృష్టియందు అనేక రూపములై అందుకు తగిన నానా నామములు (పేరులు) వహించినది. సృష్టికి పూర్వం ఏకమైయున్న వస్తువే, "ఏకం అనేకం భవతి" అని చెప్పబడినట్లుగా నానాత్వము పొందినది. ఆరూపములలో మంత్రోపదేష్టయగు గురుని రూప మొకటి. కనుక గురుని యొక్క నిజరూపము లేక తొలి రూపము సృష్టికి పూర్వమున్న 'పరమాత్మ యొక్క' రూపమే; కనుక మానవాకృతిలో నుండి మంత్రోపదేశము చేయు గురువున్ను యీదృష్టితో చూచిన గురుస్వరూపమే అయివున్నాడు.

2) 'అపరమాత్మ'ను, తటస్థ లక్షణము, స్వరూప లక్షణము, అతద్వ్యావృత్తి లక్షణము అనువానిచే గుర్తించవలెనని శాస్త్రము చెప్పుచున్నది. సృష్టి స్థితి లయములు చేయువాడే లేక ఆ విధంగా మారెడువాడే పరమాత్మయని చెప్పుట 'తటస్థలక్షణము' అద్యంతములయందు అనగా సృష్టికి పూర్వాపరములయందు తొలిరూపము మాత్రమే గుర్తించు వాడే వుండడు. తటస్థ లక్షణముచే దానిని గుర్తింపజాలము. యిదికాదు, యిదికాదంటూ నామ రూపము లన్నిటినీ నిషేధించగా శేషించునదేదో అదే పరమాత్మయని చెప్పుట 'అతద్వ్యావృత్తి' లక్షణము. యీ లక్షణముచే నిషేధింపబడిన వస్తువులే తెలియును గాని శేషించిన వస్తువేదో తెలియబడదు. ఏ లక్షణములు సహజమై పరమాత్మను విడచియుండవో ఆ లక్షణములచే పరమాత్మను గుర్తింప ప్రయత్నించుట 'స్వరూప లక్షణ'మని చెప్పబడినది. పరమాత్మను గాని ఆ పరమాత్మ పొందిన నానా నామ రూపాత్మకమగు జీవేశ్వర జగత్తును గాని ఆ సచ్చిదానందములు విడచి వుండవు.

శ్లో॥ అస్తి భాతిప్రియంరూపం నామచే త్యంశపంచకం.
ఆద్యత్రయం బ్రహ్మరూపం, జగద్రూపం తతోద్వయం

--- వేదాంత పంచదశి

అనగా 'అస్తిభాతి ప్రియ'ములు (సచ్చిదానందము) మూడూ ఆ పరమాత్మ స్వరూపములనిన్ని, రూపనామములు రెండూ జగద్రూపమనిన్ని చెప్పబడినదేగాని, నిజంగా యోచిస్తే, నామరూపములున్న చోటనే సచ్చిదానందములు తెలియబడుచున్నవి. కనుక

'స్వరూపలక్షణ' మని చెప్ప బడ్డ సచ్చిదానందములు 'జగజ్జీవేశ్వరులయందూ సృష్టికి పూర్వమందున్న పరమాత్మ యందున్నూ కూడనున్నవని చెప్పి తీరవలసినదే. 'పరమాత్మ యందున్న'వని యెట్లు చెప్పనగునని సందేహము కలుగవచ్చును. ఆపరమాత్మ యందు 'లేనిచో' పరమాత్మనుంచి వచ్చిన కార్యరూపజీవేశ్వర జగత్తునందు యెట్లువచ్చును ? యీదృష్టితో చూస్తే సర్వమూ (సాకార నిరాకారములన్నీ) స్వరూపముతో గూడియున్నవే యగును. కనుక గురుని పాంచ భౌతికరూపముగూడా గురు స్వరూపమే యనదగును. కనుకనే "గురుర్బ్రహ్మా, గురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వర। గురుస్సాక్షాత్ పరబ్రహ్మ ....." అంటూ గురుగీత కీర్తించినది. కనుక సృష్టియందున్న సమస్తమూ సృష్టి కారణమగు బ్రహ్మమూ గురుస్వరూపమే,యీ స్వరూప లక్షణముచే మాత్రమే గురుస్వరూపమును తెలుసుకొనగలము.

గురుస్వరూపమనగా పెద్దదికదా ! దేనికన్నా పెద్దది ? అంటే, సృష్టిలో కేటాయించియే ఒక్కవస్తువును తీసుకొన్నా వాని అన్నింటికన్న పెద్దదన్నమాట. సృష్టిలోపంచభూతములు పెద్దవి. పృధివి మొదలు వుత్తరోత్రావకదానికంటే మరియొకటి పెద్దది. పెద్ద, చిన్న, అణువు విభువు యిత్యాదివన్ని సాపేక్షిక శబ్దజాలములు, కనుక గురుస్వరూపము కూడా సాపేక్షికమే. 'అణోరణీయాన్ మహతో మహీయాన్' అని గురుస్వరూపము అణువుగానూ విభవుగానూ కూడా యున్నది. కనుక కొద్ది గొప్పలుగా నుండేదంతా గురుస్వరూపమే.

ఐతే పరిపూర్ణ పరబాహ్మమో ? అది పెద్దది కాదు, చిన్నదీగాదు. రెండవదే లేదు. కనుక దానిని దేనికంటే పెద్దదీ దేనికంటే చిన్నదీ ననవలెను ? ఆ పరిపూర్ణము తప్ప రెండవ దేమీలేనేలేదు కనుక అది కేవలం నిరపేక్షికమై యున్నది. అది గురుస్వరూపమూకాదు. లఘుస్వరూపమూకాదు. ఐతే శ్రీశివరామదీక్షితులవారు తమ గ్రంథములో "శరీరం లేనిది పుట్టని చావనిది, మొదలు కొనా లేనిది, రాకడ పోకడ లేనిది, సకల దేశాలయందు చలించకయున్నది, సర్వకాలాలయందు జ్ఞానకర్మలు లేక వున్నదీ, తనకుతానే స్వతస్సిద్ధమై చలించకయున్నది. గురుస్వరూపము అటువంటింది" అన్నారే. అంటే పరిపూర్ణమే గురుస్వరూపమని అన్నట్లేకదా ! అని శంకకలుగ వచ్చును. ఐతే యీ వాక్యములను యీ క్రింది విధముగా సమన్వయింపవచ్చును. (1) గురుస్వరూప మటువంటిది అన్నారు. గాని అదే గురుస్వరూపమన లేదు. నా నిజరూపమే గురుస్వరూపము కాని యిది యెంతపెద్దదైనా నిరావరణమైన పరిపూర్ణములోనే ఆవరణసహితము అగు నేను వున్నాను కనుక నాకంటే (చెప్పవలసివస్తే) అదే పెద్దది అనవలెను. కనుక ఆ దృష్టితో అది గురుస్వరూపము అనగాపెద్దది అని దీక్షితుల వారన్నారన్న మాట. నేను వుండి దాన్ని గురించి చెప్పటానికి పూనుకుంటే దానిని నాతో పోల్చుకొని నాకంటే పెద్దది గురుస్వరూప మనవచ్చునుగదా ! (2) దీనికి మ్రొక్కే రితర జేజేలు అని అన్నప్పుడు మాత్రమే అది గురువుకు గురువై బయలుకు బయలై వున్నది. యీ దృష్టితో దానిని గురుస్వరూపమన్నారు.

కనుక సృష్టి కారణమైన బ్రహ్మము (పరమాత్మ) మాత్రమే గురుస్వరూపము. పరమాత్మతో తాదాత్మ్యము చెందియున్న వారికి మాత్రము పరిపూర్ణమే గురుస్వరూపమని చెప్పవలెను. నిక్కచ్చిగా చెప్పవలెనంటే, పరిపూర్ణమును గురుస్వరూపమనిగాని, మరొకటనిగాని చివరకు పరిపూర్ణమనిగాని నోటితో పలుకనేరాదు. పలికితే అట్లు పలకబడినది యెరుకయే గాని పరిపూర్ణం కాజాలదు.

వున్నవి రెండే. (1) పరిపూర్ణము (2) లేని యెరుక (లేక గురుస్వరూపము) లేని యెరుకయే సృష్టికారణముగు బ్రహ్మము.

శ్లో॥ స్వయం బ్రహ్మమయో భూత్వా,
తత్పరం చావలోకయేత్.

అంటూ గురుగీత విధించుచున్నది. కనుక బ్రహ్మస్వరూపమగు గురుస్వరూపమే నీవై నీకన్యంగానున్న పరిపూర్ణ పరబ్రహ్మమును అవలోకనము చేయమంటోంది పైగురుగీత శ్లోకము. రెండు గురు స్వరూపములుండజాలవు గనుక గురు స్వరూపమైన తనకు అన్యమగు పరిపూర్ణము గురుస్వరూపము అని కూడ ననరాదు.

❋ ❋ ❋

4. గురుగీతా ప్రయోజనము

గురుగీత యెట్లా విర్భవించెనో తెలుసుకొంటే గురుగీతా ప్రయోజనం తెలియగలదు. పార్వతీపరమేశ్వరులు కైలాస శిఖరం పైన ఉపవిష్టులై యుండగా ప్రపంచమందలి జీవులశ్రేయస్సు కోరి, పరమేశ్వరుని పార్వతి కొన్ని ప్రశ్నలడగ సాగెను. అందు ముఖ్యమగు ప్రశ్న యిది -

శ్లో॥ కేన మార్గేణ భో స్వామిన్ !
దేహీ బ్రహ్మమయోభవేత్ ....?

అన్నదే ఈప్రశ్న. "ఏ మార్గముచేత జీవుడు బ్రహ్మమయుడు కాగలడు?" యిందుకు నమాధానంగానే గురుగీత చెప్పబడినది. కనుక గురుగీత ప్రయోజనం జీవుడు బ్రహ్మస్వరూపుడగుటయే అని వేరేచెప్పనక్కరలేదు. జీవుడు బ్రహ్మస్వరూపుడగుట అనగా ఏమి? యినుము పరుస వేదీ స్పర్శచే బంగారము అగుట వంటిదా ? కానేకాదు. తనకు తెలిసినా, తెలియక పోయినా, జీవుడు బ్రహ్మస్వరూపుడయ్యే వున్నాడు. కాని జీవుడు అది మరచి తాను కర్తయూ, భోక్తయూనై వివిధ కర్మలు చేయుచూ తత్ఫలితముగ జనన మరణరూప సంసారచక్రమున బద్ధుడగుచున్నాడు.

చక్రవర్తి పరుండి నిద్రపోతూ, కలలో తాను దరిద్ర స్థితిలో వున్నట్టున్నూ, అష్టకష్టములనుభవించుచు దుఃఖించుచున్నట్లున్నూ కలలో తనకు దుఃఖమెట్లు పోవునని ఆలోచించుచున్నట్లుగానే జీవుడు ఈ ప్రపంచమున అనుభవించు దుఃఖము యొక్క అత్యంత నివృత్తికి అనేక మార్గములను అన్వేషించు చున్నాడు. కలలోనున్న చక్రవర్తి దుఃఖమెట్లు పోవును? నీవు చక్రవర్తివిగాని దరిద్రుడవు కానేకావు అని ఆ కలలో ఆతడాప్తవాక్యము విని ఆరూఢం చేసుకుంటే వెంటనే అతనికి దుఃఖనివృత్తి కలుగును. అట్లే శిష్యుని కలలో తోచిన గురునిబోధ శ్రవణం ద్వారా జీవుడు మరచిపోయిన స్వస్వరూపము మరలనెరిగి తనకన్యంగా పరిపూర్ణబ్రహ్మమున్నదని తెలిసి సర్వభ్రాంతి రహితస్థితి చెంది జన్మరాహిత్యము చెందుచున్నాడు.

గురుగీత ఏసందర్భములో ఆవిర్భావము చెందినదో ముందుగా గ్రహించవలెను. పార్వతీదేవి పరమేశ్వరునికి మ్రొక్కి (1) గురుమహాత్మ్యమెట్టిదో, (2) జీవుడు సంసారము నుండి ఎట్లు విముక్తి చెందునో (3) జీవుడు ఏమార్గములో బ్రహ్మమయుడు కాగలడో వివరించి తెలపమని తొలుదొల్త ప్రశ్నించెను.ఈ ప్రశ్నలన్నిటికీ సటూధానములు విపులముగా గురుగీతలో వివరింపబడినవి. అంతియేగాక గురుమంత్ర జపము సక్రమంగా చేయు భక్తుడు ఏకామ్యార్థ సిద్ధికై చేయునో అందుకు తగిన, దేశకాలముల నిర్ణయించిఏదిశకున్ముఖంగా ఏఆసనంపై కూర్చుని జపము చేయవలెనో గురుగీత వుపదేశించుచున్నది.

గురుడు నరుడు అనేభావన మేమాత్రమున్నా శిష్యుని ఆశయసిద్ధి కాజాలదు. కనుక గురుమూర్తి కేవలం పరమాత్మ స్వరూపుడే అను లక్ష్యము సిద్ధించుటకై గురుమూర్తికి శిష్యుడు వినయముతో శరణాగతుడైతను మన ధనము లేవిధముగా అర్పణ చేయవలెనో గురుగీత విధించుచున్నది.మానసిక పూజా విధానంలో శిష్యుడు శరీర యింద్రియ మనఃప్రాణప్రత్యగాత్మలను మనోవాక్కాయ కర్మలచే ప్రతినిత్యము గురునికి నివేదన చేయువిధానము గురుగీత పేర్కొనుచున్నది. "తస్మైశ్రీగురవే నమః" అనేమకుటంతో అనేక గురుస్తోత్రశ్లోకములు గురుగీతయందు పొందుపరపబడియున్నవి. అంతఃకరణ పరిశుద్ధికొరకును శిష్యుని మనోఏకాగ్రతకును శిష్యుడవలంబించవలసిన కర్మాచరణ విధానము నిర్ణయింపబడినది.

గురుస్వరూప నిర్ణయము గావించుటేగాక, కేవలాత్మ నిర్ణయము గావించి పరిపూర్ణబోధ దృఢమగుటకై గురుగీత తోడ్పడుచున్నది.

ఇంతేగాక గురుగీత సద్గురు సచ్ఛిష్యుల అధికార లక్షణములు. శుశ్రూషావిధానము, ముక్తిలక్షణములు వివరింపుచున్నది. కనుక గురుగీతపఠించనివాడు గురుభక్తుడు కాజాలడు. గురూపాసన, గురుభక్తి, గురుసేవ, గురునిష్ఠ, పరిపూర్ణ రాజయోగమును అవలంబించినవానికి ఎంతో ముఖ్యము. గురుగీతాజపము, యిది సిద్ధించుటకు ప్రధానసాధనము.

5. గురుపూజయెందుకు ?

శ్రోత్రియ బ్రహ్మనిష్ఠుడును, అరూఢ జ్ఞానియునగు సద్గురుప్రాప్తి గలుగుటయే దుర్లభము. అథవా, అట్టి మహానుభావుడు లభించినను, యాతని (1) యుపదేశము (2) బోధ (3) మార్గదర్శకమగు నాతని యాచరణము మాత్రమే మనకవసరముగాని, యాతని పూజించి యర్చించి యిష్టదైవమురీతి నాతని నారాధింపనేల ? తనవంటి మానవ మాత్రు నొకనిని యారాధించుటవలన గల్గు ప్రయోజన మున్నూ లేనిచోగల్గు హానియునేమి ? యిత్యాది విషయముల విచారించుటయే యీ వ్యాసోద్దేశము. ఇందుకు శ్రుతి స్మృతి ప్రమాణములు యీ వ్యాసకర్తరచించిన పరిపూర్ణదర్శనం 327,328 పేజీలయందు కాననగును.

"తనకు గురువగుగాక ! తనవంటి మానవుని పూజించుట యవివేకము గాదా" యని యధిక్షేపించువారుగూడ స్వార్థ భూయిష్టులై తమ వంటి మానవులను పూజించుచున్నారో లేదో తమ హృదయములను ముందుగా కొంత శోధించి చూచుకొనుటెంతయు ముఖ్యము. ఉద్యోగమాసించియో యుద్యోగాభివృద్ధి నాశించియో, యున్నతోద్యోగులకు వీరు ఫల పుష్పాదులు సమర్పించుటలేదా ? పడి పడి పాదాక్రాంతులగుట లేదా తన బిడ్డల కాయుద్యోగి పేరు కూడ బెట్టుకొనుచున్నాడే ! ఇది యంతయు నాయుద్యోగిని పూజించుట గాదా ? పై యుద్యోగి ప్రాపక సంపాదమునకు కృషి చేయుచు కేవలము భగవంతుని సహితము విస్మరించుచున్నాడు. స్వార్థులై మహాకవులగు కాళిదాసాదులు సహితము రాజాశ్రయము గోరి "యీవే యింద్రుడ వీవే చంద్రుడ' 'వని యాయా రాజన్యుల దోషాపనయనము చేయుచూ గుణాధానము కల్పించుచూ త్రిమూర్తుల గూడ నాతని కీడురారని గేలిచేయు స్తోత్ర పాఠముల చేయుట మానవపూజ గదా ? వీర పూజ నెరుంగని దేశము పృధివిపై గలదా ? వీర పూజ మానవపూజ గాద్సా ?

సజీవులై తమ భావి సుఖోదయమునకు తోడ్పడగల వారిని దేవునికన్న మిన్నగా పూజించుటయే గాక చనిపోయిన అధికారి మృతకళేబరములపై గూడ పూలవానలు గురిపించుటయూ ! ఖనన దహనసంస్కారములకు పూర్వము వారి కళేబరముల చెంత దీర్ఘోపన్యాసములా ! వారి గోరీలకు భర్మహర్మ్య నిర్మాణములా ? చనిపోయిన వాని కళేబరమునకు అంత్య సంస్కారమునకు పూర్వ మాతని బంధువులు యేదో యొకరూపమున అర్చన జరిపంచుట అన్ని మతముల వారిలోనూ ప్రత్యక్షముగా మనము జూచుట లేదా ! అయ్యరు కాఫీ హోటలులో యిడ్లిసాంబారులో యిస్లామియా మిలటరీ హోటలులో అంతకన్న తామసాహారములో

బ్రహ్మముహూర్తముననే భక్షించి నోరువిప్పిన ధూమకాష్ఠగంధము తప్ప విద్యాగంధ మణుమాత్రము బయల్పడని బ్రాహ్మణ నామదేయమాత్రుడగు నొకమూర్ఖుని పితృదేవతల పేరున తన యింటి కాహ్వానించి పూజించి, యర్చించి యాతని పాదోదక లేశస్నానమున తాను తరించితిననియు తన పితృ దేవతలకు శాశ్వత బ్రహ్మలోకప్రాప్తి చేకూరెననియు మన వారు విశ్వసించుట లేదా ? కన్యాదాన సమయమున, పెండ్లి కుమార్డు తనకన్న చిన్నవాడైనను ఎంత నిరక్షర కుక్షి అయిననూ మూర్ఖుడైనను, యాతని పాదములు కడిగి యా పాద తీర్థము శిరస్సున చల్లుకొని తనున్నూ తన పూర్వోత్తర వంశస్థులున్నూ తరించినామని యుప్పొంగుట లేదా ? విగ్రహారాధన మన హిందూ మతముననే గాక యితర మతముల యందునూ ఏదో రూపమున కొద్దియో గొప్పయో వ్యాపించియుండ, జడరూపమైన లోహశిలాదారు ప్రతిమలున్ను పైన వుదహరించిన నిర్జీవ కళేబరములున్ను, అనర్హులైన మానవ నామధేయుల నామరూపములున్న పూజనీయములై యుండ తనకు శాశ్వత నిర్వాణస్థితి చేకూర్చ గల సద్గురుమూర్తి పూజనీయుడు గాదా !

మరియును గురుపూజ యనునది సర్వమతములయందునూ సర్వదేశముల యందునూ న్యూనాధిక భేదములతో యేదో రూపమున వర్థిల్లుచునే యున్నది. మన దేశమున ద్వైతాద్వైత విశిష్టాద్వైత మతస్థులాయాపీఠాధిపతులను ఆయా సాంప్రదాయక సన్యాసులను పూజించుచున్నారు. బౌద్ధ, జైన, శిఖ్కు గురువులును పూజాదికముల పొందుచుయున్నారు. మహమ్మదీయ క్రైస్తవులయందును వారి వారి మత గురువులను దేవుని తరువాత దేవునంతటివానిగా చూచుకొనుట మనము గమనించుచునే యున్నాము.

అదియును గాక లౌకిక విద్యలను గఱపి శిష్యులకు బ్రతుకు తెరువు చూపి వారి యైహిక సుఖములకు మూలకారణుడగు యుపాధ్యాయుడు సహితం వందనీయుడని సర్వులంగీకరించిన విషయమే.

తనకా విధమున పరమోపకార మొనర్చిన గురువునందు శిష్యులకు గల కృతజ్ఞతా బుద్ధియే యిందులకు కారణముగదా ! బ్రహ్మవిద్యోపదేశికుడగు గురువునందు గూడ యట్టి కృతజ్ఞత చూపిన చాలదా ? యనిన చాలదు. ఏలనన లౌకికి విద్యల బోధించునతడు కార్యగురువు, జగద్రూపముగా బ్రహ్మపదార్థము తోచబడుటకు హేతుర్భూతమైన యజ్ఞానము మూలాజ్ఞానమనబడును లేక కారణాజ్ఞానము యని అనబడును. జగత్తు నందు తోచబడు వస్తు సముదాయము యొక్కయు ఆయా వస్తువుల యొక్క గుణాదుల యొక్కయు విజ్ఞానము కలుగక పోవుటకు కారణమగునది తూలాజ్ఞానము లేక కార్యస్వరూపా జ్ఞానము యని యనబడును కనుక కార్యగురువు యీ అజ్ఞానము నశింపచేసి భౌతిక విజ్ఞానము గల్గించి యిహలోక సుఖమునకు మాత్రమే తోడ్పడగల్గుచున్నాడే గాని కారణగురువువలె యీ మూలాజ్ఞాన నాశముగావించి జనన మరణ ప్రవాహము నుండి యుద్ధరింపజాలడు. పరబ్రహ్మమును తాను స్వయముగా గుర్తెరిగిన

గురువు యీ పరబ్రహ్మ స్వరూపుడే గాని అన్యముగానది శాస్త్ర ప్రతిపాదన. అందుచే అట్టి యా గురుతత్వ మెద్దియో విచారించి పిదప యాతని పూజాదిక మెట్లవసరమో గమనింపవలసియున్నది.

గురు స్వరూపము సగుణ నిర్గుణ రూపములై యున్నది. సగుణ స్వరూపము సత్వ రజ స్తమోగుణాత్మకము నామరూప క్రియా సహితము. శ్లో॥ గురుస్సత్వ యోవిష్ణుః రాజ సశ్చతురాననః తామసోరుద్రరూపేణ .... । సత్వగుణ స్వరూపుడగునపుడు గురువే విష్ణువు ; రజోగుణోపేతుడగునపుడతడే బ్రహ్మ ; తమోగుణ విశిష్ఠుడగునపుడతడే రుద్రుడు. అందుచే నాతడు 'అత్రినేత్రశ్శివస్సాక్షాత్' మూడవ కన్ను లేని శివుడు 'ద్విబాహుశ్చహరిస్వయం' రెండుచేతులు మాత్రమే గల విష్ణువు, 'అచతుర్వదనో బ్రహ్మ' నాలుగు ముఖములు లేని బ్రహ్మయునై యున్నాడు. అంతియే గాక నామరూపాత్మకమగు సర్వమునూ త్రిగుణాత్మకమే గనుక సర్వమును గురుస్వరూపమే మరియును ప్రణవ పాదచతుష్టయమున గల 'అ'కార 'ఉ'కార 'మ'కార అర్ధమాత్రకలలో 'అ'కార 'ఉ'కార 'మ'కారములు మూడున్నూ సత్వ రజ స్తమస్సులగు గుణస్వరూపముగాను అర్ధమాత్ర నిర్గుణ స్వరూపమగు పరమాత్మగాను శాస్త్రములు చెప్పుచున్నవి. కనుక 'అ'కార 'ఉ'కార 'మ' కారములు మూడున్నూ గురుని యొక్క సగుణ స్వరూపమును, అర్ధ మాత్రక గురుని నిర్గుణ స్వరూపమును అయివున్నవి. గనుక గురువే పరమాత్మ స్వరూపుడగుచున్నాడు అందుచే త్రిగుణ గర్భితమును త్రిగుణ సామ్యస్థితియునగు అవ్యక్తనామక మూలప్రకృతియును; త్రిగుణాతీతమనియు, అర్ధమాత్రకా స్వరూపమనియు నిర్ణయించబడిన యధిష్ఠాన వ్యాపక బ్రహ్మమును గురునియొక్క నిరాకార స్వరూపములు. 'బ్రహ్మవిద్ బ్రహ్మైవ భవతి' గురస్సాక్షాత్ పరబ్రహ్మ' 'గురుమధ్యే స్థితం విశ్వమధ్యేస్థితో గురుః' 'గురోః పరతరం నాస్తి' యిత్యాదిప్రమాణము లిచ్చుట ననుసంధేయములు. గు,రు, అను అక్షరద్వయమును 'గు'కారము మాయాస్వరూపమనియు 'రు'కారము మాయా భ్రాంతి విమోచక మనియు గురుగీత చాటుచున్నది.

కనుక పిపీలికాది బ్రహ్మపర్యంతముగల సకల జడాజడ స్వరూపములలో 'గురోరన్యం నవిద్యతే' గురువుకన్న నన్యమగు జ్ఞేయవస్తువెద్దియును లేదు. కనుక తానున్నూయా గురుస్వరూపుడే. కనుకనే పరమభాగవతాగ్రేసరుడగు ప్రహ్లాదుడు. 'తనయందు నిఖిల భూతములందు నొకభంగి సమహితత్వంబున' వర్తించగల్గెను. ఆ గురుస్వరూప మపరోక్ష సాక్షాత్కారమగుట చేతనే 'విష్ణుడింతియగాని వేరొండు లేదని' యానంద వార్ధిలో తేలిపోగల్గెను. 'సర్వవ్యాపకో విష్ణుః' కనుక స్వరవ్యాపకమగు నాగురుస్వరూప మును (గొప్ప స్వరూపమును) విష్ణువు పేరిట వినుతించెను. కనుకనే 'యే యథా మాం ప్రపద్యంతే తాం స్తథైవ భజామ్యహం' అని గీతావచనము, ఎవరేయేరూపమున భక్తి ప్రపత్తులు జేసినను, అతడు నిజముగా గురుభక్తుడే, గురుపూజనే సేయుచున్నాడు. కాని యాగురుమూర్తి దివ్యానుగ్రహమున గురుస్వరూపమెట్టిదియో గుర్తించి భక్తిప్రపత్తులు చేసిన వాని భాగ్యమింతింతని వర్ణింప నలవికాదు.

సగుణారాధన, నిర్గుణారాధన, యని యారాధన ద్వివిధము. అందు సగుణారాధనయే సర్వేసర్వత్ర వర్థిల్లుచున్నది. అరాధన యనుటలోనే యారాధ్యవస్తువు సగుణమని సిద్ధించుచున్నది. నిర్గుణారాధన యనునది ఎందునూ పొసగదు. ఏలనన -----

శ్లో॥ కిమావాహన మవ్యక్తే వ్యాపకే కిం విసర్జనం।
ఆమూర్తాచ కథం పూజా కథం ధ్యానం నిరామయే॥

అనగా ధ్యానా వాహనాదికములు నిర్గుణ స్వరూపమునకు ప్రవర్తింపజాలవని భావము. ఉపాసనాభాగమున గూడ ఏమంత్రాధిష్ఠాన దేవత నుపాసించినను యా మంత్రమూర్తిని మానస ఫలకమున గీలించవలెను గదా! అనగా మూర్తివంతమగు యుపాస్య ముండిననే యుపాసన సాధ్యమగును. మాకు మంత్రమును మంత్రమూర్తియు లేదు మేము నిర్గుణోపాసకులమని మహమ్మదీయులు, క్రైస్తవులు, బ్రహ్మసమాజికులు మొదలగువారందురు. కాని సంస్కృత భాషలోనున్నదే మంత్రము లేక ఆద్యంతములు యందొకానొక విలక్షణ పదములున్నదే మంత్రము అను భావన సరికాదు అనియు, మననము చేయబడునదెల్ల మంత్రమేననియు వారు గుర్తించినచో వారి వారి ప్రార్థనా సమయముల నుచ్చరించు వాక్యములు సహితము మంత్రమే. శబ్ద శక్తికి లోబడి వాక్కులు కందెడి పదార్థము శుద్ధనిర్గుణ మెట్లనదగును? కనుక నిర్గుణము యుపాసన యనునవి రెండునూ పరస్పర విరుద్ధములు. అందువలన పూజ, ఆరాధన, ఉపాసన యిత్యాదులన్నియు సగుణమునకేగాని నిర్గుణమున కన్వయింపజాలవు. కనుక ఏమతస్థులైనను భక్తిమార్గమవలంబించు వారందరునూ తొలుదొల్త సగుణారాధకులై యుండక తప్పదు. విగ్రహారాధన మౌఢ్యమనియు, యవివేకమనియు, నిరసింపరాదనియే యిందువల్ల సిద్ధించుచున్నది. విగ్రహారాధన చేయువారాయా విగ్రహములయందలి దారు, శిలా. లోహాదులను మాత్రము పూజించుటలేదనియు, వారివారి యిష్టదేవతల యొక్క మూర్తివంతమునే వారుపూజించుచున్నారనియు వారికి లక్ష్యసిద్ధి గలుగుట కాయావిగ్రహములు తోడ్పడుచున్నవనియు గుర్తించవలసియున్నది. బాహ్యభక్తియందు సాధకుడు వర్తించినంతకాలము సగుణముయొక్క సాపేక్షత తప్పదు. ఆ భక్తి పరిణతిజెంది తన యిష్టమూర్తిని నిఖిల భూతములందు చూడగల్గినచో అదియే అనన్యభక్తి. ఉపాస్య ఉపాసక భావముగూడ నశించినపుడే యేకాంతభక్తి. అపుడే తన బాహ్యాభ్యంతరములయందు ప్రహ్లాదునకి వలె ఉపాస్యము అఖండరూపమున దోచును. ఇదియే అద్వైతసిద్ధి, ఇదియే యఖండజ్ఞానము అందుచేతనే నిజమగు భక్తుడే నిజమగు జ్ఞానియని పెద్దలు వచింతురు. అనన్యభక్తియందు సర్వ విశ్వమును భక్తుని కుపాస్యమే యగుచున్నది. ఏకాంతభక్తియందు పూజించువాడు పూజనీయుడు అను ద్వైతభావమే నశించును. అపుడే గురుశిష్యోభయ రహితము. అపుడే 'గురువు శిష్యుల నందు- గురు తొక్కటాయె' అను నుడి సార్థక మగును. అట్టి స్థిత్యానుభవము పూర్తిగా గల్గువరకు శిష్యుడు గురుదీక్ష విడువరాదు.

ఇక గురుమూర్తిని పూజించుటవలన కల్గు ఫలమేమియో తెలిసికొందము. గురుస్వరూపమే అధిష్ఠాన పరబ్రహ్మ స్వరూపమనియు అట్టి స్వరూపము తన స్వరూపముకంటే యేమాత్రమూ భిన్నము కాదనియు అట్టి అనుభవము కల్గుటే యద్వైతసిద్ధియనియు తెలిసికొంటిమి. కాని యట్టి యనుభూతి యెట్లు చేకూరును ? శ్రవణ, మనన, నిధి ధ్యాసలచే యట్టి యనుభవము చేకూరగలదనుట వెఱ్ఱిమాట. మహావాక్యముల యొక్క పద పదార్థములను అన్వయ వ్యతిరేక యుక్తులచే విమర్శించిననూ ప్రసంఖ్యానము అనగా జపము వలనను గూడ అపరోక్షానుభూతి కలుగజాలదని శాస్త్రములు ఘోషించుచున్నవి. వాక్యార్థ విచారణచే కల్గిన బ్రహ్మాకార వృత్తి నిరంతరావిచ్ఛిన్న తైలధారవలె నిలువనోపునా ? సమాధిస్థితియందు తాత్కాలికముగ నిలచిన నిల్చుగాక. ఉత్థానదశయం దుండనేరదుగాదా! అట్లుగాక మనో, వాక్,కాలయములచే చేయబడు సర్వకర్మలయందు తానా యధిష్ఠాన పరబ్రహ్మముకంటె వేరు కానే కాదనురీతిగా యాతని సాధన పరిసమాప్తి జెందవలెనన్నచో యాతని కీశ్వరానుగ్రహముండి తీరవలెనని శాస్త్రములు నుడువుచున్నవి. ఈశ్వరుడా గురుస్వరూపముకన్న భిన్నుడు కాదు. గనుక గురుని యనుగ్రహమే తదనుభూతికి సాక్షాత్సాధనముగాని అందు కల్పసాధనములు నిష్ప్రయోజనములే యగుచున్నవి. కనుక యిందుకు సద్గురుపాసనయే రాజమార్గము. గురుదీక్షయే శక్తిపాతము. అందుకే గురుగీతయందు పార్వతీదేవి అడిగిన శ్లో॥ 'కేనమార్గేణ భోస్వామిన్ దేహిబ్రహ్మమయోభవేత్' అను ప్రశ్నకు జవాబుగా 'శ్లో॥ యస్య దేవే పరాభక్తి ర్యథా దేవే తథా గురౌ। తసౌతే కథితాహ్యర్థాః ప్రకాశంతే మహాత్మనః' అని మహాదేవుడు జవాబిచ్చినాడు. అందుకే గురుగీత చరమ శ్లోకము

శ్లో॥ యస్య ప్రసాదా దహమేవ సర్వం
మయ్యేవ సర్వం పరికల్పితం చ।
యిద్ధంతి జానామి సదాత్మరూపం
తస్యాంఘ్రి పద్మం ప్రణతోస్మి నిత్యమ్ ॥

(అనగా నేనే సర్వమునై యున్నాననియును, నాచేతనే సర్వము కల్పింప బడినదనియు, ఆరూఢజ్ఞానము గల్గుటకై నిత్యమూ సద్గురు పాదకమలములను గొల్చెదను) అని ప్రవచించుచున్నది.

నిజముగా యోచించి చూచినచో వేదాంత విచారణతో గూడిన జ్ఞానమార్గము (1) వెన్నెలలో వెంట్రుకను' పసిగట్టగల సూక్ష్మ ప్రజ్ఞాదురంధరుని కేగాని మందబుద్ధిగల వారికిగాదు. (2) 'అథాతో బ్రహ్మజిజ్ఞాసా' సాధన చతుష్టయ సంపత్తి చేకూర్చుకొన్న వానికే బ్రహ్మవిచారము అనియున్నప్పటికి గురుభక్తుడు మందుడైననూ సాధన సంపద్విహీనుడైనను తప్పక జనన మరణ భ్రాంతి రహితుడు కాగలడు. ఏలనన, సూక్ష్మ ప్రజ్ఞాదురంధరుడై యున్నచో సారాసార విమర్శచే

పరస్పర విరుద్ధార్థములతో గూడిన శాస్త్రాదులను శోధించి నిగ్గు తేల్చుకొనగలడేగాని అపరోక్షానుభూతి కలుగవలెనన్న గురుకృప యుండి తీరవలసినదే.

శ్లో॥ ధ్యానమూలం గురోర్మూర్తిః,
పూజామూలం గురోః పదం
మంత్రమూలం గురోర్వాక్యం,
ముక్తిమూలం గురోఃకృపా॥"

అను ధర్మమున స్థితిప్రజ్ఞడై యుండు మందబుద్ధి సహితం నిశ్చయముగా జయమందగలడు. మరియును 'జ్ఞానంవినా ముక్తిపదం లభ్యతే గురభక్తితః, అనియు 'గురోఃప్రసాదతః స్వాత్మన్ స్వాత్మారామ నిరీక్షణాత్" అని యుండుటచే గురుభక్తుడు, జ్ఞానము లేకున్నను, మందబుద్ధియైనను, గురుకృపచేతనే తరింపగలడు. మరియును సాధన సంపద్విహీనుడైన గురుభక్తుడు గూడ తన భక్తిచేతనే యిట్టి సాధన సంపత్తి చేకూర్చుకొని ముక్తుడగుటలో సందియ మేమి లేదు.

శ్లో॥ అజ్ఞాన తిమిరాంధస్య విషయాక్రాంత చేత సః।
జ్ఞానప్రభాప్రదానేన ప్రసాదం కురు మే ప్రభో॥

అని నిత్యము గురుదేవుని ప్రార్థించు శిష్యుడట్టియఖండజ్ఞానము పొందుననుటలో సందియ యేమియును లేదు.

శ్రోత్రియబ్రహ్మ నిష్ఠుడును, ఆరూఢజ్ఞానియునగు గురుమూర్తిని పూజించుట వలన ఆ పూజనీయుని సల్లక్షణము లన్నియు పూజించువాడు తప్పక పొందుటకే గురుపూజ. తాను త్రిగుణాతీతుడగువరకు యీ సగుణ స్వరూపుడగు భౌతికవిగ్రహమునకు పూజచేసియే తీరవలెను. ఆ సద్గురువు "స్వయంతీర్ణః" తాను స్వయముగా తరించినవాడు గనుక "పరాన్ తారయతి" శిష్యులను తరింపచేయగలడు. 'అఖండ మండలాకారం వ్యాప్తం యేన చరాచరం' అయివున్న తత్పదమును దర్శింపచేయగలడు. అట్టి సద్గురుమూర్తిని అట్టి తత్పద దర్శనకాలమందుతప్ప తదితర సమయములం దెల్లపుడు గురుభక్తుడైన వాడు తప్పక భజించవలసియున్నది. గురుపూజ నెరుగనివానికి వెయ్యేండ్లు తలకిందుగా తపస్సుచేసిననూ పరోక్షజ్ఞానమేగాని అపరోక్షానుభూతి యెన్నటికి కలుగ జాలదు.

❀ ❀ ❀

6. గురుపూజా పరమార్థము

ఏ పూజ యైనను షోడశోపచారయుతముగా నుండును. కాని నిజముగా యీ యుపచారములన్నియు లెక్కిడినచో 27 అగుచున్నవి. ఎట్లనగా :- 1) ధ్యానము 2) ఆవాహనము 3) రత్నసింహాసనము 4) పాద్యము 5) అర్ఘ్యము 6) ఆచమనీయము 7) పంచామృత స్నానము 8) శుద్ధోదక స్నానము 9) వస్త్రయుగ్మము 10) యజ్ఞోపవీతము 11) సర్వాభరణ భూషణములు 12) గంధము 13) అక్షతలు 14) అంగపూజ 15) పత్రపూజ 16) నామావళీ పూజ 17) ధూపము 18) దీపము 19) నై వేద్యము 20) ఉదకపానీయము 21) ఫల ఉపహారము 22) తాంబూలము 23) దక్షిణ 24) నీరాజనము 25) మంత్రపుష్పము 26) ప్రదక్షిణ నమస్కారము 27) ఉద్వాసనము.

ఇందు : 1) ధ్యానము 2) ఆవాహనము 3) సింహాసనము 4) పాద్యము 5) అర్ఘ్యము 6) స్నానము 7) వస్త్రము 8) యజ్ఞోపవీతము 9) గంధము 10) పూజ 11) ధూపము 12) దీపము 13) నైవేద్యము 14) తాంబూలము 15) దక్షిణ 16) నీరాజనము. యీ పదహారున్ను షోడశోపచారములని చెప్పబడును.

యీ షోడశోపచార విధానము లన్నియు, గురువున కవసరమైయున్నవా ? అంటే గురుమూర్తియు తనవంటి మానవుడే. గురుమూర్తికి తన అవసరములవంటి అవసరము లుండక తప్పదు. కనుక గురుమూర్తిని యర్చించి ఆయన కేవిధమైన లోపమున్ను కలుగకుండా చూచుకొనుట గురుగీతాధర్మమే. శిష్యుని విధియే. ఇందు సందేహ మేమిన్నీలేదు. ఐనను గురుడు నరుడు కాడు! పరుడే అను దృష్టి చేతనే గురుమూర్తిని శిష్యుడారాధించుచున్నాడు. కాని కేవలము మంత్రోపద్రేష్టయగు తన గురువునకు లౌకిక ప్రయోజనములను సమర్పినంత మాత్రముననే తనకు గురుకృపా సంసిద్ధి కలుగునను యుద్దేశముతో కాదనియు స్పష్టమే. లేనిచో గురుమూర్తిని కూర్చుండబెట్టి పూజించి మృష్టాన్న భోజన నూతన వస్త్రాదికము లిచ్చుటతో మాత్రము శిష్యుడు సంతృప్తిపడక నిత్యమాతని పాదుకలకు, లేక చిత్రపట విగ్రహాదులకు యీ షోడశోపచారయుతమగు అర్చన నేల గావించవలెను ? ఇందిమిడియున్న పరమార్థ మేదియో విచారించవలసి యున్నది.

1) ధ్యానము :- ఓ పరమపురషా ! సర్వాధిష్ఠానకూటస్థ బ్రహ్మస్వరూపుడవై సర్వభూతాంతరస్థుడవై యుండు దేవుడవు నీవు. స్వాధిష్ఠాన చిదాభాసుండనగు నేను నీస్వరూపస్థితి

చెందుటకై నిన్ను ధ్యానించుచున్నాను ఈ భావనతో ధ్యానము చేయవలెయును. అట్లు చేయుచో ఆ పరమాత్మ స్వరూపస్థితిని తానుజెందునా? అంటే తప్పక చెందగలడు. మనోహి జతువత్ = మనస్సులక్కవంటిది. కరగించి ఏ మూసలోపోసిన ఆ యాకృతి లక్క యెట్లువహించునో అట్లే మనస్సు ఏ స్వరూపముపై ఏకాగ్రత చెందునో మనస్సు ఆ రూపమునే వహించును. ఏ స్వరూపము నైనను వస్తునిశ్చయముగా గురుముఖతః తెలిసికొని ధ్యానించవలెను. అపుడు ఆ అఖండ స్వరూపుడే తాను అను భావన ఆరూఢత కాగలదు. అట్టి ఆరూఢత చెందినవానికే పూర్ణబోధ గనుక యీ దృష్టితో మాత్రమే ధ్యానము చేయవలెను. షోడశోపచార పూజలలో యీ ధ్యానమే ప్రధానమైనది. మిగతావన్నియు దాని కంగములుమాత్రమేనని గ్రహింపవలెను.

2) ఆవాహనము :- ఓ పురుషోత్తమా! సర్వవ్యాపక బ్రహ్మముగదానీవు! కనుక నిన్ను ఏస్థానమునకు ఏ స్థానము నుండి ఆహ్వానించవలెను! కనుక నీ కావాహనమే కుదరదు. ఐననూ అల్పదేశమే స్థానముగాగల నేను అఖండ పూర్ణ స్వరూపమును దర్శించలేను. పరిమిత స్వరూపముతో దయసేయమని నిన్ను నాస్థానమున కాహ్వానము చేసుకొనుచున్నాను. " నీకు నిజముగా ఆవాహనము చెప్పుట అనుచితము గనుక నీ అఖండ వ్యాపక రూపమంతటిలో నా తెలివిని వ్యాపక పరుచుటయే ఆవాహనము అని అర్థము చెప్పుట యింకనూ యుత్తమభావము.

3) సింహాసనము :- సర్వవ్యాపక స్వరూపుడవగు నీవు కూర్చొనుటకు ఎంతపెద్ద స్థానమును జూపినప్పటికి అది నీకు చాలదుగదా! కాని పరిమిత స్వరూపుడనగు నేను నా అల్ప లక్షణముచే నీకొక సింహాసన మమర్చియున్నాను. నాకొరకు మీరు " ఉపాసకానాం హితార్థాయ బ్రహ్మణో రూపకల్పనా " అనురీతిగా యీ సింహాసనము నధివసించుట అని శిష్యుడు గురువును ప్రార్థించుచున్నాడు. ("నీస్వరూపావరణమును వుండజూచి, అందున్నవానిగా భావించుటకే నీకు సింహాసన మమర్చుట" అనునది ఇంకనూ యుత్తమభావము. యీ భావము స్థిరపడవలెనన్న తానే ఆ రూపమును వహించ వలసియుండును.

4) అర్ఘ్యపాద్యాచమనీయములు :- ఓ సర్వభూతాంతరస్థ స్వరూపా ! నీవు స్వయంప్రకాశుడవు. అన్నిటికి ప్రకాశమిచ్చువాడవు. "సర్వశుద్ధ పవిత్రో ఉ సౌ" అనురీతిగా నీవు యెప్పుడును మహా పరిశుద్ధుడవే. శుద్ధస్ఫటికమం దెట్టి మలిన మంటజాలనియట్లు, అగ్ని హోత్రమును ఏదియు నపవిత్రము యొనర్పజాలనియట్లు, నిన్నెట్టి మలినము నంటజాలదు. కనుక శరీరశౌచ సంబంధమగు అర్ఘ్యపాద్యాచమనములు నీకు ఎంత మాత్రము అవసరమే లేదు. కాని కామ క్రోధాదులచేతను, శుభాశుభ వాసనలచేతను, పాపపంకిలముచేతను, భ్రాంతి రూపమగు అజ్ఞానముచేతను అపరిశుద్ధుడనైయున్న నన్ను పరిశుద్ధ మొనర్చెదవుగాక యని నిన్ను వేడుకొనుటయే నీ కర్ఘ్యపాద్యాదు లర్పించుటలో గల పరమార్థము.

5) పంచామృత శుద్ధోదక స్నానములు :- నీవు అశరీరుడవు గదా! నిరుపాధికుడవు గదా! నీకు స్నాన మజ్జనాదు లెందుకు ? కాని రాగ ద్వేషాది దోషదూషితుండనై యున్న నేను నిర్మల చేతస్కుడనగుటకే నీకు పంచామృత శుద్ధోదక స్నానము లర్పించుచున్నాను.

6) వస్త్రము :- ఓ విశ్వస్వరూపా! విరాట్పురుషుడవు నీవు. అకాశమే నీకు వస్త్రమై యుండగా అంతకంటే పెద్దది లేక గొప్పదియగు ఏ వస్త్రమును నీకు సమర్పించగలను ? కాని వస్త్రము నాకవసరము. అట్టినా అవసరమును దీర్తువనియే నీకు వస్త్రమర్పించుట. అంతియేగాక అ విద్యావరణమే సహజమైన వస్త్రముగా గల్గియున్నాను. ఈ ఆవరణ రహిత మొనర్తువని నమ్మియే నీకు దివ్య సువర్ణ పీతాంబరము లర్పించుచున్నాను.

7) యజ్ఞోపవీతము :- ఓ చిద్ఘనానంద స్వరూపా! నీవే సూత్రాత్ముడవై సర్వజీవులకు జ్ఞానచక్షు ప్రదాత యుండుటచే నీకు ఉపనయన సంస్కారము (జ్ఞానచక్షు ప్రదానము) గాని ఏత త్సంస్కార చిహ్నమగు యజ్ఞోపవీత ధారణగాని నీకెంతమాత్రమూ అవసరమే లేదుగదా ! కాని అపేక్షా (అప+ఈక్ష = తప్పుచూపు) యుతమై భ్రాంతిరూప యజ్ఞానములో మునిగి తేలుచున్న నాకు యదార్థ జ్ఞానము ప్రసాదించు ఉపనయన చిహ్నమగు ఉపవీతధారణ మవసరమే కనుక యట్టి కించిజ్ఞుడనైన నాకు ఆత్మజ్ఞానోపనయన ప్రదానము గావింపుమని కోరియే నీకు యజ్ఞోపవీతము సమర్పించుచున్నాను. మరియు సాక్షాత్తుగా నీవు సూత్రాత్మస్వరూపుడవై సర్వచరాచర జగత్తునందు హారములో దారమువలె నున్నావని ఆత్మదృష్టి పెంపగుట కొరుకే నీకు సూత్ర మర్పించుట.

8) గంధం :- ఓ నిర్వాసనా మౌనస్వరూపా? నీవు నిర్లేపుడవు. అసంగుడవు నీకు సుగంధలేపనాదులా ! ఆకాశమే శరీరముగా గలనీకు దుర్గంధయుతమగు స్వేదాదు లుండునా? సుగంధ లేపనములు కావలసి యుండునా? కాని నాకు అవసరములుకనుక వానిని పుష్కలముగా సమకూర్చుము. మరియు అశుభ వాసనాసితమగు నా అంతఃకరణమును శుభ సంస్కారములతో నింపుమనుటకే సుగంధాదులను కోరుచున్నాను.

9) అక్షతాభరణములు :- ఆదిమధ్యాంత శూన్య స్వరూపా! జగద్విలక్షణుడవగు నిన్ను నేనెట్లు అక్షతాభరణములతో నలంకరింపగలను? పంచకోశ విలక్షణత్వము సిద్ధించుటే మానవునికి నిజముగా అలంకరణముగాన అట్టి స్వరూప నిశ్చయజ్ఞానము అక్షతా భరణాలంకారమును కోరి నీకు అక్షతాభరణము లర్పించుచున్నాను.

10) పుష్పాంజలి :- నిరింద్రియ స్వరూపుడవగు నీకు పుష్ప సౌరభము లేల ? శుభాశుభ వాసనారాహితస్థితి అనగా నిర్వాసనామౌననిష్ఠ నాకు సిద్ధించవలెనని గోరియే నీకు అనేక పరిమళ పత్ర పుష్పాదులను సమర్పించుకొనుచున్నాను.

11) ధూపము : - దేహేంద్రియము లేని నీకు అగరు ధూపములేల? నీ సన్నిధియే దివ్య సుగంధ పరిమళములు వెదజల్లునుగదా ! ఐనను శబ్ద స్పర్శాదుల దోషరూప దుర్గంధము నన్ను ఆవరించకుండా చేయుమని నీకు కర్పూరాగరు ధూపము లర్పించుచున్నాను.

12) దీపము :- స్వయంప్రకాశ తేజోనిధీ! సూర్య చంద్రాగ్నులకు ప్రకాశమునిచ్చు స్వయం ప్రకాశమూర్తివగు నిన్నెట్టి అంధకారమును చేరనే లేదుగదా ! నీకు దీపప్రకాశము గావలెనా ? కాని అజ్ఞాన తిమిరాంధుడనైన నాకు నీ జ్ఞాన కిరణమొకటి ప్రసాదింపుమని కోరి నీకు దీపమును చూపు చున్నాను.

13) నైవేద్యము :- సదానంద స్వరూపా ! అప్తకాముడవు, నిత్యతృప్తుడవు, షడూర్మి రహితుడవు నీకు ఆహారపానీయములు కావలెనా! నీకు నిజముగా ఆకలిదప్పులే యున్నచో నేను దీర్చగలనా? కాని షడూర్ములలో జిక్కి ఎప్పడికప్పడే షడ్రసోపేత పక్వాన్న భోజనము లాసించునాకు యదృచ్ఛా లాభసంతుష్టి చేకూర్చుమని కోరి నీకు పక్వాన్న ఫల రస నైవేద్యము లర్పించుచున్నాను.

14) తాంబూలము :- శబ్దాది పంచక విషయ వాసనలే ఎరుంగని నీవు తాంబూల చర్వణ సుఖమెట్లు అభిలషింతువు. కాని విషయ మృగతృష్ణా పరిభ్రమణుడనైన నాకు నిర్విషయి కాఖండ బ్రహ్మాకారవృత్తి కల్గవలెనని కోరి నీకు తాంబూల మర్పించుచున్నాను.

15) దక్షిణ :- ఓ అఖండ సచ్చిదానందమూర్తీ! నీకే మిచ్చి గురుఋణము దీర్చగలను? అంతయు నీవే. దక్షిణగా నీకే మిత్తును ? కాని నాకింకనూ ద్వైతదృష్టి నశించక "నేను" అను అహంవృత్తి కలుగుచున్నది కనుక నా మనఃప్రాణ వాక్కులను నీకు దక్షిణగా సమర్పించుకొనుచున్నాను.

16) మంగళ నీరాజనం :- మోక్షసామ్రాజ్య పట్టాభిషిక్తుడవై నిత్య మంగళ స్వరూపుడవై యున్న వాడవుగదా నీవు! కనుకనే నీవు సదాశివుడవైతివి. అట్టి నీకు మంగళ నీరాజన మిచ్చుటలో గల అర్థమేమి ? సర్వమంగళములు ప్రకాశమానమగుటకు నీ ప్రకాశమే కారణముగాదా! అట్టి నీ దివ్య స్వరూపమే నేనై ఏక భావన చెందుటయే పరమార్థముగా నీకు మంగళ కర్పూర నీరాజన మర్పించుచున్నాను.

17) ప్రదక్షిణ నమస్కారము :- సర్వవ్యాపకస్వరూపా! నీకు ప్రదక్షిణ మెట్లుచేతును ? నీవు లేని చోటేది? నిన్ను మీరినచో నాకు స్థానమే లేదుగదా! నిన్ను విడచి చూచినచో అంతా కుంఠితముగాని వైకుంఠమే. అట్టి పరిపూర్ణస్థితి కల్గుటకు ముందు నేనుకూడా నీవలె పూర్ణుడ కావలె కనుక అట్టి పరిపూర్ణత సిద్ధించుటకై నీకు శరీర మానసికములచే ప్రదక్షిణ నమస్కారము చేయుచున్నాను.

18) ఉద్వాసన :- స్వామి ! సర్వాంతర్యామి! అంతటానీవే యుంటే నిన్నెక్కడికు ద్వాసన చేయగలను? అసంభవము కాని పరిపూర్ణ పరబ్రహ్మమందు నేనే లేను గనుక మూలాజ్ఞానసహితముగా మూలంలేని యీనాగుర్తెరిగే శరీరమును యీజన్మతో శాశ్వతముగ నుద్వాసన చేయుటకై నిన్నాశ్రయించు చున్నాను.

"యాదృశీ భావనా యత్ర తాదృశీ భవతి నిశ్చయం" యిట్టి లక్ష్యముతో సచ్ఛిష్యుడు గురుపూజాదికము నొనర్చి ధన్యుడగుటయే గురుపూజయందలి పరమార్థము.

❀ ❀ ❀

7. నమస్కార విధానము

నాగరిక జాతులలో వ్యక్తులు ఒకరినొకరు కలుసుకొన్నపుడు తమ తమ స్నేహగౌరవములను వెల్లడించుకొను విధానము వివిధ దేశములలో వివిధ రీతులుగా నున్నది. ప్రసన్నవదనములతో ఒకరినొకరు గుర్తించుకొన్న పిదపపలుకరించుకొనుటకు పూర్వము వుభయుల సమాగమమువల్లన కల్గిన సంతోషప్రకటనకై అభినయరూపముగ హస్తవిన్యాసములు లేక హస్తచాలనాదులు చేయుట పరిపాటి. ఇంకనూ ఆత్మీయత ప్రకటించుకొనుటకై పరస్పరము ఆలింగనము చేసుకొనుటయుకద్దు. ఆ వ్యక్తులలో ఒకరు రెండవవారికంటె అధికార ఐశ్వర్యాది హోదాలలో తక్కువవారైనచో కించిద్దూరమందే నిలచి గౌరవమెక్కువగా ప్రదర్శించుచు ఆయా దేశ మత సాంఘికాచార రీత్యా వందనము చేతురు. కాని భారతీయ సంస్కృతీ సంప్రదాయముల రీత్యా చేయు నమస్కారము అత్యంత విభిన్నమూ, విశిష్టమూ, అత్యుత్తమ భావోపేతమునై యున్నది.

ఐహికసుఖములకై ప్రాకులాడక ఆముష్మికసుఖమునో లేక భగవంతుని సాన్నిధ్యమునో, లేక ప్రత్యగ్బ్రహ్మైక్యమునో లేక కేవల జన్మరాహిత్యమునో ఆశించి అట్టి ఉన్నతాదర్శనమున కనువగు పారమార్థిక జీవనమును సాగించుటయే హైందవ సంస్కృతిలోని ప్రత్యేకత. వారి నిత్య జీవన విధానమంతయు యీ ఆశయసిద్ధికి సాధనభూతముగానే యుండును.వారి ఆచారవిధానమునందంతటా యీ మహోన్నతాదర్శచ్ఛాయలు ప్రస్ఫుటముగా గానవస్తూనే యుండును. పరస్పర సమాగమమునందు వారొనర్చు అభినందన విధానము కూడ విశిష్టమైనదే అట్టి నమస్కారమును యే రీతిగా యే భావనతో వారు చేయునదియు విచారించవలసియున్నది.

నమస్కార శబ్దార్థమునందు క్రియారూప వ్యవహారము గూడ కొంత యిమిడియే యున్నది. కర్మేంద్రియములలో వాగింద్రియ, పాణీంద్రియములచే నమస్కార క్రియ జరుగుచున్నది.వాగీంద్రియముచే "నమస్కారమండీ" అనో, "నమస్తే" అనో, లేక "దండ" మనో, "దాసోహ"మనో "రాంరాం" అనో, "జైగురో" అనో, "శ్రీగురుభ్యోనమః" అనో పలుకుచుందురు. పాణీంద్రియములచే అనగా రెండు చేతులు జోడించి, అట్లు జోడించిన చేతులను హృదయస్థానమునకో, కంఠస్థానమునకో, భ్రూమధ్య స్తానమునకో, మూర్థ్నీ స్థానమునకో చేర్చుటయే నమస్కారమునందలి క్రియాయావిశేషము. గుర్తెరుగక యేకర్మయూ (ఏపనియూ) ఎవరునూ వుద్దేశ్యపూర్వకముగా చేయరుగదా ! కనుక మనో వ్యాపారము గూడ నమస్కార క్రియయందు యిమిడియే యున్నదిని వేరే చెప్పనక్కరలేదు.

ఐతే, చేతులుజోడించుట ఆయాస్థానములకు చేర్చుట అను క్రియలయుందు (వెనుక) గల భావమేమి ? యిందుకు జవాబు తెలుసుకొనుటకు పూర్వము, అట్టి నమస్కారము ఎవరికి చేయుచున్నారు? అను ప్రశ్నకుత్తరము పొందవలసి యున్నది. ఆనమస్కారము భౌతిక రూపముగానున్న యెదుటి వ్యక్తి యెక్క శరీరమునకా లేక నిరుపాధిక సోపాధికములుగా సర్వమునందు సర్వత్ర సర్వాంతర్యామిగా వ్యాప మైయుండి యెదటి వ్యక్తి యుందునూ వుండివున్న పరమాత్మకా ? శిష్టాచార సంపన్నులగువారు చేయు నమస్కారము పరమాత్మ స్వరూపమునకే యని తెలియవలెను. కనుకనే వారు శరీర సంబంధమగు హస్త చాలనాదులుగాని పరిష్వంగాదులుగాని చేయరు. ఉత్తర హిందుస్థానమునందు హిందువులుగూడ అభివాదన సమయమున ఆలింగనము చేసుకొందురుగదా యని శంకించవచ్చును. కాని ఆదేశమున యెక్కువగా నివసించుచున్న మహ్మదీయులను జూచి వారిననుకరించిన ఆచారములలో నిదియు నొకటి గావచ్చునేగాని యిది శిష్టాచార పద్ధతిగాదు. పరమాత్మ స్వరూప మన్నియుపాధుల యందునూ వుంటే, మానవునకే యెందుకు నమస్కారము చేయవలెను ? మరియును అందులోనూ కొందరికి మాత్రమే యెందుకు చేయవలెను ? అంటే .... మానవోపాధియే యెనుబదినాల్గులక్షల జీవోపాధులయందునూ శ్రేష్ఠమైనదై పరమాత్మ ప్రకాశము అభివ్యక్తమగుటను మిక్కిలి యోగ్యమైన దగుటయే కారణము. అందునూ పూజ్యులైన యోగుల యందునూ యితర సాధు సత్పురుషులయందునూ ఈ ఆత్మ తేజస్సు పరిపూర్ణముగా నిండియుండును. అందుకే "సాధూనాం దర్శనం పుణ్యం స్పర్శనం పాపనాశనం" అని చెప్పబడినది.

ఇక చేతులు జోడించుటలో గల ప్రత్యేకాభిప్రాయమేమనగా చేతులు రెండైనా పాణీంద్రియమొక్కటేగాని రెండు యింద్రియములు కాదుగదా ! మీయందునూ నా యందునూ యున్న పరమాత్మ స్వరూపమేకమే గనుక, మీరే నేను నేనే మీరు మనమిర్వుర మొక్కటే అను ఉన్నత భావమును ప్రదర్శించుటయే యని చెప్పనగును. సర్వాంతర్యామియగు పరమాత్మకు

మానవశరీరమున ముఖ్యముగా హృదయం, కంఠ, భ్రూమధ్య, మూర్ధ్నిస్థానములు అభివ్యక్తస్థానములు. కనుకనే నమస్కారము చేయు నాతడు జోడించిన కరములను అందేదేని యొక్క స్థానముననుంచి నమస్కరించుచున్నాడు. కనుక వుభయులయందవా, ఆయాస్థానములయందు విశేష ప్రకాశవంతమై యున్న పరమాత్మకే యీ నమస్కారము గాని శరీరములకుగాదు. కనుకనే శరీరస్పర్శతో గూడిన హస్తచాలనాదులు, ఆలింగనములు, యితరేతర సాంఘిక ఆచారములు వారనుసరించవలయునని కోరరు. కనుకనే నమస్కారము అందుకొనువాడు నమస్కారము చేయువాని కంటె యెంత పూజనీయుడైన విశిష్టవ్యక్తి అయిననూ ప్రతి నమస్కారము చేయును.

కరములు ముకుళించిగాని, ముకుళించకనేగాని, వాక్కు చేత గాని, మనస్సుచేతగాని తానున్నూ పరమాత్మకు ప్రతి నమస్కారము చేయును. "రాంరాం" అని కొందరూ, "జైగురూ" అని కొందరూ ఇష్టదైవమునో, గురువునో దలపెట్టు కొందురు. సన్యాసులు తమకెవరైన నమస్కారముచేయుచో "నారాయణ" అని దైవస్మరణ గావింతురు. గురువులు తమ గురువులను లేదా స్వరూపమును సంస్మరించుకొందురు. అభ్యాసకులగు గురుపుత్రులు కర్మణా, మనసా వాచా, ప్రతినమస్కారము చేసుకొందురు. కరములు ముకుళించి శ్రీగురుభ్యోనమః యని వాచా పల్కుచూ తమ గురువులను మనస్సున సంస్మరించుకొందురు. ఈ భావన యెరుగక కేవలనాగరికతా లక్షణములను ప్రదర్శించటకై దేహమే తాను అనుకొనే యితరేతర సాంప్రదాయక పద్ధతుల ననుకరించి అభినందనము చేసుకొనుట వ్యర్థమేగాక కృత్రిమముగూడ నైయుండి హైందవ సంస్కృతిని విస్మరించి విడనాడుటయే అగుచున్నది.

సామాన్యరూపమగు పైన వివరించిన నమస్కార విధానము కంటెనూ శ్రేష్ఠమై విశేషభక్తి ప్రపత్తులను ప్రదర్శించు మరియొక నమస్కార విధానము గలదు. అది కేవలము గురుదైవములకు భక్తులచే చేయబడు సాష్టాంగ నమస్కారము దీనిని గురుగీత ఈ క్రింది విధముగా నిర్వచించుచున్నది-----

శ్లో ॥ దోర్భ్యాం పద్భ్యాంచ జానుభ్యా మురసా శిరసా దృశా
మనసా వచసాచేతి ప్రణామోష్టాంగ వుచ్యతే ॥

తాత్పర్యము :- గురుపాదములపై శిరముంచి, తన భుజములు, పాదములు, మోకాళ్ళు, వక్షస్థలము నేల కంటునట్లు కర్రవలె చాచి బోరగిలపరుండి గురుపాదములను కంటితో జూచుకొనుచూ వాక్కుచే నమస్సులర్పించుచూ మనస్సుచే సర్వార్పణ బుద్ధి బూని దృఢ భావనతో ధ్యానించుచూ చేయు నమస్కారమునకు సాష్టాంగ నమస్కారమని, శరణాగతియనీ యనవచ్చును. ఐతే పాదములకే ఏల నమస్కారము చేయవలెను ? చేతి వ్రేళ్ళ కొనలు, పాదాంగుష్ఠములు శరీరముయొక్క కొనభాగములు. తద్వారా శరీరమునందలి ప్రాణశక్తి విద్యుత్ప్రవాహములవలె

ప్రసరించుచుండును. ఆ పవిత్రశక్తిని గ్రహించి తన శరీరమునందు పూరించుకొనుటకే పాదనమస్కారము నిర్ణయింపబడినది. పాదములను స్పర్శించకుండానే దూరముగా సాష్టాంగనమస్కారము చేయుటవలన యీ ప్రయోజనము సిద్ధించదు. కనుకనే "సాధూనాం దర్శనం పుణ్యం, స్పర్శనం పాపనాశనం" అని చెప్పబడినది. అందుకే గురపాదములను శిష్యుడు స్పృశించుట గురువు శిష్యునికి హస్తమస్తక సంయోగము చేయుట. ఇదియే స్పర్శదీక్ష.

శ్లో ॥ తద్విద్ధ ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా।
ఉపదేక్ష్యంతి తే జ్ఞానం జ్ఞానిన స్తత్వదర్శినః॥

అని భగవద్గీత చెప్పుచున్నది. చక్కగా గురువు నర్థించితే తత్వ సాక్షాత్కారముబొందిన యా గురువు నీకు జ్ఞానము నుపదేశ పూర్వకంగా గల్గించగలడని భావము. ఇందు ప్రణిపాతము అనగా సాష్టాంగ నమస్కారము చాల ముఖ్యము. దీనివలన కలుగు ప్రయోజన మేమో గురుగీత తెలియజేయుచున్నది.

శ్లో ॥ సాష్టాంగ ప్రణిపాతేన స్తువన్నిత్యం గురుం భజేత్
భజనాత్ స్థైర్యమాప్నోతి స్వస్వరూపమయోభవేత్ ॥

తాత్పర్యము: - నిత్యమూ సాష్టాంగ నమస్కారము లొనర్చుచూ గురుని స్తుతించి భజించవలెను. దానివలన స్థైర్యము (చంచలత్వము లేని స్థితి,భయ రాహిత్యము, దృఢత్వము గల్గి నీ స్వరూపమునే పొందు అనుభవము) అభిమానాహంకార రాహిత్యము కొరకు సాష్టాంగము విధింపబడినదని యెరుగవలెను. అభిమానాహంకారముల వీడిన వానికే పరిపూర్ణ బోధ. గనుకనే శ్రీ కృష్ణదేశి కేంద్రులవారీ శరణాగతి ప్రాముఖ్యతను తమ కందార్థములలో వుటంకించి యున్నారు. "తన పుణ్యోదయమున గురుని గాంచి యురుతర భక్తిన్ శరణని మ్రొక్కి" యనియును "చరణాధూళిని రెండు కరమూల గొని తన శిరమూన ధరియించి శరణాని యా శిష్యుడెరిగించు మనెనూ" అనియును "ప్రవిమలచిత్తుడు శిష్యుడు సవినయమున దేశికునకు శరణాగతుడై" అనియును "శరణన్న వారి మస్తకమందు చెయి బెట్టి తిరమూగ యెరుకను దీసి వెయ్యనివాడు ఎందుకో యన్నా" అనియును "తనకు శరణన్న వారల మనసెట్టిదో యరసి" యనియును చెపుతూ వచ్చినారు.

సాష్టాంగనమస్కారయుతమగు యీ శరణాగతికింత ప్రాముఖ్య మెందుకీయవలెను? అంటే నవవిధ భక్తులలో కడపటిదగు ఆత్మ నివేదన మిదే. ఏమీ మిగుల్చుకోకుండా సర్వార్పణము చేయు విధానమిదే. ప్రపత్తిలక్షణము విభీషణ శరణాగతిలో పరాకాష్ట చెందినది. "శత్రు శిబిరమునుండి వచ్చిన నాశిరస్సిదే నీపాదములకడ బడవైచినాను. నాకు శరణిచ్చి రక్షించినా సరే లేదా నా తలను ఖండించినా సరే నీ చిత్తము" యిట్టి ఆత్మార్పణమే సాష్టాంగనమస్కార మందిమిడియున్నది.

ఈ సాష్టాంగనమస్కారములో ఆత్మార్పణ మెట్లుయిమిడి యున్నది? అంటే లమిత్యాది పంచపూజలని గురగీతయందు ప్రసిద్ధముగా చెప్పబడినవిధముగా సర్వమును గురువునకు శిష్యుడర్పించుకొనుచున్నాడు. ఈ 'లం' ఇత్యాది పంచపూజలలో పృథివీభూతము, దాని సూక్ష్మమగు గంధతన్మాత్రా, యింకనూ సూక్ష్మమగు లం బీజము అర్పణ అగుచున్నవి. అట్లే జలభూతము, దాని సూక్ష్మమగు రసతన్మాత్ర, దానికంటెనూ సూక్ష్మమగు వం బీజము అర్పణ అగుచున్నవి. అట్లే అగ్ని, వాయు, ఆకాశభూతములు, వాని సూక్ష్మములగు రూప, స్పర్శ శబ్ద తన్మాత్రలును వానికంటే సూక్ష్మములగు రం,హం, యం బీజములున్న అర్పణ అగుచున్నవి. అంటే బ్రహ్మాండమందలి పంచభూతములు వాని వాని స్థూల సూక్ష్మ కారణరూపములు సహా అర్పణ యగుచున్నవేగాని, పిండాండము పిండాండమందలి అహము అర్పణ యగుట లేదే! అంగడిలోని బెల్లం అలయములోని దేవునికి నివేదన చేసినట్లున్నది. అందువల్ల తనకేమిఫలము ? అను శంక కలుగవచ్చును. కాని బ్రహ్మాండమునుండి పిండాండముత్పత్తి అయ్యెనని తెలిసికొన్నవారి కీశంకయే కలుగదు కారణమునే అర్పించునపుడు కార్యమును మిగుల్చు కొనగలడా! బంగారు వడ్డాణములో బంగారమును యిచ్చి వేసి వడ్డాణమును దాచుకొనగలడా! బ్రహ్మాండమును అర్పించునపుడు పిండాండమును సహితం అర్పణ చేయుచున్నాడన్న మాటయే. ఐననూ శిష్యుడే పంచపూజలు చేయుటలో పైన చెప్పిన భావమును కలిగియుండి (మనసా కర్మణా వాచా అన్నారు గనుక) క్రియారూపముగ దానిని ఎట్లు ఆచరించుచున్నాడో సాంప్రదాయక భక్తులకే తెలియును. ఐననూ యించుక వెల్లడించక తప్పదు. "ల" మిత్యాది పూజలు మానసికములే ఐననూ 1) "లం" పృథివ్యాత్మనే గంధతన్మాత్రా, ప్రకృత్యానందాత్మనే శ్రీగురు దేవాయ నమః పృథీ వ్యాత్మకం గంధం సమర్పయామి - అన్నపుడు మంచి గంధమును అర్పించుట క్రియారూపముగాదు. సాష్టాంగముగ ప్రణమిల్లుచూ రెండు కరములు గురుమూర్తి పాదాంగుష్టముల క్రిందికి జేర్చి గంధమును గుర్తెరుగునది ఘ్రాణేంద్రియము గనుక తన నాసికముచే గురుమూర్తి అంగుష్టమును తాక వలెను. తన స్థూల శరీరమందలి పృథివ్యాంశ గుణములగు నరములస్థులు చర్మ నఖ రోమ మాంసాదులను తన సూక్ష్మ శరీరమందున్న గంధ తన్మాత్ర వలన కలిగిన కర్మేంద్రియ పంచకమును తన కారణ శరీరమందలి లం బీజ రూపమగు ప్రాణచలనమున్ను గురుమూర్తి కర్పించుచున్నానని భావించవలెను. అట్లే స్థూలశరీరము అందలి ఆకాశ వాయు అగ్ని జల భూతములయొక్క స్థూలాంశ గుణములను, సూక్ష్మశరీరమున ఆయా తన్మాత్రలచే గలిగిన యింద్రియములను కారణ శరీరమున ఆయా భీజసంబంధమగు ప్రాణ చలనమున్ను అర్పించుచున్నానని భావించవలెను. ఆకాశమును అర్పించునపుడు శబ్దమున గ్రహించు చెవులు వాయువు నర్పించునపుడు స్పర్శను గుర్తించు త్వగింద్రియ చిహ్నములుగా చెంపలు, అగ్ని నర్పించునపుడు రూపమును గుర్తించు నేత్రములు, జలము నర్పించునపుడు రసమును గుర్తించు పెదవులు గురుమూర్తి పాదాంగుష్టములకు తాకించవలెను. "సం" సర్వతన్మాత్రా ప్రకృత్యానందాత్మనే శ్రీ గురుదేవాయ నమః సర్వాత్మ కాన్

సమర్పయామి అన్నపుడు పంచతన్మాత్ర స్వరూపమై ప్రత్యగాత్మా పరమాత్మల రూపముగా నున్న అఖండాత్మ స్వరూపమునే ఆర్పించవలెను. ఈ అర్పించు టెట్లో సాంప్రదాయక గురుభక్తులకే తెలియవలెను.

యీ విధంగా తనయందలి స్థూల సూక్ష్మ కారణమహాకారణ శరీరముల నాల్గింటిని ఏమియు మిగుల్చుకొన కుండా అర్పించు భావన ప్రధానమైనది. అప్పుడు గురుమూర్తి అంగుష్ఠముల క్రిందనుండి చేతులు కూడ తీసివైచి ఏ పట్టు లేక తన బ్రహ్మరంధ్రముచే గురుపాదాంగుష్ఠములను తాకించుచూ సర్వము విస్మరించి యుండుట శరణాగతి. సాష్టాంగ నమస్కార మన నిట్టి మహత్తర భావోపేతమైనది. ఇది యేమియు తెలియక, తెలుసుకొనుటకై ప్రయత్నించక, గురు పాదపద్మములకు నమస్కారముచేయువారిని చూచి కొందరు పరిహసింతురు. వారిని అజ్ఞులైన పసిపాలతో సమానముగాచూచి, యుపేక్షించి తమ సాంప్రదాయక పద్ధతిగా ప్రవర్తించుచూ అచరణయందుండుటయే గురుపుత్రుల కర్తవ్యము. "అవినీతులు నిందచేస్తే అయ్యే దేమోయీ! అందులో మనది పోయ్యే దేమోయీ!" అను శ్రీ కృష్ణదేశికుల వాక్యం గుర్తుంచుకొనవలసి యున్నది.

❋ ❋ ❋

8. శిష్యునికి గురువు అవసరమైతే గురునికి శిష్యుడూ అవసరమే

గురువు లేనిచో శిష్యుడు గురుబోధ మర్మధర్మ ములు తెలుసుకొనలేడు. శుశ్రూషా చతుష్టయముచే గురుని సేవించక శిష్యునికి అంతఃకరణశుద్ధి కలుగజాలదు. పరమాత్మ యొక్క సాకారరూపమే గురువు అని గురుని యుపాసించని యెడల గురువాక్యమునందు శిష్యునికి విశ్వాసము కలుగ జాలదు. వస్తువును గురువు చెప్పి చూపించి స్వయంగా గురుమార్గమునందు తాను నడిచి, శిష్యుని నడపించనిచో, మార్గమందు కలుగు అవరోధములను అతిక్రమించి శిష్యుడు గమ్యస్థానము చేరలేడు గురుని కృపకలుగనిచో పరిపూర్ణము గాని, యెరుకగాని, ఎరుకను విడచువిధానముగాని, యెరుకను విడచి అశరీరపద్ధతిలో, ఆగామి రహితముగా, రాజయోగ రీవితో, కర్మలాచరించు కర్మకౌశలముగాని శిష్యునికి లభింపజాలవు. వేయేల ! గురువు లేనిచో శిష్యునికి భ్రాంతిరహిత మెన్నడూ సిద్ధించదు. ఆశయసిద్ధి యెన్నడూ పొందజాలడు. కనుక గురువు శిష్యుడు తరించుటకు అత్యంత ముఖ్యావసరమైయున్నాడు అనుటలో యెవరికిన్ని ఎట్టి సంశయములున్నూ యుండజాలవు.

ఐతే, గురువు శిష్యుని తరుణోపాయమునకు అవసరము కాని గురువునకు శిష్యుని అవసరమేమి కలదు ? అని ముఖ్యముగా విచారించవలసిన విషయమే.

1) గురుపరంపరాప్రాప్తమై తనకు భ్రాంతిరహితము గావించు బ్రహ్మవిద్య తనతో అంతముకాకుండా ఆచంద్రార్కము అవిచ్ఛిన్నముగా సాగి భావికాలపు జిజ్ఞాసువులకు ముముక్షువులకు మేలు చేకూర్చవలెనన్నచో ప్రప్రథమంలో తనకు శిష్యులవసరము.

2) "ఆసుప్తే రామృతే కాలేన యం వేదాంత చింతయేత్" అనగా నిద్రవచ్చేవరకు తాను వేదాంత విచారణ యందే కాలము వ్యతీతము చేయవలెనని విధించబడినదిగదా! తానొక్కడే తనలో తానే సర్వకాలం విచారణ చేసుకొంటూ వుండుట కష్టసాధ్యముగదా! శిష్యులుంటే వార్కి బోధించుటతో పాటు తనకు మననక్రియకూడా ఏక కాలమందు సాగు చుండగలదు.

3) "నేటి కాలమున సాందీపునివంటి సద్గురువు శ్రీ కృష్ణునివంటి సచ్ఛిష్యుడుండుట దుస్తరము. ఎరుకకు మరుపు సహజము. గురువుకడ నేర్చిన విద్య మరచిపోవుట తటస్థింప వచ్చును. కనుక గురువు తానేర్చిన బోధను ప్రయత్నపూర్వకముగా జ్ఞప్తియందుంచు కొనవలసియున్నది శిష్యునికి పాఠములు చెప్పుటలో విషయములు తిరిగి జ్ఞప్తిలోనికి విధిగా వచ్చుటయు, గురుని స్మృతిపథములో నిలచిపోవుటయు జరుగును.

4) "విననేర్చి చెప్పనేర్చిన మనుజులకే దీనిలోని మర్మము దెలుసున్" అని శ్రీ కృష్ణదేశి కేంద్రులు కందార్థములలో శెలవిచ్చియున్నారు. కారణమేమి ? వినుటలో కష్టమేమియును లేనేలేదు. కాని చెప్పవలెనన్నచో 1) విషయము జ్ఞప్తి లోనుండవలె 2) అది క్షుణ్ణముగా తనకు అర్థమైయుండవలె. 3) శ్రోతలకు తాను చెప్పు విషయము బాగుగా వారికర్థమై హృదయమున హత్తుకొనుటకై, శ్రుతి యుక్తి అనుభవములు దృష్టాంతములు జతకూర్చి బోధించవలెను. యిందుకొరకు గురువు కష్టించి ఎప్పటికప్పుడు బోధనకు తగిన సాధనసామాగ్రి సమకూర్చుకొని శిష్యులకు బోధించుచుండవలెను. 4) చెప్పునపుడు తనకే కొన్ని సందేహములు కలుగు చుండును. వాటి పరిష్కారమునకై బాగుగా ఆలోచించుటయున్ను తనకు తోచనిచో తన గురువు నడిగి తెలిసికొనుటయున్ను తను నేర్చిన బోధ తనకు ఆరూఢ మగుటయున్ను జరుగును. 5) వినేవారికి, అర్థము కాకుంటే చెప్పేవానిదే లోపము కనుక చెప్పే నేర్పు అవసరం. అది కలుగుటకై శ్రద్ధగావిని, నిరభిమానముగా శంకలడిగి తెలుసుకొను శిష్యులవసరము.

6) దీర్ఘకాలము గురువును సేవించి, యింటనేనా, లేక వెంటనేనా గురువుతో కలసియుండి సర్వసందేహనివృత్తి గావించుకొన్న వాడే నిజముగా ఆదర్శవంతుడగు గురువు కాగలడు. నేటి కాలమున యిట్టి అవకాశములు బహుతక్కువ. తాను సందేహవిముక్తుడైగాని బోధాధికారము స్వీకరించరాదు. కాని అట్లుగాక ముందుగానే బోధాధికారులై ప్రచారమునకు పూనుకొన్న వారుకూడ

తాము తరించవలసియున్నది కదా! వారికి శిష్యులుండినచో శిష్యులకు చెప్పనిమిత్తమైనను కృషి చేయుట కల్గుచున్నది. నిత్యమూ శిష్యులకు ఆచరణ విధానమును గూర్చి యుపన్యసించుటలో, దొంగసన్యాసి నిజసన్యాసి అయినట్లు కొంత కాలమునకు తాను బోధించు విషయములను ఆచరణలో పెట్టవలెనని తాను మార్గదర్శకుడై, గురూపదిష్ట మార్గమున తన శిష్యులను నడిపించవలెనని కోర్కెగల్గును. ఆచరించి చూపించినవాడే ఆచార్యుడు కదా! కనుక జన్మరహిత మోక్షమునందు తనకు ఏమాత్రము అభిలాషయున్నా గురువు శిష్యులను సేకరించి వారిని నడిపించుటలో తానుకూడ బాగుపడి కృతార్థుడు కాగలడు.

కనుక గురువు ఆరూఢజ్ఞానము పొందుటకు శిష్యులుండుట కూడ చాల అవసరము. శిష్యులు లేనిచో ఎవరికి చెప్పను ? చెప్పటలో కాని తన లోపములు తనకు తెలియవు. సర్వము తెలయుననీ, అందుకే తనకు బోధాదికారము ప్రసాదింపబడెననీ అపోహచెంది, అహంకారియై, తనను తానే మోసగించుకొన్న వాడుగుచున్నాడు.

మా తట్ట మేము తగులపెట్టుకొంటే చాలు, మేము తిరిగి పుట్టకుండాపోతే చాలు మేము గురువులమూ కానక్కరలేదు, లోకాన్ని వుద్ధరించనూ అక్కరలేదు'' అని చాలామంది అనుట సమంజసమే కాని "అది స్వార్థదృష్టి. నీ మార్గం సరి అయినది; దీనివలన తప్పక జన్మరాహిత్యము కలుగును అని నీకు సంతృప్తి కల్గిన రోజున, నీవంటి మానవులకు దారిచూపి వారికికూడ యిట్టి యుత్తమస్థితి లభింపచేయుట నీవిధి. మరొక విధంగా నీగురు ఋణము యెట్లు తీర్చెదవు? సమర్థత లేనపుడు యితరులకు చెప్పబూనుట యెంతదోషమో, సమర్థత వున్నపుడు ఇతరులకు బోధింపకుండా వూరుకొనుటకూడా అంతే దోషమని పెద్దలంటున్నారు. మరిన్ని అదిలో సమర్థతలేదని తోచవచ్చును. కాని శిష్యులను చేరదీసి వారికి బోధించినకొద్దీ నీకు సమర్థతయూ చేకూరగలదు. అందరూ పల్లకీ యెక్కితే మోయువారెవరు? అని కొందరనవచ్చును. పల్లకీ యెక్కి మోయించుకొనుటకు, సత్కారమానపూజాదులకొరకు ధన కీర్తిప్రతిష్ఠలకొరకు గాదనియు, గురుత్వము గైకొనుట "ఆత్మనో మోక్షార్థం జగద్ధితాయచ" అన్నట్లు తన జన్మ తరుణోపాయము నిమిత్తమున్నూ లోకకల్యాణార్థమున్నూ అని గుర్తించవలెను. అందుకే శ్రీ కృష్ణ దేశికేంద్రులు --

"దేశాటనంబు చేసితి, వ్రాసితి గ్రంథములు కొన్ని
వర గురు శిష్యుల్ చేసేటి చర్చ వింటిని,
రోసితి మోక్షాద్యపేక్ష రూఢిగ వినుమీ
నీవిట్టి యారూఢత గనుమీ:
దేశికు దయబుట్ట చేసి శుశ్రూష, వుపదేశముకొని
వుపదేశమిచ్చితి మెచ్చి. . . . ."

అంటూ కందార్థం వ్రాసినారు "మీపీఠంలో శిష్యులకంటె గురువుల సంఖ్య హెచ్చుగానున్నదే" అని యితరులంటారని భాధపడనవసరంలేదు. అందులో మనది పోయ్యేదేమోయీ అని యూరుకొంటేనే మంచిది. శిష్యులు సరిగా కృషిచేయుట లేదు అని యేగురువున్నూ బాధపడనవసరంలేదు. తాను సక్రమమంగా కృషిచేస్తూవుంటే శిష్యులపుడే తమ గురువునుచూచి బాగుపడగలరు. నాకు ద్వాదశాంతమైపోయినది. నేనేమి చేసినా, ఏమిచేయకున్నా సరే అని ఆత్మవంచన చేసుకొంటూ తాము చెడినదేగాక తన్నాశ్రయించిన వారిని గూడ చెరుపక "యద్య దాచరతి శ్రేష్ఠ స్తత్త దేవేతరే జనాః" అని సదా జ్ఞప్తిలోనుంచుకొని ఆచరణకలిగియుండవలె.

మానవుడు జన్మాది మరణపర్యంతం ఒక విద్యార్థియే యైయున్నాడు. ఏది తెలుసుకొంటే సర్వం తెలియబడునో దానిని తెలుసుకొన్న పిదప అతని జిజ్ఞాస పూర్తియగును. ఆ పిమ్మట జన్మరహిత విధానమునందు ఆరూఢత సాధించవలెను. మానవుడై పుట్టినందులకూ గురుచరణముపట్టి నందులకూ ఈ పరిపూర్ణబోధయందు నిష్ణాతుడగుటయే చరమలక్ష్యము. గురుశిష్యన్యాయంలో తప్ప ఈ లక్ష్యము సిద్ధించదు. గురువు తానుగూడ శిష్యుడనే విషయం జ్ఞప్తియందుంచుకొని చతుర్విధ శుశ్రూషలు గావించుకొనుచు తన శిష్యులకు మార్గదర్శియై ఆదర్శప్రాయమైన జీవితము గడపవలెను. గురువైనంతమాత్రంతో తానశరీరియు అచలపరిపూర్ణుడును యైపోతినని అపోహపడరాదు. కనుక ప్రతి శిష్యుడున్ను తాను గురువగుటకును, శిష్యులను చేర్చి వారికికూడ తరణోపాయం కల్గించుటకును ప్రయత్నించుట వుత్తమ లక్ష్యమే యగును.

❀ ❀ ❀

9. ఆత్మ సాక్షాత్కారము సాధన ధర్మములు

మోక్షమునాశించిన ప్రతివ్యక్తికి ఆత్మసాక్షాత్కారం ముఖ్యావసరము. కేవలము జన్మరాహిత్యముకొరకు నిర్ణయింపబడిన పరిపూర్ణ బోధయందుకూడా ఆత్మను, కేవలాత్మను వస్తునిశ్చయముగా తెలుసుకొనవలసియున్నది. పరిపూర్ణ గురువు, ఆత్మయొక్క వస్తునిశ్చయము శిష్యునకు బోధరీత్యా కలిగించును. కాని ఆ బోధను శ్రవణము చేసిన శిష్యునికి ఆత్మ వస్తువునందు బుద్ధినిశ్చయమేకాని వస్తు సాక్షాత్కారము కలుగదు. అట్లుకలుగుటకై గురువు తెల్పిన అనుష్ఠాన ఆచరణము గురువు చెప్పిన వస్తువునందు ధ్యానము చెందించుట ముఖ్యావసరము. అట్టి ఏకాగ్రతాసాధనకు శిష్యునకు సహాయభూతముగా ఉండు కొన్ని ధర్మములు నియమములు ఈ

వ్యాసములో తెలియపర్చుచున్నాము. వానిని పాటించినచో శిష్యుడు తప్పక కృతకృత్యుడు కాగలడు.

1) ఈజన్మలోనే తాను తప్పక జన్మరాహిత్యస్థితిని సాధించితీరవలెనని సాధకుడు దృఢమైన దీక్షను పూని యుండుట ముఖ్యావసరము. గురూపదిష్ట మార్గమందు ప్రతినిత్యము అలసత్వములేక సాధనచేయవలెను.

2) ధ్యాన సమయమున తన కెట్టి అవరోధములు వికల్పములు యితరులవలన కలుగకుండా ఒక ఏకాంతప్రదేశ మందు సాధన చేయవలెను.

3) తన అంతఃకరణయందు మిగతా సమయములందు పారమార్థిక చింతతో నింపివేయవలెను.

4) ఇష్టదైవమునందు గురుస్వరూపమునందు భక్తిప్రపత్తులుకలిగి విశ్వమంతా గురుస్వరూపమేననే భావముతో ప్రతిప్రాణిని ప్రేమించుట అలవర్చుకొనవలెను.

5) చెట్టు మొదట నీళ్ళుపోస్తే చెట్టుఅంతకు ఎట్లు బలముచేకూరునో అట్లే ఏప్రతీకమునందు గురుస్వరూపదృష్టి నిలిపి అర్చించినా విశ్వమయుడైన గురుపరమాత్మనే పూజించినవాడగును.

6) అహంభావముగాని, ఆత్మోత్కర్షగాని పనికి రాదు. దురహంకారము వదలి గురుపరమాత్మకు ఆత్మనివేదనము చేసుకొన్నవాడై తాను గురుపరమాత్మ చేతిలోని కీలుబొమ్మ అయివున్నట్లు భావించుచూ ఉండవలెను. అప్పుడే తన వ్యష్టి అహంకారము పూర్తిగా నాశనము కాగలదు.

7) ఇతరుల తప్పులను యెంచక తనయందుండు దోషగుణములనే అన్వేషించి వానిని రూపుమాపుటకే ప్రయత్నించవలెను.

8) నీకు బలము చేకూరేవరకు నీ సాధన అంతయు రహస్యముగానే కొనసాగించుకోవలెను.

9) నీ స్వార్థమువిడచి ఎట్టికోరికలు లేక భూతదయ కల్గి ప్రవర్తించవలెను.

10) గొప్పకొరకు పదిమందిచూచి, నిన్ను మెచ్చుకొనవలెనని ఏమాత్రము ఆశించక రాజసిక తామసిక సాధనల జోలికిపోక కృషిచేయవలెను.

11) "పరోపకారః పుణ్యాయ పాపాయ పరపీడనం" అను పెద్దల వాక్యం విస్మరించక చేతనయినంతలో ఉపకారమే కాని అపకారముమాత్రము యెవరికి చేయరాదు. నీకపకారము చేసినకారియెడల ఉపేక్షవహించి నీకుచేసిన కీడును సాధ్యమైనంత త్వరగా మరచిపోవుటకే ప్రయత్నించవలెను.

12) నీ అంతఃకరణకు నొప్పి కలిగించు విషయములను గూర్చి ఏమాత్రము స్మరించక సంతోషముకలిగించు మంచి విషయములను నీవువిన్న గురుబోధలను మాత్రమే జ్ఞప్తిలోనికి తెచ్చుకొనవలెను.

13) ధ్యాన కాలమునందు నీ నేత్రములు మూసుకొనుటయు ఇతర శబ్దములు చెవులపట్టకుండుటయు ముఖ్యమని గమనింపవలెను.

14) నీ భుక్తిక్రియ కొరకు తాపత్రయము చెందకూడదు. ఏలననగా నీవు నీ ఇష్టదైవముతో లేక నీ గురుమూర్తితో కలసి ప్రయాణము చేయుచున్నావు. కనుక నీకేలోపము రాదను ధైర్యముతో యదృచ్ఛాలాభ సంతుష్టి కలిగి జీవయాత్ర సాగించవలెను.

15) శౌచమనగా స్థూలశరీశుద్ధి మాత్రమే అని భావించక అంతఃశౌచము ముఖ్యముగా ఉండవలెను. అంతఃకరణశుద్ధి కలుగుటకై సత్ కర్మాచరణము కలిగిఉండవలెను. అయ్యోనేను స్నానమయినను చేయలేదే ఇప్పుడు నేను ఎట్లా సాధన చేతును ? అని అనుకోకుండా సకాలమునకు నీ అనుష్ఠానము ధ్యానమువగైరాలుమానక చేసుకోవలయును.

16) జపసమయమునందు నా మనస్సు నిలుచుటలేదే ? నేను చేయు జపము వ్యర్థమేమో అని భావించక విక్షేపముకలుగు మనస్సును మంత్రమునందుగాని ధ్యేయవస్తువునందుగాని మరల మరల స్థిరత్వము చెందించుటకై ప్రయత్నము చేయుచుండవలెను.

17) మంత్రానుష్ఠానము లేక ధ్యానముజేయుస్థానము మార్చక ప్రతినిత్యమూ ఒకే స్థానమునందు ఒకే అసనమునందు కూర్చోనవలెను. కాని అట్లని స్థానము మారినది కనుక ఇపుడనుష్టానము చేయకూడదని మానరాదు.

18) అట్లే ఒకే సమయమునకే ధ్యానము ప్రారంభించి చేయవలెను. కాలాతిక్రమణమైనదని సాధనమానరాదు. తిధివారనక్షత్రములు బాగుండలేదనిగాని వర్జ్యములు దుర్మహూర్తములు వున్నవనిగాని యెంచి సాదన మానరాదు. పరమాత్మ దృష్టిలో కాలమంతయు పవిత్రమైనదే.

19) సాదనాకాలమందు తామసికాహారము విడనాడుట చాలా ముఖ్యము. ఏలననగా "ఆహార శుద్ధౌ సత్వ శుద్ధిః" అనిన్ని "సత్వాత్సంజాయతే జ్ఞానం" అనిన్ని తెలియవలెను.

20) అనుష్ఠానమంత్రం ఒక్కటిగానే వుండవలెను రెండుగాని ఇంకా ఎక్కువగాని జపించరాదు. అట్లే ధ్యేయవస్తువుకూడా ఒక్కటియే అయి వుండవలెను. లేనిచే ఏకాగ్రత కుదరదు.

10. రాజయోగము

మంత్ర, లయ, హఠ, రాజయోగములని నాలుగుయోగములు చెప్పబడినవి. ఇందు మంత్ర లయ హఠ యోగములు అభ్యాసయోగములని చెప్పబడును. జ్ఞానయోగమునకే రాజయోగమని పేరు. జీవ బ్రహ్మైక్యమే నాలుగు యోగములకు లక్ష్యము. కాని యిందుత్తమమైనది జ్ఞానయోగము కనుక దానికి రాజయోగమని పేరిడిరి. అభ్యాసయోగములు కఠోరసాధనలతో కూడుకొన్నవి. కష్టసాధ్యమైనవి యగుటయే యిందుకు కారణము. జ్ఞానమార్గమందు కేవలము వేదాంత వాక్యములు చెప్పి మురియుటవలన నేమియు లాభము లేదనియు, తారక యోగాభ్యాసముచే మనశ్శుద్ధి, సాంఖ్యవిచారణచే ఆత్మనిశ్చయము గల్గి అమనస్క యోగముచే అనుభవము పొందుటవల్ల అద్వైతసిద్ధి పొందవలెనని, అవుడుగాని మోక్షము సాధింపలేదని తారకసాంఖ్యామనస్కములు అవసరమని నిర్ణయించిరి. ఐతే తారకామనస్కముల యందు యోగసాధన తప్పనిసరి యగుటచే యీ రాజయోగముకూడ సులభమైనదికాదు. భగవత్ గీతయందలి ఆత్మసంయమయోగమే రాజయోగమని కొందరు అందురు. దీనికిన్ని యమ, నియమ, ఆసన, ప్రణాయామ, ప్రత్యాహార ధ్యాన ధారణ సమాధులు ముఖ్యములై యున్నవి. యీ యోగముకూడా చిత్తవృత్తులను నిరోధించి యేకాగ్రత సాధించుటకు మార్గమైయున్నది. యిందు విధించిన సాధనలు కఠినములును కష్టసాధ్యములును, కొంతమందికే యవ్వన దశలో మాత్రమే సాధన చెయ్యతగినవిన్ని అయివుండుటచే యిదియును రాజయోగమనుట చెల్లదు.

అందరూ అన్నివయసులలో సాధించ తగినదియును, పరమోత్కృష్టమైన శాశ్వత జన్మరాహిత్యమును లక్ష్యముగా కలదియును అయిన పరిపూర్ణబోధమార్గము రాజయోగము అనదగినది కాని మిగతా యోగములు రాజయోగమను పేరునకు తగినవి కావని చెప్పుటకు సందేహము లేదు.

ఈ పరిపూర్ణ రాజయోగమునకు అన్నమయ పురుషయోగము, ప్రాణమయ పురుషయోగము, మనోమయ పురుషయోగము, విజ్ఞానమయ పురుషయోగము అను నాలుగు యోగములును పూర్వాంగములై యున్నవి. యిందు అన్నమయ పురుషయోగమువలన త్రికరణశుద్ధి సాధించి, ప్రాణమయ పురుషయోగము వలన ప్రాణశక్తిని రక్షించుకొని, మనోమయ పురుషయోగమువలన యింద్రియ మనస్సులపై ఆధిపత్యము వహించి, విజ్ఞానమయ పురుషయోగమువలన ఆత్మనిశ్చయము పొందినవారెవరో వారే అచల పరిపూర్ణ రాజయోగమును సాధించుటకు అర్హులు.

పరిపూర్ణ రాజయోగమునందు ముముక్షువునకు గురువు అఖండ జ్ఞానస్వరూపమగు యెరుకను పంచతన్మాత్ర రహితమగు పరిపూర్ణమును తెలియజేసి జననమరణములకు అత్యంత మూలకారణమగు యెరుక భ్రాంతి,నుండి విడిపించగలడు. అయితే ఆ గురువునందు శిష్యునకు అచంచలమైన సంపూర్ణ విశ్వాసముండవలె. మరిన్ని గురువు బోధించిన పరిపూర్ణ బోధమార్గముకాక యితర మార్గములు అన్నియూ పూర్తిగా విడిచివేయవలెను. గురువు కేవలము దైవమేకాని యితరము కాదు అను దృఢత్వము ప్రాప్తించుటకై గురువును యిష్టదైవము వలె వుపాసనగావించలెను. కుక్క ఎంత బలిసినా గోనెబస్తాలను మోయలేనట్లు యెంత మహాశాస్త్రపండితుడు ఐనా, గురుభక్తి, గురుసేవ, గురునిష్ట లేనిచో ఆపాండిత్యము కుక్క బలుపువలె వ్యర్థము. చంచల బుద్ధిచేత లోకమునందు ఉన్న యితర సాధనా మార్గములలో దేనియందును భ్రాంతి లేక గురువు విధించిన మార్గమునందే శిష్యుడు పయనించవలెను.

కర్మవలన జన్మ జన్మవలన కర్మ యిట్లు అనంతముగా సంసారచక్రమునందు చిక్కి మానవుడు పరిభ్రమించుచున్నాడు. కనుక జన్మరాహిత్యము ఆశించిన శిష్యుడు పునర్జన్మకు హేతుర్భూతమైన విధముగా కర్మ ఆచరించరాదు. కనుక కర్మాచరణమునందు అప్రమత్తుడైయుండవలెను. యెట్టి కర్మ ఏరీతి ఆచరించినచో అది పునర్జన్మకు తీసుకొనిరాదు? అను విషయము గుర్తించి అట్టికర్మ ఆవిధముగా జేయవలెను. అందుకు ముముక్షువుయొక్క స్వధర్మము యేదో అది తెలిసి కొని స్వధర్మమును విడువక పరధర్మమును పూనక వర్తించుట ముఖ్యము.

స్వధర్మము అనగా నేది ? స్వ+ ధర్మము = స్వధర్మము. అనగా తనయొక్కపని. స్వ అనగా తాను. తాను. అనగా ఆత్మ కనుక పరమాత్మ నిర్మిత విధానమునకు అనుకూలముగా నుండు విధమున ప్రవర్తించుటయే స్వధర్మము. ఈ స్వధర్మము నిష్కామంగా,నిస్వార్థముగా ఆచరించవలెను.లేనిచో ఆ కామ్యకర్మ అంతఃకరణమందు సంస్కారములనుత్పత్తి చేయును. ఆసంస్కారములే ఆగామికర్మయై, ఆకర్మానుభవమునకు యోగ్యమైన శరీరములతో తిరిగిపుట్టి అయా సుఖ దుఃఖములను అనుభవించవలసి వుండును. దేహపోషణకై, చేయు కర్మలు స్వధర్మము లగునా ? కాదా ? యను శంక కొందరికి కలుగవచ్చును. అంటే "శరీర మాద్యంఖలు ధర్మ సాధనం" అని చెప్పబడుతోంది కనుక స్వధర్మాచరణ కొరకే శరీరమును పోషించవలెను. ఆవిధంగా భుక్తిక్రియకు ప్రధానస్థాన మీయబడినది. అవసరమైతే స్వధర్మ నిర్వహణకొరకు దేహమునుకూడా త్యజించవలెను. "స్వధర్మే నిధనం శ్రేయః" అంటూంది భగవద్గీత. ఏది స్వధర్మము? అంటే, భక్తునికి భక్తియే స్వధర్మము. కర్మయోగికి కర్మ జ్ఞానయోగికి జ్ఞానము, ప్రచారకునికి ప్రచారము స్వధర్మములు. ఎవరి స్వధర్మమును వారు పాలించవలెను. వ్యక్తినిబట్టి, దేశకాల పాత్రతలనుబట్టి స్వధర్మము మారుచుండును.

పుట్టుకవలన మాత్రమే స్వధర్మము నిర్ణయించి జీవితమంతా అధర్మము పాలింప బడవలెననుట సరికాదు. బ్రాహ్మణాది చతుర్వర్ణములలో పుట్టినవారికి ఆయావర్ణధర్మములే స్వధర్మములని నేటి సమాజములో వర్తింపచేయుట ఆచరణ యోగ్యముకాదు. జన్మతః యితర కులములవారయ్యును బ్రాహ్మణ ధర్మమును పాలించి బ్రహ్మవేత్తలైన రాజర్షి బ్రహ్మర్షులైన వారందరు స్వధర్మము నుల్లంఘించిన వారేనా ? స్వధర్మము వయసునుబట్టియు ఆశ్రమమును బట్టియు దేశకాల పరిస్థితులను బట్టియు మారుచుండును. వారివారి పూర్వజన్మ సంస్కారముల ననుసరించియు వారివారి ప్రత్యేక గుణత్రయ సమ్మిశ్రమమువల్లకు వ్యక్తులకు అంతఃకరణప్రవృత్తి ప్రత్యేక అభిరుచియు కల్గుచుండును. ఒక కులమున పుట్టినవారందరికీ వర్ణాశ్రమారోపిత ప్రవృత్తి మాత్రమే కలుగునని చెప్పరాదు. ఒకనికి యింజనీరింగు, ఒకనికి వైద్యము, మరొకరికి వేదాంతము వగైరా శాస్త్రములయందు ఆసక్తి అభినివేశములు కలుగుచుండును. పిల్లలను పరీక్షచేసి వారి ప్రవృత్తిననుసరించి వారికి శిక్షణనిచ్చి, ఆయా శాస్త్రములందు వారిని నిపుణులను గావించుపద్ధతి రష్యా మొదలగు దేశములందు అమలులోనున్నది. అభిరుచిలేని విద్యయందు ఎంత కృషి చేసినా ఎవరున్నూ ఉన్నత శిఖరముల నందుకొనజాలరు. అట్లే పారమార్థిక విషయములలో కూడా ఒకడు భక్తిమార్గము నందు ఒకడు కర్మమార్గమునందు, మరొకడు జ్ఞానమార్గమునందు, వేరొకడు యోగమార్గమునందు కృషి చేయుటకు సహజప్రవృత్తియు అర్హతయు కలవాడై యుండును. కనుకనే భక్తులు, యోగులు, జ్ఞానులు, అన్నికులములయందునూ బుట్టి పేరెన్నికగన్న వారైరి. ఎవరు ఏకర్మచేసినా, ఆకర్మను నిర్దుష్టముగాను, సౌష్టవముగాను చేసి ఆ కర్మలో ప్రథమ శ్రేణికి చేరుటయు కళాపోషణ, సంగీతము, సాహిత్యము, చిత్ర శిల్పకళలు, దానశీలత, పరాక్రమము, వైరాగ్యము వగైరాల యందు ప్రావీణ్యత పుట్టుకతో రావలసినవే గాని తెచ్చిపెట్టుకొంటే రావు. యిట్టి ప్రజ్ఞాదురంధరులు అన్ని కులములందూ నుండుట కదియే కారణము. కనుక స్వధర్మములపై నాధార పడియున్నదను వాదము విశ్వసనీయము కాదు. పారమార్థిక కృషికి మానవులందరూ అధికారులే కాని ఆ కృషి చేబట్టు వారు బహు అల్ప సంఖ్యాకులు మాత్రమే. కనుకనే భాగవతంలో 'అచ్చపు చీకటింబడి గృహవ్రతులై విషయోపభోగులై చచ్చుచు బట్టుచున్ మిగుల చర్వితచర్వణులై వారికిన్, చెచ్చెర గల్గునే పరులు చెప్పిననైన, నిజేచ్ఛనైన నే మిచ్చిననైన, గానలకు నేగిననైన హరి ప్రబోధముల్ ॥ అని చెప్పబడింది.

"మనుష్యాణాం సహస్రేషు కశ్చి ద్యతతి సిద్ధయే ।
యతతా మపి సిద్ధానాం కశ్చిన్మాం వేత్తి తత్వతః॥

తా॥ అనేక వేలమందిలో ఒకానొకనికి మాత్రమే పారమార్థిక ప్రవృత్తి కలుగుచున్నదని, అందొకానొకడు మాత్రమే కృతకృత్యుడు కాగల్గుననిన్ని అర్థం. అందుచే వర్ణములకు నిర్ణయింపబడిన కర్మయే స్వధర్మమని నిర్ణయించుట ఎంత మాత్రమూ సరికాదు. మానవుడై పుట్టినందుకు ప్రాయశః

తన స్వస్వరూప సాక్షాత్కారము పొందుటకు వలయు కృషియే స్వధర్మము. ఐహికాముష్మికపురోభివృద్ధి సాధించుటయే మానవ కర్తవ్యము కనుక కర్తవ్యకర్మ చేయుటయే స్వధర్మము. అంతఃకరణ ప్రవృత్తి ననుసరించి కలుగు ప్రేరణల యుక్తాయుక్తములను బుద్ధితో చక్కగా విమర్శించి సమిష్టి శ్రేయోదాయకమగు కర్మలను చేయుటయే స్వధర్మము.

మానవులు కర్మఫలములు అంటకుండా కర్మాచరణ చేసినచో జన్మరాహిత్యము సిద్ధించగలదని సర్వాంగీకృత విషయము. కర్మలే చేయకుండ వూరుకొంటే సరిపోలేదా ? అని కొందరందురు. కాని కర్మ చేయకుండా వుండుట అసంభవము. ఏలననగా, వూరక వుండటయే కర్మ. నిద్రపోయిననూ కర్మయే. కాష్ఠవత్తుగా శరీరావయవముల చలనము నిరోధించిననూ చలనాత్మకమగు వాయుభూతాంశముచే ఏర్పడిన మనస్సు నిస్సంకల్పరూపముగా నుండజాలదు. కనుక కాయిక వాచికకర్మ లరికట్టిననూ మానసికకర్మ తప్పదు కనుక కర్మ త్యాగమున పుణ్యాజనకమగు సత్కర్మాచరణము రజోగుణ లక్షణము. పుణ్యఫలము వుత్తమ జన్మలకు కారణమై హిరణ్య శృంఖములవలె బంధ కారణమేయగుచున్నది. జన్మయే కలుగరాదు. అని ఆశించిన వానికి యిట్టి కర్మ నిష్ప్రయోజనము. కర్మ చేయుచున్నను ఫలము అంటకుండా పోవలెను. యిందుకు స్వధర్మమగు కర్మను నిష్కామముగ చేయవలయునని సకల కర్మ ఫలితములు ఈశ్వరార్పణము చేయుట యొక మార్గమనీ గీత ఉపదేశించుచున్నది. ఐతే యెట్టి ఫలమును కోరక యెవరైనను యేకర్మయు చేయుట జరుగదు. మరియు "సర్వభూతస్థ మాత్మానం సర్వభూతాని చాత్మని । ఈక్షతే యోగయుక్తాత్మా సర్వత్ర సమదర్శిన ః ।

తనయందు సర్వమును సర్వము నందు తనను చూచు సమదర్శియగు యోగి మాత్రమే సకలకర్మలను యీశ్వరార్పణ బుద్ధితో చేయగలడు. ఏలనన అతనికి సర్వమూ యీశ్వరుడే. ఆత్మయే యీశ్వరార్పణబుద్ధి. వేరే తెచ్చి పెట్టుకోవలసిన అవసరమే లేదు. తెచ్చి పెట్టుకొన్న యట్టి బుద్ధియే నిష్ప్రయోజనమే. కనుక ఈశ్వరార్పణ బుద్ధితో కర్మచేయుమని శాసించుటయు నిష్ప్రయోజనమే. ఈ విధమగు కర్మఫలత్యాగము సాత్వికత్యాగము అన చెల్లును.

కర్మ చేయుచూ ఆ కర్మ పునర్జన్మకు కారణభూతము గాకుండుటకు గాను చెప్పబడిన కర్మ త్యాగ, కర్మఫల త్యాగకర్తృత్వ త్యాగము అను మూడు విధానములలోను కర్తృత్వ త్యాగము ప్రశంసింపబడినది. కర్తృత్వత్యాగ శ్రేష్ఠత్వమును గూర్చి చర్చించుటకు ముందు కర్మ వికర్మ, అకర్మ అను విషయములను గూర్చి తెలుసుకొనవలసియున్నది. కర్మయనగా స్వధర్మరూపమగు కర్మని తెలుసుకొంటిమి. కొందరు కర్మయనగా విహిత కర్మయని, వికర్మయనగా నిషేధ కర్మయని, అకర్మయనగా కర్మనే చేయకుండుటయని వ్యాఖ్యానించినారు. కాని అదిసరికాదు. వికర్మయనగా విపరీతేన కర్మ వికర్మ అని అర్థము గ్రహించినట్లయినది, కాని వికర్మ అనగా విశేషణ కర్మ - వికర్మ అని అర్థము కూడ సాధ్యము అయి ఉన్నది.

ఈ అర్థమే గ్రాహ్యము. స్వధర్మ కర్మాచరణము వికర్మ అనగా విశేష రూప కర్మ యెప్పుడగును? స్వార్థము, ఫలాపేక్ష లేక లోక హితార్థముగ యజ్ఞార్థము లేక యీశ్వర అర్పణ బుద్ధితో చేయు కర్మలు విశేషరూపములగును. కనుక స్వధర్మాచరణము యిట్టి మానసిక ప్రవృత్తితో చేసినపుడే కర్మ సంస్కారములంటవని కొందరు అంటారు. కర్తృత్వము ఉన్నంత వరకూ ఫల మంటక మానదు సర్వమూ ఆత్మయే గాని అన్యమేమీ లేదనే భావన యుంటేనే గాని యీశ్వరార్పణమస్తు అని అన్నంత మాత్రమున యీ కర్మకర్తృత్వము పోదు. కర్తృత్వముంటే భోక్తృత్వము తప్పదు. కర్తుత్వ భోక్తృత్వములు జన్మ పరంపలు విధిగా కలిగించును.

ఆత్మయే సర్వకర్త, కర్తయగు ఆత్మ జీవేశ్వర జగద్రూపముగా మార్పు చెంది కర్మలు చేయుచూవుండి "చేటు పాటులు రెంటిచే వచ్చు ఫలము ముమ్మాటికి అనుభవించి మరణ జననములొంద నతడేర కర్త" అని కృష్ణదేశి కేంద్రులు శెలవిచ్చియున్నారు. ఇది యెరుకయే (ఆత్మయే) అన్నిటికి కర్తయై యున్నది. విశేషించి గురుభక్తుడు - శ్లో॥ శరీర మింద్రియం ప్రాణంఅర్థ స్వజన బాంధవాన్ ॥ ఆత్మ దారాదికం సర్వం సద్గురుభ్యో నివేదయేత్ ॥ అన్నట్లు సర్వస్వము సద్గురువునకు నివేదించినపుడు, పంచతన్మాత్రలను అర్పించి యున్నపుడు యింకనూ కర్తృత్వ బుద్ధి విశేషించి యుండునా ? పరిపూర్ణ పరబాహ్యము నందు యెరుకకు మూలము గాని స్థానము కాని లేదు. "సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ" అను భగవదాదేశానుసారం గురువునకు శరణాగతుడైనవాడు కర్తృత్వము తన యందు ఆరోపించుకొనుట మూఢత్వమే యగును. తానే లేడు గనుక స్వధర్మ కర్మాచరణములో తాను చేయు కర్మలకు తాను బాధ్యుడు కాడు. ఈ దృక్పథముతో కర్మలాచరించు వానికి కర్మ సంస్కారములు అంటవు. అట్లు చేసిన కర్మయే వికర్మయగును. మరొక విధముగా చూచినా కర్మయు కర్తృత్వమును త్రిగుణకార్యములు మాత్రమే అయియున్నందున గుణములు గుణములయందు ప్రవర్తించును. నేను అసంగుడను అకర్తను, అను చిత్త ప్రవత్తితో కర్తృత్వమును వీడి కర్మలు చేసిననూ కర్మ సంస్కారములు తన్నంటజాలవు. స్వధర్మాచరణము యిట్టి మనః ప్రవృత్తితో ఆచరించుటయే వికర్మ. కనుక కర్మ+వికర్మ = అకర్మ యగుచున్నది. అకర్మయనగా కర్మలు మానుటగాదు. కర్మ చేసియు, చేయని వాడు కావలెను. అట్టి కర్మయే అకర్మయగును. పరిపూర్ణ భావములో, ఆరూఢత సాధించినవాడు యీ విధముగా కర్మాచరణ గావించి కర్మఫలములు అంటకుండా చేసుకొనును. 'యోగఃకర్మసు కౌశలం' యిట్టి కర్మ కౌశలమే యోగమని గీత చెప్పుచున్నది. యిట్టి కర్మ కౌశలమే రాజయోగము నందు మిక్కిలి ప్రాధాన్యత వహించుచున్నది. యిదియే నైష్కర్మ్యసిద్ధి.

స్వధర్మాచరణము వికర్మగా మార్పుచెందు ప్రయత్నము చాలా అవసరము. ఏ పని చేసినా హృదయపూర్వకముగా త్రికరణ శుద్ధితో చేసిన గాని అది వికర్మ కాజాలదు. ఉదాహరణకు శిష్యుడు గురుమూర్తికి నమస్కారము చేయునపుడు "మన్నాథ శ్రీజగన్నాథో మద్గురు శ్రీ జగద్గురుః"

అని గురువు నందు పరమాత్మదృష్టి తన యందు భృత్యభావము వినమ్రభావము వుంటేనే ఆనమస్కారమునకు విలువ ద్విగుణీకృతమగును. ఆ కర్మ వికర్మయగును. అప్పుడు మాత్రమే తాను చేయుకర్మ, కర్మయోగముగా పరిణమించును. లేనిచో అది కేవలము కర్మగానే వుండును గాని అది యోగమే కాదు. యోగమనగా కలయిక, కూడిక అను అర్ధము కదా. కర్మదేనితో కూడి కర్మయోగమగును ? అంటే వికర్మ రూపమగు మానసిక వ్యాపారముతో కూడినపుడే అది యొక యోగమగును. కామక్రోధాధికములతో చేయు కర్మయోగ మెప్పుడైన కాజాలునా ? కర్మేంద్రియ వ్యాపారమున కనుకూలమగు అంతరేంద్రియ వ్యాపారమున్నపుడే అది వికర్మయు, కర్మ యోగమును కాగల్గును. ఇట్టి వికర్మవలననే అంతఃకరణశుద్ధి పిదప జ్ఞానోదయమున్ను అగును. కర్తృత్వత్యాగ పూర్వకమైన స్వధర్మాచరణమే నిజమగు సన్యాసము కాగలదు. కాని కర్మ త్యాగము సన్యాసము కాజాలదు. వికర్మపూర్వక స్వధర్మ నిర్వహణలో కర్మయోగియే జ్ఞానయోగియై విరాజిల్లుటయే రాజయోగమనబడును. రాజయోగి అనగా జ్ఞానియగు కర్మయోగి. అకర్మయనగా అన్నియు చేయుచూ వాని ఫలము అంటక పోవుట. స్వధర్మము సేవారూపముగా (విశ్వ రూపములోనున్న ఈశ్వరుని సేవ) కర్తృత్వరహిత బుద్ధితో నిస్వార్ధముగా నిర్వహించినపుడు అది అకర్మయగును యిదియే రాజమార్గము. ఇదే నైష్కర్మ్యము.

రాజయోగమునందు కర్తృరత్వహితమగు కర్మ యోగము యిమిడియున్నట్లే భక్తి జ్ఞానాది సాధనలన్నియు యిమిడియున్నవి. గురూపాసన గురుస్వరూప ధ్యానము పరిపూర్ణ పరబ్రహ్మము యొక్కయు అఖండ యెరుకయొక్కయు వస్తు నిర్ణయరూప జ్ఞానప్రబోధయు యుండును. కనుకనే యిట్టి పరిపూర్ణ బోధకు పరిపూర్ణ రాజయోగమని పేరువచ్చినది. రాజయోగమని పేరు పరిపూర్ణ బోధ మార్గమునకే సార్థకమై యున్నది.

❋ ❋ ❋

11. పరిపూర్ణ రాజయోగము

యోగము, రాజయోగము, పరిపూర్ణ రాజయోగము అను మూడు శబ్దములకు గల తారతమ్యమును నిరూపించి పిదప పరిపూర్ణ రాజయోగమును నిరూపించుటయే ఈ వ్యాసముయొక్క ముఖ్యోద్దేశము. యోగమనగా రెండు వస్తువులయొక్క కూడిక అని సామాన్యార్ధము. అధిష్ఠాన పరబ్రహ్మము అవ్యక్తము అనునవి నిజముగా రెండు వేరువేరు వస్తువులు కాకున్నను ఆ అధిష్ఠాన ప్రరబ్రహ్మము తనశక్తియగు మూలప్రకృతితో కూడినపుడే

జగత్కారణమగుచున్నది. యిదియే మొదటి యోగము. ఈశ్వరునకు మాయతోను, జీవునకు అవిద్యతోను గల సంబంధములు తరువాతి యోగములు. ఈవిధముగా " ఆ బ్రహ్మస్థంభ పర్యంతం" ప్రతివస్తువు రెండు రూపములు (లేక లక్షణముల) సంయోగములో ఏర్పడినదే అయియున్నది. ప్రతి వస్తువునకును ఒక స్థూలరూపము లేక ఆవరణము ఇంద్రియగోచర మగుచున్నది. ఆ వస్తువునందు సూక్ష్మమై వస్తువుయొక్క గుణము లేక శక్తి పరివ్యాప్తమై యున్నది. వస్తువునకు గుణియనియు, వస్తుధర్మమునకు గుణమనియు పేర్లు, యీ గుణి గుణసంబంధము నిత్యము. యిట్టి యోగము ప్రత్యక్షగోచరము.

యమ నియమానన ప్రాణాయామాది సాధనలు చేసి కుండలిశక్తిని మేలుకొల్పి సహస్రారమునకు హంసనెక్కించి సమాధినిష్ఠను సాధించుట యోగము. యోగపద్ధతు లనేకములు, అందు పంతంజలి నిర్ణయించినవే నేడెక్కువగా గాన్పించుచున్నవి. "యోగశ్చిత్త వృత్తినిరోధః" అనగా యోగము చిత్తవృత్తులను ఆరికట్టునని చెప్పపడినది. యోగములో ప్రాణసంచారమును నిరోధించినంతకాలమే చిత్తచాంచల్యమగును గాని యోగమునుండి బయటకు వచ్చిన పిదప, తిరిగి చంచలత్వము పొందుచునేయుండును. అంతేకాక యోగము సాధించుట చాల కష్టము. అన్ని వయస్కులవారికి అన్ని ఆశ్రమములవారికి ఆచరణ యోగ్యముకాదు. గురువు చెంత లేక యోగసాధన చేయనేరాదు. ఏలనన, యోగసాధన యందెట్టి లోపము వాటిల్లినను శరీరమందనేక రోగములంకురించును. ఇంతకూ చిత్తవృత్తి నిరోధ మొక సాధనము మాత్రమేగాని సాధించి పొందవలసిన సిద్ధికాదు. అంతేగాక చిత్తచాంచల్య మణచి ఏకాగ్రత సాధించుటకు ఒక్క యోగమే మార్గముకాదు. పంతజలియే తన యోగసూత్రములలో "ఈశ్వర ప్రణిధానాద్వా" అని సూత్రీకరించినాడు. అనగా ఈశ్వరోపాసన వల్ల కూడా చిత్తవృత్తులను నిరోధించి ఏకాగ్రతను సాధించవచ్చునని భావము.

భగవద్గీతయందు యోగశబ్దము ఎట్లు వాడబడినదో గమనించనగును. గీతయందు పేర్కొనబడిన 18 యోగము లున్ను 18 మార్గములుగా మనము గ్రహించవచ్చును. ఆ పక్షంలో యోగమనగా మార్గమని అర్థము స్ఫురించుచున్నది. ఐతే యీ మార్గములు ఒకదానితో నొకటి ఏమాత్రమూ సంబంధము లేని ప్రత్యేక బాటలా? మొత్తం గీతయంతయు జ్ఞానమార్గమునే ప్రతిపాదించుచున్నదని కొందరు; కాదు భక్తిమార్గము మాత్రమే గీత బోధించు చున్నదని కొందరు; కాదుకాదు, గీత కేవలం కర్మమార్గము నే సిద్ధాంతం చేసినదని కొందరు; ఎవరి మతాభిమానముచే వారు మిగతా వానిని నిరసించుచున్నారు. కాని గీత యోగశాస్త్రమని గీతాచార్యుడే పేర్కొనియున్నాడు. కనుక జ్ఞానభక్తి కర్మ మార్గములన్నియు ఏ యోగ శాస్త్రమునందంతర్భూతములో అట్టిదే గీతామార్గముగాని ప్రత్యేకము అందేదో యొక్కటే అని చెప్పబూనుట నిజంగా సాహసమే.

ఐతే అట్టి యోగమేది? గీత 18 అధ్యాయములలోనూ గూడా ప్రస్ఫుటముగా ఒక యోగము అంతర్వాహినీ రూపంగా అనుస్యూతమై ప్రవహిస్తూనేయున్నది. అదేదంటే జ్ఞానకర్మలతో గూడిన ఒక విశిష్టమైన రాజమార్గము. అది రాజర్షిమార్గమని కూడా గీతాచార్యుడు పేర్కొనియే యున్నాడు. ఐతే యిందు జ్ఞానకర్మలకేగాని భక్తికి స్థానము లేదా యనుశంక పొడమవచ్చును. జ్ఞానకర్మలకు సంయోగ మొనర్చునదే భక్తి. ఎట్లనగా మనోవాక్శరీరముల మూటి చేతను కర్మ జరుగుచున్నది. జ్ఞానమనగా అదియును ఒక మానసిక కర్మయేగదా. ఉపాసనా రూపమగు భక్తిభావము చేతనే మనస్సు ఏకాగ్రత చెందును. ఏకాగ్రత చెందిన మనస్సునకే వస్తునిశ్చయజ్ఞానము కలుగును. ఏ కర్మ చేయవలెనన్నను మనస్సు దానిపై సరిగా నిలచినపుడే ఆ కర్మ చక్కగా జరుగును. కనుక జ్ఞాన, భక్తి, కర్మలలో ఒకదాని విడచి మరొకటి ప్రవర్తించుటకు నిజముగా సాధ్యమే కాదు.

గుర్తెరిగిగాని, అనగా తెలివి లేకుండా ఎవరున్నూ ఏకర్మయూ చేయజాలరుగదా! కర్మలేనిచో జ్ఞానమునకు ప్రకాశములేదు. కనుక జ్ఞానకర్మలు కలసియే సర్వదా ప్రకాశించుచున్నవి. యీ జ్ఞానకర్మలయొక్క గ్రంధియే యోగము. భాగవతుల కృష్ణదేశికులవారు --

కం॥ ముడిబడి కర్మము జ్ఞానము
విడువక నా రెండు వెలసె విశ్వమన నదే॥ అనిన్నీ

కందార్థము॥ మంత్రముచే సం తెట్లగు
తంత్రము లేకున్న ? కాదు తంత్రముచేతన్
మంత్రము లేకను వడుగీల
మంత్రము తంత్రంబు రెండు మరిగూడికొనీ
కార్యములన్నీ జరిగింపుపూనీ ॥

అనిన్నీ శెలవిచ్చియున్నారు.

"సోऽకామయత బహుస్యాం ప్రజాయేయ" అని జ్ఞానరూపమైన సంకల్పము కలిగిన పిదప, 'తత్సృష్ట్వాతదేవాऽనుప్రావిశత్' అను కర్మరూపవ్యవహారము చేసెను. కనుక యీ జ్ఞానకర్మయోగము పూర్వ మునుంచి ప్రవర్తించుచునే యున్నది. కేవలజ్ఞానమార్గముగాని, కేవల కర్మమార్గముగాని ప్రయోజనకారి కాదనియు, రెంటియొక్క కూడికయందే సర్వవ్యవహారము సాధ్యమనియు, కనుక మోక్షసాధన మార్గము నిర్ణయించుపట్లగూడ జ్ఞానకర్మల రెంటియొక్క యోగముతోనున్న మార్గమే రాజమార్గమని ఆమోదించి జ్ఞానకర్మ సముచ్చయవాదమనే గీత సిద్ధాంతము చేసినదని చెప్పుట సాహసము కాజాలదు.

కర్మలు చేయుచున్నప్పటికీ కర్మలచే బద్ధుడుగాక నిస్సంగుడై ఆత్మస్వరూప నిశ్చయజ్ఞానముతో ప్రారబ్ధమనుభవించుటయే భగవద్గీత నిర్దేశించిన రాజమార్గము. యిదియే రాజయోగ మనజెల్లును. కనుకనే యోగశబ్దమునకు 'సమత్వం యోగముచ్యతే' అనిన్ని "యోగఃకర్మసుకౌశలం" అనిన్ని గీత నిర్వచించియున్నది.

పరిపూర్ణ రాజయోగమనగా కేవల పరిపూర్ణ పరబ్రహ్మమునందు జ్ఞానమునకుగాని చలనరూపమగు కర్మకుగాని జ్ఞానకర్మ సముచ్చయరూపమగు ఎరుకకుగాని సిద్ధాంతరీత్యా స్థానములేదని ఆదిలోనే గ్రహించి ప్రారబ్ధము అనుభవించుచు ఆత్మవస్తు నిశ్చయజ్ఞానము చేత సంచితమును నాశనము చేసుకొని, ఆగామి కర్మఫల రాహిత్యమునకై రాజయోగమును సాధనారూపముగా గ్రహించుట పరిపూర్ణ రాజయోగమని చెప్పబడును. రాజయోగ విధానమునందు ఆత్మోపలబ్ధి మాత్రమే చేకూరునుగాని జీవేశ్వర జగత్తుగా పరిణమించు ఆత్మలక్షణము మాత్రము తొలగిపోజాలదు. పరిపూర్ణ రాజయోగమందట్లుగాక శాశ్వతమగు జన్మ మరణరూప సంసారము యొక్క అత్యంత నివృత్తి సిద్ధించుచున్నది.

అన్నమయ పురషయోగము, ప్రాణమయ పురుష యోగము, మనోమయ పురుషయోగము, విజ్ఞానమయ పురుషయోగము అనునవి పరిపూర్ణ రాజయోగమునకు పూర్వాంగములు. అందు చివరిదగు విజ్ఞానమయ పురుషయోగముచే ఆత్మస్వరూప నిశ్చయము సాధించినవారే పరిపూర్ణ బోధపొందుటకు పూర్ణాధికారులు. ఆత్మస్వరూప నిశ్చయము పొందుటకు మనోమయ పరుషయోగముచే మానసిక స్థిరత్వము సాధించవలెను. ప్రాణమయ పురుషయోగముచే ఆత్మబలమును సాధించినగాని మానసిక స్థిరత్వము గాంచలేడు. అన్నమయ పురుషయోగముచే త్రికరణ శుద్ధి గలిగిన వారికే ప్రాణవిద్య కరతామలకమగును. కనుక పూర్వాంగములందు సుప్రతిష్ఠుడై యున్నవాడే పరిపూర్ణ బోధను సాధించగలడు. అట్టివాడే నిజమగు సాధనసంపత్తిగలవాడు. అట్టివానికే పూర్ణగురువు పరిపూర్ణబోధను దెలుపుటకుపూనుకొని ముఖ్యసాధనేదో తెలుపుమని శిష్యుడు కోరగా నీకింకనూ సాధనలు గావలెనా ? నీవు అన్నమయ, ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ పురుషయోగములను సాధనలందు ఆరితేరి పూర్ణాధికారివై యున్నావు. అట్టివాడవైన నీకు "ఏ సాధన నీ కెందుకు?" అని ప్రశించినాడు అని తెలియవలెను.

శిష్యుడు పూర్ణధికారి గానిచో, గురు వాతనిని ముందుగా పూర్ణాధికారిని గావించిగాని పూర్ణబోధ దెల్పిన ప్రయోజనము లేదు. కనుక అధికారి పూర్ణబోధ వలన కడతేరుట బహు సులభము. అనధికారి కంతటి కష్టము మరొకటి లేదు.

❀ ❀ ❀

12. అస్పర్శ యోగము

స్పర్శ అనగా తాకుట అని శబ్దార్థము. కనుక అస్పర్శయోగ మనగా అంటని మార్గమని అర్థమగుచున్నది. ఏది దేనిని అంటనిమార్గము అని ప్రశ్నించుకుంటే, మానవుడు చేయు శుభాశుభ కర్మల, సుకృత దుష్కృత, ఫలములు తన్ను అంటకుండా ప్రవర్తించగల మార్గము అని అర్థమగుచున్నది. కానికర్మ చేసిన యెడల ఆ కర్మఫలము అంటకుండా వుండు టెట్లు? ఉదాహరణకు నిప్పుమీద చేయి వేసినచో అది కాల్చకుండునా? మఱియు 'అవశ్యమనుభోక్తవ్యం పూర్వకర్మ శుభాశుభం' అనగా ఇదివరలో చేసిన శుభాశుభ కర్మలయొక్క ఫలితములు అనుభవించక తప్పదు. అని అర్థము. అట్లగుచో అస్పర్శయోగములో మాత్రము కర్మ ఫలములు ఎట్లంటకుండాపోవును ? అని సహజముగా ఒక శంక కలుగుచున్నది. కాని నిప్పుమీద చెయ్యివేస్తే కాలుట దృష్ట ఫలము. అనగా ప్రత్యక్షముగా సంప్రాప్తించు ఫలము. కాని కర్మకు ఫలితము అదృష్టరూపముగాకూడా ఉన్నది. అనగా కానరాని ఫలముకూడా కలిగియున్నది. అనగా ఈ జన్మలో ఆ కర్మకు ఎట్టి ఫలితము లేకుండాపోవచ్చు, కాని ఆగామిరూపముగా ఆ కర్మఫలము ఉత్తరోత్తర జన్మలయందు ఫలప్రాప్తికి రావచ్చు. దీనినే అదృష్టఫలమందురు. ఈ అదృష్టఫలము ప్రాప్తించకుండా నుండుపాయమే అస్పర్శయోగము.

స్పర్శ అనగా తాకుట లేక అంటుట అని అర్థము గ్రహించినాము. త్వగింద్రియమునకు స్పర్శ నెరుగుట ఆధిభౌతికమున స్పర్శ లేక బాహ్యస్పర్శ మాత్రమే కానిజ్ఞానేంద్రియములచే తెలియబడు విషయపంచకమంతయు అనగా శబ్దాది పంచతన్మాత్ర విషయములన్నియు మాత్రాస్పర్శలని భగవద్గీత నిర్ణయించుచున్నది. ఈ మాత్రాస్పర్శవలన కలుగు సుఖదుఃఖములు నశ్వరములై బాటసారులవలె వచ్చుచు పోవుచు ఉండును. కనుక వానిని ఓర్పుతో సహించి ఉండవలెను అని భగవద్గీత హెచ్చరించుచున్నది. ఇవి అన్నియు బాహ్యస్పర్శలే. కనుక ఇంద్రియనిరోధము చేతనో యోగాది మార్గము ద్వారానో వీనినుండి తప్పించుకొనవచ్చును. అట్లు తప్పించుకొనుట అస్పర్శయోగము కాదు.

అంతఃస్పర్శ సూక్ష్మములై పట్టరానివై, నిరోధించరానివై ఉండును. ఇవి పూర్వజన్మ సంస్కారజన్యములు. మరికొన్ని వర్తమాన కర్మజన్యములు. ఇవి ప్రతివాని అంతఃకరణమునందు అంటుకొని సమయమునకై వేచియుండును. కాల కర్మానుసారముగ వాని ఫలితముల నిచ్చుచుండును. వీనిని అంతఃస్పర్శలని అనవచ్చును. ఈ బాహ్యాంతరస్పర్శలకు మూల

కారణమేమి? అని యోచించినచో అన్నిటికి మూలమైన మూలములేని గుర్తెరిగే శరీరమే అని చెప్పవచ్చును. ఏలననగా గుర్తెరుగక ఎవరును ఏకర్మను చేయరు. గుర్తించిన వెంటనే శబ్దాది విషయములయందు అనుకూల లేక ప్రతికూల ప్రవృత్తి కలిగి కర్మచేయును. దాని వలన కలిగే దృష్టాదృష్ట ఫలములను పొందుట జరుగుచున్నది. ఆవిధముగా స్పర్శలు మానవుని బంధించి కర్మజన్మలకు కారణములగుచున్నవి.

శబ్దాది విషయపంచకము గ్రహించి జ్ఞానేంద్రియములను షణ్ముఖిముద్ర లేక సమాధి పద్ధతులలో నరికట్టుయే స్థూలమగు అస్పర్శయోగము. 2. జ్ఞానేంద్రియముల ద్వారా బహిర్గతమై విషయగ్రహణచేయు మనస్సును అమనస్కాది సాధనములవలన ఆరికట్టుట సూక్ష్మ అస్పర్శయోగము అని అనవచ్చును. 3. గాఢసుషుప్తియందు మనస్సు అజ్ఞానమందు మగ్నతచెంది ఏవిషయమును గ్రహించదుగాన దానిని కారణరూపమైన అస్పర్శయోగము అని అనవచ్చును. 4. సమస్తమును ప్రకాశింపచేయు ప్రత్యగాత్మ ప్రకాశముతో ప్రాణసంయోగము లేకుండా చేయట మహాకారణ అస్పర్శయోగము అని అనవచ్చును. కాని ఈ నాల్గింటిలోను కర్మ చేయుట సంభవించదు కనుక యీ నాల్గింటిలో దేనినీ అస్పర్శయోగమనుటకే వీలు లేదు. ఏలననగా కర్మ చేయవలె, చేసిననూ ఆకర్మఫలము తనను అంటకుండా ఉండవలెను. అది అస్పర్శయోగము కాని ఏకర్మయు చేయక అజగరవ్రతంలో వలే, నల్లజాయివలే, ఒక చోట పడియుండుట ఎంతమాత్రం అస్పర్శయోగముగాదు.

అయితే నిజమైన అస్పర్శయోగమేది? అంతర్బాహ్య స్పర్శలకు అన్నిటికి మూలకారణమై సకల కర్మలకు ప్రేరణ ఇచ్చునదియై సుకృత దుష్కృతమును గుర్తెరుగునదియై జ్ఞానస్వరూపమై అన్నిటికి మూలమైఉన్నదో, ఆ మూలంలేని గుర్తెరిగే శరీరమునకు నిజముగా పరిపూర్ణ పరబాహ్యమందు మూలముగాని కొనకు ప్రవేశించేటందుకు స్థానముగాని లేదని పరిపూర్ణ గురుకృపకు ప్రాప్తుడై బోధయందు ఆరూఢస్థితిగలిగి సర్వధర్మాధర్మములను తన కర్తృత్వముతో సహ గురుపాదముల చెంత నర్పించుకొని యథోచితముగా జీవితము గడుపుటయే అస్పర్శయోగము. ఈ అర్థమందు స్థూలసూక్ష్మకారణ మహాకారణ అస్పర్శయోగములని నాల్గు విధములు లేవు. నాల్గు శరీరములు, నాల్గు అవస్థలు లేవు ఒకే అవస్థ. "పరిపూర్ణము నకు శరీరము లేదు. అవస్థలు లేవు"

స్పర్శ అనగా తాకుట అనే అర్థములో స్థూలముగా చూస్తే సంగము అనే మాటకూడా సమానార్థకముగా కనిపిస్తోంది. కాని అది సరికాదు. ఆకాశము సమస్త వస్తువుల బాహ్యాభ్యంతరములందు వ్యాపించి యున్నను వస్తువునుగాని వస్తుధర్మములనుగాని అంటక వానిచే ఏ విధముగాను వికారముచెందక అసంగమైయున్నది. ఈ అసంగత్వమునకును,

అ స్పర్శయోగమునకును ఎట్టి పోలిక లేదు. రెంటికి గల ముఖ్యభేదము ఏమనగా అసంగమైయున్న ఆకాశము ఒక ఉనికి కలిగి యున్నది. కాని అస్పర్శయోగములో స్పర్శలన్నిటికి అత్యంత మూలకారణమైన మూలం లేని గుర్రైరిగే శరీరము పరిపూర్ణ పరబ్రహ్మమందు లేనే లేదు అనే దృఢభావన పూర్తిగా జీర్ణింపజేసుకొని పరిపూర్ణ రాజయోగి అట్టి ప్రాతిపదికపైన కదా సకల వ్యవహారములు జరుపును! రెండువస్తువులుంటేనే గాని స్పర్శ ఉండుట పొసగదు. సంగములో రెండు వస్తువులున్నవి కనుక అసంగ పద్ధతిలో సాధకుడు స్పర్శలను తన అంతఃకరణమే చేరనీయకుండా జాగ్రత్త తీసుకొనుచుండును. కాని అస్పర్శ యోగములో విషయపంచకముతో సంయోగము చెందిగుర్రైరిగే శరీరము పరిపూర్ణపరబ్రహ్మమందు లేనేలేదని అస్పర్శయోగి ఆరూఢత చెందియుండును. కనుక అసంగత్వము (Non attachment) కంటె అస్పర్శయోగము మరీ శక్తివంతమైయున్నది. అస్పర్శయోగి "అసంగశస్త్రేన దృఢేన ఛిత్వా" అని ప్రయత్న పూర్వకమైన కృషి చేయవలసిన పనిలేదు. అసంగత్వము కృతకం, అస్పర్శయోగము సహజం.

శ్లో॥ సత్సంగత్వే నిస్సంగత్వం నిస్సంగత్వే నిర్మోహత్వం ।
నిర్మోహత్వే నిశ్చలతత్వం నిశ్చలతత్వే జీవన్ముక్తిః ॥

అని చెప్పబడినది.

అనగా సాధకునకు సత్సహవాసమున అసంగత్వము కలిగి మోహవర్జితుడై తత్వజ్ఞానము తెలిసి జీవన్ముక్తిని సాధించును. అస్పర్శయోగములో ఈ విధమైన పూర్వాపర సోపానము లేవియు లేవు. అస్పర్శయోగి తిన్నగా జన్మరహిత్యమునే (సర్వభ్రాంతిరహితమునే) సాధించగలడు.

అస్పర్శయోగమునకు పూర్ణాదికారి ఎవరు? అంటే పూర్వపుణ్యవిశేషమున పూర్ణగురుసందర్శనము కలిగి గురు పాదములాశ్రయించి పరిపూర్ణ మెరుకలను గురుకృపకు పాత్రుడై తెలుసుకొని, సర్వకర్తృత్వమును గురుచరణసన్నిధి సమర్పించుకొని శేషజీవితమును కొనసాగించుటలో యెట్టి ఆశయు లేక గడిపెడివాడే ఈ యోగమునకు పూర్ణాధికారి. అతడు తప్పక కృతకృత్యుడు కాగలడు.

❀ ❀ ❀

13. యోగః కర్మసు కౌశలం

"యోగఃకర్మసు కౌశలం" అనగా కర్మ(పని) చేయుటలో నేర్పరితనమే యోగమని అర్థము. ఏది నేర్పరితనము? అంటే :- ప్రతిపనికీ ఒక ఫలితముండును Action and reaction are equal and opposite అనగా ప్రతిపనికిన్ని దానికి తగిన (దానికి సమమైన) ప్రతిక్రియ వుండును అని అర్థము. చేసిన ప్రతిపనియున్ను దానికితగిన ఫలము నిచ్చును. అని భావార్థము. మంచిపనిచేసిన మంచిఫలము, చెడ్డపని చేసిన చెడ్డఫలము కలుగనున్న మాట. మంచిపనిచేయుట చే వచ్చు ఫలమును పుణ్యఫలమనియు యిది సుఖము కల్గించుననియు, చెడ్డపనిచేయటచే వచ్చునది పాపఫలమనియు, యిది దుఃఖమును కల్గించుననియు చెప్పబడినది. యీ ఫలములు దృష్టఫలమనియు అదృష్టఫలమనియు రెండువిధములు. ఈ జన్మలో చేసిన పుణ్య పాపకర్మలకు యీ జన్మలోనే కలిగే ఫలము దృష్టఫలము. ఈ జన్మలో ఫలప్రాప్తికి రాక సంస్కారముగా నిలువవుండి రాబోయే జన్మలయందు ఫలప్రాప్తికి రాబోయే పుణ్యపాప ఫలితములు అదృష్టఫలములని లేక అగామి కర్మయని యనబడును.

ఇందు దృష్టఫలములు అనివార్యములు అనగా తప్పించరానివి. ఉదాహరణకు :- నిప్పుమీద చేయి వేసినచో చేయి కాలుట తప్పదు. కాని అదృష్టఫలము కలుగకుండా కర్మచేయుట సాధ్యం. కర్మచేయుటలో నేర్పు వుంటే అదృష్టఫలము రాకుండా అరికట్టవచ్చును. ఈ నేర్పరితనమునే "కర్మసుకౌశలం" అని భగవద్గీత పేర్కొన్నది. ఈనేర్పరితన మెట్టిదో వివరించటకు ముందు దృష్టఫలము యెందుకు అనివార్యము కలుగుచున్నదో కొంచెం వివరించుట అవసరం. ఈ జన్మలో అనుభవించవలసిన సుఖదఃఖములు యిదివరలోనే నిర్ణయింపబడి యున్నవి. గతజన్మలో చేసిన శుభాశుభకర్మల యొక్క అదృష్టఫలములను యీ జన్మలో అనుభవించుటకై పుట్టుకతోకూడా తెచ్చుకొన్నాము. దీనికే ప్రారబ్దమని పేరు. ప్ర+అరబ్ధము = ప్రారబ్ధము - చక్కగా ఆరంభమైనది అని అర్థము. తల్లిగర్భమందు చేరుటతోనే యీ కర్మానుభవము ఆరంభించబడినది. కనుకనే యీ శరీరమునకు ప్రారబ్ధశరీరమని పేరు. సంధించి విడిచిపెట్టబడిన బాణము దాని వేగము ననుసరించిపోయి వేగమునశించిన వెనుకగాని యెట్లు అగదో తల్లిగర్భమునందు ప్రారంభమైన కర్మానుభవము శరీరపతనముతో గాని అగదు. కనుక ప్రారబ్దములో చేరియున్న దృష్టఫలము లనుభవించి తీరవలసినదే. 'బుద్ధిఃకర్మానుసారిణీ' యనునట్లు ఆయా కర్మలను చేయుటయు తత్ఫలితముగ సంభవించు సుఖదుఃఖములుకల్గి అనుభవించుటయు అనివార్యములే. పైనయీ యబడిన దృష్టాంతములో నిప్పుమీద చేయి వేయవలెననే సంకల్పం.

చేయివేస్తే కాలుట ఈ ప్రారబ్ధము లోనున్నది. "అవశ్య మనుభోక్తవ్యం పూర్వకర్మ శుభాశుభం" అనగా పూర్వకర్మల శుభాశుభఫలములు తప్పక అనుభవించితీరవలసిన దేనని అర్థము. మన మెంత ప్రయత్నించినా యీ ప్రారబ్ధరూపమగు సుఖదుఃఖములు అనుభవించి తీరవలసినదే.

ఇక కర్మసుకౌశలం అనగా కర్మఫలము లంటని విధంగా కర్మచేయు మంచి నేర్పరితన మేదియో తెలిసి కొందుము. అసలు కర్మ మూడు విధములుగా జరుగుచున్నది. 1) మనస్సుచే చేయబడు కర్మ మానసిక కర్మ అనగా ఆలోచించుట 2) వాచికకర్మ - అనగా వాక్కుచే మాటలాడుట. 3) కాయక కర్మ - అనగా శరీరముచే చేయు కర్మ. ఈ త్రివిధ కర్మలు లేని అవస్థ గాఢసుషుప్తి, గాఢసుషుప్తి యందు కూడ సమానవాయువు, ప్రాణవాయువు పనిచేయుచునే యుండును. కాని ఉద్దేశపూర్వకముగా మనము సంకల్పించకనే వాని పనులవి చేయుచున్నవి గనుక అవి పుణ్యపాప సంస్కారములనుత్పత్తి చేయజాలవు. స్వప్నావస్థయందు మానసిక కర్మ జరుగుచున్నను ఆస్వప్నకార్యములు చేయుటలో జ్ఞానము ఆ కర్మలతో సంయోగపడనందున యీ అవస్థయం దొనర్చిన పుణ్యపాపకర్మలు ఫలప్రాప్తినీయవు. ఒక్క జాగ్రదవస్థలో చేసిన కాయక, వాచిక, మానసిక కర్మలు మాత్రమే దృష్టాదృష్ట ఫలహేతువు లగుచున్నవి. ఫలము నాశించక చేయు నిష్కామకర్మ వలన ఫలమంటదనియు. భగవదర్పితముగా నిస్వార్థబుద్ధితో కర్మచేయవలెననియు చెప్పబడినది. నిష్కారణముగా యెవరున్న యేకర్మయును చేయరు. తన యొక్కయు తనపై నాధారపడిన కుటుంబముయొక్కయు పోషణకొరకు ఒకడు ద్రవ్యార్జనచేయ సమకట్టి వుద్యోగమో, వ్యవసాయమో, వ్యాపారమో కేవలం కూలిపనియోచేయును. ఆపనికి ప్రతిఫలమాసించియే అపనులు చేయుచున్నాడు. ఆ కర్మ నిష్కామ కర్మగాదుగదా! ఇక భగవదార్పణబుద్ధితో ఆ కర్మలు చేయు మందురు. ఇందు కర్మలు యీశ్వరార్పణ బుద్ధితో చేసి కర్మ యొక్క దృష్టఫలములను తానే భోగించుచున్నాడు. తన భోగతృష్ణ చల్లారుట లేదు. అధికాధికభోగానుభవమునకై తన కర్తృత్వము పెంచుకొని నూతన కర్మాచరణకు ప్రేరేపింపబడుచున్నాడు. కర్మలను, కర్మఫలములను శ్రీకృష్ణార్పణమస్తు అంటూ చేస్తూ ఫలానుభవమును తానే పొందుచున్నప్పుడు తన స్వార్థము నశించుట లేదు. మరియును ఈశ్వరార్పణ బుద్ధితో కర్మ చేస్తే తనను పాపపుణ్యము లంటవన్నప్పుడు అంతఃకరణ శుద్ధి లేనివాడు దుష్టప్రవృత్తితో దుర్మార్గములు చేయుటకు వెనుదీయుడు.

అట్లుగాక 'ఆత్మనస్తుకామాయ। సర్వం ప్రియం భవతి' తనయందు ప్రేమచేతనే భార్యా పుత్ర విత్తాదులయందు ప్రేమ కల్గుచున్నది. ఈ ఆత్మ ప్రేమయే స్వార్థమును కోరికలను, ఆశలను పెంచును. తనయందు తనకు ప్రేమ లేనిచో దేని ఆనందముకొరకు దేనిని మానవుడు ప్రేమించును? తనయందు తనకు ప్రేమ లేనివాడే నిజమగు నిస్వార్థపరుడు. నిజమగు వైరాగ్యపరుడు. తన ఆత్మయందు ప్రేమ వున్న వానికి అహంకార అభిమానములు భోగతృష్ణ

ఎప్పటికీ నశించవు. "నాహంకార్తాన భోక్తా" నేను కర్తనుగాను, భోక్తనుగాను, నన్ను ప్రేరేపించి, తన సత్తానిచ్చి సకల కార్యములుచేయించు పరమాత్మయే కర్త, అతడే భోక్త. నేనతిని చేతి పనిముట్టును, అతడెట్లాడించిన నట్లేయాడు కీలుబొమ్మను అని, సర్వభారమును ఆ పరమాత్మపైన నే యుంచి తన విధ్యుక్త ధర్మములను మాత్ర మొనర్చువాడే కర్తృత్వ త్యాగము చేసినవాడు. అతడే అకర్త. అభోక్త అతనికి శుభాశుభ కార్యములు చేయుటలో పుణ్యపాపము లంటవు. యిది శరణాగతి లక్షణము. పరిపూర్ణ బోధమార్గమందు వున్నదొక్క పరిపూర్ణమే. యీ సిద్ధాంతమునందు, అఖండయెరుక లేనేలేదు. అవుడు వ్యష్టియెరుకయు, దానియొక్క ఆగామీ సంచిత ప్రారబ్ధములున్నూ పూర్వపక్షమైపోవును. ఎట్లనగా దీనిని, ఒక దృష్టాంతముచే బలపరచుచున్నారు. యెట్లనగా, రాజుగారు మరణిస్తే, ఆయనయొక్క ముగ్గురురాణులూ ముండమోస్తారా? లేక అందిద్దరు మాత్రమే ముండమోసి ఒకతే మాత్రం సువాసినిగానుంటుందా? అని ప్రశ్నిస్తున్నారు. కాని యెట్టి జ్ఞానిని వారు మనస్సులో నుంచుకొని యీ నిర్ణయము చేసిరో తెలుసుకొంటే సరిపోతుంది. " నవద్వారపు రే దేహే నైవకుర్వన్ న కారయేత్" యీ దేహము నందున్న ప్రత్యగాత్మనే నేను. దేహేంద్రియ విశిష్టుడై కర్తృత్వ భోక్తృత్వములు గలిగిన జీవుడనుగాను - అని ఆరూఢుడైన జ్ఞానికి కర్తృత్వభోక్తృత్వము లేవు. గనుక ప్రారబ్ధనుభవమున్ను లేదని అద్వైతులు భావింతురు. కాని ఆ ప్రత్యగాత్మయే అంతఃకరణతో గూడి జీవుడును పేరుతో వ్యవహరించు చున్నాడుగదా! ఆ ప్రత్యగాత్మ ప్రకాశము యొక్క సత్తాలేనిచో ప్రాణమూ, జీవేంద్రియములు పనిచేయ జాలవు. కనుక ఏదిలేకుంటే ఏ వ్యవహారమూ వుండదో అదియే వ్యవహార కారణము కనుక ప్రత్యగాత్మ పరమాత్మల రూపంగా నుండి, సర్వ వ్యవహార కారణమైయుండు ఆత్మయే కర్త, భోక్త, అపుడు కర్తృత్వం త్యాగము అంటే పరిపూర్ణ పరబ్రహ్మమునందు ఆత్మలేనేలేదు. అను ఆరూఢత కలిగియుండుటేయగును.

జ్ఞానికి ప్రారబ్ధము లేదు అని బహుళ వ్యాప్తిలో నున్నది. యిది యెట్లు? ప్రారబ్ధశరీరము ప్రత్యక్షముగా తోస్తూవుంటే ప్రారబ్ధమే లేదనుట యెట్లు? అంటే ప్రారబ్ధశరీరమున్నప్పటికి జ్ఞానికి ప్రారబ్ధనుభవము లేదు. సుఖదుఃఖలక్షణములు జ్ఞాని శరీరమందు చూపరులకు ప్రత్యక్షముగా కానవస్తూవున్నా, జ్ఞానిమాత్రం ఆ శరీర తాదాత్మ్యము లేనివాడై, నేను దేహేంద్రియాదులకు విలక్షణమైన ఆత్మనే, నాకు జన్మ వ్యాధిజరామరణాదులు లేవు అని ఆత్మదృష్టి యందుండుటచే అతని కాసుఖ దుఃఖానుభవము లేదు. అన్యుల దృష్టిలో అతనికి ప్రారబ్ధనుభవమున్నూ వున్నట్లే దోచునుగానీ, స్వదృష్టిచేమాత్రం లేదు. సుఖదుఃఖానుభవము మనస్సునకే గదా ! ఆమనస్సు ఆత్మతో తాదాత్మ్యము చెందినపుడు అదియే అమనస్క మనబడుచున్నది. మనస్సుగాని, దాని అధిష్ఠానమగు ఆత్మగాని, పరిపూర్ణ పరబ్రహ్మమునందు లేనేలేదని ఆరూఢత నందినవానికి

అనుభవించునదే లేదు. కనుక అనుభవమే యుళక్కి యగుచున్నది. తానేలేడు. కనుక తనకు తోచిన సమస్తము తనతోగూడా యేమీలేదు. ఇట్టి ఆరూఢతతో యేకార్యములు చేసినా, చేసి చెయ్యని వాడగుచున్నాడు. ఇదియే నిజమగు కర్తృత్వ త్యాగము. ఇట్టి త్యాగికి అదృష్టరూపముగ యెట్టి సంస్కారములు ఏర్పడజాలవు. ఎట్టి అదృష్టఫలప్రాప్తిని కల్గింపజాలవు. కర్మత్రయ మారీతిగా నశించిపోవుచున్నది కనుక వేచిన విత్తనము మొలకెత్తజాలనట్లు జన్మరాహిత్యము సిద్ధించును. కర్తృత్వత్యాగయుక్తమగు కర్మాచరణమే కర్మయోగమని కీర్తింపబడినది. భగవద్గీత 18 యోగములుగా విభజింపబడినది. యోగమనగా మార్గము. కనుక కర్తృత్వ త్యాగపూర్వక కర్మాచరణ ఒక యోగము. కనుకనే "యోగఃకర్మసు కౌశలం" అని గీతాకారుడు యీ మార్గమును కీర్తించినాడు. కనుక అదృష్ట కర్మఫలములను అనగా ఆగామీ సృష్టికాకుండా కర్మ చేయు నేర్పరితన మీ కర్తృత్వ రహిత కర్మాచరణ విధానమునందే కలదు. కర్మత్యాగము అసంభవము. ఏలననగా కూర్చున్నా నిలుచున్నా పూరకవున్నా శరీర వాక్ మనసులనే త్రికరణములలో యేదియో ఒకటి పని చేయుచు ఆగామీని వుత్పత్తి చేయుచునే యుండును. కర్మఫల త్యాగముకూడ ఆచరణయందు సుసాధ్యముకాదు. కర్తృత్వ త్యాగపూర్వక కర్మాచరణమే ఆగామీని వుత్పత్తి చేయకుండా వుండగలదు.

కర్మఫలములే జన్మకారణము గనుక త్రివిధ కర్మ రాహిత్యమునందు జన్మరాహిత్యము కల్గునని సర్వులూ అంగీకరించుచున్నారు. ఐతే, కొందరు. ---

శ్లో॥ ప్రారబ్ధం భోగతో నశ్యేత్, తత్వజ్ఞానేన సంచితం,
ఆగామీ ద్వివిధం ప్రోక్తం తద్వేషీ ప్రియవాదినౌ॥

అనుశ్లోకమును ప్రమాణముగా గైకొనుచున్నారు. ప్రారబ్ధకర్మ అనుభవించుటచేతను, సంచితము తత్వజ్ఞానమువల్లనూ, నశించుననియు, అజ్ఞానిని దూషించువారు అయన పాపమును భూషించువారు, పుణ్యమును తీసుకొనుటరీత్యా ఆగామీకర్మ నశించుననియు ఈ శ్లోకమున కర్థము. దూషించువారు కొందరు, భూషించువారుకొందరు ఉంటేనేగాని జ్ఞానియొక్క ఆగామీకర్మ నశించదని అవిధముగా ఆ జ్ఞానియొక్క మోక్షము పరులపై నాధారపడి యుండునని సిద్ధించుచున్నది. ఎంత హాస్యాస్పదము ! కనుక యీనిర్ణయము అంగీకరించుటకు వీలులేదు.

14. నైష్కర్మ్యసిద్ధి

"కర్మ" యనగా 'పని' యని సామాన్యార్థము. ఐతే ---

కర్మమున బుట్టు జంతువు,
కర్మముననను వృద్ధిపొందు, కర్మమున చెడున్,
కర్మమె జనులకు దైవము,
కర్మము సుఖ-దుఃఖములకు కారణ మధిపా ॥

అని మహాభారతమునందు చెప్పబడిన విధముగా, సృష్టి స్థితి లయములకు, సుఖ దుఃఖములకు కారణమైన కర్మయొక్క విశేషార్థమేమి ? కర్మ యెట్లు బంధకారణమై, జనన మరణ రూప సంసారములో మానవుని పరిభ్రమింపచేయునో ముందుగా గమనించవలసి యున్నది.

ఫలములీయనికర్మలు నిర్వీరములై నశించును. అట్టిపనులను కర్మలనుటకే వీలులేదుకనుక కర్మయనగా కర్మఫలమే. కర్మ ఫలము రెండురూపములుగా నుండును. 1) దృష్టఫలము, 2) అదృష్టఫలము. ఇందు దృష్టఫలమనగా చేసినపనియొక్క ఫలితము వెంటనేకలిగి సుఖమునో దుఃఖమునో కలిగించును. ఉదా : నిప్పుమీద చేయి వేసినచో కాలి బొబ్బలెక్కి బాధించును. అట్లే ఏదైనా నేరము చేసినచో సంఘమో లేక ప్రభుత్వమో అతణ్ణి నేరమునకు తగినట్లు శిక్షించును. "అన్నము తిన్నను ఆకలి, తిన్నగ నీరంబుద్రావ తృష్ణయు, రోగం బెన్నగ నౌషధ సేవను" నివారణయగుట దృష్టఫలములకు మంచి ఉదాహరణలు. అష్టసిద్ధులన్నియు కూడా దృష్టఫలములే. వేయేల ? ఈ జన్మములో మనం చేసిన కర్మకు ఫలితంగా యీజన్మలోనే కలుగు సుఖదుఃఖములన్నియు దృష్టఫలములు. అట్లుగాక యీజన్మలో చేయబడిన పుణ్య పాపకర్మ కర్మలకు ఫలితము లీజన్మలోనే సిద్ధించక పోవచ్చును. ఐననూ బుద్ధిపూర్వకముగా చేసిన సర్వకర్మలూ నిరర్థకముగా పోవు. ఎప్పుడో ఒకప్పుడు ఫలప్రాప్తి గల్గింపక మానవు. అకారణముగా యీజన్మలో మనకు తటస్థించు సుఖ దుఃఖములు పూర్వజన్మలలో చేసిన కర్మలయొక్క అదృష్ట ఫలములే. అట్లే యీజన్మలో చేసిన కర్మలకు ఫలితములు యీజన్మలోనే ప్రాప్తించని యెడల అవి అదృష్టరూపముగా నిల్వవుండి కాలాంతరమున, జన్మాంతరములలో ఫలము నిచ్చును. బుద్ధిపూర్వకముగా చేసినకర్మ యెప్పుడో ఒకప్పుడు ఫలము నీయక తప్పదు. "చేసినవారికి చేసినంత మహాదేవ" యనునట్లు కర్మకు తగిన ఫలము సిద్ధించక మానదు.

ఒకదొక నేరముచేసి పట్టుబడక, శిక్షణను తప్పించుకొంటినిగదాయనిసంతోషపడుట మూర్ఖత. "తాతాచార్యుల వారి ముద్ర భుజము తప్పినా వీపు తప్పదు" అన్నట్లు (అనగా సమాశ్రయణ కాలములో వైష్ణవ బాలురకు భుజములపై, సలసలకాగు నేతిలో బాగావేడెక్కిన శంఖుచక్రముల ముద్రలతో కాల్చెదరు. ఒకముద్ర ఒక భుజముపై పడినతోడనే బాలుడు బాధ భరించలేక పరుగిడును. కాని పురోహితుడు వాని వెనుక పరుగెత్తి భుజము దొరకనిచో వీపుపైనైనా ఆ ముద్రను వేసితీరును) ఈ జన్మలో కాకున్న మరోజన్మలోనైనా కర్మఫలము సుఖదుఃఖరూపముగా సంప్రాప్తించి తీరును. దీనినే అదృష్ట మనియు అపూర్వమనియు చెప్పెదరు. అపూర్వమనగా కాలాంతరమున ఫలమునకు వచ్చు కర్మశక్తి. 'అదృష్టఫలము' అను శబ్దమునకు యింద్రియగోచరముకాని ఫలమని అర్థము. దృష్ట ఫలమనగా యీజన్మయందే వెంటనే తెలియబడునది. ఫలము యొక్క స్వరూప మేమి ? సుఖదుఖఃములను గల్గించు శక్తియే దాని స్వరూపము. అదృష్టఫలము ఫలప్రాప్తిని గల్గించు వరకు యెందుదాగియుండును ? అంటే కర్తయొక్క అంతఃకరణయందే (మనస్సునందే) పుణ్య పాప సంస్కార రూపములలో దాగి యుండును. మనస్సు సంస్కారముల మూట అన్నాడు - వివేకానందస్వామి.

సంస్కారము లున్నంతవరకు మనస్సు నశించదు. మనస్సునంత వరకు ప్రాణము దానిని నీచోత్తమ యుపాధుల యందు ప్రవేశపెట్టుచునే యుండును. సంస్కార మన్నను వాసనయన్నను యొక్కటే. సంస్కారము లేక వాసన యంటే నేమి ? చేసిన పనులు (సుకృత దుష్కృతములు) యొక్క స్మృతి జ్ఞానము, మనస్సునందు ముద్రింపబడి అజ్ఞాతముగ నిల్చి యుండుటే సంస్కారము లేక వాసన. ఈ సంస్కారములే వుత్తరోత్తర జన్మలకు కారణములై విత్తనమునందు సూక్ష్మ రూపములో నిక్షిప్తమైయుండు అంకురములవలె మనస్సు నందు దాగి యుండును.

ఆ॥ వె॥ అంతరంగమందు అపరాధములు చేసి
మంచివానివలెనె మనుజుడుండు ।
ఇతరు లెరుగకున్న యీశ్వరు డెరుగడా !
విశ్వదాభిరామ వినుర వేమ ॥

అని చెప్పినవాడు వేమనయోగి. ఆ ఈశ్వరు డెరవో గాదు. వ్యష్టి సమిష్టి రూపముగా నుండు ఆత్మప్రకాశమే. ఇదియే మనస్సునందు సంస్కారముల నేర్పరచుటకు కారణముగా నున్నది. అంతరంగమందలి అపరాధము లేమియనగా - మానసికకర్మలు. వాచిక, కాయిక కర్మలు యితరులకు తెలియబడునేగాని మానసిక కర్మలను యితరులు చూడజాలరుగదా ! ఆయంతరగమందేయున్న ఈశ్వరుడు గుర్తింపజాలడా! అని అర్థము. అపరాధములంటే తప్పుపనులు. మంచిపనులుకూడా మనస్సు చేయుచున్నది గదా ! మంచి తలంపులన్నియు మనస్సుచేయు మంచిపనులేగదా ! కనుక మనస్సునందు కలుగు మంచి చెడు తలంపులన్నియు

కూడా సంస్కారములను యేర్పరచుచున్నది. అట్లే త్రికరణములగు మనో వాక్కాయములు చేయు సకల కర్మలు శుభాశుభ సంస్కారము లేర్పరచుచునే యుండును.

దృష్టఫల మనుభవించిన పిదపకూడ అది సంస్కారముత్పత్తి చేయునా ? అంటే వుత్పత్తి చేయుననే చెప్పాలి. "నేనా పాపకార్య మొనర్చితిని. ఏతత్ఫలితముగా కారాగార శిక్ష ననుభవించితిని. దానితో నా పాపప్రక్షాళన మైపోయినది. ఇక నెన్నడు నట్టి పాపకార్యములను చేయ"నని నిజముగా పశ్చాత్తాపముచెంది యిక దానిని తలంపక యూరకుండెనేని ఆపాపకార్య మెట్టి సంస్కారమును యుత్పత్తి చేయకపోవచ్చును. అట్లుగాక ఆకర్మల ఫలితముగా అనుభవించిన సుఖదుఃఖములను గురించి మరచిపోక పదేపదే దానిని గురించి చింతించుచుండెనేని అట్టి తలంపే (మానసిక కర్మ యగుటచే) సంస్కార జనకమగును. కనుక మానవుడొనర్చిన సుకృత దుష్కృతములగూర్చి జ్ఞప్తిలోనికి తెచ్చుకొనరాదు. స్మరింపరాదు. స్మరించినచో లేక యితరులతో చెప్పుకొనుచుండినచో సంస్కార ముత్పత్తి కాక తప్పదు. కనుక దృష్టఫలము, అదృష్టఫలములు రెండే గాక, దృష్టఫల స్మరణచే యేర్పడే సంస్కారఫలము కూడా కలుగుచున్నది. దానికి దృష్టాదృష్టఫలమని నామకరణము చేయవచ్చును. కనుక 1. దృష్టఫలము, 2. అదృష్టఫలము, 3. దృష్ట్యాదృష్ట ఫలము అని కర్మ ఫలమును త్రివిధముగా విభజించవచ్చును.

కర్మ యనగా ఫలమునిచ్చు కర్మయేగాని, యెట్టి ఫలమును కలిగించని కర్మలను (పనులను) కర్మలే యనరాదని ముందుగానే సూచించితిమి. దానిని ఏమని పిలువవలెను ? దానిని అకర్మయని పిలువనగును. బాహ్యదృష్టికి కర్మ లక్షణములు గానవచ్చునేగాని ఆకర్మ ఫలమీయదు గనుక దానిని అకర్మయన్నారు. కర్మ, అకర్మ, వికర్మయని భగవద్గీతా శాస్త్రము కర్మలను మూడు తరగతులుగా విభజించినది. ఇందు కర్మయనగా, శాస్త్రోక్తమైన కర్మయనీ, వికర్మయనగా శాస్త్రమందు నిషేధింపబడిన కర్మయనిన్నీ, అకర్మయనగా కర్మ శూన్యతయనిన్నీ సామాన్యముగా చెప్పుదురు. యజ్ఞయాగాది కామ్యకర్మల నభిమానించు మీమాంసకులా కామ్యకర్మలే కర్మయనిన్నీ, మిగిలినకర్మలన్నియు వికర్మలనిన్నీ చెప్పుదురు. సర్వకర్మ శూన్యతనే అభిమానించు సన్యాసమార్గీయులు ఏకర్మయూ చేయకుండ నుండుటే "అకర్మ" యని యందురు. గీతావ్యాఖ్యాతలలో చాలమంది సన్యాసులే యగుటచే యీ అర్థమునే గ్రహించిరి. కాని ఏకర్మయు చేయకుండావుండుట అసంభవము అని గీతయే చెప్పినది.

''నహికశ్చిత్ క్షణమపి జాతుతిష్ఠ త్యకర్మకృత్'' గాథ సుషుప్తియందు తప్ప మనోవాక్కాయములు మూడుకూడ పనిచేయకపోవుట అనూహ్యము. అకర్మయొక్క నిజార్థమును విమర్శించి తెలుసుకొనవలసియున్నది.

సంస్కార ముత్పత్తి చేయని కర్మ బంధకారణముకాదు. బంధకారణముకాకుండా కర్మచేయు టెట్లు ? కర్మలను చేయువాడు (కర్త) యెవరు అనువిషయము ముందుగా నిశ్చయము

చేసుకొనవలసియున్నది. కర్మకర్తృత్వ విషయంలో వివిధ మార్గస్థులు వివిధాభిప్రాయములు కలిగియున్నారు.

సాంఖ్యులు :- ప్రకృతి యందలి సత్వ రజస్తమో గుణములు మూడున్ను కర్మకారణములన్నారు. ఏలననగా వారి సిద్ధాంతం ప్రకారం పురుషుడు కర్త, అభోక్త. పురుషుని సన్నిధానములో ప్రకృతియే సృష్టి స్థితిలయాది సర్వకార్యములు చేయుచుండును. కాని ప్రకృతియును దాని గుణములున్ను జడములని చెప్పబడుచున్నవే ! జడమునకు కర్తృత్వం చెప్పవచ్చునా ? ఒక డొక కత్తితో నొకని చంపినపుడు ఆ హత్యకు కర్తృత్వము కత్తికి చెప్పరాదు కదా ! చైతన్యవంతుడగు పురుషుడు ప్రకృతితో గూడిన సకల కర్మలకు కారణమగుచున్నాడు. అథవా, కేవలము కర్తగాకున్నను సాన్నిధ్యమాత్ర కర్తృత్వమున్నదిగదా ! కనుక కారయిత (చేయించువాడు) యైనను అయివున్నాడని చెప్పకతప్పదు.

"కర్తా కారయితా చైవ ప్రేరక శ్చానుమోదకః" అనగా 1 కర్త, 2 కారయిత, 3 ప్రేరేపించినవాడు, 4 ఆమోదించినవాడు - యీ నల్వురకు ఆ కర్మఫలమంటునని చెప్పబడినది. భగవద్గీతకూడ "కర్మబ్రహ్మోద్భవం విద్ధి, బ్రహ్మాక్షర సముద్భవం" అంటూ చెప్పుచున్నది. అంటే అక్షర పురుషుడు (ప్రకృతితో కూడిన పురుషుడు) కర్మకు కారణమైయున్నాడు అనియే చెప్పబడి యున్నది. కనుక, మానవునకు కర్మస్వాతంత్ర్యము లేదనిన్ని గుణత్రయములే కర్మచేయించు చున్నవనిన్ని గుణాతీతుడై ప్రకృతిని జయించవలసి యుండునని చెప్పెడి మాటలు సంపూర్ణ సత్యములని చెప్పవలను పడదు. ఏలననగా సంకల్పించకనే లేక గుర్తెరుగకనే యెవరున్ను ఏకర్మయూ చేయరు. అట్లు చేయబడిన కర్మ ఎట్టి సంస్కామున్ను ఉత్పత్తి చేయదు. కనుక ఆ గుర్తిచేదీ లేక సంకల్పించేదీ యేదియో అదియే కర్మకు అత్యంత మూల కారణమని చెప్పితీరవలసినదే.

యోగసాధకులు :- మనస్సేకర్మ కారణము కనుక మనోజయమును యోగముచే సాధించవలెనందురు. అంతఃకరణము అంతఃకరణ పరిణామములగు మనోబుద్ధి చిత్తాహం కారములున్నా కూడా జడములే అయివున్నవి. "అహంకార విమూఢాత్మాకర్తాహ మితి మన్యతే" అని గీతావాక్యం. అహంకార విమూఢాత్ముడనగా అహంకారమే "నేన" ను కొన్నవాడా ? లేక ఆత్మ తాదాత్మ్యముచెంది నేనే ఆత్మను అనుకొన్నవాడా ? నేనే ఆత్మను అనుకొన్నవాడు జ్ఞానిఅగును కాని మూఢుడు కాడుగదా ! కనుక జడమగు అహంకారమే (లేక అంతఃకరణమే) నే ననుకొన్నవాడే మూఢుడుని తేటతెల్లము కనుక యోగులు చెప్పే విధముగా కర్మకర్తృత్వము మనస్సునకు (లేదా అహంకారమునకు గాని, అంతఃకరణమునకు గాని) కలదనుట సరికాదు. సాంఖ్యులు చెప్పే ప్రకృతి గుణములకు కర్తృత్వము యెట్లు లేదో యోగులు చెప్పే అహంకారము (లేక అంతఃకరణము) నకు కర్తృత్వము చెప్పరాదు.

భక్తులు :- వారేయే నామరూపములతో వుపాసించినా వారి ఇష్టదైవమే సర్వ కర్తృత్వ భోక్తృత్వ నిమానుకత్వ నియంతృత్వ సర్వేశ్వరత్వాదులుగల ఈశ్వరుడని విశ్వసించి ఆమూర్తియందు భక్తిగల్గి యుందురు. ఆ యీశ్వరుని చేతిలో తాము కీలుబొమ్మలు. అతడెట్లాడించినా, యెట్లు పాడించినా యెట్టికర్మ చేయించినా, అట్లు చేయుచుందుమని భావింతురు. "కర్తా కారయితాచైవ, ప్రేరక శ్చానుమోదకః" అనుకర్మ పల భాగస్వాములు నలుగురూ ఈశ్వర స్వరూపులే. ఆ ఈశ్వరుడే ఫలప్రదాత. కష్టసుఖములన్నియు ఆయన ఆగ్రహానుగ్రహ ఫలితములే. అంతఃకరణమందేవున్న ఆయన ప్రేరణ చేతనే కర్మప్రవృత్తిగల్గి వివిధ కర్మ లొనర్చుచుందుము. కనుక యేకర్మకూ మేము బాధ్యులము కాము. ఆయన ప్రీతి కొరకే మేము కర్మలు చేయుచుందుము. కనుక మేముచేయు కర్మయంతయు ఈశ్వరారాధనమే. కర్మఫలమంతయూ ఈశ్వరార్పణ బుద్ధితో చేయుచూ ఈశ్వరుని కర్పించుట మాధర్మము. అప్పుడు "work in worship" అనగా కర్మ చేయుట ఈశ్వరారాధనయే యగును. కనుక "యద్యత్కర్మ కరోమి తత్తదఖిలం శంభో తవారాధనం" అనగా నే చేయు సమస్త కర్మలు నే చేయు ఆరాధనయే అనే భావముతో కర్మ చేయవలెను. మరిన్ని ---

శ్లో ॥ కాయేన వాచా మనసేంద్రియైర్వా
బుధ్యాత్మనా వా ప్రకృతి స్వభావాత్ ।
కరోమి యద్యత్ సకలం పరస్మై
నారాయణా యేతి సమర్పయామి

అనగా త్రికరణముల చేతను త్రిగుణస్వభావము చేతను యేకర్మలు చేతువో అవన్నియు శ్రీమన్నారాయణామూర్తి కే సమర్పించుమని వారాదేశింతురు. యీ విధంగా వారున్ను కర్తృత్వ బాధ్యతను తమనుండి త్రోసివేయుదురు.

వేదాంతులు : - మాయక్రమ్ముకొనుటచేత, ఆత్మాహం కారములు రెండు యెకటేనని జీవుడు తలంచునుఅని వేదాంతులంటారు. మరియు 'జీవో బ్రహ్మైవనాపరః' అనిన్ని వారంటారు. కనుక బ్రహ్మయే మాయావరణము చేత తాననుకొన్నటువంటి అహంకారముతో తాదాత్మ్యతనొంది అహంకార విమూఢాత్ముడైతేనే కర్త నంటాడన్నమాట. ఇట్లనుటలో నిజంగాతాను కర్త కాదు కాని కర్తనని అనుకొంటున్నాడని అర్థమా ? కాదు. 'తస్యకర్తారమపి మాంవిధ్యకర్తారమవ్యయం' అని గీతలో చెప్పబడినది. అనగా నేను నిజముగా కర్తనైనా కర్తను గానని తెలుసుకొ మ్మంటున్నాడు భగవానుడు. మరిన్ని మూడులోకములయందున్ను యేకర్తవ్యము లేనప్పటికి నిరంతరంకర్మ చేస్తూనే వుంటానని చెప్పుచున్నాడు. ఈ వాక్యములు పరస్పర విరుద్ధములుగా నున్నట్లు స్థూలదృష్టికి గోచరించును. కాని యించుక విచారించినచో సమన్వయము సులభ సాధ్యమే.

ఎట్లనగా - సృష్టికి పూర్వము అహంస్ఫురణయే లేనపుడు బ్రహ్మము అచలస్థితిలో వున్నపుడు నిష్క్రియమై నిర్వికారముగా నున్నది. అపుడది అకర్తయు, అభోక్తయు నైవున్నది. జాగ్రదవస్థలో మనము సకలక్రియలు చేయుచున్నను గాఢసుషుప్తిలో నిస్సంకల్పరూపముగ నుందుము. అపుడు మానసిక, వాచక, కాయిక, కర్మలేవియు లేవుకదా ! అట్లే పరమాత్మ తొలిరూపంలో నిష్క్రియమై పిదప సర్వక్రియాత్మక మగుచున్నది. కనుకనే "శుద్ధేసుషుప్తి దృష్టాంతం" అని చెప్పబడినది. సృష్టి స్థితి లయ నిగ్రహానుగ్రహములను పంచ కృత్యములాతని కర్తవ్య కర్మలుకావు. ఐనను యెట్టి స్వార్థ ప్రయోజనమున్ను తనకు లేనప్పటికి తన యందు బీజరూపములో అణగిమణిగియున్న ప్రకృతి యొక్క త్రిగుణరూప కర్మలను (అనగా సృష్టిస్థితిలయములను) చేయుచున్నాడు. ఐనను అతని కాదిలో యెట్టి కర్తృత్వాభిమానమున్ను లేదు. పరిణామ దశలో అట్టి కర్తృత్వాభిమానము కల్గినపుడు మహదహంకారమని ఆ బ్రహ్మమే పేరొందినది.

ఈ విధంగా సాంఖ్యులు, యోగాభ్యాసకులు, భక్తులు వేదాంతులు కర్మ కర్తృతము బంధకారణమని యెంచుట చేతనేయని మనము సులభముగా నిర్ణయించవచ్చును. కర్మ ఎట్లు బంధకారణమగుచున్నది ? ఫలకాంక్షవుంటే కర్మ బంధకారణ మగునని పెక్కుమంది భావింతురు. గీతయు "తస్మాదసక్త స్సతతం కార్యం కర్మ సమాచార" అని ఆదేసించుచున్నది. వారి దృక్పథమేమి? ఫల మాసించువారందరు తమ తమ కర్మ సత్ఫలితము లీయవలెనని కోరుకొందురేగాని దుష్ఫలితము లెవరున్ను ఆశించరు. అందుచే సత్ఫలితము లందు రాగము. దుష్ఫలితములందు ద్వేషముకల్గి అంతఃకరణము రాగద్వేషములకు, అభిమానమునకు, అహంకారమునకు క్రమముగా ఆలవాలమై మలినమైపోవును. ఏకోరికయైనా అసలు యెట్లు కలుగుచున్నది ?

"ధ్యాయతో విషయాన్ పుంసాన్
సంగస్తే షూపజాయతే,
సంగా త్సంజాయతే కామః"

అని గీత వివరించినది. విషయములను గూర్చి చింతించుట వలన ఆ సుఖములయందు సంగము యేర్పడి, ఆయా సుఖములయందు కోరిక పెంపొందును. కోరిక తీరుటకు అడ్డు వచ్చినవారియందు క్రోధము, కోరిక సఫలమైతే లభించు వస్తువునందు లోభము, క్రమముగా ఆ వస్తువుయందు మోహము, వస్తువు యెవరిచేతనైనా హరింపబడునేమో యని భయము, వస్తువు నిజముగా పోయినచో శోకము యీ విధముగా సమస్త దుర్వాసనలచే అంతఃకరణ మావరింపబడి నరుడు జనన మరణ ప్రవాహమున కొట్టుకొని పోవుచుండును. కనుక విషయచింతన సంగమునకు, కామ క్రోధాదులకు కారణము, విషయగ్రహణమునకు జ్ఞానేంద్రియము మూలాధారము. జ్ఞానేంద్రియము ద్వారా ప్రసరించు మనస్సు ఆత్మ ప్రకాశముచేతనే ప్రవర్తిల్లుచు విషయచింతన చేయుచున్నది. కనుక సకలకర్మలకు అత్యంత మూలకారణము జ్ఞానరూపమైన ఆత్మయే, గుర్తెరుగకుండా ఎవరున్ను ఏ కర్మయున్ను చేయరు గదా! కనుక సంగమునకు అత్యంత

మూలకారణము గుర్తు లేక యెరుక లేక జ్ఞానము. జ్ఞానమే స్వరూపముగాగల ఆత్మ, సంగమునకు తోడు కర్తృత్వాభిమానముంటే అగ్నిదేవునకు వాయుదేవుడుకూడా తోడైనట్లే. కర్తృత్వమును వదలినగాని ఫలకాంక్ష పోనేపోదని దృఢముగా చెప్పవచ్చును. కనుకనే కర్తృత్వ రహిత విధానము నవలంబించి కర్మాచరణ చేయవలెనని పరిపూర్ణ భావజ్ఞులు ఆదేశించుచున్నారు.

"యోగః కర్మసు కౌశలం" కర్తృత్వ రహిత కర్మాచరణ విధానమే కర్మ కౌశలము. సృష్టి సంకల్పము కలిగి ఆత్మయే అనేకముగా మార్పులుచెంది, వానియందు తానే జీవరూపముగా ప్రవేశించి ఆ యుపాధులను చైతన్యవంతముగావించి అయా ప్రపాధులను పోషించుచూ, చివరకు ఊర్ధ్వ పరిణామ రూపములో తానే ఇమిడిపోవుచున్నది. జీవో పాధులచే వానివాని కర్మలు జరుపుటకు వలయు తెలివి, శక్తి, యుక్తులు ఆత్మయే వాని కనుగ్రహించుచున్నది. కనుక ఆత్మయే సర్వ క్రియలకు, లేక కర్మలకు కర్తయై యున్నది.

ఈ విషయమునే శ్రీకృష్ణ దేశికేంద్రులవారు--
"ఆటాడి యాడకుండును --
ఆటాడిన మేని బొమ్మ ఆటాడకనే --
యాటాడు, యెరుక యనియెడి -
ఆటాడించేటివాడు అతడే కర్తా -
అన్నిటికీ యచల మకర్తా -
చేటు పాటుల రెంటించే వచ్చు ఫలము
ముమ్మాటి కనుభవించి మరణ జననములొంద
నతడేర కర్తా; అన్నిటికీ యచలకర్తా॥"

అని కందార్థములో యద్ఘాటించినారు. కనుక కర్తృత్వ రహిత విధానమే కర్మయోగ రహస్యము.

"సమత్వం యోగ ముచ్యతే" అని కూడ గీత కర్మ యోగ నిర్వచనము గావించినది. ఆ సమత్వ మెట్లు సిద్ధించును ? గుర్తు లేక యెరుకవున్నంతవరకు భేదము గోచరించక తప్పదు. భేదమును గుర్తించుచునే సమదృష్టి పూనాలిగదా యని కృత్రిమముగాక సమదృష్టి సహజమైపోవాలి. అంటే గుర్తు (యెరుక) యొక్క రహితమునందు గాని సిద్ధించదు. కొందరు అహంకార మమకారములు లేక కర్మ యొనర్చినచో అది కర్మయోగ మగునని చెప్పిరి. అహంకార మమకారములకు "నేను" మూలముకదా ! కనుక ఆ "నేను" గుర్తించి దాని రహితముకొరకు పరిపూర్ణ రాజయోగమును ఆశ్రయించినవాడే నిజమగు కర్మయోగి, అతడే రాజయోగి. అతడు చేయు పని అంతయు "అకర్మ"యే అగును. అతడు కర్మ చేసియు చేయని వాడే అగుటచే అకర్తయు అభోక్తయు నగుచున్నాడు. ఇట్టి అకర్మద్వారా తప్ప నైష్కర్మ్యసిద్ధి కాదు.

❀ ❀ ❀

15. భక్తి జ్ఞానములు

మోక్షసాధన మార్గా లన్నిటిలో భక్తి సాధనయే శ్రేష్ఠమన్నారు. "జ్ఞానం వినా మోక్ష నసిద్ధ్యంతి' జ్ఞానం లేక మోక్షం దొరకదు అని చెప్పబడి యున్నప్పుడు భక్తి సాధనయే శ్రేష్ఠమని ఆదిశంకరులవారేయనుట చాల చిత్రముగా దోచవచ్చును. ఐతే "మోక్షసాధన సామగ్ర్యాం భక్తి రేవ గరీయసీ" అని వూరుకొనక వెంటనే ఆయన "స్వస్వరూపానుసంధానం భక్తిరిత్యభిధీయతే" అని ఆ భక్తికి నిర్వచనం యిచ్చినారు. కనుక ఆచార్య స్వాములవారి దృష్టిలో అట్టి భక్తి జ్ఞానముకన్న అభిన్నమనియే దేలుచున్నది.

భక్తి అన్నప్పుడు ద్వైతం తప్పదు. భక్తుడు ఒకడు, భగవంతుడొకడు. వారిద్దరిమధ్య సంబంధమే భక్తి. ఐతే భక్తునకు భగవంతునియందుండే ప్రేమను భక్తియనీ, భగవంతునికి భక్తునిపై నుండే ప్రేమను వాత్సల్యమనీ యనవలెను. శంకరులవారి నిర్వచనం ప్రకారం స్వరూపానుసంధానము చేయువాడు భక్తుడు. అనుసంధానము చేయుటయే భక్తి. కాని స్వరూపమును తెలుసుకొన్నగదా దానిని అనుసంధానము చేయుట? అయితే స్వరూపమును తెలుసుకొనుటయే జ్ఞానముగదా ! కనుక ఆచార్య స్వాములవారు చెప్పే భక్తి జ్ఞానమే అనవలెనా? లేక తద్భిన్న మనవలెనా ?

భక్తి మార్గములో ద్వైతభావము తప్పదు. అద్వైత మత ప్రతిష్ఠాపనాచార్యులగు ఆది శంకరుల ద్వైతమార్గమును, భక్తిని యెట్లంగీకరించిరోయని శంక కలుగక తప్పదు. అద్వైతము జ్ఞాన మార్గమని చెప్పినప్పటికి తత్, త్వం, పద పదార్థములను అన్వయ వ్యతిరేక యుక్తులచే శోధించుచూ శ్రవణ, మనన, శిధి ధ్యాసలు చేయు సాధనాకాలమందు మాత్రమే ద్వైతము తప్పదు. వాక్యార్థజ్ఞాన మారూఢమగు వరకు జ్ఞాతృ - జ్ఞాన - జ్ఞేయ - రూపమగు త్రిపుటి తప్పదు. అంతవరకు "మాయామాత్ర మిదం ద్వైతం, అద్వైతం పరమార్థతః" అని వాచా చెప్పుకొంటూండవలసినదే. అట్లు గాక "మయ్యేవ సకలం జాతం, మయి సర్వం ప్రతిష్ఠితం ! మయి సర్వం లయం యాతి .. .." అనగా నాయందే సర్వము పుట్టుచున్నది. నాయందే మరుగగుచున్నది. అట్టి బ్రహ్మయే నేను, నేనే ఆ బ్రహ్మము అని ఆరూఢజ్ఞానము కలిగినవాడే అద్వైతము. అపుడే జ్ఞాతృ జ్ఞాన, జ్ఞేయాది ద్విపుటి త్రిపుటులన్నియు పరమాత్మయందే పర్యవసించును. తాను పరమాత్మయై వుండుట జ్ఞానమార్గమందు చరమస్థితి. ఇందుకు సాధన జ్ఞేయమగు పరమాత్మానుసంధానమే. సాధనా కాలమందు భక్తి, సిద్ధావస్థయందు జ్ఞానము మొదటి మార్గము. రెండవది గమ్యము. ఈ విధముగా నిర్ణయించి భక్తి, జ్ఞానమున కొక సోపానము మాత్రమే కనుక జ్ఞానము గొప్పది. భక్తి

తక్కువది అని కొందరు అందురు. మరి కొందరు జ్ఞానమే సోపానము; పరాభక్తియే గమ్యము అని వాదింతురు. స్వరూపమును తెలియుట జ్ఞానము. పిదప తెలిసి అనుసందానముచేసి కృతార్థుడగుటయే భక్తి అని వారు చెప్పెదరు. కాని ఎట్లు చెప్పుకొన్నా యొకటియే. ఆరూఢ జ్ఞానమున్ను ఐకాంతిక భక్తియున్ను చివరకు ఒక్కస్థానము నందు కేంద్రీకరించుట (కలుసుకొనుట) తప్పదు.

"ఆత్మన్యేవోపాసీత"; "ప్రియమిత్యుపాసీత" అనగా ఆత్మనే వుపాసింపుము. అది ప్రేమస్వరూపమైనదిగా తెలిసి వుపాసింపుము అని ఈ శ్రుతుల తాత్పర్యము. సరి అయిన భక్తుడే నాకు ప్రియతము డంటున్నాడు, గీతాచార్యుడు. భక్తునకా భగవంతునికంటె ప్రియతమమైనదిన్నీ లేదు కనుక భక్తియే ప్రేమస్వరూపము. ప్రేమయే భగవంతుడు. కనుక భక్తియొక్క స్వరూపమే భగవంతుడు. విభక్తి కానిదే భక్తి. కనుక "ఏకమేవా ఽ ద్వితీయం" అని చెప్పబడినదేభక్తి. ఈ విధంగా విచారిస్తే భక్తి జ్ఞానములు వేర్వేరు అని అనజెల్లునా ?

రాధాకృష్ణుల ప్రేమ దివ్యము అట్టి ప్రేమయే భక్తి యొక్క పరాకాష్ఠ. అట్టి ప్రేమ తరతమ భేదముచే యెట్లు ఆత్మయందే పర్యవసించుచున్నదో చూడుడు !

విత్తాత్ పుత్రః ప్రియం భవతి
పుత్రా త్స్వశరీరం ప్రియం ।
యింద్రియాణి ప్రియా ప్రాణః
ప్రాణా దాత్మా పరః ప్రియః ॥

అనగా విత్తము, పుత్రుడు, స్వశరీరము, యింద్రియములు, ప్రాణము ఆత్మ ఇవి పూర్వా పూర్వములకంటె వుత్తరోత్తరములు ఒకదానికంటె నొకటి ప్రియతరములై, చివరిదైన ఆత్మ అన్నిటికంటె ప్రియతమమైయున్నది అని భావము. కనుక పరమాత్మయందు పర్యవసింప జేయని ప్రేమకు సార్థక్యము లేదు. "ఆత్మవస్తు కామాయ విత్తం ప్రియం భవతి, ... (అంటూ చివరకు) "ఆత్మవస్తు కామాయ సర్వం ప్రియం భవతి" అని బృహదారణ్యక శ్రుతియును, యుద్ఘాటించుచున్నది. అనగా, తానైన ఆత్మయందు సహజముగా తనకు ప్రేమ యుండుటచేతనే విత్తము, పుత్రుడు, భార్యా, యిత్యాదులయందు తనకు ప్రేమ కలుగుచున్నది. కాబట్టి అట్టి ఆత్మయే ప్రేమనిధానము. ప్రేమకు (భక్తికి) పరంధామము అయివున్నది. ఆత్మకు సత్య జ్ఞానానందములు (సచ్చితానందములు లేక అస్తి భాతి ప్రియ లక్షణములు) స్వరూపమే అయివున్నవి. కనుక స్వరూప లక్షణముచేత కూడా ఆత్మ ప్రేమరూపము, జ్ఞానరూపముకూడ నైయున్నది. ఏతత్ప్రాప్తికి ప్రేమసాధన. (భక్తి) జ్ఞానసాధన రెండున్నూ మార్గములే. ఈ రెంటి లక్ష్యములున్ను ఒక్కటే, మార్గము కూడా ఒకటేగాని భిన్నముకాదు అని విమర్శించి తెలుసుకో నగును.

16. కర్త - కర్మ - క్రియలు

కర్త - కర్మ - క్రియలు అనగా నేమి ? కర్త అనగా చేయువాడు; అతడు చేసే పనియే కర్మ; క్రియ అనగా చేయుట. సర్వప్రాణులు పనిచేయుచున్నవి. మనస్సు, వాక్కు, శరీరము యివి పనిచేయుటకు ముఖ్యమైన పనిముట్లు. కనుకనే వానిని త్రికరణములన్నారు. అందేది పనిచేసినా కర్మ జరిగినట్లే. సర్వప్రాణులలోనూ యిందేదియో ఒక పనిముట్లు (ముఖ్యముగా శరీరము) పనిచేయుచునే వుండును. మానవులందు మాత్రము మూడు పనిముట్లూ పనిచేయుచుండును. గాఢసుషుప్తిలో సహితము శ్వాసక్రియ, పచనక్రియ, రక్త ప్రసరణ మొదలగు పనులు సర్వప్రాణుల శరీరములయందు జరుగుచునేయుండును. కనుక సజీవమైన యే ప్రాణియైననూ ఎట్టిపని చేయక పూరక నుండజాలదు. తనకు తెలిసియో తెలియకనో యేదో యొకపని జరుగుచునే యుండును. కనుక కర్మత్యాగమనేది వుండనే వుండజాలదు. చిరకాలము సమాధినిష్ఠలో వుండివున్న మానవ శరీరమందు గూడా పని జరుగుచునే వున్నది. అంతకు పూర్వము కుంభించిన వాయువు నందలి సత్తాను ఆ శరీరము ఆహారముగా గైకొనుచున్నది. తన రక్తమాంసములనే తన శరీరము భుజించి సజీవముగా నుంటున్నది. నఖ రోమములు పెరుగుచున్నవి. శరీరమునకు వృద్ధాప్య లక్షణములు వచ్చుచున్నవి. కనుక బ్రతికి యున్నంత వరకు కర్మ జరుగుచునే యుండును. అంతరేంద్రియ, జ్ఞానేంద్రియ కర్మేంద్రియములు పనిచేయక పోయినా, ప్రాణేంద్రియములలో సమాన ప్రాణములు శరీరమును ధరించి, భరించుచున్నవి, కనుక ఎట్టిపనీ జరుగక, యేప్రాణి శరీరమున్నూ బ్రతికియుండ జాలదు.

క్షణం కూడా కర్మచేయకుండా యెవరున్నూ యుండజాలరని గీతయందు యుద్ఘాటింపబడినది. కర్మలు రెండు విధములు - 1) గుర్తెరుగకుండా చేయబడు కర్మలు - ఆగామి ఫలములనీయవు. అనగా పుణ్యపాప సంస్కారముల నుత్పత్తి చేయవు కనుక రాబోవు జన్మలలో సుఖదఃఖముల కలిగింప జాలవు. 2) బుద్ధి పూర్వకముగా చేయబడు కర్మలు. ఇవియే మానవులకు ఆగామిఫలమును ఇయ్యగలవు కాని పశుపక్షి క్రిమికీటకములు చేయు పనులకు ఆగామి ఫలముండఙాలదు. ఏలననగా వానికి యుక్తాయుక్తములు నిర్ణయించు బుద్ధిలేదు. వాని వాని యుపాధికి సహజమగు కర్మలను అవసరాను సారము మాత్రమే ఆయాప్రాణులు చేయుచుండును. ఐతే గోవులన్నియు ఒకేజాతికి చెందియున్నవిగదా ! వానిలో కొన్ని పరమసాధు స్వభావము కలిగియుండగా! మరికొన్ని కౄరస్వభావము గలవై యుండుటకు కారణమేమి ?

యని సంశయము గలుగును. ఏకజాతియైనా వాని అంతఃకరణ యందలి గుణత్రయములు హెచ్చుతగ్గుపాళ్ళలో నుండుటయే యిందుకు కారణమని చెప్పనగును.

బుద్ధిపూర్వకముగా చేయబడు కర్మలే పుణ్య పాప ఫలములనిచ్చును అన్నాము. బుద్ధి పూర్వకముగా కర్మచేయు వాడే కర్త యనదగును. ఉదాహరణ :- పసిబాలుడు ఆడుకొంటూ చీమలను యితర క్రిములను బాధించి చంపును. అది వాని కొక ఆటమాత్రమేకాని ఆకార్యము హింసాకార్యమని తత్ఫలితము వుత్తరోత్రా తన్ను బాధించుననీ వానికి తెలియదు. అట్లే పిచ్చివాడు చేయు కర్మఫలము లాతని నంటవు, మరియు సత్కర్మలనే గావించునెడలకూడా అని వార్యముగా కొంత హింస జరుగవచ్చును. ఎట్లనగా - బీదలకు అన్నదానము చేయవలెనని సంకల్పించి వంటలు చేయించునపుడు వంటకట్టెలలోను, కూరలలోను, వేడిగంజి వార్చు నపుడును అనేక క్రిములు నాశనమగుచుండును. మరియు మనము సంచరించునపుడు ఇంట దీపములు పెట్టుకొన్నపుడు చివరకు వుఛ్వాసనిశ్వాసలు జరుగునపుడుకూడ ప్రాణహింస జరుగుచున్నది. ఈ పనులు చేయునపుడు ఆయాప్రాణులను హింసించవలెనని మన కెట్టి కోరికయు లేదు. కనుక మనము కర్తలము కాము. అకర్తలమే అగుదుము. కనుక ఆయా కర్మల ఫలితము మనల నంటజాలదు. అంతేగాక బుద్ధిపూర్వకముగా మనముచేయు హింసాత్మక చర్యలవల్లకూడా కొన్నిటి యెడల మన కెట్టి పాపము కలుగదు. క్రూరజంతువులను, మనలను బాధించు పాములు తేళ్ళు నల్లులు దోమలు మొదలగు వానిని మనం బుద్ధిపూర్వకముగా చంపినను పాపమంటదు. నల్లులను చంపుట పాపమూ కాదా యని శ్రీ రామకృష్ణ పరమహంసగారిని ప్రశ్నించి తెలుసుకొనవలెనని ఆయన శిష్యుడొకడు ఆయనవద్దకు పోయేసరికి ఆయన మంచమొకదానిని ఎండలోవేసి నల్లులను వెదకి వెదకి పట్టి చంపుచుండెనట. ఆవిధముగా ఆశిష్యునికి జవాబు లభించినది. అంతేగాక సమష్టి శ్రేయస్సు కొరకు లేదా యెక్కువమందిని కాపాడుటకు తక్కువ మందిని చంపవలసి వచ్చినా దోషము లేదు. బలవంతుని బారినుండి బలహీనులను కాపాడుటకై బలవంతుని ఆస్తిరక్షణకుగాని చేయు హింసాకార్యములున్ను పాపహేతువులు కాజాలవు.

ఇంతవరకు జనులుచేయు కర్మలయందలి పుణ్యపాప ఫలములు అంటువిధానమును గూర్చి కొంతచర్చించితిమి. ఇక పారమార్థికాభ్యున్నతికోరు సాధకులుచేయు కర్మ విధానముల గూర్చి విచారించెదము.

ప్రతినరుడూ సుఖమునే ఆశించునుగాని దుఃఖమును గాని కష్టములనుగాని యెవరున్ను కోరుకొనరు. దీనికి విరుద్ధముగా పాండురాజు ప్రథమ భార్యయగు కుంతీదేవి మాత్రం కష్టములే తనకెప్పుడూ కలుగవలెనని కోరుకొని యుండెనని ఒక కథకలదు. ఎట్లనగా శ్రీకృష్ణుడు నిర్యాణముచెందు సమయమున తన బంధుజనముల రావించి ఎవరెవరు యేయే కోరికలు

కోరుకొందురో కోరుకొండని; అవి సిద్ధించునట్లు వరములిచ్చెదననియు ప్రకటించగా అందరూ అన్ని కోరికలు కోరుకొనిరట. అందరికీ అన్నివరములూ శ్రీకృష్ణుడనుగ్రహించెనట. మేనత్తయగు కుంతీదేవి మాత్రము ముందుకు వచ్చి యెట్టికోరికలు కోరుకొనకుండ ఒక మూల కూర్చుండెనట. ఆమెను పిలచి నీవువచ్చి అందరివలె యెందుకు కోరుకొనలేదు ? అని అడుగగా ఆమె తనకేకోరికలు లేవు అని చెప్పగా "అట్లాకాదు, నన్ను సంతృప్తి పరచుటకైననూ యేదైన నొకటి కోరుకొమ్మని వత్తిడిచేయగా ఆమె తనకు ఎప్పుడునూ కష్టములే ప్రాప్తించునటుల వరమిమ్మని అడిగెనట. ఎవరైనను కష్టములు కోరుకొందురా ? యిదేమి కోరికయని యెల్లరు ఆశ్చర్యపడిరి. నీవేల కష్టము కోరు కొంటివి ? అని శ్రీకృష్ణుడామెను ప్రశ్నింపగా "స్వామి, సర్వ సుఖములూవుంటే నీవెవరికి కావలెను ? నాజీవిత మంతయూ కష్టములతోనే గడచినది. ఆ కష్టములలో నున్నందుననే నిరంతరము నిన్ను స్మరించుచూ శాంతి పొందుచుంటిని. లేనిచో నీవుగాని నీ నామస్మరణగాని యెవరికి కావలెను ? యిట్టి భక్తి శేషజీవితములో చివరవరకూ నా కుండవలెనంటే కష్టములూ దుఃఖమూ వుంటేనే అది సాధ్యపడ గలదు. కనుకనే నాకెప్పటికీ కష్టములే వుండవలెనని కోరుకొంటిని' ' అని ప్రత్యుత్తర మిచ్చెను. ఐతే కుంతీదేవి కోరికకూడా "అందరూ సుఖమునేగాని దుఃఖమునెవరున్నూ కోరుకొనరు" అనే సూత్రమునకు మినహాయింపుగా పైకథ నిలువజాలదు. ఏమనగా -- కష్టములలోనుండి దైవస్మరణ చేసుకొనుటలో గల శాంత్యానందములను కుంతి కోరుకొన్నట్లే అయినది. కనుక ఆమెకోరికకున్ను సుఖాభిలాషయే మూలము అని చెప్పనగును. ఐతే కొందరు ప్రాపంచిక సుఖములను మాత్రమే కోరుకొందురు. మరికొందరు ఆముష్మిక సుఖములను కోరు కొందురు. ఇంకా కొందరు ఈ ఐహికాముష్మిక సుఖములను కోరక బ్రహ్మానంద రూపమగు పరమ సౌఖ్యమునే కోరుకొందురు. ఈ త్రివిధ రూపములగు సుఖములలో యేదిన్ని శాశ్వతముకాదు. తానున్నంతవరకు జనన మరణములు తప్పవు. కనుక సుఖదుఃఖములున్ను తప్పవు. కనుకనే జన్మరాహిత్యమునే వుత్తమోత్తమ జిజ్ఞాసులు కోరుకొని అట్టి శాశ్వత జన్మరాహిత్యమునే పరమావధిగా నెంచుచున్నారు.

ప్రపంచమునందలి సకల మతకారులను సత్కర్మాచరణను విధించియున్నారు. కారణ మేమనగా సాధకుడు పరిశుద్ధాంతఃకరణము కల్గియుండుట ముఖ్యావసరము. మలవిక్షేప ఆవరణదోషములు, నానా వాసనలు గూడుకట్టుకొని యున్న అంతఃకరణము రాళ్ళతోడను రప్పలతోను ముండ్ల మొక్కలతోను నిండియున్న అడవిభూమి సేద్యమునకు అనుకూలముగానట్లు పారమార్థిక వ్యవసాయమునకు యోగ్యమైన క్షేత్రమే కాజాలదు. శుద్ధాంతఃకరణమునందే ఆత్మప్రకాశము చక్కగా ప్రతిఫలింపగలదు. గురువునాటిన జ్ఞానబీజములు మొలకెత్తి ఫలింపగలవు. కనుక పారమార్థిక సాధకులందరికీ త్రివిధ తపస్సులు (కాయక వాచిక మానసిక - తపస్సులు) అత్యంతావశ్యకములై యున్నవి. కర్మ, భక్తి, యోగ, జ్ఞాన, అతీత జ్ఞానార్గముల వారందరూ త్రివిధ

తపస్సులూ త్రికరణశుద్ధీ, సత్కర్మాచరణము విధిగా పాటించవలసియున్నది. అట్లుగాక శ్రీరంగనీతులు మాత్రము వాచా వల్లెవేయుచూ క్రియాచరణ లేనివారు మిధ్యాచారులని గీత పేర్కొనియున్నది.

కర్మచేయుటయూ తప్పదు. దాని ఫలము అనుభవించుటయూ తప్పదు. అందరూ కర్మచేయువారే. అందరూ కర్మిష్టులుకారు. కర్మయోగులసలేకారు. వేదోక్తకర్మలు విధి పూర్వకముగా చేయువారు అనగా యజ్ఞయాగాది క్రతువు లొనర్చి దేవతలను సంతృప్తిపరుచువారు పుణ్యఫల మార్జించి దేవతాలోకములలో సుఖభోగములనుభవించకోరుదురు. వీరు విధినిషేధములను పాటించి నిషిద్ధకర్మలు మానివేయుదురు. నిత్యనైమిత్తిక కర్మలను చేయుదురు. వీరు కర్మిష్టులగుదురే గాని కర్మయోగులు కాదు. సత్కర్మాచరణచేయుటచే వీరి అంతఃకరణము కొంతవరకు పరిశుద్ధముకాగలదు. "క్షీణేపుణ్యేమర్త్య లోకం విశంతి" అనే న్యాయంగా పుణ్యము క్షీణించగనే మరల భూమియందు జన్మలెత్తుదురు.

ఇక కర్మయోగ మేదియో యించుక విచారించనగును. చేసెడి కర్మ అంతయు కర్మయోగ మెపుడు కాగలదు ?

అంటే

1) ఐహికాముష్మిక సుఖభోగములందెట్టి కోరికలూ వుండరాదు. వున్నచో ఆతని కర్మలు కామ్యకర్మలేయగును. గాని నిష్కామకర్మ (లేక నిస్వార్థకర్మ) యెట్లు కాగలదు ?

2) మానవుడు జ్ఞానేంద్రియములచే శబ్దాదులను గ్రహించి వానికి లోలత్వమును చెందుచున్నాడు కనుక దృఢమనస్సుచే యింద్రియ చాపల్యమును అరికట్టవలెను.

3) యజ్ఞార్థము మాత్రమే కర్మచేయవలెను. యజ్ఞార్థ మనగా తన స్వార్థముకొరకు గాక లోకహితార్థం అనగా పరోపకారము నిమిత్తము కర్మచేయవలెను. తనకీ జన్మలో ప్రాప్తించిన సంపదలు పూర్వ జన్మలలో తానుచేసిన పుణ్యకార్యముల ఫలితములుగా దైవదత్తములై యున్నవి. వానిని లోక శ్రేయస్సుకై వినియోగించక పూర్తిగా తానే అనుభవించువాడు దొంగయే యగుచున్నాడని గీత యద్ఘాటించు చున్నది. కాని తన దేహయాత్ర కొరకు అవసరమైనంతవరకు అనుభవించక తప్పదుకదా ! కనుక దైవత్తమగు తన సంపదను యజ్ఞ శేషముగా (ప్రసాదముగా) మాత్రము అవసరమైనంతవరకు వినియోగించుకొని శేషించునది లోక శ్రేయస్సు కొరకు వినియోగించవలెను. ధనమును వస్తుసంపదను విపరీతముగా కూడబెట్టుట దూష్యము. ఏలననగా ఆవస్తుసంపద మిగతావారికీ అందుబాటులో లేక కరువుకాటకములు ఏర్పడు చున్నవి.

4) స్వధర్మ రూపమైన నియతకర్మను అసంగముగ (ఫలాసక్తిలేక) చేయవలెను. వైరాగ్యము యింద్రియ నిగ్రహముకల్గి. స్వధర్మమును వీడక చేయబడు సమిష్టి శ్రయోదాయకమగు కర్మలు

మాత్రము కర్మయోగములో చేరును. నేను లోకమునకు మేలు చేయుచున్నాననే అహంకార మేమియు నుండకూడదు. సేవారూపముగా నేను చేయుచున్నాను. అను వినమ్రభావముతో మాత్రమే చేయవలెను. మరిన్ని పరోపకారముతో లోకసేవా పరాయణముగ జీవించునవకాశము తనకు లభించినదిగదా యని సంతోషపూర్వకముగ సేవాధర్మము నిర్వర్తించవలెను.

ఇట్టి కర్మయోగి భక్తుడా ? లేక జ్ఞానియా ? భక్తుడగు కర్మయోగి చేయు కర్మకు జ్ఞానియొక్క కర్మకు వారివారి అంతఃకరణ దృక్పథములో మాత్రమే తేడాకలదు. అది ఎట్టిదో యించుక పరిశీలించుటకు ముందు వారిర్వురకుగూడా శీల సంపత్తి ముఖ్యావసరమనిన్ని అందుకు సత్కర్మాచరణము ఆవశ్య కర్తవ్యమనిన్నీ మరువరాదు. కర్మయోగముతో గూడని భక్తిజ్ఞానములు వ్యర్థములు. కనుకనే భగవద్గీత యందు యించుమించు అన్ని అధ్యాయములందును కర్మ ప్రశంస విరివిగా చేయబడుచు వచ్చినది. ఉత్తముడగు భక్తుడు వుత్తమ కర్మయోగియే అగుచున్నాడు.

భక్తుడగు కర్మయోగి దైవసమర్పణముగ మాత్రమే సకల కర్మలు చేయుచుండును. అతడు సేవకుడు. తన ఇష్టదైవమే ప్రభువు తానుచేయు పనులచే స్వామిని సంతృప్తిపరచుటకే భక్తుడు శ్రమించుచుండును. అతని ఆజ్ఞలను శిరసావహించి, పాలించుటే అతని కర్తవ్యము, ఆ దైవకృపయే అతడాసించును. యితర ఫలాపేక్ష యేమియు నాతనికి వుండదు. కనుక అతనికి కర్మసంస్కారములంటవు. ఆగామి కర్మఫలములే సృష్టింపబడవు.

శ్లో॥ యత్కరోషి, యదశ్నాసి యజ్జుహోషి తదాసియత్।
యత్తపస్యసి కౌంతేయ తత్కురుష్వ మదర్పణం ॥

నీవు యే కర్మ చేసినా యేదితిన్నా, ఏ యజ్ఞ దాన తపస్సులు చేసినా అవన్నియు నాకర్పింపుము అను భగవదాదేశమును భక్తుడు పాటించును.

అంతేగాక పరమభక్తుడు తన్నే భగవానునికి పూర్తిగా అర్పించుకొనును. ఆపైన తాను భగవంతుని చేతి కీలుబొమ్మగానే భావించును. తన్నాడించువాడాయనే. ఆయన ఆడించిన అట్లే ఆడుచున్నానని తలంచును. తనకర్మల కన్నిటికి ప్రేరణ యిచ్చునది ఆయనే, చేయించునదీ ఆయనే తత్ఫలముల ననుగ్రహించునదీ ఆయనే. కర్త కర్మ, క్రియలన్నియును ఆయనే. ఆరీతిగా తానకర్త, అభోక్త, తనద్వారా చేయబడుకర్మ యొక్క ఫలములు తన్నంటనే అంటవు. కనుక ఫలములీయని ఆ కర్మలను కర్మయే అనరాదు: అది అకర్మయే అగును. "సర్వ ధర్మాన్ పరిత్యజ్య, మామేకం శరణం వ్రజ" అను భగవచ్ఛాసనము పాలించి అతడు సర్వార్పణ బుద్ధితో శరణాగతి చేసిన వుత్తమభక్తుడు.

ఇక జ్ఞాని ఎట్లు అంతఃకరణ ప్రవృత్తితో కర్మాచరించునో తెలిసికొందము - వాచా వేదాంతసూక్తు లుద్ఘాటించు వాడు జ్ఞానికాడు. కాయిక వాచక మానసిక రూపములగు త్రివిధకర్మల

యందునూ తానుద్ఘాటించు వేదాంత సూత్రములను ఆచరణయందుంచి అనుష్ఠించువాడే జ్ఞాని. తానాచరించు సకల కర్మలయందు అతడాత్మదృష్టి వీడడు. ఆత్మ బ్రహ్మైక్యానుభవమునే అతడు కోరును. కనుక ఆ అనుభవసిద్ధికై అతడాత్మదృష్టిని యెన్నడు వీడడు. "ఆత్మనోన్యం నకించన" ఆత్మ కంటె అన్య మేమీ కొంచమైనా యేమీ లేదనే నిశ్చయముపై దృశ్యాదృశ్యమగు సర్వము ఆత్మస్వరూపముగా గుర్తించు అమృత దృష్టియే ఆత్మదృష్టి. ఆత్మ అకర్త, అభోక్త అయివున్నాడు. ఆ ఆత్మయే నేను. కనుక "నాహం కర్తానభోక్తా" నేను కేవలము సాక్షీభూతుడను. కర్మచేయునవి దేహేంద్రియ మనస్సులే కాని సాక్షీభూతమైన ఆత్మ కాదు. "అహంకార విమూఢాత్మా కర్తాహమితి మన్యతే" అనగా దేహాదులతో తాదాత్మ్యముపొంది ఆ నేనే ఆత్మయని అజ్ఞానిమాత్రమే భావించి తాను కర్తననుకొంటాడు. అజ్ఞాని దృష్టిలో ఆకాశ నిజాంశమగు అంతఃకరణమే తాను కనుక తానే కర్త అని భావించును. ఇట్లు భావించుట యేల సరిగాదు ? అంటే జ్ఞానికి ప్రత్యగాత్మయే తాను. 'ప్రత్య గాత్మా శివోహం శివోహం' ఆ విషయం తెలియక, అజ్ఞాని అంతఃకరణమే తానను కొంటున్నాడు. పంచతాన్మాత్ర విషయములందు లగ్నత చెంది దేహేంద్రియ మనోహంకారములతో ప్రవర్తించుచు కర్మనొనర్చును. ఆత్మయట్లు విషయము లందు మగ్నత చెందదుగదా ? కనుక అట్టి యాత్మకు కర్తృత్వము అంటగట్టుట అజ్ఞాన మన్నారు. ఆత్మవస్తు నిశ్చయము లేకపోవుటచేతనే అజ్ఞాని ఆత్మకు కర్తృత్వ మాపాదిచినాడు. ఆత్మకర్తగాకపోతే, మరి గీతదృష్టిలో కర్తయెవరు ? అంటే "ప్రకృతేః క్రియమాణాని గుణైః కర్మాణి సర్వశః" అనిన్నీ "గుణా గుణేషు వర్తంతే యితిమాత్వన సజ్జతే" అనిన్నీ (అనగా త్రిగుణములే గుణరూపములగు విషయము లందు వర్తించుచున్నవనిన్నీ) యింద్రియములు వానివాని విషయములయందు వర్తించుచుండుట మాత్రమే ననిన్నీ గీత సమాధానము చెప్పచున్నది. త్రిగుణ ప్రవృత్తిచేత యింద్రియములు (మనస్సుతో సహా) కార్యము లొనర్చుచున్నవి. కనుక కర్తృత్వము వానిదేకాని ఆత్మకట్టి కర్తృత్వము లేదని గీత నిశ్చయించినది. అంటే ఫలాపేక్ష. కర్తృత్వము యీ రెండూ కూడా అంతఃకరణకేగాని ఆత్మకు లేవు. గనుక ఆత్మైన నాకు కర్తృత్వమే లేదు. సర్వము నేనైవున్నాను. "మమాత్మా సర్వభూతాంత రాత్మా" అని జ్ఞాని నిర్ణయించుకొని సకల కర్మలు ఆత్మదృష్టిచేతనే చేయును. ఆవిధముగా కర్మఫలములీయని ఆతని కర్మలుకూడా అకర్మలే అయి అజ్ఞాని కెట్టి ఆగామికర్మ లేకుండా పోవుచున్నది.

ఇక పరిపూర్ణభావజుని కర్మవిధాన మేమి ? యెట్టి అంతఃకరణ ప్రవృత్తితో అతడు జీవయాత్ర సాగించును ? అను విషయములనుగూర్చి విచారింతము. గుర్తెరుగకుండా యెవరున్ను ఏకర్మయూచేయరు. కనుక గుర్తే సకల కర్మలకు మూలం కనుక ఆ గుర్తే కర్తఐతేగాని పరిపూర్ణబోధరీత్యా మూలంలేని గుర్తెరిగే శరీరం యేమీ లేదు. పరిపూర్ణ పరబ్రహ్మము యీ యెరుకకు మూలంగాని స్థానంగాని లేదు. మరొకటేదీ లేనేలేదు. కనుక మరొక మూలంకూడా యేమీ లేదు. పరిపూర్ణ పరబ్రహ్మమందు యెరుక పుట్టనేలేదు. దాని యందు లేకనే తోచినది. అట్లులేక తోచిన యెరుక సకల సంకల్పములు చేయుచు సకల కర్మలకు మూలమైయున్నది.

అట్టి యెరుకను విడచుటే నిజమైన త్యాగము. "త్యాగేనైకే అమృతత్వ మానశుః" యిట్టి త్యాగికి అమృతత్వము అనగా జనన మరణ రాహిత్యము కలిగి తీరును. ఎరుక సత్యమని భ్రమించి చేయు కర్మలు పుణ్య పాపములకు కారణ మగును. కాని ఎరుక విడచిన తాపసులకు అట్టి పుణ్య పాపములంటవు. లేని యెరుకకు కర్తృత్వ కారయితత్వములున్నూ నుండజాలవు. ఈ పరిపూర్ణ బోధ ఆరూఢము అయినవానికి ప్రవృత్తి నివృ త్తులు లేవు. భుక్తి ముక్తి క్రియలయందు సంగముగాని అసంగముగాని లేక పనులు చేయును. అతడు రాగియూ కాడు, విరాగియూ కాడు. మూలంలేని గుర్తెరిగే శరీరము యేమీ లేదనే దృఢ నిశ్చయంపైననే అతడెల్లపుడూ నుండును. కనుక నాతనిని అశరీరి అన్నారు. యిట్టి స్థితి సామాన్యం కాదు. ఆరూఢత యేమియు చేకూరనిదే, నేను అచల పరిపూర్ణుడను, అశరీరిని యని పరిపూర్ణగురువును చేరిన ప్రతివాడూ అనుకొంటే అది ఆత్మవంచనయే కాగలదు.

ఐహికాముష్మిక సుఖములకై చేయబడు కర్మలు. ఆత్మైక్యరూపమగు మోక్షమును గోరిచేయు కర్మలూ కామ్య కర్మలే, మరిన్ని బంధకారణములే."కేవల మోక్షాపేక్ష సంకల్పో బంధః" అని నిరాలంబోపనిషత్ వాక్యము. ఈ త్రివిధ కర్మలలోను స్వార్థమున్నది స్వ+అర్థము = స్వార్థము కనుక యిందు "స్వ", అనగా తాను, తన ప్రయోజనమూ వుంటూనేవున్నవి. కనుక నిస్వార్థకర్మ, లేక నిష్కామకర్మ కాజాలదు. తాను లేని దొక్క పరిపూర్ణ పరబ్రహ్మము మాత్రమే. పరిపూర్ణ భావజ్ఞుడు తాను లేననే ఆరూఢతపై చేయు కర్మలే నిస్వార్థకర్మలు కాగలవు. అతడే, అకర్త. కర్మలు చేసియు చేయనివాడగుచున్నాడు. తానే లేడు గనుక తనకు కర్మఫల మంటునా ? యిట్టి భావనాబలముతో చేయబడు కర్మాచరణ విధానమే అశరీర పద్ధతి.

పరిపూర్ణ బ్రహ్మమునందు పురుషప్రకృతులు లేవు. పురుషుడు లేనిచో పురుషార్థములు లేవు. కావున చతుర్విధ పురుషార్థములు వాని ఫలప్రాప్తియు అశరీరికి లేవు. కనుక అతడుచేయు కర్మయే శుద్ధనిష్కామకర్మ, లేక నిస్వార్థకర్మ కాగలదు.

ఇంతవరకు ఏయే మార్గస్థులు ఏయే దృష్టితో కర్మాను ష్ఠానము చేతురో చేసిన వివరణ క్రింద క్లుప్తముగా పొందు పరచడమైనది.

1) సామాన్య మానవులందరు స్వార్థదృష్టితో కామ్యకర్మలను యిహలోక సుఖము నాశించి చేయుచున్నారు.

2) స్వర్గాది పరలోక సుఖముల నాశించి కృఛ్ర చాంద్రాయణాది వ్రతములు యజ్ఞయాగాది క్రతువులు కొందరు చేయుచున్నారు. నిష్కామముగ యజ్ఞాదులుచేసి శాశ్వత బ్రహ్మలోకము పొంది చివరకు బ్రహ్మతోసహా మోక్షము చెందగలమని పూర్వమీమాంసకులు.

3) నిష్కామముగ నిస్వార్థబుద్ధితో లోకసంగ్రహణార్థము యితర ఫలాపేక్ష లేక కర్మచేయువారు కర్మయోగులు.

4) కేవలం భగవత్ప్రీతి కొరకు భగవత్కైంకర్యముగ (యితర ఫలాపేక్ష లేక) భగవత్ప్రేరణతో కర్మచేయుచున్నామనే ప్రవృత్తితో కర్మచేయువారు భక్తులు. ఇది భక్తియోగము. భక్తి మార్గము జ్ఞానమార్గమునకు సోపానమని ఆదిశంకరులంటే, జ్ఞానమార్గమే భక్తికి సోపానమని రామానుజు లంటారు. అదే పరాభక్తి.

5) నేనే ఆత్మస్వరూపుడును. ఇంద్రియ మనస్సులు గుణకర్మల ప్రేరణతో సకల కర్మలు చేయుచున్నవి. నేను సాక్షిమాత్రుడను, అసంగుడను. నాకెట్టి కర్తృత్వము లేదు. కనుక ఆయా కర్మఫలితములు నన్నంటజాలవు అని జ్ఞానియొక్క దృక్పథము. జ్ఞానమార్గ కర్మమార్గములు రెండూ కలిసినపుడు అది కేవలము వాచాడంబర వేదాంతము గాక అనుష్ఠానవేదాంతమై బుద్ధి యోగమని ప్రసిద్ధికెక్కినది.

6) పరిపూర్ణ భావజ్ఞునిదృష్టిలో స్వయంప్రకాశముగల ఆత్మయే సర్వమునకు మూలము.

జ్ఞానము (గుర్తు) లేకుండా అనగా సంకల్పించకుండా ఎవరున్నూ యెట్టికర్మయు చేయరు. ఏది లేకుంటే ఏకర్మయు జరుగదో దానినే కర్తృత్వమని చెప్పవలెను. "తేన వినాతృణాగ్రమపి నచలతి" అనగా సర్వసత్తాంశరూపమగు ఆత్మయే లేనిచో ఏదీ జరుగదు. కనుక సర్వమునకు ఆ యాత్మయే కర్త. పరిపూర్ణబ్రహ్మమందు నేనైన యీ ఆత్మలేదు అని దృఢపరచుకొని కర్మలు చేయువానికి ఆ కర్మఫలము లంటవు. కర్మసంస్కారము లావిధముగా అంటనివానికి జనన మరణ రహితమేనని పరిపూర్ణుల భావము.

కర్మయోగము, భక్తియోగము, జ్ఞానయోగములలో యేదో యొకదానిని మాత్రమే అభిమానించి అదొక్కటియే గొప్పదని వాదించువారు దురభిమానులనియే చెప్పవలెను. పరిపూర్ణరాజయోగములో కర్మ, భక్తి, జ్ఞానమార్గములు అన్నియు చేరియున్నవి, కర్తృత్వ రహిత విధానములో చేయబడు కర్మసుకౌశలము, సర్వార్పణబుద్ధితో గురుని సేవించు గురుభక్తి, ఆత్మ స్వరూప నిశ్చయముతో సమదృష్టి కలిగి సాధకుడు, అశరీరస్థితి గురుకృపచే ప్రాప్తించు వరకు కృషిచేసి కృతార్థుడు కాగలడు కనుక యీ సిద్ధాంతపద్ధతికే పరిపూర్ణ రాజయోగమని సార్థకనామ మేర్పడినది.

క్రియ అనగా పనిచేయుట (లేక పనిచేయు విధానము). కర్మ మనగా చేయబడిన పని (లేక దాని ఫలితము). కర్తయే లేనిచో క్రియా లేదు, కర్మాలేదు. కనుక కర్తృత్వ రహిత కర్మాచరణ విధానమైన కర్మకౌశలము తెలియుటకు పరిపూర్ణ బోధ గురువుల పాదము లాశ్రయించి గురుభక్తి గురుసేవ, గురునిష్ఠ కలిగి గురుకృపకు పాత్రులై పరిపూర్ణము యెరుకల నెరిగి తుదకెరుకవీడి అశరీరస్థితిలో శేషజీవితము సాగించి కృతార్థులగుదురుగాక ! ! !

17. ఆత్మవస్తు నిశ్చయము ఆవశ్యకత

"యతో వా ఇమాని భూతాని జాయంతే । యేన జాతాని జీవన్తి । యత్ప్రయంత్యభిసం విశంతీతి । తద్విజిజ్ఞాసస్వ । తద్బ్రహ్మేతి" తై॥ ఉ॥

దేనియందు సకలము జన్మించుచున్నదో, పెరుగు చున్నదో, చివరకు నశించుచున్నదో - అది బ్రహ్మము అని అర్థము. ఆవిధముగా జగత్కారణమగు వస్తువు ఆత్మ (లేక బ్రహ్మ) యని, సకల శ్రుతి స్మృతుల తాత్పర్యమై యున్నదని పరిపూర్ణ దర్శనములోని సృష్టి విజ్ఞాన ప్రకరణములో సిద్ధాంతము చేయబడినది. జన్మకారణమగు వస్తువే శాశ్వతము, అంతకంటె అతీతమగునది ఏమీ లేదు. దానిని చేరుటే మోక్షము అను భ్రాంతి యున్నంతవరకు జనన మరణములు శాశ్వతముగా పొందవలసియే యుండును. అట్టి భ్రాంతి రహితమునకు శ్రీ శివరామ దీక్షితులవారి సిద్ధాంతము. ఆ సిద్ధాంతమును విపులపరచుటకే శ్రీ భాగవతుల కృష్ణ దేశికేంద్రుల కందార్థ - కందపద్యములు ప్రవర్తిల్లినవి.

కందార్థములలో "పరిపూర్ణమనే దొకటి, లేనెరుకానె దొకటి, పరిపూర్ణ మెరుకల నెరిగి, యెరుకనుమాను" అని యీ సిద్ధాంతసారము సూత్రీకరింపబడినది. పరిపూర్ణ మెరుకల నెరిగిన పిదప యెరుకనుమాను అనుటలో యెరుకను యెరుంగుట అవసరమన్నట్లేగదా ?

యెరుగుట అనగా దానిని గురించి వినుట, చదువుట మాత్రమే కాదుగదా ! దాని (గురించిన) అపరోక్షజ్ఞానము కలిగినపుడే దానిని పూర్తిగా యెరిగినట్లగును. అపరోక్ష జ్ఞానమనగా యింగ్లీషులో చెప్పవలసివస్తే Direct Cognition అనుటకంటె గత్యంతరములేదు. చూచువాడు (ద్రష్ట) చూపు (దృక్కు) చూడబడేది (దృశ్యము) వేరైయున్నంతసేపు అది direct cognition కాదు. చెవులతో విన్నా, కంటితో చూచినా అది indirect cognition మాత్రమే అగును. మనస్సుతో చూచినపుడే అది direct cognition అపరోక్షము అని చెప్పవలెను. చూడబడు వస్తువు యొక్క రూపం మనస్సు చెందినపుడు నిజముగా మనస్సుతో చూచుట. మనస్సు ఏకాగ్రమైన క్షణములో (ఉష్ణముచే మెత్తగానైన లక్కవలె) ఆ చూడబడే వస్తు స్వరూపము చెందగల శక్తి మనస్సునకు గలదు. ఆ విధముగా చూచినపుడే యా వస్తువు అపరోక్షమైనది అని అనాలి. ఇదే వస్తునిశ్చయ జ్ఞానము. indirect cognition అనగా పరోక్ష జ్ఞానము అనగా జ్ఞానేంద్రియ పంచకమగు శ్రోత్రత్వక్చక్షుర్జి హ్వాఘ్రాణముల చేగల్గు యింద్రియజన్యజ్ఞానము కలుగును. ఇందువల్ల బుద్ధి నిశ్చయమే గాని, ఆత్మనిశ్చయరూపమగు అపరోక్ష సాక్షాత్కారము సిద్ధించదు. శ్రీ కృష్ణ దేశికేంద్రులు "పరిపూర్ణ మెరుకల నెరిగి" అనుటలో అపరోక్షముగా నెరుగుటయే పుద్దేశింపబడెను.

ఇతే, కంటికిగాని మనస్సునకుగాని గోచరించని పరిపూర్ణము (absolute Brahman) పట్ల అపరోక్షశబ్ద మెట్లన్వయించును ? ఎరుకనుగాని, ఎరుకలోగల వస్తువులనుగాని యెరుకచేత గుర్తించనగును. ఎరుకలేని పరిపూర్ణమును యెరుక లేక సేవింపదగును. ఎరుకలేక సేవించుటే, పరిపూర్ణ బ్రహ్మము యొక్క అపరోక్షము, "అపరోక్షమౌను మనుజులకు పరోక్షం బైనబైలు గురుకృపగలుగా; కీలిదెలేని యెరుక తాతొలుగా" అని కృష్ణదేశికేంద్రు లనుటలో, పరిపూర్ణ మపరోక్షమగుట కన్ను లేని యెరుక తొలగుటకున్ను గురుకృపయే కారణమై యున్నది. ఎరుకయే అపరోక్షముగానిచో, తెలియని యెరుకను విడచుట, అంగడిలోయున్న బెల్లమును గుడిలోనేయున్న దేవునికి, చెయ్యి మాత్రమే యిటనుండి త్రిప్పి నైవేద్యము చేయుటవంటిదే యగును. ఎరుక అపరోక్షమైనపుడుగాని, ఎరుక స్థాన స్వరూపములు తెలియబడవు.

కనుక పంచసాధనలచేత (అనగా 1. గురుమంత్రాను స్థానము, 2. గురూపాసన, 3) గురూపదిష్ట మార్గమున సత్కర్మాచరణము, 4) గురుస్వరూపధ్యానము, 5) గురుతత్వమును గూర్చి శ్రవణ మనన నిధి ధ్యాసలు) గురుకృపా సంసిద్ధి కలుగును. గురువు బోధించిన మాటలను చిలుక పలుకుల వలె తిరిగి పలుకగలుగుట మాత్రమే అయినచో అది వాచా వివేకత్వమే (లేక మెట్టవేదాంతమే) యగును.

సాధన సాధ్యమైనది (సాధనలచే సాధింపదగినది) యెరుక. సాధనాంతర నిరపేక్షకమైనది (సాధనలచే సాధింపరానిది) పరిపూర్ణము. "ఏ సాధన నీ కెందుకు" అని కృష్ణదాసుగారు అన్నారంటే, తన్నాశ్రయించుటకు వచ్చినవాడు "సాధన సంపత్తియు గల సాధకుడు" కనుకనున్ను "బోధచేయుము పుణ్యపురుషా, మాబోంట్లకు - సాధించదగు ముఖ్యసాధన " అని అడిగినాడు కనుకనున్న, వాని నుద్దేశించి "నీకే సాధనలు అవసరములేదు. సాధనలచే పొందదగు సిద్ధి యిది వరకే నీవు పొందియున్నావు. ఇక నీకిప్పుడు కావలసినది ఏ సాధనల నపేక్షించని పూర్ణ బోధ. యింకా నీకు సాధనల యందాశపోనిచో నీవు రావలసిన పనిలేదు" అని చెప్పినారు. అంతేగాని యే సాధనలూ చేయక ఆత్మవస్తు నిశ్చయము లేని వాడు వస్తే వానికి కూడ "మొదలచలము నెరిగించెద" నంటారా ? ఓ,న,మ, లు రానివానికి M.A పాఠం చెపుతారా? యోచించవలెను. పూర్ణాధికారి కాని శిష్యుడు వస్తే ముందుగా వానిని అధికారిని చేయు పూచీ గూడ సద్గురువు వహించును. ఆత్మసాక్షాత్కారము పొంది ఆ యానంద మనభవించినవాడు మరల మరల అట్టి ఆనందానుభవమునకై ప్రాకులాడుట సహజము. పూర్ణబోధలో ప్రవేశించిన తరువాత కూడ అట్టి ఆశకు లోనగునేమోనని యెంచి శ్రీ శివ రామదీక్షితుల వారు అదే (ఆ పరమాత్మ) నేను కావలెనని భ్రాంతి మోక్షభ్రాంతి, అనుభవభ్రాంతి వున్నవార్కి చెప్ప వద్దని హెచ్చరించినారు. అదేవిధముగా "రోసితి మోక్షాద్యపేక్ష ఘూఢిగ వినుమీ; నీవిట్టి ఆ రూఢత గనుమీ . . . . ." అంటూ కృష్ణదేశికేంద్రులున్ను పూర్ణాధికారి నిరూపణ చేసినారు. యీ మాటలన్నీ అనధికారికి అనగా మోక్ష

స్వరూపము (అఖండ యెరుక స్థానము) యెరుగనివానికి చెప్పిన మాటలుకావు. ఎరుక ఏదో తెలియనివారికి ఎరుక నిరసన గావించుట, పచ్చికాయను పండుగావించ యత్నించినట్లే. అది క్రుళ్ళికంపెత్తునుగాని యెన్నడును పండనేరదుగదా!

"నిన్ను (నీ నిజస్వరూపమైన ఎరుకను) విడచి చూస్తే, అంతా కుంఠితంగాని వైకుంఠమే కల్పనారహితమైన కైలాసమే (పరిపూర్ణ పరబ్రహ్మమే)"అను మాటలు యెరుక యొక్క అపరోక్షానుభూతి కలవానికే అని తెలియవలెను. ఎరుక యేదో తెలియకుంటే దేనిని విడచిచూచును? కనుక ఎరుకను వస్తునిశ్చయరూపంగా దెల్పి, శిష్యునిచే సాధనలచేయించి, ఆత్మనిశ్చయం గావించి తీరవలసినదే! అటుపిమ్మట యెరుక నిరసనగావించి, దానికతీతమైన పరిపూర్ణమునందు ఆస్తిక్యబుద్ధిని కలిగించవలసినదే!

అందుచేతనే యితర బోధల విషయ మెట్లున్నా పరిపూర్ణ బోధవిషయములో మాత్రం గురు వత్యంతావసరము. "గురువు లేని విద్య గ్రుడ్డి విద్య" అనుట పరిపూర్ణ బోధ విషయములో పరమ సత్యము.

శ్లో॥ శ్రీగురోః పరమం రూపం వివేకం చక్షు రగ్రతః ।
మందభాగ్యా నపశ్యంతి అంధః సూర్యోదయంయథా॥

అంటూంది గురుగీత. పరమాత్మ వస్తువును చూడలేనివాడు, మందభాగ్యుడు. ఇక వస్తునిశ్చయము తెలియని గురువు విషయంలో వేమ యోగీంద్రుడు "తన్ను తా నెరుగడు, తానెవ్వనికి జెప్ప, పాలుమాలినయట్టి పశువుకొడుకు" అని క్రూరముగా నిందించినాడు. వస్తు నిశ్చయము లేని గురు శిష్యులు, తాము చెడుటయే గాక, లోకమునుగూడ చెరపిన వారగుదురు.

గురువు యెరుకను వస్తు నిశ్చయముగా చూపగల్గు నేమోగాని, పరిపూర్ణమును ఎట్లు చూపును? శిష్యుడెట్లు చూచును ? చూపుట, చూచుట యెరుకేగదా! చూస్తూనే యెరుక పారిపోదా? ఆ పరిపూర్ణము దృశ్యమా ? యద్దృశ్యం తన్నశ్యం కాదా ? యిట్టి ప్రశ్నలు పరిపూర్ణ బోధ తెలుసుకున్న వారే వేయుదురా! వేస్తే వారి కేమి తెలిసినట్లు ? వారిగురువులు వారి కేమి తెలిపినట్లు ? గురువు తెలుపలేదా ? ఇవి గురువులవల్ల మాత్రమే తెలుసుకొనవలసిన విషయములు కావా? గురువులకే తెలియనిచో తెలిసిన గురువుల నాశ్రయించి తెలుసుకొనవద్దా? అట్లు గురువును విడచి మరొక గురువును ఆశ్రయించుట దోషమనుకొనుటయే దోషము.

మధులుబ్ధో యథాభృంగః పుష్పాత్పుష్పాంతరం వ్రజేత్ ॥
జ్ఞానలు బ్ధస్తథా శిష్యోగురోర్గుర్వంతరం వ్రజేత్ ॥

అను గురుగీతా శ్లోకమున్నూ, "పరిపూర్ణ బోధ నెరుగని గురుశిష్యులు బోధకొరకు కొర పనిబడున్, గురువర్యు నొకని మరలను ...... " అను కందార్థమున్నూ గమనించవలెను.

"యద్దృశ్యం తన్నశ్యం" కనుక గురువుచూపుట,. శిష్యుడు చూచుట అనేది శాశ్వతమైన పరిపూర్ణ విషయంలో చెప్పవచ్చునా? అని ప్రశ్నించుట తగదు. ఏలననగా చూచేవి కళ్ళు; కళ్ళద్వారా చూచేది మనస్సు. యీ రెంటిచే చూచుట లేదుగదా! "లేనెరుకతో దీని కనిపెట్టి పాదోట్టు మెరుక" అన్నారు కృష్ణదాసుగారు. యిట్టి వన్నియుగురు ముఖతః సందేహనివృత్తి చేసుకోదగినవి మాత్రమే కనుకనే "గురోర్ముఖేన జ్ఞాతవ్యం నాన్యథా గ్రంథకోటిభిః" అని చెప్పబడినది. గ్రంథముచేత గాని, వూహపోహలచేగాని, యుక్తిగా తెలుసుకొన్న వారిదగ్గర నుంచి రాబట్టుటకు ప్రయత్నించుటగాని వృథా.

షోడశితో ద్వాదశిని గుర్తించి రెంటినీ పంచదశితుల్య మని భావించుమనే మాటలు, ద్వాదశి షోడశుల వస్తు నిర్ణయార్థ మెరుగనివారి మాటలు. వారికి బ్రహ్మాండైక్య విషయంగాని, తుదకు పిండబ్రహ్మాండములు వస్తు నిర్ణయముగాని తెలిసియుండదనుట నిస్సంశయము. షోడశి యనగా యెరుక యని, ద్వాదశి యనగా పరిపూర్ణమని వారి భావన. ఐతే షోడశితో ద్వాదశిని గుర్తించుటనగా యెరుకతో పరిపూర్ణమును గుర్తించి అని అర్థముకదా ! "ఎరుక యెరిగిన వస్తువు యెరుకాని తెలియుము" అనీ, "లేనెరుకతో దీన్ని కనిపెట్టు"మనీ "ఎరుకలేక సేవింపదగు" ననీ శ్రీకృష్ణ దేశికేంద్రులంటున్నారుగదా! ఎరుకతో వుండచూచుకొనుట మాత్రమే సాధ్యము. పరిపూర్ణము నెరుగుట యనగా యెరుక విడచి యెరుగటయేనని తెలియవలెను. గురుగోప్య విషయములు గురువుద్వారా శిష్యుడైనవాడే తెలుసుకొనగలడు. ప్రశ్నోత్తరములద్వారా, లేక వుత్తర ప్రత్యుత్తరముల ద్వారా లేక వ్యాస వుపన్యాసములద్వారా తెలియబడవు. తెలిసినా వస్తువనిశ్చయము లేనివారికి బధిర శంఖారావవత్ అని గ్రహించదగును.

జన్మకారణమగు వస్తువునందు సత్యత్వ భ్రాంతిరహితము కానిచో జనన మరణ భ్రాంతిరహితముకాదు. సృష్టికి పూర్వమున్న అఖండ యెరుక (లేక పరమాత్మ)కు పరిపూర్ణ బ్రహ్మమునందు మూలముగాని స్థానముగాని లేదని పరిపూర్ణ బోధ సిద్ధాంతము. ఈ సిద్ధాంతము దృఢమగుటకు ఆ అఖండ యెరుకయొక్కయు (పరిపూర్ణమందు అదిలేనిదగుటచే దానిని లేనెరుకన్నారు) పరిపూర్ణముయొక్కయు వస్తునిశ్చయము అవసరము, ఎందుకూ పనికిరానిదీ ఎట్టిదీ కానిదీయగు ఆ పరిపూర్ణము అంతటా నిండున్నదని గురువాక్యాం, నమ్మితే అది నీకు జన్మలేకుండా చేసునా? అంటారు. నిజమే, చేయదు. కాని అది వున్నదనీ దానియందు నీవు లేవనీ, ఆరూఢమైతే నీకు జననమరణభ్రాంతి రహితమై తీరును. కనుక పరిపూర్ణము యొక్కయు నీయొక్కయు వస్తునిశ్చయము ముందుగా కావలసివచ్చుటలేదా ? పరిపూర్ణ మొకటి లేనెరుక కనే దొకటి అని అన్నారు కదా ! లేని ఎరుక ఏదో తెలుసుకొంటే, అది కాని దేదో అది పరిపూర్ణమని తేలుతోంది. కాని యిట్లు చెప్పుట అనుమాన ప్రమాణముచే వాచా చెప్పుటయేయగును. రెండింటినీ వస్తునిర్ణయముగా తెలియవలెను. లేనెరుకను విడచినపుడే పరిపూర్ణ మపరోక్షము.

"కస్మిన్ను భగవో విజ్ఞాతే సర్వమిదం విజ్ఞానం భవతీతి" (అనగా ఓ ఒక్కటి తెలుసుకొంటే సర్వం తెలియబడుతుంది. "యజ్ఞాత్వానేహభూయోన్యత్ ! జ్ఞాతవ్య మవ శిష్యతే" అనగా దేనిని

తెలుసుకొంటే యిక తెలివిచే తెలియదగినదియుండదో అట్టి సర్వస్వరూపమైన ఎరుక తెలియ బడకపోతే వాని జ్ఞానమంతయు వ్యర్థమే. ఆ వస్తువును (ఆత్మ స్వరూపమును తెలియకుంటే ఏమియు తెలియనట్లే! అట్టి యెరుకను తెలియకనే దానికతీతమగు కేవలాత్మను (పరిపూర్ణ పరబ్రహ్మమును) తెలియగోరుట వుట్టి కెగురలేని పూరకుక్క స్వర్గమునక కెగురుటకై పురకలు వేసినట్లే యని యెంచ దగును.

"అవిజ్ఞాతే పరే తత్వే శాస్త్రాధీతిస్తు నిష్ఫలా" పరతత్వము తెలియబడకపోతే వాని శాస్త్రజ్ఞానమంతయు నిష్ఫలమే; బూడిదలోపోసిన పన్నీరే.

"నేనెంత లెస్స చదివిన దీనిని తెలియంగగలరె దేశిక వర్యున్ పూని సేవించకుండిన" అనిన్నీ "నాలుగు శుశ్రూషణములు లోలత గావించుకొనుచు, లోకాతీతం బాలోకించీ గురునిచే యీలోకముజోలి విడువుమింతే, చాలన్నా నీతో గూడ; యిది మరువకన్నా ..." అనిన్నీ "ప్రవిమల చిత్తుడు శిష్యుడు సవినయమున దేశికునకు శరణాగతుడై బోధవిను" మనిన్నీ "సిగ్గువిడచి కొలవుమా నీతివంతా అభిమానం పోనీ నీదంతా" అనిన్నీ కృష్ణదేశికేంద్రు లంటున్నారు. "శిష్య స్తేహం శాధి మాం త్వాం ప్రపన్నమ్" అన్న తర్వాత గాని కృష్ణభగవాన్ గీతోపదేశము చేయలేదు. మరిన్ని "తద్విద్ధిప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా" అని గీతాశాస్త్రము శాసించుచున్నది. మేమెప్పుడో ఏగురువులనో ఆశ్రయించి పరిపూర్ణ బోధవాక్యములు రెండు విన్నాంకదా, అని అను కొని పూరుకోక "మేమేమి వింటిమి ? ఏమి తెలిసితిమి ? మేము బోధ సమగ్రంగావింటే మాకిన్ని సంశయములు ఏల వస్తున్నవి ?"

"గురు గురుబోధలచేతను పరిపూర్ణము నెరిగి
యెరుక బాసిన యతనిని గురుతింప నొరుల శక్యమె ?
యెరిగిన నరులిట్టి బోధ నెరిగేరోయాన్నా;
వారెరుగని మరుగుండదన్నా"

అంటున్నారే కృష్ణ దేశికేంద్రులు!! "నా కిన్ని సంశయములు వస్తుంటే నాకు సమగ్రంగా బోధ తెలియలేదేమో ? మానవ జన్మయెత్తినందుకు యీ జన్మ వృథాకాక పూర్వమే సర్వ సంశయరహితము గావించుకొనవలదా ! అని అంతరంగ పరీక్ష చేసుకొని నిరభిమానులై, తమ సంశయరాహిత్యము కావించుకొనుట ముముక్షువుల ధర్మమైయున్నది. "సంశయాత్మా వినశ్యతి" "న సుఖం సంశయాత్మనః" అనిన్నీ భగవద్గీత యుద్ఘాటించుచున్నది. "చిదిమిన కొద్దీ చిగుర్చు" "యెరుక కూకుడువేరు నెరిగి త్రవ్వు" మంటున్నారు కృష్ణ దేశికేంద్రులు.

కనుక వస్తునిర్ణయ మెరిగిన గురువుల నెన్నుకొని, గురు భక్తి, గురుసేవ గురునిష్ఠ కలిగి, సేవించి గురుకృపకు పాత్రులై జననమరణభ్రాంతి రహితము చేసుకొందురుగాక !

18. పరిపూర్ణ బోధ మార్గంలో సాధన లేదా ?

శిష్యుడు :- సర్వమునకు ఆధారమైనది ఏది ?

గురువు:- జ్ఞానము, తెలివి,యెరుక, ద్రష్ట, సాక్షి, సచ్చిదా నందము మొదలగు పేర్లన్నియు దానికే. సాలెపురుగు వలె సృష్టి స్థితి లయములు చేయునది అదే. పట్టుపురుగు వలె తనగూడులో తానే చిక్కుకొని జనన మరణముల చెందుచూ కర్మబంధమున చిక్కుకున్నదీ యదే. జగ ద్వ్యాపకమై యున్న దదే. చిదాకాశమన్నా అదే; కూటస్థచైతన్యము, అధిష్ఠానము అదే. తాను ప్రకాశిం చుచూ సర్వమును ప్రకాశింపచేయునది అదే ఎరుగు చున్నపుడు ఎరుకనీ, మరచినపుడు మరుపనీ దానికిపేర్లు.

శిష్యుడు :- అది యెందుండి యే విధముగా వచ్చినది ?

గురువు :- దానికి మూలము లేదు; తనకుతానే వచ్చినది. అది గొడ్రాలుబిడ్డ వంటిది.

శిష్యుడు :- మూలములేని వస్తువుగాని, గొడ్రాలుకు బిడ్డగాని యెట్లుండును ? కనుక ఎరుక ఏమీ లేనిదేనా ?

గురువు :- పరిపూర్ణ పరబ్రహ్మమందు దానికి మూలములేదు. అనగా పరిపూర్ణమం దది పుట్టలేదు. ఎరుకయందే ఎరుక పుట్టినది. ఎరుకయం దెరుక సత్యమే.

శిష్యుడు :- పట్టుగాఉన్నది అర్థమయ్యేలా శెలవీయండి స్వామి !

గురువు :- జాగ్రతయందు కల లేకపోయినా, కల కాలమందు కల దృశ్యములన్నియు సత్యములై సుఖ దుఃఖాను భవము కల్గించునట్లే నని తెలియవలెను.

శిష్యుడు :- లేని కల లేకపోతే గాఢనిద్రయో, లేక మెళుకువయో వుండును. అట్లే లేనెరుక లేకపోతే మిగిలి వుండునది శూన్యమా ? లేక పూర్ణమా ? ఆ శేషించిన వస్తువేది ?

గురువు :- శూన్యమనిగాని, పూర్ణమనిగాని, నిర్ణయింపరాని దేదో అది ఉండును. దానికే అచలమని, బయలని, పరిపూర్ణమని పేర్లు పెట్టినారు. అది అవాఙ్మానస గోచరము.

శిష్యుడు :- అది తెలియరానిది కాదు ! అది పరమ సత్యమని తెలిసినా తెలియకున్నా అది వున్నదే గదా ! ఇక మీ బోధవల్ల ఏమి సాధించినట్లు ?

గురువు :- సకల భ్రాంతులకు మూలమైన ఎరుక ఏమీ లేదని దృఢమగుటవల్ల సర్వభ్రాంతి రహితము సిద్ధించును గదా! "భ్రాంతి రహిత మిదం మోక్షం" అన్నారు. యిక కావలసిన దేమి ?

శిష్యుడు :- మరి, యీ యెరుక రహితమున కే సాధన చేయవలెనో సెలవీయండి స్వామీ !

గురువు :- కలకంటూ కలవరించేవాడు కలలోని భయభ్రాంతులు రహితమగుటకు ఏమి సాధన చేయవలెను ?

శిష్యుడు :- మెలకువలోనున్నవాడు జాలిచెంది, ఆ కలలో కలవ రించేవానిని మేల్కొలుపవలె.

గురువు :- శెహభాష్ ! అట్లే భ్రాంతి రహిత స్థితిలో (మెలకువలో) వుండే గురుమూర్తి ఎరుక భయభ్రాంతులలో చిక్కి అలమటించేవానిని చూచి జాలిపడి, భ్రాంతి రహితస్థితి (మెలకువ) అతనికి కల్గించవలె.

శిష్యుడు :- అట్టి గురుకృపా సంసిద్ధికొరకైనా శిష్యుడు సాధన చేయవలెనా ? వద్దా ?

గురువు :- అవశ్యము చేసి తీరవలెను.

శిష్యుడు :- ఆ సాధన యెట్టిది ?

గురువు :- గురుసేవ గురునిష్ఠ, గురూపాసన, గురుమంత్రజపము, గుర్వాజ్ఞాపరిపాలనము. "అన్యథా శరణం నాస్తి" -- "మామేకం శరణం వ్రజ" అన్నాడు భగవాన్.

శిష్యుడు :- ధన్యోస్మి

❀ ❀ ❀

19. సంసారము

భార్యాబిడ్డలు, ఆస్తిపాస్తులు మొదలగు వానితో గూడిన ఒక గృహస్థుయొక్క కుటుంబనిర్వహణ రూపమగునదే సంసారమని సామాన్యార్థము. ఈ అర్థములో తన యొక్కయు, తన కుటుంబ సభ్యులయొక్కయు సుఖ సంతోషములకై మానవుడు నిరంతర ప్రయత్నముచేయుచు జయాపజయములు, లాభనష్టములు తత్ఫలితముగా సుఖదుఃఖములు పొందుచూ నానాయాతనలు పడుచున్నాడు. ప్రపంచములో దుఃఖము 90 పాళ్ళు, సుఖము పదిపాళ్ళు మాత్రమేనని చెప్ప బడుచున్నది. ఆ సుఖ లేశము కొరకే మానవు డాసపడి చేయరాని దుష్కృత్యము లెన్నో చేయుచున్నాడు.

అనేక పూర్వజన్మ సుకృత విశేషములచే ఒకానొక మానవుడు యీ సంసారమునందు నిజముగా దుఃఖమేగాని సుఖము శూన్యమని గుర్తించి ఆనందావ్యాప్తి యెట్లుకలుగును ? అత్యంత దుఃఖనివృత్తి యెట్లు కాగలదు ? అని జిజ్ఞాస గావించుచున్నాడు.

"జన్మదుఃఖం జరాదుఃఖం జాయాదుఃఖం పునఃపునః !
సంసారసాగరం దుఃఖం తస్మాత్ జాగ్రతజాగ్రత !"

అని వివేకము తెచ్చుకొనచున్నాడు. పిరికివాడగుచో, సంసారమును త్యజించి బిచ్చ మెత్తుకొనియో ఏ ఆకు అలములు తినియో జీవిత శేషమును పూర్తి చేసుకొన నెంచుచున్నాడు. లేక ఆత్మహత్యయే గావించుకొనుచున్నాడు. మరికొందరు సన్యాసాశ్రమ స్వీకారము గావించు చున్నారు.

ఉత్తముడగు జిజ్ఞాసి "సంసారమెట్లు కలిగినది ? పుట్టి వుండబట్టి కదా యీసంసారము ! పుట్టుకేలేనిచో సంసారము కలుగదుకదా కనుక జన్మరాహిత్య రూపమగు మోక్షము నొందవలె. మోక్షస్థానమగు ఆత్మైక్యము నొందవలెనని, నిశ్చయించుకొని కర్మ భక్తి యోగ జ్ఞాన మార్గములయందు సాధన చేయుచున్నాడు. ఆత్మయొక్క పరిణామ రూపమగు యీ విశ్వము ఆత్మనుంచే వచ్చినపుడు ఆత్మయం దైక్యము సాధించినా, అట్టి ఆత్మతోపాటు మరల సృష్టిలోనికి రావలసి నదేగదా ! తనకు యీ సమస్త విశ్వమునకు బీజరూపమగు ఆత్మయొక్క రహితస్థితి యందుగాక తనకు శాశ్వతజన్మ రాహిత్య రూపమగు మోక్ష మెట్లు సిద్ధించును ? అని వితర్కించి అట్టిస్థితి పరిపూర్ణబోధవలన గాక మరెట్లు సిద్ధించును ? అని పరిపూర్ణ గురువుల నాశ్రయించి గురూపదిష్ట మార్గము నందు మరి కొందరు కృషిచేయుచున్నారు.

సంసార దుఃఖమును భరించలేక సంసారమునుండి తప్పించుకొనుటకు అనేకులు, వివిధములగు సాధనా మార్గములను చేపట్టుటకు కారణమేమి ? వారెన్నుకొన్న మార్గములు సంసార శబ్దమునకు వారిచ్చు నిర్వచనము పైననే ఆధారపడియున్నది. ఎట్లనగా :-

1) "సంసారమనగా భార్యాబిడ్డలు, ఆస్తిపాస్తులతో కూడి వున్నదే సంసారము" అను నర్థమును గ్రహించిన కొందరు వివాహము మాని యితర మార్గములలో ఆ వైవాహిక సుఖ మనుభవించుచున్నారు. ఉత్తములైతే ఘోటక బ్రహ్మచర్యక్రమునే అవలంబించి మాకు సంసార దుఃఖము లేదని భ్రమించుదురు. లేక వివాహమైతే ఆ భార్యాబిడ్డలను, ఆస్తి పాస్తులను సన్యసించి సంసారీ దుఃఖీ - సన్యాసీసుఖీ అని ప్రగల్భాలు పలుకుదురు.

2) శరీరధారణమే సంసారము అని అర్థమును నిర్ణయించుకొన్నవారు శరీరంలేకుంటే సంసారం లేదనుకొని మూర్ఖులై కొందరు ఆత్మహత్యలకు పాల్పడుదురు. అదృష్ట వశాత్తు యిట్టి మూఢులు

బహు తక్కువే. కొంతమంది వీరిలో బుద్ధిమంతులు పుట్టుక యెందుకు కలిగినది ? కర్మ ననుభవించుటకే గదా ! కనుక కర్మవలన జన్మ కనుక దేహోత్పత్తి కారణమగు అదృష్టమే సంసారము అని అర్థము చెప్పుకొని మంచికర్మవలన మంచిజన్మ; చెడుకర్మవలన చెడ్డజన్మ కనుక ప్రారబ్ధరూపముగా వచ్చిన సుకృత దుష్కృత ఫలితములగు సుఖదుఃఖము లనుభవించుచు, రాబోవు జన్మ యందు సుఖముగలుగుటకు యీ జన్మలో సుకృతకర్మల నొనర్చవలెను అని యజ్ఞ యాగాది క్రతువులు, దానధర్మములు విరివిగా చేసి స్వర్గసుఖము లనుభవించవలెననే కోరికతో కొందరట్లు గావింతురు. కాని స్వర్గములో పుణ్య ఫలము ఖర్చుకాగా 'క్షీణే పుణ్యే మర్త్యలోకం విశంతి' అనే గీతాసూక్తి ప్రకారం భూలోకమున జన్మించి మరల సంసార దుఃఖ భాజనులగుచున్నారు. ఏకర్మ చేసినా యేదో జన్మ వస్తూ వున్నదే ! కర్మయే చేయకుండా ఊరుకొనుట సాధ్యము కాదే ! మరి యెట్లు ? కర్మజఫల మాశించక నిష్కామకర్మ చేసినచో ఆ కర్మఫలానుభవమే వుండదు కనుక మరల జన్మింప నవసరముండదు. కనుక కర్మఫలత్యాగ మొనర్చి కర్మలు చేయవలెనని కొందరందురు.

3) కాని ఏఫలమున్నూ ఆశించక ఏకర్మనైనా ఎవరైనా చేయుదురా ? కనుక నిష్కామకర్మాచరణ సాధ్యముకాదు. కర్తృత్వాభిమానము లేకపోతే కర్మఫల భోక్తృత్వ ముండజాలదని మహనీయులు కొందరు సిద్ధాంతముచేయుచున్నారు. ఎట్లనగా -- యజమాని చెప్పినట్లు సమస్త వ్యవహారములు చేయు గుమాస్తాకు ఆ వ్యవహారములో చివరకు కలుగు లాభ నష్టములతో యెట్టి సంబంధము నుండజాలదుగదా ! అట్లే నా సమస్తము గురునికే యర్పించి ఆత్మ నివేదన గావించి యున్నాను. నేను నిమిత్తమాత్రుడనైనా విధ్యుక్త ధర్మముల నాచరించుచున్నాను. అందలి జయాపజయములు లాభనష్టములతో నాకు నిమిత్తము లేదు. అట్లే ఆ పాపపుణ్యములతోనూ నాకు నిమిత్తము లేదు అనే దృఢముతో అహంకార మమకారములు లేకుండా భక్తుడు సకలకర్మలు నాచరించియు ఆ కర్మఫలములచే బద్ధుడగుట లేదు. కాని భ్రాంతికారణమైన తెలివి వున్నంతవరకు శాశ్వతముగా జన్మ రహితముగాదు.

ఇక జ్ఞానమే జన్మ కారణము. స్వస్వరూప విస్మృతియే సంసారముఅనే జ్ఞాని "అహం బ్రహ్మాస్మి" అని దృఢనిశ్చయము గలవాడై, "నాహం కర్తాన భోక్తా" నేను ఆత్మ స్వరూపుడను; ఈ దేహేంద్రియ మనోబుద్ధులుగాను. "ప్రత్యగాత్మా శివోహం" మరియు ఆత్మ అగ్నిహోత్రమువలె మహా పరిశుద్ధిమైనది. దాని నేమియు మలినపర్చజాలవు. వ్యవహార మంతయు మిధ్య. మాయాకార్యము. పాపపుణ్యములు, జనన మరణములు, బంధమోక్షములు అన్నియు భ్రాంతియే అని ఆత్మనిశ్చయమందే యుండును కనుక నన్ను సంసారము గాని అందలి సుఖదుఃఖములుగాని బాధించవుఅని భావించు వారు ఆత్మస్థానరూపమగు మోక్షము చెంది ఆత్మతోపాటు మరల సృష్టిలో ప్రవేశించుచున్నారు.

ఇక పరిపూర్ణ భావజ్ఞులు - జ్ఞాతృత్వ ప్రమాతృత్వములే సంసారకారణము అంటారు. అనగా గుర్తెరిగితేనే ఇది సుఖ కారణము, ఇది దుఃఖ కారణము, ఇది సుఖము, ఇది దుఃఖము అని గుర్తెరిగి దుఃఖనివృత్తికి, ఆనందావ్యాప్తికి మానవులు ప్రాకులాడుచున్నారు. కనుక గుర్తెరిగితేనే ఆశ. గుర్తెరుగకపోతే యే ఆశా లేదు. నిస్పృహలేదు. కనుక జ్ఞానమే సంసారము. శ్రీ శివరామదీక్షితులవా రందుకనే మూలం లేని యీ గుర్తెరిగే శరీరం తోచడమే సంసారమన్నారు. కనుక సృష్టికారణమై జ్ఞానస్వరూపమైవున్న ఆత్మయే సంసారము. వ్యుత్పత్త్యర్థముచేగూడ యీ నిర్వచనము సమంజసమై యున్నది. ఎట్లనగా సం+సారము = సంసారము సారా సారవిచారము గావించినచో ఈ ప్రపంచములో అత్యంత సారభూతమగు వస్తువు ఏది ? సృష్టి కత్యంత మూలకారణము జ్ఞానఘనమైన ఆత్మయే అని తెలియబడుచున్నది. యిదియే సం+సారము-అత్యంత సారభూత వస్తువు. యిదియే యెరుక కూకుడువేరు. ఇది పోయినచో సృష్టికారణమే వుండదు. కనుక సృష్టి, ఆ సృష్టియందు వచ్చిన నేనూ వుండదు కనుక పూర్ణగురువు నాశ్రయించి పూర్ణబోధ గ్రహించి యీ సంసారమూలమును ఛేధించవలసియున్నది.

"మన ఏవ మనుష్యాణాం కారణం బంధ మోక్షయోః" బంధకారణము మనస్సని చెప్పేరన్నమాట. ఐతే మనోరూపము వహించేదీ, మనస్సును ప్రవర్తింపచేసేదీ. మనస్సుకు కారణమైనదీ యీ జ్ఞానమే అయియున్నది. కనుక మనస్సు లేక గుర్తించే జ్ఞానమే సంసారకారణము.

శరీర మున్నంతవరకు మనస్సుండక తప్పదు. ఏ ఆశ్రయమందున్నా అనగా బ్రహ్మచర్యాది చతురాశ్రమములలో ఏ ఆశ్రమమందున్నా, మనస్సు లేకుండాపోదు. అడవులకేగినా, కొండలకేగినా మనస్సు వదిలిపెట్టదు. ఏకాంతముగావుండి ధ్యానాదులచే మనస్సు నిర్మలము గావించు కొందామంటే మనస్సు ఏకాగ్రత చెందినపుడుతప్ప దాని విక్షేపమణగిపోదు. ఏకాగ్రత వదలిన మరుక్షణముననే మనో వికారములు తిరిగి ప్రారంభమగును. యోగసాధనలు చేసినా అంతే. సర్వసంగపరిత్యాగము చేసిన సన్యాసినైనా యీ మనోసంసారము వదలదు. అతని దండకమండలాదులే అతని కొక సంసారము. కనుక మనస్సును వదలకున్నంతవరకు సంసారమున్నట్లే, మనస్సును అణచి బ్రహ్మచర్య, గృహస్త, వానప్రస్థ సన్యాసములలో ఏ ఆశ్రమమందున్నా పరవాలేదు, కర్మసన్యాసము చేయనక్కరలేదు. పరిపూర్ణబోధచే మనస్సుమాత్రమేగాక సర్వసృష్టికి అత్యంత మూలకారణమైన మూలంలేని గుర్తెరిగే శరీరము పరిపూర్ణమునందు లేనే లేదని దృఢనిశ్చయముపొంది ఆ నిశ్చయముతో సకలకర్మలు చేసినా చేయనివాడగుచున్నాడు. ఇదొక్కటే సంసారతరణోపాయము.

❀ ❀ ❀

20. ఆశ

ఆశ యనగానేమి ? తనకప్పట్లో స్వాధీనానుభవములో లేనిదానిని కోరుటయే ఆశ. "కోరుట కామంబు" అంటున్నారు. అన్నివిధములగు కోరికలు కామ్యములే, ఆశలే అందరానిదాన్ని కోరుటయే ఆశ అని కొందరంటారుగాని అట్టి ఆశను పేరాశ దురాశ, అత్యాశలని వేరే పేరులతో మాత్రమే వ్యవహరించాలి.

ఆశ అనేది మానవులకు మాత్రం ప్రకృతి సిద్ధంగా సంక్రమించిన ప్రధానగుణం. ఏడాదిలోపు పసిబిడ్డకూడా, ఫలానా అనిచెప్పలేకపోయినా, ఆశకులోనవుచూ వుండడం మనం చూస్తాం. మిగతా సృష్టిలోగల పశుపక్ష్యాదుల కీయాశ అంతగా గన్పట్టదు. ఆహారాదుల విషయంలో మాత్రం తాత్కాలికంగా వానికి కూడా కొంత ఆశ లేకపోలేదుగాని, "పశువుకు తిన్నది పుష్టి, మనిషికి వున్నది పుష్టి" అనే లోకోక్తి ప్రకారం, అవసరమయ్యేదానికంటే అధికం కోరటం మానవ ప్రత్యేక లక్షణం అనియే అనవచ్చు. పశుపక్ష్యాదుల ఆశలకు మితమూ వుంది, తృప్తీ వుంది. మానవునికి మాత్రం ఆశకు అంతులేదు. చీమ తేనెటీగ మున్నగు వానికీమాత్రం మానవునికివలెనే కూడపెట్టే, లేక ప్రోగుచేసే స్వభావం వుంది కాని, అందులోకూడ ఒక మితముంది. ఐతే, సృష్టిలోకెల్ల గొప్పవాడని చెప్పబడే మానవునికి మాత్రం, ఈ అమితాశ, అసంతృప్తి కల్గించుటలో సృష్టికర్త యుద్దేశమేమి ? అణువు మొదలు బ్రహ్మపర్యంతం అఖండంగా వ్యాపించియున్న బ్రహ్మతత్వమే, తన నిజరూపమని మానవుడు తెలిసికొని తత్స్వరూపమును నిజరూపముగా చేసుకొని ప్రవర్తించాలని ఆశించి, మానవుని ఆశ అపరిమితం చేసేడేమో ననుకోవాలి. మానవుని గొప్ప కోరికలు లేక ఆశలు ఏవో మనం గమనిస్తే, యీ విషయం స్పష్టమౌతుంది. తానెప్పుడూ శాశ్వతంగా వుండాలని తనకు తెలియనిదంటూ లేకుండా సర్వజ్ఞుడు కావలని, దుఃఖమనేదేమీ లేకుండా ఎల్లప్పుడూ ఆనందంగా వుండాలనీ, దేవతలకుండే సర్వ శక్తులూ తనకు కలగాలనీ, తన కెట్టి అరిష్టములు ఎన్నడూ కలగరాదనీ, మణి, మంత్ర, ఔషధ ప్రయోగములన్నీ తనయెడల నిర్వీర్యములు కావాలనీ తనకే అందరూ సర్వవిధములా విధేయులై, సర్వనియంతృత్వ లక్షణములన్నీ తనకు సంక్రమించాలనీ మానవుడు కోరుకునే పెద్దకోరికలు, ఇట్టి కోరికలు తీరుట అసంభవములనీ, యివన్నీ కేవలం దురాశాజనకములనీ, స్థూలదృష్టికి తోచవచ్చును. ఇవి అడియాశలుగాని, పేరాశలుగాని కావు. వీనినన్నిటినీ సాధించిన మహాత్ములు నాటికీ, నేటికీ గూడ నున్నారు. ఒక్కమాటలో చెప్పాలంటే, ఆప్తకాముడైన పరమాత్మకు మాత్రమే యిట్టి సర్వశక్తులూ సహజములై యున్నాయి. గనుక, అట్టి పరమాత్మస్వరూపుడే తానైతే యీ సర్వకామ్యములూ ఒక్కసారిగా చేకూరగలవు. ఆశలన్నింటిలోనూ

గొప్ప ఆశ ఏదంటే తానే బ్రహ్మస్వరూపుడగుట. క్రొత్తగా తాను ఆ పరబ్రహ్మస్వరూపుడు కావాలో ? అవసరం లేదు. ఏలననగా తనకు తెలిసినా తెలియకున్నా తానూ, తనతోపాటు, సమస్త విశ్వమూ బ్రహ్మయే అయివున్నది. ఈవిషయం ఆరూఢ మగుటే బ్రహ్మమగుట. యిట్టి ఆరూఢ జ్ఞానికి సర్వమూ బ్రహ్మమయమే. ఆ యారూఢత సిద్ధిస్తే యిక అప్పుడాతనికింక ఏమైన యాశలుండునా ? "కిమిచ్ఛన్, కస్యకామాయ" అనురీతిగా అపుడాతడు దేని నాశించి ఏ కోరిక తీర్చుకొనుటకై ఏపని చేయును ? ఇట్టి ఆరూఢజ్ఞానులే ఆశలుడిగిన అయ్యలు. యిట్టివారి కేయాసలూ వుండనే వుండవు; కలుగనే కలుగవు.

పారమార్థికదృష్టిలేని ప్రాపంచికులకు, అన్నియాశలూ నుండును. వీరి యాశలకు సర్వతోముఖముగా సక్రమముగా చర్చించాలంటే కష్టమేఐనా, పెద్ద లిదివరకే వీనిని మూడు ముఖ్యమైన తరగతులక్రింద విభజించి యున్నారు. ఏ ఆశ అయినా యీ మూడింటిలో ఏదో ఒక తరగతిలోనికి వచ్చి తీరుతుంది. (1) స్త్రీ సంబంధమైన ఆశ (2) ధన (లేకవస్తు వాహనాది సంపద) సంబంధమైన ఆశ, (3) సంతానసంబంధమైన ఆశ. వేదాంత పరిభాషలో వీనిని 'ఈషణ త్రయము' అనగా 'దారేషణ, ధనేషణ, పుత్రేషణ' అంటారు. మొదటి రెండు ఆశలూ కామినీ కాంచనములు లేక కాంతా కనక ములకు సంబంధించినవి.

1) దారేషణ :- కాంతాకనకముల రెంటిలో యేది బలవత్తరమైన బంధకారణమగునంటే చెప్పుట కష్టమేయైనా దారేషణయే బలవత్తరమై ప్రథమస్థాన మాక్రమిస్తుందేమో ననిపిస్తుంది. దారేషణ అనుట పురుషుని వుద్దేశించి ప్రధానముగా చెప్పబడినా, స్త్రీలకు పురుషులయెడ గల భ్రాంతి లక్షణముకూడా గ్రాహ్యమే. కనుక స్త్రీ పురుషు లిర్వురిలో ఒండొకరులయెడగల కోరికలన్నీ దారేషణలోనికి చేరుతాయి. ఒండొరులయెడల స్త్రీ పురుషులకు కొంచ మించుమించు 16 సంవత్సరాల ప్రాయమునాటికి కామప్రవృత్తి బలీయమగుట ప్రారంభించును. అది యౌవ్వనారంభవేళ! తదాది కామినీ కాంచనముల యాసకులోనై మానవుడు అకార్యకరణములు (చేయరానిపనులు) యెన్నో చేయుచుండును. వలచిన స్త్రీని వశీకరణము గావించుకొనుటకు ప్రాణములనుగూడ గోల్పోయిన పురాణ దృష్టాంతములు కోకొల్లలు. దశకంఠుడగు రావణబ్రహ్మవంటి మహా దురంధరుడు స్త్రీ సాంగత్యముకోరి ప్రాణములను గోల్పోయెను. కైక మోహవాగురులలో జిక్కి దశరధుడు ఆమె మాట కెదురాడలేక ప్రియ నందనుడైన రాముని అరణ్యములకు బంపి దుఃఖవశుడై ప్రాణములుగూడ గోల్పోయెను. మోహినీ మోహావేశుడై రుక్మాంగదుడు, కుమారుని కుత్తుక నరకుటకు ప్రయత్నించెను. చిత్రాంగి యందలి ప్రేమపాశ వశుడై రాజరాజనరేంద్రుడు, కుమారుని కాలుసేతులు నరికించెను. యెనిమిదవ ఎడ్వర్డు చక్రవర్తి యొక సామాన్యస్త్రీని పెండ్లాడుటకై సూర్యుడస్తమించని బ్రిటీషు సామ్రాజ్యమునే పరిత్యజించెను. కనుక ధనేషణ కన్నా, పుత్రేషణకన్నా దారేషణ బలీయమని ప్రథమమున చెప్పదగునని తోస్తుంది.

కాని కొన్నియెడల ధనాశావేశముచే భార్యలను భర్తలు, భర్తలను భార్యలు, చంపుచుండుట కూడ కానవస్తుంది. అట్టియెడ వారికి భార్యలయెడ లేక భర్తలయెడ ప్రేమానురాగములు లేవనియే చెప్పనగును. కొన్ని యెడల ప్రేమ యున్నను ధర్మముకొరకై భార్యా పరిత్యాగం చేసినవారు సహితం లేకపోలేదు. సత్యవాక్పరిపాలనకై చంద్రమతిని హరిశ్చంద్రుడు బజారులో అమ్మివేయుటయే యిందుకు దృష్టాంతము.

2) ధనేషణ:- కాని నేడు అన్నిటికన్న ధనమే ప్రధానస్థాన మాక్రమించుచున్నదని చెప్పవలసివస్తోంది. ధనం పేరు చేపితే నేడు కడుపులోపిండం, కాటిలోని శవంకూడా ఆశతో యెగిరెగిరి పడుచున్నవి. "ధనమూల మిదం జగత్", "మాతా పుత్ర విరోధాయ హిరణ్యాయ నమోనమః" ఏ విధంగానయినా ధన మార్జించుటే పరమ పురుషార్థముగా భావింపబడుతూంది. అన్నవిక్రయ, కన్యావిక్రయ, విద్యావిక్రయాదులు నిరాక్షేపణీయంగా జరిగిపోతున్నాయి. కులవృత్తులచే, ధర్మయుతంగా ధనార్జనచేయుట పోయినది.

వ్యక్తులలోవలెనే ప్రభుత్వాలలో కూడా యీ ధనేషణే రాజ్యమేలుతోంది. పూర్వము రాజులసొమ్ము రాళ్ళ పాలనేవారు. యివ్వ డేమనాలి ? మట్టిపాలు, మంటపాలు, మహాసముద్రాలపాలు అనవలసినదే !

కీర్తికూడా యొకవిధమగు ధనమే. ధనములలో కీర్తి ధనమే అత్యుత్తమం "శిబి ప్రముఖులున్ ప్రీతిన్ యశః కాములై యీరే కోర్కెలు?" అని పోతనగారన్నారు. అట్టి కీర్తి ధనమాశించి ప్రాణములైన యర్పించెడివారు. ధనమొక లెఖ్ఖా ? "పాకీది గడింపదే ధనము, కీర్తికిరాని ధనంబు కాల్పనే" అన్నారు మహాకవులు. ఆశలలోకెల్లా సత్కీర్తి గడించాలనే ఆశ మెచ్చదగినదే కాని నెరమెచ్చుల దాతృత్వమువల్ల సత్కీర్తి రానేరదు.

3) పుత్రేషణ :- సంతాన సంబంధమగు కోరికలన్నీ పుత్రేషణ క్రిందికే వస్తాయి. సంతానాపేక్ష, పురుషుల యందుకంటే స్త్రీలయందే మెండు. మాతృత్వసిద్ధిలేని స్త్రీ జీవితం వ్యర్థంగా భావిస్తుంది. పురుషుడు ఆముష్మికసుఖం కోరి, పూర్వం, పుత్ర సంతానాన్ని ఆశించేవాడు. "అపుత్రస్య గతిర్నాస్తి' ' అనే కారిక కూడా పుట్టింది. కన్న సంతానం లేకుంటే, మరొక పురుషుని వలన స్వస్త్రీయందు సంతానం పొందేవాడు. పుత్రులు లేనివారు దత్తత చేసుకోడం యిప్పటికీ కలదు. అంతకంతకు పుత్రులే కావలెనని ఆశ అడుగంటుచున్నది. సత్సంతాన ప్రాప్తికే వుద్దేశింపబడిన వైవాహిక సంస్కారము నేడు కామసంతృప్తి కొరకే వినియోగింపబడుతోంది. స్త్రీ తన యౌవన సౌభాగ్యము నశించు నేమో అను భయముచేతను తన బిడ్డలను పోషించ నశక్తుడనగుదునేమో అను భయముచే పురుషులును సంతాన నిరోధ ప్రయత్నములు చేస్తున్నారు. సంతాన ప్రాప్తికై స్త్రీలు వ్రతములు, పురుషులు యజ్ఞయాగాదులు చేయుకాలము వెనుకబడుచున్నది. పూర్వము పెద్దలు పశువులు (గోవులు)

శిశువులులేనియింట విస్తరేసేవారుకాదు. నేడు పాశ్చాత్య విజ్ఞాన ప్రభావమున సులువుగా పుత్రేషణను మాత్రం కొందరు జయింప గల్గుచున్నారు.

కామినీకాంచనములు, సంతానములు ఆది మాధ్యాంతములయందు దుఃఖమునే కల్గించునవి కనుక యీ యీషణ త్రయమును జయింపవలెనని వేదాంతులు చెప్పుచున్నారు. వైరాగ్యమువల్ల బంధరాహిత్యమయి మోక్షము గలుగునని వారి ఆశ. మోక్షమనగా బ్రహ్మైక్యము అని వారి తాత్పర్యము. కారణరూప బ్రహ్మముతో తనకు తెలిసినా తెలియకున్నా తాను ఏకమయ్యేవున్నాడు. అది ప్రాప్య ప్రాప్తవ్యము. కేవల పరిపూర్ణ బ్రహ్మముతో యెవరికీ యెన్నడూ ఐక్యత అనేది లేనేలేదు. కనుక వేదాంతులు చెప్పే మోక్షా పేక్ష కూడా "కేవల మోక్షాపేక్ష సంకల్పో బంధః" అనీ నిరాలంబోపనిషత్. మోక్షాపేక్షకూడా బంధమే అంటూంది. పరిపూర్ణ బ్రహ్మమం దైక్యము అసంభవము. కనుక వట్టి యాశలచేత పట్టుపడకను యీ గుట్టు దేశికునోట గట్టిగా తెలుసుకు భావించపదగునూ ...." అంటున్నారు శ్రీ కృష్ణ దేశికేంద్రులవారు.

యీషణ త్రయమును జయించుటకు వేదాంతులు చెప్పిన మార్గమేమి ? మరి పరిపూర్ణ భావజ్ఞుల పరిష్కారమేమి ?

"ఆశా పరమం దుఃఖం నిరాశా పరమం సుఖం" అంటారు, వేదాంతులు. నిరాశ అనగా పిరికితనముతో గూడిన వైరాగ్యము లేక నిస్పృహ (Despair) కనుక కామినీ, కాంచనములను పుత్రులు వదలి సన్యసించినపుడే ఈషణత్రయము తొలగునని వారి ముఖ్యాభిప్రాయము. ఐహిక సుఖాలతో గూడిన ఆశలన్నీ యెండమావులవంటివి. కొరివి దెయ్యాలవలె వానివైపు పయనించినకొలదీ, భ్రాంతిజనకము లగుచునే వుండుననీ, కనుక సన్యసించి వానినుండి పారిపోవుటయే కర్తవ్యమనీ వారంటారు. నీకుముందుగాపోవు నీ నీడను పట్టుకొనుట నీకసాధ్యము. కాని వెనుకకు మరలినచో ఆ నీడ నీవెనుకనే వచ్చుననిన్నీ, కనుక నీవు వైరాగ్యపరుగడవై సన్యసించుటే మార్గమనీ వారందురు.

కాని, "ఆశ పాపజాతి అన్నింటికంటెనూ, ఆశచేత యతులు మోసపోరె ?" అన్నట్లుగా సర్వసంగ పరిత్యాగం చేసిన విశ్వామిత్రాదులు సహితం స్త్రీవ్యామోహంచేత పతితులైనవారెందరో యున్నారుగదా ! కనుక వైరాగ్యం గాని సన్యాసంగాని పరిష్కారమార్గం కాజాలదు.

మోక్షాపేక్షకూడ నొక ఆశయై వున్నపుడు "ఆశలేని వాడు అసలు లేడు" అని అనవలసివస్తోంది. ఆశలు లేక కోరికలున్నంతవరకు జన్మరాహిత్యము చేకూరదనే సర్వశాస్త్రములుచెప్పుచున్నవి.

ఇక మా ప్రబోధచే మాత్రమే జన్మరాహిత్యము కాని యితర విధంగా చేకూరదని వుద్ఘాటించు పరిపూర్ణభావజ్ఞుల పరిష్కారమార్గమేది ?

యించుక విచారంచవలసియున్నది. ఆశకు మూలమేమి ? అని విచారించి సకలకోరికలకు, ఆశలకు, భ్రాంతులకు మూలం, మూలంలేని యీ గుర్తెరిగే శరీరమే అని నిర్ణయించి, దాని రహితమునందు తప్ప ఆశలు బంధకారణము అవుతూనే వుంటాయి అని నిర్ణయించినారు. "నేను" అనేది వున్నంతవరకు అన్నీ భాధిస్తాయి. "నేనే" లేకుంటే, యిక ఆశలెవరికి ? భ్రాంతి యెవరికి ? బంధమెవరికి ? జనన మరణాలెవరికి కనుక ఆ "నేను" లేకుండా చేయుమార్గమే పరిపూర్ణ బోధమార్గము. ఒక్క పరిపూర్ణ పరబ్రహ్మమే పరమసత్యము. దానియందుఎరుకకు వుత్పత్తి స్థితి లయములు లేనే లేవు. అట్టి పరిపూర్ణ బ్రహ్మమును, లేనియెరుకను, యెరిగి, యెరుకను విడచుటే పూర్ణ మార్గము. ఆ విధంగా మేలుకొన్న పురుషుడు యెరుకనే కలలోనిపనులే చేయుచున్నట్లు ప్రాపంచికులకు గానవచ్చినా, అతడు కలవాడు కాదు. కర్తృత్వత్యాగ రూపమైన కర్మకౌశలముతో, రాజయోగరీవితో, భార్యా బిడ్డలతో, ధనకనకవస్తు సంపత్తితో తులతూగుచుండినా, అన్ని భ్రాంతులకు మూలమైన భ్రాంతికారక వస్తువునువిడచినవాడుగాన, అతనికి యీషణత్రయాది సర్వవ్యామోహ ములుండనే యుండవు. అతడు సర్వకర్మలు చేసినా చేయని వాడే యగును. యిదే పరిపూర్ణ భావజ్ఞుల పరిష్కారమార్గము.

❀ ❀ ❀

॥ శ్రీ గురుభ్యో నమః ॥

పరిపూర్ణ రాజయోగ సిద్ధాంత వ్యాసమంజరి

(తృతీయ సంపుటము)

రచయిత :

"పరిపూర్ణ దర్శనాచార్య" "సదానంద"

శ్రీ యిలపకుర్తి వీరవెంకటరామచంద్రరావు

నర్సాపురం (పశ్చిమ గోదావరి జిల్లా)

ద్వితీయ ముద్రణ 2000

ప్రతులు 1000

విషయసూచి

క్ర.సం.	విషయము			పుట
21.	అపేక్ష	...	...	1
22.	ఆత్మద్రోహము	...	...	3
23.	యానత్రయము	...	...	6
24.	ఆత్మవస్తు కామాయ - విత్తం ప్రియంభవతి	...	...	8
25.	ఏకోశమందూ లేదు	...	...	12
26.	నీ వచలుడవా ?	...	...	14
27.	బంధము	...	...	16
28.	మోక్షము	...	...	21
29.	ప్రశాంతి	...	...	25
30.	వివేకము	...	...	28
31.	పరోక్షాపరోక్షములు	...	...	38
32.	సన్యాసము : కాంతా - కనకములు	...	...	43
33.	అమృతమృత్యువులు	...	...	44
34.	పుట్టమీద కొట్ట భుజగంబు చచ్చునా ?	...	...	49
35.	ఎరుకోత్పత్తి - స్థితి - నాశములు	...	....	51
36.	జలజపత్రమునందు సలిల మంటనియట్లు	...	...	54
37.	పూర్వోత్తరజన్మ లున్నవా ?	...	...	57
38.	ఖండాఖండములు (యెరుక)	...	...	62
	శ్రీకృష్ణ దేశికేంద్రుల సాటువులు	...	...	64
39.	పరిపూర్ణమున కీయబడిన సాటువులు	...	...	66
40.	వేమన పద్యములు	...	...	81
41.	గురుకృపానంసిద్ధి	...	...	83
42.	శ్రీ శివరామదీక్షితీయ దివ్య సందేశములు	...	...	88
43.	అజాతవాదము - పరిపూర్ణ భావము	...	...	92
44.	భ్రాంతి రహిత మిదం మోక్షం	...	...	95

21. అపేక్ష

అపేక్ష అనగా చెడ్డకోరిక. అప + ఈక్ష - అపేక్ష, అప - అనగా చెడ్డదైన, ఈక్ష = కోరికతో గూడిన చూపు, కోరికలు అన్నీ చెడ్డవే అని చెప్పబడినవి. ఎందుచేతననగా కోరిక సిద్ధించినచో సంతోషముకల్గి అంతకంటే పెద్ద కోరికలను కల్గించుచున్నది. సిద్ధించనిచో దుఃఖము కల్గును లేదా ఆయా కోరికలు సిద్ధించుటకు అడ్డుతగిలిన వారియందు క్రోధము కల్గును. యీ కోపము యెన్ని అనర్థములకు దారితీయునో భగవద్గీత నొక్కి వక్కాణించినది.

శ్లో॥ క్రోధాద్భవతి సంమోహ స్సంమోహాత్ స్మృతి విభ్రమః

స్మృతిభ్రంశా ద్బుద్ధినాశో బుద్ధినాశాత్ ప్రణశ్యతి ॥

అనగా కోపమువలన అవివేకము, అవివేకమువలన విస్మృతి (మరపు) దానివలన అంతఃకరణనాశము, దానివలన సర్వనాశము కలుగుచున్నది అని చెప్పినది.

కం ॥ కోపమె పాపంబనబడు
కోపమె అహంకారమనుచు కొనియాడబడున్
కోపమె తాపం బనబడు
కోపమె మృత్యు వనబడును కుటిల విరహితా॥

అని శ్రీకృష్ణదేశికేంద్రులవారున్ను సెలవిచ్చియున్నారు.

కనుక కోరిక లేమియు నుండరాదని సిద్ధాంతము. ఐతే కొందరు మోక్షాపేక్ష కోరిక కాదని అట్టి కోరిక యుండదగునని చెప్పెదరు. యిందుకు విరుద్ధముగానిరాలంబోపనిషత్ "కేవలం మోక్షాపేక్ష సంకల్పో బంధః" అనగా మోక్షాపేక్ష సంకల్పముకూడా యొక బంధమేనని యుద్ఘాటించుచున్నది. ఆత్మస్థానమే మోక్షము కనుక ఆత్మైక్యము పొందుట మోక్షమనికదా యితరులంటున్నారు. ఇట్టి మోక్షము శాశ్వతజన్మ రాహిత్యము కల్గించదు. ఏలననగా ఆత్మతన స్థితి నుండి చ్యుతమై జీవేశ్వర జగద్రూపముగా పరిణమించుచున్నది. అట్లే మరల, మరల పరిణామము చెందునపుడు యిక శాశ్వత జన్మరాహిత్య మెక్కడిది ? కనుక మోక్షాసక్తికూడా నొక అప+ఈక్ష యే అని చెప్పవలెను.

కనుక మోక్షాపేక్ష సహితముగా అన్ని కోరికలు దూష్యములే అగుచున్నవి. గుర్తెరిగే తెలివి యున్నంతవరకు ఈ అపేక్షలు కల్గుచుండును. యీ గుర్తెరిగే జ్ఞానము (యెరుక) పరిపూర్ణ

పరబ్రహ్మమందు లేనేలేదు పుట్టనేలేదు. అని పరిపూర్ణ బోధవలన ఆరూఢత చెందనంతవరకు యిట్టి అపేక్షలు కలుగుచునే యుండును. ఏలననగా సకల సంకల్పములకు సర్వ అపేక్షలకు అత్యంత మూలము గుర్తెరిగే జ్ఞానమే. కనుకనే శ్రీ కృష్ణ దేశికేంద్రులు తమ కందపద్యములలో --

కం॥ ఏయాపేక్ష జనించిన
యాయాపేక్ష లెల్ల మాయయని తెలియదగున్
ఆయాసమౌను దానను
ఛీ యని యవి విడువదగును క్షేమముకొరకై ॥

అని చెప్పియున్నారు.

"గురుమూర్తి నిరపేక్షకాముడు" అని వర్ణింపబడినాడు. నిరపేక్షకామ మనగా తానుకోరదుగాని కోరకనే లభ్యమయ్యే సుఖము లనుభవించును అని అర్థము అట్టి స్థితి పురుషుడు దేనిని ఆశించడు.

ఈ అపేక్షలు మూడు ముఖ్యమైన తరగతులుగావిభజింపబడినవి - దారేషణ, ధనేషణ, పుత్రేషణ అని. అనగా కామినీ కాంచన సంతానములయందు రాగము గల్గియుండుట. రాగమనగా విపరీతమగు ప్రేమ, వానియందు నిజముగా లేని సుఖమున్నదని భ్రాంతిపడుటే అపేక్ష.

ఈ యీషణత్రయములే గాక కీర్తియందపేక్షచే కూడా నరులు బద్ధులగుచున్నారు. తాను మేధావి యనియో, పండితుడనియో, దానకర్ణుడనియో, గొప్ప ప్రజాసేవకుడనియో తనంతమంచివాడు మరొకడుండడనియో, లోకము తన్ను కీర్తించవలె సత్కారసన్మానపూజ లొనర్చవలెననే కీర్తికాముకత్వము కొందరికి గల్గియుండును.

ఈ కీర్తి కాంక్షయే ఒక కండూతి (దురద) వంటిది. గోకినకొద్దీ యింకనూ గోకవలెననియే యుండును. అట్లే పది మందిలో పేరు రావలెనని తనకు మాలిన ధర్మములు, నెర మెచ్చుల దాతృత్వములు చేయువారు కొందరు, తనకు సన్మానములు బిరుదు ప్రదానములు, వూరేగింపులు జరుగవలెనని ఆశించువారు కొందరు, తానుగతించినా తనపేరు శాశ్వతముగా వుండవలెనని గద్యపద్య రచనలుగావించి యెవరినో ఆశ్రయించి అచ్చువేయించుకొనువారు కొందరు, తటాక వనప్రతిష్ఠలు, ధర్మసత్ర దేవాలయ, విద్యాలయ, చికిత్సాలయ నిర్మాణములు చేయువారు కొందరు. వీరిలో పెక్కుమంది కీర్తికాములే. ఈ కీర్తికామనచే గుళ్ళో నాపరాయి వేయించిదానిపై తమ పేరు చెక్కించుకొందురు. ఇది రజోగుణ ప్రధాన లక్షణమైనది. కేవల లోకశ్రేయస్సు మాత్రమే దృష్టియందుంచుకొని ఫలాపేక్షలేక నిస్వార్థముగ చేయువారు అల్ప సంఖ్యాకులు మాత్రమే, వీరు సత్వగుణ ప్రధానులు.

పరిపూర్ణ భావజ్ఞులు, గుణాతీతులు. వీరు కర్తృత్వ అభిమానము లేకనే సకలకార్యములు చేతురు. పుణ్యఫలము గూడా ఆశించరు, ప్రజాహిత కార్యములు చేయుటలో తోడ్పడుదురు. వీరు కీర్తి కాములు కారు కనుక పేరు, కీర్తులకై పరితపించరు. పరిపూర్ణ పరబ్రహ్మమునందు గుర్తేలేదుగదా ! తాను సంపూర్ణముగా లేకుండా పోవలెననియే వీరి ఆశయము కదా! తనగుర్తు, లేక పేరు శాశ్వతముగా ప్రపంచమున నిల్చియుండవలెనని ఆసింతురా ? ఐతే వీరికి శిష్యులెందుకు కావలె ? బోధలు లేక ఉపన్యాసములు యెందుకు చేయ్యవలె ? వ్యాసములు గద్యపద్య గ్రంథరచనలు యెందుకు చేసి ప్రచారము చేయవలె ? అంటే శ్రీ శివరామ దీక్షిత దివ్యసందేశము ఆచంద్రార్క మవనిపై విలసిల్లి సంసారదుఃఖ సంతప్తులగు మానవులు జననమరణముల నుండి విముక్తులు అగుటకై కేవలము లోకశ్రేయస్సుకై వారు చేయు సేవాధర్మము మాత్రమే యని తెలియవలెను.

***

22. ఆత్మద్రోహము

ఆత్మ యనుమాట దేహము, మనస్సు, జీవుడు ప్రాణము, ప్రత్యగాత్మ, పరబ్రహ్మము అను అర్థములలో ప్రయోగింపబడుచు సందర్భమునుబట్టి అర్థము గ్రహింపబడుచున్నది. ద్రోహము అనగా కపటముచే కీడు కల్గించుట. ఇతరులకు కీడు చేసినపుడే సాధారణముగా ద్రోహమను మాట వర్తించును. సాధారణంగా తమకుతాము యెవరున్ను కీడు చేసుకొన గోరరు. తన జీవితమునందు విరక్తి గల్గి జీవితమే దుస్సహమై బాధలు భరించ లేని యొకానొక డెవడో తన ప్రాణము తానుతీసుకొనును. దీనినే ఆత్మహత్య అని అందురు. ఎవరి ప్రాణము వారికెంతో తీపి. తన యందు తన కెంతో ప్రేమ, తన సుఖముకొరకే ధనకనక వస్తు వాహమునములను గృహారామక్షేత్రాదులను, భార్యాబిడ్డలను అభిలషించు చున్నాడు. వానియందు ప్రేమ పెంచుకొనుచున్నాడు. తన సౌఖ్యమునకు అందేదైనా అడ్డు నిలచినచో దానియందలి ప్రేమను చంపుకొని దానిని తృణప్రాయముగా త్యజింపగల్గుచున్నాడు. సమస్త సంపదలను రోసి భార్యాబిడ్డలను వదలి ఐహిక సంసారమును త్యజించి అడవులపాలై ఆకులలములు తిను వైరాగ్యపరులు కూడ తమయందు తమకుగల ప్రేమను చంపుకొన్నారని చెప్ప వీలులేదు. ప్రాణధర్మమైన ఆకలిదప్పుల నివారణార్థము ఆకులలములు ఐనా తింటున్నంత కాలం

తమయందలి ప్రేమ వారికి నాశనము అయినట్లు చెప్పజాలము. మరిన్ని వారు ఏది కోరి భౌతిక వస్తు పరిత్యాగము చేసినవారు ? ఏదో ఆముష్మిక సుఖము ముందెన్నడో కల్గును అసుఖము అనుభవించవలెననే ఆశచేతనేగదా ! అపుడాసుఖము ననుభవించునదెవరు ? తానే, అదే ఆత్మ. అయితే అంత కరణము లేనిచో ఆయాత్మ ఆ సుఖ మెట్లనుభవించును ? కనుక ఆ సుఖమును సంపాదించుటకు శరీరము దాని ననుభంవిచుటకు అంతఃకరణము వుండి తీరవలసినదే. శరీరమును ఏదోరూపముగా నశింపచేయుట సులభసాధ్యమే. యీ స్థూల శరీరమును పడిపోవునట్లు చేయుట ఆత్మహత్యగా పేర్కొనబడుచున్నది. ప్రాణ మిస్థూల శరీరమునుండి శాశ్వతముగా బైటకి పోవునపుడు తన అంతఃకరణము (మనస్సు)ను కూడా తీసుకొని వేరొక శరీరములో ప్రవేశించుచున్నది. కనుక అంతఃకరణము లేక మనస్సునకు జన్మరాహిత్య మగువరకు నాశము లేదు., ఆత్మహత్య అనే పేరు ఆత్మ అనగా స్థూలదేహమనే అర్థములో వాడినపుడు మాత్రమే సరిపోగలదు.

ప్రాణము తీసుకొనుటయే ఆత్మహత్యగా వ్యవహరించుచున్నారు. అట్లే కృచ్ఛ్ర చాంద్రాయణాది వ్రతాదులచే స్థూలశరీరమును శుష్కింపచేయుటయు ఆత్మహింసయేయగును.

ఆత్మద్రోహ మననేమో విచారించవలసి యున్నది. దుష్ట సంకల్పములకు తావిచ్చి దుష్టకార్యము చేసి దుష్ట సంస్కారములను ఏర్పరచుకొనుట అంతఃకరణమును పాపపంకిల మొనర్చుట ఆత్మద్రోహమే యగును. ఏలననగా యీ అంతః కరణతోగూడిన ఆత్మ పాపాత్మయైన నీచయోని ప్రాప్తి చెందును. మనస్సు వాక్కు శరీరములను శుద్ధప్రవర్తనలో నుంచినపుడు ఆత్మకు శుద్ధాహార మిచ్చినవాడు అగుచున్నాడు.

ఈ త్రికరణములనూ శుద్ధముగా ప్రవర్తింపచేయనిచో ఆత్మకు అపరిశుద్ధాహారము పెట్టినవాడగుచున్నాడు. త్రికరణముల పరిశుద్ధతకు త్రివిధతపస్సులాచరించి త్రికరణశుద్ధిగా నుండి జీవితము సాగించుట ఆత్మనిర్ణయపద్ధతికి అనుకూలము. అట్లుగాక పరమాత్మ నిర్మిత విధానముగా ప్రవర్తింపకపోవుటయే ఆత్మద్రోహమగును. మానవుడై పుట్టినందుకు జనన మరణ రాహిత్యము సాధించవలసియున్నది. 'స్వయంబ్రహమయో భూత్వాతత్వరంచావలోకయేత్" అని చెప్పబడినట్లు తాను ముందుగా బ్రహ్మస్వరూప) డైననేగాని దానికి పరముగా పరిపూర్ణ బ్రహ్మమున్నది అని తెలియరాదు. అంతఃకరణశుద్ధి లేక ఆత్మస్వరూపమే తెలియబడదు. కనుక శుద్ధప్రవర్తన లేని వాడు ఆత్మద్రోహియే యనదగును.

"గురుద్రోహము చేసినవాడే గురుపుత్రుడు" అని కొందరు కొంటెగా నిగూఢముగా అంటూంటారు. వారి అభిప్రాయమేమి ? ఆత్మస్వరూపమే గురు స్వరూపము. దానినే లేని

యెరుకఅని పరిపూర్ణ భావఙ్ఞులు వాడతారు. "పరిపూర్ణ మొకటిదక్క నితరమైన ప్రపంచమంత తగ తెలియుము నీవెరుకేని మదిలోపల" అని శ్రీ కృష్ణదేశికేంద్రులు శెలవిచ్చినారు. ఆయెరుక లేనియెరుక అన్నారు. ఏలననగా పరిపూర్ణమందుగాని దానికన్యంగాగాని యెరుక లేనేలేదు. కాని ఆలేనెరుకయందే యీ జగజ్జీవేశ్వర నిర్మాణమంతయు జరిగినది. ఆజీవులు పునః పునః జనన మరణ క్లేశము అనుభవించుచు జన్మరాహిత్యమును ఆశించుచున్నారు. సృష్టికి మూలకారణమగు యీ లేనెరుక లేకపోయినగాని జన్మరాహిత్యము సిద్ధించదు. యీ లే నెరుకయే కల, శిష్యుని కల. ఆ కలలో శిష్యుడు నానాదుఃఖములలో తల్లడిల్లుచుండగా ఆ కలలోనే గురువుతోచి, శిష్యున కభయమిచ్చి యెరుక పరిపూర్ణముల నెరింగించి యెరుక భ్రాంతినుండి విడిపించుచున్నాడు కనుకనే "స్వప్న మధ్యే ఇయం బోధ" అన్నారు.

అట్లు కలనుండి మేల్కొ చెందినపుడు ఆ కలయందు నానాయిక్కట్లు పడిన శిష్యుడుగాని ఆ కలలో వచ్చి పరిపూర్ణబోధచెప్పి భ్రాంతిరహితము చేసిన గురువుగాని, అయన బోధగాని ఏమియు లేవు. అపుడు గురు శిష్యోభయ రహితమైపోవుచున్నది. అట్టి ఆరూఢస్థితియందు ఇక గురువు లేడు శిష్యుడులేడు - వున్న పరిపూర్ణమునందు గురుస్వరూపము యేమీ లేనేలేదని నిరసించి ఆరూఢత చెందుటయే గురుద్రోహము. కనుక ఇట్టి గురుద్రోహము చేసినవాడే గురు పుత్రుడు అన్నారు.

ఇట్లనుటలో పరిపూర్ణబోధ నెరిగిన పిమ్మట ఇక గురువును పూర్తిగా విడచివేయవలెనని కొందరు అభిప్రాయ పడితే అంతకంటే ఘోరపాప మింకొకటిలేదు. వారి దురభిప్రాయం నిలబెట్టుటకై "పరిపూర్ణబోధ తెలిపే పర్యంతముసేవ చేసి బహునమ్మికగా తరువాతను గురుమూర్తిని మరి కన్నుల గనని వాని మార్గము ఛీఛీ" అని కృష్ణదేశికేంద్రులు వ్రాస్తే "గనని" అనుచోట "గనిన" అని దిద్ది చదువుట ప్రారంభించినారు కొందరు (ప్రబుద్ధులు) బుద్ధిమంతులు. పాపము శమించుగాక.

గురువు సాక్షాత్పరబ్రహ్మస్వరూపుడే అను పరమ లక్ష్యముతో జీవితాంతమూ గురువును సేవించుచుండవలెను. స్వరూపనిశ్చయము గావించుటకు పరిపూర్ణబోధ తెలుపుటకు ఎరుకను విడిపించుటకు పిదప జీవనయాత్ర సౌష్టవముగా సాగించునత్తాఇచ్చుటకు గురుమూర్తియే పట్టుగొమ్మ, కట్టకడపటి శరణాలయము. ఎట్టి పరిస్థితులలోనూ గురువును విడనాడరాదు; విడనాడినచో అది గురుద్రోహమే యగును. "నాకు ద్వాదశాంత మయినది. గురుని కలిసినచో అది యెరుకను తిరిగి చేపట్టుట యగును." అని అపోహ చెందినవారు హీనులు. ఎరుకలేనేలేదు. నేనె ఎట్లునడిచినా బాధలేదనుకొనువారు ఆత్మవంచకులు, తమకు తావే కీడు కలిగించుకొనుచున్నారు. గనుక వారే ఆత్మద్రోహులు.

23. యానత్రయము

యాన మనగా ప్రయాణము. నేడందరును భూ, జల, వ్యోమమార్గములలో రైళ్ళమీద, స్టీమర్లమీద, విమానముల మీద, మూడు విధములుగా చేయు ప్రయాణములగూర్చి గాదీరచన. యివన్నీ స్థూల శరీరయుతముగా చేయు ప్రయాణములు. శరీరమును యిక్కడనే వదిలి జీవుడు ప్రాణమను వాహనము నెక్కి చేయు ప్రయాణమును గూర్చి మనము తెలిసికొన వలసియున్నది. ఈ ప్రయాణమునే వ్యుత్క్రాంతియనీ, మహా ప్రస్థానమనిగూడ యంటారు. ఇది మూడు విధములుగా యున్నది.

1) కర్మయానము 2) పితృయానము 3) దేవయానము

1. కర్మయానము : ఈషణత్రయములకు లోనై కేవల ప్రాపంచక భోగభాగ్యముల యందే యాసక్తుడై పుణ్యపాప రూపములుగా మిశ్రమకర్మ యొనర్చుచు మిగతా పశుపక్షి, క్రిమి కీటకాదులవలెనే జీవితమును ముగించుకొన్నవాడే యగును. వాని మరణానంతర ప్రయాణమెంత వరకు ? అంటే అట్టివాడే ఒక జన్మనుంచి మరొక జన్మకు కర్మాను సారముగా పదే పదే పుట్టుచు చచ్చుచూ 84 లక్షల జీవరాసులయందు జన్మలెత్తు చుండును. ఏదో శరీరమును దాల్చి ఆ శరీర సంబంధమగు సుఖ దుఃఖములను అనుభవించుచు లేశమైనా పారమార్థిక చింతనలేక ఆహార నిద్రా భయ మైథునముల కొరకే తాపత్రయ పడుతూ జీవితముల వెళ్ళబుచ్చుకొను చుండును. చినిగిన బట్టలను వదలి క్రొత్త బట్టలను ధరించు రీతిని శిథిలమైన శరీరములు వదలి క్రొత్త శరీరములను గైకొంటాడని భగవద్గీత చెప్పుచున్నది. కనుక శరీరము నుండి మరొక శరీరమునకు 'తృణ - జలూక' అనగా 'గడ్డి - పురుగు' మాదిరిగా యెడతెగని ప్రాయాణములు సాగించుచునే యుండును. కర్మలు చేయుచు వాని ఫలితము లనుభవించుటకు జన్మ లెత్తుచూ ఆసులో కొయ్యవలె మరణ జననములమధ్య నిరంతరము సంచరించును. ఇదియే కర్మయానము. ఇది నిజముగా ప్రయాణమేకాదు. తన యింట్లోనే ఒక గదిలో నుంచి వేరొక గదిలోనికి రాకపోకలు సాగించినట్లే. జాగ్రదా ద్యవస్థల వలెనే వారికి జనన మరణములు కూడ జరుగుచునే యుండును.

2. పితృయానము :- దీనికే కృష్ణగతియనీ, ధూమాధి మార్గమనీ కూడ పేరు. పితృలుండు చంద్రలోకము వరకూ చేయు ప్రయాణము కనుక పితృయానమని పేరు వచ్చినది. కృష్ణగతి అనగా నల్లని మార్గము. ధూమమనగా పొగ. ధూమమార్గము అనగా పొగలో ప్రయాణము అని అర్థము వచ్చుచున్నది. యిందుకు వ్యతిరేకముగా దేవయానమునకు శుక్లగతి లేక అర్చిరాది మార్గము అని పేర్లు పెట్టబడినవి. శుక్లగతి అనుటలో తెల్లని మార్గమని, అర్చిస్సు అనగా జ్యోతి

లేక ప్రకాశము గనుక అర్చిరాది మార్గ మనగా వెలుగుబాట యని అర్థము వచ్చుచున్నది. కనుక యీ శుక్ల కృష్ణములు లేక జ్యోతి ర్ధూమములు అను రెంటికి అగ్ని ఆధారముగా నున్నది. అగ్ని ప్రకాశముగానుండునపుడు జ్యోతి రూపముగా వెలుగుచుండును. మందముగా నున్నపుడు ధూమావృతమై అనగా పొగచే కప్పబడినదై నల్లగా యుండును. మరియు అగ్ని భూతమునకు జ్ఞానశక్తి చెప్పబడినది. కనుక ప్రకాశాప్రకాశములుగా లేక జ్ఞానాజ్ఞానములుగా యీ మార్గములున్నవి అని తెలుచున్నది. అంటే మరణకాలమునందు ఏ ప్రవృత్తిచే మరణించునో అట్టి మార్గమునే అనుసరించి ప్రయాణమున్నూ జరుగును. కనకనే "యా అంతే మతి స్సా గతిః" అనగా అవసానకాలమున మనస్సు దేనియందు లగ్నమగునో తదనుగుణ్యముగా మాత్రమే యా జీవి ప్రయాణము చేయును అని చెప్పబడినది.

మరణ సమయమున వాతము కమ్మును అనగా అగ్ని యొక్క అనుగ్రహము సన్నగిల్లును. అందుచేతనే శరీరభాగములు చల్లబడును. కఫ వాత పిత్తములు కంఠావరోధమును కల్గించును. జీవిత కాలములో తాను చేసిన సాధన విస్మృతి చెందును. మనస్సు మలినరూపమై స్తబ్ధత నొందును. అట్టి స్థితిలో దైవచింతన యెట్లు సమకూడును ? అయినను చేసిన యోగసాధనలు లేదా యజ్ఞయాగాది కామ్యకర్మలు కేవలం వృధాగా పోనేరవు. కనుక అట్టి జీవి చంద్రమండలము వరకు ప్రాయాణముసాగించి, తా జేసిన పుణ్య ఫలములకు దగిన సుఖ రూప భోగము లనుభవించి అపుణ్యఫలము క్షీణించగా విదవ, మేఘమండలములో జలబిందువు నాశ్రయించి సస్యాదులయందు పడి, క్రమముగా దానిని భుజించిన తండ్రియొక్క శుక్లబిందువునందు జేరి, తిరిగి శరీర పరిగ్రహణము కావించును. జీవితములో నతడు కామ్యకర్మలను జేసెనేగాని నిష్కామ కర్మలను చేసి యుండలేదు. కనుక ఆ కర్మలకు తగిన ఆముష్మిక సుఖము (లోకాంతరముల యందలీ సుఖము) ననుభవించ గల్గినాడు. అనంతరము తిరిగి కర్మ యానమును చెంద వలసినవాడే అగుచున్నాడు.

అట్టివాడు తప్పక దక్షిణాయనములో కృష్ణ పక్షమునందు రాత్రి కాలమున మరణించుననీ, లేక అకాలములో మరణించువారు చంద్రలోకమును దాటి పోజాలరని చెప్పుట విజ్ఞాన దృష్టికాదు. కామ్య కర్మల నొనర్చినవారి ప్రయాణమంత సుఖమైనది కాదు. చీకటిమార్గము అని అనవచ్చును.

3. దేవయానము : జ్ఞాన మార్గము ననుసరించి ఆత్మ స్వరూప వస్తు నిశ్చయ జ్ఞానముజెందినవారు నిష్కామ కర్మనే చేతురు. అంతయు ఆత్మ స్వరూపముగా నుండు వారికి దేనియందు కోరిక యుండును ? కర్తృత్వ రహితబుద్ధితో లోక శ్రేయస్సు కొరకే వారు కర్మ లాచరింతురు. "నిష్కామేనైవ భోక్తవ్యం సదా సంతుష్ట మానసః" అని చెప్పబడిన రీతిగా ఎట్టి కోరికలు లేక సదా సంతుష్ట మానసులై వుందురు. వారి మార్గము జీవించినను మరణించినను

ఒక్క తీరే, అనగా వారెప్పుడు నడచినను తేజోమార్గముననే లేక వెలుగుబాటలోనే. అట్టివా రుత్తరాయణములో శుక్ల పక్షమునందు పగటివేళ శరీర పరిత్యాగము చేసెదరని కానీ ఆ విధముగా మరణించిన వారే మోక్షము జెందెదరని యనుటయు న్యాయముకాదు. జ్ఞానాగ్నిచే సర్వకర్మలను దహించినవాడు కనుక ఏ సంస్కారమును అతని అంతఃకరణమున నుండదు. జీవితమంతయు ఏ స్వరూప నిశ్చయము నందుండెనో ఆ స్థితియే మరణ కాలమునందునూ అతనిని వీడి యుండదు, కనుక అతడు సూర్యమండల అర్చిరాది మార్గమును కూడ భేదించుకొని మోక్షస్థానమును చెందగలడు. ఇదియే జ్ఞానుల మార్గము. ఆ మార్గమున అగ్ని దేవత, అహర్దేవత, శుక్లపక్షదేవత యుత్తరాయణ దేవత లుండవచ్చును. అంటే వారందరునూ సూర్యస్థానీయులే తేజోరూపులే. కనుక అట్టి తేజోమయమార్గము అర్చిరాది మార్గము అని నిర్ణయింపబడినది కనుక కర్మ యోగ మార్గములందు కృషిచేసి మరణించినవారు చీకటిరాత్రి ప్రయాణము వంటిదగు ధూమమార్గము చెంది పునారవృత్తి పొందెదరు. కేవలము జ్ఞానమం దారూఢులై సిద్ధిపొందినవారలు పగటి పూట ప్రయాణమువంటిదగు అర్చిరాది మార్గములో (దేవ యానములో) పయనించి పునరావృత్తి పొందెదరు.

మరి పరిపూర్ణ భావజ్ఞునిదే మార్గము ? అనగా ఏ మార్గమున అతని జీవి పోవును ? అతనికి పోకడే లేదు. కనుక పోవు మార్గమంటూ ఒకటి లేదు. సహజామనస్కస్థితి యందుండును గనుక జీవత్వమాతడు అధిగమించియే వున్నాడు. చమురు లేని దీపమారిపోయి ఎక్కడికైనను పోవునా, అట్లే వాసనా క్షయ మనో నాశనముల సాధించిన పిమ్మట యిక యేది ఎక్కడికి పోవలెను? కనుకపరిపూర్ణుని వ్యుత్క్రాంతియే లేదు. ఎప్పుడెట్లు శరీరపతనమైనా ఏమీ లేదు.

***

24. ఆత్మనస్తు కామాయవిత్తం ప్రియం భవతి

విత్తమనగా ధనము, ధనేషణ, దారేషణ, పుత్రేషణ అను ఈ షణత్రయ బద్ధుడై మానవుడు చేయరాని పనులు చేయుట కెంతమాత్రం వెనుకాడుటలేదు. ఈషణ మనగా ప్రేమ. ఆ ఈషణత్రయములో ధనేషణ అత్యంత బలీయము కనుక ప్రధాన బంధకారణమగుచున్నది. ధనమందలి ప్రేమచే భార్యా పుత్రాదులను సంహరించిన దుర్మార్గులను కూడా యెందరినో మనం చూస్తున్నాము. కట్టుకొన్న భార్యకన్న కన్న కొడుకుకన్న యీ ధనము యింత ప్రేమాస్పద మగుటకు కారణమ మేమి ?

"ధనమూల మిదం జగత్" అని ఆర్యోక్తి పుట్టి యున్నది. కారణమేమి ? ధనముతో సుఖ సాధనముల నెన్నిటినైన సంపాదించవచ్చును. సుఖము లెన్ని చూచినా, శబ్ద, స్పర్శ, రూప, రస, గంధములను పంచ విధములుగా నుండి జ్ఞానేంద్రియ గ్రాహ్యములుగా నున్నవి.

సరస, సంగీత, వీణా, వేణు, తాళ, మృదంగాది ధ్వన్యాత్మకములుగా, దశవిధ నాదాత్మకమగు శబ్దముచే ఆనందము కలుగుచున్నది. మంద మలయానిలము, శారద యామినీ చంద్ర చంద్రికలు, పూలపాన్పులు, హంసతూలికాది మృదులశయ్యలు, చందన శైత్యోపచారములు సుందర విలాసినీ గాఢ పరిష్వంగాది సుఖములు, స్పర్శ సంబంధములైన త్వగింద్రియముచే తెలియబడుచున్నవి. నదీనద వన పర్వత, సముద్రాది, ప్రకృతి సౌందర్యము, లాస్య నృత్య నాట్యాది విన్యాస సౌందర్యము నవయౌవ్వన రూపలావణ్యాది వనితా సౌందర్యము యిత్యాదులన్నియు రూపసంబంధములై నేత్రేంద్రియ గ్రాహ్యముగా నున్నవి. పంచభక్ష్యాది పరమాన్నాలు షడ్రసరూపముగా జిహ్వేంద్రియముచే గ్రహింప బడుతున్నవి. నానావిధ పరిమళ ద్రవ్యములు మనోహర పుష్పాదులవలన కలుగు సౌగంధమును ఘ్రాణేంద్రియము గుర్తించుచున్నది. ఆయా జ్ఞానేంద్రియముల ద్వారా ఆయా విషయములను మనస్సే గుర్తించుచున్నది. కనుక ఆ మనస్సు అస్వస్థతచే వైకల్యము చెందినా, అన్యథాయత్తమైనా, మూర్ఛ సుషుప్త్యాది అవస్థలు చెందినా, మనస్సా విషయాదులను గ్రహించుటయే లేదు. గ్రహించినా, ఆయా విషయములు మనస్సు కేవిధమైన సుఖమున్ను యీయజాలకున్నవి. మనస్సుకదా సుఖదుఃఖానుభవము చెందునది కనుక మనుస్సు స్వాధీనమందుంచుకొన్నవానికి నరకము కూడ స్వర్గతుల్యము కాగలదు. లేక మనోవ్యాధి గలవానికి స్వర్గమే నరక రూప మగుచున్నది. కనుకనే ఆ మనస్సు స్వాధీనము చేసుకొనుట అనేక సాధనలు నిర్ణయింపబడి యున్నవి.

ధనమువలన సుఖసాధనము లెన్నేని మానవుడు చేకూర్చుకొనగలడు కాని సుఖమును తప్పక సంపాదించుట మాత్రము చాలా సందేహాస్పదమే కదా! ధనము వలన వస్త్ర, వస్తు, వాహనాది సంపత్తియే కాదు; రాజ్యాధిపత్యముగూడ సంపాదించ వచ్చును. అధికారము, కీర్తి మొదలగున వన్నియు మానవునికి హస్తగతము కావచ్చును. ధనము వెచ్చించి ఎన్ని తినుబండారములైనను సంపాదించగలడు. కాని అవి తిని జీర్ణించుకొను ఆకలి ఆరోగ్యము సంపాదించలేడు. హంసతూలికాదులను ఖరీదు చేయగలడు కాని సుఖనిద్రను ఖరీదు చేయగలడా! గ్రంథములను కొనగలడు గాని జ్ఞాన వైరాగ్యములను ఖరీదు చేయగలడా ? వినోద కాలక్షేపములకు ధనము వెచ్చించగలడేగాని మనశ్శాంతిని ఖరీదు చేయగలడా ? ధనము వెచ్చించి స్త్రీలను పొందగలడేగాని వారి పవిత్రప్రేమను యెన్నడైనా పొందగలడా . అందమైన కళ్లద్దాలు కొనగలడేగాని, నేత్రదృష్టిని కొనగలడా ? స్తోత్ర పాఠకులను, వందిమాగధులను కొనగలడేగాని నిజమైన మిత్రుని యొక్క

నినైన సంపాదించ గలడా ? కనుక మణిమయ భూషణములను, చీనిచీనాంబరములను ఖరీదు చేయవచ్చునే గాని సహజ సౌందర్యమును ఖరీదు చేయనగునా ? పై వానిలో ఏదైన తాత్కాలిక సుఖానుభూతిని యివ్వజాలినా అది శాశ్వతముగా నిల్వగలదా ? ధనమున్నచో కొండమీద కోతిని దింపవచ్చునేమోగాని కోతిగంతులు వైచే మనో వానరమును ముహూర్తకాలమైన స్థిమితముగా నిలుపుటకు సాధ్యమగునా ?

సుఖ సాధనములను కొన్నవానివలన సుఖ మేల చిక్కుట లేదు ? నిజముగా ఆ వస్తుసంపదయం దట్టి సుఖము లేకపోవుటయే కారణము. ఐతే, మరి సుఖము యెక్కడ నున్నది? తనయందే ! ఆనందస్వరూపమని వర్ణింపబడే తన ఆత్మయందేకలదు. ఆ ఆత్మయొక్క సహజానందము మనసు నందు ప్రతిబింబిస్తేనే నిజమగు సుఖము సాధ్యము కాగలదు. కాని ధనముచే ఏమాత్రము సాధ్యము కాదనుట నిర్వివాదాంశము.

ఐననూ, ప్రతివాడును ధనార్జనకై యెన్ని అకార్య కరణములను చేయుచున్నాడు! జూదము అన్యాయము మోసము, దొంగతనము చివరకు అన్యజన ప్రాణాపహరణము చేయుటకుకూడ వెనుదీయుటలేదు. తనకును, తనమీదాధార పడినవారికిని నిత్యజీవితావసరములను సమకూర్చుటకు ధనము అవసరమే. ఆ కొద్దిపాటి ధనమును న్యాయమార్గమున సంపాదించలేడా?

మానవుని ఈ ఆశకు కారణమేమి ? గాఢతరమైన వ్యష్టి అజ్ఞానమే కారణము. ధనము కూడబెట్టినచో అధికాధిక సుఖములు బడయగలుగుదుననీ వానిని శాశ్వతముగ నిలుపుకొనుటకు మరింత ధనముకావలెననీ, కోరుచూ మానవుడధికాధిక ధనప్రాప్తిమార్గము లన్వేషించుచున్నాడు.

అసలు మానవుడీ సుఖములకై ఎందుకు ప్రాకులాడవలెను ? అని జిజ్ఞాస బయలుదేరు చున్నది. జీవోపాధుల యుత్పత్తికి పరమాత్మయే మూలకారణము. అది సచ్చిదానంద లక్షణములు గలది. అయిననూ అనాద్యవిద్యా సంసర్గ దోషకారణమున, జీవరూప పరిణామముచెంది మానవాకృతి కూడ వహించినది అనంత విశాల గంభీరత్వముగల సముద్ర జలములు సూర్యుని యుష్ణోగ్రతచే మేఘములై, పిదప వర్ష రూపమున అవతరించి, నదీ నద రూపములై యువ్వెత్తుగా పొంగిపొరలి ఆ సముద్రముఖముగానే ప్రవహించునట్లు తన తొలిరూపమగు ఆ అనంత ఆనందసాగరము చేరువరకు మానవుడు అధికాధిక సుఖ ప్రాప్తికై అల్లాడుచునే యున్నాడు.

ధనము సుఖకారణమగుటలేదు సరిగదా, బహుళ దుఃఖకారకమై యున్నది. ఎట్లనగా ధనము లేకున్న దుఃఖము; ఆర్జనయందు దుఃఖము; రక్షణయందు దుఃఖము; రాజులు, దొంగలు

ఋణగ్రహీతలు హరింతురేమోయను దుఃఖము; తన ధనముకొరకై తన పుత్ర మిత్ర కళత్రాదులే ఎట్టి తంత్రములు పన్నుచున్నారోయనీ తన ప్రాణమునే హరింతురేమోయనీ విపరీత భయ దుఃఖములు; పరహస్త గతమైన తన ధనము తిరిగి పొందుటలో పడు అనంత దుఃఖములు; తారసిల్లుచున్నవి. ధనము, కన్నతల్లితో సహితం శత్రుత్వము తెచ్చుచున్నది. కనుకనే "మాతాపుత్ర విరోధాయ, హిరణ్యాయ నమోనమః" అన్నారు.

మరొక ముఖ్య విషయమును విమర్శించి తెలుసుకొన వలసియున్నది. అసలు మానవుడు దేనిని ప్రేమించినా ఎందుకొరకు ప్రేమించుచున్నాడు ? ప్రేమించబడేదాని యందు, ఏదో ప్రేమించదగిన మంచి యుండుటచేత. ఆ వస్తువుకొరకే దానిని ప్రేమిస్తున్నాడా ? లేక తన స్వార్థము కొరకు తన ఆనందముకొరకు మాత్రమే దానిని ప్రేమిస్తున్నాడా ? తన ఆనందము కొరకే ప్రేమిస్తున్నాడని తెలుస్తోంది. కాని, నా స్వార్థముకొరకు నేను ప్రేమించుట లేదని కొందరనుకోవచ్చును. ఉదాహరణగా కురూపియై, మూగ, గ్రుడ్డి, చెవుడు, కుంటి వగయిరాలు ఉండిన బిడ్డను ప్రేమించుటలేదా ? అంటే అది జాలిగాని, ప్రేమకాదు. ప్రేమయున్నా అది స్వల్పం. ఎపుడు ఎవరు దేనిని ఎందుకు ప్రేమించినా, అట్లు ప్రేమించుటలోకూడా తమకొక ఆనందముండుట చేతనే ప్రేమించుచున్నారు. కాని తనకు దుఃఖము కల్గించేదానిని ఎవరైనా ప్రేమింతురా ? ప్రేమిస్తే వారిని కరడుగట్టిన అజ్ఞానులనియే అనాలి. బహుళ దుఃఖప్రదమైన ధనమును ప్రేమించే దురాశాపరులను ఏమనాలి ? ఎంత చదివినా, ఎంత నేర్చినా స్వార్థ పరత్వము కూడదని ఎన్ని యుపన్యాసములిచ్చినా, ధనమునందలి ప్రేమ (ధనేషణ) వదలలేకున్నారు. క్షణికమగు కించిన్మాత్రమగు విషయానంద మేదో సమకూర్చు చుండుటచే ధనమువలన కలిగే దుఃఖమును విస్మరించి, దాని వెంట పరుగిడుచున్నారు. తన యెడల తనకు ప్రేమ యుండుట చేతనే తన కేకించిత్తో సుఖముకలుగుటకు తోడ్పడే ధనము తనకు ప్రియతమ మగుచున్నది.

యిదే విషయమును బృహదారణ్యకోపనిషత్ విపుల పరచి చెప్పుచున్నది.

ప్రేమయే భగవంతుడు, భగవంతుడే ప్రేమ అనే విషయం హైందవులకేమీ క్రొత్తగాదు. "ఆత్మానమేవ ప్రియ ముపాసీత" "ప్రియమి త్యుపాసీత" అని ప్రేమయే ఆత్మగా యుపాసింపుమని యీ యుపనిషత్ యుద్బోధించుచున్నది. నాయందలి 'నేను' కూడా ఆత్మస్వరూపమే. యీ నేనుయందలి ప్రేమచేతనే నా భార్యా, నా పుత్రులు, నా విత్తము, నా సర్వము, నాకు ప్రియమగుచున్నది. ఈ నేను యొక్క లేక 'నా' యొక్క పరిమాణమెంత ? "యావద్విత్తం, తావ దాత్మా" అనగా నీ విత్తము అనగా నీ ధన కనక వస్తు వాహనాది సంపత్తి ఎంతయున్నదో నీ ఆత్మ

అంత వ్యాప్తమన్నమాట. కొబ్బరితోటలు విరివిగా కల్గియున్న ఒక ఆసామీ ఒక పండితునిచూచి 'నా ఆత్మ ఎక్కడున్నది"? అని ప్రశ్నిస్తే, "నీ ఆత్మ కొబ్బరిచెట్లు కాయలో వుంది" అని కొంచెం ఎగతాళిగా జవాబు చెప్పినాడట ! కాని అది ఎంతో పరమసత్యము. "నేను, నాది" అని నీయందూ, నీ వస్తు వాహనాదులయందు నీ ప్రేమ వ్యాప్తమైయున్నప్పుడు ప్రేమయే స్వరూపంగాగల నీయాత్మ ఆయా వస్తువులయందున్నట్లేగదా ! కనుకనే "యావద్విత్తం తావదాత్మా" అన్న శ్రుత్యర్థం తెలుపుతోంది.

"నాయందే నాకు ప్రేమలేనిచో నాకు దేనియందునూ ప్రేమ యుండజాలదుగదా!" అను అన్వయ వ్యతిరేకయుక్తిచే ఆలోచించినచో నాయందు నాకు ప్రేమ యుండబట్టే నాకు సర్వము ప్రియమగుచున్నది. అని సుస్పష్టముగా ఋజువగుచున్నది. యీ విషయమునే బృహదారణ్య శ్రుతి స్పష్టపరచుచున్నది. "ఆత్మవస్తుకామాయ పతిః ప్రియాభవతి" "ఆత్మనస్తుకామాయ జాయా ప్రియాభవతి" "ఆత్మవస్తు కామాయ పుత్రాః ప్రియాభవన్తి" "ఆత్మవస్తు కామాయ విత్తం ప్రియం భవతి" "ఆత్మవస్తుకామాయ సర్వం ప్రియం భవతి" అంటూ యుపనిషత్ చెప్పుచున్నది.

కనుక తనకు తనయందు ప్రేమ యున్నంతకాలము ధనమునందలి ప్రేమ (ధనేషణ) పోజాలదు. కనుక స్వ+అర్థము = స్వార్థము = నేనను వస్తువు స్వార్థరహితమనగా నేనను వస్తువస్తు యొక్క రహితము. అట్టి స్వార్థరహితమునందు గాని ధనేషణ పోజాలదు అని పరిపూర్ణభావజ్ఞుల నిర్ణయము. కనుకనే 'నేను' అనుదాని మూలమును గురుముఖతః వస్తు నిశ్చయపూర్వకముగా గుర్తెరిగి "రోసితి మోక్షాద్యపేక్ష" అని దానియందు వైరాగ్యము కల్గియుండుటే కర్తవ్యము.

***

25. "ఏకోశమందు లేదు"

'వానికి భయమనేది ఏకోశమందూ లేదు' అనియో, "దానికి సిగ్గనేది ఏకోశమందూ లేదు' ' అనియో మనం వాడచునే వున్నాము. ఏకోశమందూ లేదంటే ఈషణ్మాత్రమూ, ఏకించిత్తూకూడా లేదు అనే అర్థములో మనం వాడుచున్నాము. కాని కోశము అనే శబ్దార్థమును మనసులో నుంచుకొని మాటలాడడంలేదు. కోశమనగా కత్తి ఒర, పుస్తకము, ఖజానా మొదలైన అనేకార్థములున్నవి. కాని కోశశబ్దము వేదాంతశాస్త్రములో ఒక ప్రత్యేకార్థములో వాడబడినది. ఆత్మకావరణ రూపముగా కప్పియున్నవేవో వానిని కోశములన్నారు. అన్నమయ కోశము, ప్రాణమయ కోశము, మనోమయ కోశము, విజ్ఞానమయ కోశము, ఆనందమయ కోశములనే పంచకోశముల యొక్క ఆవరణలలోపల ఆత్మ అంతరాంతరముగా నున్నదన్నారు. అనగా అన్నమయ

కోశములోపల ప్రాణమయ కోశము, ప్రాణమయ కోశము లోపల మనోమయ కోశము, మనోమయ కోశములోపల విజ్ఞానమయ కోశము, విజ్ఞానమయ కోశములోపల ఆనందమయ కోశము నున్నవనియు దానిలోపలనున్నది ఆత్మయనియు కొందరన్నారు. ఆత్మయనే దానిని కూడా హిరణ్మయ కోశమని కొందరు వాడారు. "షట్కోశిక మిదం స్వరం" "హిరణ్మయే పరే కోశే విరజం బ్రహ్మనిష్కలం" అంతా ఆరుకోశములుగా నున్నదనీ అందు చివరికోశం హిరణ్మయ కోశమని శ్రుతులు దానిని వుద్ఘాటించియేయున్నవి. దానిని బట్టి కోశములు అయిదుమాత్రమే కాదు షట్కోశములు అని అంగీకరించక తప్పదు.

ఆత్మ యీ కోశములన్నిటికీ అంతరాంతరముగా నున్నదని చెప్పినవారు ప్రారంభకులకు సులువుగా అర్ధము కాగలందులకే అట్లు చెప్పినారనవలసివస్తోంది. అట్లు చెప్పినచో ఆత్మకు ఏకదేశీయత ఏర్పడుచున్నది. కనుక అట్లు చెప్పుట సరికాదు. ఐతే మరెట్లు చెప్పాలి ? ఒక కోశము కంటె నొకటి వుత్తరోత్తరా సూక్ష్మముగా నున్నవని, అందాత్మ సూక్ష్మాతి సూక్ష్మ మహాసూక్ష్మముగా నున్నదనీ అంటే యీ విప్రతిపత్తి యుండదు.అంటే "అణోరణీయాన్" అని ఆత్మకొనియాడదగి యున్నదన్నమాట. అనగా పరమాణువు కంటెను మహాసూక్ష్మమై యున్నదన్నమాట జీవోపాధులన్నిటి యందునుండు ఆత్మ యీవిధంగా మహాసూక్ష్మముగా వున్నది. నేనెవరు అని ఆత్మాన్వేషణ చేసిన వారికి చిక్కుచున్నది. ఇదంతా పిండాండంలో వెతుకులాట, చీకట్లో చిందులాట ఇట్లుగాక బ్రహ్మాండమందున్న సమిష్టి పంచకోశములను దాటినపుడే "మహతో మహీయాన్" మహత్పదార్థముకంటెను మహత్పదార్థమై అనగా అన్నిటికి గొప్పదియగు గురుస్వరూపము తెలియబడును.

పిండాండమందు షట్కోశములు బ్రహ్మాండమందు సమిష్టి షట్కోశములు. మొత్తం పన్నెండుకోశముల్లు ఏ కోశమందునూ లేదు అంటే ఈ 12 కోశములలో ఎక్కడా ఎంత సూక్ష్మపరిశోధన చేసినా లేదని యర్థం. ఈ పన్నెండూ ఏమీలేదు, ఈ పన్నెండింటా ఏమీ లేదనేటందుకే పరిపూర్ణ బోధకుల ద్వాదశి. ఈ 12 కోశములలోనూ వున్నదేది ? ఈ 12 కోశములలో "ఏకోశమందూ లేనిదేది ?" అని విచారించి చూడాలి.

ముందు "అణోరణీయాన్" అని చెప్పబడిన విధంగా సూక్ష్మాతి సూక్ష్మంగా వున్నదేది ? ఆత్మయన్నారు వేదాంతులు. పరమాణు వన్నారు వైశేషికులు. నేటి శాస్త్రజ్ఞులు ఆ పరమాణువు శోధించి అందు నిగూఢంగా ఎలెక్ట్రానులు ప్రోటానులు, న్యూట్రానులు అనేవి వున్నాయి అనీ, అవి మహావేగంగా నిరంతర చలనశీలములై గిర్రున తిరుగుచుండునని కనిపెట్టారు. ఆ పరమాణువునుకూడా బ్రద్దలుకొట్టి సర్వనాశనకారియగు మహాశక్తిని ఆవిష్కరింప చేస్తున్నారు. కనుక శాస్త్రజ్ఞుల యీ సూక్ష్మాతి సూక్ష్మ పరిశోధనవల్ల నేమి తేలినది ? పిండాండంలో హిరణ్మయ కోశంతో సహ యేకోశంలో చూచినా చలనంతప్ప అచల స్థితి లేనేలేదని తేలినది.

పోనీ "మహతో మహీయాన్" అని బ్రహ్మాండము కంటె పెద్దదై, సమష్టి హిరణ్మయ కోశమని చెప్పదగిన యాఅధిష్ఠాన బ్రహ్మమువరకూగల సమష్టి. కోశములన్నీ వెదకిచూస్తే అన్ని కోశములందూ నున్న దేది ? ఏకోశ మందునూ లేని దేది ? పంచ భూతములందూ, నవగ్రహ నక్షత్రాదులయందు సమస్త దృశ్యాదృశ్య లోకములయందు చలనమే గానవస్తుంది. ఈ అన్ని కోశములలోనూ, ఏకోశ మందూ లేనిది" అచలతత్వము. సృష్టియొక్క పూర్వా పరములయందు అధిష్ఠాన చేతన బ్రహ్మము అచలస్థితిలో లేదా ? అంటే, వున్నది. అది కేవలాచలస్థితి కాదు జాగ్రదావస్థలో యెన్నో చలనాత్మక వ్యవహారములు చేసినవానికి గాఢసుషుప్తిలో నున్న అచలస్థితి వంటిదే అది. చలనము నంతను గర్భీకృత మొనర్చుకొనియున్నది. సృష్టిసంకల్పమే చలనము. దానికి ఈ చలాచలస్థితులు రెండూ వున్నవి అని చెప్పవచ్చునేగాని దానికి శాశ్వతమైన కేవలాచలస్థితి యెన్నడూ చెప్పరాదు, కనుక వ్యష్టి సమష్టి రూపాత్మక మగు యీద్వాదశ కోశములలో అచలస్థితి అనేది ఏకోశానాలేదు. పరిపూర్ణ పరబ్రహ్మ మొక్కటే కేవలాచలస్థితి కలది. ఐతే ఆ పరిపూర్ణ పరబ్రహ్మము సకల దేశముల యందు, సకలకాలము యందు, సకల వస్తువులయందు నిండి నిబిడీకృతమైయుంటే దాని అచలస్థితి ఆ పన్నెండు కోశాలలో ఏకోశమందూ లేదంటే యెట్లా ? అని శంక రావచ్చు. సూదిమోపుటకే సందులేని పరిపూర్ణ మందు ఎరుకకు స్థానమే లేదు. ఎరుకయొక్క ద్వాదశ కోశములూ పరిపూర్ణమందు లేవు మరిన్నిలేని కోశములలో పరిపూర్ణస్థితి "ఏకోశ మందూ లేదు."

***

26. నీ వచలుడవా ?

నీయందు (పిండాండ దృష్ట్యా) దేహము, మనస్సు, ప్రాణము ఆత్మ అను నాల్గు భాగములున్నవి. ఇందేదైన అచలము అయితే నేనచలుడనని నీవనవచ్చు. ఈ నాల్గింటిలో దేహ మనఃప్రాణములు మూడును వస్తుతః జడస్వరూపములై వున్నవి. వీని కన్నిటికి చేతన మొసంగి కదలించునది ఆత్మ చైతన్యమే. ఆత్మ కదిలిస్తే కదలి. లేకుంటే కదలని దేహమనః ప్రాణములు చలన మనవలెనా ? అచల మనవలెనా ? రెండునూ అనరాదు. వానిని కదిలించు ఆత్మ అచలమా? చలమా . రెండునూ అయివున్నది. ఒకటి స్థితి, రెండవది గతి. గతికల్గియున్నపుడు అనగా కదిలించునపుడు తనయందు కదలికయుండెనా లేదా ? ఇంజను కదలితేనేగాని రైలు కదల నట్లు తనయందు కదలిక లేనిచో దేనినీ కదలింపజాలదు. కాని తనయందున్న కదలిక

స్థూలరూపంగా గుర్తింపరానిదై సత్తా మాత్రముగా అనగా శక్తిరూపముగా నున్నది. ఇందు కయస్కాంతమే (సూదంటురాయి) దృష్టాంతము. అయస్కాంత మందుగలశక్తి స్థూలరూపముగా గానరానట్లే పిండ బ్రహ్మాండములయందలి ఆత్మశక్తి స్థూలరూపముగా గానరాక గర్భీకృతమై యుండను, ఈ శక్తియే చేతనము, ఆత్మయొక్క యీ చైతన్యమే సర్వప్రాణులయందు యేదో ప్రమాణములో తెలివి రూపముగా వుండియే వున్నది. ప్రాణములేని వస్తువులయందు యిది కేవలం శక్తిరూపముగానే యున్నది. కనుక తెలివి, శక్తి అను రెండునూ తెలివియొక్క రూపాంతరములే. లేదా శక్తియొక్క రూపాంతరములే. ఒకటి జ్ఞాన శక్తి. రెండవది క్రియాశక్తి యని అనవచ్చు. చలనము రెండువిధములని చెప్పవలెను. ఒకటి సూక్ష్మమై, జ్ఞానమునకు సంబంధించి కానరాకయున్నది. రెండవది స్థూలమై క్రియారూపముగా గానవచ్చుచున్నది. యీ రెండునూ శక్తియొక్క వ్యాపారములే. జ్ఞానశక్తి కావరణము మనస్సు. ఇది సూక్ష్మమైనది. క్రియాశక్తి కావరణము స్థూలము. ఈ జ్ఞాన క్రియాశక్తులలో మొదటిది అంతరేంద్రియ వ్యవహార కారణమై యున్నది. రెండవది స్థూలశరీర సంబంధముతో క్రియారూపముగా కర్మ లొనర్చును. బాహ్యమునందు కానరానంత మాత్రంచేత చలనం లేదనరాదు. చలాచలములు రెండూ చలనముయొక్క రూపాంతరములే; సాపేక్షిక ద్వంద్వములే. చిత్‌యొక్క లక్షణములే, "ద్వంద్వ స్సామాసికస్యచ" అనగా సమానములలో నేను ద్వంద్వ సమానమును అంటున్నాడు విభూతి యోగంలో శ్రీకృష్ణపరమాత్మ. కనుక ఏ ద్వంద్వాలు తీసుకొన్నా అన్నియు సచ్చిదానంద పరమాత్మ రూపాంతరములే. కనుక ఏ స్థానమందు చూచినా పిండబ్రహ్మాండముల యందుగాని అఖండాత్మ స్వరూపము నందుగాని కేవలాచలస్థితి లేదు. ప్రత్యగాత్మ సమాధియందు నిశ్చలముగా నున్నదని చెప్పినా సృష్టికిపూర్వము పరమాత్మ అచలముగా నున్నదని చెప్పినా తదనంతరం చలన రూపం వహిస్తూ వున్నవి. కనుక చలాచలస్థితులు రెండునూ ప్రత్యగాత్మా పరమాత్మల రెంటికినీ వున్నవనే చెప్పవలసి వున్నది. యీ రెండింటియొక్క అఖండత్వము నందున్ను చలాచలస్థితులు రెండూ వున్నవనే అనాలి. కనుక "అచలోయం సనాతనః" అని చెప్పబడిన మాట కేవలం అచల స్వరూపముగావుండి చలన మెన్నడూ యెరుగని పరిపూర్ణ పరబ్రహ్మ మొక్కదానికే చెల్లును. దానియందు శక్తి రూపముగాగాని తెలివిరూపముగా గానీ యెరుక యెన్నడూ లేదు. కనుకనే దానిని "నిశ్శక్తి నిర్మలం పూర్ణం" అని అభివర్ణించినారు. 'అదే నీవు- నీవే అది' అంటూ "తత్వమసి' ' మహావాక్యం యొక్క లక్ష్యార్థంకూడా వుభయాత్మకమగు అనగా చలాచలాత్మకమగు ప్రత్యగాత్మ పరమాత్మల విషయంలో మాత్రమే సత్యం, పరిపూర్ణ పరబ్రహ్మం, ఏదీ కానిది తనయం దేమీ లేనిది. అది నీవుకాదు - నీవు అది కాదు.

27. బంధము

బంధ మనగా కట్టుబడి యుండుట. అనగా తన ఇచ్ఛవచ్చిన రీతిని సంచరించుటకు కోరిన ఫలప్రాప్తి కలుగుటకు దుష్ఫలితములు రాకుండుటకు -- స్వేచ్ఛ, స్వతంత్రము లేకుండా యేదో అవ్యక్తశక్తిచే సంకెళ్ళు వేయబడినట్లు వుండుట బంధ మనబడును. త్రికరణములగు మనస్సు, వాక్కు, శరీరము (నానావిధ యింద్రియములతో సహా) దేనిపైనా తన కెట్టి పెత్తనము లేకుండుటయు బంధమే, ఇట్లు తన్ను బంధించినవారెవరు ? దేనిచేత బంధించినారు ఎందుకు ? ఎప్పుడు . ఎట్లు బంధింపబడినాడు ? మొదలగు విషయములన్నియు పరిశీలించవలసి యున్నది. మరియును ఈ బంధము జీవునికా ? ఈశ్వరునికా ? అధిష్ఠాన వస్తువునకా ? అని కూడా విమర్శించవలసియున్నది. ఏలననగా ! ప్రత్యక్షముగా తాను స్వయముగా బంధింపబడినటుల స్థూలముగా కానవచ్చుటలేదు. కనుక ఇది ప్రకృతి బంధమో, పురుషుని బంధమో, కర్మబంధమో, జ్ఞానబంధమో, బాహ్యాబంధమో, అంతరబంధమో తెలియుట లేదు. కనుక ఇది తత్వపరిశోధనవలననే తెలియ తగియున్నది.

సృష్టికిపూర్వము తాను తానై, రెండవదిలేక నిర్వికారమై, అచలమై నిష్క్రియమై వున్న బ్రహ్మ పదార్థము నుండి ఈ సృష్టి కలిగినదని సర్వశాస్త్రముల ఏకాభిప్రాయమయి ఉన్నది. అట్లే పూర్వసృష్టులున్నూ కలిగినవి. మును ముందు కలుగనై యున్నవి కూడా. ఈవిధముగా సృష్టి, స్థితి, లయములు కలుగుటకు కారణమేమి ? పరమాత్మ యొక్క స్వతంత్రములేక స్వేచ్ఛచేతనే (స్వ + ఇచ్ఛ) కలిగినవంటే మరల మరల విధిగా తప్పక ఎందుకు జరుగవలయును ? అది స్వేచ్ఛ చేతనే అనరాదు. ఏ అవ్యక్త శక్తియో తన్ను ప్రేరేపించి, బంధించి ఈ సృష్టి బంధములోనికి ఈడ్చుకొని వెళ్ళుచున్నదని చెప్పతగును. కనుక సృష్టికి మూలకారణము నిర్గుణ స్వరూపమగు బ్రహ్మమన్నా, లేక సగుణ స్వరూపుడగు ఈశ్వరుడన్నా మొత్తముమీద సృష్టికర్తయే బద్ధుడై యున్నాడు. ఇక జీవుని విషయములో ఈ బద్ధత్వము మరింత ప్రస్ఫుటముగా కానవచ్చుచున్నది. ఆశించిన సత్ఫలితాలు కలుగవు. ద్వేషించిన దుష్ఫలితములు రాకమానవు. ఒకటి తలచిన, మరియొకటి అగుచున్నది. అందుకు తగిన కారణములా, కానవచ్చుట లేదు. కనుక జీవుని బద్ధత్వ విషయములో ఎవరికిని, ఎట్టి సందేహ ముండజాలదు. బ్రహ్మాండమందలి సూర్య-చంద్రాది నవగ్రహములు నక్షత్రములు, పంచభూతములు, వేయేల బ్రహ్మాది స్తంభపర్యంతము ఏదో తెలియరాని ఒక సూత్రమునకు బద్ధమైయున్నది. ఇదియే బంధము.ఈ బంధము సృష్టికి అత్యంత మూలకారణమగు వస్తువునందు ఉండిననేవేతప్ప సృష్టియందున్న ప్రతి పదార్థమునకు ఆ బంధము సంక్రమింపజాలదు. కార్య వస్తువులయందుకాక కారణవస్తు పరిశీలనయే తత్వజిజ్ఞాస. అయినను

కార్యకారణముల నన్వేషించుచూ మూలకారణమై వస్తువునందలి బంధమును విమర్శించి తెలుసుకొనుట సుబోధకముగా నుండును.

జీవబంధము :-తొలుదొల్త ఇది బాహ్యబంధమా ? లేక అంతరబంధమా ? ఇంచుక విచారింతము. అపంచీకృతమగు పంచతన్మాత్రలనుండి ప్రభవించి, పంచీకృత పంచమహాభూతములతో ఏర్పడిన ఈ బ్రహ్మాండమందు, పంచతన్మాత్రలు విషయరూపముగా అనగా శబ్ద,స్పర్శ, రూప, రస, గంధములుగా నున్నవి. అందు శబ్దముయొక్క లోలత్వముచేత లేళ్ళు, పాములు, ప్రాణహాని తెచ్చుకొను చున్నవి. ఏనుగులు స్పర్శసుఖమాశించి నశించుచున్నవి. మిడుతలు, దోమలు, మొ॥ అగ్నియొక్క రూపమునకు భ్రమించి నశించుచున్నవి. జలచరములు జిహ్వ విషయమగు రసమునకు లోలత్వము చెంది స్వనాశము తెచ్చుకొనుచున్నవి. తుమ్మెదలు పంపంగి పువ్వుయొక్క సుగంధముచే ఆకర్షింపబడి నశించుచున్నవి. శ్లో॥ కురంగ మాతంగ పతంగ మీనాః భృంగాః పంచభిరేవపంచ" అని చెప్పబడినట్లు పైన చెప్పబడిన .జీవులు ఒక్కొక్క తన్మాత్ర విషయముచేత మాత్రమే ఆకర్షింపబడి ప్రాణహాని తెచ్చుకొనుచున్నవి. ఇక మానవుడో ! పంచతన్మాత్ర విషయములు ఐదింటికిన్ని దాసుడై వానికొరకు పరితపించుచూ సత్ఫలితములకు పొంగి, దుష్ఫలితములకు కృంగి దుఃఖములపాలగుచున్నాడు. కనుక బాహ్యమందున్న శబ్ద స్పర్శ రూపరస గంధాదులే ప్రాణులను బంధించునట్లు స్థూలదృష్టికి గోచరించుచున్నది.

కాని శబ్దాది విషయములందు దోషమే బంధకారణమై యున్నదని అనునెడల పైన పేర్కొనిన కురంగ, మాతంగ, పతంగ, మీన, భృంగములు ఒక్కొక్క ఇంద్రియవిషయము చేతనే యెందుకు బంధింపబడవలెను ? అవియునూ విషయ పంచకమును గుర్తించుచున్నవికదా ! అందు ఒక్క విషయము మాత్రమే బంధించిమిగిలిన విషయము లేల బంధించుటలేదు ? అని ప్రశ్నించవలసి వచ్చుచున్నది. ప్రపంచమందలి వస్తువు లన్నియు గుణదోషములు రెండున్నూ వున్నవేకాని కేవలము దోషము మాత్రమే కలిగిన వస్తు వేదియును లేదు. "గుణదోష మయం సర్వం స్రష్టాసృజనకౌతుకీ" అన్న న్యాయముగా, అన్నియూ ద్వంద్వలక్షణోపేతమై యున్నవే కాని కేవలత్వ మనునది ప్రపంచమందలి ఏ వస్తువునందైననూ మృగ్యమే. కనుకనే ధర్మరాజునకు కేవలము చెడ్డవాడుకాని, దుర్యోధనునకు కేవలం మంచివాడుకాని సృష్టిలో కానరాలేదు. కనుక దోషము వస్తువునందున్నదా ? లేక తనయందున్నదా ? అని ప్రశ్నించినచో తనయందే దోషమున్నదని చెప్పితీరవలెను. శబ్దాది విషయములు గుర్తించునది మనస్సుకదా ! గుర్తించనిచో బంధము లేదుకదా కనుకనే "మన ఏవ మనుష్యాణాం కారణంబంధమోక్షయోః" అని చెప్పబడినది కనుక బంధము బాహ్యనిష్ఠమనరాదు. అంతర్నిష్ఠమనియే చెప్పితీరవలెను.

బంధకారణమగు వస్తువు అంతరమందున్నదంటే దాని స్థానస్వరూప, స్వభావములేమి ? అని విమర్శించవలసి వున్నది. ఏమైననూ ఈ బంధకారణ వస్తువు ఇంద్రియగోచరమగు స్థూలపదార్థము మాత్రముకాదు. పైన చెప్పబడిన మనస్సు బంధకారణమంటే అందరిమనస్సు అన్ని విషయములచేతను బంధింపబడుచున్నదా ? అందరికీ మనస్సున్నది కదా ? కనుక మనస్సు ప్రతి వక్కరియందునూ, భిన్నభిన్నమై యున్నదని చెప్పక తప్పదు. ఆ విభిన్నతకు కారణమేది ? అంటే ఆయా వ్యష్టి మనస్సులయందు నిక్షిప్తమై నిగూఢముగానున్న భిన్న బిన్న సంస్కారములే ! సంస్కారముల మూటయే మనస్సు. సంస్కారము లేనిచో మనస్సేలేదు. జీవించి యుండగనే ఈ సంస్కారములను తుడిచిపెట్టినవానికి ఇక బంధము లేదు. వాసనాక్షయమైతే మనస్సు లేనట్లే కనుక ఈ అంతర్బంధమునకు స్థానస్వరూపములు మనస్సే. ఆయా సంస్కారములు సమయము వచ్చినపుడు ఉద్బుద్ధమై పైకి ఉబుకుచుండును. ఇందుకు వానిని ప్రేరేపించునది ఏది ? అంటే ఏ ప్రత్యేక సంస్కారములకు సంబంధించిన శబ్దాది విషయములు, జ్ఞానేంద్రియముచే గ్రహింపబడునో, ఆ క్షణమున ఆ సంస్కారము పెల్లుబికి ఆయా విషయములచే ఆకర్షింపబడి తన పని ప్రారంభించును. ఇదియే దాని స్వభావము ఈ విధముగా బాహ్య విషయము అంతర సంస్కారము ఈరెండునూ కలిసి జీవబంధమగుచున్నది.

పరమాత్మ (లేక ఈశ్వర) బంధము:- ఇట్టి సంస్కారములను, ఆ సంస్కారములను దాచుకొను మనస్సును, అట్టి మనస్సుగల ప్రాణులను పరమాత్మ ఏల సృష్టించవలెను ? ఏమి ఆశించి సృష్టించవలెను ? అంటే కొందరు "లీలా దేవతు కైవల్యం" అనగా తన లీల లేక ఆనందముకొరకు అన్నారు. సృష్టి స్థితి లయములుచేసేది అతని మాయాశక్తిగాని, అతను కానేకాదన్నారు కొందరు. బంగారము నగలుగా ఎందుకు మారవలెను ? అంటే దాని నైజగుణమే లేక స్వభావమే అట్టిది. అట్లే సృష్టి స్థితి లయములు చెందుట దాని స్వభావము. జీవేశ్వర జగత్తుగా మానవులుగా, మనస్సుగా, వేయేల సర్వముగా మారుటయే దాని స్వభావము. జన్మకర్మలు రెండును దాని స్వభావములే. పరంపరగా సృష్టి స్థితి లయములు చేయుటకు పరమాత్మ బద్ధుడై యున్నాడు. దేనిచేత ? అది అతని కర్మ. కర్మకారణమైన ప్రాణచలనము సృష్టిసంకల్పమునకు పూర్వము తనయందే బీజరూపముగా నుంచుకొని ఉత్తరోత్తర సృష్టులను ఆవిర్భావము చేయుచున్నాడు. ఇదియే పరమాత్మకు బంధము.

ఈ విధముగా అతనిని బంధించినవా రెవరు ? వేనితో ? ఎప్పుడు ? ఎక్కడ ? ఈ మొదలగు ప్రశ్నలకు ఇట నేమీ తావు లేదు. ఏలననగా దేశ కాల పాత్రలు ఏమియూ సృష్టికాక పూర్వము "బ్రహ్మణోన్యం నకించిన" అనే న్యాయముగా ఉన్నది. ఆ పరమాత్మ యొక్కటేకదా ! కనుక తన్నుతానే బంధించుకొనెనని చెప్పకతప్పదు. దేనిచేత బంధించుకొనెను ? అని ప్రశ్నించుటకు

కూడా తావు లేదు. తానే కర్త, కర్మ, క్రియ కరణములు సహాయకారణములు. సర్వము తానే ఐతే ఒకచేతితో రెండవచేతిని కొట్టినట్లు, తన చేతులతో కాళ్ళను బంధించుకొన్నట్లు తనలోని ఒక భాగముచే మరొక భాగమును బందీకృత మొనర్చుకొన వచ్చును. దీనికి దృష్టాంతమేమి ? సృష్టిలో ఏ ప్రాణి అయినా అట్లు తనను తాను బంధించుకొన్నదా ? అంటే పరిపూర్ణ భావజ్ఞులు ఊర్ణనాభి (అనగా నాభి స్థానమందు దారముకలది) పట్టుపురుగు దృష్టాంతము నిచ్చినారు. ఈ పురుగు చొంగ రూపములో పట్టుదారమును తయారుచేసి పట్టుకాయ యొక్క పై పొరను ముందు దట్టముగా అల్లివేయును. ఆ పిదప లోపలి పొరలను అల్లుకొనుచూ పట్టుకాయను దళసరి కావించుటలో లోపలి ఖాళీప్రదేశము అంతకంతకు సంకుచితమై చివరికి ఎట్టి ఖాళీయును లేక ఊపిరాడక మూర్ఛావస్థ చెందును. కొన్నిదినము లట్లేయుండి మూర్ఛతేరుకొని పండ్లతో దారమును పటపటకొరిగి తగినంత రంధ్రము చేసికొని పట్టుకాయను భేదించుకొని విముక్తినొందును. అట్లే పరమాత్మ తనలోని త్రిగుణప్రభావముచేత, జీవేశ్వరజగత్తును సృష్టించి "తత్సృష్ట్వా తదేవానుప్రావిశత్' అను శృత్యానుసారము, ఆ సృష్టియందు అనుప్రవేశము గావించి అందు అంతటావ్యాపించి పట్టుకాయయందు పురుగువలె పరమాత్మ బద్ధుడై ఉన్నాడు. పరిపూర్ణ పరబాహ్యమున్నది అని తన్ను విడిచి చూచెనా ఈ బ్రహ్మాండ కటాహమును భేదించుకొని విముక్తి గాంచుచున్నాడు.

ఊర్ణనాభీ అనగా, సాలెపురుగు అనిన్నీ ఆ సాలెపురుగు ఎట్టి పనిముట్లుగాని సహాయ కారణములుగాని లేకనే తన నాభియందున్న జిగురు పదార్థమును చొల్లురీతిగా వెలువరించి, సాలెగూడు విధముగా జీవేశ్వర జగత్తును సృష్టించెననియు, ఆ గూటిలోని దారము మ్రింగివేసి గూటిని నాశనమొనర్చుననియు, పరమాత్మగూడ అట్లే తనయందలి మాయా శక్తిచే జీవేశ్వర జగత్తును సృష్టించి ఆ మాయను ఉపసంహరించుట ద్వారా ప్రళయమును కల్పించుననియు కొందరు సాలెపురుగు దృష్టాంత మిత్తురు. ఆ దృష్టాంతము సరికాదు. ఏలననగా తన లోపలి దారముచేత గూడునల్లి, ఆ గూటిపై భాగమున సాలెపురుగు స్వేచ్ఛగా విహరించునేగాని ఆ గూటిలో బంధింపబడు ఈగలు దోమలువలె తానుకూడా బంధింపబడదు. కనుక ఇటసాలెపురుగుకు నిజముగా బంధమూ లేదు; మోక్షములేదు. ఈ దృష్టాంతము అద్వైతభావమును పోషించునేగాని, మహాద్వైతమగు లేక కేవలాద్వైతమగు పరిపూర్ణ భావమునందు పనికిరాదు.

ఈ విధంముగా సృష్టికారణ స్వరూపమైన బ్రహ్మముతో సహా సర్వమూ బంధమున చిక్కియున్నది. ఇట్టి బంధము సంపూర్తిగా లేకపోవుటయే నిజమైన మోక్ష స్వరూపము.

జ్ఞానకర్మబంధము : జీవుని బంధించు యీషణాత్రయము వాసనాత్రయము, అష్టపాశములు, రూపముగా బంధము స్పష్టముగా ద్యోతకమగుచున్నది. పరమాత్మవిషయములో తన్ను తానే లేక తనయందు ఒక భాగము, మరొక భాగమును బంధించుచున్నదని పైన పేర్కొనినాము. కాని బంధింపబడిన భాగాము బంధించిన భాగము అను రెంటిలో బందింపబడిన భాగమునకే బంధమున్నదిగాని, బంధించిన భాగమునకు బంధములేదుకదా ! అను శంక తోచవచ్చును. కాని నిజముగా పరమాత్మ భాగములే కాలేదు. కాని రెండు రీతులుగా తోచుచున్నది. అయిననూదాని అఖండత్వమునకు భంగము లేదు. ఆ రెండు రీతులు ఏవి ? అవి దృక్కోణములోని భేదరూపములేగాని వస్తువులో భేదములేదు. ఒక దృష్టితో చూచిన అది జ్ఞానరూపము. వేరొక దృష్టితో చూచిన అది కర్మరూపము. ఆ పరమాత్మ ఇట్టి ద్వంద్వ లక్షణములతో రెండు రీతులుగా కానవచ్చుచున్నది. జ్ఞాన కర్మలకు శబ్దభేదమేకాని, వస్తుభేదము లేదు. ఎట్లనగా బ్రహ్మమునకు, సృష్టి సంకల్పము కలిగినపుడు ఆ సంకల్పమే జ్ఞాన స్వరూపము ఆ సంకల్పమే జన్మ, ఆ సంకల్పమువలన కలిగిన చలనమే ప్రాణము. ఆ ప్రాణశక్తి యొక్క పనియేకర్మ. కనుక జ్ఞానము, నంకల్పము, జన్మ, చలనము, ప్రాణము, కర్మ ఇవి అన్నియూ ఒకే బ్రహ్మమునకు, ఒకే సంకల్పముతో ఒకే కాలములో ఏర్పడుచున్నవి. కనుక ఏక రీతిలోనున్నా రెండు రీతులలోనున్నా, అనేక రీతులలోనున్నా ఆ బ్రహ్మయే.

సమష్టిజ్ఞానముయొక్క ప్రకాశములో వ్యష్టిజ్ఞానము సర్వమును తెలుసుకొనుచున్నది. అట్లే సమష్టి ప్రాణచలనశక్తి చేత వ్యష్టి ప్రాణము కర్మకారకమగుచున్నది. అందుకే కృష్ణ దేశికేంద్రులవారు "ఎరుగుట జ్ఞానము, దానను జరిగేపని కర్మ మనుచు జనులెన్నిరి" మరిన్ని శ్రీ శివరామ దీక్షితులవారు శలవిచ్చినట్లు "గుర్తెరుగక ఎవరున్నూ ఏ కర్మయున్నూ చేయరు" కనుక జ్ఞాన కర్మ లొకటే అయిననూ "ముడిబడి కర్మము జ్ఞానము, విడువక నా రెండు వెలసె విశ్వమున" అని జ్ఞానకర్మలు రెండు వస్తువులుగా నున్నట్లు పేర్కొన్నారు. అయితే వానికి నిజాభిప్రాయ మెట్లు తీసుకొనవలె ననగా ! నిస్సంకల్పరూపమైన బ్రహ్మమునకు సంకల్పము కలుగుటయే ముడి. ఇదే జగజ్జనన కారణము. ఇదే జ్ఞానకర్మల బంధము. ఈ బంధములో జ్ఞానము కర్మవలన బంధింపబడెననిగాని, కర్మము జ్ఞానమువలన బంధింపబడెననిగాని చెప్పరాదు. జ్ఞాన కర్మలురెండునూ కలసి జ్ఞానకర్మలు రెండింటిని బంధించెనని చెప్పవలెను. కనుక పరమాత్మ స్వరూపమయిన బంధము యిట్టిది. ఈ జ్ఞానకర్మలు రెండున్నూ అనాదిగా బ్రహ్మము నందుండుటచే బ్రహ్మయే బంధము అనవలెను. ఆ బ్రహ్మమే మోక్షము. ఎట్లయినది ? "మోక్షము" అను నీ క్రింది వ్యాసములో చూడగలరు.

***

28. మోక్షము

మోక్షము అను మాటకు కొందరు ముక్తి, కైవల్యము నిర్వాణము, నిరతిశయ సుఖావిర్భావము, అత్యంత దుఃఖ నివృత్తి యిత్యాది మాటల నుపయోగించుచున్నారు. బంధ మోక్షములు, లేక బంధ విముక్తులు అను సమానములలో బంధమునకు వ్యతిరేకార్థ ప్రతిపాదకముగా మోక్షము, ముక్తి అను శబ్దములు వాడబడుచున్నవి. కాని ముక్తి సాలోక్య, సామీప్య, సారూప్య, సాష్టిత్వ, సాయుజ్య ముక్తులు అని పంచ విధములగు ముక్తులు చెప్పబడినవి. యీ ముక్తులు విష్ణువు, శివుడు మొదలగు యిష్టదైవముల లోకములు, సామీప్యాదులు పొందుట అని అర్థము. కాని మోక్ష శబ్దమునకు విడుదల, విడుపు అను అర్థములో యీ సాలోక్యాదులు అర్థవంతములు కాజాలవు. సార్థకములుకావు. బంధము అను వ్యాసములో తృణాది బ్రహ్మ పర్యంతము బంధమున చిక్కియున్నదనియు, బ్రహ్మమే బంధమున కత్యంత మూలకారణమనిన్ని సాకల్యముగా వివరింపబడినది. కనుక యీ బంధవిముక్తి లేక మోక్షము చేకూర వలెనంటే యీ మొత్తము సృష్టి కారణమగు బ్రహ్మమును అతిక్రమించి పోవుటయే నిజమగు విడుదలకనుక సాలోక్యాది ముక్తులు నిజమగు మోక్షము కానేరవు. కాగా వానిని సాలోక్యాది పదవులని పేర్కొనుటయే జరుగుచున్నది. అవి మోక్షార్థ ప్రతిపాదకములు కాజాలవు. అత్యంత దుఃఖ నివృత్తి నిరతిశయానంద ప్రాప్తి తానున్న వానికే నేను తాను అనరాని దానియందు ఆనందమూ లేదు, దుఃఖము లేదు. ఏది వున్నా అది బంధమే కాని మోక్షము (సంపూర్ణ విడుదల) కాదు.

1) శబ్ద స్పర్శ రూప రస గంధములు విషయ రూపముగా బాహ్యమున బంధకారణమై యున్నవి. బంధము అను వ్యాసములో పేర్కొనినాము. యీ బంధమునుండి విడుదల పొందవలెనంటే వానిని జ్ఞానేంద్రియములచే గ్రహించకుంటే చాలదా అని తోచవచ్చును. షణ్ముఖీ ముద్రలోవలె జ్ఞానేంద్రియముల ద్వారా విషయ పంచకము గుర్తించకుండా ఆ ద్వారములను మూసివేస్తే సరిపోదా ? సరిపోదు. ఏలననగా శబ్దాదులయొక్క స్మృతిజ్ఞానము మనస్సునచోటు చేసుకొని అప్పుడప్పుడు పొటమరించి వ్యక్తికి బంధకారణ మగుచునే వుండును. కనుక విషయగ్రహణ మానినంతమాత్రాన ఏమియు ప్రయోజనము లేదు. ఏలననగా యిదివరలో అనుభవించిన శబ్దాదుల స్మరించుటవలన కూడా బంధ మేర్పడుచున్నది. కనుకనే --

ధ్యాయతో విషయాన్ పుంసాన్ సంగస్తే షూపజాయతే
సంగాత్సంజాయతే కామః కామాత్క్రోధోభిజాయతే ॥

.... అందూ భగవద్గీత విషయ స్మరణ మాత్రమున మానవు డెట్లు బద్ధుడైపోవుచున్నాడో వివరించినది. కనుక వైరాగ్యముచే విషయములనుండి అడవులకు పారిపోయినా అంతరమందున్న మానసిక స్మృతులు బంధకారణ మగుచున్నవి. కనుక విషయ వైరాగ్యమాత్రమువల్ల మోక్షము చేకూరదనుట స్పష్టమే.

2) కనుక అంతరమున బంధకారణముగానున్న మనస్సును జయించవలెను. లేదా మనస్సును లేకుండా చేయవలెను అని కొందరు అందురు.

"మన ఏవ మనుష్యాణాం కారణం బంధ మోక్షయోః ॥

బంధాయ విసయాసక్తం మోక్షం నిర్విషయం మనః "

అనగా మనస్సును నిర్విషయంచేస్తే మోక్షమన్నారు. జ్ఞానేంద్రియములద్వారా మనస్సువిషయ గ్రహణ చేయక యూరకుండవలెనన్న దానిని యోగమార్గములచే వృత్తి శూన్య మొనరించవలెను. లేదా జ్ఞాన మార్గమున దానిని అఖండ బ్రహ్మాకారవృత్తియందు నిలుపవలెను. అవిధముగా వృత్తి శూన్య మొనర్చినా, బ్రహ్మాకారవృత్తియందున్నా అట్లుండు కాలము పరిమితమే. చాంగ దేవుడు 1400 సంవత్సరములు యోగసమాధియందున్నా అతనికి భ్రాంతి రహితము కాలేదు. అఖండ బ్రహ్మాకార వృత్తియందు మనస్సును వుంచుదామంటే ప్రాణిధర్మమగు ఆకలిదప్పులు బ్రహ్మాకార వృత్తిని విచ్ఛిన్న మొనర్చుచున్నవి. కనుక యోగామనస్కము లేక జ్ఞానామనస్క మార్గములచే తాత్కాలికముగ మాత్రమే మనస్సు విషయగ్రహణ చేయుటలేదు. కాని శాశ్వతముగ మనుస్సు నశించుట లేదు.

3) కనుక అంతర్బాహ్య బంధములు శేషించుచునే యున్నవి. బాహ్యమందున్న విషయపంచకము అంతరమందున్న సంస్కారములు రెండున్ను కలసి బంధకారణ మగుచున్నవి అని బంధము అను వ్యాసమున చెప్పినాము. మనస్సు సంస్కారముల మూట అన్నాము. కనుక సంస్కారములు పోవలె. వాసనావాసితముకాని మనస్సు జ్ఞానేంద్రియముల ద్వారా విషయములను గుర్తించినను ఎట్టివికారము చెందదు. కనుక వాసనా క్షయమువల్ల మనోనాశ మేర్పడును అని చెప్పబడినది. ఐతే 1) సంచితము, 2) ప్రారబ్ధము, 3) ఆగామి అని కర్మ త్రివిధంగా విభజింపబడినది.

అందు 1) అనంతకోటి జన్మలలోని కర్మవాసనల కూటమికి సంచితమని పేరు. 2) వర్తమాన జీవితములో ననుభవించుటకు తెచ్చుకొన్న శుభాశుభసంస్కారజన్యమగు పుణ్య పాప కర్మఫలములు ప్రారబ్ధము. 3) వర్తమాన జన్మయందలి మనో వాక్శరీరములతో చేయబడిన కర్మఫలముల వాసనారూపమే ఆగామి. ఈ త్రివిధకర్మలు నశించినగాని మోక్షము లేదని సర్వాంగీకారమగు విషయము.

"ప్రారబ్ధం భోగతో నశ్యేత్ తత్వజ్ఞానేన సంచితం ।

ఆగామీ ద్వివిధం ప్రోక్తం తద్వేషీ ప్రియవాదినౌ ॥

అని కర్మత్రయము జ్ఞాని కెట్లు నశించుచున్నదో చెప్పినారు. అనగా ప్రారబ్ధము అనుభవముచేతను, సంచితము తత్వజ్ఞానము చేతను నశించును, కాని అజ్ఞానిని భూషించువారు అతని పుణ్య కర్మ ఫలముల దూషించువారు లేక ద్వేషించువారాతని పాపకర్మల ఫలితములను పొందుదురని, ఆరీతిగా జ్ఞానికి ఆగామి నశించుచున్నదని చెప్పుట సరి గాజాలదు. ఏలననగా ఆ జ్ఞానియొక్క మోక్షము అన్యుల (భూషించువారు, ద్వేషించువారు) పై నాధారపడి యున్నదనియు కాగా యిక యెవరికిన్ని మోక్షమునందు సంపూర్ణ స్వాతంత్ర్యము లేనట్లున్ను చెప్పవలసియుండును. కనుక ఆగామి యీ విధముగా నశించునని చెప్పుట సరిగాదు.

ఆగామికర్మ ఫలప్రాప్తికి రాకుండా నశించవలెనన్న (1) కర్మత్యాగము (2) కర్మఫల త్యాగము (3) కర్తృత్వ త్యాగము అను త్రివిధ పద్ధతులచే సిద్ధించగలదనీ, అందు కర్మ త్యాగము అసంభవమనీ గీత యుద్బోధించుచున్నది. ఏ ప్రయోజనమును కోరకనే ఎవరైనా ఏ పనియైనా అసలు తలపెట్టుదురా ? కనుక ఫలత్యాగబుద్ధి ఆదిలోనే యుండుట అసంభవము. కర్మఫలము ప్రాప్తించిన యనంతరం తద్వాసన అంతఃకరణమం దంటక మానదు. త్యజించవలె నన్న అది సాధ్యం కాదు. శ్రీకృష్ణార్పణమస్తు లేక తత్సద్బ్రహ్మార్పణ మస్తు అన్నా అదిపోదు. ఒకవేళ పోయినా అది ఆ దైవము నందు లేక బ్రహ్మమునందు బ్యాంకులో దాచికొన్న ధనము వలె తన కాతాను నిల్వయై వుండును. ఇక కర్తృత్వత్యాగ మొక్కటే మార్గము.

ఐతే ఏ పనికైననూ కర్త యెవరు ? నేను అను వ్యష్టి అహంకారమే కర్తయని యితరులందరు పల్కుచున్నారు. కాని ప్రత్యగాత్మ ప్రకాశము లేనిదే యింద్రియ వ్యవహార ముండజాలదుకదా ! ముఖ్యముగా ఏది లేకుంటే వ్యవహారమే యుండదో నిజంగా దానినే కర్త యని విధాయకముగా అని తీరవలసినదే. కనుక ప్రత్యగాత్మయే కర్త. కాని ప్రత్యగాత్మ పరమాత్మకంటే అభిన్నమైనపుడు సర్వమునకు పరమాత్మయే కర్త కనుకనే శ్రుతి "తేన వినా తృణాగ్రమపిన చలతి" అని అంటున్నది. కనుక వ్యష్టి అహంకారమే కర్తయని నిశ్చయించుకొని అహంకర్తృత్వమును మాత్రము వదలి కర్మాచరణ చేయువారు నిజముగా కర్తృత్వ త్యాగ మొనర్చిన వారు కాదు. ఏలననగా వ్యష్టి కర్తృత్వము పోయినా సమిష్టి యందు కర్తృత్వము శేషించుచున్నది. కనుక కర్మఫల త్యాగముగాని, వ్యష్టి కర్తృత్వ త్యాగముకాని చేసినవాడు సర్వకారణమగు బ్రహ్మమునందే చేరును. ఈ బ్రహ్మమే మోక్షస్థానమని అందరూ చెప్పుచున్నారు. యీ బ్రహ్మమే బంధమున కత్యంత మూలకారణమని "బంధము" అను వ్యాసంలో తీర్మానం చేయబడినది కనుక బంధ మోక్షముల రెంటి స్థానము బ్రహ్మమే. బ్రహ్మమే అన్నిటికి కర్త యని తేలినది. ఈ బ్రహ్మయొక్క కర్తృత్వ మెట్లు రహితమగును?

బ్రహ్మము శాశ్వతమని దృఢభావనచేస్తే దాని కర్తృత్వమున్ను శాశ్వతముగా యుండి తీరును. కనుక పరిపూర్ణ బోధచే "పరిపూర్ణ మొక్కటియే యెప్పటికి నుండును. కర్తయైన బ్రహ్మమునకు ఆ పరిపూర్ణ పరబయలునందు స్థానముగాని మూలముగాని లేదు అని దృఢము కావలెను". మరిన్ని అద్వైతములో బంధమోక్షములు మిధ్యయని వుద్ఘాటించబడుచున్నదే కాని బంధ మోక్షముల రెంటికీ స్థానము, మూలమూ బ్రహ్మయే యగుచో ఆ బ్రహ్మముకూడా మిధ్యయే అనవలసియుండును గదా! మిధ్య అనగా పారమార్థికముగా లేనిది. అంటే ఆ బ్రహ్మమున కతీతమగు పరిపూర్ణ పరబాహ్యమునందా బ్రహ్మమునకు మూలముగాని, స్థానముగాని లేనిదై యున్నదన్నమాట. బంధ మోక్షములు, జనన మరణములు మిధ్యయనీ, భ్రాంతిరూపములనీ యీదృష్టితోనే అచలఋషులు వుద్ఘాటించియున్నారని తెలియనగును. కనుకనే పరమ గురువులు ---

"బంధము మోక్షము లేకను

బిందుత్రయ మేమి లేక బీజములేకన్ ..."

అంటూ తమ కందార్థములలో శెలవిచ్చియున్నారు.

ఒకే వస్తువు బంధమునకు మోక్షమునకుకూడా స్థానమై యున్నదంటే ఏమి సిద్ధించును ?

"యతో వా యిమాని భూతాని జాయంతి।

యేన జాతాని జీవంతి। యత్ప్రయంత్యభిసంవిశంతి।

తద్విజిజ్ఞాసస్వ। తద్బ్రహ్మేతి" అని తైత్తిరీయ శ్రుతి.

కనుక సృష్టి, స్థితి లయములు చేయునపుడు ఆ బ్రహ్మము బంధరూపములోనున్నది సృష్టికి పూర్వము, ప్రళయానంతరమూ ఆ బ్రహ్మమే మోక్షస్వరూపమని చెప్పబడుచున్నది. జాగ్రదవస్థ బంధమూ, సుషుప్తి మోక్షము అన్నట్లుగా యున్నది. ఎరుక బంధమూ, మరుపు మోక్షమూ అన్నట్లన్నమాట. ఎరుక మరుపులు రెండుయెరుకేకదా! కనుక శాశ్వతముగ జన్మరాహిత్య స్థితికానిర్వాణము కావలెనంటె బంధమోక్ష రూపములుగా మారుచూవున్న యీ బ్రహ్మమునండియే విముక్తి కావలసియున్నది. బంధమూ, మోక్షమూ రెండూ కూడా బంధమే, కనుకనే "కేవలమోక్షాపేక్ష సంకల్పో బంధః" అని నిరాలంబోపనిషత్ సిద్ధాంతము.

ఈ మొత్తము సృష్టినుండియేగాక, సృష్టికారణమగు బ్రహ్మమునుండి కూడా విడుదల పొందుటయే నిజమగు విడుదల. అది యే జన్మకు యెన్నడూ తిరిగి రాని పద్ధతి. సృష్టిలోని భాగమైన తాను సృష్టిని అతిక్రమించి పోవలెనంటే, తానైన బ్రహ్మమును అతిక్రమించి పోవలెను. అపుడు తాను నిశ్శేషముగా లేకనే పోవును. తన వునికియే మిధ్యయగును. "

ఆ॥ వె॥ నీటియందు మొసలి నిగిడి యేనుగుబట్టు,
బైట కుక్క చేత భంగపడును ।
స్థానబలిమిగాని తనబలిమి గాదయా.. .'

అన్నారు వేమన, తన స్థానమును వదలిన తానే లేకపోవుట తథ్యము.

ప్రకారాంతరముగ విచారించినచో -- తా నెవరు ; తన స్థాన స్వరూప స్వభావము లేవి? అని విచారించినచో తానే బ్రహ్మము బ్రహ్మముయొక్క స్థాన స్వరూప స్వభావములే తనయొక్క స్థాన స్వరూప స్వభావములు. కనుక సృష్టియు, సృష్టికారణమును తానే యైనపుడు, తన బంధము తొలగవలెనంటే, తానైన బ్రహ్మమే లేకపోవలెను. పర,అపరా ప్రకృతులు రెండూ నా స్వభావములే, నేను లేకుంటే నా స్వభావమూ వుండదు. నా ప్రకృతి, (నా స్వభావము) పోతేనే గాయుండును. నాప్రకృతి బంధమున్నూ, నేను మోక్షస్వరూపుడననిన్నీ అనుట కూడదు. నేనే బంధమున్నూ మోక్షమున్నూ కూడ నైయున్నాను. నా ప్రకృతితో పాటు నేను పోయినపుడే నాకు నిజమగు బంధమోక్ష విముక్తి. ఇదియే అచలబుషుల పూర్ణబోధ మార్గము

"నీవే బంధ మోక్ష రూపుడవైన బ్రహ్మ స్వరూపుడవు. అట్టి బ్రహ్మస్వరూపుడవైన నీవే జనన మరణ భ్రాంతి యందు తగుల్కొని యున్నావు. నీ కన్యమైన పరిపూర్ణ బ్రహ్మమునందు బ్రహ్మస్వరూపుడవైన నీవుగాని, నీ బంధమోక్షములుగాని లేనేలేవు. పరిపూర్ణ పర బాహ్యమును తెలిసి బ్రహ్మస్వరూపుడవైన నీవు లేనే లేవని గురుముఖతః తెలిసి లేక పోవుటయే కర్తవ్యము.'

***

29 ప్రశాంతి

ప్రశాంతి యనగా ప్రకృష్టమైన అనగా విశేష రూపమైన శాంతి, అలజడి, ఆందోళన, ఆరాటము, కలత చీకు చింత యిత్యాదులేమియు లేకుండుటే శాంతి అని అర్థము చెప్పవలెను. శాంతియొక్క అభావము అశాంతి. నాలుగు విధములుగా యీ అశాంతి కలుగుచున్నది. 1) ఆధిభౌతిక, ఆధిదైవిక తాపముల వలన, 2) అధ్యాత్మిక తాపమువలన, 3) మానసిక క్షోభవలన, 4) మరణానంతరము కల్గుననే దుఃఖప్రాప్తి వలన అశాంతి యేర్పడుచున్నది. మొదటి దగు అశాంతికి బ్రహ్మాండమందలి పరిస్థితులే కారణము. మిగతా మూడింటికి, తన స్థూల సూక్ష్మ యాతనా శరీరములయందలి పరిస్థితులు కారణములు. ఇందే అశాంతియు లేకుండు టే శాంతి. ఈ శాంత్య శాంతులు వచ్చుచు పోవుచునుండు నేగాని శాశ్వతముగా నుండవు

అశాంతికి అసంతృప్తియే మూలము. అసంతృప్తి, ఆశకు మూలము. తన సుఖమునకు ఏవిధమైన లోపం కలిగినా అసంతృప్తియే. జీవిత నిర్వహణములో ముఖ్యావసరములు తీరనిచో అసంతప్తి కలుగుట సహజమే. క్షుత్పిపాసల యొక్కయు, శీతోష్ణముల యొక్కయు బాధలు సర్వప్రాణులకును సమానమే, కనుక అన్న పానీయములున్ను నివసించుట కనువగు స్థానమున్ను, అన్ని ప్రాణులకు కనీసావసరములై యున్నవి. పశుపక్ష్యాదు లీ అవసరములు తీరినచో పరమ సంతృప్తితో జీవించుచుండును. కాని మానవుడట్లు గాక, అదికాధిక సుఖములకై ప్రాకులాడుచుండును. ఒక్క మానవోపాధియందే యీ అసంతృప్తి మిక్కుటముగా గానవచ్చుటకు కారణము నన్వేషింపవలసియున్నది.

విజ్ఞాన యుక్తమగు మానవాంతఃకరణమే యిందుకు కారణము. ఆకలిదప్పులు నివారణకై లభించినదానితో తృప్తి పడక రుచ్యములగు ఆహార పానీయములు కాంక్షించి వానినుత్పత్తి చేసుకొనుచుండును. శీత వర్ష ఆతపముల నుండి కాపాడుకొనుటకు సాధారణ గృహములుగాక సుందరములగు భర్మహర్మ్యముల నాశించును. కామోపహతుడై సుందర స్త్రీల పొందు నాశించును. అధికార పిపాస, అష్టైశ్వర్యసంసిద్ధి, కీర్తికాముకత్వము, యిత్యాదులు మానవాంతః కరణము నావహించి ఆతనిని వానికి బానిసను చేయుచున్నవి. ప్రపంచ సార్వభౌమత్వముగాని యింద్రాధిపత్యముగాని అతని తృష్ణను చల్లార్చలేకున్నవి. వాని సంసిద్ధికై అతడొనర్చు ప్రయత్నములలో ధర్మాధర్మములను గురుదైవములను సర్వమును త్యజించుటకైనను నాతడు వెనుదీయడు. అంతటి బలీయమైన కాంక్ష మానవునియందు మాత్రమే యుండనేల?

పశుపక్ష్యాది యితర జీవరాసులన్నియు, ఆయా యుపాధులయందు స్వాభావిక మగునట్టియు, ప్రారబ్ధ రూపమగునట్టివియు సుఖదుఃఖముల ననుభవించునేకాని, వాని అంతఃకరణమున ఆగామికర్మ ప్రేరకములగు సంస్కారము లుండవు. నూతన పుణ్యపాప సముపార్జనయు నుండదు. కనుక పశుపక్ష్యాదులయంద శాంతికి తావులేదు.

మానవాంతఃకరణమే అశాంతికి పుట్టిల్లు. అంతఃకరణ స్థూల ధర్మములైన కామ క్రోధ లోభ మోహ భయములు, సూక్ష్మధర్మములైన జ్ఞాన సంకల్ప నిశ్చయ చింతనాభిమానములున్ను అతనిని క్రుంగదీయుచుండును. మిగతా జీవులకున్ను అంతఃకరణ కలదుగాని అందీ స్థూల సూక్ష్మ ధర్మము లత్యల్పముగా నుండును. అట్లే వివేకయుక్తమగు విజ్ఞానమున్ను వానియందల్పమే. మానవుడు మాత్రము తన విజ్ఞానముచే నిత్యానిత్యములను నిర్ణయించి, ఆపైన --

"నిత్యానిత్యములనె నిర్ణయ మెరుగాక,
నిత్యుడై యుండేటి నిజబోధ"

నెరుగుట కందుచేతనే పూర్ణాధికారియై యున్నాడు. లేక, తన విజ్ఞానమును మంటకలుపుకొని ఆశాపాశముల జిక్కి అధోగతిపాలగుటకు మానవునికి మరీ సులభమై యున్నది.

శ్లో॥ కామం క్రోధంచ లోభంచ దేహే తిష్ఠతి తస్కరాః ।

జ్ఞాన రత్నాపహారేణ తస్మాజ్జాగ్రత జాగ్రత ॥

నీలోనున్న జ్ఞానరత్నమును దొంగిలించుటకు కామక్రోధాదులనే దొంగలు నీలోనే పొంచియున్నారు. జాగ్రత! అనియీ శ్లోకము హెచ్చరించుచున్నది.

సాధారణముగా మానవులు, అయురారోగ్యములు, అధికారాద్యష్టైశ్వర్యములు, పాండిత్యప్రతిభలూ కీర్తిప్రతిష్ఠలు, కోరి వానికై తమ సర్వస్వము ధారబోయుచున్నారు. కాని ఆయా కోరికలు ఫలించినా శాంతి కలుగుచున్నదా? పోనీవారార్జించిన సుఖశాంతు లెంతకాలముండును? సుఖము లన్నియు క్షణికములే. మరియు దుఃఖసమ్మిశ్రమములే. అనిత్యములును, దుఃఖ సమ్మిశ్రితములును గాని సుఖములు మచ్చుకైన గానరావుగదా!

అవి అనిత్యములై నశించుట వలన తిరిగి అశాంతి కారణములే యగుచున్నవి. ఆముష్మిక సుఖములగు స్వర్గాదిపుణ్యలోక సుఖములు గూడా దీర్ఘకాలికములు కావచ్చునే కాని శాశ్వతములుగావు, "క్షీణేపుణ్యే మర్త్యలోకం విశంతి" అని గీత చెప్పుచున్నది.

శాంతి, అశాంతి అనునవి సాపేక్షిక ద్వంద్వములై సుఖదుఃఖ కారణములై యున్నవి. కనుకనే శ్రీ కృష్ణదేశికేంద్రుల వారు తమకందార్థములలో "సంతోషాసంతోషము లంతలో గనవచ్చి, పిదపనరుగు నెచటికో" అన్నారు. కనుక క్షణికములగు వీని వలన శాంతి ఎట్లు చేకూరును ? ఎన్ని సుఖసాధనముల నుత్పత్తి చేసి సుఖములు పొందిననూ చివరికి అశాంతియే మిగులుచున్నది, కాని మనశ్శాంతి లభ్యమగుట లేదు. అట్టి మనశ్శాంతి కావాలంటే ద్వంద్వాతీతుడవు, గుణాతీతుడవు కావాలంటోంది భగవద్గీత. వేదములయందలి శాంతి పాఠములు "ఓ శాంతి ,శాంతి, శాంతిః" అని ప్రార్థనలు చేస్తున్నాయి. ముమ్మారు శాంతిని కోరుటలో పిండ బ్రహ్మాండముల యందూ ఆత్మయందూగూడ శాంతి వర్ధిల్లుగాక అని గొంతెత్తి పల్కుచున్నాయి. కాని యీ శాంత్యశాంతులకు స్థానభూతమైన ఆత్మయొక్క దోషస్వరూపమునుండి శాంతిని కోరుటలేదు. ఆ దోష నివృత్తిగానిదే ప్రశాంతి ఎట్లు చేకూరును?

అంతఃకరణయందు ద్వంద్వాతీత గుణాతీత లక్షణము లెట్లుగల్గును? కామ క్రోధాదులనుండి అంతఃకరణ విముక్తమైనప్పుడే అంతరంగ శాంతి కల్గును అని సాధారణాభిప్రాయము. అరిషడ్వర్గములో ప్రధానమైనది కామము. కనుక కామజయము కావాలి. కోరికలు నశించాలి అని అంతా అంటారు కాని అవి యెట్లు నశించును? వానిని బలాత్కారముగా

నిరోధిస్తే తాత్కాలికోపశమనము మాత్రమే కల్గును. శాశ్వతముగా కామజయము అనగా యిచ్ఛారాహిత్యము కలుగుటకు పూర్ణబోధ యొక్కటే శరణ్యము. కోరికలు కోరేది ఏదో, దాని రహితమునందుకానికోరికలు పొడచూపకుండా వుండవు సర్వద్వంద్వములకూ త్రిగుణములకు సమస్త కామనలకు మూలము, స్థానము అయిన అంతఃకరణమునకు (ఎరుకకు) పరిపూర్ణ పరబ్రహ్మమునందు స్థానముగాని మూలముగాని, లేదని గురుకృపచే నారూఢపరచుకొన్నవాని యొక్క అంతఃకరణము నిర్మలమై గుణాతీత స్థితి జెందును. నాడే ఆశాపాశములు అడుగంటును. అశాంతిహేతువగు తృష్ణసమూలంగా నశించును. సంగాసంగములు లేక నాతడుభుక్తి ముక్తిక్రియలయందు వర్తింపగల్గును. రాగ వైరాగ్యములకు కూకుడు వేరైన హృదయగ్రంధి ఛేదింపబడును. అపుడాతడు పొందు ప్రశాంతి యొక్క సుఖము మూడులోకములందునూ గానరాదు. అశాంతి నిలయమగు అంతఃకరణము అప్పుడు మాత్రమే ప్రశాంతి నిలయమై విరాజిల్ల గలదు.

***

30. వివేకము

'వివేకము' అనగా యుక్తాయుక్త విచక్షణా జ్ఞానము అని సామాన్యార్థము. యుక్తాయుక్త విచక్షణ చేయుట అంతరింద్రియములోని బుద్ధీంద్రియము యొక్క అధి భౌతిక వ్యవహారము. అంతరింద్రియములలో మొదటిదియగు జ్ఞానమునకు పని- వస్తువులను, శబ్దాది విషయములను గుర్తించుట, గుర్తెరిగిన విషయములలో మంచి - చెడులను నిశ్చయించుట బుద్ధి పని. యీ రెండున్నూ ఇంద్రియార్థములనే గుర్తించునుగాని అతీంద్రియమగు పారమార్థిక విషయములను గుర్తించవు. పారమార్థిక విషయములను గుర్తించి అందలి సారాసారములను విమర్శించి శ్రేష్ఠమగు పారమార్థిక సత్యత్వమును నిశ్చయించుకొనుటయే వివేక శబ్దమునకు విశేషార్థము. ఉదాహరణ పూర్వకముగా ఈ సామాన్య - విశేషార్థములను గ్రహించుట సులభమగును. ఇది సత్యము, ఇది అసత్యము; ఇది ధర్మము ఇది అధర్మము; ఇది హింస, ఇది అహింస; ఇది మేలు, ఇది కీడు - అని లౌకిక విషయములలో మంచి చెడులను యేర్పరచి మంచిని గ్రహించి తెలుసుకొనుట వివేకమునకు సామాన్యార్థము. ఇది బుద్ధి యొక్క ఆధిభౌతిక వ్యాపారము. ఇది సత్‌పదార్థము - ఇది అసత్పదార్థము, ఇది నిత్యము - ఇది అనిత్యము, ఇది దృక్ - ఇది దృశ్యము, ఇది ప్రకృతి - ఇది పురుషుడు, ఇది ఆత్మ- ఇది అనాత్మ, ఇది చిత్ - ఇది జడము -- ఇత్యాది పారమార్థిక

విషయములను, అతీంద్రియ విషయములను వివేచన చేసి తెలుసుకొనుటయే వివేకమునకు విశేషార్థము. ఇంద్రియార్థములలో మంచి-చెడులను గుర్తించుటను జ్ఞానమనీ, పారమార్థిక విషయములలో సత్యాసత్య నిర్ణయముచేసి, సత్యవస్తువును తెలిసికొనుట విజ్ఞానమనియు భగవద్గీత స్పష్ట పరిచినది.

శ్లో ॥ జ్ఞానం తే హంఽస విజ్ఞాన మిదం వక్ష్యామ్య శేషతః ।
యత్ జ్ఞాత్వానేహ భూయోఽ న్యత్ జ్ఞాతవ్యమవశిష్యతే ॥

అనగా దేనిని తెలిసినపిదప నిక తెలివిచే తెలియదగి నది లేదో దానిని గురించి చెప్పెద నన్నాడు భగవానుడు--"ఏక విజ్ఞానేన సర్వ విజ్ఞానం భవతి" అనగా దేనిని తేలిస్తే సర్వము తెలియబడునో ఆ వస్తువే జ్ఞానమునకు పరాకాష్ఠ . దానిని తెలిసికొనుటయే మానవోపాధియొక్క పరమ లక్ష్యము.

విచారణ, వివేకము అనునవి సమానార్థకములుకావు. విచారణ లేక వివేచనచే మానవుడు వివేకముచెందుచున్నాడు విచారణ వివేకమునకు సాధనము. వివేకము సాధ్యము. కనుక వివేకమునకు వస్తునిశ్చయజ్ఞానము అను అర్థమును గ్రహించుట లక్ష్యార్థము. అయినను బుద్ధినిశ్చయ జ్ఞానమే(Intellectual covniction) వివేకమనదగును కాని ఆత్మనిశ్చయ జ్ఞానము (సాక్షాత్కార జ్ఞానము Realisation కాదు).

విచారణ (Discrimiation) వలన, వస్తువు యొక్క బుద్ధినిశ్చయ జ్ఞానము కలుగును. ఇట్టి నిశ్చయ జ్ఞానమే (Intellectual conviction) వివేక శబ్ధమునకు లక్ష్యార్థమనియు ఆ పిమ్మట ఆత్మ నిశ్చయ జ్ఞానము కలుగుననియు, ఆత్మనిశ్చయ జ్ఞానమే అపరోక్ష సాక్షాత్కారము (Realisation) అనియు తెలిసికొంటిమి. విచారణ యనగా శాస్త్రవిచారణ గాదు. అపరోక్ష సాక్ష్కాత్కారముచేసుకొన్న గురుముఖతః గురుబోధ వినుటరీత్యా విచారణ సాగించవలెను.

శ్లో ॥ తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా ।
వుపదేక్ష్యంతి తే జ్ఞానం జ్ఞానిన స్తత్వదర్శినః ॥

అనగా గురువునకు భక్తిపూర్వకముగా సాష్టాంగ నమస్కారముగావించి, గురుసేవ చేయుచూ, చక్కగా అడిగి తెలుసుకొంటూ, విచారణ చేయవలెను. ఏలనంటే తత్వమును సాక్షాత్కరించుకొన్నవాడు గనుక ఆ గురుమూర్తియే నీకు వివేకము గల్గించ గలడని తాత్పర్యము. కనుకనే "గురోన్ముఖేన జ్ఞాతవ్యం నాన్యథాగ్రంథకోటిభిః" అనగా గురు బోధరీత్యానే తెలియబడును. కోటి గ్రంథములు చదివిననూ తెలియబడదని తాత్పర్యము.

శాస్త్రము వలన తెలియబడదనుటకు కారణమేమి? శాస్త్రము ఆత్మనుగూర్చి వర్ణించి చెప్పగలదేగాని ఆత్మ వస్తువును చూపించ లేదు. గురువు వస్తువును వర్ణించి చెప్పుట మాత్రంగాక, వస్తువును చూపించగలడు. కండ్లకు కానరాని వస్తువును ఎట్లు చూపగలడు? మనో నేత్రమునకు, లేక జ్ఞానచక్షువునకు చూపించగలడు. ఉదాహరణకు: భూగోళ శాస్త్రం "భూమి గుండ్రముగా నున్నది. తనచుట్టూ తాను తిరుగుటవలన రాత్రింబవళ్ళు ఏర్పడుచున్నవి" అనును. భూమి గుండ్రముగా నున్నది అంటూ చెప్పి, అందుకు కొన్ని యుక్తులను గూడా చెప్పుచున్నది. ఐనను బుద్ధినిశ్చయము కలుగుటలేదు. కాని వుపాధ్యాయుడు ఆ భూగోళ శాస్త్రమును వివరించి చెప్పుటయేగాక భూమి యొక్క నమూనాను (గ్లోబును) ఒక దీపమును తెచ్చి ఆ గ్లోబు తన చుట్టూ తాను తిరుగునట్లు చేసి, ఆ దీపప్రకాశము పడినచోటు పగలువంటిదనియు పడనిచోటు రాత్రివంటిదనియు చెప్పి రాత్రింబగళ్ళు అదేవిధంగా మనకు కల్గుచున్నదని చెప్పినపుడు మనకు బుద్ధినిశ్చయము (Intellectual cognition) కల్గుచున్నది. ఇట్టి దే పరోక్షజ్ఞానము (Indirect cognition) భూమియొక్క వర్తులత్వమును గూర్చి అపరోక్ష సాక్షాత్కారమును (Direct cognition) పొందగోరువారు స్వయముగా భూమిచుట్టూ తిరుగు ఏ వుపగ్రహములోనో భూ ప్రదక్షిణ చేస్తూ భూమియొక్క వర్తులత్వమును, రాత్రింబవళ్ళ రాకపోకలను గుర్తించ వలసియున్నట్లే, వివేకము పొందినవాడు మనన నిధి ధ్యాసల ద్వారా అపరోక్ష సాక్షాత్కారము (Realisation) పొందగలడు.

శాస్త్ర పాండిత్యమును వివేక మనరాదు. ఇదివరకు అధ్యాత్మిక పరిశీలన చేయుటలో, తమ జీవితములనే కైంకర్యము చేసిన మహాత్ముల దివ్యానుభూతులు, శాస్త్రరూపములో మనకు నేటికినీ లభ్యమగుచున్నది. అట్టి శాస్త్రవిషయములు "శ్రుతయశ్చభిన్నాః స్మృతయశ్చ భిన్నాః మహ ఋషీణాం మతయశ్చ భిన్నాః" అన్నట్లుగా పరస్పర విరుద్ధములుగా నుండగలవు. అట్టి నిశ్చయములను పూర్వపక్ష సిద్ధాంతములు చేసి సమన్వయము చేసి అవగాహన చేసుకొనకుండా అది ఆ ప్రకరణార్థము, ఇది యీ ప్రకరణార్థమని కొందరు పండితులు పల్కుట మనం గమనిస్తూనేవున్నాము. ఇందుకు వస్తురూపమైన అనుభవజ్ఞానం (విజ్ఞానం లేక వివేకం) లేకపోవుటయే కారణము. చిలుకపలుకులవలె, ఆ గ్రంధమట్లు చెప్పినది; యీ గ్రంధములో నిట్లున్నది అని వారు పునరుద్ఘాటించగలరు. ఇది కేవలము శాస్త్ర పాండిత్యము మాత్రమే గాని భగవద్గీతలో చెప్పబడిన సమదర్శిత్యమునకు చేర్చు వివేక జ్ఞానము (Wisdom) కాదు.

వివేక మెట్లు విచారణ సాగించిన కలుగును ? ఇందుకు ప్రాతిపదికగా ప్రప్రధమమున, యీ ఖగోళ భూగోళములతో గూడిన దృశ్యమాన ప్రపంచమునకు పూర్వాపరములయందు యీ సృష్టి కాధారముగా అధిష్టానముగా, లేక కారణ కర్తృత్వములు గలదిగానున్న వస్తువేదో ఒకటియుండి

తీరవలెను. అదేదైవము; ఆత్మ లేక బ్రహ్మము అని ఆస్తిక్య బుద్ధియు, దానిని తెలుసుకొనవలెనను ప్రగాఢమగు కోరికయు నుండ వలెను. దీనినే శుభేచ్ఛ అందురు. యిది పూర్వపుణ్యమున్న వారికే గల్గునుగాని అన్యులకుండదు. ఇట్టి శుభేచ్ఛ యే లేని వారి నెందరినో మనం చూస్తూవున్నాము. దేవుడే లేడు. సృష్టికి కర్తయూలేడు. సర్వమూ ఆ యా వస్తువుల నైసర్గిక స్వభావముచేతనే కలుగుచున్నవి. నాశనముచెందుచున్నవి. అను నిరీశ్వరభావముగలవా రప్పటికీ యిప్పటికీ యెప్పటికీ వుంటూనే వుందురు. ప్రపంచమందలి వస్తువు లన్నియు అపారములు; యివి ఆత్మకాదు అని, నేతి, నేతి అని నిషేధించి, వీనియన్నిటికీ కారణ రూపమగు సార వస్తువే ఆత్మ, లేక బ్రహ్మము, అని దృఢనిశ్చయ జ్ఞానము పొందుటే వివేకము. ఇట్టి వివేకము పొందనివారందరూ అవి వేకులనియే (పారమార్థికముగ) అనదగును. వారే మూఢులు. తమ బుద్ధీంద్రియమును పారమార్థిక వివేకమును పొందుటకై వినియోగించని వారినే ''మూఢమతే!'' అని శంకరభగవత్పాదులు సంబోధించియున్నారు.

వివేకమునకు పూర్వాంగములు : - 1. పూర్వపుణ్య విశేషము వలన, దైవము, ఆత్మ లేక బ్రహ్మము అనే దాని యందాస్తిక్య బుద్ధి కల్గి దానిని తెలియవలెననే ఆకాంక్షరూపమగు శుభేచ్ఛ ప్రధమాంగము.

2) అట్టి సత్పురుషుల సహవాసము రెండవది. దీని వలన జన్మతః కలిగిన శుభేచ్ఛ (విచారించి తెలుసుకొనవలెననే ప్రవృత్తి) అధికమగును.

3) విచారణ లేక వివేచన - గురువుల నాశ్రయించి వారి ముఖతః సారాసారములను పరిశీలించి, అనిత్య వస్తువులను నిత్య వస్తువును వస్తునిర్ణయ పూర్వకముగా గుర్తెరుగుట.

4) వైరాగ్యము నాల్గవది. అనిత్య వస్తువుల యెడ వైరాగ్యము, నిత్యవస్తువునందు ప్రేమ గలుగుట. ఈ నాలుగున్ను వివేకోదయమునకు పూర్వాంగములుగా చెప్పవచ్చును. వివేకమువలన వైరాగ్యము గల్గునా? లేక వైరాగ్యము వలన వివేకము గల్గునా? దీనినే మరియొక విధముగా చెప్పవలెనంటే 1) ఆత్మను దెలుసుకొనుటవలన ఆత్మ ప్రేమగలిగి ప్రాపంచిక విషయములందు రోతకల్గునా? లేక 2) విషయములయందు వైరాగ్యము చేత లేక రోత కల్గుట వలన ఆత్మ ప్రేమ కలుగునా? 1) మొదటి కల్పములో -- ఆత్మను తెలుసుకొనుట యనగా ఆత్మయొక్క స్థాన స్వరూప స్వభావములు తెలుసుకొనుట యని అనవలెనుగదా! ఆత్మ సత్యం లేక నిత్యం అను కేవల వాచాజ్ఞానము వలన మాత్రమే యెట్టి ప్రయోజనమున్నూ లేదు. స్థాన స్వరూప స్వభావములు తెలిసినచో మాత్రమే తనయందు అఖిల భూతములందు ఆత్మ ఎట్లున్నదో దేహ ప్రపంచముల యొక్క నామ రూపక్రియా సుఖానుభవము లెట్లు అనిత్యములో చక్కగా తెలియబడును. అందువలన అనిత్యమగు నామ రూప ప్రపంచము నందు వైరాగ్యము స్థిరపడును.

నిత్యమైన ఆత్మయందే ప్రేమ ఏర్పడును. మిగతా నామ రూప క్రియా సుఖానుభవములయందు రోత కల్గును. ఆ పిదప సన్యసించినచో దానిని విద్వత్ సన్యాస మందురు. 2) రెండవకల్పములో అనగా వైరాగ్యము కలిగిన పిమ్మటనే వివేకోదయ మగుననే పక్షంలో -- వారి వాదన యెట్లనగా -- ప్రపంచమునందలి వస్తువులన్నియు అనిత్యములు, విశేషించి దుఃఖప్రదములు. పంచతన్మాత్ర విషయములగు శబ్ద స్పర్శ రూప రస గంధములు సుఖ దుఃఖద్వంద్వములు గలవిగా నున్నవేగాని కేవల సుఖము దేనియందునూ గానవచ్చుటలేదు. ఏ సుఖము నూహించినా క్షణికమే. ఆ క్షణిక సుఖము గూడ పర్యవసానమందు దుఃఖమునే కలిగించుచున్నది. ఇట్టి కించిత్సుఖమునకై ప్రాకులాడనేల? ఏసుఖానుభూతి పొందిననూ తృప్తి కలుగుటలేదు సరిగదా తృష్ణనే (మరల మరల ఆ సుఖానుభవము పొందవలెననే ఆశనే) రేకెత్తించుచున్నది. ఈ తృష్ణకు అంతమే లేదు. అనుభవించుటవలన కోరికలు తీరవు, తృప్తి కలుగదు. సరిగదా ఆజ్యముపోసి అగ్నిని చల్లార్చ నెంచుటవంటిదే అగుచున్నది. వస్తువు నందు గల ధోష దర్శనము చేసి, అదెట్లు దుఃఖమును కలిగించుచున్నదో చింతించుట వలన వస్తువునందు రోతగల్గి వైరాగ్య మేర్పడుచున్నది. ఈ దుఃఖదోషాను దర్శనమువలన "నిర్దోషంహిసమంబ్రహ్మ" అని చెప్పబడిన దుఃఖరహితము, దొషరహితము, అనందఘనమూనైన బ్రహ్మమునం దానక్తి గల్గి సద్గురువుల నాశ్రయించి క్రమశః వివేకము పొందవలెను. వైరాగ్యములేనిచో వాచా వివేకత్వమేగాని నిజమగు వివేకము కలుగదని వీరు అందురు. వైరాగ్యము కలిగిన పిదప ఆత్మ విచారణ చేయుట కొరకై సన్యసించుట వివిదిషా సన్యాస మందురు.

ఇట్టి వైరాగ్య మెట్లు ఉదంచును ? అంటే --

1) శుభేచ్ఛవలెనే వైరాగ్యముకూడా నిర్నిమిత్తముగా, శుకుడు, వామదేవుడు, జడభరతుడు, రమణమహర్షి అది మహాపురుషులకు వలె పూర్వపుణ్య విశేషముచే ప్రాప్తించ వచ్చును. 2) ప్రపంచమున జూచిన దుఃఖదృశ్యములచే కాకతాళీయముగా అశోకునకు బుద్ధునకు వైరాగ్యము కలిగినట్లు కలుగవచ్చును. 3) వైరాగ్యపరులైన సాధుసత్పురుషుల సహవాసముతోను వారి ప్రసంగములు వినుటవలననూ వైరాగ్యము కలుగవచ్చును. 4) లేదా ఆప్తులగు భార్యా పుత్రాదుల మరణమువలనను లేక ఐశ్వర్య నాశనము వల్లనూ కలుగవచ్చును. 5) జన్మాదిగాకల్గుతూ వచ్చిన కష్ట పరంపర కారణముగా నిస్పృహ, నిరాశ కల్గుట వలన కలుగవచ్చును. కుంతీదేవికి జన్మాదిగాకల్గిన కష్ట పరంపరలచే వైరాగ్యము కలిగి చివరకు శ్రీ కృష్ణ నిర్యాణావసరమున ఎప్పుడూ కష్టములే తనకు కావలెనని (అందుచే భగవద్భక్తి పెంపొందగలదనే భావనతో) శ్రీ కృష్ణుని వరమడిగెనట 6) రానున్న మహోపద్రవ రూపమగు ప్రజానాశనము నకు, బంధునాశనమునకు భీతి చెందుటవలన వైరాగ్యము, విషాదము కలుగవచ్చును. అర్జునుడు--

శ్లో ॥ నకాంక్షే విజయం కృష్ణ ! నచ రాజ్యం సుఖానిచ।
కింనో రాజ్యేన గోవింద! కిం భోగైర్జీవితేన వా! ॥

అంటూ అస్త్ర సన్యాసము చేసి త్రిలోకాధిపత్యము కూడ తనకు వలదని వైరాగ్యముపూని విషాదగ్రస్తుడైనాడు. ఆ పిదపనే అతనికి శ్రీకృష్ణుడు గీతా ప్రబోధముగావించి కర్తవ్య నిష్ఠుని చేసినాడు.

తీవ్ర వైరాగ్యపరునికే వివేకోదయమగును. పురాణవైరాగ్యము ప్రసూతి వైరాగ్యము, స్మశాన వైరాగ్యముల వంటి తాత్కాలోచిత వాచాడంబర రూప వైరాగ్యముల వల్ల వివేకోదయము కాజాలదు. వైరాగ్యము వలన ముముక్షుత్వ మేర్పడును. ముముక్షుత్వమనగా తీవ్రమగు మోక్షాపేక్ష. ముముక్షుత్వము కలుగనియెడల మహాపురుష సంశ్రయము లభించదు.

శ్లో ॥ దుర్లభం త్రయమేతత్ దైవానుగ్రహ హేతుకం ॥
మనుష్యత్వం ముముక్షుత్వం మహాపురుష సంశ్రయః ।

అని వివేక చూడామణి. మహాపురుషు లనగా "స్వయంతీర్ణః పరాంస్తారయతి" తాము తరించి యితరులను తరింపచేయగల సద్గురువులే. అట్టి సద్గురువులను సాక్షాత్ బ్రహ్మస్వరూపులుగా నుపాసించిన వారికే వివేకోదయము కాగలదుగాని కేవల గురుబోధ శ్రవణం చేసిన మాత్రాన కలుగదు. ఏలననగా వివేకోదయమునకు ప్రతిబంధకములుగానున్న మలవిక్షేపావరణ దోషములు తొలగవు. పాప సంస్కారములే మలదోషము. ఇది నిష్కామ కర్మాచరణము వలన నశించును. ఉపాసనలవలన విక్షేపదోషము (మనస్సు యొక్క చాంచల్యము) నశించును. "సర్వశరీరస్థచైతన్య ప్రాపకో గుర రుపాస్యః" సర్వోపాధిగతమగు పరమాత్మ చైతన్యమును ప్రాప్తింపచేయు గురుడే యుపాసింపదగిన వాడని నిరాలంబోపనిషత్ యుటంకించుచున్నది. "తదేవ బ్రహ్మత్వం విద్ధివేదం బ్రహ్మ యదిద ముపాసతే" అని కేనోపనిషత్తు అవరణ దోషము గురువాక్యము వలన నివర్తి యగును. గురు సమాశ్రయమువలననే యీ మూడు దోషములును నివర్తియగును. కనుక గురూపాసన చేస్తూ గురువువల్లనే బోధ వినవలెను. విన్నదానిని మనన నిధి ధ్యాసలు చేయవలెను.

సద్గురువు ఏమి బోధించును ? 'తత్త్వమసీ' మహా వాక్యమును బోధించును. బోధించుట అనగా వాక్యమును వుపదేశించుట మాత్రమే గాదు. 'తత్ - త్వం- అసి' అను పద పదార్థములను వస్తు నిశ్చయ పూర్వకముగా దర్శింపచేయును. "దర్శితం యేన.... తస్మై శ్రీగురవే నమః" అని గురుగీత చెప్పుచున్నది. ఆ విధముగా దర్శింపచేస్తూ చేసిన బోధవలనగాక సంశయ విపరీత భావనలు పోజాలవు. ఇది త్రాడా లేక పామేనా అనుట సంశయము. ఇదే పామేననుకొనుట విపరీతభావన. వస్తు నిశ్చయ రూపమగు గురుప్రబోధ వలననే యివి రహితముకాగలవు కనుక అట్టి గురుబోధనే శ్రవణము చేయ వలెను. మనన క్రియ వలన తానే ఆ బ్రహ్మమనే దృఢజ్ఞానము కల్గును. గురువునందలి అంధ విశ్వాసముతో గురువాక్యము శ్రవణము చేయుట మాత్రముతో

నాగక మనన క్రియ చేయవలెను, మనన మనగా మనస్సుచే విన్న విషయములు పదేపదే చింతించి శోధించుట. అనుసంధానము, చింతనము, పరిశీలన, విమర్శన ఆలోచన - వగైరా చేయుటయే మననము. ఇట్టి ప్రత్యక్షమూలక విచారణయే వివేక సాధనము.

కనుక వైరాగ్యము వలన సద్గురువు నాశ్రయించి శ్రవణ మనన నిధి ధ్యాసలు చేయుట వలననే వివేకోదయ మగునని పలువురి అభిప్రాయము. వివేక, వైరాగ్యాది సాధన చతుష్టయ సంపత్తి కల్గినవాడే శ్రవణాధికారి అని శాస్త్రములున్ను చెప్పుచున్నవి. వారు నిత్యానిత్య వస్తు వివేకము ప్రధమాంగముగా నిర్ణయించినారు. ఇందు నామ రూపాత్మకమగు ప్రపంచ అనిత్యత్వమే తెలియబడుచున్నది. తటస్థ లక్షణముచేగాని, స్వరూప లక్షణముచేగాని, అతద్వ్యావృత్తి లక్షణముచేగాని నిత్యమని చెప్పబడే ఆత్మ లేక బ్రహ్మ అనువస్తువు అనుమాన ప్రమాణముచే వుండి యుండవచ్చును అని మాత్రమే తెలియబడుచున్నది.

ఇది శ్రవణము చేతనే తెలియబడు చున్నది. ఇది బుద్ధి నిశ్చయ జ్ఞానము (Intellectual conviction) కూడా కాదు. కనుక వివేకమని చెప్పరాదు. ప్రయోగశాలలో (Globe) భూమియొక్క నమూనాను చూపి ఆ విధముగా భూమి గుండ్రముగా నున్నట్లు చెప్పుటవంటిది కాదు. పురుష ప్రకృతులు ఓతప్రోతముగా కలసియున్నవి. అందు ప్రకృతి రూపమగు ప్రపంచమందు పురుష రూపమగు బ్రహ్మమే విధముగానున్నదోచెప్పి ప్రకృతిని చేటాయించి పురుషుని చూపినపుడే బ్రహ్మముయొక్క వస్తు నిశ్చయ జ్ఞానము కల్గును. యిదే వివేకము, గురువు యిట్టి వివేకముకల్గించును. యిట్టి వివేకవంతులకే --

శ్లో॥ శ్రీగురోఃపరమారూపం వివేకం చక్షు రగ్రతః ।
మందభాగ్యా నపశ్యంతి అంధస్సూ ర్యోదయం యథా ॥

ఇట్టి వివేకము గ్రంథములు కల్గింపలేవు. మనస్సు బ్రహ్మాకారవృత్తి వహించినపుడే అది అపరోక్ష సాక్షాత్కారము (Direct cognition) అనబడును.

ఈ విధముగా, ఆత్మయొక్క (బ్రహ్మము యొక్క) పరోక్ష జ్ఞానమున్ను, అనాత్మయొక్క ప్రత్యక్షజ్ఞానమును కలిగినపిదపనే ఆత్మయందు ప్రీతి, అనాత్మయందు రోత కలుగునే కాని, పూర్వజన్మ సుకృతము లేని వారికి మరొక విధముగా వైరాగ్యము కలుగజాలదు. ఈ విధముగా వివేక జ్ఞానము వైరాగ్యమునకు సాధన మగుచున్నది. గురుమూర్తి కలిగించిన యీ వివేకము, శిష్యుని మననక్రియ చే ఆరూఢమై నిధి ధ్యాస చేసినచో అపరోక్ష సాక్షాత్కారమునకు దారి తీయును.

ఐతే నిజముగా ఆత్మానాత్మలని రెండు వస్తువులు లేనేలేవు. "ఏకమేవాఽద్వితీయం బ్రహ్మ" "నేహ నానాస్తి కించన" "సర్వం ఖల్విదం బ్రహ్మ" "బ్రహ్మైవేదం విశ్వమిదం వరిష్ఠం" ఇత్యాది

మన అధఃపతనమునకీ తెలివి యెట్లు పరంపరామూలకారణమైయున్నదో, క్రింది గీతా శ్లోకములు వివరించుచున్నవి --

శ్లో॥ ధ్యాయతో విషయాన్ పుంసః! సంగస్తేషూపజాయతే ।
సంగాత్సంజాయతే కామః కామా త్క్రోధోఽభిజాయతే॥

శ్లో॥ క్రోధాద్భవతి సమ్మోహః సమ్మోహాత్స్మృతి విభ్రమః॥
స్మృతి భ్రంశాద్బుద్ధినాశో, బుద్ధినాశా త్ప్రణశ్యతి॥

అనగా విషయములను గూర్చి చింతించుటవలన (లేక ధ్యానించుటవలన) సంగము, సంగము వలన కామము, కామము వలన క్రోధము, క్రోధమువలన సమ్మోహము, సమ్మోహమువలన బుద్ధినాశము, బుద్ధినాశము వలన సర్వనాశనము సంభవించుచున్నవనితాత్పర్యము. విషయములను గుర్తించిన పిదపగాని విషయ చింతన యుండదుగదా ! కనుక విషయములను గుర్తించు తెలివియే విషయ లోలత్వమునకు సంగమునకు మానవుని అధఃపతనమునకు మూలకారణమై యున్నదని చెప్పక తప్పదు. గుర్తెరిగే జ్ఞానము సుఖరూపమా ? లేక దుఃఖరూపమా? అని యోచిస్తే,కేవల సుఖరూపమూ గాక, దుఃఖరూపమూ గాక ద్వంద్వరూపమై యున్నదని స్పష్టమగుచున్నది.దుఃఖకారణమైన వస్తువునందు సుఖభ్రాంతిని, సుఖ కారణమైన వస్తువునందు దుఃఖభయమును కల్గించునదీ గుర్తెరిగే తెలివియే అయివున్నది. గుర్తెరిగే జ్ఞానమునందు యీ ద్వయదోషము సహజమైయున్నది. ఇది వుపాధిగతదోషము, కాని అది దోషరహితమని యనవచ్చును.అగుచో ఒక్క మానవోపాధియందే, ఒకే వస్తువు భిన్న భిన్నమగు దృష్టి భేదమును గల్గింపనేల ? ఉదాహరణకు సర్వావయవ సౌష్ఠవముగల స్త్రీ సౌందర్యము చూచి కాముకుడు ముగ్ధడగును. విరాగి తటస్థభావమును గల్గియండును. ఆమె పుత్రునికి పూజ్యభావమే కల్గించును. ఈపాప తటస్థ పూజ్యభావములు అన్నియు అంతఃకరణనే ఆశ్రయించి యున్నవి. ఆదిలో శుద్ధజ్ఞానమే అంతఃకరణాశ్రయమువల్ల దోషభూయిష్టమైనది అని దీనికిన్ని సమాధానము చెప్ప వచ్చును. కాని అట్లు అంగీకరించినా సకలమూ ఆ శుద్ధ జ్ఞానముయొక్క పరిణామ రూపములే అని చెప్పినపుడు, గుణ దోషములన్నింటికి మూలకారణము ఆ శుద్ధ జ్ఞానమేయగును. కనుక అదియును దోషరూపమేనని, అచలఋషులు నిర్ణయించి "నిర్దోషంహి సమం బ్రహ్మ" అని చెప్పబడినట్టిన్ని,దేనికీ కారణముకానటువంటిన్ని పరిపూర్ణ బ్రహ్మము (Absolute Brahmam) నే ప్రతిపాదించినారు.

శ్రు॥ "న కర్మణా న ప్రజయాధనేన త్యాగేనైకే అమృతత్వ మానశుః" అనగా కర్మలవలనగాని, సంతానమువలన గాని, ధనమువలనగాని అమృతత్వము సిద్ధించదనీ, ఒక్క త్యాగము వలనే

సిద్ధించునని శ్రుతి తాత్పర్యము. కర్మ త్యాగము, కర్మఫలత్యాగము అనునవి ఒక్క కర్తృత్వ త్యాగమునందే అంతర్భూతములు. కర్తృత్వ రహితముగా కర్మ లాచరించినచో కర్మ చేసిననూ చేయనట్లే. కర్తృత్వమే వదలిననాడు ఫలాభిసంధిన్నీ యుండదు. కర్తృత్వముతో బాటు భోక్తృత్వ భావమున్ను రహితమే యుగుచున్నది. కారణబ్రహ్మముయొక్క మహదహంకారరూపమగు జ్ఞానమే సర్వకర్తృత్వాహంకారమునకు మూలకారణము. కార్యములేని కారణముండునేగాని కారణము లేనిచో కార్యముండదుగదా ! కనుక కర్తృత్వాహంకారమునకు మూలకారణమగు అఖండ యెరుకయందలి భ్రాంతిరహితము నందే కర్తృత్వ రాహిత్యము సిద్ధింపగలదు. దానియందలి భ్రాంతిని త్యాగము చేయుటయే త్యాగమునకు పరాకాష్ఠ. మరియు యిష్టవస్తు త్యాగమే త్యాగ మనిపించుకొనునుగాని అయిష్ట వస్తువులను వదలివేయుట త్యాగమనియే అనరొప్పదు. లేనిచో తీర్థయాత్రలలో గయకేగి తనకిష్టములేని జీడిపండును, కాకరకాయను వదలిపెట్టినట్లే యగును. "ఆత్మనస్తు కామాయ । సర్వం ప్రియం భవతి" ఆత్మయందలి ప్రేమయే సర్వప్రేమలకు కారణము, ఆత్మయే ప్రేమకు నిధానము. అత్యంత ప్రేమపాత్రమైనది. ఆత్మయే. దానియందలి ప్రేమను త్యాగము చేయుటకంటె గొప్ప త్యాగము లేదు.

వస్తువులను పట్టుదలబూని వదలినంతమాత్రమున వస్తువులయందలి రాగము నశించదు. ఆయా వస్తువులయందలి విషయానందానుభవము కొరకు పరితపించుచునే వుండును. వాసనారూపముగ వస్తువులయందలి ప్రేమ అంతఃకరణమున హత్తుకొనియే యుండి విషయములపై కురుకుటకు తగిన సమయమునకై వేచియుండును. వస్తు భోగమునుమాత్రము వదలి విషయానురక్తిని వదలనివానిని మిథ్యాచారి అని గీత పేర్కొనుచున్నది. పంచతన్మాత్ర విషయములకు, మనగుర్తెరిగే జ్ఞానమునకు, మూలకారణమైన ఆత్మయందలి ప్రేమ నశించినగాని విషయాసక్తి వదలదు. ఆత్మయందలి రాగమును విడచుటయే నిజమైన వైరాగ్యము. ఇట్టి వైరాగ్యము సన్యాసమువలన లభించదు. పరిపూర్ణ రాజయోగము వలననే సిద్ధించును.

ఇప్పుడు వివేకవైరాగ్యములననేమో మనము తెల్సుకున్నాము. నిజమగు వివేక మేదియంటే పరిపూర్ణ పరబ్రహ్మమును, లేని యెరుకను (పరిపూర్ణ పరబ్రహ్మమందు మూలముగాని, స్థానముగాని లేకుండుటచే ఆత్మను లేనియెరుకన్నారు.) గురుముఖతః వస్తునిశ్చయపూర్వకముగా దృఢముగా తెలియుటయే వివేకము. పరిపూర్ణపరబ్రహ్మమునందు యెరుక (ఆత్మ) లేనేలేదని తెలిసి దానియందలి భ్రాంతిని విడచుటయే వైరాగ్యము.

***

31 పరోక్షాపరోక్షములు

అక్షము అనగా యింద్రియములు. మన జ్ఞానమంతయు ఇంద్రియజ్ఞానమైయున్నది. మనస్సు జ్ఞానేంద్రియములద్వారా శబ్ద స్పర్శ రూప రస గంధములనే విషయపంచకమును తెలుసుకొనుచున్నది. ఈ విశ్వమంతయు పాంచభౌతికమై యుండుటచే ఆపంచభూతములయందు సూక్ష్మరూపముగా ఈ శబ్దాదివిషయములు అన్నీగాని కొన్నిగానివుండి మన జ్ఞానేంద్రియములకు గోచరించి గ్రహింపబడుచున్నవి. పంచభూతములకు కారణమై సూక్ష్మాతిసూక్ష్మ మహాసూక్ష్మమైయున్న ఆత్మను ఈ జ్ఞానేంద్రియముల ద్వారా ప్రసరించిన మనస్సు గుర్తింపజాలదు. కాని యింద్రియముల ద్వారా శబ్దాది విషయములను గుర్తించుటమాని తన్ను వుపసంహరించుకొన్న మనస్సు ఆత్మను తెలుసుకొనుచున్నది. ఈ మనస్సు అపుడు శుద్ధమనస్సు, నిరీంద్రియమనస్సు అని పిలువ బడుచున్నది. "మనసైవానుద్రష్టవ్యం" (అనగా మనస్సుచే చూడదగియున్నది.) అను శ్రుతి వాక్యములో చెప్పబడిన దిట్టి నిరీంద్రియ మనస్సే.

ఇంద్రియములకు గోచరించు విషయములు ప్రత్యక్షములని చెప్పబడుచున్నవి. యింద్రియములకు గోచరించనివి పరోక్షవిషయుములు. కనుక విశ్వము ప్రత్యక్షముగానూ విశ్వకారణమగు ఆత్మ పరోక్షముగానూ వున్నవి. కాని ప్రత్నముచే మనస్సును శుద్ధ మొనరించి ఏకాగ్ర మొనర్చినచో పరోక్షముగాయున్న ఆత్మగూడ తెలియబడుచున్నది. కనుక ఆత్మ పరోక్షముగాను ప్రత్యక్షముగానుకూడ వున్నది.

పరోక్షమంటే దూరముగా నున్నది అనియున్ను అర్థమున్నది. కనుక ఈ అర్థములో అపరోక్షమంటే దగ్గరగా కట్టెదుటనే వున్నదని అర్థము చెప్పవలసివున్నది. ఇంద్రియములద్వారా తెలియబడు శబ్దాదులు సమీపములో వుంటేనే తప్ప యింద్రియములు వానిని గ్రహించలేవు. ఇంద్రియముల శక్తి పరిమితమై యున్నది. కనుక దగ్గరలో నున్న విషయములో ప్రత్యక్ష మగునని తెలియవలెను.

విశ్వమూ, విశ్వకారణమూ రెండూగూడా ప్రత్యక్షముగానూ పరోక్షముగానూ గూడ యున్నవి.

ఐతే పరిపూర్ణబ్రహ్మము ప్రత్యక్షమా ? లేక పరోక్షమా, లేక అపరోక్షమా ? అను ప్రశ్నకు ఏమి సమాధానము ? పరిపూర్ణమిందేదిన్నీ కాదు అనియే జవాబు చెప్పవలెను. ఎట్లనగా :- యింద్రియములచేగాని "మనస్సష్ఠాణీంద్రియాని" అని చెప్పబడే యింద్రియరూప మనస్సుతోగాని శుద్ధమనస్సుతో గాని, ఎరుకచేగాని తెలియబడదు కనుక అది ప్రత్యక్షము అని చెప్పరాదు. ఆపరిపూర్ణపరబ్రహ్మము పరోక్షము(దూరముగా నున్నది) కాదు. ఏలననగా అది సకల దేశములందు

(సర్వప్రదేశములయందూ సర్వత్రా) నున్నది. పోనీ అపరోక్షమై(దగ్గరలోనే) యున్నదేమో నంటే అట్లున్ను చెప్పరాదు. అదే పరిపూర్ణమై మిగతా తెలియబడేవి, తెలుసుకొనేవి, తెలివి (జ్ఞాతృ, జ్ఞానజ్ఞేయము) అనే త్రిపుటి లేనిదీ త్రిపుటి కానిదీ అయివున్నది. అది కేవలము అవిజ్ఞేయమై యున్నది. మరియును ఆ పరిపూర్ణ పరబ్రహ్మము మిగతా వేమీ లేనపుడు, అది దేనికి దగ్గరగా నున్నది, దేనికి దూరముగానున్నది ? ఏమీ చెప్పలేముగదా ! "తదేజతి, తన్నైజతి, తద్దూరే తద్వదంతికే తదంతరస్య సర్వస్య తదు సర్వస్యాస్య బాహ్యతః" (అనగా అది కదలును, అది కదలదు. అది దూరముగా నున్నది, అది దగ్గరగానూ యున్నది. అది అన్నిటి లోపలా నున్నది. అది అన్నిటి బైటనూ వున్నది) అను శ్రుతి అధిష్ఠాన బ్రహ్మమునకే వర్తించునుగాని పరిపూర్ణ పరబ్రహ్మమునకు వర్తించజాలదు. కనుక దానిని అపరోక్షమనిన్ని చెప్పజాలము. అది వాక్కునకే అందనిదని చెప్పబడుతోంది కనుక దానిని ఏమనీ చెప్పలేము.

ఐతే "అపరోక్షమౌనె మనుజులకు పరోక్షంబైన బయలు గురు కృప లేకన్ ..." అంటూ శ్రీకృష్ణదేశి కేంద్రులేల వ్రాసినారు ? అని శంక కలుగుతుంది. యెరుక (అనగా గుర్తించే తెలివి) వున్నంతవరకు అదిపరోక్షముగా వున్నదానివలె కానవస్తూంది. కాని అది వద్దనే వున్నది గుద్దుకున్నా తెలియదు. పరిపూర్ణము, యెరుక అనే రెంటిలో పరిపూర్ణ పరబ్రహ్మమే యెప్పటికీ వున్నది. యెరుకలేనిది ఎరుకలేకుండా పోతే పరిపూర్ణము స్వతసిద్ధమై యున్నది. గురుకృపచేత మాత్రమే, లేని యెరుక, లేకుండా పోగలదు. అప్పుడు వున్నదొక్క పరిపూర్ణ పరబ్రహ్మమే స్వతస్సిద్ధమై సర్వత్ర నిండియున్నది. అపుడది దూరముగా వున్నదనిగాని, దగ్గరగా వున్నదనిగాని చెప్పరాదు. అది తప్ప రెండోది లేదు. గనుక దేనికిని అది దగ్గరగానూ లేదు, దూరంగానూ లేదు. కనుక రెండవదైన యెరుక వున్నంతసేపూ పరిపూర్ణము అనే మాటయే వుచ్చరింపరాదు. అపుడు యెరుకకు అది పరోక్షమై, దురవగాహమై, బహుదూరస్థమై యున్నది. గురుకృపచే యెరుక రహితమైతే అప్పుడు పరిపూర్ణము స్వతస్సిద్ధమై యున్నది. "దూరముగా వున్నది" "దగ్గరగా వున్నది" అనేమాట పలికేవారే లేక, తాను తానై ఏకమై వున్నది.

అధిష్ఠాన వస్తువు తానే అయివున్నట్టు ఆరూఢత కలుగుటే అపరోక్షమని యితరులంటారు. సర్వ కారణమగు ఆ యెరుక రహితమగుటే పరిపూర్ణము అపరోక్షమగుటయని పూర్ణభావజ్ఞుల నిర్ణయము. వారి భావములో పరిపూర్ణము స్వతస్సిద్ధమై వుంటుందేగాని అది తాను యెన్నడు కాదు, అది యిది కాదు, ఇది అది కాదు అని శ్రీ శివరామదీక్షితులవారి సూక్తి. కనుక పరిపూర్ణ విషయములో పరోక్షము, అపరోక్షములనే శబ్దములు కేవల ఔపచారికములుగా మాత్రమే శ్రీకృష్ణ దేశికేంద్రులవారు వాడినారు. అందుకే వారి కందపద్యములలో "మాటమాయైతె మానెను, మాటను మాట్లాడి మనము మానుద మవలన్" అన్నారు. కనుక ఏ కల్పములోనూ పరిపూర్ణము పరోక్షమూగాదు, అపరోక్షమూకాదు. యెరుక మాత్రమే పరోక్షముగానూ అపరోక్షముగానూ వున్నది.

పరోక్షము అనగా యింద్రియముల విషయగ్రహణకు దూరస్థమైనది పరోక్షమనబడును. అక్షము అనగా ఇంద్రియములు లేక కన్ను ; పర అనగా దూరము. పరముగానున్నది అని అర్థములు. పర + అక్షము = పరోక్షము కనుక కన్ను మొదలగు యింద్రియములకు దూరస్థమై యున్నది. పరోక్షమనుటలో ఆవస్తువు వున్నది గాని చాటుగా యున్నది యన్నమాట. అట్టి వస్తువు వున్నదని మాత్రము తెలియుట పరోక్షజ్ఞానము.

పరోక్షమునకు ప్రతియోగి ప్రత్యక్షము. ప్రత్యక్షమనగా ఇంద్రియ గోచర మయ్యేది. మన స్పష్టాణీంద్రియాని అని అన్నారు. యేలననగా జ్ఞానేంద్రియముల ద్వారా మనస్సు వస్తువులను గుర్తిస్తూవున్నది. మనస్సు అంతఃకరణమందు మగ్నత చెందిన సుషుప్త్యాదులలో ఇంద్రియము లుండియు లేనివే యగుచున్నవి. కనుక మనస్సును ఆరవ యింద్రియమన్నారు. మరిన్ని స్వప్నమునందు మనస్సేయే యింద్రియ విషయములు కట్టెదుట లేకున్నను జ్ఞానేంద్రియ వ్యాపారములు భావనారూపముగా చేయుచు సమస్తమును గుర్తిస్తూ వున్నది. ఇదే మానసిక ప్రత్యక్షము, ప్రత్యక్షముగా చూచుట యననిదే యర్థము. ఏకాగ్రతతో యే ఆకారములను భావించునో ఆయారూపములు మనస్సు తానే దాల్చి తన కట్టెదుట చూచుచున్నట్లే ఆయాకారములను చూచును. ఇదే వస్తుసాక్షాత్కారము. అంతే గాని ఆ దేవతామూర్తులు కట్టెదుట వచ్చి నిల్వవు. మనోహి జతువత్ అనగా మనస్సు లక్కవంటిది. లక్క అగ్నియొక్క సన్నిధానముచే మెత్తబడి యే ఆకారమయినను దాల్చగలదు. అట్లే మనస్సు ఏకాగ్రలక్ష్యముచే యే వస్తువును ధ్యానించినా ఆ వస్తురూపమును వహించును. కనుక యింద్రియసన్నికర్షణజ్ఞానమే ప్రత్యక్షముగాని తెలియబడున దెల్ల సత్యమని భావించరాదు. సూర్యబింబమును ప్రత్యక్షముగా మనము చూచుచున్నాము. అరచేతికంటే అధిక వైశాల్యము కనుపడుటలేదు. అయినను వాస్తవముగా భూమండలమునకంటె యెన్నోరెట్లు పెద్దదై యున్నది. కనుక ప్రత్యక్షముగా గూడ కేవలముగా ప్రమాణమని స్వీకరింపబడలేదు.

పరోక్ష ప్రత్యక్షములకంటెను విలక్షణమై, యున్నదున్నట్లుగా తెలియబడుటయే అపరోక్షము. ఏలననగా ఇది యింద్రియ సన్నికర్షణ జ్ఞానము కాదు. కనుక ప్రత్యక్షము కంటె విలక్షణమైనది మరిన్ని వూహామాత్రమైన పరోక్ష జ్ఞానమూ కాదు. ఎందుకనగా పరోక్షజ్ఞానము అనుమాన ప్రమాణము చేతనే కలుగుచున్నది. మానసిక ప్రత్యక్షము సత్యము అసలే అనరాదు. ఏలననగా యెట్లు భావించిన అట్టి ఆకారమును మాత్రమే మనస్సు ప్రత్యక్షముగా చూచును గాని వున్నదున్నట్లుగా సత్యవస్తువు గోచరించినదని చెప్పలేము. యధాతథముగా అనగా ఉన్నదున్నట్లు తెలియబడుట అపరోక్షము.

అద్వైత సిద్ధాంతమును వివరించుపట్ల పరోక్షా పరోక్ష జ్ఞానముల తారతమ్యమును ఒక దృష్టాంతరీత్యా విశదీకరించినారు. పరమానందయ్య శిష్యులుగా పదిమంది కలిసి ఎక్కడికో

"అపరోక్షమౌనే మనుజులకు
పరోక్షంబైన బయలు గురుకృపలేకన్ ?
అపరోక్షమౌను మనుజులకు
పరోక్షంబైన బయలు గురుకృపకలుగా;
కీలదె లేని యెరుక తా తొలుగా ॥"

అని కందార్థంలో గానం చేసినారు.

ఈ అన్ని పదములు యెరుకకే వర్తించును. ఎట్లనగా జ్ఞానేంద్రియములచే గుర్తించలేము. కనుక అది పరోక్షము అనవచ్చును. 'మనసై వానుద్రష్టవ్యం' అని మనస్సుచే గుర్తింపబడుచున్నది. కనుక ప్రత్యక్షమున్ను అయివున్నది. జ్ఞాన దృష్టితో చూస్తే తానే ఆ బ్రహ్మము. బ్రహ్మమే తాను అయివున్నాడు. కనుక ఆయెరుక అపరోక్షమున్నూ అయివున్నది. అంతేకాక యీ యెరుకయందేదీ కాకుండా కూడా యున్నది. "యద్యపృశ్యతిచక్షుబ్యాం తత్తదాత్మేతి నిశ్చియా ...." అనే శృత్యానుసారం, అనేది, వినేది, కనేదీ వేయేల సమస్త విశ్వము "బ్రహ్మై వేదం విశ్వమిదం వరిష్టం" అని చెప్పబడి యింద్రియగోచరము అగుచున్నది. కనుక ఎరుక పరోక్షముకాదు. "అజ్ఞానేనావృతం జ్ఞానం తేన ముహ్యంతి జంతవః" అనబడుతూ అజ్ఞానావరణముచే కప్పబడి యున్నందున ప్రత్యక్షమనీ అనరాదు. పత్యగ్బ్రహ్మములకు విరుద్ధ ధర్మములు ప్రత్యక్షముగా గానవచ్చుచున్నవి. కనుక అపరోక్షమనిన్ని అనరాదు. కనుక యెరుకకన్నీ వర్తించుచున్నవి. మరొక దృష్టితో ఏదీ వర్తించుటలేదు. కనుకనే మాయా లక్షణమగు అనిర్వచనీయత్వము యెరుకకే సరిపడు చున్నది. ఎట్లనగా ---

"సన్నా ప్యసన్నా ప్యుభయాత్మికానో,
భిన్నా ప్యభిన్నా ప్యుభయాత్మికానః ।
సంగా స్యసంగా న్యుభయాత్మికానో,
మహాద్భుతాఽనిర్వచనీయ రూపా ॥

--- వివేకచూడామణి.

కనుక యెరుకకన్న మాయ యెందును లేదు అని అనవలసినదే, పరిపూర్ణ మేమి యనరానిది; ఏ శబ్దము వర్తించదు. ప్రత్యక్ష, పరోక్ష, అపరోక్ష శబ్దము లేవియు పరిపూర్ణ విషయములో చెప్పరాదు.

***

32 సన్యాసము : - కాంతా కనకములు

సన్యాసి కాంతా, కనకములను ఎంతమాత్రము దరిచేరనీయ రాదని. రామకృష్ణ పరమహంస నొక్కి నొక్కి చెప్పుచుండెడివారు. అంతేగాదు; డబ్బుయొక్క స్పర్శ తగిలితే తన శరీరము భగ్గున మండిపోవునని కూడా అంటూ ఉండేవారు. ఆయన ప్రబోధ వినుటకై వచ్చెడి నరేంద్రుడు (వివేకానందుడైనాడు) ఆ మాటలు నిజమా లేక అబద్ధమా ? పరీక్షించవలెనని రామకృష్ణుడు పరుండు ప్రక్క క్రింద యెవరును చూడకుండా నొక రూపాయ నాణెమును యుంచెనట. కొంచెము తడవైన పిమ్మట రామకృష్ణ ప్రక్కపై మేను వాల్చి రెండు క్షణములలో అదిరిపాటుతో లేచి మంట, మంట శరీరమంతయు భగ్గున మండిపోవుచున్నది అని గంతులు వేయుచుండెనట. అక్కడున్న వారందరు ఏమికారణ మేమికారణమని ఆందోళన పడసాగిరట, అపుడు నరేంద్రుడు అయ్యా! తమ వాక్యముయొక్క సత్యత్వ మరయుటకై నేనే యిట్లు చేసితిని తప్పు క్షమింపుడని, చెంపల వాయించుకొని క్షమాపణ వేడికొని, తాను ప్రక్క క్రింద నుంచిన రూపాయినీ తీసివేసెనట. అవును గురువుయొక్క నిజాయితీని అట్లు పరీక్షించవలసినదే! అని రామకృష్ణ పరమహంస తిరిగి ప్రక్కమీద పడుకొని చంటిపిల్లవానివలె హాయిగా నిదురించెనట. అట్లే నిజమైన సన్యాసి కామినీ కాంచనములను వమనాన్నము (కక్కినకూడు) వలె దూరంస్త మొనరించ వలెను "నరుడు పక్వాన్నతతిని కక్కి మరల నాకునే? యతి సంస్కృతి విడచి తిరిగి పూనునె...." అన్నారు శ్రీకృష్ణ దేశికులవారు.

శ్లో॥ ద్వావిమౌ పురషాలోకే శిర శ్శూల సమౌ మతే ।
గృహస్థశ్చ నిరారంభో, యతిశ్చ సప్రతిగ్రహః ॥

తాత్పర్యము : ఏపనియుచేయక, సోమరియై తిరుగు గృహస్తున్ను ధనాదులను ప్రతిగ్రహించు సన్యాసియు యీ యిర్వురును లోకమునకు బాధాకరులై ఎంతో శిరోవేదన కల్గించువారై యున్నారు.

శ్లో॥ నరకాయతే మతిః చేత్ పౌరోహిత్యం సమాచర
వర్షం యావత్ కిమన్యేన, మఠచింతాం దినత్రయం॥

తాత్పర్యము : నీకు నరకం కావాలంటే ఒక సంవత్సరం పాటు పౌరోహిత్యం చేయి . అబ్బా! అంత కాలం ఎవనికోపిక వుందంటావేమో, మూడురోజులుపాటు మఠాన్నిగూర్చి (అనగా సన్యాసి నివసించుట కేర్పరచుకొన్న గృహము) ఆలోచిస్తే చాలు. అనగా తప్పులు చేయుటకు పూరోహితులకు, సన్యాసులకు ఎంతో అవకాశమున్నది అన్నమాట.

"నవై మృత్యు ర్వ్యాఘ్రయివాత్తి
జంతున్నాప్యస్య రూప ముపలభ్యతే హి"

అని సనత్సుజాతీయం చెప్పుచున్నది. అనగా పెద్దపులి జంతువులను భక్షించినట్లుగా మృత్యువు ప్రాణులను భక్షించదు. మృత్యువునకు ఆకారమైనననూలేదు. మరికొందరు మృత్యువసలు లేనేలేదని అంటారు. మోహమే మృత్యువని కొందరంటారు. ఏది సత్యం? అను ప్రశ్నకు సమాధానముగా ధృతరాష్ట్రునకు మహర్షి --

"ఉభే సత్యే క్షత్రియాద్యప్రవృత్తే
మోహో మృత్యు స్సమ్మతో యః కవీనారి
ప్రమాదం వై మృత్యు మహం బ్రవీమి
సదాఽప్రమాద మమృతత్వం బ్రవీమి"

(సనత్సుజాతీయం)

మోహమే మృత్యువని జ్ఞానులు చెప్పుచున్నారు-- (అనాత్మయందాత్మాభిమానమే మోహము) కాని ప్రమాదమే మృత్యువని నేనంటాను. ప్రమాదమనగా తానెవ్వడో యెరుగకపోవుటయే. అప్రమాదమే -- అనగా తానెవ్వడో తెలియుటయే అమృతము.

యీ రెండు భావములలో నిజముగా తేడా ఏమీ లేదు. ఎందుకనగా అన్యదాఖ్యాతి విక్షేపకార్యము. ప్రమాదం లేక అజ్ఞానము ఆవరణకార్యము కనుక ఆవరణ విక్షేపకార్యములే మృత్యువని సిద్ధించు చున్నది.

శ్రుతి : "మృత్యోః స్సమృత్యుమీప్నోతి యయిహ నానేవపశ్యతి" అంటూ వచ్చింది. వున్నదున్నట్లుగా గ్రహించకపోవుటయే భ్రాంతి కారణమై మృత్యుపరంపరకు దారి తీయుచున్నది. "తరన్తిమృత్యుంతీర్వా; అతిమృత్యుమేతి" అనగా విద్వాంసుడు (వున్నదున్నట్లు తెలిసినవాడు) మృత్యువును పొందడు మృత్యువునకే అతడు మృత్యువగుచున్నాడు. వేదాంతపరముగా మృత్యువున కే యర్థము చెప్పినా శరీరము పుట్టుట చచ్చుట ప్రత్యక్షము, కనుక దానిని బాగుగా విమర్శిచవలసియున్నది.

జీవోపాధులయందు, సర్వేంద్రియముల ద్వారా సర్వవ్యవహారములు చేయించు శక్తికే ప్రాణశక్తియని పేరు. ఇదియే జీవులకు, జన్మమృత్యు జరా వ్యాధులను కలిగించుచున్నది. శక్తి యుత్పన్నము కావలెనన్నచో చలన ముండక తప్పదు. చలన లక్షణము కలది ప్రాణము. కనుక ప్రాణము వుంటేనేగాని చలనముండదు. మరిన్ని చలనముంటే తప్ప ప్రాణము తెలియబడదు. కనుక ప్రాణ చలనములకు అవినాభావ సంబంధము. లేక గుణ-గుణి, ధర్మ-ధర్మి, సంబంధము.

శరీరమునందు ప్రాణము ప్రవేశించుటతోడనే శరీరమునకు చలనత్వ మేర్పడుచున్నది. సజీవమని చెప్పబడుచున్నది. శరీరమును సంపూర్ణముగాను శాశ్వతముగాను ప్రాణము విడిచిపోవుట మరణము. అసంపూర్తిగా విడచుట కూడా యున్నదాయేమి? అంటే సమాధియందు ప్రాణ క్రియలు పోయినవేగాని ప్రాణము పూర్తిగా విడిచిపోవుటలేదు. ఎట్లంటే -- ఆహార పానీయములు లేవు కనుక సమానరూపముగా పచనక్రియ, అపానరూపముగా విసర్జనక్రియ చేయుటలేదు. వ్యానము శీతోష్ణ స్పర్శలను గుర్తెరుగుట లేదు. ఉదానము పలికించుట లేదు. ప్రాణము ఉచ్ఛ్వాస నిశ్వాస రూపముగా పిండ బ్రహ్మాండములకు రాకపోకల సాగించుట లేదు. ఐనను యీ క్రియ లన్నియు జరిపించు ప్రాణశక్తి మాత్రము శరీరమును విడువక సుప్తమై యున్నది. ప్రాణక్రియలు ప్రాణేంద్రియ వ్యాపారములు యేమియు లేక పోయినా ప్రాణము పోయిన దనజాలకున్నాము. ఇపుడు పంచప్రాణక్రియలూ ప్రాణము కాదని స్పష్టమైనది, ఇవన్నీ యే చలనశక్తి కారణముగా జరుగుచున్నవో దానినే ప్రాణమనాలి. ఐతే ఈ శక్తి యెవరిది? శక్తి గల శక్తుడెవడు? అతనినే దేవుడని సామాన్యులన్నారు. పరమాత్మయని వేదాంతులన్నారు. శక్తిద్వయమని పరిపూర్ణులన్నారు. వస్తు నిర్ణయ రూపముగా గురుముఖతః విచారించ వలసినదే.

ప్రాణశక్తి శరీరమున ప్రవేశించుట జననము, శరీరమును వదలినచో మరణము క్షీణించినచో జర లేక ముసలితనము. పంచప్రాణరూపముగా శరీరమును భరించునది ప్రాణమే గనుక ప్రాణ వ్యాపారము సక్రమముగా నిర్వర్తించకపోవుటయే వ్యాధి. ఉదాహరణకు- సమానము సరిగా పనిచేయనిచో అజీర్ణవ్యాధులంకురించును. కనుక జన్మ మృత్యు, జరా వ్యాధులన్నింటికి ప్రాణమే మూలకారణమని గుర్తెరుగవలెను.

దేహ ధర్మములగు జనన మరణములు, ప్రాణము యొక్క ప్రవేశ నిర్గమనాదుల వలన కలుగుచున్నది. ఐతే ప్రాణమో! ఒకప్పుడొక శరీరమును, మరొకప్పుడు మరొక శరీరమును ధరించుచూ శాశ్వతముగా నుండునట్లే గానవచ్చుచున్నది. "జీవమెన్నడూ నాశ మొందదు" అనే యూహకు తావిచ్చుచున్నది.

శ్లో॥ వాసాంసి జీర్ణాని యథా విహాయ
నవాని గృహ్ణాతి నరోపరాణి ।
తథా శరీరాణి విహాయ జీర్ణా
న్యన్యాని సంయాతి నవాని దేహీ ॥

-- భగవద్గీత

తాత్పర్యము : చినిగిన బట్టను వదలి నూతన వస్త్రమును ధరించు నట్లు జరావ్యాధులచే శిథిలమై జీర్ణమైపోయిన శరీరమును వదలి దేహి నూతన శరీరములను ధరించును అని భగవద్గీత యందు చెప్పబడినది.

ఈ శరీరయంత్రము యితర యంత్రాదికముల వలెనే కొంత కాలమునకు శిథిలమగుటయు ఆశరీరమును ప్రాణము వదలిపోవుటయు తప్పదు. కనుకనే --

"జాతస్యహి ధృవోమృత్యుః ధృవంజన్మ మృతస్యచ " అనగా పుట్టినది చచ్చుటయు, చచ్చినది పుట్టుటయు తప్పదు. అన్నప్పుడు ఏది చచ్చినదో అదే తిరిగి పుట్టుచున్నది అన్నప్పుడు ఆ చచ్చి పుట్టేది ఏది? దేహమందామా? అంటే దేహ మిక్కడనే బూడిద యగుచున్నది. కనుక చచ్చి పుట్టేది ప్రాణమేననవలసినదే. ఐతే చస్తూ పుడుతూ, తిరిగి చస్తూ పుడుతూ వుంది కనుక దీనికి నాశమున్ను తేలికగా సంభవించుదు అని వప్పుకోవలసియున్నదే. కాని పరిపూర్ణ బోధ వలన మాత్రము ఇది కూడా శాశ్వతము కాదని ఋజువగుచున్నది.

ఐతే ప్రాణము జడమని చెప్పబడుతోంది. కాని ఏ శరీరమునందు పుట్టాలో అక్కడనే పుట్టుచున్నది. ఏ శరీరము నుండి పోవాలో దానినుండియే పోవుచున్నది. కనుక యీ ప్రాణముతో తెలివిగల మరొక వస్తువు కూడా చేరియుండాలి. ఆ వస్తువే సంస్కారముల మూట అని చెప్పబడే మనస్సు. మనస్సునందలి సంస్కార వేగము ననుసరించి ప్రాణ మా మనస్సును దేహాంతరములలోనికి, లోకాంతరములలోనికి ("వాయుర్గంధానివాశయాత్" అనగా సుగంధ దుర్గంధములను వాయువెట్లు తనతో తీసుకొనిపోవునో అట్లే) మోసుకొని పోవును.

దేహమునందు ప్రవేశించుట జననము; దేహమును విడచుట మరణము, లేక మృతము. ఈ ప్రవేశనిర్గమములు లేకుండుట అమరము లేక అమృతము. అనగా చచ్చి పుట్టేదేదో యది పోక యుండుట, పుట్టిచావకయున్నా, చచ్చి పుట్టకయున్నా అమృతమే యిట్టి అమృతత్వమును ఆశించి "మృత్యోర్మాఅమృతంగమయ" అనగా మృత్యువు నుండి అమృతత్వమునకు పోదురుగాక యని ప్రార్థించుచున్నాడు. నిద్రరాకుండా యెప్పటికి మేల్కొనే యుండాలి అని కోరుకున్నట్లే. అనగా ఒక ప్రాణికే మరణించుట, మరణించకుండ నుండుట అను రెండుస్థితులు. అందొక స్థితిని మాత్రమే కోరుకొంటున్నాడన్న మాట. అమృతమృత్యువులు సాపేక్షిక పదములై యున్నవి. పరమాత్మయే అమృత మృత్యువులను రెండు రూపములు గలవాడై యున్నాడు.

శ్రుతి : - "ఉభయం హైతదగ్రే ప్రజాపతిరాస। మర్త్యం చైవామృతంచ । తస్య ప్రాణా ఏవామృతా అసుః । శరీరం మర్త్యం ॥"

అనగా ప్రజాపతికి ప్రాణశరీరములు రెండూ అమృత మృత్యు స్వరూపములుగా నున్నవి. యిందు ప్రాణము అమృతము. శరీరము మర్త్యము లేక మృత స్వరూపము అని భావము. యిదే భావమును గీతయున్ను "అమృతంచైవ మృత్యుశ్చ, సదసచ్చాహ మర్జున" నేనే అమృతమృత్యువులు, సదసత్తులు అయివున్నానంటున్నాడు భగవానుడు. ఇదే భావమును

శ్రీ భాగవతుల కృష్ణ దేశికేంద్రుల వారు తమ కందార్థములలో యీ క్రింది విధముగా సెలవిచ్చియున్నారు -

కం॥ దేహమును జూచు కన్నులు
దేహమునకు వేరులేని తీరున యెరుకే,
కోహం, కస్త్వం, తవదాసోహం,
సోహంబటంచు, చూచుచుండు సుమీ -
తనకు తానె తోచుచుండు సుమీ।
దేహీ దేహములానె తెరగున ప్రసరించి
దేహముకాని విదేహిగ
తనను దా జూచుచుండు సుమీ।
తనకు దానె తో చుచుండు సుమీ॥

కనుక అమృతమృత్యువులే ప్రాణ శరీరములు లేక దేహీ దేహములు అయి ప్రసరించేది, ఆ పరమాత్మ స్వరూపమే. అదే

" ఆటాడి ఆడకుండును, ఆటాడిన మేనిబొమ్మ ఆటాడ కనే ఆటాడు,
యెరుక యనియెడు ఆటాడించేటి వాడు అతడేర కర్తా
అన్నిటికి యీ అచల మకర్తా
చేటుపాటుల రెంటిచే వచ్చు ఫలము
ముమ్మాటి కనుభవించి మరణ జననములొంద
నతడేర కర్తా అన్నిటికి యీ అచలమకర్తా "

అని వేరొక కందార్థములో సెలవిచ్చినారు. యీ ఆట శాశ్వతముగా ముగింపు అయినప్పుడే కేవల జన్మరాహిత్యము. ఆస్థితి మృతమూగాదు అమృతమూకాదు. యీ రెండూ లేనిది, యీ రెండూ కానిది. అమృత మృత్యువులను ద్వంద్వ స్వరూపము చెందు వస్తువుయొక్క రహిత స్థితి పరిపూర్ణ బోధ వలననే చేకూరగలదు.

ఇంతవరకు ప్రాణశబ్దము వాడినాము. మరి జీవుడు, ఆత్మయను శబ్దము లెపుడు వర్తించును? అనగా మనస్సుతో గూడినచో జీవుడుని వ్యావహారము . అచల స్థితిలోనున్నప్పుడు ఆత్మయనీ దానికే పేరు. ఎట్లనగా సుడిగాలి లేచి ఒకానొక చోటగల చెత్త చెదారములతో కలసి ఆకారాకృతులతో కొంత తడవు వ్యవహరించి, ఆ చెత్త చెదారములను మరొక చోట రాల్చిపోవును. అట్లే సంస్కారములతో గూడిన మనస్సుతోచేరి ప్రాణము శరీరమును ధరించుచున్నది. యిదే

జననము శరీరమునందలి సంస్కారయుతముగా వెడలుచున్నది. యిదే మరణము. కనుక మనస్సుతో గూడినప్పడే జీవనామము కలుగుచున్నది. ప్రాణమునకు చలనస్థితి స్వాభావిక మన్నాము. కాని దానిక చలస్థితి లేక పోలేదు. "ఎక్కడా గాలి లేదు" అని మనమంటుంటాము. కాని అప్పుడు గాలి లేక పోలేదు. వీచకుండా అంటే చలించకుండా స్తంభించినది. గాలికి, చలాచల లక్షణములు రెండూ ఉన్నట్లే ప్రాణమునకున్ను అచలస్థితి కూడా యున్నది. గడియారమందలి లోలకము నిరంతరము ఇటునుంచి అటు, అటునుంచి యిటూ కదులుతూనేవున్నా అద్యంత స్థానములందు ఆచలస్థితియే వుంటూ యున్నది. ఆ స్థితిలోనే ప్రాణమునకు ఆత్మయని పేరు. ఆస్థితికే అమృతమని పేరు. యీ చలాచల లక్షణములు (లేక మృతామృతములు) రెండూ ప్రాణ లక్షణములే. యెరుక లక్షణములే. ప్రాణమునకు గల యీ ద్వంద్వ దోష పరిహార మొక్క పూర్ణబోధ వలనే కాగలదు. కర్మ సంస్కారము లన్నిటిని తనయందు భద్రపరచుకొనే మనోలక్షణము శాశ్వతముగా లేకుండా చేయుటయే అచల ఋషుల పరమాదర్శము.

***

పుట్టమీదకొట్ట భుజగంబు చచ్చునా ?

పుట్టలో ఎక్కడో ముడిచిపెట్టుకొని పడుకునివున్న పామునకు పుట్టపైన కర్రతో ఎన్ని దెబ్బలు కొట్టినను అందు ఏఒక్క దెబ్బయినను తగులజాలదు కదా ! యిక ఆ దేబ్బలచే ఎప్పటికైనా అపాము చచ్చునా? ఎంతమాత్రము చావ నేరదనుమాట సత్యమే.

ఈ దృష్టాంతము లౌకిక పారమార్థిక విషయములలో దేనికైనను అన్వయము చేసికొనవచ్చును. పారమార్థిక విషయములో యీ దృష్టాంతమును ఎట్లు అన్వయింప చేసుకొనగునో ఈ చిన్న వ్యాసమున యించుక పరిశీలింతము.

సాధారణముగా వేదాంతమునందు దేహము, యింద్రియములు, వాక్కు, మనస్సు, ప్రాణము వీటన్నిటికి విలక్షణముగా "నేనే" "నేను" అని స్ఫురించు వస్తువు ఏదో ఒకటి ప్రతి ప్రాణియందును వున్నదని అందరకు అనుభవములో గోచరము అగుచున్నది. అట్లే సృష్టి కారణమగు వస్తువు ఒక పురుషాకృతిలో వుండిన ఎడల ఆ పురుషుని యందు కూడా ఈ నేను వస్తువు వుండిన వుండక తప్పదనిన్నీ ఆ పురుషునియొక్క సంకల్పమే ఈ జీవేశ్వర జగత్ సృష్టికి అత్యంత మూల కారణమూవున్నదనిన్నీ వూహించుటకు సావుకాశము కలుగుచున్నది. ఈ వ్యష్టిసమష్టుల యందు తెలివిరూపముగ నున్న ఈ నేను అను వస్తువు ఏకరూపమా ? భిన్నరూపమా ? ఏక

నశించి, స్వార్థరహిత కర్మాచరణము సాధ్యమగును. కర్తృత్వరహిత కర్మాచరణచేయు నేర్పరితనము లభించి అంతఃకరణమునందు ఎట్టి కర్మవాసనలు అంటక యీ జన్మయే తుది జన్మగా జన్మరాహిత్యము నొందును.

***

35 ఎరుకోత్పత్తి స్థితి నాశములు
(గురుశిష్య సంవాదము)

శిష్యుడు : - దేహములయందు యెరు కెట్లు ప్రవేశించినది స్వామీ !

గురువు: - నారికేళమున నీ రేట్లో అట్లే.

శి : - నారికేళమున నీ రెట్లు ప్రవేశించినది ?

గు : - ఒకప్పుడు లేకుండా వుండి క్రొత్తగా నీరు యెక్కడి నుండియో వచ్చి ప్రవేశించినదందువా ఏమి?

శి :- కాదు స్వామీ ! దానియందే అది పుట్టినట్లు తోస్తూయున్నది.

గు : - అదివరకు వుండియే పుట్టినదందువా ? లేక లేకుండానే పుట్టినదందువా ?

శి : - లేకుండా పుట్టజాలదు. పుట్టుటకు పూర్వం అది అక్కడనే సూక్ష్మముగా వున్నదనే అనాలి.

గు : - అదివరకే సూక్ష్మముగా వున్నదానిని, క్రొత్తగా పుట్టినదనీ లేక ఎందుండియో వచ్చి ప్రవేశించినదనీ అనవచ్చునా ?

శి : - అనకూడదు గాని, పరమాత్మ వుపాధులను సృష్టించి పిదప తానే దానియందు జీవరూపముగా ప్రవేశించెనని శ్రుతులు చెప్పుచున్నవి కదా!

గు :- సృష్టియనగా వేరు వేరు రూపములు కలుగుట అని మాత్రమే అర్థము - శ్రుతి "అనుప్రావిశత్" అన్నది గాని "ప్రావిశత్" అనలేదు 'అను' ప్రవేశమంటే తిరిగి ప్రవేశించుట.

శి : - కొంచెం వివరించండి స్వామీ ! అర్థం కాలేదు.

గు : - మట్టితో బొమ్మలు తయారుచేసినట్లు, పరమాత్మ దేనితో నైనా వుపాధులను తయారు చేసినాడా?

శి : - మాయచేత, లేక మహత్తుచేత పరమాత్మ సృష్టిచేశాడంటున్నారు.

గు : - పరమాత్మ కంటె ఆ మాయ భిన్నమా, అభిన్నమా? ఆ మాయ భావపదార్థమా లేక అభావపదార్థమా ? మహత్ అంటే అది ఎవరి మహత్తు ?

శి : - సృష్టికి పూర్వమాపరమాత్మ యొక్కడే వుండెను కనుక మాయ అతనికంటె భిన్నంగా లేదని, అది అభావ పదార్థమేగాని భావపదార్థము కాదని, మరొకరు లేరు గనుక మహత్తు ఆయన యొక్క మహిమయే యనీ అనాలి లేదా పరమాత్మయే ఆ మహత్తు అనాలి.

గు : - కనుక, సృష్టి అంటే, ఆ పరమాత్మయే భిన్నభిన్ననామరూపాలు వహించుటయే అని అనక తప్పదు.

శి : - అను ప్రవేశ మనగా అదివరకు ప్రవేశించియుండి మరల ప్రవేశించుట, అని మీరన్నారే ! రెండుసార్లు ప్రవేశించుట యేమి స్వామీ ?

గు : - వుపాధులకు తాను వుపాదాన కారణమగుట అనగా తానే వివిధ నామరూపాలు చెందుట, మొదటి ప్రవేశము, ఆ వుపాధులయందు జీవరూపముగా, లేక తెలివిరూపముగా తానేయుండుట రెండవప్రవేశము లేక అను ప్రవేశము. అంటే స్థూలావరణము, అందలి సూక్ష్మాంశమైన తెలివిరూపము రెండూగూడా తానే అయివున్నాడన్నమాట. అంతేగాని ఎక్కడనుండియో వచ్చి క్రొత్తగా ప్రవేశించలేదు.

శి : - అయితే సృష్టి అనే శబ్దమునకు యెట్లు నిర్వచిస్తారు స్వామీ !

గు : - "ఏకం అనేకం భవతి" అనగా ఒక్కటిగా నున్నది అనేకముగా అగుటయే సృష్టి. "అనేకం ఏకం భవతి" అనేకముగా అయినది మరల ఏకత్వరూపము దాల్చుటే ప్రళయము.

శి : - దేహములయందు ఎరుక ఏ విధముగా నున్నదో శెలవీయండి స్వామీ !

గు : - తెలివి, దేహములు రెండుగానైనది తానే. తీపి బెల్లమునం దెట్లున్నదో అట్లే దేహి దేహమునందుండి యున్నది.

శి : - స్థూలమును విడిస్తే ఎరుక (తెలివి) ఏ దేహమునందుండును ?

గు : - ప్రాణమునందుండును. అపుడా ప్రాణమే దానికి దేహము, ఆ దేహమును విడచి మనస్సు లేక (దేహి) వుండదు. అంతేగాని స్థూలదేహమును విడచి వుండదు అని అనరాదు.

శి :- యీ దేహి దేహముల కాధారము మేమి ?

గు :- అన్నము, నీరు ఆధారము

శి :- స్థూల దేహమున కన్నపానీయములవసరేమే యనజెల్లును గాని సూక్ష్మదేహ సంబంధమగు తెలివి కెట్లు ఆధారమునదగును ?

గు :- తిన్న అన్నము సప్తధాతువులుగా మారి సూక్ష్మము మనస్సునకు బలము నిస్తోంది. త్రాగిన నీటియొక్క సూక్ష్మము ప్రాణసత్తా కలిగిస్తోంది. ఆ విధంగా మన ప్రాణములకు పుష్టిచేకూరి తెలివి ప్రకాశించుచున్నది; కనుక తెలివికి మనఃప్రాణములు, మనఃప్రాణములకు అన్న పానీయాలు ఆధారముగా నున్నవి. అన్నపానీయాల స్థూలాంశముల చేతనే రక్తమాంసాలు వృద్ధిచెంది స్థూల దేహము నిలచివున్నది.

శి :- దేహమునుండి ఎరుక ఎట్లు పోవుచున్నది ?

గు :- స్థూలదేహమునుండి ప్రాణముతో పాటు మనస్సున్ను (తెలివిన్ని) పోవుచున్నది.

శి :- సుషుప్తియందు ప్రాణమున్నప్పటికీ తెలివి లేక పోవుటకు కారణమేమి ?

గు :- తాత్కాలికముగా మనస్సునకు ప్రాణముతో సంయోగము తప్పినది కనుక తెలివి మరుగునవడినది. మరణమునందు, మనస్సును తీనుకొని ప్రాణము స్థూలదేహమునుండి బయల్వెడలి పోవుచున్నది. తిరిగి స్థూలదేహముదొరికే వరకు తెలివి ప్రాణమునందు మరుగుగా నుంటున్నది.

శి :- మరి యీ యెరుక ఎప్పుడు నశించుచున్నది ?

గు :- నాశనమనుమాటే పనికిరాదు, ఎరుకకూ నాశనము లేదు. దేహమునకూ నాశనములేదు.

శి :- అదేమి స్వామీ అట్లా అంటారు ? దేహము ప్రత్యక్షముగా బూడిద అయిపోవుటలేదా?

గు :- అది నాశనము కానేకాదు. రూపము మార్పుచెంది మరొక రూపము వహించిందంతే.

శి :- ఎరుకకూ నాశననము లేదంటే పూర్ణబోధ ఎందుకు స్వామీ !

గు :- ఏమి? పూర్ణబోధ ఎరుకను నరికివేయునా ఏమి?

శి :- మరి పూర్ణబోధ వలన ఏమి రహితమగును?

గు :- ఎరుకయందు భ్రాంతి రహితమగును. అపుడే సర్వభ్రాంతి రహితం, "భ్రాంతిరహిత మిదం మోక్షం" అన్నారు పెద్దలు.

శి : - ఎరుకయందు భ్రాంతి ఎట్లురహితమగును ?

గు : - శిష్యుని అధికారిని గావించి, ఎరుక, పరిపూర్ణముల వస్తునిశ్చయ ముగావించి సద్గురువు ఎరుక భ్రాంతిని శిష్యునికి తొలగించును. కనుక శిష్యుడు గురుకృపా సంసిద్ధికై ఎల్లప్పుడు కృషిచేయవలెను.

***

36. "జలజపత్రమునందు సలిల మంటనియట్లు"

శిష్యుడు: - పరిపూర్ణ భావజ్ఞుడు, అంటీ అంటని రీతిగా కర్మలెట్లు చేస్తూ వుంటాడో శెలవీయండి స్వామి!

గురువు: - తెలివి(జ్ఞానము) లేనే లేదని తెలుసుకొని క్రియలు చేస్తూ వుంటాడు.

శి : - తెలివి లేకనేపోతే, తెలుసుకొనుట ఏలాగు?

గు : - లేనేలేదని తెలుసుకొన్నయట్టి తెలివితో, అందరూ తెలుసుకొన్నట్లుగానే తెలుసుకొంటూ వుంటాడు.

శి : - మరియింక భేదమేమి ?

గు : - తెలివీ, తెలివికి తెలియబడేదీ, సత్యమేనని భ్రాంతి జెంది కాంక్షతో కర్మలు చేస్తాడు ప్రపంచీకుడు, ఎరుకే శాశ్వతమగు బ్రహ్మమన్న తొలి భ్రాంతియే సర్వభ్రాంతులకు మూలకారణము.

శి : - మరి పరిపూర్ణభావజ్ఞడే దృష్టితో కర్మలుచేస్తాడు ?

గు : - గురువాక్యంద్వారా యెరుక లేనేలేదనే సత్యము ఆరూఢంచేసుకొని, ఆ విషయం మరువకుండానే సకల క్రియలు చేస్తూ వుంటాడు.

"సత్యమగు బట్టబయలు
నసత్యంబగు యెఱుక నెరిగి సద్గురు కృపచే।
సత్యము గాదని యెరుకను
సత్యముగా నమ్మివుంటే చాలు చాలన్నా"
అంటున్నారు శ్రీ కృష్ణదేశికేంద్రుల వారు.

శి :- ఎరుక సత్యముగాదని, లేనేలేదని నమ్మినంతమాత్రాన కర్మ ఫలములు అంటక మానునా?

గు :- అవును, ఎరుక లేనేలేదని నమ్మితే కర్మప్రవృత్తిని ప్రోత్సహించు త్రిపుటిగాని కర్మచేయు త్రిపుటిగాని లేవని అపుడే నమ్మకముకలుగును. అనగా ధృఢమగును.

శి :- లేనేలేవని ధృఢమైనంత మాత్రాన లేకపోవునని ఒక దృష్టాంతముచెప్పగలరా ?

గు :- ఎండమావులలో నీరు లేనేలేదని ఘట్టిగా తెలుసుకొన్న తర్వాత నీళ్లు గానవస్తూనేవున్నా లేనేలేవని నిశ్చయముండదా?

శి :- ఇపుడు సరిపోయినది స్వామీ ! త్రిపుటులు కూడా లేవని నిశ్చయ మగునన్నారే, ఆ త్రిపుటులేవి?

గు :- శ్లో ॥ జ్ఞానం, జ్ఞేయం, పరిజ్ఞాతా, త్రివిధా కర్మచోదనా

కరణం కర్మ కర్తేతి త్రివిధః కర్మ సంగ్రహః ॥

--భగవద్గీత.

అనగా కర్మకు ప్రోత్సహించు త్రిపుటి ఏదనగా --జ్ఞానము, జ్ఞేయము జ్ఞాత, ఎందువల్లననగా గుర్తెరుగకుండా యెవ్వరూ యేకర్మా చేయరుగదా! 1) కర్త 2) కర్మ 3) కరణము (పనిముట్లు) అను త్రిపుటిచే కర్మ జరుగుచున్నది. జ్ఞాతయే కర్త, జ్ఞానమే కరణము. ఈ రెండూ లేనేలేవని ధృఢనిశ్చయమై కర్మ చేస్తే ఆ కర్మ చేసియు చేయనట్లే అగుచున్నది.

శి :- ఓహో! ఇదియా, వినకనే వినుట, కనకనే కనుట, చేయకనేచేయుట, అను మాటల యభిప్రాయము?

గు :- అవును, ఆ రెండు త్రిపుటులు లేనివని నిశ్చయమున్న వానికి కర్మప్రవృత్తికవసరమగు కాంక్ష (ఫలాసక్తి) గాని కర్తృత్వాహంకారముగాని యెట్లుండును? అంటే కర్తృత్వ రహితముగా నిష్కామకర్మ జరుగుచున్నదన్న మాట. అది యెట్లు బంధకారణమగును?

శి :- బాగుగా అర్థమైనదిగాని స్వామీ ! ఒక్క సందేహము బాధిస్తూన్నది ?

గు :- అ దేదో నిర్భయముగా చెప్పు.

శి :- "నిప్పు లేనేలేదు కనుక కాల్చనే కాల్చదు" అనే నమ్మకముతో నిప్పులమీద చేయవేస్తే కాల్చకుండా వూరుకుంటుందా ?

గు :- ఓహో! నీవు చెప్పేది దృష్టఫలవిషయము మాత్రమే. మేము చెప్పేది అదృష్టఫలము గురించి.

శి :- దృష్టాదృష్ట ఫలములగురించి కొంచెం వివరించండి స్వామి !

గు :- ఇప్పుడు మనంచేసే కర్మకు రెండు విధములగు ఫలములున్నవి.

1) ప్రత్యక్షఫలము; అనగా యిపుడే కలుగునది. యిదే దృష్టఫలము. 2) అదృష్టఫలము అనగా మనకు కానరాకుండా ఎప్పుడో ముందు కలగబోయే ఫలము. దీనినే ఆగామి అంటారు. ఇది ప్రస్తుతమొక సంస్కారము మాత్రమే వుత్పత్తి చేయును. సత్కర్మ పుణ్యసంస్కారమును, దుష్కర్మపాపసంస్కారమును సృష్టించును. ఈ పుణ్యపాప సంస్కారములే సుఖదుఃఖరూపములగు ఫలములు కల్గించుచుండును. ఈ సుఖదుఃఖములు భవిష్యత్ జన్మలలో ఫలప్రాప్తికి వచ్చును, దృష్టఫలము నుండి మాత్రము తప్పించుకొనలేము. ఈ దృష్టఫలము మన ప్రారబ్ధములో భాగముగా యీజన్మ లోనే అనుభవిస్తే సరిపోతుంది. అదృష్టఫలమునుండి పరిపూర్ణ భావజ్ఞుడు తప్పించుకొనగలడు. ఇతరుల కదిన్ని అనివార్యమగుచున్నది.

శి :- పరిపూర్ణ భావజ్ఞుడెట్లు తప్పించుకొనును ?

గు :- అతని అంతఃకరణమును యెట్టి సంస్కారమున్నూ వుత్పత్తి కాకుండా చేసుకొనును.

శి :- సంస్కార ముత్పత్తి కాకుంటే ఏమి జరుగును ?

గు :- జన్మరాహిత్యమే సిద్ధించును.

శి :- అది యెట్లు సిద్ధించును ? కర్మత్రయ మున్నంత వరకూ జన్మ తప్పునా ?

గు :- గురుముఖతః ఆత్మవస్తునిశ్చయజ్ఞానము తెలియుట వలన సంచితకర్మ నశించును. భోగమువలన అనగా అనుభవమువలన ప్రారబ్ధమున్ను; యిపుడు చేసిన కర్మల యొక్క దృష్టఫలమున్నూ నశించును. అదృష్టఫలము అంటకనే పోవును. కనుక ఆగామియున్నూ రహితమే. ఈ విధముగా పరిపూర్ణ భావజ్ఞునికి కర్మత్రయ నాశనము కలుగుచున్నది.

శి :- ఆగామి రహిత విధానము నేను మరియొక విధముగా విన్నాను "ఆగామి ద్వివిధంప్రోక్తం, తద్వేషి ప్రియవాదినౌ" అను మాటలు సరి గాదా ?

గు :- కావు, తన్ను భూషించేవారు కొందరుండి తన పుణ్యం పట్టుకొని పోవాలి. తన్ను దూషించేవారు మరికొందరుండి తనపాపం పట్లుకొనిపోవాలి. అలా భూషించే వారిమీదా, దూషించేవారిమీదా తనముక్తి ఆధారపడి వున్నదన్న మాట. అట్టివారు లేకుంటే తనకు ఆగామి రహితముగాని, జన్మరహితముగాని వుండనే వుండదన్నమాట.

శి :- ఇది హాస్యాస్పదముగానే వున్నది. ఐతే తెలివి లేక తెలుసుకొనుట ఎట్లో బాగా అర్థంకాలేదు స్వామి?

గు : - పరిపూర్ణ పరబ్రహ్మమందు లేదు, కనుక దానికి లేని తెలివి (లేనెరుక) అని పేరు. అట్టి లేని యెరుక ఎరుక యందలి పనులుచేసుకొంటూ వున్నది. తాను పరిపూర్ణ పరబ్రహ్మమందు లేదు. గాని తనయందలి సమస్తము తనకు సత్యమ్మే. కనుక లేని తెలివి తనకు పరమైన పరిపూర్ణ పరబ్రహ్మమందు లేకనే తనయందలి సమస్తమును తెలుసుకొనుచున్నదని అర్థము.

శి : - పరిపూర్ణ పరబ్రహ్మయందు లేనే లేననే జ్ఞానము, సంస్కారమును ఎట్లుత్పత్తి కాకుండా చేయగలదా యని సందేహముగా నున్నది స్వామి! పరిపూర్ణము ఆ సంస్కారములను నాశనము చేయునా ఏమి?

గు : - సంస్కారమనగానేమి ? బలమైన భావనారూపమగు స్మృతి జ్ఞానమునకే సంస్కారమని పేరు. పరిపూర్ణ పరబ్రహ్మమందు నేను లేను అనునది (యింకనూ) బలమైన అరూఢ జ్ఞానము సంస్కార రూప జ్ఞానమును తొలగించు చున్నది. క్రొత్తనీరువచ్చి పాతనీరును కొట్టివేసినట్లే "వజ్రం వజ్రేణ భిద్యతే" వజ్రాన్ని మరొక వజ్రం ఖండించునట్లే ఒక జ్ఞానము మరొక జ్ఞానాన్ని ఖండించునేగాని 'నిశ్శక్తి నిర్మలం పూర్ణం' అనిచెప్పబడే పరిపూర్ణము ఏమీ లేని యెరుకను ఏమి చేయగలదు?

శి : - ధన్యోస్మి !! గురుదేవా ! నమస్తే ! నమస్తే! నమః

***

37. పూర్వోత్తరజన్మ లున్నవా ?

ప్రపంచమతములన్నియు పునర్జన్మను యేదోవిధముగా నంగీకరించియున్నారు. క్రైస్తవులు మహమ్మదీయులుకూడ మరణానంతర జీవితమును,స్వర్గ - నరకములను అంగీకరించుటచే వారును యేదోవిధముగా పునర్జన్మ నంగీకరించినట్లే. ముఖ్యముగా హిందూమతమునకు పునర్జన్మసిద్ధాంతము జీవకఱ్ఱయై యున్నది. ప్రస్థానత్రయ మనబడే ఉపనిషత్తులు, బ్రహ్మసూత్రములు, భగవద్గీత హైందవమతమునకు ముఖ్యప్రమాణ గ్రంథములైవుండి ఈ సిద్ధాంతమును పోషించుచున్నవి. భారతదేశములోని త్రిమతములు - అనగా ద్వైత అద్వైత విశిష్టాద్వైత మతములేగాక బౌద్ధ, జైన మతములును బ్రహ్మ ఆర్య దివ్యజ్ఞానసమాజములున్ను పూర్తిగా జన్మ పరంపరలను అంగీకరించియున్నవి.

జన్మయనగా శరీర ధారణము. శరీరమును ధరించిన వాడెవడు? అతనికి దేహియనీ, జీవుడనీ, ప్రాణియనీ, మొదలగు పేర్లుగలవు. శరీరము అతడు లేనిచో ఏ క్రియలను చేయకుండుట, మరణించినవాని దేహమును చూచిన వారందరికీ సుస్పష్టమే. అతడీశరీరమందుండి సకల క్రియలనుచేయుచున్నాడు. శరీరమును వదలిపోవునపుడు ఆ కర్మ ఫలములను (సంస్కార రూపములో) మోసుకొని పోవుచున్నాడు. సంస్కారములులేని మనస్సుండదు. మనఃప్రాణములు లేక జీవుడుండడు. అతడు శరీరముతోపాటే మొదటిసారి పుట్టి శరీరముతో పాటే లేకుండా పోవుచున్నట్లుగా స్థూల దృష్టికి గోచరించుచున్నది. ఏలననగా శరీరములేని ప్రాణి యింద్రియగోచరముకాదు. కాని యింద్రియ గోచరముకాని వస్తువులు లేనే లేవని యనరాదుగదా! ఏలననగా నక్షత్రములు పగలు గానరానంత మాత్రమున లేవని యనరాదు. వేసవిలో పై కెగసిన ఆవిరి, గానరానంత మాత్రమున లేనట్లేనా? గ్రహములయొక్క ఆకర్షణ శక్తి, విద్యుచ్ఛక్తి మొదలగు ప్రకృతి శక్తులు గానరానంత మాత్రాన అవి లేవనియనవచ్చునా? తనయందుండే జ్ఞానాజ్ఞానములు ఏ యింద్రియమునకైన గోచరించునా ? అట్లే శరీరమును ధరించిన జీవుడు శరీరమును ధరించక పూర్వము, శరీర పతనానంతరము లేనేలేడని యన వచ్చునా ? వర్తమాన శరీరమును ధరించిన జీవుడు గూడ పూర్వ మెక్కడో ఏ శరీరమునందో యుండియుండవలెనను టయు వర్తమాన శరీరమును విడచిన జీవుడు మరల ఏ శరీర ములోనో ప్రవేశించుటయు గూడ తార్కిక దృష్టిచేచూచినచో మిక్కిలి సమంజసమే కాగలదు. కనుక జీవుడు శరీరములో ప్రవేశించుటయే జన్మయనియు, శరీరమును విడుచుట మరణమనియు గ్రహింపనగును.

జీవుడే శరీరములోనైనా యెందుకు ప్రవేశించవలెను? ఎందుకు విడువలెను. తన యిచ్ఛవచ్చినట్లు యీ ప్రవేశ నిర్గమనముల గావించుటకు అతనికి స్వతంత్రమున్నదా ? లేక ఏదేని నొక సూత్రమున కాతడు బద్ధుడై ఈ జనన మరణములను పొందుచున్నాడా ? స్వతంత్రమున్న దన్నచో స్వర్గాదిభోగ భాగ్యములలోనే ప్రతివాడును జన్మించగోరును. కాని దుఃఖభూయిష్టమగు భూలోకమునందలి 84 లక్షల జీవరాసుల శరీరములలో ఎవడును ప్రవేశించగోరడు. ప్రతి క్షణమందును కోటానుకోట్ల వివిధ శరీరములందు పుట్టుటయే సంభవింపదు. కావలెనని నీచయోనిప్రాప్తి నెవ్వడు అభిలషించడుగదా ! అట్లే శరీరమును వదలి పోవలెనని గూడ కోరుకొనకనే చిన్న వయస్సునందున్న ప్రాణులు సహితము శరీరం విడచుట ప్రత్యక్షమే కనుక జీవునికి జనన - మరణములయందు యెట్టి స్వతంత్రమూ లేదు. జీవుడు పరతంత్రు డన్నచో, ఏ సూత్రమున కాతడు బద్ధుడై జనన - మరణములకులోనై నీచోత్తమ జన్మల నెత్తుచున్నాడు ? అన్న చో కర్మ సూత్రమున కాతడు బద్ధుడైయున్నాడు అని శ్రుతియుక్తి అనుభవములవల్ల స్పష్టపడుచున్నది.

కర్మసూత్రమనగానేమి? "కర్మమునబుట్టు జంతువు కర్మమునను వృద్ధిబొందు కర్మమున జెడున్ " అన్నదే ఆ కర్మ సూత్రము.

కనుక కర్మవలననే జన్మ. జన్మయనగా స్థూల శరీర ధారణము. స్థూల శరీరముతోనే అనుభవించవలసిన కర్మ ఫలానుభవమునకై స్థూల శరీరధారణ తప్పదు. స్థూల శరీరముతో జన్మించినవాడు మరల కర్మచేయకతప్పదు, ఆ కర్మాను భవమునకు మరల జన్మించవలెను. కనుక కర్మవలన, జన్మ జన్మవలన కర్మ అని జన్మకర్మలు పరస్పర కార్యకారణము లైయున్నవి. కర్మవలన జన్మయు, జన్మవలన కర్మయు, మరల ఆ కర్మ వలన జన్మయు యిట్లు అనంతముగా జన్మకర్మలు అనాదిగా సాగుచునేయున్నవి. యిదియే సంసార చక్రము. కర్మబంధము. ఈ చక్రభ్రమణమునుండి తప్పించుకొన వలెనన్న కర్మరాహిత్యము లేక నైష్కర్మ్యసిద్ధి కల్గినగాని జన్మరాహిత్యము సిద్ధింపదు.కనుక పూర్వోత్తర జన్మలు ఉన్నవా అను అంశమును పరిశీలించుటకు ముందు కర్మశిద్ధాంతమును పూర్తిగా పరిశీలించవలసి యున్నది.

కర్మ యనగా పని. "కృ" అను ధాతువునుండి యుత్పత్తి. పనిచేయుకర్త - పూర్తి చేయబడిన పని - ఆ పనికి చేయునట్టి క్రియా - ఈమూడూ కర్త, కర్మ, క్రియలు అనబడును. ఈ మూడూ త్రిపుటి రూపముగా నుండి ఒకదానికొకటి పూర్తిగా సంబంధపడి యున్నవి. కర్మ అను శబ్దమునకు పనియనీ, ఆ పని చేయుటవలన కల్గిన ఫలము అనీ రెండర్థములున్ను ఉన్నవి. చేసిన పని యొకటి దాని ఫలము మరొకటి యుండదు. విత్తనము పడుటతోనే పంటపండదు. ఒక పాపకార్యముగాని పుణ్యకార్యముగాని చేసినపుడు దాని పూర్ణ ఫలము కొంత కాలమునకుగాని గోచరముకాదు. కనుకనే దానిని అదృష్టఫలము అన్నారు. సాధారణముగా పనినిబట్టి ఫలముండును. ఒక్కొక్కప్పుడు చేసిన పనికి తగినంత ఫలము లేకపోవచ్చును. కాని అసలే ఫలముండని పనియుండదు. మరియు వెంటనే ఫలము లేకపోయినా కాలాంతరము నందైనా జన్మాంతరమందైనా ఫలము కల్గితీరును. కర్మయు కర్మఫలమున్ను కారణ కార్యములుగా నున్నవి. ఫలము కార్యము దాని కారణము అంతకు పూర్వముచేసిన కర్మ యొక్క ఫలితము యిపుడు కల్గినచో దానికి కారణమగు పూర్వకర్మ యుండకతప్పదు. అట్లే ఇపుడొక కర్మచేసినచో దానికి భవిష్యత్ఫలమునూ వుండకతప్పదు. పాపపుణ్య కార్యములు చేసినపుడు దానికి ఆయా ఫలము లెట్లు కలుగుచున్నవో మనకు స్పష్టముగా గోచరించదు. అనగా కర్మకున్ను దానివలన చివరకు లభించే ఫలమునకును మధ్య జరిగే పరిణామరూపమైన అంతర్దశలు మనకు గోచరించవు. వుదాహరణకు ఔషధ సేవవలన రోగనివృత్తి కలుగుచున్నది. కాని ఔషధము మ్రింగినది మొదలు రోగనివారణ సిద్ధించు వరకున్ను మన శరీరములో కలుగు మార్పులన్నింటిని మనం గుర్తించలేకున్ననూ ఔషధము వల్ల నివత్తి చేకూరినదని మనం చెప్పచున్నాము. వైద్యశాస్త్ర నిపుణుడు మాత్రమే ఔషధముచే శరీరమున

చేసినచో దాని ఫలితమిప్పుడు తప్పించుకొనగలుగుదు మేమో గాని ఎప్పటికి ఏఫలితమూ కలుగకుండా చేసుకొనలేము. జీవితమున పట్టుబడకుండా యెన్నో హత్యలు చేసినవాడు ఆ దుష్కృతఫలితమును ఎప్పుడో నొకప్పుడు అనుభవించితీరును.

తపోదానాది సత్కర్మ లెన్నో చేసి యీ జన్మమున ఎట్టి సుఖము ప్రాప్తించకనే గతించనవాడా సుకృతఫలమును, జన్మాంతరమునందైనా ఆయా కర్మఫలము లనుభవించక తప్పదు. ఆ కర్మఫలమునుభవించుటకు పునర్జన్మ తప్పదు. కనుక

"కర్మమున బుట్టు జంతువు
కర్మముననను వృద్ధిబొందు కర్మమున
చెడున్ కర్మయె జనులకు దైవము
కర్మము సుఖదుఃఖములకు కారణమధిపా"
అనిచెప్పబడినది భారతములో.

కర్మచేయునది ఏది? త్రికరణములు అని మూడు పనిముట్లు చెప్పబడినవి. 1) మనస్సు 2) వాక్కు 3) శరీరము. యీ మూటిలో ముఖ్యమైనది మనస్సు ఏలననగా మనస్సు సంకల్పించనిదే ఆలోచించనిదే వాక్కు చే మాట్లాడుటగాని కర్మేంద్రియములచే పనిచేయుటగాని జరుగదు. మనసంయోగం లేక చేసెడి కర్మ సౌష్టవంగానూ నిర్దుష్టంగానూ నుండజాలదు. అది కేవలం పిచ్చివాని పనివంటిదేయగును. ఆ పనులకు పాపపుణ్యరూప కర్మఫలము లుండవు. ఉఛ్వాసనిశ్వాస చేయుట. రెప్పపాటు జరుగుట మొదలగు పనులున్ను కర్మలు అవన్నియు మనోప్రేరణ లేకనే జరుగుచ్నువి. పసిపిల్లలు చేయు పనులలో మనస్సుయొక్క సంకల్పక్రియ యున్నా ఆ పనులయొక్క మంచిచెడ్డలను గూర్చి తలపోయు దారుఢ్యరూప చిత్తవృత్తి లేనందున ఆ పనులకున్ను పాపపుణ్యఫలప్రాప్తి యుండదు. కనుక పాపపుణ్య ఫలోత్పత్తి గల్గించు కర్మలే బాధకరములు. అవియే సంస్కారములుత్పత్తిచేసి జన్మపరంపరల గల్గించును. యిట్టి విశేషార్థములోనే కర్మవలన జన్మ,జన్మవలన కర్మ యని కర్మ సిద్ధాంతము ప్రతిపాదింపబడినది.

కనుక కాయక వాచిక క్రియలు మనస్సంయోగమున్నపుడే సంస్కారోత్పత్తి హేతువులగును. కాని మానసిక క్రియలు అన్యసహాయ మపేక్షింపకనే స్వయముగా సంస్కార జనకములు కాగలవు. కనుక అపవిత్ర భావములు దుష్టసంస్కార హేతువులు కనుకనే మనస్సును ఎల్లపుడుపరిశుద్ధముగా నుంచుకొని దుష్టాలోచనల కెన్నడూ యెట్టి అవకాశము నీయరాదన్నారు. కనుకనే "మన ఏవ మనుష్యాణాం కారణం బంధమోక్షయోః" అట్టి బంధమోక్ష కారకమగు మనస్సును "గురూపదిష్ట మార్గేణ మనశ్శుద్ధింతు కారయేత్" అని గురుగీత చెప్పుచున్నది.

***

38. ఖండాఖండములు (యెరుక)

ఖండము అనగా ముక్క, తునక లేక ఒక భాగము. అఖండము అనగా ముక్కలు, తునకలు, భాగములు కానిది. మొదటిస్థితి ఏది ? అసంఖ్యాకములగు ఖండములుండి పిదప అవన్నియూగూడి అఖండరూపము పొందినవా? లేక అంతయు ఒకే ఒక అఖండ స్వరూపముగా వుండి. పిదప ఖండము లైనదా? అనగా ఏకవస్తువుగ అనేకమైనదా లేక అనేక ములగు వస్తువులు కూడి ఏకవస్తువు మారినవా? " ఏకమేవాద్వితీయం బ్రహ్మ" అనిన్ని ఆ "ఏకం అనేకంభవతి" అనిన్ని శ్రుతి సమాధానము చెప్పుచున్నది. పిదప మరల ప్రతిసంచర పద్ధతిలో అనగా వూర్ధ్వ పరిణామములో ఆ అనేకం "ఏకంభవతి" అనిన్ని శ్రుతియే వాకొనుచున్నది. సంఖ్యానీకముకూడా ఒకటితోనే ప్రారంభమగుచున్నది.

"ఎరుకైన భూతముల నీ వెరుగుము ఆకసము,
గాడ్పు యింగలము నీళ్లు యిరవందనేల"

అన్నారు కృష్ణదేశికేంద్రులు. అనగా ఎరుకే భూతములైన దన్నారు. కనుకతొలుత అఖండమగువస్తువు ఖండములాయెనని చెప్పుటయే న్యాయమైయున్నది. సృష్టియుంటేనే ప్రళయము చెప్పనగునుగాని సృష్టిలేనిదే ప్రళయము చెప్పరాదుగదా! క్రమసృష్టినే శాస్త్రము లంగీకరించినవిగాని యుగసృష్టిని (అన్నియు ఒకేసారి సృష్టియైన వనుట) అంగీకరించలేదు. అట్లే ప్రళయములో గూడ పృథివి జలములో, ఆ జలము అగ్నిలో, ఆ అగ్ని వాయువులో, ఆ వాయువు ఆకాశములో, ఆకాశము ఆత్మలో లయమగునని చెప్పబడినదే గాని మొత్తము పంచభూతములు ఒకేసారి ఆత్మయందు లయ మగునని చెప్పరాదు. కనుక ఏవిధముగా చూచినా తొలుత అఖండముగానున్న వస్తువు క్రమముగా అనేక ఖండములాయెనని చెప్పుటయే యుక్తమైయున్నది.

అఖండమనగా తెంపులేనిది ఆదిమధ్యాంత రహితమగు వస్తువనిన్ని గూడ నర్థముల గలవు. ఈ అర్థములో కేవలము అఖండమగు నది యొక్క పరిపూర్ణ పరబ్రహ్మము మాత్రమే. అది నిరపేక్షక అఖండము అనగా పరిపూర్ణమును చెప్పినపుడు ఖండవస్తువుయొక్క ప్రసక్తిలేదు. ఎరుక సృష్టికి పూర్వమఖండ వస్తువుగాను, సృష్ట్యనంతరము ఖండ ఖండములుగాను మారుచుండుటచే అది సాపేక్షిక ద్వంద్వ స్వరూపము. అట్టి-

"అఖండంబగు యెరుకరూపు గనరా మాతండ్రీ
యిది తెల్పిన ఘనుడే తలిదండ్రీ
ఖండాఖండములుగ గనుపించు ఎరుకనె దండిద
నేటి యుద్దండుల కలనైన గనరా మాతండ్రీ"

అనిన్ని కృష్ణదేశికేంద్రులు చెప్పియున్నారు. కనుక సృష్టికి పూర్వము యెరుకయు అఖండముగానే యున్నది. ఐతే పరిపూర్ణమొక అఖండము సృష్టికి పూర్వమున్న యెరుక యొక అఖండము అని రెండు అఖండములుండుట విరుద్ధము గాదా! అని ప్రశ్నించవచ్చును. దానిని చూచినపుడు యిది గానరాదు. దీనిని చూచిన అది గానరాదు. ఎట్లనగా రజ్జు వెంత యుండునో, రజ్జుసర్పము గూడ నంతేయుండును. సర్పప్రతీతి అయినపుడు రజ్జువుగానరాదు. రజ్జువున్న దున్నట్లుగా తెలియబడినపుడు సర్పముగానరాదు. కనుక ఎరుక తొలిరూపము అఖండమేయని చెప్పదగును.

ఎరుక ఒక్కటే అయివున్ననూ, స్థానభేదమునుబట్టి, గుణలక్షణ భేదములనుబట్టి 1) అఖండయెరుక, 2) శుద్ధయెరుక, 3) మిశ్రమయెరుక, 4) మలిన యెరుక అని నామములను బొందినట్లు శ్రీ దయానంద పాన్నాల రాజయోగీంద్రుల వారు తాము రచించిన నిజప్రబోధ విధానమందు పేర్కొనియున్నారు.

పరిపూర్ణ పరబ్రహ్మమునకున్ను ఎరుకకున్నూ సామ్యములున్ను వైషమ్యములున్నూ గూడా గలవు. సామ్యములు మాత్రమే గమనించిన యితరులు రెండూ ఒకటే నన్నారు. సామ్యములు ఏవనగా అచలత్వము, అఖండత్వము, సర్వవ్యాపకత్వము అగోచరత్వము. యెరుకకు చలనత్వము, ఖండత్వము ఏకదేశీయత మానసిక గోచరత్వముగూడ ఉండుటచే యెరుక ద్వంద్వ లక్షణములు గలది. పరిపూర్ణ పరబ్రహ్మము సర్వద్వంద్వ విరాహిత్యమైనది. యెరుకకు ముఖ్యముగా జ్ఞానాజ్ఞానలక్షణములు గల్గియున్నవి. యెరుక నిరంతరం పరిణామశీలి పరిపూర్ణ మెప్పటికి నొక్కరీతిగా నున్నది. పరిపూర్ణమునకు జ్ఞానాజ్ఞానములు రెండూగూడా లేవు. యెరుక కు ఖండాఖండరూపములు రెండూ కలవు. పరిపూర్ణమునకు కేవల అఖండత్వము మాత్రమే కనుకనే శ్రుతి "పూర్ణమదః పూర్ణమిదం" అని చెప్పుచున్నది. ఆకాశముకంటె సూక్ష్మము ఆత్మ ఆకాశము ఖండమా అఖండమా? వుపాధినిబట్టియు ఆవరణమును బట్టియు ఖండఖండములగా గానవచ్చినను నిరుపాధికమగు ఆకాశము అఖండమే. ఎట్లనగా ఘటాకాశ మఠాకాశములు ఘటమఠ విచ్ఛిన్నానంతరమే గాక ఘటమఠము లున్నపుడు గూడ ఘటమఠములలోని ఆకాశము, వాని బైటనున్న ఆకాశము తెంపు లేక అఖండముగానే యున్నపుడు ఆకాశముకంటె సూక్ష్మమగు ఆత్మ అఖండముగానే వున్నదనుటలో విప్రతిపత్తి యుండజాలదు.

ఐతే, కందార్థములలో "అంతటాగలదొక్క అచలమే గానియెరుక అంతాట గలదాని అనరాదువినరాదు" అన్నారు గదాయని యెవరైనను శంకింపవచ్చును. పరిపూర్ణమంతటా నిండుకొని యున్నదని సర్వాంగీకృతవిషయము. సూది మోపుటకైనా తావీయని పరిపూర్ణమందన్య ముండుటకే వీలులేదు. అన్యమేమి లేనేలేదు. ఎరుక పరిపూర్ణమందు పుట్టనేలేదు. కనుక అచలము తక్క మరొకటి అంతటా కలదని యెట్లనగలము. కాని పరిపూర్ణమందు లేక తొచిన యెరుక

అంతటా అఖండముగా నున్నట్లు తోచుచున్నది. ఎరుక యందు యెరుక సత్యమే కనుకనే అంతట గనుపడునట్టిదేయని శ్రీకృష్ణ దేశికేంద్రులు సెలవిచ్చుట జరిగినది. కనుపడడమేగాని యెరుక లేనేలేదు.

మరియును ఎరుక రెండు రూపములుగా నున్నది. 1) యెరుకరూపము, 2) మరుపురూపము, యెరుకనగా యెరిగేటిది; మరుపనగా యెరుక తనను మరచటము, వ్యష్టియందు జీవులు కించి జ్ఞత్వలక్షణములు గల్గియున్నారు. వానియుందు గుర్తెరిగే లక్షణము చాలా పరిమితమై ఏకించి దవరోదమున్నను గుర్తు పరిపూర్ణముగా పనిచేయలేక పోవుచున్నది. కనుక ఏక దేశములో మాత్రమే పనిచేయుచున్నది. గోడవతల ఏమిజరుగుచున్నదో మనంచూడలేము. కాని సకల బ్రహ్మాండమే శరీరముగాల ఈశ్వరుడు సర్వజ్ఞుడు అని చెప్పబడుచున్నాడు. అనగా ఏకకాలమందే అతడు సర్వత్రనుండు సకలమును గుర్తించగలడన్నమాట. కనుకనే శ్రుతి "సర్వతిః పాణి పాదస్తు సర్వతోక్షి శిరోముఖం" అంటూ ఆలకారికంగా ఆత్మను అభివర్ణించినది. అనగా అతని యెరుక (జ్ఞానము) అఖండమని చెప్పినట్లేగదా. అట్లే మరుపు (అజ్ఞానము) కూడా వ్యష్టి సమష్టులయందు ఖండాఖండములుగా నున్నది. కనుక యెన్ని విధముల విచారించినను యెరుక ఖండాఖండములుగాను ఏక దేశీయ సర్వ దేశీయములుగాను, వేయేల సర్వసాపేక్షిక ద్వంద్వములుగానూ వున్నది. ద్వయదోష దూషితముగా నున్నందుననే, దానియందు కేవలత్వము లేదు. కనుక ఎరుక కేవలము ఖండరూపమనిగాని, కేవలము ఏక దేశియమనిగాని అనరాదని సిద్ధించుచున్నది.

శ్రీకృష్ణదేశికేంద్రుల సాటువ్వలు

సాటువులనగా దృష్టాంతములు. శాస్త్రార్థము చేయుపట్ల దృష్టాంతము లేని వాద మంగీకరింపబడదు. కనుక వేదాంత విచారణలో దృష్టాంతములకు యెక్కువ విలువ యీయబడుచున్నది. ప్రత్యక్షముగాగానరాని వస్తువులకు అనుభవములో ప్రత్యక్షముగా గానవచ్చు వస్తువులను దృష్టాంతముగా చెప్పి తెలియనిదానిని తెలియపరుచుటయే దృష్టాంతములు ప్రయోజనము.

శ్లో॥ విద్యాంతం బ్రహ్మవిద్యాంతం వార్తికాంత మగోచరం ।
పూర్ణబోధ ప్రవక్ష్యామి శ్రుణు శిష్యమహోత్తమ॥

అనగా- అన్ని విద్యలకంటెను వుత్తమమైనది బ్రహ్మవిద్య. దానికంటెను యుత్తమమైనదై అగోచరమైనదగు పూర్ణబోధను చెప్పుచున్నానని భావార్థము. అట్టి అగోచరమైన పూర్ణబోధను తెలుపు సంపూర్ణగ్రంథమును "శక్తి ద్వయనిరాశకంబైన శుద్ధనిర్గుణతత్వ కందార్థ దరువులు; క్షరాక్షరోపాది ద్వయదోషరహిత పరమతత్వ కందములు" అను శీర్షికతో రచించిరి. ఆత్మాతీతం, కేవలాత్మయని చెప్పబడె పరిపూర్ణమును సర్వసృష్టికి మూలకారణమై యెరుకయని చెప్పబడే ఆత్మను అనువదించి యెరుకను విడిపించుటయే గ్రంథస్తవిషయము. కనుక అర్థము గ్రహించుట యేమాత్రము సులభసాధ్యముకాదు. అందుచే నాగ్రంథములో యెన్నొసాటువులను చెప్పియున్నారు. ఈ గ్రంథములో కల్పించబడ్డ గురుశిష్య సంవాదములో చాలు చాలునని నీకై నీనోట నీవు పల్కుదాకను సాటువులను చెప్పుచుందు" నని గురుని ముఖముగా ప్రతిజ్ఞ చేయించి యున్నారు. ఐతే సాటువులలో నుండే విలువ యెంత తక్కువదో వారు గుర్తించి యుండుటచే వెంటనే "నూటికొక్కటే సేలుమాటాని తెలియుము" మాటిమాటికి వట్టిపాటలేమిటికి" అని గురువు చేత పల్కించినారు. కారణమేమనగా దృష్టాంతమునకు ద్రాష్టాంతికమునకు(on all fours) సర్వేసర్వత్రపోలిక సరిపోకపోవుటయే గాక ఏతద్విరుద్ధముగా కూడా నుండవచ్చును. దృష్ట ద్రాష్టాంతికములో ఏదో ముఖ్యమైన ఒక్క విషయంలో మాత్రమే పోలిక కుదురును. అట్లు కుదిరిన పోలిక మాత్రమే సేలుమాటగాని మిగతావి పొల్లుమాటలే యగును.

కనుక శ్రీకృష్ణదేశికేంద్రులవారి సాటువులను సంపూర్ణముగ నవగాహన చేసికొని అందు సేలుమాటలను గుర్తించి పొల్లుమాటలను త్రోసెవుచ్చుట ఎంతేని అవసరము. లేకున్నచో పాఠకులు శ్రీకృష్ణ దేశికేంద్రులను సరిగా నర్థము చేసికొనక తబ్బిబ్బు కావచ్చును. ఒక్కొక యెడ యపార్థములు సిద్ధాంత భంగమున్నూ కల్గించవచ్చును. కనుక అట్టి భ్రమప్రమాదములకు పాఠకులు లోనుగాకుండ నుండగలందులకే యీ వ్యాస ముద్దేశింపబడినది.

నిజముగా యోచిస్తే సృష్టియందంతటా యెంతవెదకినా సర్వసామ్యత యే రెండు వస్తువులకు లేదు. ఒకే చెట్టున కాచిన అనేక కాయలలో యే రెండు కాయలకు సంపూర్ణ సామ్యము లేదు. కవలపిల్లల్లో సహితం సర్వసమానత్వము గానరాదు. యెక్కడో ఒకచోట భిన్నత్వముండుట తప్పదు. చివరకు ఒక్క మూసలో తయారైన వస్తువులలో కూడా ఏ ఒక్క చిన్న విషయములోనో భేదముండును. రెండంటూ వుంటే భేదముండక తప్పదు. భేదముంటేగాని రెండని మాటేరాదు. తాత్వికముగా చూచినా గుణసామ్యావ్యవస్థయందు సృష్టిలేదు. వైషమ్యమునందే సృష్టియగుచున్నది. నిక్కచ్చిగా చెప్పాలంటే యే రెండు వస్తువులకు సంపూర్ణ సామ్యము చెప్పనేరాదు. అందును పరిపూర్ణమునకు సాటిగల వస్తువుండ వీలులేదు కనుకనే "దీనికి సాటిదేదీ యెచ్చటా" అని కృష్ణదేశికులే అన్నారు. అట్లే యెరుకకున్ను సాటిదేదీ లేదు. పరిపూర్ణమునకు సాటి పరిపూర్ణమే.

అట్లే యెరుకకుసాటి యెరుకయే. కనుక యేసాటువులు చెప్పినా ఏమాత్రమూ పనికిరావు. ఐనను శిష్యుని కవగాహన యగుటకై మాత్రమే కృష్ణదేశికులు సాటువులు చెప్పుచూ వచ్చిరి.

ఈ విషయములను దృష్టిలో నుంచుకొని శ్రీ కృష్ణదేశికేంద్రులిచ్చిన సాటువులను పరిశీలించి అవగాహన చేసుకొన వలసివున్నది.

40. పరిపూర్ణమున కీయుబడిన సాటువ్యలు

1. చట్టువలె కదలకుండును బట్టబయలు చట్టు అనగా చట్రాయి. బ్రద్దలు కొట్టుటకు అంతగా సాధ్యముగానిది. ఎంతో కష్టపడినగాని కదుపుటకు దుస్సాధ్యమైనది. చట్టు రాయిపై నుండి యెంత మహాప్రవాహము ఎంత వేగముగా ప్రవహించినను ఆ రాయి యీషణ్మాత్రమైనను కదలదు. మరిన్ని చట్రాయి. కదలుటకు స్థలమున్నది. అది యేక దేశీయము. బట్టబయలు అంతటా తానే నిండియుండగా కదలుటకు స్థలమేలేదు. కదిలించువారుగాని సాధనములుగాని లేవు. కనుక బట్టబయలు కదులుట అసంభవము. చట్రాయి ఒకప్పుడు కదులును. ఒకప్పుడు కదలదు. కనుక దానికి చలాచల లక్షణములు రెండునూ కలవు. బట్టబయలుకు చలనమెప్పుడునూలేదు. అది కేవలాచలమైయున్నది.

2. సముద్ర దృష్టాంతము "తండోప తండములుగా" (కందార్థము) గుంపులు గుంపులుగా గొప్ప జలచరములు తన లోపలనుండి గగ్గోలుచేస్తున్నా లేక అవి చనిపోయినా సముద్రము ఎట్లు గుర్తెరుగకుండా నుండునో అట్లే ఎండమావులరీతి నుండేటి బ్రహ్మాండ ముండినా పోయినా పరిపూర్ణము గుర్తెరుగకుండానే ఉండును అని దృష్టాంత మియ్యబడినది. సముద్రము గాని పరిపూర్ణముగాని గుర్తించకుండానే యున్నవి. అను ఒక్క విషయములోనే సామ్యమున్నదిగాని యితర ఏ విషయములోను సామ్యములేదు. సముద్రము ఆవరణయుక్తమై జలచరముల సృష్టి స్థితిలయములకు చోటిచ్చి ఆధారముగాను అధిష్టానముగాను ఉన్నది. పరిపూర్ణము అట్లులేదు. దానికి ఆవరణములేదు. అది దేనికి చోటివ్వదు. అది బ్రహ్మాండమునకు ఆధారముగాని అధిష్ఠానముగాని కాదు. జలచరములు సత్యముగా నున్నవి. బ్రహ్మాండము సత్యముగాక ఎండమావుల వంటిది అయివున్నందుననే పరిపూర్ణము తనయందుచోటిచ్చునట్లు భ్రాంతికలిగించుచున్నది. గనుక గుర్తెరుగకుండా ఉండేలక్షణములో మాత్రమే యీ దృష్టాంతము గైకొనవచ్చును.

3. సూర్యుడు చీకటిని, దావాగ్ని చదలను, పగలు రాత్రిని, రాత్రి పగలును, లక్ష్మీదేవి లేమిని, భూదేవి అన్నమును ఎరుగనట్లు భవనాశస్థితిలేని బయలు భవనాశస్థితులుగల ఎరుకను

ఎరుగదు. (రవి తమసమున్న దెరుగునే అనే కందార్థము) ఈ కందార్థములో, సూర్యుడు, దావాగ్ని దివము, రాత్రి లక్ష్మీదేవి, భూదేవి పరిపూర్ణమునకు సాటిపరుపబడినవి.

సూర్యుడు - సూర్యునియందు చీకటిలేదు; గుర్తెరిగే తెలివిన్ని లేదు. అట్లే బయలందు యెరుకలేదు. బయలుకు గుర్తెరిగే లక్షణమున్నూ లేదు ఒకటి గానవస్తే రెండోది వుండదు అంతవరకు ఇందు పోలికలున్నవి. ఐతే తేడాలో చాలాయున్నవి. 1) సూర్యుడేకదేశియుడు అనగా ఆవరణయుక్తుడు 2) తన ప్రకాశావరణమునకు బయటి చీకటి సత్యముగానున్నది. 3) సూర్యునికి రాకపోకలుగలవు. పరిపూర్ణము సకల దేశములయందూవుండి నిరావరణమైయున్నది. అంతటా నిండియున్న దాని కన్యముగా యెరుక వుండుటకే వీలులేదు. అది లేని స్థలమంటూ లేనే లేదుగనుక రాకపోకలుండుటకున్ను సావుకాశము లేదు. యెరుగకపోవుటయందు మాత్రమే సామ్యమున్నది. అట్లే మిగతావాని విషయములో విచారించవలెను.

4) గోడ (చిత్తరువు రంగుగోడల అనే కందార్థము) జగత్తు, ఎరుక, ఉత్తబయలు యీమూటికి చిత్తరువు రంగు గోడలను వరుసగా ఈ కందార్థములో దృష్టాంతముగ చెప్పినారు. ఇందు ఉత్తబయలుకు గోడకు పోలిక వూహించుకోమన్నారు. గోడమీద రంగులు వేయుటవలన చిత్తరువు ఏర్పడుచున్నది. ఇందు రంగు చెరిపివేస్తే రంగుతో పాటు చిత్తరువున్ను పోవుచున్నదిగాని గోడ పోవుటలేదు. అట్లే యెరుక జగములు వచ్చినా పోయినా పరిపూర్ణము మాత్రము శాశ్వతముగా ఉండుననియీ దృష్టాంతము యియ్యబడినది గాని మరి యేవిషయములోనూ గోడకు పరిపూర్ణమునకు పోలిక యేమీలేదు.

5) మేల్కు పరిపూర్ణము (కలమేల్కు లెరుక బయలుల కిల సామ్యముజేసి జూడుమీ అన్న కందార్థము) ఎరుకకు, ఎరుకలో తోచిన విశ్వమునకు కలను దృష్టాంతముగా యిచ్చినారు. ఎరుకను కలతోనూ ఎరుకవలన అయిన సమస్త విశ్వమునకు కలయందలి దృశ్యములతోను పోలికబెట్టి పరిపూర్ణ మునకు మేల్కు పోలికగా యిచ్చినారన్నమాట. మేల్కులో కల, కల దృశ్యములు ఎట్లు లేకుండా వున్నవో అట్లే పరిపూర్ణ మునందు ఎరుక ఎరుకవల్ల నైనవిశ్వము లేనివే అయివున్నవి. అంతవరకు మాత్రమే యీ దృష్టాంతము గైకొనతగునుగాని యిక పొడిగించకూడదు. ఏలననగా మేల్కు అనగా జాగ్రత అవస్థగదా! జాగ్రతావస్థయందు ఎరుకవుండి ఇరువదిఐదు యింద్రియములతోను గూడి సమస్తవ్యవహారములు చేయుచున్నది గదా! మరి పరిపూర్ణముయందు యెరుకగాని, యింద్రియములుగాని, వ్యవహార క్రియలుగాని యేమైన వున్నవా? గనుక యీ దృష్టాంతము పొడిగించకూడదు. ఎరుకనే కలకు మేల్కు గురుబోధయని

చెప్పుట సరిగాని పరిపూర్ణమును మేల్కయని. మరియొకటనిగాని అనరాదుగాని అయినను కలయందలి భ్రాంతులు మెలకువయందు లేనట్లు పరిపూర్ణమునందు యెరుక అనే భ్రాంతిగాని యెరుకవల్ల వచ్చిన యితర భ్రాంతులుగాని యేమీ లేవని చెప్పుటకే పరిపూర్ణమునకు మేల్కకు యీ కందార్థములో పోలిక చెప్పబడినదని గ్రహించవలెను.

6) భూమి దృష్టాంతము (చెట్టే మూలము విత్తుకు అనే కందార్థము) విత్తుకు చెట్టు, చెట్టుకు విత్తు కారణ కార్యములై ఉన్నవి. కాని నేల లేనిచో విత్తువల్ల చెట్టుగాని, చెట్టువల్ల విత్తుగాని కలుగవు. ఈ విధంగా విత్తూ చెట్టు లు (బీజవృక్షములు) ఒకదానికొకటి కారణ కార్యములై తన ఆధారముననే పరిణామముచెందుచున్నవని భూమి తెలుసు కొనుటలేదు. అట్లే ఎరుక జగములుతనయందే అధోఊర్ధ్వ పరిణామముల చెందుచున్నవని పరిపూర్ణమునకు గుర్తులేదు అన్నంతవరకే ఈ దృష్టాంతమును గ్రహించవలెనుగాని విత్తు చెట్టుల పరిణామమునకు భూమి ఆధారముగాను అధిష్టానముగాను వుండి పోషకద్రవ్యములను సమకూర్చుచున్నట్టుగా పరిపూర్ణము యెరక జగములకు ఆధారముగాను అధిష్ఠానము గాను పోషకద్రవ్యములను సమకూర్చునదిగాను లేదు. గనుక బీజవృక్షములు పరిణామము భూమి యెట్లెరుగదో అట్లే ఎరుక జగముల పరిణామమును పరిపూర్ణ మెరుగదు అన్నంతవరకే దృష్టాంతము అని గ్రహించవలెను.

7) పలక దృష్టాంతము (పరిపూర్ణమనెటి పలకే అను కందార్థము) గోడ దృష్టాంతమెట్లో అట్లే పలక దృష్టాంతము కూడా అన్వయము చేసుకొనవలయును. పరిపూర్ణమునకు పలక యెరుకకు బలపము, జగత్తునకు అక్షరములు పోలికలు. బలపము వలన అక్షర మేర్పడినట్లు యెరుకవల్ల జగత్తు ఏర్పడుచుతున్నది.బలపము చలించునపుడు అక్షరములు రూపు దాల్చుచున్నవి. కాని పలకమాత్రము కదలక స్థిరముగా వున్నది. అట్లే పరిపూర్ణము స్థిరమైయుండగా (కేవలము అచలమైయుండగా చలన శీలములైన ఎరుక జగములు ప్రవర్తించుచున్నవి.) బలపమునకు పోవుట అక్షరములు చెరిగిపోవుట జరుగవచ్చును కాని పలకమాత్రము శేషించివుండును. అట్లే ఎరుక జగములు రాకపోకలు సాగించినా పరిపూర్ణము మాత్రము ఎరుక జగము లతో రాదు. ఎరుక జగములతో పోదు అనుటకు కూడా యీ దృష్టాంతము గైకొనవచ్చును. అంతేగాని పలక బల్పాక్షరములకు ఆధారమైయున్నట్లు పరిపూర్ణము యెరుక జగములకు ఆధారమేలేదు. ఎరుక జగములకు ఆధారమున్నదని చెప్పరాదు. మరిన్ని పలక చూర్ణముచేసి బలపముగా చేయవచ్చును. ఆ బలపముతో అక్షరములు వ్రాయవచ్చును. అట్లు పలకయే బల్పాక్షరములుగా మార్పుచెందును. ఆవిధముగానే పరిపూర్ణము ఎరుక జగములుగా మారినది అని చెప్పుట వలన పరిపూర్ణ సిద్ధాంతమునకే భంగము వాటిల్లును. దృష్టాంతమును పొడిగించి అట్టి విరుద్ధార్థములను గ్రహించరాదు. పరిపూర్ణము యెన్నడు చలించదని ఎప్పటికీ శాశ్వతమని చెప్పుటకు మాత్రమే యీ దృష్టాంతము గైకొనవలయును.

8) అల భద్రాచలమనినను బయలుగా గుర్తెరగ వలయును ఇందు పరిపూర్ణమునకు భద్రాచలమును పోలికగా యిచ్చినారు. భద్రా+అచలము = భద్రాచలము అనగా హానిపొందనిది, ఎన్నడూ చలనము పొందనిది పరిపూర్ణము కూడా ఎన్నడూ కదలనిది, ఎన్నడూ హానిపొందనిది అచలమనగా పర్వతము అనికూడా అర్థము. ఒక కొండపైన భద్రుడనువాడు విష్ణువునుగూర్చి తపస్సు చేసెనని విష్ణువు సాక్షాత్కరించి ఆ కొండపై విష్ణురూపమున నిల్చిపోయెనని ఒకగాథ. ఆ పర్వతప్రాంతమున పిదప ఏర్పడిన గ్రామము భద్రాచలమను పేరుతో గోదావరీతీరమున వెలయుచున్నది. ఆ పర్వతము ఎంతో కాలముగా కదలక మెదలక అక్కడే వుండివుండగా ఆపిద ఎప్పుడో విగ్రహము వెలసినది. వచ్చినది పోవుటయూ తప్పదు. అట్లు విగ్రహముతో భద్రాచలమను ఆపర్వతముకూడా లేచిపోదుగదా! గనుక భద్రాచలము శాశ్వతముగా ఉండేది. విష్ణువిగ్రహము రాక పోక లక్షణములుగల దగుటచే అశాశ్వతపుది, అట్లే శాశ్వతమైన పరిపూర్ణమునందు లేనియెరుక ఒకప్పుడు తోచి గురుకృప కలిగినపుడు లేకుండా పోవుచున్నది. అట్లు లేకుండా పోయేయెరుకతో పరిపూర్ణము పోకుండా శాశ్వతముగా నిలిచేయుండును. ఈ విధముగా బయలుకు భద్రాచలమున్ను, ఎరుకకు విష్ణువిగ్రమున్ను పోల్చి చెప్పబడినది.

9) మరుపు సుషుప్తి మరణములు పరిపూర్ణంబునకు సాటిపరచబడినవి. యెరుక, యెరుకా మరుపు అను రెండు రూపములుగా నున్నది. యెరుక తనను తాను మరచినపుడు మరపు అనబడుచున్నది. మరపు స్థితియందు గుర్తెరిగే తెలివి రూపమైన యెరుక యేమీలేదు. అట్లని పరిపూర్ణమునందు యెరుక మరుపురూపములో ఉన్నదని అనుకొనరాదు. యేలననగా గుర్తెరుగునపుడు యెరుకని, గుర్తెరుగకుండా వున్నపుడు మరుపని ఒక యెరుకే పిలువబడుచున్నది. మరపందు యెరుక తాత్కాలికంగా లేదుగాని తిరిగి యెరుకరూపము వహించుచునేయున్నది. పరిపూర్ణమునందు యెరుక, యెరుకరూపములో గాని, మరుపురూపములోగాని యెన్నడూ లేనేలేదు. దృష్టాంతమునందలి యీ తేడాను గమనించవలయును.

10) సుషుప్తి వంటిది పరిపూర్ణమని దృష్టాంతమిచ్చినారు. సుషుప్తిలో యెరుక యేమీగుర్తించకుండా మరుపు రూపములో వున్నది. కాని పరిపూర్ణములో యేరూపము లోను యెన్నడూ లేదు.

11) పరిపూర్ణమునకు మరణావస్థతో చాటువు యిచ్చినారు. మనఃప్రాణముల చేరికలో గుర్తు కలుగుచున్నది. ప్రాణము మనస్సును తనతో కూడా తీసుకొని శరీరమునుండి బయటపడి బ్రహ్మాండములో చేరుచున్నది. అపుడు యిక శరీరమునందు మనఃప్రాణములు వుండవు. గనుక వాని సంయోగములో యేర్పడు గుర్తురూపమైన యెరుకకూడా యేమీలేదు అట్లే

పరిపూర్ణమునందును యెరుకలేదు. దృష్టాంతమును పొడిగించరాదు. యేలననగా పరిపూర్ణమందు ఒకప్పుడు మనఃప్రాణములు వుండునని సంయోగములో ఒకప్పుడు గుర్తుండునని ఒకప్పుడు మనఃప్రాణములు పోవుటవలన ఆ గుర్తు పరిపూర్ణమునువీడి బయటికిపోవునని అనరాదు. మనఃప్రాణములు పరిపూర్ణమునందెన్నడూ లేనేలేవు. అవి బయటకు పోవుటకు పరిపూర్ణమునకు బహిఃప్రదేశము లేదు.

మరపు సుషుప్తి మరణములయందు గుర్తెరిగే తెలివి రూపమైన యెరుక తాత్కాలికముగా మాత్రమే లేదు. మరుపునుంచి జ్ఞప్తికి సుషుప్తి నుండి మెలుకువకు, మరణము నుండి పునర్జన్మకు వచ్చినపుడు మరల యెరుక కలుగుచున్నది. కాని పరిపూర్ణమునందు యెరుక ఎప్పుడూ లేనేలేదు. ఒకప్పుడు లేక ఒకప్పుడు ఉండుటయూలేదు అని తేడాను గమనించవలయును. గనుక పరిపూర్ణమునకు సాటి యేమీ చెప్పరాదు. మరి యీ సాటువులను కృష్ణదేశికేంద్రులవారు ఏల చెప్పినారు? అంటే శిష్యప్రబోధార్థము మాత్రమే తెలియరాక అగోచరమైన అవిజ్ఞేయమైవున్న పరిపూర్ణమును శిష్యుడు వుండజూచుకొనగలుగుటకు మాత్రమే అని తెలుసుకొనవలయును.

1) చట్టు 2) సముద్రము 3) సూర్యుడు-మరియు దావాగ్ని, దివారాత్రములు, లక్ష్మీ, భూదేవి 4) గోడ 5) మేల్కు 6) భూమి 7) పలక 8) భద్రాచలము 9) మరపు 10) సుషుప్తి మరణము మొదలగు దృష్టాంతములలో యేదియు పరిపూర్ణముతో సాటిచేయరాదని గ్రహించినాము. శ్రీ శివ రామ దీక్షితులవారుకూడా, సూర్యుడు, చంద్రుడు, భూమి, అగ్ని, శరీరము గట్టు, స్త్రీ, పురుషుడు, వుపమానములుగా యిచ్చి అవి యెట్లు సరిపోజాలవోకూడా నిరూపించినారు. కనుక ఏ వుపమానమూ, ఏసాటువా, ఏదృష్టాంతమూ, పనికిరావు పరిపూర్ణమువంటిదీ మరొకటిలేదు. పరిపూర్ణము తప్ప యింకేమీ లేదు.

పిపీలికాది బ్రహ్మపర్యంతము యెరుకే అయినను అందలి నానావస్తువులకు, నామ రూప క్రియా నటనలలో యెంతో వైవిధ్యం గానవచ్చుచున్నది. జ్ఞానేంద్రియములకు గోచరంగాని, అఖండయెరుకను మనస్సు చేగుర్తింపచేయుటకు గాను, కందార్థములలో శ్రీకృష్ణదేశికేంద్రులు అనేక సాటువుల నిచ్చినారు. ఎరుకకు, ఎరుకలోని వస్తువులనే దృష్టాంతమిచ్చినారు కనుక యేవో కొన్ని భేదములున్నను యివ్వబడిన సాటువులు చాలవరకు సరిపోవును. సరిపోవునో లేదో పరిశీలించేముందు, యెరుకను గురించి కొంత తెలిసికొనుట అవసరము.

పరిపూర్ణ మొక్కటి తప్ప మిగతాదంతయు యెరుకే. ఆ యెరుక పరిపూర్ణమందు లేకనే తోచినది పరిపూర్ణము యెరుకగా పరిణమించలేదు. పరిపూర్ణమునందు గుర్తెరిగే యెరుక యెన్నడూ లేనేలేదు. కనుక అఖండ మెరుక గాగాని జీవేశ్వర జగత్తుగాగాని మారవలెనని సంకల్పించనూలేదు. పరిపూర్ణ మందు ఏ శక్తి సామర్థ్యములూ లేవు. పరాపర ప్రకృతులుగాని, ప్రాణముగాని దానియందు

లేనేలేవు. జ్ఞానము లేనేలేదు గనుక యేవిధమైన కర్మలున్నూ లేవు. పరిపూర్ణమునందెట్టి అహం వృత్తియు లేదు. కనుక కర్తృత్వ భోక్తృత్వములున్నూ దానికిలేవు. అదిదేనికీ అనగా జీవేశ్వర జగత్తులకు ఆధారము, అధిష్ఠానము, కారణమూ, నిజబింబమూ కాదు. దానియందు త్రిగుణములూలేవు. పంచతన్మాత్రలు లేవు. పరిపూర్ణమునందు యెరుక లేనేలేదు కనుక సర్వమూ యెరుకయందే వున్నవి. పరిపూర్ణమే సర్వత్ర సర్వవస్తువుల యందు సంపూర్ణముగ నిండియే యున్నది. కనుక అట్టి పరిపూర్ణ మొక్కటియే సత్యవస్తువు. యెరుక పరిపూర్ణమందు లేనలేదు కనుక అది అసత్యము. వున్నట్టు తోచబడుటయే గాని, అది లేనే లేదు. యిక్కడ కొన్ని సందేహములు కలుగ వచ్చును. వున్నట్టు తోచబడిన దెవరికీ? గుర్తెరిగే తెలివిగా తోచినది తానే; తెలిసేవాడు, తెలివీ తెలియబడేది తానే, అంటే తానే తోచి తోచినదానిగా తన్నుతానే చూచుకొనును. తాను సత్యమైన బ్రహ్మమని తనను తానేనమ్మినది. ఎందుకు నమ్మినది ? ఉన్న పరిపూర్ణమును తానెరుగదు. కనుక తన్ను తానే బ్రహ్మమనుకొన్నది. ఒక్కటైన తానే అనేక మగుదునుగాక అని సంకల్పించి తానే ఆధారమూ, అధిష్ఠానమూ, అభిన్న నిమిత్తోపాదాన కారణమూ అయి జగజ్జీవేశ్వరులుగా మారి తన్ను తానే చూచుకొని సుఖదుఃఖములు పొందుచూ పట్టుకాయలోని పట్టుపురుగువలె బంధమున తగుల్కొన్నది. తానుకాని, తాను లేని, పరిపూర్ణ పరబ్రహ్మమున్నదని తెలుసుకొనేవరకు భ్రాంతిలో మునిగి జననమరణ ప్రవాహమున పడి కొట్టుకొనుచున్నది. 3) పరిపూర్ణమూ, యెరుకా రెండూ సత్యమేల కారాదు? అంటే సత్యమొక్కటే యుండునుగాని రెండు సత్యములుండుట విరుద్ధము. సత్యమైన పరిపూర్ణము ఎరుకకు కారణమైతే, కార్యమైన ఎరుకకూడా సత్యమే అనవచ్చును. పరిపూర్ణము కారణముగాదు. ఎరుక దాని కార్యమూకాదు. ఆ రెంటికి కారణకార్య సంబంధము లేదు. కారణకార్య సంబంధమున్న ఎరుక జగములలో రెండూ సత్యమనియో రెండూ అసత్యమనియో చెప్పవచ్చును, జగత్తు అసత్యమని అంటే, దానికి కారణమగు బ్రహ్మము (అఖండయెరుక) కూడా అసత్యమే ననక తప్పదు.

పరిపూర్ణమందు ఎరుక అసత్యముగాని యెరుకయందు యెరుక సత్యమే. ఏలననగా మేను, ఎరుక అను రెంటిలో ఒకదానికొకటి కారణముగాను, ఆధారముగాను,్రధిష్ఠానము గాను, మూలముగాను,స్థానముగానూ వుంటూవున్నవి. మేను యెరుకు రెండూ ఎరుకే లేక రెండూ మేనే. కనుక ఎరుక యందు ఎరుక సత్యమేనన్నారు. జగత్తు కేవలం పారమార్థికంగా మిథ్యన్నారేగాని వ్యవహార సత్యత్వము గలదన్నారు ఆది శంకరులు. జగత్తు కేవలం శూన్య స్వరూపమైన అళీక పదార్థము కాజాలదు. శూన్యమే అయితే రేవు దాటుటకు నావ యెందుకు ! నది కష్టముగా నడిచిపోరాదా?

కందార్థములలో కల్పింపబడిన, గురుశిష్య సంవాదములో "గురువర! 1) పరిపూర్ణంబన యెరుకన యివి రెండు యెట్టివి ? 2) యెరుకోద్భవమెందు ? 3) యెరుక జనుచోటుయయ్యది 4) యెరుకను నేనెట్లు విడచేది ? ...." అంటూ యెరుక విషయమై శిష్యుడు వేసిన నాలుగు ప్రశ్నలకు గురువు దృష్టాంత పూర్వకంగా జవాబులు చెప్పియున్నారు. ఆ దృష్టాంతములేవో అవి యెంతవరకు సరిపోయినవో యిక పరిశీలింతము.

1) కలదృష్టాంతము :- ఎ) "పరిపూర్ణములో దోచిన ఎరుకేకల" - సుషుప్త్యవస్థలో కల దోచిన విధముగా పరిపూర్ణములో యెరుక దోచినది. గాఢసుషుప్తి యందు తాత్కాలికంగా యెరుక యేపని చేయుటలేదు. గాని మరుపు రూపములోవున్నది. పరిపూర్ణమందు అసలే లేదు. మరుపు రూపమైన సుషుప్తి నుండి వచ్చి జాగ్రదవస్థయందు యెరుక రూపము వహిస్తున్నది. సుషుప్తి సమయమునందు అంతఃకరణము నందు దాగియున్న కర్మ సంస్కారములు జాగ్రత్స్వప్న ములయందు పునరుద్భూతములై జాగ్రదయందు క్రియారూపముగాను కలయందు భావనారూపముగానూ కర్మలు చేయుచున్నవి. కనుక కలకు మూలమే లేదనుట ఎట్లు ? అంటే ఆ సంస్కారములు మాత్రము యెరుకగావా! కనుక యెరుక కెరుకే మూలము మరోక మూలము మాత్రములేదు. పరిపూర్ణమందు యెరుకకు మూలముగాని స్థానముగాని లేనేలేదు.

మరిన్ని జాగ్రతనుంచి సుషుప్తికి సుషుప్తి నుంచి జాగ్రతకు మధ్య సంధికాలములలో కలవచ్చుచున్నది. అట్లు ఏ సంధికాలములలో ఎరుక పరిపూర్ణమందు తోచుచున్నది. అంటే మనఃప్రాణములు సంధిలో లేక నేను మేనుల సంధిలో అని చెప్పవచ్చును. ఎరుకకు నేను మేనులే రెండురూపాలు. పరిపూర్ణము మేలు కాదు సుషుప్తకాదు. దానికి ఎప్పుడూ ఏ అవస్థలు లేవు. ఐతే ఎరుకనే కలకు పరిపూర్ణ బోధయే మెలకువగాని పరిపూర్ణమనరాదు.

2) "ఎరుకను కలలో పురుషుని కెరుకే యీ విశ్వమగుచు నేర్పడుకలగా" అనగా యెరుకేకల విశ్వము, కలలో కల అన్నమాట. యీ విశ్వమనేకల ఎవరికికల? అంటే ఎరుకనే కలలో దోచిన పురుషునియొక్క కల. కలలో కల కనుక మరీ అసత్యము. అట్లే యీ విశ్వము కలవంటిదగు యెరుకకంటెనూ అశాశ్వతము, అసత్యమూనై యున్నది. యెరుకనేకలకు, యెరుకలేదనే నిశ్చయజ్ఞానమే మేల్కొగాని, పరిపూర్ణమే మేల్కొయని చెప్పరాదు.

3) కల మేల్కొనంటినట్లు, ఎరుక బయలు నంటదు. ఎందుకంటదు? అంటే, లేనివస్తువు వున్నవస్తువును బాధింపజాలదు ఐశ్వర్యమునకును, దరిద్రమునకును చేరిక వుండదు. చేరికేవుంటే దరిద్రమంటూ వుండనేజాలదు కదా! అట్లే బయలు ఎరుకకు చేరికే వుంటే ఎరుకే లేకుండాపోవును. కల, యెరుకలు రెండూ మిథ్యావస్తువులు.

యింద్రియములచే గుర్తింపరాని దయ్యును మనస్సుచే గుర్తింపదగియున్నది. ఎట్లనగా యిది శూన్యగృహము అన్నపుడు అశూన్యత్వమును (యేమీ అందు లేకపోవుటను) గుర్తించుచున్నాము. ఇంద్రియములు శబ్దాదులను గుర్తించినట్లే, శబ్దాదుల, లేమిరికమునుగూడ గుర్తించుచున్నది. ఎట్లనగా శ్రోత్రేంద్రియముచే శబ్దమును గుర్తించినట్లే నిశ్శబ్దమునుగూడ గుర్తించుచున్నాము. అట్లే మిగతా స్పర్శ రూప రసగంధములను, అవి లేనిస్థితిని గూడ ఆయా యింద్రియములచే గుర్తించుచున్నవి. వస్తువు వుండుట, లేకుండుట కూడ మన యింద్రియ సన్నికర్షణ జ్ఞానము చేతనే గుర్తించుచున్నాము. "శూన్య మన్యత్ స్థానం పూర్ణమన్యస్థానం" అని చెప్పబడినది. కనుక శూన్యమునకును పూర్ణమునకును అన్యమైనది పరిపూర్ణము. శబ్దస్పర్శాదులున్న చోటున్ను శూన్యమైన చోటున్ను కూడ ఎరుకే. ఏలనన శూన్యమునుగూడ గుర్తెరుగ గలుగుచున్నాము. కనుక రెండున్ను ఎరుకే. అస్తినాస్తుల కతీతమైనది పూర్ణత్వశూన్యత్వములక తీతమైనదీ పరిపూర్ణ పరబ్రహ్మమొక్కటే కనుక ఎరుకను శూన్యమన్నారు. మరిన్ని వున్నదానియందు లేనిదేదో అది శూన్య మనజెల్లును. కనుక వున్న పరిపూర్ణ మందు లేని యెరుకను శూన్యమే యనవలెను.

యెరుక క్షణికము :- 1) తొలుకారు మెరుపువలె 2) నీళ్ళలోని బుడగలు రీతి 3) సూర్యకిరణములయందలి నీటి తుంపరులు వలె యెరుక కనిపించి, మరల కనుపడదు.

యెరుక శబ్దమునకు జ్ఞానము, గుర్తు సంకల్పము అను అర్థములుగలవు. అయం ఘటః- ఇది కుండ అని కుండను గుర్తించిన జ్ఞానము అయంపటః అని జ్ఞానముచే బాధింపబడుచున్నది. ఒకానొక వస్తువును గుర్తించిన జ్ఞానము ఎంతకాలము నిలుచును ? మరొక వస్తుజ్ఞానము కలుగనంతవరకే గాని ఆపైన లేకుండా పోవుచున్నది. కనుక యెరుక క్షణికమని చెప్పబడినది. సృష్టిలో మనకు గానవచ్చు సర్వస్వము పరిణామ శీలమై నిరంతరము మార్పులకు గురి అగుచున్నది. స్థూలమగు పదార్థములయందేగాక సూక్ష్మమగు వస్తువులయందును యిట్టినిరంతర మార్పు సత్యమైయున్నది. గుర్తు (లేక యెరుకే) గూడ యీనిబంధనకు లోనైయున్నది. ఊహకందు సమస్తము క్షణభంగురమయ్యేవున్నది. సంకల్పవికల్పముచేయు ఎరుక క్షణకాలముగూడ ఒకేరితిగా నిల్చుటలేదు అనుటకు శ్రీ కృష్ణదేశికేంద్రులు "తొలు కారు మెరుపు తళుక్కున మెరిసి మరుక్షణములో మాయమైనట్లే, నీటిలో బుడగలు పుట్టి వెన్వెంటనే బ్రద్దలైపోయినట్లే వర్షానంతరం సూర్యకిరణములలో కానవచ్చు నీటితుంపురులు వాని వేడిచే అంతలోనే యెగిరిపోయినట్లుగానే ఎరుక క్షణమైన స్థిరముగా నిల్వదు అని దృష్టాంతముల నిచ్చినారు.

4) ఎరుక వుత్పత్తి అనుటకు దృష్టాంతములు నారికేళ సలిలము బి) బీజవృక్షన్యాయము సి) సుషుప్తి యుందు మెలకువ డి) ఊర్ణనాభి ఇ) వంధ్యానూనుడు వగైరాలు యఫ్) సంతోషాసంతోషములు జి) కట్టెందు సామాన్య విశేషాదులు హెచ్) మనఃప్రాణములు ఐ) తెలివిదేహములు.

సృష్టికి పూర్వము సృష్టికి కారణమైన బ్రహ్మము అఖండజ్ఞానరూపముగానుండి తానే అనేకముగావలెనని సంకల్పించి అనేకనామరూపములు వహించిభిన్నాభిన్నముగా తోచుచున్నది. కనుక యీ కారణ కార్యరూపముగానున్న సమస్తము ఏకవస్తువే. కార్యకారణములు గానటువంటి పరిపూర్ణ పరబ్రహ్మమునకిది భిన్నముగా తోచుచున్నది. ఆ పరిపూర్ణ బ్రహ్మమునందు లేని యీసృష్టి కారణవస్తువునకు లేని యెరుక అని పేరిడినారు. ఈ లేనెరుక యెట్లువచ్చినదో తెలుపుటకు పైన పేర్కొన్న దృష్టాంతము లీయబడినవి.

ఎ) నారికేళము (కొబ్బరికాయ) లోనికి నీరు యెట్లు వచ్చినదో అట్టే ఎరుకపుట్టినది. నిండా నీరున్న లేతకొబ్బరి కాయనుండిగాని, నీరు పూర్తిగా యెండిపోయిన కొబ్బరికురిడీ కాయనుండిగాని చెట్టు మొలవదు. కొద్దిగా నీరున్నకొబ్బరి కాయయే సరియైన విత్తనము. విత్తనపుకాయలోని ఆ కొద్ది పాటి నీరే చెట్టుకాచిన కాయలలోని నీటికి కారణమైయున్నది అని చెప్పవలెను. కనుక కొబ్బరినీరే కొబ్బరినీటికి కారణమైనట్లే యెరుక ఎరుకే కారణమైయున్నది.

బి) బీజవృక్షన్యాయము (విత్తే చెట్టయి పుట్టును, విత్తేవిత్తనమురీతి వెలయును) విత్తనమువల్ల చెట్టు, చెట్టు వలన విత్తనములు వచ్చుచున్నవిగాని యీ రెంటికి వేరే విత్తన యొకటున్నదా ? అట్లే జగమువలన సంకల్పము జగమా సంకల్పమునను జనించును యెరుక కన్యమైన దొక్క పరిపూర్ణమే. అది యెరుకకు మూలముకాదు. కనుక యెరుక కెరుకే మూలమైయున్నది.

సి) మేలుక సుషుప్తిలోపలయే లీలం తనకు తాను యేతెంచునో, గుర్తాలీల బయలులోపల వాలయము తనకు తానెవచ్చునోయన్నామేలుక యట్లువచ్చును, మేలుకపోయి సుషుప్తిలోని కెట్లుపోవును ? మనస్సు అంతఃకరణ స్థానముందు అజ్ఞానావరణమున మగ్నత చెంది ప్రాణముతో కలయిక లేక యున్నందున గుర్తుపోయి సుషుప్తివచ్చును. మనస్సు ప్రాణముతో సంయోగము చెందుట తోడనే గుర్తు పుట్టు చున్నదా ? అవును. అంటే, యే రెంటియొక్క చేరికలో కలుగుచున్నది? అను ప్రశ్నకు జవాబు చెప్పవలసియుండును.పరిపూర్ణమందు ఏదీ లేనేలేదుగదా ! కనుక యీదృష్టాంతము సరిపోదు అనే చెప్పవలసియున్నది. కొంచెము పరిశీలించి చూస్తే యెరుక బయలులో తనంతట తానుగా వచ్చినదని చెప్పుటకే దృష్టాంతము యీయబడినదని తెలుసుకొనగును. గాఢ సుషుప్తిలో మోల్కాలేదు. గుర్తూలేదు. పరిపూర్ణ మందునూ అవస్థాత్ర యములుగాని గుర్తుగాని లేవు. ఎవ్వరు లేపనిదే నిద్రనుండి మేల్క హఠాత్తుగా ఎట్టికారణమున్నూ లేకనే వుచ్చుచున్నది. అట్లె యెట్టికారణమున్నూ లేకనే హఠాత్తుగా పరిపూర్ణమందు యెరుకవచ్చును అనుటకే యీ దృష్టాంత మీయబడినదని తెలియవలెను.

కొందరు మేలుక నుషుప్తి రెంటిమధ్యలో కలవచ్చునట్లు పరిపూర్ణములో గుర్తువచ్చుచున్నదని చెప్పెదరు. ఇది యెంతమాత్రము సరికాదు. బయలులో యేరెంటిమధ్య, గుర్తు కలుగును ? పరిపూర్ణమందు ఒకటిగాని రెండుగాని యితరము లేమీ లేనేలేవుగదా !

డి) ఊర్ణనాభి అనగా నాభిస్థానమందు దారముగలది అని శబ్దార్థము. కనుక సాలెపురుగునో, లేక పట్టుపురుగనో అర్థము చెప్పవచ్చును. అదారముతో అల్లబడే గూటికి నిమిత్త కారణము, ఉపాదాన కారణములు రెండూ ఆపురుగే అయివున్నది. అట్లే పరమాత్మ నిమిత్త కారణము, ఉపాదాన కారణము రెండూ తానేయై సృష్టి చేయుచున్నాడు. గనుక అతనిని అభిన్న నిమిత్తోపాదాన కారణమన్నారు. సాలెపురుగు దృష్టాంతము గైకొన్నచో విప్రతిపత్తి (అక్షేపణ) యేమనగా సాలెపురుగు తాను అల్లిన గూటి వుపరిభాగమున తాను స్వేచ్ఛగా సంచరించుచున్నది. తాను అల్లినగూడు తనకు బంధకారణమగుటలేదు. అట్లే పరమాత్మ అభిన్న నిమిత్తోపాదాన కారణము మాత్రమేగాక సాక్షిగానున్నాడు అందురు. తన సృష్టియందు తాను బద్ధుడగుట లేదు అని చెప్పెదరు. ఇది విరుద్ధము ఏలననగా కర్తగానున్న యతనినిసాక్షియని చెప్పుట యెట్లు !

పరిపూర్ణ భావజ్ఞులదృష్టిలో పరమాత్మ సృష్టి సంకల్పము చేసెను గనుక సృష్టికర్తగానున్నాడు. మరిన్ని సృష్టిగా తానే మార్పుచెందెను. గనుక కార్యముగాను వున్నాడు. అనగా కారణకార్యములు రెండుతానే అయివుండి తాను సృజించిన విశ్వమునందుతానే బద్ధుడై యున్నాడు. కనుక పూర్ణనాభి శబ్దమునకు పట్టుపురుగు దృష్టాంతము చెప్పుచున్నారు. పట్టుపురుగు దృష్టాంతమే చక్కగా సరిపోయినది. ఏలననగా పట్టుపురుగు తానల్లిన పట్టుకాయలో తానే చిక్కి మూర్ఛావస్థనుండి మేల్కొని పట్టుకాయలో రంధ్రము పెట్టి బయల్పడి పోవునట్లుగానే యెరుక పరిపూర్ణ గురుసార్వభౌముని ప్రబోధచే భ్రాంతిరహితము చెంది బ్రహ్మాండ కటాహమును భేదించుకొని పోవును.

ఇ) లేనెరుక బయలులోపల తానెటుల జన్మించెననిన, తగువిను "వంధ్యాసూనుని గతి" అను కందార్థములో 1) వంధ్యాసూనుడు 2) వియదబ్జం 3) యక్షరాజధాని 4) రజ్జుసర్పము 5) స్థాణుపురుషుడు 6) మృగజలము 7) శశి విషాణము 8) స్వప్నానందములను దృష్టాంతము లిచ్చి యున్నారు.

1) వంధ్యాసూనుడు - బిడ్డలేలేనిది గొడ్రాలు. కాని ఆమె దత్తత చేసుకొంటే అపుడా కుర్రవానిని వంధ్యాసూనుడని చెప్పనగును. అట్లే సృష్టికారణవస్తువు తనయందేమీ లేక గొడ్రాలివంటిదగు బయలందు తొచిన యెరుక వంధ్యాసూనుని వంటిదే యగును గదా!

2) వియదబ్జము - అకాశపుష్పము. శూన్యమైన అకాశమునకు పుష్పము పూయదుగాని, వర్షానంతరం, తుంపురులలో సూర్యకిరణములు విశ్లేషము చెంది, అందలి సప్తవర్ణములు

యింద్రధనస్సుగా ఏర్పడును. దానిని ఆకాశ పుష్పముగా అజ్ఞులు భావింతురు. అట్లే పరిపూర్ణమునందు లేనప్పటికి యెరుక జగములు భాసించుచున్నవి.

3) యక్షరాజధాని - మేఘపంక్తులు మేడమిద్దెలుగా ఆకృతులు వహిస్తే వానిని యక్షరాజధానిగా భావింతురు. మరియును ఇంద్రజాలములో మోహితుడైన వానికి కనపడు నగరము యక్షరాజధాని గంధర్వనగరము అని పిలువబడును. కేవలము అట్లే లేని యెరుక జగములు భ్రాంతిచే సత్యముగా దోచబడినవి మాత్రమేగాని, నిజముగా నవి పరిపూర్ణమునుందు లేనేలేదని తాత్పర్యము.

4) రజ్జుసర్పము - పాముగా కన్పడు త్రాడు పాము యొక్క ఆకార విశేషములే స్ఫురణకువచ్చుటచే పామేయని భ్రాంతి చెందుట.

5) స్థాణుపురుషుడు - పాతిపెట్టబడియున్న కఱ్ఱదుంగను చూచి మనిషి అనుకొన్నట్లు అని దృష్టాంతము.

6) మృగజలము - ఎండమావులలోని నీరు. నిజముగా నీరులేదు. అది నీరునుకొని దప్పిగొన్న లేళ్ళు ఆ నీళ్ళకై పరుగెత్తి నశించును కనుక ఆ అసత్యమైన జలమునకు మృగజలమని పేరువచ్చినది.

7) శశివిషాణము - కుందేటి కొమ్ము కుందేలు పరుగిడునపుడు రెండు చెవులను దగ్గరగా చేర్చును. అపుడు ఆ చెవులు రెండూ కూడి ఒక కొమ్మువలె కన్పడును.

8) స్వప్నానందము - కలలో కల్గిన ఆనందము అని అర్థము. కలలోని దృశ్యములు. కలలోని అనుభవములు అసత్యములేకదా! అయినను సత్యమైనవిగా తోచబడును. అట్లే మనకు సుఖదుఃఖములు గల్గించునని తెలియవలెను.

లేనెరుక బయలులోపల తానెటుల జనించెను? అని ప్రశ్నించి దానికి సమాధానముగా యీ దృష్టాంతము నీయబడినవి. ఐతే ఆ దృష్టాంతములలో ప్రతిదానికి ఏదో ఆధారమూ అధిష్ఠానమూ వున్నది. కాని లేని ఎరుక కలుగుటకు ఏది ఆధారమూ అధిష్ఠానమూ అయివున్నది? పరిపూర్ణము ఆధారమూ అధిష్ఠానమూ అయివుందని చెప్పరాదు. కనుక లేనియెరుకే లేని యెరుకకు ఆధారమూ అధిష్ఠానము అయివుందని చెప్పక తప్పదు. ఇది యెట్లు ?

1) వంధ్యాసూనుడు - గొడ్రాలికి కొడుకు యెన్నడూ పుట్టనేలేదు. ఆమె దత్తుడున్ను ఆమెకు పుట్టలేదు . అయిననూ అతడామె కొడుకని చెప్పబడినటులే లేనియెరుక పరిపూర్ణ మందు పుట్టనేలేదు ఐననూ అందువున్నటుల భ్రాంతిచే తోచబడుచూ వున్నది. వంధ్యాసూనుడను శబ్దమునకు వంధ్యయొక్క దత్తపుత్రుడు ఆధారమూ అధిష్ఠానము అయివున్నాడు. కాని వంధ్యకాదు.

అటులే పరిపూర్ణము లేనియెరుకకు ఆధారము కాదు వంధ్యకు దత్తపుత్రుడు ఎటులపుట్టలేదో అటులే పరిపూర్ణ మందెరుక పుట్టనేలేదు.

2) వియదబ్జము - ఆకాశపుష్పము, ఆకాశమునకు పుష్పము పూయలేదు. కాని ఆకాశమునందు ఇంద్రధనస్సుతోచినది. కనుక ఆకాశము కారణముకాదు. వానతుంపురులలో సూర్యకిరణము విశ్లేషముజెంది వానియందలి సప్తవర్ణములు కానవచ్చినవి కనక సూర్యకండమ్ముందలి సప్తవర్ణములే ఇంద్రధనుస్సునందలి సప్తవర్ణములకు కారణముగాని ఆకాశము కారణముకాదు. అటులే లేని యెరుకే లేని యెరుక జగములకు కారణముగాని పరిపూర్ణము ఎంతమాత్రము కారణముకాదు.

3) యక్షరాజధాని అసలు ఎక్కడైనా ఏరూపములో నైనా వునికి గలిగియున్నదా లేక ఊహామాత్రమైన అళీకపదార్థమా! కేవలము అది అళీకపదార్థమే అయితే సారూప్యసాదృశ్యాది దోషములవల్ల భ్రాంతికల్గినదని కూడా చెప్పరాదు. పరిపూర్ణమందు ఎరుక పుట్టనేలేదని ఒక్కమాట చెప్పివేసినట్లే. అట్లుగాక ఇంద్రజాలములో గానవచ్చిన నగరమే యక్షరాజధాని అనే కలంలో యింద్రజాలము నందు తెలియబడినవి, అన్నీ అసత్యములేగనుక లేనియెరుకయు అందుతోచినవన్నియుకూడ అసత్యములే. సత్యమైన పరిపూర్ణము యిట్టి అసత్యమైన యెరుకకు కారణము కాజాలదు.

4) రజ్జుసర్పము : - స్థాణుపురుషుడు అను రెండు దృష్టాంతములలోను సారూప్య సాదృశ్యాది దోషములు, అధ్యాస సామగ్రియ నుండుటచే ఒకవస్తువు మరొకటిగా భాసించుట జరుగుచున్నది. పరిపూర్ణము యెన్నడూ అట్లు భాసించేది కానేకాదు. ఇకపోతే, యెరుకలో వస్తువులలో ఒకటి మరొకటిగా భాసిస్తూవుంటవి. అందుకు ముఖ్యకారణము ఆ అన్నిటిలో అనుస్యూతముగావున్న యెరుకయే. లేని యెరుకొక్కటివుంటే అన్ని అధ్యాసలూ వుంటూనే వుంటవి. ఎరుకలోనే అన్ని చిత్ర విచిత్రాలు తోస్తూవుంటవి.

ఐతే రజ్జువు సర్పమైన విధమునన్ లేనియెరుక బయలులో తానెట్లు జన్మించినది ? అని విచారిస్తే అసలు రజ్జువు సర్పమైనదా లేక రజ్జువు సర్పమురీతిగా కనబడినదా ? అంటే రజ్జువుసర్పము కానేలేదు. అట్లే పరిపూర్ణమందు, యెరుక జనించనేలేదు అని చెప్పకతప్పదు. ఐతే యిక యీదృష్టాంత మెట్లు సరిపోగలదు ? రజ్జువు సర్పముగా భాసించుట యెట్లు జరిగినది ? పూర్వము చూచియున్న సర్పము యొక్క స్మృతి జ్ఞానము కలిగియున్న వానికే సర్పభ్రాంతి కలుగును గాని సర్పమునే చూచియుండని వానికి సర్పభ్రాంతి కలగనే కలగదు. ఈ స్మృతిజ్ఞానమే సర్పభ్రాంతి జ్ఞానమునకు కారణము. సర్ప జ్ఞానమే సర్పభ్రాంతి కలిగించినది. అట్లే లేనెరుక బయలు లోపల లేనెరుక చేతనే జనించినది అని తెలుచున్నది. ఆ విధముగా రజ్జు సర్ప దృష్టాంతము సమన్వయించుకొనవలసి యున్నది. ఇదే విధముగా స్థాణుపురుషుని దృష్టాంతమున్ను అన్వయించవలెను. తాను మానవాకృతితో నున్నాడు తాను మానవుడుననే గుర్తు తన్ను

వదలియుండుట లేదు. ఏల ననగా సంఘములో తనవంటి యితర మానవులతో నిత్యసంసర్గము కలిగియుండి వారిలో గలసి వ్యవహరించుచున్నాడు. ఆ మనిషి గుర్తు తన్ను అంటియేవుండి పొడవు, లావు మొదలగు సాదృశ్యములు మందాంథకారములో ఆ కఱ్ఱ మొద్దు యందు మానవాకారమే వెంటనే స్ఫురించి భ్రాంతి జనకమగుచున్నది. అట్లే తానే తోచి లేనియెరుక తనయందు నానాత్వమునకు రూపకల్పన చేసుకొని అరూపములను తన కంటే భిన్నభిన్నముగ చూచుకొని భేదమోదములు పొందుచున్నది.

మృగజలము యెట్లు తోచుచున్నది ? సూర్యకిరణముల వలన కలుగుచున్నదని, సూర్యుడస్తమించిన పిదప పోవునని అందరూ యెరుగుదురు. అయితే వుదయమందు గాని సాయంత్రమందుగాని తోచవుగదా! మధ్యాహ్నము సూర్యకిరణముల ఉష్ణోగ్రత యెక్కువగా నుండునపుడు భూమికాలి అందలి చెమ్మ ఆవిరి రూపముగా పైకిలేచునపుడు మాత్రమే జలముగాతోచును. ఆ జలము సూర్యకిరణముల యందు లేనేలేదు. ఐనను వున్న దానివలె తోచును. ఆవిరి యందలి జలమే, జలమువలె భూమి వుపరిభాగమున మాత్రమే తోచుచున్నది. అట్లే పరిపూర్ణమందు లేనేలేని ఎరుకతానే తనయందు తోచుచున్నది. "నేనని బ్రహ్మలోపల లేని దే సంభవమునొంది" అన్న కందార్థములో శ్రీ కృష్ణదేశికులు లోకులు గజిబిజిగా యీ దృష్టాంతమును చెప్పినా దానికి యీ బోధకు తగునంచు వినజేస్తినన్నారు. ఎండమావుల యందు నీరెట్లులేదో అట్లే బ్రహ్మమునందు జగత్తులేదు అని మాత్రమే లోకుల భావన. పరిపూర్ణలభావములో ఎండమావుల జలము సూర్యకిరణములం దులేనప్పటికి సూర్యకిరణముల యందు వున్నట్లు యెట్లు తోచబడుచున్నదో అటులే పరిపూర్ణ మందు యెరుక లేనప్పటికీ పరిపూర్ణమునందే తోచబడు చున్నదని, ఆవిరియందున్నజలమే యెండమావులయందు తోచు జలమునకు కారణమై యెటులున్నదో అటులే యెరుక కెరుకే కారణమైయున్నదనిన్ని తెలియవలెను. కనుకనే యీ దృష్టాంతము పరిపూర్ణ బోధకు తగియున్నదని శ్రీ కృష్ణ దేశికులన్నారు.

శశవిషాణము :- కుందేటికొమ్ము. కుందేలుకుకొమ్మున్నట్లుతోచుటకు పరుగిడునపుడు కుందేటి చెవులొకటిగా చేర్చుటయే కారణమైయున్నది. అటులే యెరుక లేనే లేనప్పటికి, తనయందలి నేను మేను లొకటిగాచేరుటయే గుర్తెరిగే యెరుకొత్పత్తికి కారణము. స్వప్నానందము, స్వప్నము, స్వప్నములోని సమస్తమూ జాగ్రతయందు లేవు గనుక అసత్యములే, అటులే ఎరుక యెరుకయందలి చిత్ర విచిత్రము లేనివే. కాని స్వప్నమున్నదంతవరకు స్వప్నవిషయము లన్నియు యెటుల సత్యప్రతీతిగలిగియున్నవో అట్లె యెరుకయు అందలి విషయములు యెరుక యున్నంతవరకు సత్యములే. పరిపూర్ణ ప్రబోధ యనే మేల్కొంచెందినవారికి మాత్రము బ్రహ్మానందము స్వప్నానందము తుల్యమే యగుచున్నది.

ఎరుకెటుల పోవు ననుటకు : -

1) కరిమ్రింగిన వెలగపండువలె యెరుక పోవును. యేనుగునకు వెలగపండు అందించినచో దానిని అటులే మ్రింగివేయును. అటులే మలముద్వారా మరునాడు విసర్జించును. కాని పండులోని గుంజు, గింజ మాత్రము లేకుండాపోవును. వట్టి గుల్లమాత్రమే బైటపడును. కాని యీ గుల్లయందు ఏమాత్రమూ పగులుగాని, రంధ్రముగాని యుండదు. అట్లే మరణమునందు ప్రాణ మనస్సులు లేని మృత కళేబరము కదలక మెదలక పడియుండును. వెలగపండునందలి గుంజుతో ప్రాణమును గింజతో మనస్సును పోలిక చెప్పవచ్చును. వెలగపండు గుంజున్ను గింజలున్ను యేనుగ జఠరాగ్నిచే ద్రవరూపము చెంది గర్భకోశములోని కాకర్షింపబడి సప్తధాతురూపములు చెంది చివరకు రేతస్సు రూపముగా ఆడయేనుగునందు ప్రవేశించి బిడ్డరూపముగా పుట్టుచున్నది. అట్లే శరీరమునందున్న మనఃప్రాణములు అకాశముచే నాకర్షింపబడి జీవి కర్మానుసారము మరియొక గర్భస్థపిండము నందు ప్రవేశించి శరీరధారణ చేయుచున్నది. కనుక యెరుక పోయినట్లెపోయి తిరిగి వచ్చే పద్ధతికి యిది దృష్టాంతమైయున్నది.

2) వనిగల్లువలె వచ్చిపోవును. వనిగల్లు అనగా నీటిబుడగ. ఇది యెటుల వచ్చిపోవును? జలమునందున్న వాయువు బైటికిపోవు ప్రయత్నములో బుడగలుపుట్టుచున్నవి. ఉదాహరణకు సోడాబుడ్డిని తెరచినచో సోడానీటిలోని గ్యాసు(వాయువు) పైకిపోవునపుడు బుడగలు విరివిగా పైకిలేచును. గాలితో నిండిన సన్నని నీటిపొరనే బుడగ యందుము. కనుక వాయుజలములు సంయోగములో నీటిబుడగ కల్గునట్లు నేను మేనుల సంయోగములో అనగా ప్రాణమనంబుల సంయోగములో యెరుక గుఱైరిగే తెలివి కలుగుచున్నది.

3) మేలుక సుషుప్తిలోపల ఏలీలన్ తనకు తానెయేతెంచునొ అట్లు గుర్తుబయలులో వచ్చిపోవుచున్నది. ఒకప్పుడు మెళకువ అకారణంగా (ఎవరున్ను లేపనిదే) తనంతతానే వచ్చు చున్నది. వచ్చిన మేల్కు వృద్ధిచెంది మరల నిద్రలోనికి జారి గాఢసుషుప్తి చెందుచున్నది. అట్లే బయలందు తనకుతానే గల్గి జీవేశ్వరజగత్తుగా వృద్ధిచెంది ప్రళయములో తిరిగలేకపోవుచున్నది. ఇచ్చట సుషుప్తి బయలుకున్ను, మేల్కు యెరుకకున్ను సాటువ చేయబడినది. కాని సుషుప్తియందు మెలకువ దాగియున్నట్లు బయలుయందు గుర్తు దాగియుండలేదు. కనుక బయలును సుషుప్తితో పూర్తిగా పోల్చరాదు. కనుకనే కృష్ణ దేశికేంద్రులు "దీనికి సాటిదేది యెచ్చోటా" ? అని యుద్ఘాటించియున్నారు .

4) కట్టెందు నిప్పులేక కట్టియనొక సమయమందు కనుపడి బహుగా మిట్టిపడి తుదకు కనపడ దట్టిదెనుమి యెరుక పుట్టువు. కట్టెయందు నిప్పు కనుపడదుకాని సామాన్యాగ్ని యనబడి దానియందే దాగియుండి ఒకప్పుడు కనబడి పిదప కనబడకుండా నశించిపోవునట్లు యెరుక పుట్టించుచున్నదని దృష్టాంతము. నిప్పు యెరుకకున్ను కట్టె పరిపూర్ణమునకును యిందు సాటువ

లిచ్చినట్లే మేల్కు యెట్లు దాగియున్నదో అట్లే యీ దృష్టాంతమందునూ కట్టెయందు సామాన్యాగ్ని అట్లే దాని యున్నతి మరిన్ని సామాన్యాన్ని కట్టెయందుండి విశేషాగ్నికి మూలంగా నున్నది. కనుక నిప్పుకు కట్టె కారణమై యున్నది అనాలి అంతేగాక నిప్పు మిట్టిపడి తుదకు కనుపించకుండా పోవుటలో కట్టెను పూర్తిగా దహించుచున్నది. పరిపూర్ణమునందెరుక దాగియుండనూలేదు. ఎరుకకు కారణమున్నూకాదు. ఎరుకతోపాటు పోవుటయున్నూ లేదు. కనుక పరిపూర్ణమునకు యీ సాటువయున్ను సరిపోదు. కాని అంతకు పూర్వము గానరాని యెరుక పుట్టుచున్నదనుటకున్ను కట్టెయందలి సామాన్యాగ్ని విశేషాగ్నికి కారణమైనట్టు ఎరుకే యెరుకకు మూలమగును అనుటకున్ను నిప్పుసాటువ సరిపోవుచున్నది.

(కందార్థములలో అనేక యితర సాటువలున్నవి. వాని నన్నిటిని వివరించుట గ్రంథవిస్తరమగును. సాటువులను బట్టికందార్థ అర్థమును తెలుసుకొనుటకు ప్రయత్నించనచో సిద్ధాంతభంగము కాగల ప్రమాదమున్నది. సాటువునకు వైజ్ఞానికముగ యెట్టి అర్థము చెప్పకొన్నా బాధలేదు, కాని ద్రాష్టాంతికమునకు వర్తింపచేయుపట్ల సిద్ధాంత వైరుధ్యము కాకుండ చూచుకొని మిగతా సాటువులను పాఠకులు అర్థము చేసుకొనవలెను.)

***

40 వేమన పద్యములు

వేమన రసపిపాసి. తొలుత శృంగార రసము, తుదకు బ్రహ్మానందరసము నాతడాస్వాదించెను. అతడు తొలుత భోగి, మధ్యలో యోగి, తుదకు త్యాగి, అభిరాముని స్నేహించి హేమతారక విద్య, అంబికాశివయోగిని సేవించి బ్రహ్మవిద్యనాతడు. బడసెను. అతడు చేయని సాధన పొందనియను.భవము లేదనియే చెప్పవచ్చును. అతడు శోధించక విడచిన మతవాదములు తాత్విక విషయములు లేవు.

వేమన పద్యములు జనసామాన్యము నెక్కువగా నాకర్షించుటవలన, "విశ్వదాభిరామ వినుర వేమ" అనే మకుటముతో యితరుల పద్యములు గూడ కాలక్రమేణా వేమన పద్యములుగా చెలామణి కాజొచ్చినవి. పొడవు కథలవంటి పద్యములు కొన్ని, బ్రహ్మంగారి తత్వాలలో వలె గూఢార్థమిమిడ్చిన పద్యములు కొన్ని, వేమనగారి పద్యములుగా ప్రచారములోనున్నవి. అవన్నియు వేమన పద్యములుకావు. ఐనను రసవాదమును, పరిపూర్ణభావమును చెప్పుపట్ల గూఢార్థమిమిడ్చిన పద్యములు కొన్నియుండవచ్చును. అందు, పరిపూర్ణ భావ మిమిడ్చిన పద్యములు మాత్రమే, (గురు గోప్యము కాపాడుచూ) వ్యాఖ్యానించబడును.

ఆ॥ వె॥ బయలు రూపు రూపు బయలునుగా జేసి
బయలు రూపు బట్టబయలు జేసి
బయలులోని దాని భావింప దత్వంబు ॥ విశ్వ॥

తాత్పర్యము : శూన్యమగు ఆకాశమే సర్వరూపము లాయెను కనుక కనవచ్చు సర్వరూపములు శూన్యముగానే భావించుము. ఆ శూన్యాకాశము ఆత్మనుంచిగదా వచ్చెను. ఆ యాత్మకూడా లేనిదైనా పరిపూర్ణ పరబ్రహ్మమందు తోచుచున్నది. యీ ఆత్మనే తత్వశబ్దముచే గ్రహించ వలెను. (బయలునకు ఆకాశమనియు ఆత్మయనియు, పరిపూర్ణ మనియు మూడర్థములున్ను గలవు)

ఆ॥వె॥ ప్రొద్దు పొడుచుచోటు బ్రొద్దు నిలచుచోటు
బ్రొద్దు గ్రుంకుచోటు బొసగజూచి
ప్రొద్దెరిగిన వాడు పొలుపైన యోగిరా ॥ విశ్వ ॥

తాత్పర్యము : ప్రొద్దు అనగా సూర్యడు కనుక సూర్యుడు ఉదయాస్తమానములు చెందు ప్రాక్పశ్చిమములు సంచారముచేయు మధ్యప్రదేశమును గమనించి ఆ దేశమును, సూర్యుడు కాలమునకు చిహ్నము గనుక అకాలమును విచారించి దేశకాలములుగానున్న వస్తువును, దేశకాలాతీతమగు వస్తువును తెలిసికొన్నవాడే నిజమైన యోగి.

ఆ॥ వె॥ పుట్టవారలెవరు పుట్టుకుందు రెవరు
పుట్టిపుట్టనట్టి పురుషులెవరు
పుట్టిపుట్టనట్లు బోధించి చూడరా ॥ విశ్వ ॥

తాత్పర్యము : 1) జన్మలకు లోనైనవారలు 2) జన్మరహితము యిదివరకే చేసుకొని బ్రహ్మైక్యము చెందిన వారలు 3) యిది వరకు పుట్టి జీవముతోనుండి యికముందు పుట్టకుండా చేసుకొన్న వారలెవరు ? 1) సంచిత ఆగామిరూపములగు కర్మ శేషము మిగిలియున్నవారు పునః పునః జన్మించుచునేయుందురు. 2) పరిపూర్ణ భావముచే సర్వకర్మలను నాశనము చేసుకొన్న పిదప దేహమును విడచినవారు. 3) జీవించియుండగానే సద్గురుకృప సాధించి అశరీరపద్ధతిలో ప్రారబ్ధ శరీరమున్నంతవరకు యీ లోకమున నడయాడువారు అను మూడు రకముల మానవులున్నారు. మూడవ రకము మానవులుగానగుటయే మానవజన్మకు సార్థకము కనుక పూర్ణబోధయే బోధించి లోకకళ్యాణము చేకూర్చుటయే సద్గురువుల కర్తవ్యము.

ఆ॥ వె॥ గురుతుగాను చెప్ప గురుడెవ్వడును లేడు
గురు తెరుంగు శిష్యవరుడు లేడు
గురుడు శిష్యుడనుట గ్రుడ్డెద్దు చేనెరా ॥ విశ్వ ॥

తాత్పర్యము : పరిపూర్ణ పరబ్రహ్మము చూపులకు వాక్కులకు నందనిది ఎరుక చేత ఎరుగరానిది. యెరిగిన లేనెరుక దాన్ని గనిపెట్టిన పిదప లేకనేపోవుచున్నది . కనుక దాన్ని చెప్పి చూపించిన గురుని గుర్తుగాని, విని చూచిన శిష్యుని గుర్తుగాని పరిపూర్ణ పరబ్రహ్మమందు లేనేలేవు. కనుక పరిపూర్ణబోధయందు గురుశిష్యన్యాయం ఎట్లున్నదనగా గ్రుడ్డెద్దు చేను మేసినట్లుగానున్నది. యెద్దు గ్రుడ్డిదైనను చేను మేయగల్గినది. దాని ఆకలియును తీరినది. ఆ పిదప చేను యందు యజమానియులేడు యెద్దులేదు అట్లే పరిపూర్ణ పరబ్రహ్మమందు గురుశిష్యోభయ రాహిత్యము. అట్లే గురువు శిష్యునికి పరిపూర్ణబోధ తెలియచేసి వస్తునిశ్చయము గావించెను శిష్యునికి భ్రాంతి రహితమాయెను అని భావము.

***

41. గురుకృపాసంసిద్ధి

పరమాత్మ సృష్టియందలి 84 లక్షల జీవోపాదులలో మానవోపాధి దుర్లభమైనదని సర్వులకు విదితము "దుర్లభం మానుషం దేహం, వివేక మతిదుర్లభం" అనే న్యాయంగా మానవోపాధికి వచ్చినా వివేకము కలిగియుండుట మరీ దుర్లభము. మానవజన్మ యెత్తినందుకు జన్మరహితమునకు కృషిచేయుట పరమధర్మమైయున్నది. ప్రపంచమునందు గల సర్వమతములు జన్మకారణ వస్తువే దైవమని మోక్షస్థానమనీ నిర్ణయించుచున్నవి. శ్రీ శివరామదీక్షిత సిద్ధాంత పరిపూర్ణ బోధయందే జన్మరాహిత్య విధానము చక్కగా నిరూపింపబడినది. పరిపూర్ణ బోధనుగూర్చి దాని నిర్మితవిధానము ఆరూఢవిధానములను గూర్చి యీ వ్యాసమంజరిలో పెక్కు పర్యాయములు వివరించుట జరుగుచునే వున్నది. మరల దానివిషయమై చర్చించుటవల్ల చర్విత చర్వణ దోషము కలుగదా అని శంకించ నవసరములేదు. విశేషించి పునర్విమర్శ ద్వారా సిద్ధాంతమందలి అధికృత అందలి లోతుపాతులు హెచ్చు అవగాహనకు రాగలవు.

పరిపూర్ణబోధ ఆరూఢమగుట ఎట్లు? దీనియందలి లోతును గ్రహించి, ఉత్తీర్ణులగుటకు ఆచరించదగిన ఆచరణ విధానమేమి? అని ప్రశ్న కలిగినచో ఒక్క గురూపాసన, గురుకృప అనిచెప్పక తప్పదు. ఒక్క గురూపాసన, గురుకృపల ద్వారానే సర్వార్థసిద్ధికాగలదు. గురువు అనుగ్రహించగల వుత్తమోత్తమమగు ఫలప్రాప్తి యేదో అది గురుకృపావిశేషమనదగును. ఇతరులకు తెలియరానిది గురువు వద్ద గుహ్యాతి గుహ్యముగా నున్న రహస్య జ్ఞానమేది ? అదే స్వరూపజ్ఞానము, అదే ఆత్మరూపము, గురురూపము, తన నిజరూపమున్నూ అయివున్నది.

అది " గురోర్ముఖేన జ్ఞాతవ్యం నాన్యథా గ్రంథ కోటిభిః " ఐననూ గురుబోధరీత్యా ఆ వస్తువునందు బుద్ధి నిశ్చయముకలిగినను గురుకృపలేనిచో ఆత్మనిశ్చయము. (అనగా అరూఢజ్ఞానము) కలుగ జాలదు. అట్లు ఆత్మనిశ్చయము కలిగించిన వెనుకగాని సద్గురువు పరిపూర్ణబోధ శిష్యుని కనుగ్రహించడు.

పారమార్థిక సంబంధమైన ఏ సాధనాసిద్ధికైనా ముందుగా శిష్యునికి అంతఃకరణశుద్ధి కావలెను. ఏకాగ్రత అత్యంత ఆవశ్యము. సత్కర్మాచరణవల్ల అంతఃకరణశుద్ధి కలుగును. ఏకాగ్రత గురూపాసనచే గలుగును. ఏకాగ్రతతో చేసిన సాధన అత్యంతశక్తివంతము కాగలదు. గురుకృప కలుగుటకు గురుమంత్రానుష్ఠానము అత్యంత ఆవశ్యకము. గురుమంత్ర నిర్మాణములో గురుమంత్రము దేనికొరకు జపించవలెనో నిర్ణయించబడినది. " శ్రీ గురుకృపా ప్రసాద సిద్ధ్యర్థే జపే వినియోగః" అనగా ఒక్క గురుకృపా ప్రసాదసిద్ధికొరకే అని నిర్ణయింపబడియున్నది. గురుమంత్రమునకు సాక్షాత్ శ్రీ గురు పరమాత్మయే అధిష్టానదేవతయై వున్నాడు. మంత్రము విడిచి వేరే మంత్ర అధిష్ఠాన దేవత ఉండడు. గురుమంత్ర మందే గురుస్వరూపము ఎట్లు నిండియున్నదో సాంప్రదాయక గురువులచేత శిష్యులు వస్తు నిశ్చయముగా విచారించవలసి యున్నది. గురుమంత్రానుష్ఠానము వలననే గురుపుత్రుడు ఆత్మసాక్షాత్కారము పొందవలసియున్నది. గురువు మంత్రమును మాత్రమే వుపదేశించి వూరుకొనునా ? అంటే తదా చరణవిధానము, అనగా వాచక, ఉపాంశు, మానశిక, అర్థభావన, ధ్యాన పద్ధతును సాంగోపాంగముగా గురువు తెలియ చేయును, ప్రారంభమందు వాచకజపము, తదుపరి ఉపాంశు, పిదప మానసికము, క్రమేణా అభ్యాసము చేయవలసియున్నది. ఇట్లు క్రమేణ అభ్యాసము చేయుటలో మానసిక ఏకాగ్రత లభించితీరును. మానసికజపముచే మంత్రశక్తి వుత్పన్నమగును. ఏలనన మనస్సు ఇటునటు పరుగిడక కేవలము మంత్రాక్షరములపైననే కేంద్రీకరింపబడును. గురుమంత్రసిద్ధే గురుకృప అని చెప్పవలెను. మానసిక జపము చేయుచు గురుముఖతః వస్తునిశ్చయపూర్వకముగా గురుమంత్రార్థమును గ్రహించి అనగా గురుమంత్రాధిష్టానదేవతయొక్క స్థాన స్వరూప, స్వభావములు విని స్వరూపనిర్ణయమునందే ఏకాగ్రత చెందు నట్లు మనస్సును ప్రయత్నపూర్వకముగా ప్రవేశపెట్టి ధ్యానములో సాక్షాత్కారానుభవము పొందవలసియున్నది. అంతరంగసాధనలో ఎట్టి ఉపేక్షయు పనికిరాదు. పరమాత్మ లేక గురుస్వరూపము ఒక్క మనస్సుచేత మాత్రమే చూడదగినదని, వినదగినదని శ్రుతులు ఘోషించుచున్నది. "మనసైవానుద్రష్టవ్యం- మనసైవానుశ్రోతవ్యం", మంతవ్యో నిధిధ్యాసితవ్యం॥ అనిన్ని, "బుద్ధి గ్రాహ్యమతీంద్రియం" అనిన్ని నిర్ణయించుచున్నవి. మనఃపరిపక్వత లేని సాధన వ్యర్థమేకాగలదు. పరిపూర్ణ సిద్ధాంతములో, గురుపుత్రులుత్తీర్ణులగుటకు ముఖ్యముగా మూడు మార్గములు నిర్దేశింపబడి యున్నవి.

1) అనుష్ఠానము, 2) ఆచరణ, 3) విచారణ ఇచ్చట అనుష్ఠానమనగా గురుమంత్రానుష్ఠానమనియే తెలియవలెను. అభ్యాసంలో అనేక మానసిక ఆందోళనలకు గురికాగల అవకాశమున్నది అందువలననే గురూపదిష్టమార్గములోనే అభ్యసించవలసియున్నది. "నానా యుక్త్యుపదేశేన తారితాశిష్యసంతతిః" అని గురుమూర్తి కీర్తింపబడుచున్నాడు. ఆచరణ అనగా త్రికరణశుద్ధిరూపకమైన ప్రవర్తన. త్రికరణశుద్ధి ప్రవర్తనవలననే అంతఃకరణపరిశుద్ధి అయి అంతఃకరణ ఆత్మగా మారగల శక్తి ప్రాప్తించగలదు. అందున పారమార్థిక సంబంధమైన ఆత్మ శుశ్రూష అనంబడు త్రికరణశుద్ధిని; గురుపుత్రుడు తు.చ. తప్పకుండా పాటించవలసియున్నది. ఇక విచారణ అనగా గురుముఖతః సాంఖ్య, తారకామనస్క, మహావాక్య, వార్తికసిద్ధాంత విచారణచే తానే ఆత్మ స్వరూపమును బుద్ధిరూప నిశ్చయము పొందవలెను. పిదప గురుమూర్తి ఆత్మస్వరూపమను వస్తునిశ్చయపూర్వకముగా శిష్యునకు ఎరుకపరచి దానిని ధ్యాన పద్ధతిలో ఎట్లు అరూఢపరచుకొనవలెనో ఎరిగించును. అనుష్ఠాన, ఆచరణ, విచారణలు సరిగా ఏకబాటలో ప్రవేశపెట్టి కృషి చేయుసాధకుడు నిస్సందేహముగా స్వరూపసాక్షాత్కారము పొందగలడు. ఆత్మ సాక్షాత్కారానుభవము కలుగు పర్యంతము అంతరంగ సాధన (అనగా శ్రవణ మనన నిధి ధ్యాసలు) విడువరాదు. అఖండ ఎరుక నిర్ణయము ఎరిగిన నరునికి మాత్రమే పరిపూర్ణ బోధవిషయములో గురుమూర్తి "ఏసాధన నీకెందుకు వీసానికి పనికిరాదు" అని అన్నారేకాని, ఇతర విషయము కాదని ముఖ్యముగా గ్రహించవలసియున్నది. ఈ అనుష్ఠాన, ఆచార, విచారణలు ఎంతకాలము ఎక్కువగా చేయవలెను ? అన్నచో ప్రతి నిత్యము నిదురవచ్చినదనక చేయుచునేయుండవలెనని తెలియ వలెను. అనుష్ఠానము హెచ్చుగా చేయుచున్న కొలది. మానసిక విశ్రాంతి కలిగియుండుట గురుముఖతః తాను విన్న విచారణ జ్ఞప్తికి వచ్చి అందలి విషయము ఆమూలాగ్రముగా ఆరూఢమై సందేహ నివారణ తనంతతానుగానే అగుట విషయములందు వైరాగ్యము, అంతఃకరణ ప్రశాంతి మున్నగునవి కలుగగలవు. ఈ విధమున పరిపక్వము చెందిన మనస్సే, గురుమూర్తి నిర్దేశించిన ధ్యాన మార్గముద్వారా తానే ఆత్మస్వరూపము అనే అఖండ జ్ఞానిసిద్ధిగాంచగలదు. గురుకృప, లౌకిక ప్రయోజనముకై గురుపుత్రుడాశించరాదు. జన్మరాహిత్యరూప పరిపూర్ణబోధ స్థితిని పొందుటకు ఒక్క గురుకృపయే పరమాధారమను విషయము ప్రతిక్షణము గుర్తించి తదాచరణకు వలయు సాధనలు, అనగా గురుభక్తి, గురుసేవ, గురునిష్ఠ, అనుష్ఠాన, ఆచరణ విచారణలు చతుర్విధ శుశ్రూషలు మొదలగునవి అత్యంత శ్రద్ధతో అవలంబించవలసి యున్నది. సగుణ రూపముతో నున్న గురుమూర్తి అనుగ్రహించి బోధయందలి మర్మములు ఎరుకపరచినను, అంతరంగ సాధనలచే పరిపక్వమై అనుష్ఠాన సిద్ధిరూపమైన ఈశ్వరకృపను పొందనిచో ఆరూఢము కాజాలదు. గురుముఖతః తాను విన్న అఖండ ఎరుకయొక్క స్వరూపస్థితియందు, తనమనస్సే

ఆత్మయై నిలవగలుగుటయే గురుకృపకు పరమ తార్కాణము. ఇది అనుభవనీయము. ఇది అంతయు గురుకృపవలననే లభింపగలదు. గురుస్వరూపమే తానై నిలుచుటయే గురుకృప ఇట్టి అనుభవముపొందిన వానికి ఇక ఐహికాముష్మికములందు కోరదగినది లేదు. పరిపూర్ణ బోధయందు జన్మరాహిత్యరూప, సర్వభ్రాంతి రాహిత్యస్థితిని పొందదలచిన గురుపుత్రుడు ప్రప్రథమములో ఇట్టి అఖండజ్ఞానసిద్ధిని పొందితీరవలసిన దేనని చెప్పకతప్పదు. ఈ భావమునే గురుగీత ఈ క్రింది శ్లోకములో ఉద్ఘాటించుచున్నది--

శ్లో॥ స్వయం బ్రహ్మమయో భూత్వా
తత్పరం చావలోకయేత్ ।
పరాత్పరతరం నాన్యత్
సర్వగం తన్ని రామయమ్ ॥

తా॥ జనుడు తాను బ్రహ్మస్వరూపియై పిమ్మట దానికి తరమైన కేవలాత్మనుచూడదగును. సాక్షాత్తూ పరస్వరూపమగు పరిపూర్ణముకంటె అన్య మేమీ లేదు. అది అంతటను నిండి దేనికి ఆధారముగాక నిరామయమైనది.

అఖండ ఎరుక నిర్ణయము ఎరిగిననే కాని పరిపూర్ణ బోధ చెప్పరాదు. గురుకృపచే అఖండయెరుక ఆరూఢుడైన వానికి మాత్రము ఇక సాధనలు పనికిరావని, ఏ సాధనలూ లేని పరిపూర్ణ బోధను గురూపదిష్ట మార్గమందే కృషి సల్పమని గురుమూర్తి నిర్దేశించినారని తెలియవలెను.

శ్రీ భాగవతుల కృష్ణదేశికేంద్రులు తాము రచించిన కందార్థములలో గురుకృపను ఇంకను విశేషముగా నిర్వచించి, నిరూపించియున్నారు. "అపరోక్షమౌనె మనుజులకు" అనే కందార్థములో ఈ భావమును వ్యక్తపరచి యున్నారు. పరిపూర్ణబోధనను క్లుప్తముగా చెప్పవలెనంటే, పరిపూర్ణమును ఎరుకను ఎరిగి, ఎరుకను మానుటయే. ఇక్కడ ఎరుగుట యనగా కేవలము వినుట మాత్రమే కాదు, వాటినిగూర్చి వస్తునిర్ణయముగా ఆరూఢపరచుకొనుటయే అని తెలియవలెను. ఈ భావమును కృష్ణదేశికేంద్రులు ప్రథమంలో

పరిపూర్ణమనే దొకటీ లేనెరుకనే దొకటీ
పరిపూర్ణ యెరుకల నెరిగి ఎరుకనుమాను ॥

అని వుపదేశముకూడా చేసియున్నారు. అయితే నవి ఎవ్విధంబున తెలియబడగలవు? అను ప్రశ్నకు జవాబుగా శ్రీ దేశికేంద్రులే తమ కందార్థములలో శలవిచ్చియున్నారు.

"అపరోక్షమౌనే మనుజులకు,
పరోక్షంబైన బయలు గురుకృపలేకన్,
అపరోక్షమౌను మనుజులకు
పరోక్షంబైన బయలు గురుకృపకలుగా,
కీలిదే లేని ఎరుక తా తొలుగ
విపరీతమౌ బుద్ధివిడచి నీవెప్పుడు
ఉపచారములు చేయుచుండుము గురునికి"

అని నుడివియున్నారు. దీనిభావ మేమనగా మనో వాక్కుల కందక, శుద్ధ నిర్గుణమైయున్న పరిపూర్ణ పరబ్రహ్మము తెలియబడవలెనన్నను, ఎరుకను వీడవలెనన్నను, ఎరుకను వీడి అశరీర పద్ధతిలో కర్తవ్య కర్మాచరణ ద్వారా అస్పర్శయోగ పద్ధతి అలవడవలెనన్నను ఒక్క గురుకృప చేతనే ననియు, అట్టి గురుకృప కలుగుటకు తగువిధమైన ఉపచారములు చేయుచుండుమని నిర్దేశించి యున్నారు.

"ఉపచారములు చేయుచుండుమా గురుకృపకలుగా" అని గురుకృప సిద్ధించు మార్గముకూడా సూచించినారు! ఉపచారము అనగానేమి ? సేవయనియు, గంధాదులర్పించు 5 పంచోపచారములు, ధ్యానావాహనాది 16 షోడశోపచారములు, ఆవాహనము, స్వాగతాదులతో సహా 18 అష్టాదశోపచారములున్ను, సుగంధ తైలాభ్యంగనాది 64 చతుష్షష్టి పుపచారములు అని అర్థములుగలవు.

"గురుశ్రూష నొనర్చుట నెరిగించెద నెట్లనన్న। యేర్పడ వినుమా నరు లిష్ట దైవములకున్ పరిచర్యయొనర్చునట్లు" అని కందార్థములలో పరిచర్య అన్న శబ్ద ముపయోగింపబడినది. షోడశోపచారములు మొదలగు యుపచారములు ఇష్టదైవములకు పరిచర్యయే యగును. కనుక సగుణరూప గురుపూజా విధాన మందీ వుపచారములన్నియు చేయతగిన శుశ్రూషయనగా సేవయనియే అర్థము, స్థాన, ఆత్మ అంగభావ శుశ్రూషలు చేసుకొనుటయే నిజమగు గురుసేవ. ఇవి స్వోద్ధరణకు తన అంతఃకరణ పరిశుద్ధకి అత్యంతావసరము కనుక గురుభక్తులు సగుణరూపములోను నిర్గుణరూపంలోను గురుమూర్తిని ఉపాసించుట ముఖ్యకర్తవ్యము. యిట్టి గురుసేవ వలననే గురుకృపావిర్భావము కాగలదు. ఆ పిదపగాని యెటు వంటివాడయినను పరిపూర్ణ మెరుకల నెరుగ జాలడు. ఎరుకను వీడి భ్రాంతిరహితుడు కాజాలడు. గురుకృప పారమార్థికాభ్యున్నతికే గాక, ప్రాపంచికమున గూడ యెనలేని మేలు చేకూర్చును.

శ్లో ॥ మూకంకరోతి వాచాలం పంగుంలంఘయితే గిరిం ।
యత్కృపాత మహంవందే పరమానంద మాధవం ॥

పరమాత్మయగు మాధవునికృప యున్నచో, మూగివాడు మహోపన్యాసకుడగును, కుంటివాడు కొండలను దాటగల్గును అని భావము. ఆది శంకరుల శిష్యుడగు పద్మపాదుడు నది అవలియొడ్డుకుపోవ సంకల్పించినపుడు అడుగడుగున అతని పాదములానృుకొనుటకు నదిలోపద్మములు మొలవగా వానిపై పాదములానృుచు మోగాలైన చెమ్మకాకుండా అవలిఒడ్డుకు నడచిపోయెనట. యీ విధముగా గురుకృప ఐహిక జీవితము నందు ఎంతో సహాయము కాగలదు. గురుకృపాసిద్ధికై గురూపాసనగావించువాడు జీవితములో ప్రారబ్ధానుసారం ప్రాప్తించు సుఖదుఃఖములకు పొంగక కృంగక అంతఃకరణ స్థిమితమును గోల్పోక సదా శాంతుడై యుండును కనుక ఐహికాముష్మిక సుఖసంతోషములకు చతుర్విధ పురుషార్థసిద్ధికి గూడ గురు కృపాసంసిద్ధి అత్యంత అభిలషనీయమై యున్నది.

***

42 శ్రీ శివ రామదీక్షితీయ దివ్య సందేశములు

శ్రీమద్రామడుగు శివరామ దీక్షితులవారు 101 యజ్ఞములు గావించిరనియు, అద్వైతసిద్ధాంతములో ఆరితేరిన నిపుణులై కాశీపట్టణమునందు యితర మతవాదములన్నియు ఖండించి అద్వైతమతమే అన్నింటిలో గొప్పదని ఆదిలో నిరూపించి అదియే శ్రేష్టమైన సిద్ధాంతమని దానినే దేశమంతటా ప్రచారము సాగించుచుండెను. ఆ సందర్భములో వారికి శ్రీధరస్వామివారితో పరిచయముకలిగి వారితో ముఖాముఖి 7 రోజులు అద్వైతమే శ్రేష్ఠమైన సిద్ధాంతమని వాదించి, పరాజితులై శ్రీ ధరస్వామివార పాదము లాశ్రయించి పరిపూర్ణబోధను సాకల్యముగ్ర వారినుండి గ్రహించిరనియు ప్రతీతి. ఆ పిమ్మట అద్వైతమతమును ఖండించుచు పరిపూర్ణబోధ సిద్ధాంతమే జననమరణ రాహిత్యమునకు ఏకైక మార్గమని ప్రచారము చేయుచు వచ్చిరి.

ఈ పరిపూర్ణ బోధ ప్రచారములో శ్రీ దీక్షితులవారు యిచ్చిన దివ్య సందేశమేమి? అనుటయే ఈ వ్యాసరచనోద్దేశము.

1) బుద్ధభగవానుడు పాళీభాషలో, బసవేశ్వరుడు కన్నడ భాషలోను సర్వులకు తెలియులాగున వారివారి మాతృభాషలలో తెలిపి వారికి అవగాహన చేసినట్లుగా

శ్రీ శివరామదీక్షితులవారు, తేటతెలుగు భాషలో తెలియజేసి తెలుగు వారికి మహోత్కృష్టమైన సేవ గావించిరి. అంతకు పూర్వము తెలుగు భాషలో రచింపబడిన వేదాంత గ్రంథములు నిజముగా లేనే లేవని చెప్పవచ్చును. వేదాంతమంతయు ఉపనిషత్తులలోను, బ్రహ్మసూత్రములలోను, భగవద్గీతలలోను సంస్కృతభాషలోనే రచింపబడి యుండుటచే సంస్కృత భాష తెలిసిన మహా పండితులకేగాక తదితరులెవరికిని అవగాహన గాకయుండెను. ఆ సంస్కృత గ్రంథములలోకూడ

> "శ్రుతయశ్చ భిన్నాః స్మృతయశ్చ భిన్నాః,
> మహాఋషీణాం మతయశ్చ భిన్నాః"

అనునట్లు పరస్పర విరుద్ధమైన భావములతో నుండుటచే వేరువేరు మత సిద్ధాంతములకు తావిచ్చెనేగాని ఏకైక రూపమైన సిద్ధాంతమును ప్రచారపరచి యుండలేదు. అట్లు గాక శివరామ దీక్షితీయ ప్రబోధము తేట తెనుగుభాషలో నుండుటవలన అక్షరాస్యులైన వారందరికి మతవాదములు లేని ఏకైక మార్గమును ప్రతిపాదించినది. ఈ విధముగా తెలుగువారందరు శ్రీ శివరామ దీక్షితులవారికి ఎంతో ఋణపడియున్నారు.

దెవుడెవరు ? జీవుడెవడు ? వారిరువురకుగల సంబంధమేమి? జీవుడు దేవుడగునా! మొదలగు అనేక ప్రశ్నలకు శ్రీ శివరామ దీక్షితులవారు సరియైన సమాధాన మిచ్చియున్నారు. మిగతా అన్ని హైందవ మతములలోను అద్వైతమే మహోత్కృష్టమైనది. "బ్రహ్మసత్యం జగన్మిథ్య జీవో బ్రహ్మైవ నాపరః" అనగా సత్యమైన దొక్క బ్రహ్మమే. జగత్తు లేనేలేదు జీవుడు బ్రహ్మమే, యితరముకాదు అని దీని భావము అంటే జీవుడు నిష్కళంక జీవితము గరపి మలవిక్షేప, ఆవరణ దోషములను అంతఃకరణమునందు తొలగించు కొన్న శుద్ధాంతఃకరణస్వరూపుడు బ్రహ్మమేకాని వేరుకాడు. అపుడు ఆ శుద్ధాంతఃకరణ కలిగిన జీవుడే బ్రహ్మమగుచున్నాడు. సత్యమగు పదార్థము ఆ బ్రహ్మస్వరూప మొక్కటియే. అది ఏకమేవ అద్వితీయం బ్రహ్మ" అని నిర్ణయింపబడినది. అంటే జీవుడుగాను (84 లక్షల రకముల జీవులుగాను) ఏకమయిన బ్రహ్మ వస్తువుగాను నున్నది ఆ పరబ్రహ్మ మొక్కటే. అనగా బ్రహ్మము ఖండములుగాను, అఖండముగాను మార్పుచెందుచు వున్నదన్నమాట. ఇట్లు ఖండాఖండములుగా మార్పులు చెందు బ్రహ్మము సత్యమగునా? మార్పుచెందునది మాయయేగదా? సృష్టిసమయమునందు పంచభూతములుగాను. పంచతన్మాత్రలుగాను, పంచశక్తులుగాను, పంచ బీజములుగాను, పంచ అధిష్ఠాన దేవతలుగాను మార్పులు చెంది తిరిగి ప్రతిసంచర పద్ధతియందు ఏకమైన అఖండ బ్రహ్మస్వరూపముగా నుండునది సత్యవస్తువు అనదగునా? కొందరికి వరములు, కొందరికి శిక్షారూపముగ శాపములు యిచ్చును. తెలివితో, శక్తితో సర్వ శక్తులు ప్రదర్శించునది సత్యమగు పరబ్రహ్మము అని అనదగునా? విచారించినచో ఈ అద్వైత నిర్మిత పరబ్రహ్మము ద్వయ దోష దూషితమైన సర్వలక్షణ విలక్షణమగు పరిపూర్ణ బ్రహ్మము కాజాలదు అనిగ్రహింప వలయును.

"బ్రహ్మైవ జగత్కారణం" అనగా బ్రహ్మమే జగత్తు నకు కారణ స్వరూపము ఏ బ్రహ్మము అనగా! సృష్టికంతటికి మూలకారణమైన వస్తువు ఏదో ఆ బ్రహ్మమే " సోఽకామ యత బహుస్యాం ప్రజాయేయేతి" అతడే ఆదిలో "ఏకమేవ అద్వితీయం బ్రహ్మ" అనగా అతడే అనేక మగుదుననికొరెను. "తత్సృష్ట్వా, తదేవానుప్రావిశత్" ఆ సృష్టించిన సమస్తము నందు తానే మరల ప్రవేశించి, ఆయాజీవుల నామ రూపాత్మకమగు ఉపాధులను నడిపించెను. ఈ విధముగా ఆదిలో ఒకటైన ఏకరూపమగు ఈ బ్రహ్మమే అనేక నామరూపములగు జీవులుగా మార్పుచెందెను. అయితే ఆ బ్రహ్మము కారణస్వరూపము. జీవులందరు కార్యరూపములు. కనుక కారణస్వరూపమగు బ్రహ్మమే కార్యరూపులగు జీవులయ్యెనన్నమాట. మరల కార్యరూపమగు జీవులు కారణ స్వరూపులయ్యెదరు. కనుక కార్య కారణములు రెండును, ఒకటే అని చెప్పవలసియున్నది.కార్యకారణములలో కార్యమెటువంటిదో,కారణము అట్టిదే, కార్యము అనిత్యమగుచో, కారణమును అనిత్యమే అనవలయును. కనుక సృష్టి కారణమగు బ్రహ్మము అనిత్యమే అనవలయునుగాని నిత్యము అనరాదు.

నిజమైన పరిపూర్ణ పరబ్రహ్మమునకు అది మధ్యాంతములు లేవు. సర్వత్రా నిండి నిమిడీకృతమయి సూది మోపుటకైనను తావులేక నిండియున్నది దాని కెట్టి పరిమితియును లేదు. కేవలమఖండమై యున్నది. దాని యందు జ్ఞానముగాని, కర్మముచేయుటకు వలయు ప్రాణశక్తి గాని యింద్రియములుగాని వానిని నడిపించు అధిష్ఠాన దేవతలుగాని అన్యము ఏమియులేదు. "నిశ్శక్తిః నిర్మలం పూర్ణం" దానియందు ప్రాణశక్తిగాని గుర్తెరిగే తెలివికాని లేదు. వేయేల దానియందు యితర మేమీ లేదు. అందు చోటును లేదు. దాని కావరణేలేదు. కేవలము ఆద్యంతములు లేనిది. అది తప్ప రెండవది లేనిది అన్నప్పుడు దానియందు తెలివిగాని, ప్రాణముగాని లేదు. వృద్ధి క్షయములు పొందనిది. అన్యమయిన దేదితోచినా అది ఎండమావులవలె సురస్వప్నమువలె లేనిదేయగును. కనుక సృష్టికారణమయిన వస్తువే సృష్టిగా మారినది. గనుక ఈ కారణ కార్యములు రెండూ ఎండ మావులవలె తోచుటేగాని నిజముగా లేనే లేవు. ఎవరికి తోచినదో వారే లేరు. కనుక యింద్రియ గోచరమగు సమస్తము శుద్ధమనస్సునకు గోచరించు బ్రహ్మ వస్తువు లేనేలేదు.

కారణ స్వరూపమగు బ్రహ్మమునకు (అనగా అఖండ ఎరుకకు) మరియొక కారణముగాని మూలముగాని వుండుటకు స్థానముగాని లేనేలేవు. పృథివ్యాది పంచభూతములకు ఆత్మరూపమగు బ్రహ్మము కార్య కారణ సంబంధములతో మహాకారణముగా నున్నది. దానికి కారణము ఎంత వెదకినా కానరాదు. కారణములేని కార్యము విశ్వములో ఏదియును లేదు. ఉండుట అసంభవముకూడ. కనుక సృష్టి కారణమగు బ్రహ్మమునకు ఉనికియేలేదు ఎండమావులలో జలమున్నట్లే కానవచ్చినా అక్కడ నిజముగా నీరు లేదు. కలయందు దొచిన శరీరములవలెనే

కలయందు మాత్రమే నున్నట్లు తోచబడునేగాని కలనుండి మేల్కొన్న పిదప ఈ షణ్మాత్రము యెట్లు లేదో అట్లే ఏమియు లేదు. అట్లే ఈ గుర్తైరిగే శరీరమునకు " ఆకాశము శరీరము బ్రహ్మ ' అని చెప్పబడినట్లు గా మనసునకు గోచరించు మహాకాశమే శరీరముగా నున్నది. ఈ దేహి దేహములు రెండు ఒక దానిని ఒకటి విడువక రెండు కలసి ఏకవస్తువుగా నున్నది. దీనికి పరిపూర్ణ పరబ్రహ్మమునందు స్థానముగాని, మూలముగాని యేమీలేదు. ఈ అఖండ యెరుకే బట్ట తెరవలె సత్యముగా వున్న పరిపూర్ణ పరబ్రహ్మమును ఆచ్ఛాదించుచున్నది.

"మనసైవానుద్రష్టవ్యం, మనసైవానుశ్రోతవ్యం" అని చెప్పబడే రీతిగా శుద్ధ మనస్సుచే గోచరింపబడుచున్నది. కాని నిజముగా చూచినచో మనోవాక్కులకు అందరాని అతీతమయిన బ్రహ్మవస్తువుకాదు. "నతత్రచక్షుర్ గచ్ఛతి, నవా గచ్ఛతి, నోమనః" అని చెప్పబడిన కంటికి, వాక్కుకు, మనస్సునకు గోచరించినిది కాదు. అట్లు కంటికి, వాక్కుకు, మనస్సునకు గోచరింపరానిది ఒక్క పరిపూర్ణ పరబ్రహ్మమే. కనుకనే దానిని "అవిజ్ఞేయం పరబ్రహ్మం" అన్నారు.

ఆ పరిపూర్ణ పరబ్రహ్మమునందు ద్విపుటి, త్రిపుటిలు లేవు. ఆ పరిపూర్ణ పరబ్రహ్మమునందు చైతన్యము, అహంకారము క్షేత్ర, క్షేత్రజ్ఞలు, ధర్మాధర్మములు, స్థూల, సూక్ష్మ, కారణ, మహాకారణములు, కారణ కార్యములు, మూల ప్రకృతి అధిష్ఠాన చేతన బ్రహ్మము, ప్రకృతి పురుష సంయోగము, శివశక్తులు విద్య అవిద్యోపాదులు సదసత్తులు, మాయా అవిద్యలు, దేహి దేహములు, దృక్ దృశ్యములు, జ్ఞానాజ్ఞానములు, విక్షేపావరణములు. ఆత్మానాత్మలు, బ్రహ్మ ఆత్మోపాధులు, జీవేశ్వరులు క్షరాక్షరులు, పరాపరకృతులు మహావాక్య స్వప్రకాశములు, అమృత మృత్యువులు, గురు శిష్యులు మొదలగునవేమియూ లేవు.

"అమృతంచైవ మృత్యుశ్చ సదసచ్చాహమర్జున" (భ॥గీ) అమృత మృత్యువులు, సదసత్తులు మొదలగు సర్వద్విపుటులు, జ్ఞాత జ్ఞాన జ్ఞేయములు, కర్త కర్మ క్రియలు; ద్రష్ట దర్శన దృక్కులు, మొదలగు త్రిపుటులుగాని యేమీ లేవు. ఈ సర్వద్విపుటులు, త్రిపుటులు, అధిష్ఠాన చేతన బ్రహ్మమునకే గాని పరిపూర్ణ పరబ్రహ్మమునందేమీ లేవు. పరిపూర్ణ పరబ్రహ్మమునందు దశావతారములుగాని, 84 లక్షల జీవోపాదులుగాని, ముక్కోటి దేవతలుగాని మరియే యితరముగాని లేనేలేవు. కనుకనే "అది యిది కాదు యిది అది కాదు" అని శ్రీ శివరామ దీక్షితులుద్ఘాటించుచున్నారు. వీరు ఈ సిద్ధాంతమును అచ్చ తెలుగులో ననువదించుచు శరీర రహిత ప్రకరణమనుపేర ద్వాదశీభావమును, భ్రాంతిరహిత ప్రకరణము పేర షోడశీ భావమును, స్వప్న దృష్టతరము అను గ్రంథమును రచించి పరిపూర్ణ భావమును సిద్ధాంతీకరించి "బృహద్వాశిష్ట సిద్ధాంత నిర్ధారణోద్ధారణకునిగా" పేరుపొందినారు.

కనుక పరిపూర్ణ భావజ్ఞుల కర్తవ్యమేమనగా అట్టి పరిపూర్ణ పరబ్రహ్మము గురువు చెప్పిన దృష్టా ద్రాష్టాంతముల ద్వారా ఉండజేచుకొని (ఉన్నది అని ఆరూడపరచుకొని) పరిపూర్ణ పరబ్రహ్మమునకు గాని మరియే యితరమునకు గాని పుట్టక యెండమావుల జలమువలె, సురస్వప్నమువలె, లేకనే తోచుచున్న అఖండ యెరుకయగు సృష్టి కారణమగు పరమాత్మను వస్తు నిశ్చయముగా తెలుసుకొని తన నిజస్వరూపమయిన ఆ అఖండ యెరుకను లేనే లేదని నిరసించుట రీత్యా జన్మ కారణమును తొలగించు కొనుటయే, జనన మరణ రాహిత్యమునకు ఏకైక మార్గము. సృష్టి కారణమగు పరమాత్మ తానే అని గ్రహించుటకు గురూపాసనయే మార్గము. గురుమంత్ర జపముచే గురుస్వరూపమే తానని ఆరూఢతచెంది ఆ గురుపరమాత్మయందు తన స్థూల, సూక్ష్మ,కారణ, మహాకారణములు మానసికముగా నిత్యము గురునకు సమర్పించుచు ఎరువు సొత్తుగా తన జీవితము నడుపు కొనుటకు వాటిని మరల గ్రహించి ధర్మపద్ధతిగా మాత్రమే సకల కర్మలు చేయుచు కర్తృత్వ రహిత కర్మాచరణము వలన నైష్కర్మ సిద్ధి సాధించి జన్మరాహిత్యమును గాంతురుగాక.

***

43. అజాతవాదము - పరిపూర్ణభావము

వేదాంత శాస్త్రములో సృష్టి ఏవిధముగా జరిగినది అను విషయములో ఈ అజాత వాదమునకు ముందు ప్రధానముగా 1) సజ్జాత వాదము 2) అసజ్జాత వాదము 3) సదసజ్జాత వాదము 4) అనుభయజాత వాదము అను 4 వాదములున్నవి. వీనిని విమర్శించి పరిశీలించినచో ఏ వాదమును ఆమోద యోగ్యముగా లేదు. ప్రతీవాదమును హేతుబద్ధము కాదు. కార్యరూపమగు సృష్టికి కారణరూపమగు వస్తువు సత్తా, అసత్తా, సదసత్తా రెండును కావా అని పరిశీలించినచో ఏపక్షమును తర్కవిరుద్ధమే అయివున్నది. కనుక మాండూక్యోపనిషత్తు కారికలలో గౌడపాదాచార్యులవారి చేత అజాత వాదము సిద్ధాంతము చేయబడినది.

అజము, అమరమునగు బ్రహ్మమునుండి ఏదియును పుట్టనేలేదు. సృష్టి అంతకు మాయయే కారణముకాని అజము, అమరము అయిన బ్రహ్మముకాదు. అజము అమరము అయిన బ్రహ్మము ఏది? అనినచో ఒక్క పరిపూర్ణ పరబ్రహ్మమే అని తేలుచున్నది. అయితే "బ్రహ్మైవ జగత్కారణం" అని ఉపనిషత్తు సిద్ధాంతము.

యతో వాఇమాని భూతాని జాయంతే
యేన జాతాని జీవంతి ।
యత్ర్పయం త్యభి సంవిశంతి ।
తద్ విజిజ్ఞాఇ_సస్వ । తద్ బ్రహ్మేతి ।

"అనగా దేనినుండి భూతములన్నియు పుట్టుచున్నవో దేనిచేత పోషించబడుచున్నవో దేనియందు తుదకు ప్రవేశించి లయ మగుచున్నవో దానినే బ్రహ్మముగా తెలుసుకొనుము" అని భావము. ఈ భావమే సర్వోపనిషత్తుల యొక్క సారాంశము. కాని అజము. అమరము అయిన బ్రహ్మమునుండి ఏదియు పుట్టనే జాలదు అనే సిద్ధాంతమునకు బ్రహ్మమే జగత్కారణము అను సిద్ధాంతమునకు ఎట్లు పొసగును ? అజము అమరము అయిన బ్రహ్మము పుట్టు చావులు లేని పరిపూర్ణ పరబ్రహ్మము అనియు జగత్కారణమైన బ్రహ్మము మాయాశబళిత బ్రహ్మము లేక సచ్చిదానంద బ్రహ్మము అని గ్రహించవలయును. పరిపూర్ణ పరబ్రహ్మము ఒక్కటియే సత్యముగాని మాయా బ్రహ్మము అనగా కారణ బ్రహ్మము కేవలము అసత్యమైనది, ఇట్లు చెపితే తప్ప

కార్యోపాధి రయం జీవః కారణోపాధి ఈశ్వరః ।
కార్య కారణతాం పిత్వా పూర్ణ బోధోవశిష్యతే॥

యిక్కడ ఈశ్వర శబ్దముచేత కారణ బ్రహ్మమును గ్రహించ వలెను.

అజము, అమరము నయిన బ్రహ్మమునుండి ఏ సృష్టియు కాజాలదు. అది ప్రాణము, జ్ఞానము రెండునూ లేని పరిపూర్ణ పరబ్రహ్మము. ఉపనిషత్ నిర్ణయమైన కారణ బ్రహ్మమును (అఖండయెరుక) అనంత శక్తులు కలిగిన సచ్చిదానంద బ్రహ్మమని తెలియవలసి యున్నది. "బ్రహ్మసత్యం జగన్మిథ్య" అను సిద్ధాంతమునందు బ్రహ్మమే సత్యమనియు జగత్తు మిథ్య యనియు చెప్పబడినది. మిథ్య యనగా నామరూపములు మాత్రమే లేవు. కాని నామరూపములకు ఆధారము అధిష్ఠానముగానున్న కారణబ్రహ్మము (అనగా అఖండ యెరుక) మాత్రమేవున్నది. అనగా అఖండ యెరుకయే సత్యము. ఆ అఖండ యెరుకయందు పరిణమించిన నామ రూపములు గల జగత్తు అసత్యము అని చెప్పినట్లయినది. అంటే కారణము సత్యము, కార్యము అసత్యము అన్నమాట. కారణ వస్తువు ఎంత సత్యమో కార్యము అంతే సత్యముగాని ఒకటి సత్యము ఒకటి యసత్యము కాజాలదు. కనుక బ్రహ్మజగత్తులు రెండును సత్యమే కావలయును లేక యసత్యము కావలయును. అంతేకాని కారణము మాత్రమే సత్యము, కార్యరూప జగత్తు అసత్యమని నిర్ణయించరాదు. అజాత వాదము విశదీకరించుటలో కొందరు జగత్తు మాత్రము

ఏవాదమురీత్యా చూసినను మిథ్యయే యగుచున్నది యని పేర్కొనినారు. గాని కారణ స్వరూపమును సత్యమనిగాని, యసత్యమనిగాని నిర్ణయించక కప్పదాటు వేసిరి. ఒక్క పరిపూర్ణ భావము నందే సర్వకారణమయిన మాయా శబళిత బ్రహ్మమయిన అఖండ యెరుక కూడా ఏమీ లేదు, అని సిద్ధాంతీకరించినారు. అజాత వాదములో జగత్తు మాత్రమే పుట్టలేదని నిర్ణయించగా పరిపూర్ణ భావములో జగత్కారణమైన అఖండ యెరుక కూడా లేనే లేదని నిర్ద్వంద్వముగా చెప్పియున్నారు. కనుక అజాతవాదమును, పరిపూర్ణ భావమును ఒకటేనని చెప్పరాదు.

జగత్తు మిథ్య అన్నారేగాని అసలు పుట్టనేలేదని "బ్రహ్మ సత్యం జగన్మిథ్య" వాక్యము చెప్పుచున్నది. జగత్తు స్వప్నమువంటిది అని, స్వప్న దృశ్యమని, స్వప్న దృశ్యములు మేల్కొన్నప్పుడు ఎట్లు ఏమీ లేవో అట్లే స్వప్నావస్థలో మాత్రమే సత్యముగా తోచబడును గాని బ్రహ్మములో మేల్కొన్నవానికి అసత్యమే అని అజాత వాదము కొందరు వుటంకించుచున్నారు. స్వప్నావస్థలో తోచబడిన దృశ్యములతో ఈ జగత్తు పోల్చబడినది. అంటే పరిపూర్ణ భావరీత్యా ఎరుక జగములు రెండు ఒకటే. ఎరుకే పంచభూతములుగా పరిణమించి వానినుండి జగత్తుగా పరిణమించెను. జగజ్జీవేశ్వరులు పుట్టిరి. ఊర్ధ్వపరిణామములో నిరుపాధికమగు అఖండ ఎరుకగా పరిణమించినది. అధో-ఊర్ధ్వపరిణామములలో చక్రాకృతిగా ఎరుక జగత్‌లుగా పరిణమించుచున్నది. కనుక ఎరుకే జగము, జగత్తే ఎరుక కాని వేరు గాదు. ఎరుకకు మూల మేమి ? యని యన్వేషించినచో మూలము లేనిదేయని తేటతెల్ల మగుచున్నది. మూలములేని వస్తువేదీ ప్రపంచములో కానరాదు గనుక మూలములేని యీ అఖండ యెరుక నిజముగా లేనే లేదు. ఎండమావులలోని జలమువలె సురస్వప్నము తోచబడిన దానివలె యున్నట్లు తోచబడుటయేగాని నిజముగా లేనేలేదు. కారణబ్రహ్మమైన యీ అఖండ యెరుకతో సహా పరిపూర్ణ పరబ్రహ్మమునందు యేమియును లేదు. ఇది పరిపూర్ణ భావము. కారణబ్రహ్మమయిన అఖండ ఆత్మయే సత్యము. దానినుండి పరిణమించిన సమస్తము అసత్యమే అని చెప్పుట అజాతవాదము. కనుక అజాత వాదమేకాదు, అద్వైతవాదులగు వ్యాఖ్యాతలు నజాతవాదమే పరిపూర్ణ మని నిర్ణయించినారు.

జగత్‌ను నరస్వప్నముతో పోల్చరాదు. నరస్వప్నమునకు మూలమున్నది. జీవుల పూర్వసంస్కారములే స్వప్నములకు మూలము. స్వప్నానుభవములో కూడా ప్రారబ్ధ రూపమైన సుఖదుఃఖములలో కొన్ని జీవులచే అనుభవింపబడుచున్నవి. కనుక ప్రారబ్ధము జాగ్రత, స్వప్నము రెంటిలోనూ అనుభవింపబడి క్షీణించుచున్నది. ఆరూఢులైన పరిపూర్ణభావజ్ఞులే సురలు.

వారిదృష్టిలో తోచబడు జగత్ స్వప్నదృశ్యమువలె మిథ్య. ఇదియే పూర్ణభావముగాని జగత్ మాత్రమే పుట్టలేదు. కారణబ్రహ్మమును పరిపూర్ణ పరబ్రహ్మమును రెండూ ఒక్కటే అనుదృష్టి పూర్ణభావము కాదు. పరిపూర్ణ పరబ్రహ్మమే ఏకైక సత్యము అన్యమేమియు లేదు అనుటయే పరిపూర్ణ భావము.

***

44. భ్రాంతి రహిత మిదం మోక్షం

"భ్రాంతి రహిత మిదం మోక్షం" అనగా భ్రాంతి రహితమే మోక్షము అని స్పష్టముగా తెలియుచున్నది. మోక్ష స్వరూపమును నిర్ణయిస్తూ వ్రాయబడిన వ్యాసము లోగడ ప్రకటింపబడినది. భ్రాంతి యనగా నేమి ? భ్రాంతికి కారణమేమి ? పరిపూర్ణుల భ్రాంతిరహిత విధానముయొక్క విశిష్ఠత యేమి ? మొదలగు విషయము లీ వ్యాసమున చర్చింపబడినవి.

"భ్రాంతి" యనగా యదార్థముగా వున్న వస్తువును గ్రహించకుండా అన్యవస్తువుగా దానిని తెలుసుకొనుట భ్రాంతి, భ్రాంతియన్నా భ్రమయన్నా పర్యాయపదములే. ఇవి 'భ్రం' అనుధాతువునుండి యుత్పత్తి చెందిన శబ్దములు. భ్రం అనగా తిరుగుట. గిరగిర తిరుగువాడు వున్న వస్తువును వున్నట్లుగా గ్రహించడు. అట్లే మనో వేగములో అనంత సంకల్పములు తిరుగుటలో, పూర్వదృష్టవస్తు సంస్కార బలముచే అన్యథా గ్రహణము కలుగుచుండును. యదార్థముగా వున్న వస్తుజ్ఞానము ప్రమ, అన్యవస్తుగ్రహణము భ్రమ యని చెప్పబడును. శాస్త్రపఠనాదులవలన కొన్ని భావములు మనస్సునందు హత్తుకొని సంస్కార కారణములు కావచ్చును. ఉదాహరణకు పూర్వమీమాంసకులు కర్మవల్లనే మోక్ష మందురు. ఈ భావము కర్మభ్రాంతికి కారణమగుచున్నది. ఇట్లే మిగతా దర్శనశాస్త్రములవల్లనూ కొన్ని భ్రాంతులేర్పడుచున్నవి. మతవాదములున్నూ అట్లే భ్రాంతి కారకము లగుచున్నవి. కనుకనే "మతములందు ముక్తి వెదకిన లేదయా" అన్నాడు వేమన.

ముందుగా గ్రంథ పఠనాదులవల్లనూ, మతవాదముల వల్లనూ గలిగిన కొన్ని భ్రాంతులను వివరించి పిదప సర్వభ్రాంతులకు మూలకారణమగు భ్రాంతిని గూర్చియు ఏతద్భ్రాంతి రహితమునందు మోక్షమెట్లు స్వయంసిద్ధమో విచారంతము.

సాధనలయందు భ్రాంతి : - మానవునికి అంతరేంద్రియములైన జ్ఞాన, మనో, బుద్ధి, చిత్త అహంకారములను పురస్కరించికొని సాధనలు 5 రకములు. 1) అహంకారమును పురస్కరించుకొని చేయునది మంత్రోపాసన. 2) చిత్తమును పురస్కరించుకొని చేయునది. భక్తి సాధన. 3) బుద్ధిని పురస్కరించుకొనిచేయు మతవాదుములు. 4) మనస్సుని పురస్కరించుకొని చేయు యోగ సాధన. 5) జ్ఞానమును పురస్కరించుకొని చేయబడు తత్వవిచారణ. యే సాధనలైనను యీ అయిదింటిలో అంతర్భూతములే అయివున్నవి. యీ సాధనలచే మోక్షమును సాధించుకొనగలమని యనుకొనుట భ్రాంతి. మోక్షమనగా శాశ్వత జన్మరాహిత్యమే మోక్షముగాని సాలోక్యాది పంచముక్తులు మోక్షస్వరూపము గాదు. పంచ సాధనలచే శాశ్వత జన్మరాహిత్యము ఏల చేకూరదు ? అంటే, ధ్వని మొదలగు తన్మాత్రలు గనుగొనగా లేశమైన గాన్పించని బట్ట బయలైన పరిపూర్ణ పరబాహ్యమునందు, జన్మ కారణమగు యెరుకకు మూలముగాని స్థానముగాని లేవు. పంచ తన్మాత్ర సహితమగునది యెరుక. పంచతన్మాత్రరహితము పరిపూర్ణము. కనుక శబ్దతన్మాత్రనుంచి వచ్చిన అంతరేంద్రియ వ్యవహారముచేత పంచ తన్మాత్ర సహితమూ, జన్మకారణమూనగు యెరుక బలము పంజు కొనునేగాని నశింపజాలదు.

కర్మసాధన, జ్ఞాన సాధనలు పైన ఉదహరించిన పంచ సాధనలలోనూ చేరవేమోయని సందేహించ నవసరములేదు. కర్మయనగా పని. పని చేయునవి, మనస్సు, వాక్కు, శరీరము అను త్రికరణములు కనుక పంచ సాధనలూ త్రికరణములలో దేని చేతనో చేయబడునవే గాని వానిని మీరినవిగావు. తత్వవిచారణయే జ్ఞానసాధన యనదగును కనుక కర్మ జ్ఞాన సాధనలు రెండునూ కూడ చెప్పబడినట్లే.

యీ సాధనలన్నియు జన్మకారణమగు వస్తువును సాక్షాత్కరించుకొనుటకు మాత్రమే ప్రయోజనములుకాని, కార్యకారణరహితమగు పరిపూర్ణమును యెరిగి జన్మకారణమగు యెరుక రాహిత్యమునకు మాత్రము సాధనములుగావు కనుక సాధనలచే జన్మరాహిత్యము సాధించుననుట భ్రాంతి, వట్టియాశ. "వట్టియాశలచే పట్టుబడకను యీ గుట్టు దేశికునోట ఘట్టిగా తెలుసుకో" మంటున్నారు కృష్ణదేశికేంద్రులు. ఏలననగా సాధనాంతర నిరపేక్షకమగు పరిపూర్ణము సాధించరానిది. మరియెట్లు ? అంటే అది గురుగోప్యమగు పరిపూర్ణ బోధమార్గము. దానివల్ల మాత్రమే శాశ్వత జన్మరాహిత్యము చేకూరును, అదియే సాధనలేని బోధ.

మంత్రోపాసన, భక్తి యోగములన్నియు కర్మ రూపములే యగును. ఏలననగా, వాక్కుచే మంత్రోపాసన, మనస్సుచే భక్త్యుపాసన శరీరముచే యోగాభ్యాసము జరుగుచున్నవి. మత వాదములకును తత్వవిచారణకున్ను జ్ఞానము కారణమై యున్నది. కనుక భ్రాంతులు రెండు విధములుగా స్థూలముగా విభజింపవచ్చును. 1) కర్మ భ్రాంతి 2) జ్ఞాన భ్రాంతి కనుక పంచ

సాధనలలో మంత్రోపాసన, భక్తి, యోగాభ్యాసము అను మూడున్ను కర్మ భ్రాంతిలోనివి. మతవాదము తత్వవిచారణ జ్ఞాన భ్రాంతిలోనివి.

1) కర్మ భ్రాంతి :- పుణ్య కర్మాచరణచే వూర్ధ్వలోక ప్రాప్తియు చివరకు మోక్షప్రాప్తియు నగునని పాపకర్మాచరణచే అధోలోకములలోనో లేక భూలోకమున నీచయోని ప్రాప్తియో కలుగునను సిద్ధాంతమును నమ్మి. యజ్ఞయాగాది పుణ్యకర్మలు. కృచ్ఛ్రచాంద్రాయణాది వ్రతములు, తీర్థయాత్రాదికములు చేయుట భ్రాంతియే. ఏలననగా ఈ కర్మ లేవియు జన్మరాహిత్యరూప మోక్షమును కల్గించవు. నీచోత్కృష్ట జన్మపరంపరలయందే త్రిప్పును. కర్మవలన జన్మ, జన్మవలన కర్మయనుట సిద్ధాంతము. కనుక కర్మయే బంధ కారణమైతే మోక్షమెట్లు సిద్ధించును ? సుకర్మ వలన మంచి జన్మ దుష్కర్మవలన నీచజన్మ రాగలదు. మంచిజన్మలు హిరణ్యశృంఖలములు (బంగారు సంకెళ్ళు) నీచజన్మలు ఇనుప సంకెళ్లు. ఏదైననూ బంధకారణమే గాని మోక్షకారకము గానేరదు. కర్మఫలము లనివార్యములు కనుక కర్మఫల మనుభవించుటకై జన్మ ఎత్తవలసినదే. జన్మయెత్తినవాడు కర్మ చేయకతప్పదు. ఈ కర్మఫలమనుభవించుటకై జన్మ యెత్తక తప్పదు. కనుక కర్మ, జన్మపరంపరలకే కారణమగు చున్నది గాని జన్మరాహిత్యమున కేమాత్రమూ తోడ్పడదు.

మోక్షము కర్మవలన సిద్ధించునంటే అట్టి మోక్షము కృతకము (తయారు చేయబడినది) కావలసివచ్చును. కర్మ వలన ఐదు కార్యములు మాత్రమే సిద్ధించును. 1) ఉత్పత్తి 2) సంస్కారము 3) వికార్యము 4) ప్రాప్తి 5) గమ్యము, మోక్షము యీ అయిదు రకముల కర్మఫలములలో దేనిక్రిందకునురాదు. చేసినవారికి చేసినంత మహదేవ యను న్యాయముగా యెంతో కొంత ఫలమును గల్గించు ప్రతికర్మయు జన్మ కారణమే యగుచున్నది పుణ్యము చేసి ఆ పుణ్యానుభవమునకై పుణ్యలోకములలో జన్మించినను "క్షీణేపుణ్యే మర్త్యలోకం విశంతి" అను గీతా వచనము ప్రకారము తిరిగి భూమియందు 84 లక్షల రకముల జీవోపాధులలో ఏదోయొక యుపాధిని పొందవలసినది. ఆ పుణ్యలోకములలో వుత్తమ కర్మచేసి ఇంకనూ వుత్తమజన్మ పొందుట కూడా సాధ్యముకాదు. ఏలననగా స్వర్గాది లోకములలోని ప్రాణులకు కర్మ శరీరము లేదు.

2) భక్తి భ్రాంతి : కొందరు సాలోక్య, సామీప్య, సాయుజ్యాది ముక్తులే జన్మరహితము గావించునని యెంచి యిష్టదైవములను భక్తితో నుపాసింతురు. కాని "లోకంబులు, లోకేశులు, లోకస్థులు తెగిన తుది" అంటూ చెప్పబడుటవల్ల పంచ ముక్తులున్ను నశ్వరములే. యిది తెలియక భక్తియే ముక్తికి త్రోవయని. "కలౌ స్మరణాన్ముక్తిః" యని భ్రాంతితో నున్నారు కనుక కేవల భక్తివలన జన్మరహితము సిద్ధించుననుకొనుట భ్రాంతి మాత్రమే.

3) యోగ భ్రాంతి : యోగాభ్యాసమువలన కూడా జన్మ రహితము కాదు. యమ నియమాసన ప్రాణాయామ ప్రత్యాహార ధ్యాన ధారణ సమాధులవలన జన్మరాహిత్యరూప మోక్షము సిద్ధింపజాలదు. "యోగశ్చిత్తవృత్తి నిరోధః" యోగఫలము చిత్తవృత్తి నిరోధమేనని యోగసూత్రములే చెప్పుచున్నవి. మరియు యోగాభ్యాసమువల్ల ప్రాణసత్తా వృద్ధిగాంచి ఆయురారోగ్యములు పెంపగును, యోగభ్యాసములో అవాంతరముగా నానావిధ మహత్తులున్ను సిద్ధించును. ఏకాగ్రత కుదురును. ఏకాగ్రత సిద్ధించుటవలన ఆత్మ సంయమనముచే ఎట్టి మహత్తులైననుకోరి సాధించవచ్చును. కాని ఏమి ఫలము ? పరిపూర్ణ బోధయందువలె జన్మరాహిత్యము చేకూరదుగదా ?

యెంత మహత్తుగలవాడైనను మోక్షము సాధించలేడు. పైగా మోక్షమునకు దూరస్తుడైపోవుచున్నాడు. ఏలననగా, తనకుగల మహత్తులు ధన కీర్తి ప్రతిష్టలకై వినియోగించి కేవలము తాను దైవమో, అవతార పురుషుడో అని లోకమును భ్రమింపచేసి సత్కార మాన పూజాదులు పొంది అహంకారమును వృద్ధి చేసుకొనును. అంతేగాక అతడు దుష్ట ప్రవృత్తి గలవాడగుచో తన స్వార్థముకొరకు ప్రజలపై ఆ మహత్తులుపయోగించి మానవత్వము గోల్పోయి దానవుడైలోక కంటకుటగును. వీరే మానవరూప రాక్షసులు. కనుకనే అశుద్ధమునుండి తొలగిపోయినట్లు ఈ మహత్తులనుండి దూరముగా తొలగిపోవలెనని శ్రీ రామకృష్ణ పరమహంస గారు సాధకులను హెచ్చరించి యున్నారు.

మతవాదనలు : దేశ కాల సమాజముల ననుసరించి తాత్కాలిక ప్రయోజనములకై నానావిధ మతములు వెలసినవి. మతానుయాయులు తమతమ మత సిద్ధాంతముల కనువగు ప్రమాణములను సంతరించుకొని వానిని మీరినవారు రౌరవాది నరకముల పాలగుదురని జనులను భయపెట్టి తమ మతమును కాపాడుకొందురు. మతవాదములు ఆరీతిగా ఆ మతానుయాయులను తమ హద్దులలో బంధించి మానవ స్వాతంత్ర్యబుద్ధిని అరికట్టి బానిసలను చేయుచున్నారు. సర్వస్వాతంత్ర్యరూపమగు మోక్షమును గలిగించుటకు బదులు బంధమునే సృష్టించుచున్నారు. కనుకనే, 'మతములందు ముక్తి వెదకినా లేదయా' అన్నారు వేమనయోగి. పరిపూర్ణ బోధ యొక ప్రత్యేక మతముకాదు. మానవ చరమలక్ష్యమగు జన్మరాహిత్యమునకు దారిచూపు పరమ సత్య సిద్ధాంతము. మతవాదము లన్నింటిలో అద్వైతవాదము గొప్పది. అద్వైతమత వాదములోని ముఖ్య సిద్ధాంత మేమనగా -- 1) బ్రహ్మసత్యం జగ న్మిథ్యా 2) జీవో బ్రహ్మైవనా పరః॥

1) "బ్రహ్మ సత్యం-జగ న్మిథ్యా" అనగా బ్రహ్మము సత్యవస్తువు, జగత్తు మిథ్యారూపము. మిథ్య యనగా కేవలము అలీకపదార్థము కాదు. అనగా కేవల శూన్యము మాత్రము కాదు. పారమార్థిక సత్యత్వము లేనిది అని యర్థము. ఐతే విచారించి చూస్తే బ్రహ్మము జగత్కారణము

అనిన్ని వేదోపనిషచ్ఛాస్త్రముల ముఖ్య తాత్పర్యమై యున్నది. అంటే బ్రహ్మము కారణము, జగత్తు కార్యము. కారణవస్తువునందు కార్యవస్తువగు జగత్తు బీజరూపముగా నైనా యుండక తప్పదు. కనుక రెండూ సత్యమో లేక రెండూ అసత్యమో అనాలికాని కార్యవస్తువగు బ్రహ్మసత్యం, జగన్మిథ్యాయనుట సరిగాదు. "బ్రహ్మైవేదం విశ్వమిదం వరిష్టం" అని శ్రుతికూడా చెప్పుచున్నది అంటే బ్రహ్మము, విశ్వము అను రెండూ బ్రహ్మము యొక్క రూపాంతరము కనుక బ్రహ్మ సత్యం, జగన్మిథ్యాయనుట భ్రాంతి . ఈ భ్రాంతికి లోనై మెట్టవేదాంతము ప్రబలి అనేక భ్రాంతులకులోనై జనులు దరి గానలేకున్నారు.

2. "జీవోబ్రహ్మైవ నాపరః " అనగా జీవుడు బ్రహ్మమేకాని వేరుకాదు. మహావాక్యములు దీనిని ఘంటిగ ప్రతిపాదించుచున్నవి. అందు "తత్త్వమసి" వాక్యము వాచ్యార్థముచే జీవేశ్వరైక్యమును, లక్ష్యార్థముచే ప్రత్యగ్బ్రహ్మైక్యమును సాధించుచున్నది. తనకు తెలిసిననూ తెలియకున్ననూ అంతా బ్రహ్మస్వరూపము మాత్రమే అయినపుడు ఐక్యము క్రొత్తగా గావించవలసిన పనియే లేదు. అంతా బ్రహ్మస్వరూపమేనంటూ "బ్రహ్మణోన్యం, నకించన", "సర్వంఖల్విదంబ్రహ్మ" అని శ్రుతులును వుద్ఘాటించుచున్నవి ప్రతిబింబ వాదముచే జీవేశ్వరైక్యము (వాచ్యార్థమును) సాధించుచున్నారు. ప్రతిబింబ వాదము కేవలము అసంగతము. ఎట్లో విచారించి చూచెదము.

1. బింబ ప్రతిబింబ వాదములో నిజ బింబము (అసలు వస్తువు) ప్రతిబింబిచుటకు వేరొక వస్తువు కావలసియున్నది. సూర్యుడు ప్రతిబింబింపవలెనన్న అద్దమో నీరో కావలసివుండును. సృష్టికి పూర్వమున్న బ్రహ్మము "ఏక మేవాఽ ద్వితీయం బ్రహ్మ" అని కొనియాడబడుచు రెండవ వస్తువే లేక తానై వుండెను గదా !

2. బింబ ప్రతిబింబముల మధ్య కొంత కాళీ వుండవలెను. సర్వ వ్యాపకముగా బ్రహ్మమే పూర్ణముగా నిండియుంటే యిక కాళీ ఎక్కడిది ?

3. బింబము (అనగా బ్రహ్మము) నకు ఆకారము లేక వర్ణము వుంటేనేగాని ప్రతిబింబము రూపింపబడుటకే వీలు లేదు. కాని రూవ రహితమైన అకాశము అద్దమునందు ప్రతిబింబించుటలేదా అని యిందుకు ఆక్షేపణ చెప్పెదరు- కాని నీలాకాశము, ప్రతిబింబింప గలదేగాని, శుద్దాకాశము ప్రతిబింపజాలదు గదా ! బహ్మమునకు నీలత్వాది వర్ణములు లేనేలేవు. ఆరోపితములే గదా.

4. బింబప్రతిబింబములు చూసి చెప్పుట కపుడెవరు ఎక్కడుండిరి ?

5. బింబముతో ప్రతిబింబము ఐక్య మెట్లగును? నిజ బింబము లేకుంటే ప్రతిబింబమున్ను పోవును లేక ప్రతిబింబమెందుతో చెనో ఆ వస్తువు లేనిచో దానితోపాటు ప్రతిబింబమున్ను లేకుండా పోవునేగాని నిజబింబము వద్దకు పోయి దానితో ప్రతిబింబము ఐక్యమగు ననదగునా ? అంటే ఒక రిట్లన్నారు : "సూర్యుని ప్రతిబింబము చెరువులో ఎచట తోచుచున్నదో, అచట నొకడు

నీటిలో మునిగి కండ్లు తెరచి ప్రతిబింబము ద్వారా సూర్యుని వైపు చూచెనేని, అపుడు బింబ ప్రతిబింబములకు యేకత్వము సిద్ధించుచున్నదన్నారు. అపుడైనను బింబము, ప్రతిబింబము చూచువానిచూపు, ఒకే సరళరేఖలో నుండుటవలన అట్లేకమైనట్లు తోచినదేగాని నిజముగా ఐక్యము సిద్ధించినదా ?

6) అధిష్ఠాన చేతనము (బ్రహ్మము) మాయయందు, ప్రతిఫలించినది, అధిష్ఠాన చేతనము, మాయా, మాయా ప్రతిబింబము, యీ మూడున్ను కలిసి, ఈశ్వరుడాయెనని‌న్ని అధిష్ఠాన చేతనము, అవిద్యయందున్ను అట్లే ఫలించినది. అపుడు ఆ అధిష్ఠానము, అవిద్య, అవిద్యా ప్రతిబింబమూ ఈ మూడూ కలిసి జీవుడాయెనని చెప్పబడినది. మాయావిద్యలు అందలి ప్రతిబింబములున్నూ తీసివేస్తే అపు డధిష్ఠానచేతనమే అక్కడ యిక్కడ నుండును గదా. అది ఐక్యమనిచెప్పటలో తప్పేమి ? అని మరికొందరందురు. మూడూ కూడితేనే ఈశ్వరుడు మూడు కూడితేనే జీవుడు. మాయా అవిద్యలను ప్రతిబింబములను తొలగిస్తే అపుడు జీవేశ్వరులే లేరు. యిక ఐక్యత ఎవరికి చెప్పవలెను ? ఈశ్వరుడైన అధిష్ఠానచేతన మూన్నూ జీవుడైన అధిష్ఠానచేతనమున్ను వేరుగా భిన్నముగా నున్నవని అనగల్గితేనే తప్ప ఐక్యత అనే మాటే పొసగదు.

7) అసలు జీవేశ్వరులిద్దరూ చిదాభాసులే. అనగా చిత్ యొక్క అభాస మాత్రమే. అనగా చిత్తునందు వున్నట్లు తోచబడుట మాత్రమే గాని నిజముగా లేనివారే. సూర్య ప్రకాశమునందు యెండమావుల జలమువలె తోచబడినవారే అంటె సరిపోతుంది, కాని జీవుడు వేరు, ఈశ్వరుడు వేరు అని ఆదిలో ప్రతిపాదించి. ఆ పిమ్మట ఆ రెంటికి ఐక్యత ప్రతిపాదించుట, "ఘూనాబొడ్డు" అని అనుకొన్నట్లే యగును. అంతయు చిత్ స్వరూపమే అయివుండి నానావిధ నామ రూపములు వహించెనన్నమాట. అందుకే శ్రీకృష్ణ దేశికేంద్రులు తమ కందార్థములలో

"అన్నియు తానై, తన కవిపన్నుగ
వేరనుచు నోట బల్కుచు,
మరి తా నన్నిటి యెరిగే యెరుకై యున్నానని,
యెరుకకెరుకే నూహింపుచుండూ ...."

నన్నారు.

8) కనుక, జీవేశ్వరైక్యము అనేది భ్రాంతి మాత్రమే. కనుకనే

శ్లో॥ భ్రమేణాహం, భ్రమేణత్వం, భ్రమేణోపాసకా జనాః ॥
భ్రమేణేశ్వర భావత్వం, భ్రమమూల మిదం జగత్

అని చెప్పబడింది.

నేనే బ్రహ్మననే భ్రాంతి అనగా "అహం బ్రహ్మాస్మి" అనే భ్రాంతి. ఇందు "బ్రహ్మ" శబ్దము ఏ బ్రహ్మమును సూచించును ? జీవేశ్వర జగత్తు యొక్క సృష్టికీ పూర్వము వుండి యీ సృష్టి కారణమైన బ్రహ్మముకా ? లేక కార్యకారణ రహితమగు పరిపూర్ణ పరబ్రహ్మమునకా ? అని ప్రశ్నించుకుంటే ఆ పరిపూర్ణమునందు, సృష్టిగాని, సృష్టి కారణవస్తువుగాని లేనేలేదు. అది యెన్నడూ ఏవస్తువూ కాలేదు, ఏ వస్తువూ అది కానేరదు. కనుక యీ "అహం బ్రహ్మాస్మి" అనే మహా వాక్యమునందలి బ్రహ్మశబ్దము సృష్టికి కారణమైన అధిష్ఠాన చేతనబ్రహ్మమునే సూచించును. ఆ అధిష్ఠాన చేతన బ్రహ్మముయక్క జ్ఞాన ప్రకాశమే పిండాండమందు ప్రత్యగాత్మ పేరుతోనూ బ్రహ్మాండములో పరమాత్మ పేరుతోనూ వ్యవహరింవబడుచూ వుపాధిభేదముచే ఖండఖండములుగాక అఖండముగానే యున్నది. యీ విషయమే శ్రీకృష్ణదేశికులు

"పిండబ్రహ్మాండంబులు రెండును,
యీ రెంటిలోని రెండహములు,
ఈ ఖండములు నాల్గుగూడి అఖండంబగు
యెరుకరూపు గనరా మాతండ్రి" అంటూ

తమ కందార్థములలో నుటంకించినారు. అంతఃకరణతో గూడి "నేను, నేను" అనేది అదే. కనుక అహం బ్రహ్మాస్మి అనగా నేను బ్రహ్మను అని అన్నా అనకపోయినా తానే బ్రహ్మస్వరూపుడే అయివున్నాడు. అంటేనే బ్రహ్మమై లేకుంటే కాకుండ నుండలేదు. యిది తెలుసుకొంటే జన్మరాహిత్యము కాదు, ఈ మహావాక్య జన్యజ్ఞానము కలిగితే జన్మరహిత్య రూప మోక్షము సిద్ధించదు. యీ అఖండయెరుక (అఖండ జ్ఞానము)నకు పరిపూర్ణ పరబ్రహ్మమునందు మూలములేదు, స్థానములేదు. యిది అదికాదు. అది అయిదికాదు, అనుటయే పరిపూర్ణబోధ. సర్వకారణమై జన్మకారణమైన ఈ అఖండ యెరుక రాహిత్యమునందే జన్మరహితరూపమగు మోక్షము సిద్ధించును. "నాన్యఃపంథా అయనాయ" "అహం బ్రహ్మాస్మి" అని అహంకార రూపుడే యగుచున్నాడేగాని మోక్షము నొందుటలేదు. కనుకనే యిది భ్రాంతికారకమే యగుచున్నది.

మతభ్రాంతి :- జీవేశ్వరులు భిన్నులని ద్వైతులు, అభిన్నులని అద్వైతులు, అభిన్నులేగాని కేవలం ఒకటిగాదని విశిష్టాద్వైతులు ప్రతిపాదించుచూ ఒకరి వాదముల నొకరు ఖండించుకొని, కొట్లాడుకొనుచూ ఒకరిలోనొకరు లేకుండాపోయిరి. స్థూల, సూక్ష్మ, కారణదృష్టులచే ఒకే వస్తువు బిన్నభిన్న కోణములలో దర్శించుటవలన భిన్నాభిప్రాయములుకల్గి భిన్నభిన్న మతములు యేర్పడినవి. మతి (బుద్ధి)చే తర్కించుటలో మతవాదములన్నియు పుట్టినవి. మనస్సుచేతను, వాక్కుచేతను నిర్ణయింపరాని పరిపూర్ణ బ్రహ్మమును యిట్టిదని మనస్సుచే నిర్ణయింపబూని తప్పటడుగులు వేసి మత నిర్ణయములు చేసిరి. కనుక మతవాదములన్నియు భిన్న భిన్నములుగా వెలసినవి. అన్నియు అపభ్రంశములే. భ్రాంతిరూపములే.

మతము లన్నిటిలో గొప్పదైన అద్వైతమత మూల సూత్రములను యించుక విచారించి అద్వైత బోధవలన జన్మరహితమనుకొనుట భ్రాంతియని తెలిసికొంటిమి. భ్రాంతి కారణమేది ? అద్వైతనిర్ణయానుసారం "ఏకమే వాఽద్వితీయం బ్రహ్మ - నేహ నానాస్తి కించన - అనగా వున్న దొక్క బ్రహ్మమే. రెండవది లేదు. నానాత్వమనేది అసలు కొంచెమైనా లేదు. రెండవది (జీవేశ్వర జగత్తు) వున్నదనుకొనుట భ్రాంతి. భ్రాంతికి కారణము సమష్టియందు మాయయని, వ్యష్టియందు అవిద్యయనియు వారందురు. ఈ మాయ జడమనియు, బ్రహ్మముయొక్క సాన్నిధ్యమందు సత్తాకలిగి జగత్తుగా పరిణమించుననియు వారి వాదము. జగత్తుగా పరిణమించుటకు యిట్లు మూలకారణము బ్రహ్మమేనని అంగీకరిస్తూనే జగత్ భ్రాంతికి మూలకారణము బ్రహ్మమే నని వారేల యనజాలకపోయిరో యాశ్చర్యముగా నున్నది. మరిన్ని గుర్తెరిగే తెలివి వుంటేనేగాని యధార్థజ్ఞానముగాని అయధార్థరూపమగు భ్రాంతిగాని గలుగదుగదా ! కనుక భ్రాంతి కత్యంత మూలకారణము చిత్స్వరూపమగు బ్రహ్మమే యనక తప్పదు. పరిపూర్ణ భావజ్ఞుల సిద్ధాంత మేమంటే - జగత్కారణము బ్రహ్మమే, ఆ బ్రహ్మమే 'అన్నియు తానై తన్నుతానే చూచుకొని తానే భ్రమ ప్రమాదులకు లోనగు చున్నది. కనుక భ్రాంతి కారణము బ్రహ్మమే. ఆ బ్రహ్మమే మాయ. మాయాబ్రహ్మలకు వసుత్తః భేదమే లేదు.

ప్రకారాంతముగా అద్వైతులు, ద్వైతబుద్ధియే భ్రాంతి అని నిర్ణయించి, ద్వితీయాద్వై భయంభవతి" రెండవ దంటూవుంటే భయభ్రాంతులు తప్పవు అన్నారు. రెండు అని అంటే భేదము వుందన్నమాట. భేదమంటే రెండు అన్నమాట. అద్వైత సిద్ధియందుగాని అభేదబుద్ధి గలుగదు. భేద బుద్ధి 5 విధములుగా నున్నది. 1) జీవేశ్వర భేదము 2) పరస్పర జీవభేదము 3) ఈశ్వర జడభేదము 4) జీవజడభేదము 5) జడజడ భేదము. యీ పంచభేదములు నివర్తి అయితేనే అభేదదృష్టి కలిగి అద్వైతసిద్ధి అని అందురు. చేతన వివర్తం మాయా పరిణామం అన్న వారి మూలసూత్రమే ఈ భేదము లన్నింటికి మూల కారణము. "మొదలువంకరైతే చివరవరకు వంకరే' ' అని దీక్షితులవారన్నట్లు మాయా బ్రహ్మములను వేరుగా పరిగణించుటయే మొదటి వంకర. అట్లుగాక సూటిగా పరిపూర్ణ భావజ్ఞు లేమన్నారు అంటే, ఎరుకే అనగా అధిష్ఠాన చేతన బ్రహ్మమే జీవేశ్వర జగత్తుగా పరిణమించినది అని చెప్పివేసినారు. మరిన్ని "సర్వంఖల్విదం బ్రహ్మ అను" శ్రుతి యీ వాదమును సమర్థించు చున్నది. అప్పుడు ఇక భేదమునకు తావే లేదు గదా !

కనుక అధిష్ఠాన చేతన బ్రహ్మమగు యెరుకే సర్వభేదములకు సర్వ భ్రాంతులకు మూలకారణముగా నున్నదని తేట తెల్లమే కనుకనే సర్వభ్రాంతులకు మూలము. మూలం లేని యీ గుర్తెరిగే శరీరమేనని శ్రీ శివరామ దీక్షితుల వారు పదే పదే నొక్కి చెప్పియున్నారు.

భ్రాంతి రహిత మెట్లు అని వివేచించుటకు ముందుగా భ్రాంతి లక్షణమును మరి కొంచెం లోతుగా విమర్శించుట అవసరము. భ్రాంతి యన్నను. భ్రమ యన్నను, పర్యాయ పదములే నన్నారు.'భ్రం' అను ధాతువునుండి యీ పదము లేర్పడియున్నవి. 'భ్రం' అనగా భ్రమణము తిరుగుట అని అర్థము. అంతేకాదు 'భ్రం' అనగా చలనమే - చలించునది. దీనికి వ్యతిరేకం అచలము. కనుక అచల పరిపూర్ణ పరబ్రహ్మమునకు యెట్టి భ్రాంతి, యెట్టి భ్రమణము. యెట్టి చలనము లేదన్నమాట. కనుక పరిపూర్ణ పరబ్రహ్మ మొక్కటియే భ్రాంతి రహిత స్థానము. "సోఽ కామయత బహుస్యాం ప్రజాయేయ" అను సృష్టి సంకల్పము కలుగుటయే ప్రథమ చలనము. సృష్టి సంకల్పము కల్గిన వస్తువేదో అదే జగత్కారణము. చలనము లేనిదే ఏ సృష్టియూ జరుగుటకే సాధ్యము కాదు. కనుక ఈ చలనము, చలనము పొందిన వస్తువు, చలనకార్యమగు జీవేశ్వర జగత్తు, యిది అంతయూ చలనమే. భ్రమణమే; భ్రాంతియే యన జెల్లును. యీ చలనము పొందు వస్తువునకే భ్రాంతి రహితము కావలసి యున్నది. చలించు లక్షణము, భ్రాంతి యెవరికి కపోనదంటే యెరుకకే; నేను వున్నాని, నావల్లనైన జీవ జగత్తు లేదని అనే భ్రాంతి దీనికే నేననే అహం స్ఫురణగాని, నేనే బ్రహ్మననుకొనే భ్రాంతిగాని లేశమైన లేని దొక్క అచల పరిపూర్ణ పరబ్రహ్మమే. కనుక యెరుకయే భ్రాంతి, భ్రాంతియే యెరుక, కనుక భ్రాంతి రహిత మనగా యెరుక రహితమే. ఇందులో సందేహము లేదు.

అయితే గురుమూర్తి కృపవల్ల, యెరుక లేశమైన లేని పరిపూర్ణ పర బ్రహ్మమును వుండజూచుకొని, యెరుకే బ్రహ్మమనే భ్రాంతి విడచి రాజయోగ మార్గమున జీవితము గడుపుచున్నవాని గుర్తు అసలే లేకుండా పోయినదా ? వుండి యున్నప్పటికి కోరలు పెరికిన పామువలె నిర్వీర్యమైయున్నదా ? పరిపూర్ణ భావజ్ఞునికిన్ని, ప్రాపంచికునికిన్ని జగత్తు సమానంగానే తోచుచున్నదా లేదా ? పరిపూర్ణ భావజ్ఞునికి అసలు తోచుటయే లేదనవచ్చునా ? అశరీర లక్షణములో వుండి సర్వము తెలుసుకొంటూ సర్వ వ్యవహారములు చేస్తూ వున్నాడనవలెనా ? లేదా ?

"కల నెడబాసిన మనుజులు
కలలోపలి పనులు చేయగలవా రననా ?
కలవారు గారు వారలవలె, ఎరుకను
గురునిచేత వదలి యెరుకలోనా
గల పనిచేయవలదె ?"

అని శ్రీకృష్ణ దేశికేంద్రులు ప్రశ్నిస్తున్నారు. ఇక్కడ యెరుక అనగా అఖండ యెరుక. మేలుకొన్నవారు అనగా గురునిచే అఖండ యెరుక పరిపూర్ణమందు లేనేలేదని ఆరూఢత.

చెందినవారే వ్యష్టి యెరుకచేత అఖండ యెరుకలోని పనులు చేసుకొంటూ వుండవలదా, చేసుకొంటూ వుండవలెనని భావము. పరిపూర్ణములో తోచిన ఎరుకే అనగా అఖండ యెరుకయే కల; భ్రాంతి. ఆ ఎరుకకు వునికి కలదనుకొనుటయే భ్రాంతి. ఈ భ్రాంతి రహితము కావలెను. అఖండ ఎరుకకూ వునికియే లేదు కనుక పోవుటయు లేదు, ఉన్నదనే భ్రాంతియే పుట్టినది. ఆ భ్రాంతియే గురు కృపచే తొలగినది. మనిషి నీడయందు దెయ్యమే కాలమందునూ లేకపోయినా యున్నదని భ్రాంతి చెందెను. అది మంత్రగాని మహిమచే పోయినది అనుకొనుట భ్రాంతి రహితము. కనుక పోవలసినది, నిజముగా పోవునది భ్రాంతియే.

అయినపుడు ఎరుకే భ్రాంతి. భ్రాంతియే యెరుక.

"భ్రమ యనినను పుట్టుక
భ్రమకే నామంబులిట్టి భ్రమనే నీవున్,
భ్రమ యీ మేను జగత్తులు,
భ్రమ ఎరుకయు మరుపు రెండు భ్రమే భ్రమ ? వినరా"

అన్నారు కృష్ణదేశికేంద్రులు. కనుక ఎరుకే భ్రమ. భ్రమయే యెరుక యనుటలో సందేహము లేదు గాని తొలగవలసినది ఎరుక సత్యమనే భ్రాంతియే. యెరుక భ్రమ కల్గు శిష్యుని పరితాపము మాననట్టి వాడే గురుడు అన్నారు. కనుక భ్రాంతియే బాధాకరమగుచున్నది. భ్రాంతియే తొలగవలెను.

భ్రాంతి ఎవరికి కలుగుచున్నది : - అఖండ ఎరుక (అధిష్ఠాన చేతన బ్రహ్మము) సత్యము. అదే బ్రహ్మము, అంతకుమించి ఏమీ లేదు.తోచిన జగత్తు మిధ్య అను కొన్నంతకాలము అట్టి వారికి భ్రాంతి విస్తారమగునేగాని ఎన్నటికి భ్రాంతి రహితము కాదు. సకల భ్రమలకు మూలం, మూలం లేని యీ గుర్తెరిగే శరీరమే కనుక వారికే సర్వ భ్రాంతులూ కలుగుచున్నవి. పరిపూర్ణ బోధచే వున్న దున్నట్లుగా విచారిస్తే ఆ అఖండ ఎరుకయే అసత్యము. అది సత్యమే ననుకొంటే ఎరుకయందు ఎరుక పరిణామమగు జగద్రూపము కూడ సత్యమే ననవలెను గాని అసత్య మనరాదు. అఖండ ఎరుక సత్యమని అదే బ్రహ్మమని భ్రాంతి చెంది యున్నవారికి సకల పుణ్య పాపంబులు ప్రాప్తించునని కృష్ణదేశికేంద్రులు శెలవిచ్చినారు.

'పాపంబులు పుణ్యంబులు, భ్రమిన్
ప్రాపించును ఎరుకచేత భ్రమసిన వారిన్
ప్రాపింప వెరుకనెడసిన
తాపసులను చిత్తమందు తగ తెలుసుకొనుమీ ॥

అన్నారు శ్రీకృష్ణదేశికేంద్రులు. నానాత్వము గోచరించుట భ్రాంతి యనియు; ఏకత్వమే భ్రాంతిరహి మనియు నందురు. ఏకానేకములుగా దోచు ఎరుకయే భ్రాంతి. పరిపూర్ణమునందు యెరు లేదు కనుక భ్రాంతియూలేదు.

అద్దాల గదిలో ఒక కుక్కను వదలి తలుపు మూసిన యెడల, ఆ అద్దములయం అనేక వేలకుక్కలు ప్రతి ఫలించిట్లుగా ఒకే యెరుక అనేకముగా దోచిభ్రాంతిలో ముంచినట చెప్పబడిన దృష్టాంతము సరిగాదు. ఏలననగా ప్రతి బింబములన్నియు మిథ్యగాను, నిజబింబవై అసలు కుక్క వక్కటే నిజముగాను యున్నది. కనుక యీ దృష్టాంతము బ్రహ్మసత్యం జగ న్మిథ ' అను వాక్యముచే పోషించును. 'ఏకం అనేకం భవతి అనేకం ఏకం భవతి' అను శ్రుత్యా సారం ఏకం సత్యవస్తువైతే అనేకములున్ను సత్యవస్తువులే కావలసి వున్నవి. జీవేశ్వర జగ రూపములగాతోచు అనేకత్వమంతయు ఏకవస్తువగు ఎరుకయే. నామరూపాలు మాత్రమే మిథ

భ్రాంతిరహితమెట్లు కాలదు :- ఈ దిగువ శ్లోకమే అందుకు సిద్ధాంతము ---

శ్లో ॥ అశరీరం సర్వదాఽస్తి శరీరం రహితం సదా ।
అయమేవ సద్యోముక్తి రన్యథా భ్రమ కారణమ్

తా॥ శరీరములేని పరిపూర్ణ పరబ్రహ్మమే ఎప్పుడూ వుండి వున్నది, శరీర మెప్పుడున్నూ లే యీ సిద్ధాంతము దృఢమైన తక్షణమే సద్యోముక్తి లభించుచున్నది. ఇతర సిద్ధాంతములు భ్రా కారకములే యగుచున్నవి. ఈ శ్లోకమే పరిపూర్ణ సిద్ధాంతమును పూర్తిగా ననువదించుచున్న

--:: సమాప్తమ్ ::--

ఓం
శ్రీ గురుభ్యోనమః

పరిపూర్ణ రాజయోగ సిద్ధాంత వ్యాసమంజరి

(చతుర్థ సంపుటము)



రచయిత
"పరిపూర్ణ దర్శనాచార్య సదానంద"
శ్రీ యిఱపకుర్తి వీర వెంకట రామచంద్రరావు
నర్సాపురం, ప॥గో॥జిల్లా

ఓం

శ్రీ గురుభ్యోనమః

పరిపూర్ణ రాజయోగ సిద్ధాంత వ్యాసమంజరి

(చతుర్థ సంపుటము)

రచయిత

"పరిపూర్ణ దర్శనాచార్య సదానంద"

శ్రీ ఇలపకుర్తి వీర వెంకట రామచంద్రరావు

నర్సాపురం, ప॥గో॥జిల్లా

వెల
రూ. 18-00

శ్రీ గురుభ్యోనమః

ఈ గ్రంథ పునర్ ముద్రణకు ద్రవ్య సహాయము చేసిన ప్రగళ్ళపాటి నాగేశ్వరరావు, రత్నంగార్ల సంగ్రహ జీవిత చరిత్ర

పశ్చిమ గోదావరి జిల్లా చాగల్లులో వ్యాపారవేత్తలైన ప్రగళ్ళపాటి పెద్ద సత్యనారాయణ, వీరమ్మ దంపతుల చతుర్థ పుత్రుడైన కృష్ణమూర్తి సత్యవతి దంపతుల గర్భవాసమున జ్యేష్ఠ పుత్రుడుగా 17-10-1956వ సం॥లో చిరంజీవి ప్రగళ్ళపాటి నాగేశ్వరరావు గారు జన్మించినారు. వీరికి ముగ్గురు సోదరీమణులు. నిడదవోలులో ఇంటర్మీడియట్ వరకు వీరి విద్యాభ్యాసం జరిగింది. తదుపరి వీరు వ్యాపార రంగంలో ప్రవేశించారు. యుక్తవయస్సు రాగా 1977వ సం॥లో చి॥ల॥సౌ॥ తులసితో వీరికి వివాహం జరిగింది. 1978లో వీరికి భగవాన్ అని పేరుగల పుత్రుడు జన్మించాడు. 1978 సం॥లోనే భార్యా వియోగం జరుగగా తూర్పు గోదావరి జిల్లా గోనాడ వాస్తవ్యులు కాపగంటి శ్రీరామ చంద్రమూర్తి, రత్నావతి దంపతుల ద్వితీయ కుమార్తె చి॥ల॥సౌ॥ రత్నంతో 15-1-1979లో వివాహం జరిగింది. వీరికి ప్రసాద్ అనే కుమారుడు, జోత్స్న అను కుమార్తె కల్గిరి. చి॥సౌ॥ రత్నం పుట్టింటి వారసత్వంగా అధ్యాత్మిక జిజ్ఞాస తల్లిగారి ద్వారా సంక్రమించి కృషి చేస్తున్న సందర్భంలో, శ్రీ శివరామ దీక్షితీయ సంప్ర దాయమున పీఠాధ్యక్షులైన శ్రీ దయానంద పొన్నాల రాజయోగీంద్రుల వారి శిష్యులైన, పరిపూర్ణ దర్శనాచార్య సదానంద శ్రీ యిలపకుర్తి వీరవెంకట రామచంద్రరావు గారి ప్రియశిష్యుడు శ్రీ మంచిరాజు శ్రీనివాసమూర్తి గురువుగారి శిష్యమండలి గోనాడ గ్రామంలో ఈ ధర్మమునందు చక్కగా కృషి చేయుచున్నది. అందు తోట రంగారావు గారి ద్వారా ప్రేరేపితులై 1995 సం॥లో రథ సప్తమి రోజున వీరి దంపతులు ఉపదేశ క్రమంలో గురుమంత్ర దీక్ష గైకొని, సంప్రదాయ పద్ధతిన నిర్దేశింపబడిన అనుష్ఠాన, అచరణ, విచారణ క్రమము ద్వారా బోధ యొక్క సమగ్ర స్వరూపమును వస్తు నిశ్చయ పద్ధతిగా గ్రహించి ఇహపరముల రెంటియందు శాంతి, ఆనందములు పెంపొందించుకొని జన్మ సాఫల్యం పొందినామని తృప్తితో జీవించుచున్నారు.

పీఠగ్రంథములన్నియు గురుముఖతా విచారించిన ధన్యజీవులు వీరు. అంతేగాక ఉభయత్ర వీరి కుటుంబ సభ్యులందరిని ప్రేరేపించి ఈ ధర్మమునందు కృషి చేయించుచున్నారు. స్వయంకృషితో అంచలంచెలుగా ఆర్థికాభివృద్ధిని సాధిస్తూ చాగల్లు గ్రామంలో వ్యాపారాభివృద్ధిని కొనసాగించుచున్నారు. వీరి కృషి ఆదర్శమును ఇనుమడింప జేసుకొనుచు శ్రీ గురుదేవుల ఆశీస్సులతో 1-12-2000 సం॥లో వీరి స్వగృహమునందు గురుయంత్ర పాదుకా ప్రతిష్ఠాపన అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించి నిత్య, పక్ష, మాస, వత్స కార్యక్రమములను నిర్విఘ్నంగా కొనసాగించుచున్నారు. దీనికి ముందుగా ఒక సంఘటన జరిగినది.

చిరంజీవి నాగేశ్వరరావు బాల్యావస్థలో చెరువులో నుండి నీరు తీసుకొని వస్తుండగా చెరువు అంచున వెండి పాదుకలు అలల నడుమ వీరికి దర్శనం కల్గించగా ఆ పాదుకలను ఇంటికి తీసుకొని వచ్చి దైవపీఠంలో ఉంచి నిత్య పూజాదికం నిర్వహించుచుండగా నాయనమ్మగారి నిర్యాణానంతరం ఈ పాదుకలను తిరుపతి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి హుండీలో వేసి దైవ సమర్పణ గావించిరి. మరల కొన్ని సంవత్సరాలకు పాదుకలు గురురూపంలో తమ ఇంట్లో కొలువు చేసినందులకు వీరి దంపతులు మరల పరమానందంతోయున్నారు. ఆ ధర్మవంతమైన దాంపత్య జీవితంలో ఎక్కువ జీవితకాలం గురువుగారితో వెచ్చించుతూ బోధయందు చక్కటి ఆరూఢతను సాధించిరి.

గురువుగారితో కలిసి వీరు అన్ని ప్రాంతములు విరివిగా పర్యటిస్తూ, గురుభక్తి, గురుసేవ, గురునిష్ఠల ద్వారా వీరి జీవితాన్ని వినియోగించుచూ, గురుధర్మము లోక కళ్యాణమునకు విరివిగా ప్రచారం గావించుటయే గురుసేవగా భావించి ఈ గ్రంథ పునర్ముద్రణకు వారి ఆర్థిక సంపత్తిని అందించి ధన్యులైరి. శ్రీ గురుకృప వీరియందు సర్వదా ప్రసరించి, సమస్త సుఖశాంతులు కలుగుగాక.

ఇట్లు

తోట రంగారావు

గోనాడ, తూర్పుగోదావరి జిల్లా

శ్రీ గురుభ్యోనమః



శ్రీ ప్రగళ్ళపాటి నాగేశ్వరరావు

శ్రీమతి రత్నం

ముందుమాట

పరిపూర్ణ దర్శనాచార్య సదానంద శ్రీయిలపకుర్తి వీరవెంకట రామచంద్రరావుగారు, శ్రీ అచల ఋషి దయానంద పొన్నాల రాజయోగేంద్రుల వారి అనుగ్రహముచే వారి దివ్యాశీస్సులతో శ్రీ శివరామ దీక్షితీయ సాంప్రదాయమును తమ గ్రంథ రచనల ద్వారా బహుళ ప్రాచుర్యము చేసి పాఠక లోకమును ఉత్తేజితులుగా జాగృత మొనరించినారు. వారి శిష్య ప్రశిష్యులు వలయు ఆర్థిక సంపత్తిని సమకూర్చి వారి గురుభక్తిని వ్యక్త పరచుకొనుచునే ఉన్నారు.

అంతేగాక గురుధర్మ నిర్వహణలో శ్రీ రామచంద్రరావు గారు దంపతులు జరిపిన కృషిని, గడిపిన ఆదర్శవంతమగు జీవితమును లోకములో ప్రచారం చేయుటకై గురుదేవుల ఆశయ సంసిద్ధి కొరకు **"శ్రీశ్రీశ్రీ సీతారామచంద్ర పరిపూర్ణ బోధోపదేశ మందిర సంస్థ"** ను గుంటూరు జిల్లా, మంగళగిరి మండలం, యర్రబాలెం గ్రామములో ఏర్పాటు చేసి శ్రీ గురుదేవుల ఆదర్శమును లోక కళ్యాణార్థము వివరించడంలో వారికి గల సహాయ సంపత్తిని అందించు చున్నారు. ఇది సహృదయులు సంతసించి ప్రోత్సహించవలసిన అంశము. శ్రీ రామచంద్రరావుగారి రచనలన్నియు వారి గురుదేవులు శ్రీ శివరామ దీక్షితీయ పీఠాధిపతులైన దయానంద పొన్నాల రాజయోగేంద్రుల వారి దివ్యశ్రీ చరణములకు పూజా పుష్పములుగా సమర్పింపబడి యున్నవి. అట్లే యీ భాగం కూడా యొక పూజా పుష్పంగా వారి చరణ సన్నిధి చేరాలని భక్త మండలి వారి తరపున శ్రీ గురు పరమాత్మను ప్రార్థించుచున్నాము.

ఇట్లు

భక్తమండలి తరపున

మంచిరాజు శ్రీనివాసమూర్తి

విషయ సూచిక

1.	గురూపదేశము	1
2.	గురూపాసన	3
3.	గురుమంత్ర ప్రభావము	7
4.	అధికార లక్షణము - లక్షణయుతుడు	11
5.	త్రివిధ తపస్సులు	14
6.	జన్మరహితము - సాధనలు	17
7.	శరణాగతి	20
8.	జన్మరహిత విధానము	23
9.	పరిపూర్ణ బోధ - శ్రవణాధికారులు	27
10.	నిజ వైరాగ్యము	29
11.	శిష్యుని అంతరంగ సాధన	31
12.	పరిపూర్ణ బోధ - ఆరూఢమగు విధానము	33
13.	పరిపూర్ణ బోధ - సాధనాంతర నిరపేక్షకము	44
14.	అంతశ్శౌచము	47
15.	అభిమానము	48
16.	అంతఃకరణము	60
17.	వస్తు నిశ్చయము - ఎరుకను విడుచుట	61
18.	ప్రాణము - ఆత్మకాదు	62
19.	ఆవరణ, నిరావరణములు	63
20.	ఏ ఆశ్రయం గొప్పది?	65
21.	కందార్థ, కంద పద్యములు - గుఢార్థములు	69

22.	అవశ్యమను భోక్తవ్యం	71
23.	బలవాన్ ఇంద్రియాగ్రామోవిద్వాంసమపి కర్షతి	73
24.	బంధమేది?	75
25.	నీచాశ్రయం కూడదు	77
26.	గురువాక్యం యధాతధా	78
27.	అతిథిదేవోభవ	79
28.	సన్యాసము, కాంతా,కనకములు	81
29.	తత్త్వములన్నియు కలిసియే ఎరుక	83
30.	విచిత్ర గణితము	84
31.	దత్తగురుని మహత్యము	85
32.	అహం వైశ్వానరోభూత్వా	87
33.	గురువాజ్ఞాపాలనము - ఏకలవ్యుడు	88
34.	మంత్రవేత్త మరణము	90
35.	చిత్ర విచిత్రాలు	92
36.	జ్ఞానేశ్వర మహరాజ్	94
37.	మహాత్ములకు భ్రాంతి చెందకు	97
38.	శ్రీ కృష్ణార్పణమస్తు	99
39.	గురుకృపా సంసిద్ధి	100

పీఠిక

రాజయోగి వేదాంత మాసపత్రిక యందు నాచేత, నా సహధర్మ చారిణియగు శ్రీమతి సీతామహాలక్ష్మి చేత రచింపబడి, ప్రకటింపబడిన వ్యాసములన్నియు, పుస్తక రూపంలో ప్రకటించిన అవి శాశ్వత రూపంలో నిల్చి పరిపూర్ణ బోధయందు కృషి చేయువారికి, పరిపూర్ణ బోధ యెట్టిదో ఎరిగేటివారికి, ఎంతయో, సహాయకారిగా నుండుననియు, గ్రంథ ముద్రణకు వలయు ధనము విరాళ రూపముగా తాము భరింతుమనియు భక్తాదులు వాగ్దానము చేసి యుండుటచే మూడు సంపుటములుగా విభజించి "పరిపూర్ణ రాజయోగ సిద్ధాంత వ్యాస మంజరి" అను శీర్షికపై 1983వ సం॥లో నా భార్య రచనలన్నియు ప్రథమ సంపుటముగా 1985లోను, నా రచనలలో కొన్ని ద్వితీయ సంపుటముగా మిగిలిన వ్యాసములు 1986వ సం॥లో తృతీయ సంపుటముగాను ప్రకటించినాము. రాజయోగ మాసపత్రిక యందు నాచే రచింపబడిన మిగిలిన వ్యాసములు విషయ నిరూపణ కల్గిన ఇతర భక్తాదుల వ్యాసములు కొన్ని క్రోడీకరించి చతుర్థ సంపుటముగా ప్రకటించుచున్నాము. ఈ గ్రంథము కూడ భక్తాదుల ఆర్థిక సహాయముచే ముద్రింపబడెను. చాగల్లు వాస్తవ్యులైన శ్రీ ప్రగళ్ళపాటి నాగేశ్వరరావు, శ్రీమతి రత్నం దంపతులు ఈ ధర్మము నందు కృషి చేస్తూ గురు ఋణం తీర్చు విధానంలో ఈ గ్రంథ రాజము వారి స్వంత ద్రవ్యముతో ముద్రింపజేసి పాఠకులకు అందించి ధన్యులైరి. వీరి సంగ్రహ జీవిత చరిత్ర విడిగా ప్రకటింపబడుచున్నది.

శ్రీ గురుపరమాత్మ అనుగ్రహముచే వీరికి సమస్త శుభములు కల్గి జీవితాశయము నెరవేరుగాక. మాచే రచింపబడిన గ్రంథములన్నియు, మా గురుదేవులైన శ్రీ మదచల ఋషి దయానంద పొన్నాల రాజయోగేంద్రుల వారి దివ్యశ్రీ చరణ సరోజములకు పూజా పుష్పములుగా సమర్పింపబడియున్నవి. ఈ గ్రంథమును మరియొక పూజా పుష్పముగా సమర్పించుకొనుచున్నాము.

ఇట్లు

బుధజన విధేయుడు

యిలపకుర్తి వీరవెంకట రామచంద్రరావు

నర్సాపురం

1. గురూపదేశము

ఉపదేశమును పొందుట నిజముగా అవసరమా? అన్నచో విధిగా అవసరమనియే చెప్పితీరవలెను. ఏలనన తన స్వ స్వరూప యదార్థజ్ఞానమును పొందుట మానవుని స్వధర్మమై, అవశ్యకర్తవ్యమైయున్నది. కేవలము ప్రాపంచీక లక్షణములు కొరకే పాటుపడక, ఉపదేశము గురునిద్వారా పొంది విచారించి గమ్యము చేరినవాడే నిజమైనమానవుడు. మోక్షఅర్హత ఒక్క మనవోపాధికే కలదు. ఇట్టి సర్వోత్కృష్టమైన వుపాధిని పొంది కర్తవ్యమును మరచి, యధేచ్ఛగా సంచరించుట నిజముగా పశులక్షణమే అనదగును. కావున స్వస్వరూపమును ఉపదేశరూపముగా పొందుట మానవుని నైతిక కర్తవ్యమై యున్నది. చెప్పవలసినంతగా శాస్త్రాదులు చెప్పినవి. అవి వల్లెవేసిన చాలదా? ఉపదేశమెందుకు? అను ప్రశ్న కలగవచ్చును. వస్తువును వున్నదున్నట్లుగా చూపించు సామర్థ్యము అధికారము తత్వదర్శియగు గురుమూర్తికి కలదు. పరంపరగా వస్తునిశ్చయ విధానము, తన్నాశ్రయించుచున్న సత్‌శిష్యులకు ఆరూఢపరచి, వారిని కృతార్థులనుచేయు శక్తియుక్తులు ఒక్కగురువుకు మాత్రమే కలవు. "గురూపదేశము అనగా గొప్ప ఉపదేశము కదా! తానే పరమాత్మ స్వరూపుడను అను అఖండ జ్ఞానమును ప్రాప్తింపచేయుటయే గురూపదేశము. శాస్త్ర జ్ఞానము ఎంతయున్న గురూపదేశము ద్వారా అనుభవైకజ్ఞానము పొందనిచో నిరర్థకమే, "తన్ను తానెరుగడు, తానెవ్వనికి చెప్పు పాలుమాలిన వట్టిపశువు కొడుకు" అని వేమనగారు ఆత్మ నిశ్చయజ్ఞానము లేకయున్న గురువుల విమర్శించి యున్నారు.

"గురువు లేని విద్య గుడ్డి విద్య" అని లోకోక్తి గురోర్ముఖేన జ్ఞాతవ్యంనాన్యధా గ్రంధకోటిభిః" అని వస్తువు గురుముఖతః మాత్రమే తెలియదగినదని సిద్ధాంతీకరించుచున్నది. "ఏక విజ్ఞానేన సర్వ విజ్ఞానం భవతి" అని ఏఒక్క జ్ఞానము తెలుసుకుంటే మిగిలిన సమస్తము తెలియబడుతుందో అట్టి ఆత్మజ్ఞానము పొందమని శాశించుచున్నది. అట్టి అఖండ జ్ఞాన సంపత్తి గురూపదిష్ట మార్గమందే సిద్ధించగలదు. ఈ భావమునే భగవద్గీత యందు శ్రీకృష్ణభగవానుడు క్రింది శ్లోకము ద్వారా నిర్ణయించినాడు.

శ్లో॥ తద్విద్ధి ప్రణిపాతేన పరి ప్రశ్నేన సేవయా
వుపదేక్ష్యం తితేజ్ఞానంః జ్ఞానినాతత్వ దర్శినః ॥

కావున ఒక్క గురుపదేశము ద్వారానే ఆత్మ స్వరూప నిశ్చయము కలుగగలదని తెలియవలసియున్నది. ఆత్మ స్వరూప నిశ్చయము ఒక మనసు ద్వారానే పొందవలసి యున్నది.

శ్లో॥ నతుమాం శక్యసే ద్రష్టు మనేనైన స్వచక్షు షా
దివ్యం దదామి తేచక్షుః పశ్యమే యోగమైశ్వరమ్.

అని గీతాశ్లోకంలో చెప్పబడిన దివ్యచక్షువు (లేక జ్ఞానచక్షువును) గురువే ప్రసాదించగలడు. అంతః కరణ పరిశుద్ధి ఏకాగ్రత, సిద్ధించినవానికే ఆత్మనిశ్చయము కలుగగలదు. గురువు చెప్పి చూపించిన మార్గమందె అవి సిద్ధించ గలవు. గురువు మార్గ దర్శకుడై శిష్యుని ఉద్ధరించ గలడు. తత్, త్వం, అసి పదార్థములను దర్శింపచేసి అఖండజ్ఞాన సంపత్తిని కలిగింపగలడు. వస్తువును దర్శింప చేసిననాడే యదార్థజ్ఞానము తెలియగలదు. గురు గీతయందు "తత్పదం దర్శితంయేన, అసిపదం దర్శితంయేన, త్వంపదం దర్శితంయేన" అంటూ చెప్పబడినది. ఈమూడింటిని వస్తునిశ్చయపూర్వకంగా తెలియ చేసినవాడే గురువు. వాటిని చెప్పగలిగినంతలో ప్రయోజనముండజాలదు. ఈభావమునే శ్రీకృష్ణదేశి కేంద్రులు కందార్థములలో ఈక్రింద విధముగా శలవిచ్చి యున్నారు. "పింద బ్రహ్మాండంబులు రెండునూ,ఈరెండునూ, ఈ రెంటిలోని రెండహములు. ఈ ఖండములు నాల్గుగూడి అఖండంబగు ఎరుకరూపు గనరా మా తండ్రి" అని నుడివియున్నారు. "నీవు దేవుని చూచితివా? అని వివేకానందుని ప్రశ్నకు అనేకమంది పండితులు వెనుకంజ వేసిరి. రామకృష్ణపరమహంస మాత్రము నిన్ను చూచునట్లుగా చూచినానని" చెప్పగలిగినాడు. వెయ్యిమంది పండితులలో ఆత్మనిశ్చయము యదార్థముగా పొందగలిగిన వారొక్కరుండుట చాలాదుస్తరము "ఆత్మ నిశ్చయ పద్ధతి తెలిసినవాడే పండితుడుగాని, వూరకయే శాస్త్రాదులు వల్లించి చెప్పువాడు పండితుడుకాడు. అట్టి పాండిత్యమువల్ల లౌకిక ప్రయోజనములు పొందవచ్చునేమోగాని, పారమార్థిక, అభ్యున్నతి గాంచలేడు.

ఎరుక, పరిపూర్ణమును వస్తునిశ్చయముగా తెలిసినగాని ఎరుకను వీడుట సాధ్యము కాజాలదు. ఈ వస్తునిశ్చయము ఎట్లు చేకూరును? అన్నచో ఒక్క పరిపూర్ణ గురువు వల్లనేనని తెలియవలెను. గురువు ఎట్లు పైవాటిని గూర్చి వస్తు నిశ్చయజ్ఞానము కలిగించును? ఉపదేశ కాలమందు గురుశిష్యుల ప్రమాణములేవి? విచారించవలసియున్నది.

కేవలము జన్మరాహిత్యమే పరమావధిగా నెంచి సద్గురు పాదములు నాశ్రయించి ఉపదేశమునకై వచ్చిన శిష్యుల "గురువాక్యం యధాతధా" అనే నిర్ణయములో కేవలము గురువునియోగించిన శిక్షణయందే ప్రవర్తిల్లుచు అంతఃకరణ పరిశుద్ధి, ఏకాగ్రత సాధించగా గురుమూర్తి అతనికి, సర్వసృష్టికి మూలకారణమైన ఆత్మస్వరూపమును వస్తునిశ్చయ పూర్వకముగా తెలియచేయును. అది విన్న శిష్యుడు ధ్యాన యోగములో దానిని అనుభవము గావించుకొని అఖండాత్మ స్వరూపుడై యుండును. అప్పుడు శిష్యుడు జన్మకర్మలకు కారణ స్వరూపమును గాంచినవాడే గాని దానిని దాటిపోలేదు. తెలివి చేత, తెలియదగిన సమస్తమును తెలియగలిగినాడు, మనస్సుచేత చూడదగినది చూచినాడు, ఇక అతనికి దానిని విడిపించు మార్గము గురువే చెప్పి చూపించవలసియున్నది. పరిపూర్ణ పరబ్రహ్మము మనోవాక్కులకు

అందనిది. అది ఎరుకలేక సేవించదగినది. "నచక్షుర్గచ్ఛతినో మనః" అట్టి పరిపూర్ణ పరబ్రహ్మమును గురువు అఖండ ఎరుక రూపుడైయున్న శిష్యునకు వుండచూపి ఉండచూచిన దానిని లేకుండా చేయగలడు. ఇతర ఏ సాధనల వల్లను అది తెలియబడదు. "చూపించచూపరానిది చూపించితి దాన్ని నీవు వుండచూచితివి కదా!" అని శ్రీకృష్ణదేశి కేంద్రులు తమకందార్థములో నిర్ణయించియున్నారు. గురూపదేశమన గురుని వలన ఎరుకను, పరిపూర్ణమును వస్తు నిశ్చయముగా ఎరిగి, ఎరకను వీడుటయే లక్ష్యముగదా!

ఈ గురూపదేశము పొందుటకు అర్హులు ఎవరు? అన్నచో జన్మ కర్మలలో చిక్కి, జనన మరణములు పొందుచున్న ప్రతి మానవుడు అర్హుడేనని చెప్పవలెను. తన స్వశక్తిపైన ఆధారపడి కడతేరుట దుస్తరము. ఎంతటి మహా పండితునికైననూ గురూపదేశము అత్యంత ఆవశ్యకము. అందునూ పరిపూర్ణ భావము వున్నదున్నట్లుగా ఆరూఢమగుటకు ఉపదేశావశ్యకత ఎంతేని కలదు. తన్నాశ్రయించిన వారికి మాత్రమే గురువు ఉపదేశ రూపముగా వస్తు నిశ్చయ పద్ధతి ప్రబోధించగలరు. "ఆచరించి చూపిన వాడే ఆచార్యుడు" అనే సూక్తి ప్రకారము శిష్యుని గురూపదిష్ట మార్గములో తాను మార్గదర్శకుడై నడిపించి తరింపచేసి అతనిని కర్మయోగిగా చేసి, ప్రపంచ పారమార్థిక వ్యవహారముల రెంటియందు అంటక వ్యవహరించగలగుదీ, ఆచరణ పద్ధతి అనుగ్రహించగలడు. కావున జన్మరాహిత్యా విధానమును ఆశించు ముముక్షువు గురుమూర్తి, ఉపదేశము ద్వారా జన్మ కారణ వస్తువును గుర్తించిన పిదప దానిని అంటకయున్న పరిపూర్ణ పరబ్రహ్మమును ఉండజూచుకొని ఎరుకలేని స్థితిలో అశరీరుడై కర్మ కౌశలముతో శేష జీవితము గడుపుటయే ముఖ్యవిధి.

2. గురూపాసన

ఉపాసన అననేమి? ఉప + ఆసన = ఉపాసన. అనగా సమీప స్థానమునందు సుస్థిరముగా నుండుట. దేని సమీపమునందు అన్నచో తన ఇష్టదైవము యొక్క సమీపము నందేనని చెప్పవలెను. ప్రతి వానికి కూడా ఏదో ఒక దైవమూర్తి యందు విశ్వాసము కుదిరి భక్తితో పూజించుచూరాగా, అది క్రమశః ఉపాసనా పద్ధతిగా మారగలదు. భక్తి కంటె కూడా ఉపాసన అత్యంత శక్తి వంతమైనది. ఏలనన భక్తియందు ముఖ్యముగా బాహ్యభక్తి యందు విగ్రహారాధనలో భగవంతుని ఒకానొక రూపంలో భావించుచూ భక్తి సల్పును. మనసునందు ఒకే ఒక్క భావన స్థిరపడుటకు భక్తిమార్గము సహాయపడగలదు. అనగా ఏకాగ్రత కుదురును. బాహ్య ఆడంబరములతో సంతృప్తి చెందక పారమార్థిక కృషిచేసిననే గాని లక్ష్యసిద్ధి పొందజాలరు. ఏపని చేయవలెనన్నను ముందుగా మానసిక ఏకాగ్రత, అంతఃకరణపరిశుద్ధి అత్యంత ఆవశ్యకములైయున్నవి. అంతఃకరణ పరిశుద్ధియు, ఏకాగ్రతయు లేని భక్తి

ఉపాసనలు నిరర్థకములేనని చెప్పవలసియున్నది. ఏకాగ్రత ఎట్లుసిద్ధించును అన్నచో ఉపాసన వల్లనేనని చెప్పక తప్పదు. కార్యాచరణద్వారా అంతఃకరణశుద్ధి, ఉపాసనద్వారా ఏకాగ్రతపొంది చేసిన సాధనయే ఫలప్రదము కాగలదు. ఉపాసనలందు రెండు విధములు 1. సగుణోపాసన 2. నిర్గుణోపాసన. 1. సగుణోపాసన అనగా స్థూలరూపముగా గానవచ్చు నామరూపాదులతో కూడియుండు దేవతామూర్తిని ఉపాసించుట ఇష్టదైవము యొక్క విగ్రహమునుగాని, ఛాయచిత్రమునుగాని, ఏర్పరుచు కొని దానికి నిత్యము పూజాదికములు నిర్ణయించి, ఆయా నామరూపములు సదా స్మరించుకొనుచూ నవవిధ భక్తి పద్ధతులలో భక్తిని క్రమశః అభ్యాసము చేయుచూ రాగా, మనస్సుకు ఆయా నామరూపములు భావనలో స్థిరపడి, ముద్రపడి తరువాత అచంచలస్థితిలో ఇతరమును ఏమాత్రము దరిజేరనీయక తన మనస్సు స్వరూపమందే ప్రవేశపెట్టుచూ తీవ్రప్రయత్నము చేయుట సగుణోపాసనము. 2. నిర్గుణోపాసనము: సగుణోపాసన చేసియున్న వానికి నిర్గుణోపాసన సులభసాధ్యము. ఏకాగ్రత లేనిచో నిర్గుణోపాసన సాధ్యమేకాదు. మనస్సు నిర్గుణమగు పరమాత్మయందు ఏకాగ్రత చెందినపుడు మనస్సు నిర్విషయమై ఆపరమాత్మతో తాదాత్మ్యము చెంది మనస్సు రహితము కావలెను. అట్టి మనస్సుకును నిరీంద్రియ మనస్సందురు. అట్టి నిర్విషయమగు మనస్సు చేతనే ఆపరమాత్మ తెలియతగియున్నది. పరమాత్మ, స్వరూపము నిర్గుణము. అది నిరీంద్రియమగు అనగా నిర్విషయమగు మనస్సు చేతనే చూడదగినది, వినదగినది. పొందదగినదని అనేక శృతిస్మృతులు ఘోషించుచున్నవి. "ఆత్మవారే ద్రష్టవ్యో, శ్రోతవ్యో మంతవ్యో నిధిధ్యాసతవ్యః" అనిన్ని "మనసైవ వాను ద్రష్టవ్యం, మనసైవ వానుశ్రోతవ్యం", అనిన్ని నిర్ణయించుచున్నవి. కావున నిర్గుణ రూప వస్తువును ఉపాసించుట ఒక్క మనస్సుచేత మాత్రమే సాధ్యము కాగలదు. కనుక సగుణోపాసన ద్వారా సాధకుడు నామరూప వస్తువులందు మున్ముందు ఏకాగ్రత సాధించవలెను. కావున సగుణోపాసన, నిర్గుణోపాసనకు సోపానమని చెప్పవలసి యున్నది. ఈ దృష్టితోనే ప్రతీకోపాసన (విగ్రహారాధన) పెద్దలచే నిర్ణయింపబడినది. గురుమూర్తి యొక్క మానవాకారము (నామరూపములు) సగుణము. పరమాత్మయే ఆయన నిర్గుణరూపము. మొట్టమొదటనే నిర్గుణోపాసన యందు ప్రవేశించి కృతార్థుడగుట దుర్లభము. కనుకనే "ఉపాసకానాంహితార్థాయ బ్రహ్మణో రూపకల్పనా" అనే శృతి నిర్ణయముగా ఉపాసన సౌలభ్యము కొరకు మాత్రమే నిర్గుణబ్రహ్మము సగుణరూపమై నామరూపములు పొందినదని తెలియవలెను. తనకొరకు అనగా తన్నుద్ధరించుటకే పరమాత్మ నామరూపములు వహించి గురురూపంలో అవతరించెనని శిష్యుడు భావించవలెను.

ఈ ఉపాసనవల్ల సాధకునికి గలుగు ప్రయోజనమేమి? ఏ వ్యక్తి ఏ వస్తువును ఉపాసించినా తనకు అన్వరూపసాక్షాత్కారము పొందుటకే కదా! మరియు తనయందలి దుష్ట

లక్షణములున్ను వ్యక్తిగతలక్షణములన్ని పూర్తిగా నాశనమై తానుపాసించు భగవంతుని యందలి సమస్త కల్యాణ గుణములు తనకు సంక్రమించుటకే అని తెలియవలెను. ఉదాహరణకు రాముని ఉపాసించువాడు రామునియందలి దైవలక్షణములులో కనీసము ఏఒక్కదానిని పొందగలిగినను ఆ వుపాసన సార్థకమైనట్లే. నేటి కాలములో భగవంతుని పూజించుటయే నేర్చినారు గాని నిజమైన ఉపాసనా పద్ధతిలో, ఆ వుపాస్య దైవమందలి సుగుణములను ఏ ఒక్కరును పొందుటకు ప్రయత్నించక కేవలము బాహ్యాడంబరములకే దిగజారిపోవుచున్నారు. ఉపాసన యొక్క ముఖ్యోద్ధేశ్యము తనవ్యష్టిరూపము తనుచేయు సాధనలచేత నాశనము చేసుకొని, సమిష్టి రూపమైన భగవత్స్వరూపమును పొంది, తదనుగుణ్యముగా ప్రవర్తించి మానవుడు మాధవుడుగా మారుటకే. ఉపాసనద్వారా ఏకాగ్రత ప్రప్రధముగా సిద్ధింపగలదు. ఏకాగ్రతలేని సాధనలు ఎన్ని చేసిననూ నిష్ప్రయోజనమే కాగలవు. అయితే నిజము... ఉపాసింపదగిన వస్తువేది? దానిని ఎట్లు ఉపాసింపవలెను? దానివల్ల సాధకునికి గలుగు ప్రయోజనమేమి? గురూపాసన యందలి ప్రాముఖ్యత ఏమి? మున్నగునవి చక్కగా విచారించవలసియున్నది.

సర్వ జీవేశ్వర జగత్తుకు అత్యంత మూలకారణమైన పరమాత్మ స్వరూపమే నిజముగా ఉపాసింపదగినది. తానే పరమాత్మ స్వరూపము అనే అఖండ జ్ఞానసంపత్తి పొందుట ప్రతి మానవుని విద్యుక్త ధర్మమైయున్నది. చతుర్విదపురుషార్థములలో ఇదియే పరమ పురుషార్థము.

అట్టి అభ్యున్నతికి పాటు పడక కేవలం ప్రాపంచిక సుఖములకే తన సర్వస్వము వినియోగించుచూ జీవితమును వృధాచేయుట నిజముగా పశు లక్షణమే కాగలదు. ఇట్టి పరమాత్మ రూప అఖండ జ్ఞాన సంపత్తి తనకు ఎవ్విధంబున సంప్రాప్తము గాగలదు? అన్నచో గురూపదిష్ట మార్గమందేనని చెప్పవలెను. " గురోర్ముఖేన జ్ఞాతవ్యం నాన్యధా గ్రంధ కోటిభిః " అనిన్ని " గురూపదిష్ట **మార్గేణ మనశ్శుద్ధింతు కారయేత్** " అనిన్ని శృతులు పేర్కొనుచున్నవి. " తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా! వుపదేక్షంతితే జ్ఞానం, జ్ఞానినాంతత్వ దర్శినః " అని భగవద్గీత యందు గురుమూర్తి ఒక్కరి చేత అట్టి పరమాత్మ స్వరూపస్థితి పొందవలెనని నిరూపించుచున్నది. ఈ అఖండ జ్ఞాన సంపత్తి, గురుమూర్తికి ఎట్లుకలిగినది? అన్నచో పరంపరా ప్రాక్తమిమం ఏర్పడినదని చెప్పవలెను. "ఏవం పరంపరాప్రాప్తమిమం రాజర్షయోవిదుః" అని గీతానిర్ణయము కదా! "బ్రహ్మవిత్ బ్రహ్మైవభవతి" అనిన్ని "గురుసాక్షాత్ పరబ్రహ్మ అనగా బ్రహ్మసాక్షాత్కారము పొందినవాడు బ్రహ్మమే. కనుకనే గురుసాక్షాత్ పరబ్రహ్మమని చెప్పబడినాడు. నిరాలంబోపనిషత్తులో "క వుపాస్య" అనగా దేనిని ఉపాసింపవలెను? అను ప్రశ్నకు జవాబుగా "ఉపాస్యఇతిచ"

సర్వశరీర స్థచైతన్య బ్రహ్మోపాసకో గురురుపాస్యః అని జవాబు చెప్పబడినది . అనగా, సమస్తమందు చైతన్యరూపముగా నుండియున్న పరబ్రహ్మ వస్తువును ప్రాప్తింపచేయు గురుమూర్తియే ఉపాసింపదగిన వాడని అర్థమైయున్నది. గురూపాసనయే పరమాత్మోపాసన పరమాత్మ ఉపాసనయే గురూపాసన అని తెలియవలెను.

జన్మరాహిత్య విధానమందు కృషిచేయు వారికి ఈ గురూపాసన అత్యంత ప్రాధాన్యమై యున్నది. ఒక్క గురూపాసన ద్వారానే గురు కృపావిర్భావము కలుగును. తన నిజరూపమైన పరమాత్మను, పిదప పరిపూర్ణ పరబాహ్యమును యెరుగ గలుగును. సర్వభ్రాంతి, రహితమగును. అశరీరుడై శేషజీవితమును గడుపగలుగును.

పరిపూర్ణబోధ యందు ఈ గురూపాసన విధిగా నిర్ణయింపబడియున్నది. గురూపాసన ద్వారానే సాధకుడు సర్వార్థసిద్ధి పొందగలడు. ఇతర సాధనలన్నియు ప్రయత్న పూర్వకముగా విసర్జించి కేవల గురూపాసన ద్వారానే సాధకుడు కృతకృత్యుడు కావలసియున్నది. గురు పుత్రుడు కేవల ప్రాపంచిక, అవాంతర సుఖములు నాసించి గురూపాసన చేయరాదు. మిగిలిన ఇతర దేవతల ఉపాసనలవల్ల అవాంతరమైన కొన్ని ప్రయోజనములు లేక ఫలితములు సిద్ధుంచునేగాని ఆత్మ స్వరూప యదార్థ జ్ఞానము సిద్ధింపజాలదు. ఒక్క గురూపాసనయందే సాధకుడు భుక్తిముక్తి క్రియలందు పూర్ణత్వము పొందగలడు. పరిపూర్ణ బోధయందు కృషిచేయు సాధకులు, ఇతర దేవతోపాసనలు, ఇతర సాధనలు చేయవచ్చునా? చేసినచో తప్పేమి? అంటే ఎంతమాత్రము చేయరాదు, ఏలనన, ఎప్పుడైనను మనస్సు ఒకే పద్ధతి యందే ప్రవర్తిల్లునుగాని, రెండు విషయాలపై కేంద్రీకృత మొనర్చుటకు దుర్లభము. అట్లు అథవా నిలిపినచో ఏ సిద్ధియును పొందక ఉభయభ్రష్టుడగును, కావున ప్రప్రథమములో సాధన పద్ధతిలో సాధకుడు అంతః కరణయందు ఒక్క గురూపాసనకే చోటునిచ్చి ఫలప్రాప్తికై తీవ్రసాధన చేయవలెను. పరిపూర్ణ బోధను చెప్పుటకు ముందుగా గురుమూర్తి శిష్యునికి రెండు ముఖ్య షరతులు విధించినారు. "మదిలో నామాట నమ్మి మరి వింటివేని" అనిన్ని "చంచల బుద్ధి మానుంటి వేని" అనిన్ని నిన్ను కృతార్థుని చేతునని గురుమూర్తి శెలవిచ్చినారు. ఈ భావమును శ్రీకృష్ణదేవేంద్రులవారు తమ కందార్థములో "జలము నెడబాయ నొల్లని" అంటూ "ఇతరము మాని గురువునే కొల్చుసుమ్మి" "**నిరతామరమరలేకనీవు సల్ప్రతి వేని** గురుబోధమరుగు సద్గురునిచె తెలిసేవు" అని వుద్ఘాటించినారు. రాజయోగాశ్రమములో గృహస్థు అశరీర పద్ధతిలో ఉనికి గలిగియుండుటకు వలయు శక్తియుక్తులు కూడా గురూపాసన ద్వారానే సంప్రాప్తింప గలవు. గురూపాసన యిహపరముల రెంటియందు జయమొసంగి సర్వార్థసిద్ధి ప్రదమైయున్నది.

కుక్క ఎంత బలసియున్ననూ గోనె బస్తాలు మోయజాలనట్లే ఎంత శాస్త్ర పాండిత్యమున్నా

గురుభక్తి లేక, గురూపాసన చేయక ఎవరునూ జనన మరణ భ్రాంతిరహిత స్థితిని చెందజాలరు. కనుక గురూపాసన శిష్యుని జన్మ రాహిత్యమునకు అత్యంతము ఆవశ్యకమైయున్నది. "నాన్యః పంథాయనాయ" తరించుట కన్యోపాయము లేదు.

3. గురుమంత్ర ప్రభావము

గురు మంత్రము మనగా గురువు శిష్యునికుపదేశించిన మత్రము. మరియొక అర్థములో గొప్ప మంత్రము. అంతకు మించిన మంత్రము, ఇక రెండవది లేదన్నమాట. ఉపదేశ కాలమందు గురువు ఉపదేశించు వానిలో ఏది గురుమంత్రము? ఏదైతే సర్వసృష్టికి అత్యంత మూలకారణమైన పరమాత్మ యొక్క శక్తి సామర్థ్యములు కొనియాడుచూ, సాక్షాత్ ఆ పరమాత్మ యొక్క నిర్ణయమునే తెలియచేయుచు భీజ నిర్మాణము కలిగి అత్యంత శక్తివంతమై యున్నదో అదే గురుమంత్రము. గురు స్వరూపమే, ఈ మంత్రమునకు అధిష్టాన దేవత. గురుమంత్రము మనగా ఎట్టిదో దాని లక్షణములు ఎట్లుండవలెనో మొదలగు విషయములన్నియూ శ్లో॥ "గురుమంత్ర ముఖేయస్య" గురుగీత శ్లోక వాఖ్యనంలో చెప్పబడినది. మంత్ర లక్షణములు విపులీకరింపబడినది. ఈ గురుమంత్ర ప్రభావము తదాచరణ పద్ధతి. గురుమంత్ర సామర్థ్యము అది నిరంతరం అనుష్టించుటవల్ల పరమ ప్రయోజనము ఆ ఫలితాలు ఇచ్చుట వల్ల సాధకునికి గలుగు లౌకిక పారమార్థిక ప్రయోజనము. దీని జపానుష్ఠానము పరమావదియా?. గురుకృప అనగానేమి? అది ఏ రీతిని సిద్ధించును? దేనిని ఆశించి గురుఉపదేశము పొంది అనుష్ఠాన, ఆచరణ, విచారణలు సల్పవలెను? మున్నగు విషయములు విపులీకరించుటయే ఈ వ్యాసము యొక్క ముఖ్యద్ధేశము. ఇందు ముఖ్యముగా పాఠకులకు సులభ గ్రాహ్యమగుటకు కొన్ని గురుగోప్య విషయములు వెల్లడించుచున్నందులకు పెద్దలు మన్నించుదురుగాక! జనన మరణ రూప ఘోర సంసార సాగరంలో మునిగి తేలూచూ తగురీతిని రక్షణ పొంది కృతార్థుడు అగుటకు మానవుడు విధిగా సద్గురు పాదములు ఆశ్రయించవలెను. అట్లు తన్ను ఆశ్రయించిన సాధకులకు జన్మ పరంపర లకు అత్యంత మూలకారణము అయిన పరమాత్మను తెలియచేయుటకు గురువు సాధకునకు మనో ఏకాగ్రత లేక చిత్త స్థైర్యమును ముందుగా చేకూర్చవలెను. అట్లుగాక కేవలము విచారణ మాత్రమే శ్రవణం చేసిన శిష్య అంతఃకరణ దీనిని యదార్థముగా ఆరూఢపరుచు కొనజాలదు. అంతఃకరణ పరిశుద్ధత ఏర్పడదు. ఏకాగ్రత చెందిన గాని ఆత్మసాక్షాత్కార స్థితి కుదురుట, దుస్తరము. వాసనా వాసితమగు మనస్సునకు మల, విక్షేప ఆవరణములనే త్రివిధ దోషములు ఉండుట వల్ల మనస్సు పూర్వవాసనలచే ప్రేరేపింపబడును. క్షణమైన నిశ్చలత లేక చలించుచున్నది. ఇట్టి మనస్సును అరికట్టుట

నాశించుట మాత్రము కోరిక కాదా! అని శంకించపనిలేదు. ఈ కోరిక ఎవరికి ఎట్టి బంధము కలుగచేయదు. గురుపుత్రుడైనవాడు నిష్కామముగా మాత్రమే అనుష్ఠానము గావించవలెను. అట్లు చేయుటవల్ల తనకు కోరకుండానే సర్వార్థసిద్ధి కాగలదు. తానే ఆ పరమాత్మ స్వరూపము అనే అఖండ జ్ఞాన సముపార్జనకై కృషిచేయు వానికి ఇంక ఇతరమైన ఐహిక ఆముష్మిక సుఖములతో పని ఏమి? ఇదియే గురుకృపకు ప్రయోజనము. ఇంకఏమైన వున్నదా? అంటే శ్రీ కృష్ణదేశికేంద్రులవారు గురుకృపను ఇంకా విశేషముగా కొనియాడినారు. ఆ పరోక్షమౌనే మనుజులకు, పరోక్షంబైన బయలు గురుకృపలేకన్... లేని ఎరుకెతాతోలుగా" అని నుడివినారు. గురుస్వరూపము తానగుట మాత్రమే గురుకృపా ప్రయోజనము కాదన్నమాట. తన నిజరూపమైన అఖండపు ఎరుకను, దానికన్యమైన పరిపూర్ణ పరబ్రహ్మము ఎరుకపరచి, ఎరుక భ్రాంతినుండి రక్షించి, సర్వభ్రాంతి రహిత పరిపూర్ణ స్థితి గురుకృప వలన గాని చేకూరనేరదని నిరూపించినారన్న మాట. అంటే ఎరుక, పరిపూర్ణములను వస్తునిశ్చయ పూర్వకంగా తెలియచేసి, ఎరుకభ్రాంతిని పోగొట్టుటకు కూడ గురుకృపసాధనమై వున్నది. గురుకృప ఎంత మహత్తరమైనదో గమనించవలెను. అట్టి గురుకృప ఎట్లు సిద్ధించును? గురుమంత్రానుష్టానము, గురుభక్తివల్లనేనని చెప్పక తప్పదు. గురుమంత్రానుష్టానము వల్ల గురుస్వరూపము తానై పిదప సర్వభ్రాంతి రాహిత్య పరిపూర్ణ స్థితిగూడ గురుకృపా ఫలితంగా శిష్యుడు పొందవలెనన్న మాట. గురుమంత్రము అనుసరించుట వల్ల గురుకృప కలుగును. గురుకృప వల్ల తన జన్మస్థానము వస్తునిశ్చయముగా తెలియబడి, దాని కన్యమైన పరిపూర్ణ పరబ్రహ్మముకూడా తెలియబడి, సర్వభ్రాంతి రహిత రూపమైన పరిపూర్ణ స్థితి గల్గునని పిండితార్థము.

"పునరపి జననం పునరపి మరణం" అన్నట్లుగా జన్మ పరంపరములకు లోనై పరితపించు చున్న మానవులకు ఇక మార్గమేమి? అతనికి ఏపగిదిని శాశ్వత సుఖము కలుగును, అంటే గురూపదేశము వల్లనేనని చెప్పవలెను. "గురూపదిష్ట మార్గేణ మనశ్శుద్ధింతు కారయేత్" అన్నట్లుగా పరిపూర్ణ గురు సాంప్రదాయమును ఆశ్రయించ వలసినదే. గురూపదేశము ఎంతటి వేత్తలకైనా అత్యంత ఆవశ్యకము. గురుబోధ ఆరూఢమై అది తనయందు జీర్ణమగుటకు శక్తి సామర్థ్యములు కావలెను కదా! కేవలము వాచాజ్ఞానము కాక అనుభవ జ్ఞానము కలుగవలెను కదా! అయితే ఎట్లు కలుగును? గ్రంధములోని మంత్రము పఠించుట వల్ల కలుగనేరదు. ఎందు చేతనంటే "గురున్ముఖేన జ్ఞాతవ్యం నాన్యథా గ్రంధకోటిభిః" అన్నట్లుగా ఎన్ని గ్రంధములు నేర్చినా వాచాజ్ఞానమేకాని అనుభవ జ్ఞానము కలుగదు. గురువు మంత్రము ఉపదేశముచేసి ఊరుకొనునా? సాంప్రదాయక గురువు అయితే ఆ మంత్రమును ఏరీతిగా సాధకుడు క్రమేపి అనుష్ఠించి ఆచరించి తరించగలడో వివరంగా వస్తు నిశ్చయ పూర్వకంగా

తెలియచేయును. తానుచేయుచు శిష్యులచే చేయించి కడతేర్చగలడు. "నానాయుక్త్యోప దేశనతారితాశిష్యసంతతి:" అన్నట్లుగా అనేక యుక్తులు చెప్పి తరింపచేయగలడు. గురువు విధించిన అనుష్టాన, ఆచరణ, విచారణలందు కృషిచేయనివాడు గురుపుత్రుడు కానేకాదు. కావున జన్మరాహిత్య మాసించి కృషిచేయదలచినారు, తన స్వగురుమూర్తి వల్ల మంత్రోప దేశము పొంది తదాచరణ పద్ధతిని గ్రహించి సర్వకాల సర్వావస్థలందు కృషియందు యేమరక గురుకృపను పొంది సర్వభ్రాంతి రాహిత్య మోక్షమును పొందుటకు వలయు శక్తి యుక్తులు మంత్రానుష్టాన శక్తిచే పొంది తరించవలసి యున్నది.

4. అధికారలక్షణము-లక్షణయుతుడు

ప్రపంచములో ఏవృత్తి వ్యాపారములు చేయుటకును ఒకానొక అర్హత ఉండి యుండవలెను. శాస్త్రపరిభాషలో ఆపనిచేయుటకు ఆవ్యక్తి అధికారి అని పిలువబడుచున్నాడు. అట్లే పారమార్థిక సాధనలకు కూడా అధికారలక్షణములు నిర్ణయింపబడినవి. ఉపనయనము చేయుటకు 8వ సం॥ బ్రాహ్మణులకు వయస్సుగా నిర్ణయింపబడినది. వేదాధ్యయనమునకు ఉపనయనము కావింపబడినవాడే అధికారి. యజ్ఞ, యాగాదులు ఒనరించుటకు వేదాధ్యయనము చేసిన వ్యక్తియే అధికారి. బ్రహ్మవిద్యయందు సత్కర్మలుచేసి అంతఃకరణ శుద్ధిపొందినవాడే అధికారి, అంతేగాక నిత్యానిత్య వస్తువివేకము, ఇహమూత్రార్థ ఫలభోగ విరాగము, శమాదిష్కటసంపత్తి, ముముక్షత్వము అను సాధన చతుష్టయమును కలిగి యున్నవాడే మహావాక్యోపదేశమును, శ్రవణ, మనన, నిధిధ్యాసలు చేయుటకును అధికారియైవున్నాడు. సాధలన్నియు బహిరంగసాధనలు, అంతరంగసాధనలు అని రెండు విధములు పూర్వపూర్వ సాధనలు, బహిరంగసాధనలనియు, అంతకంటె ఉత్తరోత్తా శ్రేష్టమగునవి అంతరంగసాధనలనియు పేర్కొనబడుచున్నవి. బ్రహ్మవిద్యయందు జ్ఞానమార్గమున సాధన చతుష్టయసంపత్తి కలవాడే అధికారిగా నిర్ణయింపబడినాడు.

జన్మరాహిత్య రూపమైన మోక్షమును సాధించుటకు పరిపూర్ణ బోధ ఏకైక మార్గము. అట్టి పరిపూర్ణ బోధ తెలుసుకొనుటకు అధికారి ఎవరు? పరిపూర్ణ బోధ ప్రతిష్టాపనాచార్యులగు శ్రీ శివరామదీక్షితులవారు పరిపూర్ణ బోధకు అధికార అనధికారులను తాము రచించిన శివరామదీక్షితీయము, శరీర రహితప్రకరణము నందు పేర్కొనియున్నారు. అందు శాస్త్రవాసన, దేవతాభ్రాంతి, జ్ఞాన, భక్తి, వైరాగ్య, కర్మజీవేశ్వరైక్య మున్నగు సాధనలయందు, ద్వైతాద్వైత విశిష్టాద్వైత, మతమతాంతర మార్గములయందు భ్రాంతివున్నవారికి, శాస్త్రవాసన గలవారికి, గురుసేవచేయనివారికి, ఎదురుబడివాదించేవారికి, పరిపూర్ణ బోధ చెప్పవద్దన్నారు. వీరందరిని పరిపూర్ణబోధకు అనధికారులుగా నిర్ణయించినారు. భ్రాంతిరహితం కావలెనని మిక్కిలి

ఇచ్చువున్నవారికి, అనుమానము లేనివారికి, సూచన చేయగానే కనుక్కొనే సూక్ష్మప్రజ్ఞకలవారికి పరిపూర్ణ బోధ చెప్పమని అన్నారు. వీరే పరిపూర్ణ బోధకు అధికారులుగా నిర్ణయించినారు. శ్రీ శివరామదీక్షితులవారి శిష్యపరంపరలో ప్రముఖస్థానము నలంకరించిన భాగవతుల కృష్ణదేశి కేంద్రులవారు సాధన సంపత్తికలిగి, లక్షణయుతుడైనవాడే పరిపూర్ణబోధవినుటకు వుత్తమాధికారిగా సూచించినారు. బ్రహ్మవిద్యాభ్యాసమునకు సాధనచతుష్టయ సంపన్నుడే అధికారియని నిర్ణయింపబడియుండగా పరిపూర్ణబోధకు సాధన సంపత్తి గల లక్షణయుతుడై అధికారి అని నిర్ణయింపబడినది. బ్రహ్మ విద్యాభ్యాసమునకు సాధన చతుష్టయ సంపన్నుడే అధికారి అని నిర్ణయింపబడియుండగా పరిపూర్ణబోధకు సాధన సంపత్తి గల లక్షణయుతుడే అధికారియని, నిర్ణయింపబడినది. ఈ అధికారులిరువురికి గల తారతమ్యమేమి? సాధన చతుష్టయ సంపత్తికిని, సాధన సంపత్తికిని గల వ్యత్యాసమేమి? తెలియవలసి యున్నది.

ఏ సాధనలేక ఏకర్మ చేయవలసియున్ననూ, మానవుడు తన అంత రేంద్రియము లచే ధర్మాధర్మనిర్ణయము చేసి, జ్ఞానేంద్రియములచే విషయపంచకమును గుర్తించి కర్మేంద్రియములచే కర్మ ఆచరించ వలసియున్నది. కనుక ప్రప్రథమములో ఏసాధనకైననూ అంతరేంద్రియ వ్యవహారము జరిగిన గాని ఏకార్యమైననూ జరుపుట సాధ్యము కాదు. జ్ఞానము, మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారము, అనునవి అంతరేంద్రియములు. ఏసాధనయందైననూ ఆ అంతరేంద్రియములలో ఏదో ఒకదానిని, పురస్కరించుకొని సాధనజరుగుచుండును. సాధనలను ముఖ్యముగా 5 తరగతులుగా విభజింప వచ్చును. మంత్రోపాసన, భక్తి, మతనిర్ణయము, యోగాభ్యాసము, తత్వవిచారణ అనునవియే ఆ అయిదు విధములు. ఏ సాధనయైననూ ఈ 5 తరగతులలో ఏదో ఒక తరగతి చెందినదియే గాని ఈ తరగతులలో చేరని సాధన లేదు.

తనయొక్క స్వస్వరూపమును (నిజరూపము) అన్వేషించి తెలుసుకొనుటయే మానవుని ప్రధానలక్ష్యమైయున్నది. తానెవరో తెలిసిన కదా! బ్రహ్మమును తెలియుట సాధ్యమగును. పైన ఉదహరించిన పంచసాధనలలో ఏదో ఒక సాధనను పూని, స్వరూపసాక్షాత్కారము పొందుటకు ప్రయత్నించువాడే నిజమైన మానవుడు. అట్టి కృషిచేయని మానవుడు మానవాకృతిలోనున్ననూ అతడు పశుతుల్యుడే. అందుకే "జ్ఞానేనహీనః పశుభిః సమానః" అని పెద్దలు నిర్ణయించినారు. ఏలననగా! ఒక్క మానవునికే స్వస్వరూపమును తెలియగల జ్ఞానము విశేషముగానున్నది. పశుపక్ష్యాదులకు అట్టి విశేషజ్ఞానము లేదు. మిగిలిన అన్ని విషయములలోను, మానవులకు, పశుపక్ష్యాదులకు సమానలక్షణములే కలిగియున్నవి. మానవ విశిష్టమగు ఈ జ్ఞానము సక్రమముగా వినియోగించలేని మానవుడుకూడా ఒక వింతపశువు (ద్విపాద పశువు) అగుచున్నాడు.

పైన ఉదహరించిన పంచసాధనలలో, ఏ సాధననైననూ దృఢముగా అభ్యసించిన ఎడల అవి ఆత్మసాక్షాత్కారమునకు దారితీయుచున్నది. కనుక అన్ని సాధనలకును చరమ లక్ష్యము ఆత్మసాక్షాత్కారమే కనుక సాధకులు పొందదగు ఉత్తమోత్తమ ఫలం ఆత్మ సాక్షాత్కారమే అయివున్నందున, సాధనసంపత్తి అనగా సాధనలచేత పొంద దగిన ఉత్తమఫలమగు ఆత్మసాక్షాత్కారమే సాధనసంపత్తి. సాధన చతుష్టయ సంపత్తి అనగా, నిత్యానిత్యవివేకాది సాధనలు మాత్రమే. ఈ సాధనచతుష్టయము వలన మాత్రమే ఆత్మసాక్షాత్కారముకాదు. సాధన సంపత్తి అనగా ఆత్మసాక్షాత్కారమే. కనుక ఆత్మసాక్షాత్కారము పొందినవాడు పరిపూర్ణ బోధకు ముఖ్యాధికారి. అంతేకాదు తానాశించిన జన్మరాహిత్యము కేవలము ఆత్మసాక్షాత్కారము వలననే చేకూరజాలదు. అని నిశ్చయము కలిగి ఆత్మసాక్షాత్కారమే మోక్షమగుచో అట్టిమోక్షమునాకు అవసరము లేదు. అని నిరసించినవాడే పరిపూర్ణబోధకు ముఖ్యాధికారి. కనుకనే కృష్ణదేశికేంద్రులవారు "రోసితి మోక్షద్యపేక్షరూఢిగ వినుమీ. నీవిట్టి అరూఢతగనుమీ" అని శలవిచ్చియున్నారు. తమకందార్థములలో మొదటిలోనే లక్షణ యుతమై వినువారికే జన్మరాహిత్యము పరిపూర్ణ బోధచే కలుగునని చెప్పినారు. కనుక లక్షణయుతు లనగా ఆత్మసాక్షాత్కారమును పొందియూ దానివలననే జన్మరాహిత్యము పొందుదునని ఎంచక, అదియే నిజమైన మోక్షమని భావించక, కేవలము జన్మరాహిత్యమునే ఆశించువాడు లక్షణయుతుడు అని చెప్పనగును.

పరిపూర్ణబోధచే జన్మరాహిత్యము సిద్ధించునని నమ్మి, అట్టి ఉత్తమోత్తమమైన బోధపొంది, జన్మతరుణోపాయము పొందుటకు నేటికాలములో సంసిద్ధులై గురువులనాశ్రయించిన వారందరూ, ఇట్టి సాధనసంపత్తి కలిగి, మోక్షమును కూడా కోరి, లక్షణయుతులైయున్న వారేనా? అని యోచిస్తే అట్టివారే అందరును అని చెప్పుట చాలా కష్టము. కనుక సాధారణముగా నేడు పరిపూర్ణ బోధకు చెందినవారిలో పెక్కుమంది పరిపూర్ణబోధకు అధికారులు కారనియే ఒప్పుకొనక తప్పదు. అట్టి అనధికారులను పూర్ణగురువులు శిష్యులుగా ఎందుకు స్వీకరించు చున్నారు? అని ఎవరైననూ ప్రశ్నించవచ్చును. అట్టి అనధికార శిష్యులను, అధికారులుగా చేయు పూచీకూడా గురుమూర్తియే వహించి అట్టి అనధికారులను అధికారులుగా చేయుటకై వారికి తారక, సాంఖ్య అమనస్క, మహా వాక్య, వార్తిక పద్ధతులను క్రమముగా బోధించి, పిదప వారికి ఆత్మ వస్తు సాక్షాత్కారము గావించి, పిదప, ఆ వస్తువు చలనశీలమైయెట్లు వున్నదో, ఎట్లు సృష్టిగా పరిణమించుచున్నదో, ఎట్లు సృష్టి , స్థితి, లయములు లేక ఆవిర్భావ, తిరోభావములు చెందుచున్నదో, ఆయా విధములుగా మార్పులకు లోనయ్యే వస్తువునకును, ఎన్నడూ చలించక ఏ మార్పులూ ఎన్నడూ యెరుగక, ఏక స్థితిలో ఉండు పరిపూర్ణ పరబ్రహ్మమునకు, గల అత్యంత విభిన్నత్వమును

నిరూపించుటరీత్యా మోక్షస్థానమనబడే ఆత్మయందైక్యము చెందిననూ కేవలమగు శాశ్వత జన్మరాహిత్యము కలుగజాలదని ఋజువు చేసి అట్టి ఆత్మ రూప మోక్షమునందు కూడా శిష్యునికి విరక్తి (రోత) కలిగించుటరీత్యా శిష్యుని పరిపూర్ణబోధకు పూర్ణాధికారినిగా గావించవలసియున్నది.

కనుక, మానవుడై పుట్టి, ఐహికాముష్మిక సుఖములయందుగాని, ఆత్మ స్వరూపమోక్షమందుగాని యెట్టి భ్రాంతియు లేక కేవలం జన్మరాహిత్యము మాత్రమే ఆశించిన స్త్రీ పురుషులందరును పరిపూర్ణ గురుసార్వభౌముని పాదములాశ్రయించి గురుకృపకు పాత్రులై పరిపూర్ణ బోధకు అధికారమును సంపాదించి పరిపూర్ణ బోధ తెలుసుకొని జన్మరాహిత్యమును పొందవలసియున్నది.

5. త్రివిధ తపస్సులు

తపః అనగా తపించుట. వేటిని తపింపచేయవలెను? అన్నచో త్రికరణములైన మనః ప్రాణవాక్కులనే అని చెప్పవలెను. ఏలననగా ఒకే అంతఃకరణము మనః ప్రాణవాక్కులుగా ప్రవర్తిల్లి తద్వారా కర్మ చేయుచూ బంధ మోక్షములు చెందుచున్నది. ఈ అంతః కరణయే జ్ఞానేంద్రియములు ద్వారా పంచతన్మాత్రలను గుర్తించి కర్మేంద్రియములు ద్వారా కర్మచేసి, సుఖదుఃఖములు పొందుచూ, సంస్కారయుతమై అనేక నీచోత్తమ జన్మలు పొందుచున్నది. యీ సంస్కార బలము వల్లనే వర్తమాన దశ యందు అనేక పుణ్యపాపకర్మలోనర్చుటకు ప్రేరణ కలుగుచున్నది. మిగిలిన ఉపాధులన్నిటిలో కన్నా మానవ ఉపాధియందు త్రికరణములు హెచ్చుగా వికాసము చెంది సకల ద్వంద్వ రూప వ్యవహారములు చేయుటకు శక్తివంతములై మానవోపాధి ఆధిక్యతను నిరూపించుచున్నది. అందువల్లననే "దుర్లభం మానుషం దేహం" అని నిర్ణయింపబడినది. మానవుడు తన స్వస్వరూపయథార్థ జ్ఞానమును పొంది, శాశ్వత జన్మ రాహిత్యమునకై పరిపూర్ణ బోధను గ్రహించుటకు అధికారియై యున్నాడు. స్వస్వరూపమును పొందుటకు అంతఃకరణ పరిశుద్ధత మానసిక ఏకాగ్రత అత్యంత ఆవశ్యకములు. గురూపాసన ద్వారా ఏకాగ్రతయును, త్రివిధ తపస్సులు చేసి అంతఃకరణ పరిశుద్ధి కలుగ గలదని తెలియవలెను. అంతఃకరణపరిశుద్ధిలేని శాస్త్రజ్ఞానము ఎంతయున్న అది నిష్ప్రయోజనమే కాగలదు. అందువల్ల పారమార్థిక కృషి యందు త్రివిధ తపస్సులు అత్యంత ఆవశ్యకమైయున్నది. కనుక త్రివిధ తపస్సులను విచారించవలసి యున్నది.

మానసిక తపస్సు, వాచిక తపస్సు, శారీరక తపస్సు అని త్రివిధములు. ఈ త్రివిధ తపస్సులను గూర్చి భగవద్గీత యందు క్రింది విధముగా వివరింపబడినది.

శ్లో॥ దేవద్విజ గురుప్రాజ్ఞ పూజనం శౌచ మార్జవమ్
బ్రహ్మచర్య మహింసాచ శరీరం తప ఉచ్యతే॥

తా॥ దేవతలను, బ్రాహ్మణులను, గురువులను తత్వవేత్తలను పూజించుట మరియు శుచిత్వము, సత్ప్రవర్తన, బ్రహ్మచర్యము అహింస అనునవి కల్గియుండుట శరీర తపస్సు.

శో॥ అనుద్వేగకరం వాక్యం సత్యం ప్రియహితం చ యత్
స్వాధ్యాయభ్యసనం చైవ వాఙ్మయం తప ఉచ్యతే॥

తా॥ ఏ వాక్యము ప్రాణులకు దు:ఖము కలిగింపనిదియో, యదార్థమో ప్రియకరమో, అదియును మరియు శాస్త్రాభ్యాసమును
వాచికమగు తపస్సని చెప్పబడును.

శ్లో॥ మనః ప్రసాదః సౌమ్యత్వం మౌనమాత్మ వినిగ్రహః
భావ సంశుద్ధిరి త్యే తత్త పో మానస ముచ్యతే॥

తా॥ ప్రశాంతి, సౌమ్యభావము, మౌనము, ఆత్మనిగ్రహము అంతఃకరణ శుద్ధి అనునది మనస్సుతో నిర్వహింపదగిన తపస్సు అని అందురు. యీ త్రివిధ తపస్సుల ద్వారా త్రికరణములు పరిశుద్ధమగుటయే త్రికరణశుద్ధిగాని కేవలము మనస్సుతో తలచినదే, వాక్కుతో పలుకుట, వాక్కుతో పలికినట్లు శరీరముతో చేయుట త్రికరణ శుద్ధిగాదు. దొంగలు, దుష్టకార్యములొనర్చు సంఘములు కూడ యిట్టి త్రికరణ శుద్ధి పాటించవచ్చును. వారికందరకు అంతఃకరణ శుద్ధి కలుగజాలదు గదా! అయితే, కం॥ మనసున
వాక్కున తనవున పనియొక్కటి జర్పునట్టి భక్తునకుదయన్. వినిపింపుము వినమని ...... అంటూ త్రికరణశుద్ధి గలవాడే భక్తుడు శ్రవణాధికారియని శెలవిచ్చినారే అని శంకించవలసిన అవసరం లేదు. ఏలననగా పారమార్థిక విషయములలో త్రికరణశుద్ధిగా ప్రవర్తించవలెను అని మాత్రమే అర్ధము, పని అనగా గురువు చెప్పిన సాధనాక్రమంలోని పని. ఉదాహరణకు నిత్యానుష్ఠానం చేయుమని గురువు శాసిస్తే, అట్లాగే చేస్తానని గురువు యెదుట నమ్మబలికినపుడు అట్లే చేసే తీరవలెను. అట్లు చేయుటయే భక్తుని విధి. ఆ విధంగా చేసినవాడే భక్తుడన్నమాట వాటిని లౌకిక వ్యాపారములలో త్రికరణ శుద్ధి ప్రవర్తన పాటింపనవసరంలేదని 'అర్థమున్నూ కాదు. త్రివిధ తపస్సులలో నిష్ణాతుడగువానికి లౌకిక పారమార్థిక వ్యవహారముల రెండింటి యందును త్రికరణశుద్ధి ప్రవర్తన సహజమగును. త్రివిధ తపస్సులు చేయని వానికి త్రికరణశుద్ధి కలుగదు. పైన నిర్ణయింపబడిన త్రివిధతపస్సుల ద్వారా సత్వగుణము పెంపొంది అంతఃకరణశుద్ధికలిగి ఆత్మ జ్ఞానము పొందుటకు అర్హత కలుగునని గీతయందు స్థూలముగా నిర్ణయింపబడినది.

సప్తాన్నములలో, పశువులకు తృణాదులు, మానవులకు ధాన్యాదులు, పితృదేవతలకు శ్రాద్ధతర్పణాదులు, దేవతలకు హవిస్సులు, క్షుద్రదేవతలకు బలులు, ఆత్మకు, మనస్సు, వాక్కు, శరీరములు అన్న స్వరూపముగా చెప్పబడినవి. కావున త్రికరణములే ఆత్మకు ఆహారముగా చెప్పబడియున్నది. త్రికరణములు అపవిత్రముగా నున్నచో ఆత్మకు అపవిత్రాహారమిడిన వాడగును. వాని ఆత్మ మలినముగా నుండును. త్రికరణశుద్ధికలిగి అంతఃకరణ శుద్ధిగావించినవానికి సులభముగా ఆత్మ స్వరూప నిశ్చయ జ్ఞానము కలుగగలదు. కావున **ఆత్మోన్నతికై** పాటుపడు ముముక్షువు ముందుగా త్రివిధ తపస్సుల ద్వారా అంతఃకరణ శుద్ధి పొందక చేయు పారమార్థిక సాధలన్నియు వ్యర్థములే అగును.

ఈ త్రివిధ తపస్సులు ఏమి? అన్నచో శరీరము ద్వారా తనవంటి సాటి మానవులందరుకు ఉపకరించు, సమష్టిశ్రేయోదాయకమగు కర్మలు యజ్ఞరూపంగా ఫలితమాసించక చేయుట, పరబ్రహ్మనిర్మితమగు వాక్కుద్వారా తను పారమార్థిక కృషియందుచేయు విధానము తోడి మానవులకు ప్రబోదించి వారిని అజ్ఞానము నుండి మేల్కొల్పుట, మనస్సు ద్వారా సర్వమానవాళికి ఉపకరించు ఆలోచన చేయుచు, సంఘశ్రేయస్సుకు పాటుపడుచూ మానవతా ధర్మమును కాపాడుట యిట్లుగాక తపస్సు అనగా ఏ అరణ్య ప్రాంతమున కోపోయి ఏకాంతముగా మౌనస్థితిలో నుండుట కాదు. అట్లు చేయుట వలన స్వార్ధముచే అధోగతి పొందును. సత్యవాక్పరి పాలన "పరోపకారార్థ మిదం శరీరం" అన్నట్లుగా పరోపకారం కొరకు శరీరవాగ్మనస్సుల ద్వారా, సమష్టి శ్రేయోదాయకమైన క్రియలుచేయుటయే నిజమైన తపస్సుగా చెప్పవలెను. వీనిని పై విధముగా తపింపచేసినవానికిగాని అంతఃకరణశుద్ధి కలుగజాలదు. అంతఃకరణ శుద్ధి లేనిదే ఆత్మావతరణము కలుగజాలదు.

త్రికరణశుద్ధిరూప ప్రవర్తన ద్వారా మానవుడు మాధవుడుగా మారి ధార్మిక జీవనము గడుపుట స్వధర్మమైయున్నది. అట్లుకాక వాటిని నిరుపయోగము గావించినచో పారమార్థికముగా భ్రష్టుడగును, మరల మరల నీచయోనిప్రాప్తిచెందునేగాని జనన మరణ రహితరూప మోక్షమును ఎన్నడూ పొందజాలడు.

6. జన్మరహితము - సాధనలు

పరమాత్మ సృష్టియందుగల 84 లక్షల జీవోపాధులయందు మానవోపాధి సర్వశ్రేష్ఠమైనది. ఎందుచేతననగా మిగిలిన ఉపాధులలో కర్మశరీరమో, జ్ఞానశరీరమో ఏదియో ఒకటి మాత్రమే హెచ్చుపాళ్ళలో నిర్మింపబడెను. కాని మానవోపాదియందు కర్మచేయుటకు అనుకూలమగు స్థూల శరీరము, అఖండాత్మక దృష్టితో తనమొక్క నిజస్థితిని గుర్తించి, ఉపాధిని పవిత్రమొనర్చుకొను జ్ఞానశరీరము రెండునుకలిసి ఒకరూపముగా పోతపోసినట్లుగా నిర్మింపబడెను. తనయొక్క జ్ఞానస్తితి వల్ల పరిసరప్రాంతములు తనకు అనువుగా చక్క చేసుకొని వాటి ఫలితములు అనుభవించుచు సుఖ దుఃఖములు పొందుచున్నాడు.

మానవజన్మ తరుణోపాయమునకు ధర్మ, అర్థ, కామ, మోక్షములను నాలుగు సాధనలు నిర్ణయింపబడినవి. ఇవి ఒకదానితో ఒకటి జతపడి మానవ జన్మను పవిత్రతచేయుటకు హేతుర్భూతములగుచున్నవి. వీనిని విడివిడిగా అభ్యసింపక వీని కూడలి స్థానమును గుర్తెరిగి అభ్యసింపవలేనేగాని, వేరువేరుగా విచారించినచో అనర్ధదాయకమగును. కేవలము అర్ధసంపాదనయో ధర్మసంపాధనయో, కామసంపాదనయో, మోక్షసంపాదనయో ఏదియో ఒకదానిని అభ్యసించి నిజస్థితిని గుర్తించలేక అధోగతిపాలగుచున్నారు. ఇదిగాక వీనిని క్రమశావిచారించి వేటియందు ఏమరక కృషిచేయువాడు నిజమైన మానవుడు. తాను త్రికరణశుద్ధితో కూడిన ఆచరణయందు ధర్మము తప్పనివాడై కనీసావసరములకు సరిపడు ధన సంపాదన, తన శీలమును కాపాడుకొను కామ్యవృత్తి. జన్మ తరుణోపాయమగు మోక్షరూప సాధనలు చేయుట నిజముగా మానవునిగా పుట్టిన ప్రతివాని విధ్యుక్త ధర్మమైయున్నది. ఇదిగాక అన్యాయ ధనసంపాదన తీవ్రకామ్యభోగశక్తి, ధర్మమును వీడి, తన నిజస్థితిని గుర్తించుటకు శక్తిలేక, అంత:కరణమును మలినమొనర్చుకొని జన్మపరంపరలకు లోనగుట నిజముగా పశు లక్షణము.

మేఘమండలమునుండి బిందు రూపముగా నేలపైబడి నదులై అవి స్వస్థలమగు సముద్రము నందు చేరుట సహజము. అట్లే అనేక జన్మపరంపరలకు లోనై సుఖదు:ఖములుపొందుచు, జన్మతరుణోపాయమును వెదుకుటకు మానవునిగా జన్మించిన ప్రతివాడు కోరుట సహజము. ఈ లక్ష్యమునకు విభిన్నమార్గములు నిర్ణయింపబడినవి. తన విజ్ఞానమును పురస్కరించుకొని కర్మ, భక్తి, జ్ఞాన, వైరాగ్యములను అవలంభించి, అష్టాంగ సాధనలు చేసి, అణిమాది అష్టసిద్ధులు పొంది మహావాక్యములను విమర్శించి, ప్రత్యగాత్మ పరిమాత్మలకు ఏకత్వమును గుర్తెరిగి తన నిజస్థితిని గుర్తించుటకు యత్నశీలుడగుచున్నాడు. ఆ సాధనలన్నియు అంతరేంద్రియములని చెప్పబడు జ్ఞానమనో, బుద్ధి, చిత్త, అహంకారములను పురస్కరించు

కొనియే నిర్ణయింపబడినవి. ప్రతియొక్కరుకూడా జన్మరహిత మోక్షస్థితిని పొందవలెనను సంకల్పముతో ఈ సాధనలందు కృషి చేయుచున్నారు. కాని వీరిలో నిజముగా జన్మకారణ వస్తువు ఏది? తాను ఎవరు? మోక్షము దేనినుండి? మున్నగు ప్రశ్నలకు సంపూర్ణ వివరణము తెలియకనే వివిధవిధాలను అనుసరించి తాము తెలుసుకున్నంతవరకు తృప్తి చెంది గమ్యమును చేర కున్నారు. స్థూలశరీర ధారణయే జన్మమని దానికే జనన మరణములని దానినుండియే విడుదల పొందవలెనని చాలమంది అపోహ. కాని ఇది విజ్ఞాన దృష్టికి చాలా అసమంజసమైన విషయము ఆత్మనుంచియే సర్వము సృష్టింపబడినవని ఉపనిషత్తులు, వేదములు చెప్పుచున్నవి. కనుక ఆత్మయే సర్వసృష్టికి ఆధారము, అధిష్ఠానముగాను ఉన్నది. శ్రీకృష్ణదేశి కేంద్రులవారు తమ కందపద్యములలో "జ్ఞానమునకు జన్మమొక్కటి కలిగెగదోయి" అని శలవిచ్చినారు. ఇదియే 84 లక్షల జీవోపాధులను సృష్టించి, వాని కర్మను తనయందు దాచుకొని అనేక జన్మపరంపరలకు హేతుర్భూతమగుచున్నది. "ఎరుక అనియెడి ఆటాడించేవాడు అతడేరా కర్త" అని కందార్థమందు చెప్పబడినది. త్రివిధ కర్మలకు కూడా ఈ ఆత్మయే ఆధారము. కనుక కర్మ సిద్ధాంతమునుసరించి కర్మయే జన్మలకు కారణమని గుర్తించి ఈ కర్మరూప జ్ఞానమునుండి పూర్తిగా విడుదల పొందిననాడే నిజముగా జన్మ రహితమగును. ఈ నిర్ణయమునే దేశికప్రభువులు తమ కందపద్యములలో "ముడిపడి కర్మము జ్ఞానమువిడువక నా రెండు వెలసె విశ్వమననదే కడువేడ్క బయలుగనెనా, గడియైనను నిల్వలేక కల్లయిపోవున్" అని నిర్ణయించినారు. నిరాలంబోపనిషత్తు "భ్రాంతి రహితమిదం మోక్షం" అని మోక్షశబ్దమును నిర్వచించెనది. ఇటువంటి భ్రాంతిరహిత మోక్షస్థితి ఒక్క పరిపూర్ణబోధవలన తప్ప అన్యసాధనల వల్ల లభ్యముకాదు.

ఇటువంటి భ్రాంతిరహిత మోక్షస్థితిని పొందవలెనని తీవ్రసంకల్పము కలవారు ముందుగా సాధనసాధ్యమగు తన నిజరూపమైన ఆత్మతత్వమును ప్రప్రథమముగా గుర్తించి తనస్థితిని వీడినగాని పరిపూర్ణ బోధ శ్రవణములకు అర్హులు కారు. ఆత్మ నిశ్చయము పొందుటకు అనేక సాధనలు నిర్ణయింపబడినవి. పరిపూర్ణ పరబ్రహ్మము ఏ సాధనలచేతను తెలియబడదు. అన్ని నిర్ణయములుచేయు అఖండ ఎరుకకు అందు ప్రవేశించుట స్థానముకూడ లేదు. ఆత్మనిశ్చయ జ్ఞానము పొందుటకు నిర్ణయింపబడిన సాధనములలో ముఖ్యముగా నిత్యానిత్య వస్తు వివేకము, ఇహాముత్రార్థ ఫలబోగ విరాగము, శమాది షట్క సంపత్తి, ముముక్షత్వము అనునవి చెప్పబడినవి. ఇవి పూర్తిగా విచారించి తెలుసుకున్నవారు తమ నిజస్థితిని గుర్తించు, అవకాశము కలదు. నిజస్థితి అయిన ఆత్మను గుర్తించినంత మాత్రమున జన్మరహితము కాదు. ఎందుచేతననగా ఆత్మ నుండి మరల సృష్టివికసించి, జీవేశ్వర

జగద్రూపముగా పరిణమించుచున్నది. ఈ సృష్టికి పూర్వస్థితిని చూచి అదియే అచలమని కొందరు భ్రాంతి చెందుచున్నారు. కాని ఇది కేవలాచలస్థితి కాదు. కేవల అచలమైనది ఒక్క పరిపూర్ణ బ్రహ్మము మాత్రమే. ఆత్మయందు సృష్టికి పూర్వము జీవేశ్వర జగత్తు మర్రి విత్తనమందలి మర్రిచెట్టు రీతిగా నిగూఢముగా బీజరూపముగా నుండి మరల సృష్టికోన్ముఖము అగుచున్నది. కనుక ఆత్మయే జన్మకారణమని చెప్పబడినది. శివరామ దీక్షితులవారు "సర్వభ్రాంతులకు మూలం మూలంలేని ఈ గుర్తెరిగే శరీరమని" సిద్ధాంతీకరించినారు. కావున జన్మరహితమాసించి కృషిచేయు ప్రతివారు కూడా ముందుగా సాధనలుచే తెలియబడు ఆత్మను గుర్తెరిగి తరువాత దానివల్ల మోక్షము లేదని గుర్తించి, పరిపూర్ణ గురువు చెంత చేరి భ్రాంతి రహితము గావించుకొనుటయే ఉత్తమము. సాంప్రదాయక పద్ధతులు తెలియని కొందరు తమ వద్దకు వచ్చు శిష్యులకు "ఏసాధన నీకెందుకు వీసానికి పనికి రాదు" అని బోధించి తాము చెడినదేగాక వారిని భ్రష్టులుగా నొనర్చు చున్నారు.

అన్ని సాధనలు చేసి వాని గమ్యమగు ఆత్మను గుర్తెరిగినవానికి దానివల్ల జన్మరహితము కాదని ఏ సాధనలు లేని పరిపూర్ణస్థితిని నీకు కలిగింతును. సాధనలు అన్నియు మాని స్థిరబుద్ధితో నుండమని, అభయప్రధానము గావించును. ఈ నిర్ణయము తెలియక తమ జన్మమును చేతులారా వ్యర్థము గావించు కొనుచున్నారు. "కేవల మోక్షాపేక్ష సంకల్పోబంధః అని ఉపనిషత్తు చెప్పుచున్నది. కనుక జన్మరహితమోక్షస్థితిని ఆశించిన ప్రతీమానవుడు పూర్ణ గురువు చెంతచేరి, వారికి సేవాశుశ్రూషలు చేసి మంత్రసిద్ధిపొంది వారికృపచే ఆత్మనిశ్చయము పొంది దానివలన కూడా మోక్షము లేదని గ్రహించి పరిపూర్ణ స్థితిని పొందుటయే ప్రథమ కర్తవ్యము, దీనినే పరమపురుషార్థమందురు. ఇదితప్ప మిగిలిన మార్గములు వల్ల జన్మరహితము కాదు. కావున ఉత్తమోపాదియందుండు మానవులందరూ గురు పదములు ఆశ్రయించి నిజసాంప్రదాయమును గుర్తించి జన్మరహితం చేసుకొని కృతార్థులు కావలసియున్నది.

7. శరణాగతి

శ్లో॥ శ్రవణం, కీర్తనం, స్మరణం, విష్ణోః పాదసేవనం, అర్చనం, వందనం, దాస్యం, సఖ్యం ఆత్మ నివేదనం॥ అని నవ విధ భక్తుల నిర్ణయము. వీనియందు ఆత్మ నివేదన రూపమైన శరణాగతి చివరిది. నవవిధ భక్తులు సోపానక్రమముగా చెప్పబడినవి. విభీషణ, శరణాగతి చాలా వుత్కృష్టమైనది. శరణాగతి అనగానేమి? విభీషణ శరణాగతికి అంత ప్రాధాన్యత ఎందుకు కల్గినది? భగవద్గీతలో శ్రీకృష్ణుడు అర్జునికి బోధించిన శరణాగతి యొక్క నిజాభిప్రాయమేమి? శరణాగతి అను పదమునకు సాంప్రదాయ పద్ధతిగా నిజార్థము ఎట్లు నిర్ణయింపబడినది? మున్నగు విషయములు చక్కగా విచారించి తెలుసుకొనవలసియున్నది. ''శరణాగతి'' అనగా తనకున్న సర్వస్వమునాది అనే అభిమానము వీడి తాను దైవస్వరూపముగా తలంచుచూ పూజించువారికి త్రికరణశుద్ధిగా భావనా రూపముగా ధారబోయుటయే శరణాగతి. తన సోదరుడు తన్ను చంపను ద్యుక్తుడైనపుడు దుష్టునిచేత చంపబడుటకంటె ఆశ్రీరామ చంద్రుని చరణములవ్రాలి జన్మ సార్థకపరుచుకొనవలెనని ఎంచి విభీషణుడు రాముని చెంతకు వచ్చి నన్ను రక్షించినా, శిక్షించినా నీదేభారము అని సర్వార్పణబుద్ధితో శ్రీరాముని చరణములపై వ్రాలెను. అట్టి పరిస్థితిలో రాముడు విభీషనుని శత్రువునిగా భావించి వధించినా శిష్యునిగా తలంచి రక్షించినా ఆయన నిర్ణయమునకే వదలి విభీషణుడు శ్రీరాముని శరణాగతి కోరెను. అపుడు రాముడు తన పక్షమువారు ఎంతవలదన్నా విభీషణుని ఆత్మ నివేధన గ్రహించినవాడై అభయమొసగి రక్షించెనని రామాయణమునందు చెప్పబడినది. శరణాగతి అనునది భక్తికి పరాకాష్ట.

ఇకపోతే యుద్ధరంగమందు తన సోదరులను, బంధువులను, గురువులను చూచి మోహపరవశుడై యుద్ధమును మాని, భిక్షాటన చేయుదునని కింకర్తవ్యతా మూఢుడై, రథముపై చతికిలబడిన అర్జునుని శ్రీకృష్ణుడు కర్తవ్యోన్ముఖుని గావించిన పద్ధతి ఇంచుక విచారించవలసియున్నది. శ్రీకృష్ణుడు భగవద్గీతలో చిట్టచివర 'సర్వధర్మాన్' పరిత్యజ్య మామేకం శరణం వ్రజ, అహంత్వాం సర్వపాపేభ్యో మోక్ష ఇష్యామి మాశు చ॥ అని, ఆ విధముగా చేసినచో నీకు పుణ్యాపాపములు అంటవని శిష్యుడగు పార్థునికి ఆజ్ఞాపించినాడు. సర్వధర్మములు విడనాడి గురువునగు, నన్ను ఒక్కనినే శరణుబొందుము. నేను నిన్ను రక్షించగలను అని అభయమిచ్చినాడు.

జనన మరణ రూప ఘోర సంసార వారాశిలో చిక్కి నిలకడ లేక తల్లడిల్లుచూ విముక్తిని కోరు విజ్ఞానవంతుడగు మానవుడు ఏ విధముగా తన కర్తవ్యము అనగా స్వధర్మమును నెరవేర్చుకొనవలెనో ఇంచుక విచారించవలసియున్నది. తన జన్మకు అత్యంత

మూలాకారణమగు పరమాత్మ స్థానమును తాను స్వయంగా తెలుసుకొనుటకు శక్తి లేక, యెవరు తెలియ చేతురా అని పరితంపించుచూ తన పూర్వజన్మ సుకృతమువల్ల పరిపూర్ణ గురువును చేరి తనకున్న సర్వస్వము త్రికరణశుద్ధిగా నివేదించుటయే కర్తవ్యము. ఈ భావమునే స్కాంధ పురాణాంతర్గతమగు గురుగీతలో "శరీరమింద్రియం ప్రాణమర్థస్వజన బాంధవాన్, ఆత్మ దారాధికం సర్వంసద్గురుభ్యోని వేదయేత్" అని నుడివినది. ఇందు "నివేదన" అను మాటను శ్రద్ధగా విచారించవలసియున్నది. నివేదన అనగా కేవలము భావనా రూపముగా గురుపరమాత్మకు అర్పించుటయే. గురుమూర్తికి ఇవి అన్నియు ఎందుకు అర్పించుకొనవలెను? అని ప్రశ్నించుకొన్నచో వాని యందలి తీవ్రమైన అభిమాన రూపమైన మోహబంధము చేతను కదా తాను వాని కొరకు పుణ్యాపాప కర్మ లాచరించి సంస్కారములు పెంచుకొని జన్మ పరంపరలకు లోనగుచున్నది? తనయందు కర్మచేయు అంగములేవి? అన్నచో ముఖ్యముగా శరీరము, మనస్సు, వాక్కు, వీని ద్వారనే తాను పుణ్యాపాపకర్మలు, చేయుచున్నాడు. ఈ త్రికరణములు ఏ విధముగా ఏర్పడినవి? సృష్టికి పూర్వము "ఏకమేవా అద్వితీయం 'బ్రహ్మ' అయివున్న పరమాత్మ సృష్టిలోనికి వచ్చినపుడు మనఃప్రాణ వాక్కులుగా స్థూల పరిణామము చెందినది. ఈ భావమునే ఛాందోగ్యోపనిషత్తులో "ఆత్మ రు ఏకసన్ ఏతత్రయం, మనః ప్రాణవాచో సంఘాతంసత్తా" అని పేర్కొన్నది. అందువల్ల ఆత్మ యొక్క స్థూల పరిణామమే ఈ మనస్సు ప్రాణము (శరీరము) వాక్కు, ఇవి వస్తుతః ఆత్మ స్వరూపమే అయివున్నది. మనః ప్రాణముతో కూడిన సూక్ష్మ శరీరమే కదా! జన్మ జన్మాంతరములకు లోకాంతరములకు యానత్రయములో ప్రయాణము చేసి బంధములో చిక్కి ఉపాధి గతమై మోక్షము కావలెనని కోరుకొను చున్నది.

ఈ త్రికరణములను గురుపాద సన్నిధిని తనవి కావు, ఇవి గురుసొత్తే అను భావనతో వానిని గురుమూర్తి నియోగించిన పద్ధతిగా నడుపుటకు ప్రప్రథమములో గట్టిగా ప్రయత్నించవలెను. కర్మయే జన్మ కారణము. 'కర్మమున బుట్ట జంతువు. కర్మమున వృద్ధిపొందు కర్మమున జెడు, కర్మము జనులకు దైవము, కర్మము, సుఖదుఃఖములకు కారణమధిపా" అని కదా కర్మ సిద్ధాంతము. కర్మకు త్రికరణములు ఆధారము. శ్రీకృష్ణ దేశి కేంద్రులవారు "ముడిబడి కర్మము. జ్ఞానము, విడువకనా రెండు వెలసె విశ్వమననదె" అంటూ కర్మ జ్ఞానముల స్వరూపమే ఈ విశ్వమని నిరూపించినారు.

పై విధముగా తనయందు నిర్మింపబడి జన్మకర్మలకు కారణమగు మనస్సు, వాక్కు, శరీరములను గురుమూర్తికి అర్పణ చేసి, వానిని ఆత్మ నిర్ణయ పద్ధతిగా నేను. నాది అను వ్యష్టి అహంకార మమకారములు వీడి గురు నిర్ణయానుసారము. నడుపుట ముందుగా గురుపుత్రులైనవారు, నేర్వవలసియున్నది. పరిపూర్ణ బోధకు అధికార నిరూపణలో "మనసున,

వాక్కున, తనువున, పనియొక్కటి జరుపునట్టి భక్తునకు దయస్ వినిపించుము" అని నిజ భక్తుని గూర్చి శ్రీకృష్ణ దేశికేంద్రుల వారు నిర్ణయించినారు. ఈ భావమునే మరియొక చోట వెల్లడిస్తూ "శరణాగతుడగు శిష్యుని కరుణామృత దృష్టి చేత గని" పరిపూర్ణ భావము చెప్పినట్లుగా ఉల్లేఖించినారు. ఇచ్చట "శరణాగతి" అనగా త్రికరణములను గురుమూర్తికి సర్వార్పణ బుద్ధితో ధారబోయుటయే. అపుడు తనకు ఇక కర్తవ్యము లేదు. అందువల్ల కర్తృత్వము లేదు. ఈ విధముగా తనయందున్న వ్యష్టి అహంకారము గురుమూర్తికి ధారబోయుట ద్వారా నాశనమగుచున్నది. త్రికరణశుద్ధిగా ప్రవర్తించుచూ గురువుని సంతోష పెట్టుటయే కదా,ఆత్మ శుశ్రూష యొక్క నిజాభిప్రాయము.

ఇకపోతే జన్మజన్మలకు కారణమగు ఈ త్రికరణములను నివేదన పద్ధతిగా ధారబోసినచో శాశ్వతమైన జన్మరహితము కలుగునా! యిది కూడా చాలదనియే చెప్పవలెను. ఏలననగా యిది వరకే తను మన ధనముల ధారబోసియుండినను "ఎరుకను గురుదక్షిణగా మరి వేగిరమివ్వు" మని శిష్యుని హెచ్చరించుచున్నాడు. ఆత్మస్థానము తెలియబడినా మరల తిరోభావము చెందు స్థితిగతులు ఆత్మకు స్వభావక్రియలు. కావున శ్వాశత జన్మరాహిత్య మాసించి కృషి చేయువారు జన్మ అత్యంత మూల కారణమగు అధిష్టాన చేతన పరబ్రహ్మయందలి భ్రాంతి కూడా నాశనము చేసుకొనవలెను. లేనిచో మరల జన్మ తప్పదని చెప్పి తీరవలసినదే. "సర్వ భ్రాంతులకు మూలం మూలలేని యీ గుర్తెరిగే శరీరం"అని శ్రీ శివరామ దీక్షితులవారున్నూ " ఆత్మవస్తుకా మాయ సర్వం ప్రియం భవతి, భ్రాంతి రహితమిదం మోక్షం" అని శ్రుతులున్ను ఉద్ఘోషించుచున్నవి. ఎరుకకు కూడ వేరు నెరిగి త్రవ్వితే తప్ప శాశ్వత జన్మ రహితంకాదు అని చెప్పవలసినదే. ఇప్పుడీ భావముతో "శరణాగతి" అను పదమునకు అర్థమును విచారించినచో ఎరుకను వీడుటయే అని స్ఫురించుచున్నది. ఈ ఎరుకను వీడుట ఎట్లు? అన్నచో "ఎరుకను విడిపించలేరు ఎవ్వరు ధాత్రిన్,గురుడొక్కడు తప్ప" అని నిర్ణయమున్నది. కావున, స్థూల రూపమైన వానిని వదలకనే అన్నింటికి కారణమైన ఆత్మను వదులుటయే నిజమైన శరణాగతి. ఈ భావన దృఢమగుటకై నిత్యము గురుపుత్రుడు, తన గురుమూర్తికి ద్వాదశ సాష్టాంగ నమస్కార రూపముగా సర్వము భావనా రూపంగా అర్పించుచున్నాడు. తన సర్వస్వము గురునికర్పించి, యే విధముగా శిష్యుడు వ్యవహరించును అనగా "ముట్టక వ్యవహరించుమని గురుని ఆజ్ఞ. ఈ పద్ధతి నిజ గురువుల చెంతనే నేర్వవలసియున్నది. ఈ భావమునే శ్రీకృష్ణుడు అర్జునునికి బోధించినాడు. అదియే నిజమైన శరణాగతి. యిట్లు విచారించి గురుమూర్తి దివ్యశ్రీ చరణములను అండగాగైకొని, భుక్తి, ముక్తి క్రియలందు పూర్ణయోగం పూని, అన్యోన్య సహకారము,ఐహికాకాముష్మికా పురోభివృద్ధి గాంచి జన్మ సార్థకత గాంచి తరించవలసియున్నది.

8. జన్మ రహిత విధానం

పరమాత్మ సృష్టియందుగల 84 లక్షల జీవోపాదులలో మానవోపాధి అత్యంత ఉత్తమమైనది. దుర్లభమైనది. కర్మ, జ్ఞాన శరీరములు సమ్మిళితమగు వివేకవంతమైన ఉపాధి కనుకనే ఈ మానవోపాధికి అంత ప్రాధాన్యత ఇవ్వబడింది. తనయొక్కయు, తనకు ఆధారముగా కానవచ్చు, ఈ చరాచర ప్రపంచము యొక్కయు పరస్పర సంబంధమును యీ రెంటికి మూల కారణమగు ఆది తత్వమును కూడా గ్రహించి జన్మ తరుణోపాయమును పొంది తరించి అన్యులను కూడా తరింపచేయు శక్తి యుక్తులు కూడా, ఈ మానవోపాధికి మాత్రమే కలవు. మిగిలిన ఉపాధులందు యింద్రియములశక్తి ఏ కొద్దిగానో ఉన్నప్పటికి మానవోపాధియందు మాత్రము సంపూర్ణ వికాసము చెంది జ్ఞానేంద్రియములు ద్వారా విషయ పంచకమును గుర్తించి అంతఃకరణమునకు నివేదించి పరమాత్మ నిర్ణయ పద్ధతిగా కర్మేంద్రియములచే కర్మయొనర్చుటకు అనువైన పరిస్థితి ఈ ఉపాధియందు మాత్రమే కలదు.

మానవజన్మకు సార్థకత ఏది? జన్మకారణమేమి? జన్మరహితము గావించుకొనుట అవసరమా? అందుకు సరిఅయిన మార్గమేమి? శాశ్వత జన్మరాహిత్యము ఏ విధముగా చేకూరును? మున్నగు విషయములు విచారించవలసియున్నది.

మానవునికి చతుర్విధ పురుషార్థములు నిర్ణయింపబడినవి. అవి ధర్మ, అర్థ, కామ, మోక్షములు ధర్మపద్ధతిగా ధనమును సంపాదించి, ధర్మ పద్ధతిగా కోర్కెలను నెరవేర్చుకొనుచూ, తన మూలస్థానమును గుర్తించి, దాని రహితమునందు తప్ప జన్మరాహిత్య మోక్షము సిద్ధించదని, మానవుడే తెలుసుకొనగలడు. ఇందు మోక్షమనునది పరమపురుషార్థము. చరమ లక్ష్యము. ముందుగా తాను బంధమందు చిక్కుకున్న కదా! తనకు మోక్షావసరము. ఏ బంధ మునందు తాను చిక్కుకొనెను? అనగా సంసార బంధమునందే? సంసారమనగా ఎండిపోని ప్రవాహ రూపమగు జన్మపరంపరలో "పునరపిజననం, పునరపి మరణం" అన్నట్లుగా జీవుడు పుట్టుచూ, చచ్చుచూ మరల పుట్టుచూ చక్రభ్రమణము రీతిగా తిరుగాడుచూ కర్మత్రయముచే బద్ధుడై క్షణమైన శాంతి లేక తల్లడిల్లుచున్నారు. అందుకూ "జన్మదుఃఖంజరాదుఃఖం జాయాదుఃఖం పునః పునః, సంసార సాగరం దుఃఖం తస్మాత్ జాగ్రత్త జాగ్రతా॥ అని పెద్దలు హెచ్చరించుచున్నారు.

ఈ సుఖ దుఃఖములతో కూడిన జన్మ ఏ విధముగా కలుగుచున్నది తెలియనిదే, జన్మ రహితమునకు మార్గమును ఎట్లు అన్వేషించగలము? కావున ముందుగా జన్మ ఏ తీరుగా కలుగుచున్నది విచారించవలసియున్నది. "కర్మమున బుట్టు జంతువు కర్మమున వృద్ధిపొందు

కర్మమున జెడున్, కర్మము జనులకు దైవము, కర్మము సుఖ దుఃఖములకు కారణమధిపా'' అని కదా కర్మ సిద్ధాంతము. కర్మయే జన్మపరంపరలకు అత్యంత మూల కారణమని తెలియుచున్నది. తాను చేసుకొన్న శుభాశుభ కర్మల సంస్కారములను పురస్కరించుకొనియే తనకు నీచోత్తమ జన్మలు ప్రాప్తించుచున్నవి. ఆగామి సంచిత ప్రారబ్ధములను కర్మ చక్రమందు తగులుకొని సంచితము నుంచి తెచ్చుకొన్న ప్రారబ్ధము అనుభవించుచూ, మరల ఆగామి రూపముగా నూతన సంస్కారములు ఏర్పరుచుకొని, ప్రారబ్ధ శరీర పతనానంతరము సూక్ష్మ శరీరముతో జీవుడు లోకాంతరములకు, యానత్రయములలో పయనించి స్వర్గ నరకములు అనుభవించుచూ, బంధమునందు తగులుకొని అనేక నీచోత్తమ ఉపాదులు పొందుచూ, ప్రశాంతి లేక తల్లడిల్లుచున్నాడు. ఇదియే సంసారము. కర్మ యెట్లు జరుగుచున్నది? అన్నచో ముఖ్యముగా త్రికరణములు ద్వారా జరుగుచున్నది అని చెప్పక తప్పదు. ఏలననగా మానవుడు మానసికముగా వాచికముగా శారీరకముగా పుణ్యపాప కర్మలు చేయుచున్నారు. ఈ త్రికరణములను ధర్మపదములో ఏకపద్ధతిగా ప్రవర్తింపచేసినచో అంతఃకరణ పరిశుద్ధి కలిగి పరమాత్మ వస్తువు తెలియబడుటయు, వక్రమార్గమందు చేసిన నీచయోని ప్రాప్తియు కలుగుచున్నది. ఈ త్రికరణములు ఒక్క మానవోపాధియందు మాత్రమే సంపూర్ణ వికాసము చెందియున్నవి. సంస్కారముల మూట, వాసనలకు పుట్టిల్లు అనదగు మనస్సు దాని కావరణమైన ప్రాణముతో జతపడి లింగశరీరమను పేరుతో జన్మపరంపరలలో సుఖదుఃఖములు శోక మోహములు పొందుచుండును. ఈ బంధము నుండి శాశ్వతమగు విడుదల అనగా మోక్షమును కోరుకొనుచున్నది. " మన ఏవమనుష్యాణాం కారణం బంధ మోక్షయో" అని శృతివచనము. ఈ త్రికరణములు సప్తాన్న విభజనలో ఆత్మకు ఆహారముగా చెప్పబడినవి. త్రికరణ శుద్ధిగా పరమాత్మ నిర్ణయానుసారము ఆచరణ కలిగి శాశ్వత జన్మరాహిత్యము పొందుటయే మానవుని యొక్క స్వధర్మము. "మానవునిగా పుట్టినందులకు సార్థకము యిక పుట్టుక లేకుండా చేసుకొనుటయే" అని పెద్దల సూక్తి. జన్మరాహిత్య మోక్ష స్థితిని పొందుటకు మార్గమును అన్వేషించుట వివేకము గల మానవుని విద్యుక్త ధర్మమై ఉన్నది. ఈ జన్మను దుఃఖ రూపముగా ఎందుకు నిర్ణయించినారు? అంటే ఈ జన్మయందు దుఃఖము 90 పాళ్ళు సుఖము 10 పాళ్ళు గాను చెప్పబడినది. కేవలం సుఖము, కేవలం దుఃఖము కాదు. కేవల దుఃఖ భూఇష్టమైనదే మానవజన్మ. ధనికుని మొదలు కటిక నిరుపేద వరకు దుఃఖము అనుభవించుచునేయున్నారు. అందుకే జన్మయే దుఃఖరూపమని వర్ణింపబడినది. "బతికియుండిన సుఖములు బడయవచ్చు" ననే భ్రాంతి చెంది అజ్ఞానులు వీనియందే వ్యామోహము పెంచుకొని సుఖమునకై ప్రాకులాడుచున్నారు. పుణ్యపాపకర్మలు

రెండునూ చేయుచు బద్ధులై జన్మపరంపరలకు లోనగుచున్నారు. దుఃఖమయమైన ఈ జన్మయందు మోహము చెంది తన స్వధర్మము గుర్తెరుగక బద్ధుడగుట పశులక్షణము. దేవతిర్యగ్ మానవోపాధులలో దేని యందునూ దుఃఖము లేకుండా ఉండుట లేదు. కనకనే "దుఃఖధ్వంసో మోక్ష" యని శృతి మోక్షమును నిర్వచించినది. "సర్వ భ్రాంతులకు మూలం మూలంలేని యీ గుర్తెరిగే శరీరమని" శ్రీ శివరామ దీక్షితులవారు నుడివినారు. ఇట్టి దుఃఖభూయిష్టమైన ఈ జన్మనుంచి విముక్తిని కోరుట బుద్ధి విశిష్టత గల మానవుని, జన్మ హక్కు అయిఉన్నది.

ఈ దుఃఖము ఏ తీరున పోవును? అంటే సుఖము వల్ల పోవునని కొందరు చెప్పెదరు. వెలుగువల్ల చీకటి పోయినట్లుగా, పుణ్యకర్మల వల్ల పాపకర్మలు పోయి స్వర్గసుఖములు లభించునని తలంచుట అవివేకము. పుణ్యపాప ఫలములగు సుఖదుఃఖములు దేనికవి వేరువేరుగా అనుభవించవలసినదే. కొందరు యజ్ఞయాగాది దానధర్మములు ఉపవాస వ్రతాదికములు అష్టాంగ యోగములు చేసి జీవబ్రహ్మైక్యమును సాధించిన మోక్షమని వివిధ సాధనలు చేయుచున్నారు. ఈ కర్మలు ఆచరించుట వల్ల స్వర్గాది ఉన్నత పదవులు సిద్ధించిననూ ఆయా పుణ్యకర్మలు క్షీణించగానే "క్షీణేపుణ్యేమర్త్యలోకం విశంతి" అనే న్యాయముగా మరల ఉపాధికి రావలసినదే మరల దుఃఖమనుభవించవలసినదే. పాపము ఇనుపసంకెళ్ళు పుణ్యము బంగారు సంకెళ్ళు. ఏ సంకెళ్లకైనను జన్మకారణములే బంధకారణములే కదా! వాసనా వాసితమై, పుణ్యపాప సంస్కారములకు నిలయమై జన్మవాగురులలో చిక్కుకొని సుఖదుఃఖములు పొందుచున్న వస్తువు యొక్కఅత్యంత నాశనము నందు తప్ప శాశ్వత జన్మ రాహిత్యము కలుగనేరదు. సుఖదుఃఖములు పొందుచు, జన్మధారణ చెందునది అంతః కరణము. ఇదే సుఖదుఃఖములకు పుట్టిల్లు. వ్యష్టి, సమిష్టి రూపముగా పరిణమించుచూ, సృష్టికి పూర్వము ఏకరూపంగానున్న యీ వస్తువే జన్మపరంపరలకు అత్యంత మూల కారణము యీ విశ్వ మహా వృక్షమునకు యిదియే కూకుడు వేరు. దీని రాహిత్యమందు తప్ప జన్మరహితము కాదు.

సచ్చిదానంద లక్షణములు కలదై, సర్వ వ్యాపకమైయున్న పరమాత్మ వస్తువును తెలుసుకొని నిరతిశయా ఆనందమును పొందియుండడమే మోక్షమని కొందరు మతకారులు చెప్పినారు. ఆ బ్రహ్మము. ఆనంద స్వరూపముగా నుడివినారు. ఈ జగత్తు కేవలము భ్రాంతి లక్షణముచే తోచుచున్నది. బ్రహ్మ సత్యం జగన్ మిధ్యా అని సూత్రీకరించినారు. ఇది ఎంత వరకు సమంజసమో విచారించవలసియున్నది. సృష్టికి పూర్వము "ఏకమేవా అద్వితీయం బ్రహ్మ" గా నున్న బ్రహ్మము "సోకామయత బహుస్యాం ప్రజాయేయ" అను సంకల్పముతో జీవేశ్వర

జగత్తుగా పరిణమించి, తాను తిరిగి వాని యందు జీవరూపంగా తత్సృష్ట్వా తదేవానుప్రావిశత్" అని చెప్పబడినట్లుగా ప్రవేశించి, పిండబ్రహ్మాండములుగా పురుష ప్రకృతులుగా సర్వ ద్విపుటి త్రిపుటులుగా పరిణమించి ఏకం అనేకం భవతి అయినది సృష్టికి పూర్వము ఏకరూపముగా నున్న ఆత్మ సత్పదార్ధముగా చెప్పబడెను. అదియే సృష్టిలో మన ప్రాణవాక్కులుగా పరిణమించెనని "ఆత్మాఉః ఏకస్సన్. ఏతత్రయం" అనిన్ని మనఃప్రాణ వాచాసంఘాతం సత్తా" అనిన్ని ఉపనిషత్తులు నిర్ణయించెను. కావున సృష్టి కారణమై, జగదధిష్టానమైయున్న పరమాత్మయే జన్మకర్మలకు అత్యంత మూలకారణము. దాని సత్తా లేనిచో గడ్డిపోచకూడా కదులజాలదు. "తేనావినా తృణాగ్రమపినచలతి" పరిపూర్ణ పరబాహ్యా మందు ఈ పరమాత్మకు మూలంలేదని ఆరూఢపరచుకొన్న తప్ప జన్మ రాహిత్యము కలుగదు. "స్వయం బ్రహ్మమయో భూత్వా తత్పరంచావ లోకయేత్" అని గురుగీత శాశించుచున్నది. నిన్ను విడచి చూడమంటున్నారు దీక్షితులవారు.

పంచతన్మాత్ర విషయములచే బద్ధుడైన తనకు ఏ తీరుగా భ్రాంతి రహితమగును? అనగా ఒక్క పరిపూర్ణ బోధవలనే అని చెప్పక తప్పదు. దీనినే పరిపూర్ణ రాజయోగమని కూడా అందురు. శ్రీ శివరామ దీక్షిత నిజప్రబోధ విధానము జన్మకర్మలకు కారణమైన పరమాత్మను వస్తు నిశ్చయముగా తెలియచేసి, అదియే జన్మకు అత్యంత మూలకారణమని, ఎరుకపరచి, సర్వలక్షణ విలక్షణమైన పరిపూర్ణ పరబాహ్యమును ఉండచూపి అందుతన నిజరూపమైన పరమాత్మకు మూలముకాని కొనకు ప్రవేశించుటకు స్థానముకాని లేదని ఆరూఢపరచి సర్వభ్రాంతి రాహిత్యము చేకూర్చి త్రివిధ కర్మలను రహిత పరచి, సర్వభ్రాంతి రహితము గావించ శక్తివంతమై అలరారుచున్నది.

కావున పరిపూర్ణ గురువుల చెంత చేరి వారి పాదము లాశ్రయించి సేవాశుశ్రూషలు చేయుచూ "గూరుపదిష్ట మార్గేణ మనత్సుద్ధింతుకారయేత్" అన్నట్లుగా వారి కృషితో అంతఃకరణ పరిశుద్ధి గావించుకొని ఎరుక పరిపూర్ణములను వస్తు నిశ్చయముగా గుర్తించి, భ్రాంతి రాహిత్య స్థితిని పొంది జన్మసార్ధకత చేసుకొని తరించవలసి యున్నది.

9. పరిపూర్ణ బోధ - శ్రవణాధికారులు

శ్రీమద్రామడుగు శివరామ దీక్షిత పరిపూర్ణ సిద్ధాంతము తప్ప మిగిలిన ప్రబోధనల వల్ల శాశ్వత, జన్మరాహిత్య మోక్షస్థితి చేకూరజాలదు. మిగిలిన ప్రబోధనలు సృష్టికి అత్యంత మూలకారణమైన అఖండ ఎరుకను తెలియచేసి, అదియే మోక్షస్థానమని భ్రాంతి చెందించుచున్నవి. పరిపూర్ణ బోధ ఈ భ్రాంతి నుంచి విముక్తి గావించి, పరిపూర్ణ స్థితిని చేకూర్చును. అఖండ ఎరుక యందలి మూలభ్రాంతి రహితము కానిదే జన్మరహితము కాదు. ఈ పీఠ ప్రతిష్టాపనాచార్యులు శ్రీ శివరామ దీక్షితుల వారు "సర్వ భ్రాంతులకు మూలం మూలంలేని ఈ గుర్తెరిగె శరీరము" అని సిద్ధాంతీకరించినారు. కావున జన్మరహిత రూప మోక్ష స్థితికి పరిపూర్ణ బోధయే అత్యంత అవలంబనీయము.

ఇట్టి మహోన్నత సిద్ధాంతమును అవలంభించుటకు ముందుగా ముముక్షువునకు ఉండవలసిన లక్షణము లేవి? అవి ఏవిధముగా గ్రహించనగును? అట్టి అధికార లక్షణములు పొందుట అవసరమా? అను విషయములు ముఖ్య విచారణీయములు. " "దుర్లభం మానుషం దేహం వివేక మతిదుర్లభం" అను శృత్యానుసారముగా వివేక వంతమైన మానవోపాధికి చెందిన ప్రతివారు స్త్రీ పురుష బేధములేక అందరూ ఈ జన్మ రహిత పరిపూర్ణ సిద్ధాంతమును పొందుటకు అర్హులు.

శ్రీకృష్ణదేశి కేంద్రులవారు తమ కందార్థములలో మొట్టమొదట ప్రారంభమందు ఈ భావన కొర్కై "జనులార జనన మరణములను దొలగంద్రోయజాలు. లక్షణయుతమై వినువారికి కనువారికి తన లావెరిగించు ..." అని చెప్పినారు. కాని ప్రతివారు కూడా తమ ఉపాధి అత్యంత మూల కారణమైన ఆత్మ స్వరూపమును గురుకృపకు పాత్రుడై వస్తు నిర్ణయముగా గుర్తెరిగి అందు ఆరూఢత చెంది దాని యందు కూడా "రోసి తిమోక్షాద్యపేక్ష" అను భావన కలిగిన పూర్ణాధికారులు కావలెను. ఇది అంత తేలికగా గుర్తింపబడదు. గురువు చెంతచేరి వారి శుశ్రూషలందు ఏమరక, మంత్రానుష్టానపరుడై త్రికరణశుద్ధిని అక్షరాలా పాటించుచూ పవిత్రాంతఃకరణ కలవానికి మాత్రమే పూర్ణగురువు ఆత్మ స్వరూప నిర్ణయము గావింపగలడు. అట్టి శిష్యుడే ఆ వస్తు నిర్ణయమును గ్రహించి ఆరూఢత చెందగలడు. "స్వయం బ్రహ్మ మయోభుత్వా తత్పరంచావలోకయేత్, పరాత్పరం నాన్యత్ సర్వగంతన్ని రామయం" అని గురుగీత అన్యత్రా చెప్పుచున్నది. అనగా తాను బ్రహ్మ స్వరూపుడై తన కన్యముగా నుండు కేవలాత్మను తెలియవలెనని భావము. పూర్ణబోధకు అధికారము పొందుట బహు కష్టము. "పూర్ణబోధ కొరకు పురుషుండు బహు జన్మ పుణ్యవశము చేత పుట్టవలయు" అని ఆత్మలింగ శతకము చెప్పుచున్నది. పూర్ణబోధలో చేరని వారు అందరూ కూడా ఇటువంటి స్థితిలోని

వారేనా! అందరూ పూర్ణాధికారము పొందిన వారేనా? ప్రస్తుత స్థితిలో ఇట్టి పూర్ణాధికారులు ఉండుట చాలా అరుదు. కాని కొందరు మేము కూడా పరిపూర్ణబోధ పొందితిమి. మాకు భ్రాంతి రహితమైనదని ఆత్మవంచన గావించుకొని తమ్ము నాశ్రయించిన వారిని కూడా చెరుపుచున్నారు. జన్మకారణమైన ఆత్మవస్తు నిర్ణయముగా మాకు తెలుసునని ధైర్యముగా చెప్పుటకు ముందుకు ఎవరురారు అని చెప్పుటలో అతిశయోక్తి లేదు. నిజగురువైతే తన్ను ఆశ్రయించిన శిష్యులకు ముందుగా సాంఖ్య, తారక, అమనస్క మహావాక్య విచారణయు వారికి పద్ధతిని సాకల్యముగా నెరిగించి ఆ పిదప ఆత్మ నిర్ణయము గావించి, అందు శిష్యుని నిష్ణాతుని గావించి దానివల్ల కూడా జన్మరహితము కాదని నిరూపించి, ఆ పిదప "ఆత్మాతీతం కేవలాత్మ" అను పరిపూర్ణ బోధను శిష్యునికి ఎరిగించును. కావున కర్మరూపసాధన, జ్ఞానరూపసాధన యోగరూపసాధన, భక్తి రూపసాధనలు చేసి తాను ఆత్మస్వరూపుడు కావలెను. ఇట్లుకాక ఊహ అపోహల చేత నిర్ణయించుకొని పరిపూర్ణబోధ యందు ఆరూఢత సంపాదించుట కలలోని వార్త. "మనసున వాక్కున తనవున పని యొక్కటి జరుపునట్టి భక్తునకు దయన్ వినిపించుమని" కృష్ణదేశికేంద్రులవారు శెలవిచ్చినారు. ప్రతీ విషయము శాస్త్ర దృశ్యం, గురుర్వాక్యం, తృతీయం ఆత్మ నిశ్చయం, చతుర్థం, సంశయచ్ఛేధం పంచమం ము్యక్తిదాయికం" అను శృతి పద్ధతిగా నుండవలెను.

ఈ సిద్ధాంత ప్రతిష్టాపనాచార్యులవారు పూర్ణాధికారిని నిరూపించుటలో "స్త్రీలే కాని పురుషులే కాని ఏ భ్రాంతి లేనివారు కర్మ, భక్తి, జ్ఞాన, వైరాగ్యములందు ఇచ్ఛలేనివారు. ధ్యాన భ్రాంతి, అయితినను భ్రాంతి. వివిధ మతములందు భ్రాంతి లేనివారు, కావలెనని కోరిక లేనివారు, నిరంతర గురుసేవాపరాయణులు, త్రికరణశుద్ధి కలిగినవారు, గురూపదిష్ట మార్గమందు కృషిచేయువారు, తన నిజస్థితియందు కూడా కోరిక లేనివారు" ఈ బోధకు శ్రవణాధికారులుగా నిరూపించినారు. శ్రీకృష్ణదేశికేంద్రులవారు తమ కందార్థములలో "వినవలెనని కనవలెనని మనసందున కోర్కెకల్గు మనజులెవినుడి, వినజేసెద కనజేసెద ఘనమగు ఈ బోధ" అని పేర్కొనినారు. "కేవల మోక్షాపేక్ష సంకల్పోబంధ" అని ఉపనిషత్తు చెప్పుచున్నది. కావున ఇట్టి పూర్ణాధికార లక్షణములు ముందుగా పొందుట అత్యంత అవసరము. పరిపూర్ణ పరబ్రహ్మము, మనోవాక్కుల కందనిది. "యతోవాచో నివర్తంతే అప్రాప్యమనసాసహ" అనగా మనోవాక్కులు దానిని తెలుసుకొనుటకు శక్తి లేనివి. అది గురుమూర్తియే అధికారమును బట్టి శిష్యునికి అపరోక్షము గావింపగలడు. "అపరోక్షమౌనె మనుజులకు పరోక్షంబైన బయలు గురుకృపలేకన్, కీలిదెలేని యెరక తాతొలుగా" అనిన్ని "గురుమూర్తి చూపెనేనియుపరిపూర్ణము తనకు లెస్స, ప్రత్యక్ష మౌరా, చూస్తునే ఎరుక

పారిపోవునుర్రా" అనిన్ని దేశి కేంద్రులు తమ కందార్థములలో చెప్పినారు. ఆ కందార్థ, కంద పద్యములు పరిపూర్ణ బోధకు వెన్నెముక వంటివి. అంతే వాసులై ఇది సాంప్రదాయిక పద్ధతిగా గురువుల చెంత వస్తు నిర్ణయముగా విచారించి తెలుసుకొనదగినవి. ఎరుక పరిపూర్ణములను వస్తు నిర్ణయముగా గురుకృపా పాత్రులై గ్రహించి ఆరూఢపరుచుకోనిన పూర్ణాధికారి మాత్రమే,ఈ కందార్థములను విచారణ చేయుటకు అర్హుడు. ఆత్మ స్వరూపమును పంచసాధనలచేత గుర్తించి, ఆరూఢత గాంచి పిదప మాత్రమే పరిపూర్ణ బోధను గ్రహించుటకు అధికారి, కావున ఈ అధికార లక్షణములు మనయందు ఉన్నవాలేవా? లేకపోతే అందుకు వలయు ప్రయత్నము పురుషాకారము బూని త్రికరణశుద్ధిగా కృషి చేయుచున్నామా? అని ఎవరికి వారే సాత్మ పరీక్షగావించుకొని విధిగా భగీరథ ప్రయత్నము గావించి, అయినా గురుకృపను పొంది శాశ్వత జన్మరాహిత్య మోక్షస్థితి పొందవలసియ్నుది.

10. నిజ వైరాగ్యము

ప్రపంచములో కానవచ్చు వస్తువులు అసత్యములు, అనిత్యములు, బంధ కారణములు, భ్రాంతి జన్యములు, అని తలచి వాని నాశింపక ఇంద్రియ నిగ్రహము కలిగి శాశ్వత సుఖదాయకమైన వస్తువు ఏదైనా కలదా? లేదా? అని యోచించవలెను. తత్ ప్రాప్తికి వైరాగ్యమవసరము. జ్ఞానేంద్రియములకు, మనస్సుకు గోచరించు ఈ సమస్తము, ఏదో ఒక కాలమందు నాశనము అగునని కేవలాచలస్థితి వీనియందు లేదనియు, ఆ వస్తువులచే కలుగు సుఖదుఃఖములు అనుభవించు తాను కూడా వానితో పాటుగా మార్పు చెందుచూ చుక్కాని లేని నౌక వలె తుదమొదలు కానరాని నిరంతర ఆవేదన నుండి విడుదల కోరి, దుర్లభమైన మానవోపాధిని పొందిన తాను పరిపూర్ణ గురువుల చెంతచేరి, వారి పాద పద్మములాశ్రయించి, మృత్యువు తన్ను మ్రింగక మునపే, విజ్ఞానవంతుడగు మానవుడు విముక్తిపొందనాశించుట సహజము.

కొందరు భార్యబిడ్డలతో కూడిన సంసారము దుఃఖమయమని, తన జన్మకు కారణమైన తల్లిదంద్రులు కూడా తనకు బంధమని, వారి వలన తనకు ఈషణ్మాత్రము కూడా ప్రయోజనము లేదని, వారిని పరిత్యజించి ధర్మశాల వంటి గృహస్త ధర్మమును వీడి, సన్యసించుచున్నారు. తాము సర్వసంగపరిత్యాగులమని, అన్నింటిని జయించిన అతీతులమని, వైరాగ్యపరులము మేమే, అని భావించుకొనుచు, పవిత్రమైన మానవజన్మను చేతులారా వ్యర్థము కావించు కొనుచూ, మోక్షము కొరకు కర్మ సన్యాసమని, యోగ సాధనలని వారికి తోచిన పద్ధతులు అవలంబించి, తాము తెలుసుకొన్నదే గొప్ప అని వారిలోవారు

కలహించుకొనుటయే గాక వారిని ఆశ్రయించిన వారిని కూడా కర్మ భ్రష్టులుగా చేసి, రెంటికి చెడిన రేవడి రీతిగా అధోగతిపాలు చేయుచున్నారు. ఎచ్చటికి వెళ్ళిన, ఎచ్చట ఉన్నా ఎన్ని సాధించినా భ్రాంతి రహితము కానిదే జన్మరహితము కాదని పాపము వీరికి తెలియదు.

పరిపూర్ణ ఋషులు "వైరాగ్యము" అను పదమునకు నిజ అభిప్రాయము నెరుకపరచి, దాని ద్వారా అన్ని వస్తువులకు ముందుగా అధిష్టానచేతన బ్రహ్మ భ్రాంతి రహిత విధానము, వస్తు నిశ్చయముగా తెలియచేసి, సర్వసంగ పరిత్యాగమనగానేమో తెల్పి కర్మకౌశలముతో శేష జీవితము గడుపుడని సకల మానవాళికి బోధించుచున్నారు.

మిథిలానగరం అగ్ని జ్వాలల కాహుతియగుచున్నదని దండక కమండలాదులు గైకొని పారిపోయిన సన్యాసి శ్రోతలవలెగాక ఏమాత్రము చలించక సంపూర్ణ అంతఃకరణ స్థిమితముతో గురుబోధయందే లగ్నమనస్కుడైయుండి పోయిన జనకుని కథ సుపరిచితమే. కావున పై వేషములు మార్చి, భార్యాబిడ్డలను వదలి సన్యసించుట నిజవైరాగ్యమ నబడదు. అన్ని రాగములకు మూలము తాను "ఆత్మ వస్తు కామాయ సర్వం ప్రియం భవతి" అని బృహదార్యణకోపనిషత్తు చెప్పుచున్నది. ఈ యదార్థ జ్ఞానమైన తన్ను, తన మీద అభిమానమును వీడజాలక పైపై విషయములు వదలిన మోక్షము సిద్ధించదు. "భ్రాంతి రహిత మిదం మోక్షం" అనగా సర్వభ్రాంతులకు మూలమగు తనకు పరిపూర్ణ పరబ్రహ్మమునందు మూలము కాని కొనకు ప్రవేశించుటకు స్థానము కాని లేదని, గురుకృపకు పాత్రులై, గురువు వలన తెలిసికొని సర్వభ్రాంతి రహితము కావించుకొనిన సత్పురుషుడే నిజవైరాగ్యపరుడు.

పరమాత్మ సృష్టి విధానములో సన్యాసమునకు తావులేదు. గృహస్తాశ్రమము ధర్మశాల కర్తయైన తాను ఉండగా కర్మఫలమంటక తప్పదు కనుక పరిపూర్ణ గురువుల చెంతచేరి వారి కృపచే తన అఖండస్థితిని వస్తు నిశ్చయముగా గుర్తెరిగి, ఆ అఖండ యెరుక లేశమైనా లేని పరిపూర్ణ పరబ్రహ్మము ఉండచూచుకొని, కర్మకౌశలము ఎరిగి వేనియందు భ్రాంతి లేక జనక చక్రవర్తివలె గృహస్తు అయి, ధన్య జీవితము గుడుపుటయే నిజమైన వైరాగ్యము. కావున సర్వులు పై విషయము నందలి యథార్థం గ్రహించి గురుదేవుల చరణంబుల వ్రాలి జ్ఞానముచే జన్మరహితము కావించుకొనుటయే శరణ్యము.

11. శిష్యుని అంతరంగ సాధన

గురుమూర్తి పాదముపట్టిన తరువాత ఆ గురువును పరమాత్మగానే భావించవలెను. తదన్య భావన కలిగిన యెడల గురుపుత్రుడనని తృప్తిపడుటకు వానికి అర్హతలేదు. యేలననగా గురుపాదము పట్టుట భగవంతుని తెలుసుకొనుటకేగదా! అట్టి భక్తికే లోపము రానీయరాదు. యెన్ని కష్టములకు లోనైన గురుమూర్తిని పరమాత్మగానే యెంచుకొనవలెను. శ్లో॥ గురుర్బ్రహ్మ, గురుర్విష్ణు, గురుర్దేవో మహేశ్వరః। గురుసాక్షాత్ పరబ్రహ్మ, తస్మై శ్రీ గురువేనమః॥ అని చెప్పిన శ్లోకమును ప్రతి దినమునూ గురుమంత్రముతో సమానముగా కొంచెం ఇంచుమించులో జరిపించుచునేయుందుము. సాక్షాత్ పరబ్రహ్మయన్న వాక్యము ఒక్కటే చాలును. ఎందుకు సాక్షాత్ పరబ్రహ్మ మని చెప్పబడినది? అంటే జగత్కారణ స్వరూపమైనది, జగస్సాక్షి స్వరూపమైనది, ఏ పరమాత్మ వున్నాడో, అట్టి పరబ్రహ్మ స్వరూపమును తన గురుముఖతః విని, తానుగూడా పరబ్రహ్మ స్వరూపుమును చెందినట్టి గురుమూర్తి గనుక, సాక్షాత్ పరబ్రహ్మయని చెప్పుటకు ఏమిని సందేహము లేదు. అట్టి స్థితికే గదా తాను గురువు వద్దకు చేరి కృషిచేయుట! తన యొక్క అంతఃకరణమును తాను బాగుచేసుకొనవలెను. గురుమూర్తి రాజయోగాశ్రమము నందుండి భార్యబిడ్డలతో సంసారము చేయుచూ అతిధి, అభ్యాగతులను సత్కరించుచున్నపుడు, సమస్తమైన వ్యవహారికములను నడుపుచుండవలెను గదా! అట్టి పరిస్థితి యందు గురుమూర్తి విషయలంపటుడుగా గానవచ్చును, అంత మాత్రమున అతడు కలలో వాడనుట తన బుద్ధిలోపమే గాగలదు. దేవాలయము లోనికి వెళ్లిన భక్తుడు దేవాలయము నందున్న విగ్రహమును భగవంతునిగానే భావించి, తాను శుచియైన మనస్సునందు ఆ దేవుని, గ్రంథము నందు వర్ణించిన మూర్తివంతునిగా ధ్యానించునే గాని యిది రాతి విగ్రహమని, యిది మానవుని వులి నుంచి ఆకారమును జెందెనని అనుకోడు. దేవాలయమునందున్న విగ్రహము మానవ నిర్మితమని తెలిసినప్పటికి దానియందు ఒక మహిమ వున్నదనే తలంపు ఆ భక్తునికి వున్నది. ప్రాణప్రతిష్ఠ చేసి, బీజాక్షరమంత్రములచే నిత్యధూప దీప ఆరాధనలచే, ఆవిగ్రహమట్టి మహిమాన్విత శక్తిని సంతరించుకున్నది.

భగవద్గీత 6 అధ్యాయం శ్లోకము 5 నందు 'ఉద్ధరేదాత్మ నాత్మాన, నాత్మానం మవసాదయేత్। ఆత్మైవహ్యాత్మనో బంధు రాత్మైద రిపురాత్మనః॥ అని వున్నది. ప్రతి మనుజుడును తాను బాగుపడుటకు గాని, చెడుటకు గాని కారణం తానే, తనకు మంచిచేయు హితుడు గాని, చెడు చేయగల యహితుడు గాని లేడనుటచే కర్తవ్యతాకర్తవ్యతలు యందు, ప్రతి మానవునకు కర్తృత్వము గలదనియు, విహిత ప్రతి సిద్ధాచరణము నందు భారతంత్ర్యము యెంతమాత్రము

లేదనియూ గీతయందు చెప్పబడుచున్నది. గనుక గురుమూర్తికిని తాను, యే దృక్పథముతో సేవచేసి కొలుస్తాడో అట్టి స్థితికే తాను అర్హుడౌతాడు గాన త్రికరణశుద్ధిగా మనో **వాక్కాయికములచే గురుస్సాక్షాత్** పరబ్రహ్మగా ధ్యానించి కించిజ్ఞత్వము గల తన్ను అర్పణ చేసుకోవలెను. అలా చేసినప్పుడు తప్పకుండా తాను అట్టి స్థితికి అర్హుడయ్యే అదృష్టము పట్టును. యీ విధానములో ఏ విధమైన పొరపాటు జరిగినా తనకు తానే శృంఖలాబద్ధు డగుటకు కారణభూతుడగును. యెట్లంటే గురుమూర్తి యందు యే విధమైన లోపమును తన మనస్సు సంకల్పించినా తన మనస్సే కలుషితమగును గాని, గురుమూర్తికి పోయినదేమీ లేదు. భగవద్గీతా శ్లోకంలో చెప్పినట్లు తాను బాగుపడుటకైనా, చెడుటకైనా తానే కారణము గాన ఏ విధమైన విషయ సంకల్పమునకూ తన అంతఃకరణము నందు తావీయకుండా జాగ్రత్త పడవలసిన బాధ్యత తనయందు ఉన్నది. తనకు కావలసినది గురుమూర్తి వద్ద వున్న విద్య. గురుమూర్తి యందు వున్న లోపములు శిష్యునికి అనవసరం. గురులోపముల వైపు శిష్యుని దృష్టి పోయినచో గురులక్ష్యముచెడును. గురువిద్య యొక్క ప్రభావము క్షీణించిపోవును. విద్యా లోపమున్న యెడల యింకొక గురువు వద్దకు వెళ్ళవలసియే వుండును. శ్లో॥ శాస్త్ర దృశ్యం గురుర్వాక్యం తృతీయం ఆత్మనిశ్చయం, చతుర్థం సంశయచ్ఛేదం, పంచమం ముక్తిదాయకం॥ ఈ విధంగా ఆత్మదృఢనిశ్చయం చేసుకోవలసివుంటుంది. కనుక సత్ శిష్యుడు అంతఃకరణము నందు యే విధమైన లౌకిక విషయ సంకల్పములు ప్రవేశించుటకును, తావీయకుండా జాగ్రత్త పడవలెను. కోశ కోశాంతరముల యందు పరమాత్మ స్వరూపమును నింపుకొని సర్వమునందు తానూ తనయందు సర్వము అనే నిశ్చయం పొందిన గురుమూర్తినెట్లు చూచుకోవలెను?

కృష్ణపరమాత్మ దుష్టశిక్షణ, శిష్టరక్షణ చేయలేదా? ఆయనను నరునిగా చూడవలెనా? నారాయణునిగా చూడవలెనా? పరంపరాపురుషులలో వారు గాదా? పాండవులకు దైవస్వరూపుడై, కౌరవులకు శతృస్వరూపుడును కాలేదా? కాబట్టి దైవాంశ సంభూతుడైనా, లోక సంగ్రహము కొరకు మంచి చెడు కర్మలను, కర్మశరీర ధారియైన కృష్ణపరమాత్మ చేసినట్లే గురుమూర్తి కూడా సమస్త వ్యవహారములనూ చూచుచుండవలెగదా! శిష్యునకు కావలసినది ప్రబోధ, తదన్యం కించిత్తు కూడా అవసరం లేదు. మనస్సునందు, భౌతిక విషయవాసన ప్రవేశించిందంటే దాని నిర్మూలనకకు అప్రమత్తుడై ఉండవలెను. కర్త అయినా, భోక్త అయినా తానే కారణుడగుచున్నాడు. అంతా తానే తనను విడచి చూడబోతే, తానే లేనని చెప్పుటకు కూడా వీలుకాని అనిర్వచనీయస్థితి. దేవాలయమునకు వెళ్ళి దేవుని దర్శనము చేసుకొవలెనని వుద్దేశ్యం కలిగినప్పుడు తలారా స్నానం చేసి, శుచియై పట్టు

వస్త్రములు ధరించి పువ్వులు, పళ్ళు, ఆకులు, వక్కలు, అగరువత్తులు, పట్టుకు వెళ్ళి దేవునికి అభిషేకములు, పూజలు చేయించుచున్నారే! దేవాలయము లోని దేవుడు రాతి విగ్రహము గదా! వాళ్ళు ఏఏ కోరికలు కోరునో, మ్రొక్కులు మ్రొక్కునో అచంచలమైన భక్తివిశ్వాసంతో మెలగెదరు కదా! నిజంగా దేవాలయంలో దేవుడు వీళ్ల కోరికలు తీరుస్తాడో, లేదో సందేహాస్పదమే గదా! అటువంటి కేవలం గురుసాక్షాత్ పరబ్రహ్మయనే తలంపుతో గదా, గురుభక్తుడు గురుశుశ్రూషణ చేయ్యాలి? అట్టి తరి తన అంతఃకరణ ఎంత పవిత్రత గలిగినదై వుండాలి? యే విధమైన భౌతిక విషయ సంకల్పములూ తన మనస్సునందు ప్రవేశించకుండా జాగరూకుడవ్వాలి. పరబ్రహ్మమును తెలుసుకోవలెనంటే అట్టి పరబ్రహ్మ తన అంతఃకరణయందు ప్రవేశించడానికి అనుకూలమైన పద్ధతిగా అంతఃకరణ సరిచేసుకోవాలి. అప్పుడు గదా గురుమూర్తికి అనుగ్రహ పాత్రుడౌవుతాడు. అంతటి శక్తి అంతఃకరణకు కలుగచేయడానికి మార్గమేమిటి? అనగా గురుమంత్రమే మార్గము. ఒక్క క్షణం కూడా పవిత్రమైన అమూల్యమైన ఈ విషయమును మరువకూడదు. ఇతర విషయముల అప్రయత్నంగా మనస్సునందు చోటుచేసుకొనుటకు ప్రయత్నించునప్పుడు మనకెందుకు యీ విషయముజోలి, అని ప్రతి అనవసర విషయమునకు విముఖుడయ్యే, పద్ధతి యందు సాధన చేయాలి. "ఖంమధ్యేకురు చాత్మానం ఆత్మ మధ్యేచ ఖంకురు" అనునట్లు నిరంతరం కృషిచేయాలి. ఆకాశవత్తుగా అంతఃకరణను మలచుకునేందుకు పట్టుగా ప్రయత్నించువాడే నిజమైన శిష్యుడు.

12. పరిపూర్ణ బోధ - ఆరూఢమగు విధానము

"పునరపి జననం, పునరపి మరణం" అను న్యాయంగా జనన మరణములు పొందుచూ, ప్రశాంతి లేక, కర్మ సంస్కారబద్ధుడై, సముద్రమందలి కెరటమువలె జన్మలకు వస్తూపోతూ మానవ జన్మ యొక్క పరమార్థమును, స్వధర్మమును గుర్తించక, కేవలము ఐహికా ముష్మిక సుఖభోగములకు, సాలోక్య, సామిప్య, సారూప్య సాయుజ్య సార్ష్ణిత్వము మున్నగు పంచముక్తుల భ్రాంతిలో మునిగి భావిలో గిలకవలె వస్తూపోతూ నుండు సకల మానవాళికి కర్తవ్యమేమి? అనేక జన్మలయందు చేసుకొనిన సత్కర్మసాఫల్యము వలననే వివేకవంతమైన మానవజన్మ లభించినది. అన్ని ఉపాధుల కంటె మానవోపాధియందు విమర్శనాత్మక జ్ఞానము విశేషముగా కలదుగదా! యిట్టి విశేషజ్ఞానము సద్వినియోగ పరుచుకొనక కేవలము ప్రాపంచిక సుఖదుఃఖ విషయ వాసనలలో మునిగి తేలుచూ, కూపస్తమండూకమువలె నుండి జీవితమును వెళ్ళబుచ్చుట నిజముగా పశులక్షణమే అనదగును.

ప్రపంచమందుగల మహాపురుషులందరూ ఈ అంశముల పైననే తమ జీవితము నంతయు

వినియోగించి, తీవ్రమైన కృషిచేసి, సాధించిన సత్ఫలితములు, అనుభవములను, సిద్ధాంతరూపంగా, గ్రంథరూపంగా సర్వులకు అందచేయుచునే వున్నారు. పూర్వము వేదాంత శాస్త్రమంతయు సంస్కృత భాషయందే నిర్మింపబడియుండెను. అన్ని మతములు కూడా జన్మ కారణము. జన్మ రాహిత్య విధానము పరమ శాంతి మున్నగు పరమ లక్ష్యములను దృష్టి యందుంచు కొనియే తమ తమ నిర్ణయ విధానములను భిన్న భిన్న రూపంగా సిద్ధాంతీ కరించినవి. పరిపూర్ణ సిద్ధాంతమును ఉద్ధరించిన శ్రీ శివరామ దీక్షితులవారు, అద్వైత సిద్ధాంతము కంటె అతీతమైన, శాశ్వత జన్మరాహిత్యమేర్పరచు దేవ మార్గమును సిద్ధాంతీకరించి సకల మానవాళికి మహోపకారము చేసిరి. ఈ పరిపూర్ణ భావము ఆయనకున్నూ పరంపరాప్రాప్తించినదే. సంస్కృతంలో నిగూఢముగా నున్న దానిని అచ్చతెనుగులో సర్వులకు గ్రాహ్యమగునట్లుగా వీరు దీనిని ఉద్ధరించుటచే దీనికి దీక్షితీయ సిద్ధాంతమని కూడా పేరు. ఈ పూర్ణ భావము ఎట్లు ఆరూఢమగునో విచారించుటకు ముందుగా వీని నిర్మిత పద్ధతిని కొంత విపులీకరించుట ముఖ్యము.

ఈ సిద్ధాంతము యొక్క ప్రాముఖ్యత ఏమి? ఇది మిగిలిన మత నిర్ణయముల కంటె అధికంగా ఏమి నిర్ణయము చేసినది? ఇది కూడా ఒక మతమా? దీనికి పరిపూర్ణ భావము అను పేరు ఎట్లు వచ్చినది? ఈ పరిపూర్ణ సిద్ధాంతము వలన జన్మ కర్మ రాహిత్య మోక్షము ఎట్లేర్పడును? దానికి సాధకుడు చేయుదగు, అనుసరించదగు ముఖ్య కర్తవ్యమేమి? సర్వమానవసౌభ్రాతృత్వము, అన్యోన్య సహకారము ఏపగిదిని నిజముగా చేకూరి వ్యక్తులకు, తద్రీత్యా విశ్వమునకును పరమశాంతి ఏర్పడగలదు? మున్నగు విషయములు విపులీకరించుటయే ఈ వ్యాసము యొక్క ముఖ్యోద్దేశము.

జన్మఎట్లు, ఎవరికి, ఏ రీతిగా కలుగుచున్నది? ఇది తెంపులేక జరుగుటకు కారణమేమి? జీవేశర జగత్తుయొక్క ఉత్పత్తికి ఆత్మయే కారణమని సర్వమతములు అంగీకరించియే వున్నవి. వేదములు, ఉపనిషత్తులు, భగవద్గీత, అన్నియూ కూడా బ్రహ్మమే జగత్కారణమని నుడివియున్నవి. "తస్మాద్వాయే తత్ ఆత్మానః ఆకాశస్సంభూతః....అనిన్నీ "బ్రహ్మణ్యోర **వ్యక్తాన్**" అనిన్నీ శ్రుతులు బ్రహ్మమే జగత్ కారణమని నిరూపించినవి. బ్రహ్మమే జగత్కారణ మని ఎట్లు నిరూపణ గావింపబడినదో "పరిపూర్ణ దర్శనము" అను గ్రంథములో సృష్టి విజ్ఞాన ప్రకరణము చూచిన గ్రాహ్యము కాగలదు. ఆత్మయే 84 లక్షల జీవోపాదులగా పరిణమించియున్నది. జన్మకు కర్మ కారణమా? లేక కర్మకు జన్మ కారణమా? అన్నచో ఒకదానికి ఒకటి ఆధారమైయున్నది. తీపికి బెల్లము, బెల్లమునకు తీపి ఎట్లు ఆధారముగా నున్నవో, అట్లే ఈ జన్మ కర్మలు ఒకదానికొకటి ఆధారముగా వున్నవి. సృష్టి కారణమైన బ్రహ్మయే, జన్మకర్మస్వరూపమై యున్నది. 84 లక్షల జీవనోపాధులుగా తానే పరిణమించి,

తనచే సృజింపబడిన ప్రకృతి ఆవరణయందు తానే బంధింపబడి, సంస్కారముల నేర్పరచుకొనుచు లింగ శరీరము అనుపేరుతో సంస్కార ఫలానుభవములు కొరకు నీచోత్తమ జన్మలు పొంది ఆవిర్భావ, తిరోభావములు చెందుచూ జనన మరణములు పొందుచున్నదీ సృష్టి కారణమైన బ్రహ్మమేనని, పరిపూర్ణ భావజ్ఞుల నిర్ణయము. బంధమోక్షములకు కారణము ద్వైతాద్వైత విశిష్టాది మత నిర్ణయములు, సృష్టి కారణము బ్రహ్మమని నిరూపిస్తూనే, మాయా పరిణామమే ఈ జగత్తని, బ్రహ్మము సత్యము, జగత్తు మిధ్యా అని నిర్ణయించి, భాష్యములు వ్రాయుట జరిగినది. కాని దీని అభావము వెంటనే తెలియుచున్నది. "ఏకమేవా అద్వితీయం బ్రహ్మ" సర్వం ఖల్విదం బ్రహ్మ" అని శృతులు ఘోషించుచున్నవి. ఈ కారణ బ్రహ్మయే జగత్తుగా పరిణమించినదని, ఈ రెండు కూడా ఒకదానిని నొకటి విడిచిలేవని బ్రహ్మము నందు ఈ ద్వయ లక్షణము సహజముగా నున్నదనీ, స్థూల భాగమసత్యము సూక్ష్మము సత్యము కాదనియు, రెండూ సత్యమైనా కావలె, లేక అసత్యమైనా కావలెననీ, ద్వంద్వ లక్షణములు గలిగి సర్వత్రిపుటి, ద్విపుటులుగా, భాసించుచూ, సర్వ భ్రాంతులకు జన్మకర్మలకు ఈ (బ్రహ్మయే) మూలకారణమనియు, దీనియందు కేవలత్వమనునది లేదనియు, సృష్టికి పూర్వము అచల లక్షణము కలిగియున్నా సృష్టి సంకల్పరూప చలనముతో సర్వచలనమూ యేర్పడుచున్నదనియు, కావున ఇట్టి లక్షణములు గల ఈ అఖండ ఎరుకకు, దానికంటె అన్యమై, సర్వలక్షణ విలక్షణమై కేవల నిప్ప్రతియోగికమైయున్న, పరిపూర్ణ పరబాహ్యము నందు ఈ కారణ బ్రహ్మమునకు మూలముగాని, కొనకు ప్రవేశించుటకు స్థానముగాని లేదని అరూఢపరచి, జన్మకర్మలను లేకుండా చేయునది పరిపూర్ణ సిద్ధాంతము. దీనినే అస్పర్శయోగమని, పరిపూర్ణ రాజయోగమని సహజా మనస్క రాజయోగమని, కూడా అందురు. ఇది ఒక మతము కాదు. మతము అన్నిటని ఏర్పరచి, సరిహద్దులు ఏర్పరుచుకొని వున్న ఎరుక రాహిత్యమునే తెలియచేయునది. దీనిని కూడా ఒక మతమని అపోహచెందుట గొప్ప పొరపాటు కాగలదు.

ఈ పరిపూర్ణ సిద్ధాంతమును పూర్ణయోగమని కూడా అందురు. కేవలము తత్వ విచారణయో, యోగాభ్యాసమో, మతనిర్ణయమో, భక్తి మార్గమో, మంత్రోపాసన యందేదియో ఒకటి మాత్రమే గాక వీటినన్నిటిని ఏక కాలమందే అభ్యసింప చేసి ఈ సాధనల ద్వారా పొందదగిన ఆత్మస్వరూపమును వస్తు నిశ్చయముగా సాధకునకు ఆరూఢపరచి జన్మ కర్మలకు కారణముయిన దీనియందు కూడా భ్రాంతి రహిత పద్ధతిని ఆరూఢపరచి, భుక్తిముక్తులందు పూర్ణత్వము ప్రసాదించి శాశ్వత జన్మరాహిత్యమును ఏర్పరుచు వస్తునిర్ణయ విధానము దీనియందు ఉండుటచే, దీనికి పూర్ణయోగమని అందురు. ఉపాధులనుభవించు కర్మలను

ఆగామిసంచిత ప్రారబ్ధములందురు. ఆత్మ నిశ్చయ జ్ఞానము వలనసంచితరాశిని, అనుభవము వల్ల ప్రారబ్ధమును రహిత పరచుకొన వచ్చునే కాని, ఆగామి రహిత విధానము ఎంత ఆత్మనిశ్చయ జ్ఞానపరునికైనా అసంభవము. తన నిజరూపమున అఖండ ఎరుకకు పరిపూర్ణ పరబాహ్యము నందు మూలము లేదని, కొనకు ప్రవేశించుటకు స్థానము కూడా లేదని, ఆ కేవలత్వమందు ఈ జన్మకు కారణమైన అఖండ ఎరుకలేనేలేదని, పుట్టనేలేదని, అరూఢపరుచుకొని, కర్మత్యాగము, కర్మఫలత్యాగముగాక, కర్మ కారణరూపమయిన అఖండ ఎరుకను వీడిన, కర్తృత్వరహిత కర్మాచరణ విధానమువలన గాని ఆగామి రహితముగాదు. దీనినే అస్పర్శయోగమందురు. భగవద్గీత యందు శ్రీకృష్ణుడు అర్జునునకు ఈ పరిపూర్ణ భావమునే బోధించెను. సర్వధర్మాన్ పరిత్యజ్యమాం ఏకం శరణం వ్రజ" అని అన్ని ధర్మములకు మూలమైన నీవైన ఆత్మను, గురువగు, నాకు సమర్పించి కర్తృత్వరహితముగా కర్మాచరణ గావింపుమని, నరుని నారాయణుడు ఆజ్ఞాపించెను. ఈ విధముగా ఒక్క పరిపూర్ణ సిద్ధాంతమునందే కర్మత్రయనాశనము, తద్వారా జన్మ రాహిత్యరూప పరమ ప్రశాంతి సంభవించగలదు. గాని మిగిలిన మార్గములన్నియు తిరిగివచ్చు, పద్ధతుల నేర్పరుచును గాని "నసపునరావర్తతే" అన్నట్లుగా తిరిగిరాని పరిపూర్ణత్వమును ప్రసాదింపలేవు.
కావున జన్మరహిత విధానమును ఆశించిన ముముక్షువునకు ఇక కర్తవ్యమేమి? ఏ మార్గము ననుసరించిన తాను జన్మకర్మలను సునాయాసముగా అధిగమించ గలడు? అన్నచో ఒక్క పరిపూర్ణ బోధచే తప్ప ఇతర మార్గములచే శాశ్వత జన్మరహిత్యము సిద్ధించదని నొక్కిచెప్పవలసినదే. ఈ పరిపూర్ణ సిద్ధాంతము నందు తన జన్మలకు కారణమయిన ఆత్మ స్వరూపము వస్తు నిశ్చయముగా తెలియచేసి అందు నిష్ఠాతుని గావించి పిదప పరిపూర్ణ బోధచే సర్వభ్రాంతిరాహిత్య స్థితిని చేకూర్చు బోధ విధానము నిర్ణయింపబడియున్నది. "పరిపూర్ణ మెరిగి ఎరుక నెరిగి, ఎరుకమాను" అని పరిపూర్ణ భావము. ఇట్టి విశిష్టమైన పరిపూర్ణ భావము. సాధకునకు ఎట్లు ఆరూఢమగును? దానికి సాధకుడు అనుసరించదగిన ఆచరణ లక్షణమేమి? గురుభక్తి గురుసేవ, గురునిష్టలు ఈ మూడింటి యొక్క విశిష్టత ఏమి? ఈ గురూపాసన ఇంతగా ఎందుకు నిర్ణయింపబడినది? మున్నగు అంశములను చక్కగా విచారించి తెలియవలసియున్నది. గురుసేవఅనగానేమి? గురు అనగా గొప్ప స్వరూపమని కదా అర్థము. "గురుస్సాక్షాత్ పరబ్రహ్మ" అను న్యాయంగా పరమాత్మ స్వరూపమే గురు స్వరూపము. ఇట్టి సర్వోత్కృష్టమైన గురు స్వరూపమును సేవించుట యెట్లు? సర్వశుద్ధ పవిత్రోసౌ అనగా అది పరమ పవిత్రమైనదిగదా! అట్టి పరమాత్మ స్వరూపమును సేవించవలెనన్న తన యందు అంతఃకరణ పరిశుద్ధత, ఏకాగ్రత

కావలసియున్నది. గురువు పరమాత్మయే అను భావనతో కదా, గురుభక్తుడు గురూపాసన గావించుచున్నాడు. గురుమూర్తి ప్రభువు, తాను భృత్యుడు ॥ భృత్యానుభృత్య పరిచారక భృత్యుభృత్యస్య'' అని ముకుందమాలలో చెప్పుచున్నది. శిష్యుడు తన యొక్క అహంకారమును గురుసేవద్వారా నశింప చేసుకొనుటకు కృషి చేయుచున్నాడు. తన యందలి వ్యష్టి అహంకారము వలననే పుణ్యపాపసంస్కారములను ఏర్పరచుకొనుచున్నాడు. దానివల్ల సంస్కారబద్ధుడై జన్మపరంపరలకు లోనగుచున్నాడు. ఈ వ్యష్టి అహంకారము గురుసేవచేత మా త్రమే నశింపగలదు. గురుమూర్తికి నిత్యము నమస్కారము పూజాధికము. గురుని ఆజ్ఞపాలనము మున్నగు వాని ద్వారా నిరభిమాన పూర్వకముగా గురుసేవ సల్పిన గాని తన అహంకారము నశించదు. తనతో సహా సర్వమును గురుమూర్తికి అర్పణచేసి దాని యందు అభిమాన రాహిత్యముతో ప్రవర్తించినగాని, మమకారము అనగా నాదియను దృష్టి పోదు. శ్లో॥ శరీర ఇంద్రియంప్రాణం అర్థ స్వజన బాంధవాన్, ఆత్మదారాధికం సర్వం సద్గురుభ్యో నివేదమిత్'' అని గురుగీత శాసించినది. ఇందు "నివేదన'' అను శబ్ధమును గమనించవలసియున్నది. తనయందు ముఖ్యముగా ఏకర్మచేయుటకైననూ మనసు వాక్, శరీరము అను మూడు అంగములు కలవు. వీనినే త్రికరణములని అందురు. ఈ త్రికరణముల ద్వారానే తాను ముందు సగుణరూపంలో సాకారరూపుడై తన గురుమూర్తిని సేవించవలసియున్నది. ఎందుకనగా అభిమాన రహితునికి మాత్రమే అంతఃకరణయందు ఆవరణ రహితమై తద్వారా ఆత్మ నిశ్చయము ఆరూఢమగుట సంభవించును. గురుభక్తి ఎంత అవసరమో, గురుసేవ కూడా అంతే అవసరమని చెప్పవలెను. కేవలము భక్తియున్నా పాసగదు. గురుసేవ మంత్రముననే గురుని ఆజ్ఞాపాలనము వలన మాత్రమే, అనేక మంది శిష్యులు తరించగలిగినారని, అనేక పురాణగాథలందు చెప్పబడియున్నది. గురుసేవా పద్ధతి యందు నాల్గు శూశ్రూషలు నిర్ణయింపబడినందున దానిని గూర్చి విపులముగా తెలియవలసియున్నది. ఈ శూశ్రూషలు గురులబ్ధికా? శిష్యలబ్ధికా? శుశ్రూషలవసరమా? తన లబ్ధికి తానే ఎట్లు చేసుకొనగలడు. తన యందు గల త్రికరణములను త్రివిధ తపస్సుల ద్వారా పరిశుద్ధమొనర్చి, తానే పరమాత్మ స్వరూపుడనని ఆరూఢపరచుకొనవలెను. గురుమూర్తి మార్గదర్శకుడు మాత్రమే. ఆ మార్గ మునందు పయనించుచూ తన్నుతాను ఎరుగుటకు, శిష్యుడే ప్రయత్నించవలసియున్నది. కావున తన్నుతాను తరింపచేసికొనుటకు అనగా తన లబ్ధికొరకే సమిష్టి రూపమైన పరమాత్మ స్వరూపమును సేవించుకొనవలెను. గురుసేవయే పరమాత్మ సేవ1. స్థాన శుశ్రూష 2. అంగ శుశ్రూష 3. ఆత్మ శుశ్రూష 4. భావ శుశ్రూష అని నాలుగు శుశ్రూషలు పేర్కొనబడినవి.

1. స్థానశుశ్రూష : గురుస్థానమునకేగి గురుసేవ చేయుచూ అందలి కష్టసుఖముల యందు ఓర్మి కలిగి ప్రబోధ వినుట. ఈ పద్ధతి రామునకు లేనందుననే వశిష్ఠుడు బ్రహ్మవిద్య బోధించిననూ ఆరూఢత చెందలేక పోయెను. శ్రీకృష్ణుడు సాందీపని ఆశ్రమమునకు వెళ్ళి గురుసేవ మాత్రము చేతనే తరించగలిగినాడని చెప్పబడుచున్నది. ప్రారంభమందు గురుస్థానమునకు వెళ్ళి గురుప్రబోధ వినవలెను. లక్ష్యార్థమునందు గురుస్వరూపమును సర్వేసర్వత్రా చూచుచు దానియందు తన మనస్సును నిల్పి ఆత్మదృష్టిపూనియుండుటయే స్థానశుశ్రూష అని చెప్పబడును. శిష్యుడు గురుని వెంటనైనా వుండాలి, గురుడు తన యింటనైనా వుండాలని పెద్దలందురు. తన యింటనుంచుకొని బోధ గ్రహించుట స్థాన శుశ్రూష కాజాలదు. గురుని యింటనూ వెంటనూ వుండుటయే స్థాన శుశ్రూష. కనుక సావకాశము కలిగినపుడు మాత్రము ఆ అవకాశమును జారవిడుచుకోక, యితర సమయములందు గురుమూర్తి తన అంతఃకరణము నందే సుస్థితుడై యున్నట్లు భావించుచూ కృషి చేయుటయే స్థానశుశ్రూష.

2. అంగశుశ్రూష : అంగములనగా భాగములు తనయందు త్రికరణములే ముఖ్యమైన అంగములు. వీనిద్వారా గురు సేవ చేయుటయే అంగశుశ్రూష అనగా మనస్సు వాక్కు శరీరములద్వారా గురుభక్తి కలిగియుండి తన యందలి త్రికరణములు పరమాత్మయొక్క స్థూల శరీరమని నిర్ణయము. కలిగి వానిని మహా పవిత్రముగా నుంచగలుగుటయును, త్రికరణశుద్ధి కర్మాచరణము అంగశుశ్రూష అని నిర్ణయము. ఇట్లుగాక గురుమూర్తి శరీర స్థూలాంగములకు సేవచేయవలెనని శిష్యులకు చెప్పుచూ, త్రికరణశుద్ధి రూపమైన ఆచరణ పద్ధతిని నేర్పి ఆచరింపచేయకనే శిష్యవంచకులై దురాచార పరాయణులై, ప్రవర్తిల్లు స్వార్థగురువులుకూడా ఉన్నారనుటలో అతిశయోక్తిలేదు.

3. ఆత్మశుశ్రూష : గురునికి ఆత్మసంతృప్తి గలుగునట్లు ప్రవర్తించుట నిజగురుదేవుడు ఎట్లు సంతోషించును! అనగా శిష్యుడు ఆత్మయందు ప్రేమ, ఆచరణయందు పాపభీతి కలిగియుండి, త్రివిధ తపస్సులద్వారా అంత:కరణ పరిశుద్ధి పొంది తద్వారా ఆత్మనిశ్చయపరుడై యుండవలెను అంతఃకరణ అపవిత్రముగా నున్న ఆత్మవతరణ జరుగదు. అంతఃకరణయే మనఃప్రాణవాక్కులుగానున్నవి. ఇది వ్యష్టియందు త్రికరణములుగాను సమిష్టియందు పరమాత్మగాను శ్రుతులందు చెప్పబడుచున్నవి. "ఆత్మఉప్కస్సన్ ఏతత్రయం. ఆత్మ ఒక్కటియే సత్ రూపముగా నున్నది. అది మనఃప్రాణ వాక్కులుగా నున్నవని భావము. సప్తాన్నములలోను ఆత్మకు త్రికరణములే ఆహారమని నిర్ణయింపబడినవి. ఈ త్రికరణములను వక్రమార్గమందు ప్రవర్తింపచేసిన అంతఃకరణ అపవిత్రత నొంది, నీచజన్మలు

ఎత్తవలసియుండును. త్రికరణశుద్ధి కర్మాచరణద్వారా, అంతఃకరణ పవిత్రతను, తద్వారా ఆత్మ స్వరూప నిర్ణయమును పొందనగును. పరమాత్మ పద్ధతిగా ఆచరణ కలిగి ప్రవర్తించుటయే ఆత్మశుశ్రూష. ఇదియునుగాక పారమార్థిక త్రికరణశుద్ధి ముఖ్యంగా కలిగియుండును. "గురువాక్యం యదాతథా" అన్నట్లుగా గురుమూర్తి నియోగించిన పరమార్థరూపసాధనలందు ఏమరకుండా తన ఆచరణచే గురుమూర్తిని మెప్పించి తద్వారా వారికృపను పొందవలసి యున్నది. గురుమూర్తినియోగించిన అనుష్ఠాన ఆచరణ విచారణలందు ఏమరకుండా త్రివిధ తపస్సులద్వారా ఆచరణ గలిగియున్న భక్తుడు నిస్సందేహముగా కడతేరగలడు.

శ్లో॥ ఆకల్పజన్మకోటీనాం యజ్ఞదానతపఃక్రియా తాస్సర్వాస
ఫలాదేవీ గురు సంతోషమాత్రతః॥ అని గురుగీత నిర్ణయించినది. కావున తన ఆచరణ పద్ధతిచే గురుమూర్తికి ఆనందము కల్గించి, వారి అనుగ్రహము పొందుటకుచేయు ఆచరణ విధానమే ఆత్మశుశ్రూష. ఇట్లుకాక స్వార్థగురువులు లౌకిక ప్రయోజనములను ఆశించి ధన కనక వస్తువాహనాదులర్పించుకొని గురువును సంతోషపెట్టవలెనని భోధించి, శిష్యుల విత్తమును హరించుచూ తాము చెడినవేగాక తమ బోధలచే ఇతరులనుకూడ చెరుపుచున్నారు. కావుననే "మనసున వాక్కున, తనవున పనియొక్కటి జరుపునట్టి భక్తునికి దయన్ ! వినిపించుము వినుమని యీఘనబోధను వానికతుకగలదుడుగకుమీ" అంటూ అధికారిని ఆవిధముగా గుర్తించి, స్వార్థములేక, తప్పక పూర్ణబోధను బోధించుమని శ్రీకృష్ణదేశికేంద్రులు గురువులనే హెచ్చరించుచున్నారు.

4. భావశుశ్రూష : పరిపూర్ణ భావము నందు ఇక ఏ ఇతర భావములు ప్రవేశించుటకు వీలులేదు. అన్ని భావములకు అవకాశమిచ్చు ఆత్మయే పరిపూర్ణ భావముచే అభావముగావించబడుచున్నది. ఐహికాముష్మిక సుఖభోగముల కొరకు, ధనకీర్తి ప్రతిష్ఠల కొరకు, మానవుడు ఆశించకుండా జన్మరాహిత్య విధానము నందే కృషి చేయవలయును. ఎందుకనగా ఎన్ని సాధనలు చేసి ఎన్ని భోగములు అనుభవించినా, అవన్నియు క్షణికములే. మరల జన్మకు వచ్చి తీరవలసినదే. ఆత్మరూప నిర్ణయము పొందిన వారికైన మరల జన్మ తప్పదు. కావున కామ్యరూపమైన సాధనల యందు ఏ భ్రాంతియును పొందక ఒక్క పరిపూర్ణ భావమును మాత్రమే ఆరూఢపరచుకొనుచూ ఇతరమైన వానిని కొంచెమైన దరిచేరనీయక, యుండుటయే భావ శుశ్రూష. ఈ శుశ్రూషా విధానములందు తన్ను తానే సేవించు కొనుచున్నాడు. ఎందువలన అంటే తన పురోభివృద్ధికి తానే ప్రయత్నించు కొనుచున్నాడు. ఎవ్వరునూ తన్ను రక్షించి ఉద్ధరించ సమర్థులుకారు. "ఉద్ధరేదాత్మనాత్మానం ఆత్మాన మవసాదయేత్" అని భగవద్గీత యందు శ్రీకృష్ణుడు చెప్పియున్నాడు. కావున ఎవరికి

వారే తమ్ము తాము తరింపచేసుకొనుటకు గురుమూర్తిని మార్గదర్శకునిగా నిర్ణయించుకొని వారు విధించిన మార్గమందు పయనించి కృతార్థులు కావలసియున్నది.

ఈ శూశ్రూషలను గూర్చి శ్రీకృష్ణదేశికులు తమ కందార్థములందు "నాలుగు శుశ్రూషణములు లోలత గావించుకొనుచు లోకాతీతం బాలోకించి గురునిచే యీ లోకము జోలి విడువుమింతే చాలన్నా నీతో కూడా యిది మరువకన్నా" అని నాల్గు శుశ్రూషలు తనకు తానే గావించు కొనుచూ గురుమూర్తి కృపచే ఎరుకను విడువమని శ్రీకృష్ణ దేశికుల హెచ్చరిస్తున్నారు. ఎంత వరకు ఈ గురుసేవ అవసరము? అంటే పుట్టినది మొదలు చచ్చినదాకా అవసరమేనని చెప్పి తీరవలసినదే. ఈ భావమునే ఎరుక తనకు తావీడిపోదు" అనే కందార్థములో "గురునకు పరిచర్య యొనర్చి బోధపద్ధతి వినివన్, తిరిగి రాని పద్ధతి గనినన్" అని చెప్పినారు. పరిచర్యలనగా యీ నాల్గు విధములగు శుశ్రూషలేయని తెలియవలెను.

కావున గురుమూర్తికి శిష్యుడు నాల్గు శుశ్రూషల ద్వారా సేవచేయుచూ తాను గురూ పదిష్ఠ మార్గమునందు పయనించి గమ్యము చేరవలసియున్నది. వాచాగా కాకుండా కేవలం ఆచరణ కల్గినపుడే సహజముగా మార్పు రాగలదు. నాల్గు శుశ్రూషలచే త్రికరణశుద్ధిగా గురుని సేవించి ఆత్మ స్వరూపుడైయున్న వానికి గాని పరిపూర్ణ బోధ ఆరూఢము కాజాలదు. పరిపూర్ణ పరబాహ్యము నందు సేవకుడు సేవించు విధానము, సేవింపబడు వస్తువు అనే త్రిపుటి లేక ఒక్క ఆత్మస్వరూపము (గురు స్వరూపము) సేవించదగినది. అనగా తాను పరిపూర్ణ బోధ ఆరూఢ పర్చుకొని ఇతరులను కూడ తరింపచేయుటకు అవతరించిన గురుమూర్తి మాత్రమే సేవింప తగినవాడు. ఏలననగా "బ్రహ్మవిద్ బ్రహ్మైవ భవతి" అనే న్యాయముగా తన గురువే నిర్గుణ రూపము నందు పరమాత్మ అయ్యియున్నాడు. నిదురవచ్చిన దనుక నీవు చచ్చినదనుక గురు భక్తి గురుసేవలు గురు భక్తుడు కలిగి ఉండవలసినదే. గురువులై యున్న వారికి కూడ ఈ గురు సేవ అత్యంత ఆవశ్యకమై యున్నది. ఎందుకనగా గురుకృపచేత తాను ఇదివరలో అరూఢ పర్చుకొనిన పూర్ణ భావము తన నుండి ఎల్లవేళల వేరు కాకుండ ఎరుకను వీడి అశరీర పద్ధతిలో నుండుటకు వలయు శక్తియుక్తులు గురుభక్తి గురుసేవ వలననే లభింపగలవు. కావున ఎంతటి వారికైన గురుభక్తి, గురుసేవలు ఆవశ్యకములై యున్నవి.

గురునిష్ఠ అనగా గురుమూర్తి నిర్ణయించిన ఆచరణ పద్ధతి యందు ప్రవర్తిల్లుచూ గురుమూర్తి ధ్యానము నందు మాత్రమే నిలకడ కల్గి, కాలము గడుపుట గురుభక్తి గురుసేవకల్గియున్న గురునిష్ఠ లేనిచో ప్రయోజన హీనమే కాగలదు. సర్వకాల సర్వావస్థలయందు గురునిష్ఠ కల్గియున్న గురుభక్తుడు కడతేరగలడు. "పానీయంబులు ద్రావుచున్, గుడుచుచున్, భాషింపుచున్" ప్రహ్లాదుడు శ్రీహరిని మరువనట్లుగా గురుపుత్రుడు గురుమూర్తి యందు

తీవ్ర నిష్ఠ కల్గియుండుటయే గురునిష్ఠ.

గురునిష్ఠ కలిగియుండి త్రికరణశుద్ధి కర్మాచరణ యందు ఏమరకుండ నున్న వాడే నిజమైన గురుపుత్రుడు. ఎందుకు గురునిష్ఠ కల్గియుండువలెను? అన్నచో ఎంత పరిపూర్ణ భావము ఆరూఢపర్చుకొన్న తాను ఎరుకలో ప్రవర్తించుచూ కర్మాచరణ అంటీ అంటని పద్ధతిలో చేయవలసినదే కదా? సహజ పద్ధతిగా పరమాత్మ నిర్ణాయానుసారంగా తాను రాజయోగమునందు గృహస్థ ధర్మక జీవితములో కర్మయోగియై కర్మనాశనము, ఋణ నాశనము కొరకు పాటుపడుచు ధన్యజీవితం గడపవలసి యున్నది కదా! ఇంతటి అంతఃకరణ నైర్మల్యము, సహజ ఆచరణ పద్ధతీ ఏ రీతిగా తనకు లభ్యం కాగలదు? అన్నచో గురునిష్ఠ వలననే అని చెప్పక తప్పదు. ఎరుకను గురుదక్షిణగా గురుమూర్తికి ఇచ్చి వేసిన తర్వాత గురుమూర్తి మరల శిష్యునికి లోక వ్యవహారార్థము ఎరుకను ఎరువిచ్చి ముట్టక వ్యవహరించుమని ఆదేశించుచున్నారు కదా? ముట్టక వ్యవహరించు ఆచరణ పద్ధతి కూడ గురుమూర్తి కృపవలననే అనగా గురుభక్తి, గురుసేవ, గురునిష్ఠల వలననే చేకూరగలదు. ఈ గురునిష్ఠను గూర్చి శ్రీకృష్ణ దేశికేంద్రులు తమ కందార్థకంద పద్యముల యందు "జలము నేడబాయనొల్లని జలచరముల తీవి బూని సత్సశిష్యుడు హృజ్జలజంబను పీఠముపై నిల్పి ఇతరము మాని గురువునే కొల్చుసుమ్మీ! తదుక్తులనే తలచునమ్మి కలకాలమిరీతి గడ్పుచూనే ప్రొద్దు తల్లితండ్రి, దొరదాత దైవమనుచు గురువునే కొల్చు సుమ్మి అని "పతి భక్తిగల యువతి వలె సతతము గురుభక్తి గల్గి సత్ శిష్యుడిలన్ స్థితి గుదురసేవచేయును" అని నుడివి యున్నారు. ఇదియే గురునిష్ఠ.

గురుభక్తి గురుసేవల యందు ఏమరకుండా గురునిష్ఠ కల్గియున్న పరిపూర్ణ భావజ్ఞడే ధన్యజీవి. గురుభక్తి. ప్రథమ సోపానంగాను, గురుసేవ ద్వితీయ సోపానముగాను, గురునిష్ఠ తృతీయ సోపానముగాను చెప్పబడినవి. వాని యందు ఏమరకుండ కృషిచేయువాడు తప్పక కృతార్థుడు కాగలడు. "దుర్లభం మానుషం దేహం" అనే శృతి నిర్ణయానుసారముగా మానవోపాది అత్యంత దుర్లభమైనదనియు అందునూ వివేకవంతుడై యుండుట మరి దుర్లభమని చెప్పబడినది. కేవలము లౌకిక ప్రయోజనములకు మాత్రమే పాటుపడక, పారమార్థికముగా కూడా ముందడుగు వేసిననేగాని ఈ వివేకము సార్థకము కాజాలదు. జన్మ సహజముగా దుఃఖ స్వరూపము. ఈ మానవ జన్మయందు సుఖమేదో కలదని చేయరాని పనులు చేయుచూ మానవుడు కర్మ సంస్కార బద్ధుడై జన్మ పరంపరలకు లోనై అధోగతి పాలగుచున్నాడు. మిగిలిన ఉపాదులన్నిటికన్న మానవుని పంచతన్మాత్ర విషయములు గట్టిగా బంధించి యున్నవి. ఈ మానవోపాదియందు ఏ మాత్రము కూడా శాంతి లేదని ఉన్నా అది క్షణికమేనని స్పష్టముగ తెలియుచున్నది. పుణ్యకర్మాచరణచే పాప సంస్కారములు పోవునని యెంచి,

పుణ్యకర్మాచరణగావించు చున్నారు. కాని పుణ్యపాప ఫలముల రెంటినీ దేనికదియే వేరువేరుగా అనుభవించవలసినదే. పాపము ఇనుపసంకెళ్ళతోను, పుణ్యము బంగారు సంకెళ్ళతోను పోలిక చెప్పబడినవి. ఏదైన బంధకారణమే, జన్మ కారణమే మొత్తం సంస్కారములకు పుట్టినిల్లైన వస్తువేదో దాని రాహిత్యమందు గాని శ్వాశత జన్మరాహిత్యము కాజాలదు. "క్షీణేపుణ్యం మర్త్యలోకం విశంతి" పుణ్యము క్షీణించగా మరల ఉపాధికి రావలసినదే! తన యందు గల అభిమాన దృష్టి చేతనే తనకు అన్నియు ప్రేమ పాత్రములగుచున్నవి. బాహ్యరూపమైన వస్తువులను వీడి దూరముగా పోయి వైరాగ్యపరుల మని ఎంచి సన్యాసదీక్షతో నున్ననూ తన యందలి అభిమాన దృష్టి మాత్రము పోదు. తాను అనగా పరమాత్మ స్వరూపుడే గదా! సర్వమునకు కారణమైన ఆత్మయే స్వ + అర్థము = స్వార్థము! దానిని పరిపూర్ణ బోధచే రహిత పరిచిన గాని శాశ్వత జన్మ రాహిత్యము కాదని అచల ఋషుల సిద్ధాంతము. "ఆత్మవస్తుకామాయ సర్వం ప్రియం భవతి" అని బృహదారణ్యకోపనిషత్తు చెప్పుచున్నది. తన ఆత్మయందలి ప్రేమచేతనే సర్వము నందు తనకు ప్రేమ కల్గును. తనయందే తనకు ప్రేమలేని వానికి దేనియందును ప్రేమ కలుగజాలదు. కావున సమస్తమునకు మూలమైన ఆత్మకు పరిపూర్ణమందు మూలముగాని, స్థానముగాని లేదని ఆరూఢ పరుచుకొనినగాని తన యందలి ప్రేమగాని, పుణ్యపాప సంస్కారములగాని పోవని తెలియవలసియున్నది. "సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ" అని నీవైన ఆత్మ గురువైన నాకు అర్పించి (వీడి) యుండుమని శ్రీకృష్ణుడు అర్జునుని ఆజ్ఞాపించినాడు కనుక శాశ్వత జన్మరాహిత్యము ఒక్క పరిపూర్ణ బోధచే మాత్రమే చేకూరగలదని నొక్కిచెప్పక తప్పదు.

మానవునిగా పుట్టినవారు ఇక మరల పుట్టుక లేకుండా చేసుకొనడమే సార్థకత. మానవునకే మోక్షార్హత కలదు. ఇట్టి సర్వోత్కృష్ట మానవోపాధి పొంది కేవలము ప్రాపంచిక విషయ సుఖములకే పాటుపడుచూ జీవితమును వ్యర్థము చేసినచో అది వివేకయుక్తమగు మానవ నైజమునకే విరుద్ధమైన కేవలం పశు లక్షణము పొందినట్లు చెప్పతగియున్నది. "ఇహచేదవేదీ బహు సత్యమస్తి ఇహ చేన్నవేదీ మహతీవినష్టిః" అని శృతి హెచ్చరించుచున్నది. ఏలననగా జన్మరాహిత్యము సాధించుటకు ప్రత్యేక పనిముట్టుగా నున్న మానవోపాధి మరల ఎపుడు కల్గునో చెప్పజాలము.

ఒక్క పరిపూర్ణ బోధ చేత మాత్రమే, శాశ్వత జన్మ రాహిత్యముతో బాటుగా సర్వమానవ సౌభ్రాతృత్వము, అన్యోన్య సహకారము, ఐహికాముష్మిక పురోభివృద్ధి, చేకూరి తద్వారా విశ్వ మానవ కళ్యాణము ప్రపంచ శాంతి చేకూరగలవు. ఎట్లనగా వ్యష్టి లక్షణములచే కేవలం స్వార్థ దృష్టితో నున్న మానవునకు తనకు నిజరూపమైన ఆత్మ స్వరూప వస్తు నిశ్చయ

జ్ఞానమును కలిగించి, తద్వారా సమిష్టి అంతఃకరణ పూర్వకమగు కర్మాచరణ విధానము, ఈ సిద్ధాంతమందే చేకూరగలదు. అంతా ఒక్కటే ఏక రూపులే యని తలంచాలని, సమిష్టి శ్రేయోదాయక కర్మాచరణ గావించు కోవాలని, అందరు బోధించుచున్నారు. కాని కేవలము వాచా వేదాంతము తెచ్చుపెట్టుకొన్న బాహ్యావైఖరి కాక సహజముగా సమిష్టి కర్మాచరణ పద్ధతి చేకూరవలెను. అది ఒక్క వస్తు నిశ్చయజ్ఞానము గురుకృపచే అరూఢ పర్చుటచేతగాని సిద్ధింపనేరదు. అరిషడ్వర్గములను జయించాలి, త్రికరణశుద్ధి కావాలి, అంతఃకరణ పరిశుద్ధి, ఇంద్రియ నిగ్రహము కావాలని, సర్వము బ్రహ్మమేనని తెలియాలని నినాదములు గావించి నంతమాత్రమున ప్రయోజనం లేదు. వస్తు నిశ్చయ జ్ఞానముచే పైన పేర్కొనినవన్నియు సిద్ధించగల అనుష్ఠాన ఆచరణ పద్ధతులు ఈ పరిపూర్ణ సిద్ధాంతము నందు మాత్రమే నిర్ణయింపబడి యున్నవి. జన్మ కర్మలకు తన నిజరూపమే(అఖండ ఎరుకయే) కారణమని దానిని పరిపూర్ణ బోధచే రహిత పరచి, కర్మత్యాగము, కర్మఫలత్యాగము గాక, సర్వకర్తయగు పరమాత్మ స్వరూపమునే గురూపదిష్ఠ మార్గముచే త్యాగము చేసి, కర్తృత్వ రహితముగా చేయు, కర్మ కౌశలమును నేర్చి అంటీఅంటని పద్ధతిలో అశరీర పద్ధతి నవలంబించి జన్మ కర్మల నుండి మానవుడు శాశ్వత విముక్తి గాంచవలసి యున్నది. వివేకవంతమైన మానవోపాధి లభించినందుకు దానిని చేతులారా వృథాకానివ్వక గురుపాదములాశ్రయించి జన్మచరితార్థత గావించుకొనుటయే మానవుని కర్తవ్యమైయున్నది.

ఇట్టి పరమ రహస్యమైన ఈ పరిపూర్ణ భావమును గురు ముఖతః మాత్రమే ఆరూఢపరచుకొని, తరించవలసియున్నది. "గురోన్ముఖేన జ్ఞాతవ్యం నాన్యథా గ్రంథ కోటిభిః అనిన్ని", "గురూపదిష్ఠ మార్గేణ మన సుద్ధింతు కారయేత్" అనిన్ని చెప్పబడుచున్నది. ఈ పరిపూర్ణబోధ అరూఢమగుటకు నిజ సాంప్రదాయక సద్గురువునే ఆశ్రయించుట ఎంతో అవసరమై యున్నది. ముఖ్యముగా గమనించవలసియున్నవి. కనుక, సర్వమానవ సౌభ్రాతృత్వము, అన్యోన్య సహకారము, ఐహికా ముష్మిక పురోభివృద్ధికి తోడ్పడుచు పరమ శాంతితో మానవ జన్మను చరితార్థత గావించుకొని గురుమూర్తి దివ్యశ్రీ చరణములు అండగా గైకొని సర్వులు దివ్య జీవితము గడుపుచూ కృతార్థులుగావలసియున్నది.

13. పరిపూర్ణ బోధ - సాధానాంతర నిరపేక్షము

పరిపూర్ణ బోధయందు కృషిచేయు గురుపుత్రుడు యితర సాధనలు మానవలెనా? సాధారణముగా ఈ ప్రశ్న సర్వులకు జనించుచునే వుండును. దీనికి జవాబు బడయ వలెవన్నచో ముందుగా పరిపూర్ణ బోధయందు సిద్ధాంతపరమైన నిర్ణయ విధానము తెలియవలసియున్నది. పరిపూర్ణ బోధ అనగా నేమి? దేనినాశించి పరిపూర్ణబోధ పొందవలెను? పరిపూర్ణబోధ యందు శిష్యుని ఆచరణ విధానము ఎట్లుండవలెను? ఒక్క గురూపాసన ద్వారా సర్వార్థసిద్ధి ఎట్లు పొందగలడు? మున్నగు విషయములను విపులముగా విచారించవలసియున్నది.

"దుర్లభం మానుషం దేహం, వివేకం అతిదుర్లభం", అనే నిర్ణయానుసారంగా దుర్లభమైన మానవోపాధిని పొంది పరమపురుషార్థమనంబడు జన్మతరుణోపాయమునకు కృషిసల్పక, కేవలం ప్రాపంచిక సుఖమునకై జీవితమును, వినియోగించువాడు నిజముగా పశుతుల్యుడే. జన్మరాహిత్య మోక్షం పొందుటయే మానవుని ప్రధాన కర్తవ్యం స్వధర్మమునై యున్నది. మానవుడై పుట్టుట మరల పుట్టుక లేకుండా చేసుకొనుటకే, అని పెద్దల సూక్తి.

యిట్టి జన్మరహితము ఒక్క పరిపూర్ణ బోధ చేతనే సిద్ధించ గలదు. ఏలననగా మతవాదులు జన్మకర్మలకు కారణమగు బ్రహ్మమునే మోక్షస్థానముగా నిర్ణయించి, తత్ ప్రాప్తికై వివిధ రూపములైన మత నిర్ణయముల నేర్పరచి, మత సరిహద్దులలో చిక్కి జన్మరహితం పొందగలమని అపోహ చెంది యున్నారు. పరిపూర్ణబోధయందు జన్మంతరుణోపాయము చక్కగా ఎరుకపరచబడియున్నది. జన్మకర్మలకు అత్యంత మూలకారణమైన అధిష్టాన చేతన బ్రహ్మమును వస్తు నిర్ణయ రూపముగా ఎరుకపరచి, దానినంటక సర్వత్రా నిండియున్న అచల పరిపూర్ణ బ్రహ్మమును ఉండజూపి సర్వభ్రాంతి రాహిత్యస్థితిని ప్రసాదించునది పరిపూర్ణబోధ. సాలోక్యాధి పంచముక్తులను పొందినా, అహం బ్రహ్మాస్మియను అనుభవము పొందినా నిర్వికల్పసమాధిస్థితిని పొందినా, జన్మకారణమగు వస్తువు మిగిలియే యుండును కనుక మరల జన్మ పరంపరలకు లోనుకావలసినదే. ఒక్క పరిపూర్ణ బోధయందే తిరిగి పుట్టని మార్గము నిర్ణయింపబడియున్నది.

కావున జన్మరాహిత్యమాశించి కృషిచేయు ముముక్షువు పరిపూర్ణ బోదను విధిగా ఆశ్రయించవలసియున్నది. ఉత్తమాధికారిని ఉద్దేశించుచు, మోక్షసంకల్పము కూడా బంధహేతువేనని నిరాలంబోపనిషత్తు "కేవలమోక్షాపేక్ష సంకల్పో బంధః" అని నిర్ణయించి యున్నది. జన్మరాహిత్యరూప సర్వభ్రాంతి. రాహిత్యస్థితి ఒక్కటియే గురుపుత్రుని ఏకైక

లక్ష్యంగా ఉండవలెను. ఏ భ్రాంతులకును లోనుగాకుండా వుండవలెను. పరిపూర్ణబోద యందు, తాను అనే వస్తువునే త్యాగము చేయువిధానము నిర్ణయింపబడినది. సమస్త సుఖదుఃఖములకు, రాగద్వేషము లకు, తానేమూలము "ఆత్మ వసుకామాయ సర్వం ప్రియంభవతి" అని శృతి నిర్ణయించినది. జన్మకర్మలకుతానే మూలము తనమూల నాశనమునందు తప్ప జన్మరాహిత్యము సిద్ధించ నేరదు. తన్ను తాను త్యాగము చేసుకొనుటయే జన్మ స్వార్ధత్యాగము. రాహిత్యస్థితి ఒక్కటియే ఇదియే నిజమైన త్యాగము. జన్మకర్మలకు తానేమూలము. తన మూల వినాశనయందు తప్ప జన్మరాహిత్యము సిద్ధింపనేరదు. తన్ను తాను త్యాగము చేసుకొనుటయే స్వార్థత్యాగము. ఇదే నిజమైన త్యాగము యీభావమే. భగవత్ గీతయందు శ్రీకృష్ణుడు, అర్జుననకు "సర్వధర్మాన్ పరిత్యజ్యమాఏకం శరణం వ్రజ అంటూ నీవైన ఆత్మను, గురువగు నాకు అర్పించి కర్తృత్వ రహితముగా కర్మాచరణ మొనర్చమనియు, పుణ్యాపాపములంటని, అశరీరపద్ధతిని, తానొసంగెదననియు, గీతోపదేశమందు విశదపరచియున్నాడు.

జన్మరాహిత్యం ఒక్క గురూపాసనద్వారా మాత్రమే పొందవలసివున్నది. "గురోర్ముఖేన జ్ఞాతవ్యం నాన్యథాగ్రంధకోటిభి:" అనిన్నీ "గురూపదిష్ట మార్గేణా, మునశ్శుద్ధింతు కారయేత్ అనిన్నీ నిర్ణయించబడియున్నది. "జ్ఞానా దేవతుకైవల్యం", "సత్యజ్ఞానమ నంతంబ్రహ్మా", "ఏకమేవా అద్వితీయం బ్రహ్మా", అని చెప్పబడిన తన నిజరూపమైన పరమాత్మ స్వరూపము తెలియవలెన్నను, "యతోవాచోనివర్తంతే. అప్రాప్య మనసాసహ", అనినీ, "నచక్షర్గచ్చతి. నవాగ్లచ్చతి, నోమన:", అనిన్ని "నైనం ఛిందంతి శస్త్రాణి" మొదలగు శ్రుత్మిస్మృతులచే నిర్ణయింపబడిన కేవలపరిపూర్ణపరబ్రహ్మము వుండచూచుకొనవలెనన్నను, ఎరుకను వీడి అశరీర పద్ధతిలో కర్తృత్వరహితముగా కర్మల నాచరించుచు, ధన్యజీవితము గడపవలెనన్ననూ ఒక్క గురుకృపవల్లనే సాధ్యమగునని చెప్పక తప్పదు. "పరిపూర్ణమెరుక లెట్టివొ గురు ముఖమున రెంటిలెస్స గురుతెరిగెరుకన్, సరిపుచ్చుకున్న మృషయని, పరిసుద్ధపు బోధయిది. పాటించికనరా శివరాములపద్ధతి యిదేరా" అనిన్ని "ఎరుక తనకు తావీడి పోదు మెరుకను విడిపించలేరు ఎవ్వరు ధాత్రిన్, గురుడొకడుతప్ప" అనిన్న "అపరోక్షమౌనె మనుజులకు, పరోక్షంబైన బైలుగురు కృపలేకన్". అనిన్నీ కందార్థములలో సర్వోత్కృష్టమైన గురుకృప కలుగుటకు గురూపాసన ప్రధానాంగముగా నిర్ణయింపబడినది. ఒక్క గురుకృప నాసించియే గురుపుత్రుడు, గురూపాసన, గురుమంత్రానుష్టానము, కావింపవలసివున్నదేకాని, యితరమైన యేకోరికలను ఆశించరాదు.

గురుకృపనాశించి, గురుపాసనచేయు గురుపుత్రునికి యితరోపాసనలు యితరసాధనలు వర్జనీయములే. ఏలననగా ఏకలక్ష్యమన్నపుడే ఏకాగ్రత సిద్ధించును. ఏకాగ్రత సిద్ధించినగాని మనస్సుధ్యేయ వస్తుదాత్మ్యము చెందదు, గురుకృపావిర్భావము వలన అతడు సర్వార్థ సిద్ధిని గాంచగలడు. గురూపదిష్ట మార్గమందు అనుష్టాన ఆచరణ, విచారణలు సలుపుచూ, నాలుగు శుశ్రూషములు లోలత గావించుకొనుచు ఇతర సాధనలనుమాని కృషిచేయువాడు తప్ప కృతకృత్యుడు కాగలడు. ఈ భావమునే శ్రీకృష్ణదేశికేంద్రులవారు తమ కందర్థాములలో "జలము నేడబాయ నొల్లని, జలచరములు రీవిభూని సత్శిష్యుడు హృజ్జలజంబను. పీఠముపై నిలపి యితరముమాని గురువునే కొల్చుసుమ్మి! **తదూక్తులచే తలచునమ్మి**" అనిపేర్కొని యున్నారు. "యితరము మాని" అను మాటను ముఖ్యముగా గమనింపవలసివున్నది. గురుపుత్రుడు. భావశ్రూషకెన్నడును భంగము కలుగకుండా ప్రవర్తింపవలసి వున్నది. తాను ఏ భావమునందు ప్రవర్తిచవలసివున్నదో గురుముఖమున గుర్తించి దానియందే వర్తించుచూ యితరేతర సాధనలన్నియు సంపూర్ణముగా వర్జించుటయే భావశుశ్రూష. అన్ని భావములకు అవకాశమిచ్చు అఖండ యెరుకయే పరిపూర్ణ బోధచే అభావము గావింపబడుచున్నది. కావున ఏ విధమైన భ్రాంతికి లోనుగాకూడదు. దీనిని గురుపుత్రులు విధిగా పాటించవలసియున్నది. యితరమైన సాధనల భ్రాంతిలో మునిగి పరిపూర్ణ బోధ ఆరూఢపరచుకొనలేక రెండింటికి చెడిన రేవడిరీతిగా అధోగతి పాలగుట, కడుంగడు శోచనీయము. కావున గురుపుత్రుడు, యితరమైన సాధనలన్నియు ప్రయత్న పూర్వకముగా విసర్జింపవలసియున్నది. గురుకృప వలన తాను కోరకనే సర్వార్థసిద్ధి పొందగలడు, అన్ని సాధనలు యెరక నిర్ణయమునకే, పరిపూర్ణబోధ ఏ సాధనల చేత పొందనలవికాదు. ఒక్క గురుకృప వల్లనే ఆరూఢము కావలసియున్నది. ఆతని యెడల యితర సాధనలన్నియు నిరర్థకములే అగును.

కావున జన్మరాహిత్యమాశించి గురూపదిష్ట మార్గమందు కృషిచేయు ముముక్షువులందరూ, గురువునియోగించిన మార్గమందే కృషిసల్పుచూ, భావశుశ్రూషకు భంగము కలుగనివ్వకుండా ఇతర భ్రాంతులకు లోనుగాక, సర్వభ్రాంతి రాహిత్యస్థితియే పరమావధిగా నెంచి గురుభక్తి, గురుసేవ, గురునిష్టలందేమరక, అనుష్టాన, ఆచరణ విచారణల ద్వారా గురుకృపవడిసి లక్ష్యసిద్ధిగాంచవలెను.

14. అంతశ్శౌచము

ప్రభాత సమయమున సదాచార సాంప్రదాయ యుక్తడగు ఒక బ్రహ్మణోత్తముడు చెరువులో స్నాన మాచరించి సూర్యునకర్ఘ్యమొసంగి ఆ చెరువుకట్టపై దర్భాసనమువై చికూర్చొని, జపమాలను చేత ధరించి నిమీలిత నేత్రుడై ఉత్తరాభిముఖ్ఖుడై మంత్రజపము చేయుచుండెను. అట్టి సమయమున చెరువులో ఒక మూల చాకలి వాడొకడు విప్రునకు సమీపముగా బట్టలు ఉతుకుచుండెను. ధ్యాననిష్టుడగు ఆ ద్విజుని రజకుడు చూడలేదు. పొరపాటున ఉతుకుచున్న వస్త్రముల నుండి ఒక జలబిందువు ఎగిరి విప్రునిపై బడెను. వెంటనేయితడు జపధ్యానములను విరమించి రుద్రాకారుడై లేచి నిలబడి బట్టలుతుకుచున్న చాకలి వానిని గాంచిన తోడనే ఆతనిలో క్రోధాగ్ని రగుల్కొనెను. కారుచిచ్చువలె అది హృదయసీమ యందంతటను వ్యాపింపతొడగెను. తత్ప్రభావముచే యితడు ఒడలు మరచిన వాడై తానివరో ఎదుటి వాడెవడో తెలియని పరిస్థితికి దిగజారి పోయెను. అత్తరియతడు చెరువుకట్టపై నుండి క్రిందకు దిగి చాకలిని సమీపించి తనపై మురికినీరు చల్లినందులకు దుయ్యబట్టి నానాదుర్భాషణలాడి పరుష వాక్యములు పలికి పలువిధములు దుమ్మెత్తిపోసెను. అంతటితో ఆగక పరమక్రోధావిష్ఠుడై ఆ చాకలి వీపుపై రెండు దెబ్బలు కొట్టెను. చాకలి మారు పలుక లేదు. ప్రతికారము సలుపలేదు. ప్రశాంతత చిత్తుడై యుండెను. అయ్యో! చాకలి వానినితాకి వైచితినే! నేనవరు? అతడెవరు? నా కులమేమి? అతని కులమేమి? రామ రామ! ఎంత పొరపాటు జరిగినది. ఇప్పుడు నా శరీరము అపవిత్రమై పోయినదే! అని పశ్చాత్తాప పడుచు ఆమైలను పోగొట్టు కొనుటకై దూరముగా పోయి ఆ చెరువులో ఒకమూల స్నానము చేయుదొడగెను. చాకలియు వేరొక చోట స్నానమునకు ఉపక్రమించెను. చాకలి స్నానము చేయుచుండగా ద్విజుని చిత్తమున సంభ్రమాశ్చర్యములు రేకెత్తినవి. అతడు తన మనంబున ఇట్లు తలపోసెను. చాకలిని తాకినందు వలన నేను స్నానము చేయుట న్యాయముగానున్నది. మరి ఆ చాకలి ఎందులకు స్నానము చేయుచున్నాడు? దీనికి కారణమేమియో అరయుట ఉత్తమము అని తలంచి వెంటనే విప్రవర్యుడు రజకుని చెంతకు వెళ్ళి "ఓరీ! నిన్ను తాకినందువలన నేను స్నానము చేయుట న్యాయము. మరి నీవెందులకు స్నానము చేయుచున్నావు? ఆ రజకుడు ప్రశాంతచిత్తుడై నవ్వుచూ, అయ్యా! నిన్ను తాకినందు వలన నేను స్నానము చేయుచున్నాను అని ప్రత్యుత్తరమిచ్చెను. అది విని భూసురుడు ఇదెక్కడ న్యాయమురా! నేను బ్రహ్మణుడను. నీవు అబ్రహ్మణుడవు నిన్ను స్పృశించునందువలన నేను స్నానము చేయుట సహేతుకము. మరి నీ స్నానము యొక్క ఆంతర్యమేమి? అని పలుకగా రజకుడిట్లు చక్కని సమాధాన మొసంగెను. ఓ విప్రవర్యా మీ దేహము

పవిత్రమైనది. నేను దానిని గౌరవించెదను. కాని మీ శరీరము లోపల కోపమను చండాలుడు ప్రవేశించినాడు. అతనిని స్పృశించి నందువలన నేను అపవిత్రుడనై పోయితిని. అందుచేత స్నానము చేయవలసివచ్చినది. రజకుని యా గంభీర వాక్యములు కర్ణ పుటములందు బడగనే విప్రునకు జ్ఞానోదయమయ్యెను. తన పొరపాటు గ్రహించి పరితప్త హృదయుడయ్యెను. అయ్యో! అనవసరముగ నోరు పారవేసుకొంటినే! పాప మా రజకుడు కట్టపై నున్న నన్ను చూడలేదు. పొరపాటున ఒక చుక్క నీరు పడినది. అంత మాత్రము చేతనే నేను శాంతమును వీడవచ్చునా? అన్యాయము. రజకుడు చెప్పినది పరమ సత్యము. అతని వాక్యములచే నాకు కనువిప్పు కలిగినది. కోపము చావనిదే ఎన్ని శాస్త్రములను చదివిన నేమి ఫలము. ఎన్ని కోట్ల జపము సల్పిన ఏమి లాభము? లోని అసూయ తొలగినదే లోని ద్వేషము అంతరించనిదే ఈ పైపై చేష్టల వలన ఏమి ఉపయోగము. చిత్తశుద్ధిలేని శివపూజ వలన ప్రయోజనముండునా? నేను పుట్టను కొట్టుచున్నాను. పాములు చావలేదు. శరీరము విభూతి రేఖలచే అలంకరించుకొనుచున్నాను. మడి బట్టలచే పవిత్రము గావించు కొనుచున్నాను. కాని అంతరంగమున కామక్రోధాది చండాలుడు విజృంభించుచున్నారు. వారిని తొలగింపనిదే వారికి ఉద్వాసన చెప్పనిదే, ఈ శరీరము ఎంత పవిత్రముగ నున్నప్పటికిని అపవిత్రమైనదే యగును. ఇకమీదట ఈ పొరపాటు జరగనీయను. ఈ దుర్గుణరాశిని హృదయకోశమున రావణ కాష్ఠమువలె రగుల్కొననీయను. దానిని ప్రయత్నపూర్వకముగా దూరికృత మొనర్చి బాహ్య శుద్ధితోబాటు అంతర శుద్ధిని గూడ సంపాదించుకొందును అని నిర్ణయము గావించుకొని వీడిపోయెను.

15. అభిమానము

అభిమానమనునది అంతఃరేంద్రియమైన అహంకారమునకు ఆదిభౌతికమై యున్నది. ఈ అభిమానం వల్లనే మానవుడు పుణ్యపాప కర్మాచరణ చేయుచూ సంసారబద్ధుడై అనేక నీచోత్తమ జన్మలు పొందుచున్నాడు. ఈ అభిమానమనునది భిన్న భిన్న రీతులలో ప్రకటమగుచున్నది. 1. స్థూల శరీరాభిమానము 2. కులాభిమానము లేక జాత్యభిమానము 3. మతాభిమానము 4. దేశాభిమానము 5. స్వాభిమానము లేదా ఆత్మాభిమానము. ఇవన్నియు స్వార్థమును పెంచుటచే పారమార్థికాభ్యున్నతికి ఆటంకములగుచున్నవి.

1. స్థూల శరీరాభిమానము :

ఈ స్థూల శరీరమే నేను దీనిని ఏ విధముగానూ బాధింపకుండా సుఖపెట్టుటయే ముఖ్యావసరము. అన్యాయ మార్గముల చేతనైనా సరే ఈ శరీరమును, శరీర సంబంధులగు భార్యా పుత్రాదులను ఎట్టి ఇబ్బందులకు లోను కానివ్వకుండా వారిని కూడా తనవలెనె

సంతోష పెట్టుగలగుట తనకు పరమావధి అని ఎంచి మానవుడు సంచరించుచూ అధోగతి పాలగుచున్నాడు. ఈ స్థూల శరీరా భిమానముచే అనేక బంధములు స్వయముగా కల్పించుకొని, తన స్వార్థము కొరకై ఎదుటి వారికి ఎంత హానియైనా సరే కల్పించి తన్ను రక్షించుకొని సుఖపడుటకుద్యుక్తుడగుచున్నాడు. విచక్షణా జ్ఞానము కోల్పోయి పుణ్య పాప రూపకర్మాచరణ చేయుచూ, అనేక నీచోత్తమ జన్మలను పొందుచున్నాడు. మరియు దేహవాసనకు చిక్కి, శరీర పుష్టికి సౌందర్యమునకు ప్రాకులాడుచున్నాడు.

2. కులాభిమానము లేక జాత్యాభిమానము :

కులాభిమానముచే తాను అగ్రజాతికి చెందిన వాడననో లేక అగ్రకులమునకు చెందినవాడననో ఎంచి తక్కువ కులముల, వారిని యేహ్య భావముతో తనకంటే హీనులుగా తలంచుట ప్రారంభించును. జాతులందు విద్వేషము పెరుగును. వర్గకలహములు హెచ్చి సర్వమానవ సౌభ్రాత్వము అన్యోన్య సహకారము కలుగుటకు బదులుగా అనైక్యత ఏర్పడి మానవ సమాజము నందు ప్రశాంతి లేకుండా చేయుచున్నది. ఒకరికంటే ఒకరు అధికులమని నిర్ణయించుకొని, వారి ఆధిక్యతను నిలద్రొక్కుకొనుటకు ప్రయత్నాలు సాగించుచున్నారే కాని, పరమాత్మ నిర్ణయ పద్ధతి తెలియలేకున్నారు. వర్ణవ్యవస్థ తారుమారై కులవృతులు నశించి ధనార్జనయే పరమావధియని ఒకరితో నొకరు పోటీలు పడి అన్యోన్య సహకారము నశించి స్వార్థబుద్ధి పెరుగుచున్నది. సంఘమునందు వర్గభేదములు అవతరించి, మానవత నశించుచున్నది. యీ పరస్పర ద్వేషములు నశించి సమైక్యత సిద్ధించవలెనన్న వర్ణవ్యవస్త నశించుటే ఏకైక మార్గమని చెప్పక తప్పదు. దీనిని సమూలముగా నాశనము గావించిన గాని, సుఖశాంతులు కలుగవని, మానవుడు గ్రహింపగలిగినా స్వార్ధ దృష్టి విడువలేక మనోదౌర్భల్యము వల్లనో లేక యితర ప్రాద్బలము వల్ల ఆచరణయందుంచ లేక పోవుచున్నాడు కులాభిమానము మానవుని నుండి దూరమై సర్వమానవ సౌభ్రాతృత్వము, అన్యోన్య సహకారముతో సంఘజీవనము సుఖశాంతిమయమై వెలుగుట పరిపూర్ణ భావమెట్లు సహకారి కాగలదో ముందు ముందు విచారించవలసియున్నది.

3. మతాభిమానము :

మతాభిమానము, వలన ఎవరి మత సిద్ధాంతములు వారు నమ్ముకొని వానిని ఆచరించి ప్రగతి పథం అధిరోహించుటకు బదులుగా, ఒకరి ఆచార విచారములు, మరియొక్కరు విమర్శించుకొనుచూ, కలహములు పెంచుకొని సమాజమునకు తీరని కీడు ఏర్పరుచు చున్నారు. ముఖ్యముగా మానవుని నిత్యదైనందిన జీవితము నిర్ణయించి, సంఘజీవనము పటిష్టము గావించి, మానవాభ్యున్నతికి పాటుపడి, జీవితము శాంతి వంతము గావించుట కొరకు కదా మతములు ప్రవర్తిల్లినవి. ఏ మతమైనను మానవుని స్వధర్మ పరాయణుని

గావించి సమిష్టి శ్రేయోదాయకమైన పద్ధతిలో నడవడి నిర్ణయించి, మానవుని మానవునిగా గుర్తింపచేసి,సమిష్టి శ్రేయస్సు ప్రాప్తింపచేయుటయే ముఖ్యోద్దేశము కదా! సంఘవినాశమునకే మతపద్ధతులు వినియోగింపబడుట కడంగడు శోచనీయము. మత యుద్ధ జ్వాలలలో శలభముల వలె తండోపతండములుగా నాశనమైపోయిరి. ఇట్టి మతముల వల్ల మానవ సమాజమునకు ఈషణ్మాత్రము కూడా ప్రయోజనముండబోదు. ప్రపంచమును మతముల అల్లకల్లోలము చేసిన ఘట్టములో చరిత్రలో కోకొల్లలు, అన్య మతస్థుల నాశనము చేయుట ఒక మహాపవిత్ర కార్యము దేవునికెంతో ప్రీతికరము. కనుక ప్రాణహానికి కూడ వెరువక మతాభిమానముచే ఒండురులు విమర్శించుకొనుచుండిరి.

ఈ మతాభిమానము వల్ల చరిత్రలో ఎన్ని మత కలహములు ఏర్పడి, సంఘజీవనము నష్టపడియున్నదో తెలియుచునేయున్నది. స్వ మతాభిమానముతో పాటు అన్యమత విద్వేషము ప్రబలి, అన్యమతములు నిర్మూలనముకై నడుముకట్టి మత యుద్ధముల చెలరేగి చిరకాలము ప్రపంచం అశాంతిలో మునిగిపోయెను. మానవుని మతదురాభిమానమును పాద్రోలి పరమాత్మ నిర్ణయ విధానము ఎరుక పరచి, సంఘశ్రేయస్సుకు తోడ్పాటుకు పరిపూర్ణ బోధ ఎట్లు సహాయకారి కాగలదో ముందు విచారింతము.

4. స్వాభిమానము లేక ఆత్మాభిమానము :

స్వాభిమానము వల్ల మానవుడు అనేక కష్టములకు లోనగుచున్నాడు. అభిమాన ధనుడనని, అభిమానవంతుడనని నిర్ణయించుకొని, మానవుడు అశాంతికి లోనగుచున్నాడు. ఈ స్వాభిమానము వల్లనే మిగిలిన యితరాభిమానములన్నియు కలుగుచున్నవి. తనయందు తనకు అభిమానము ఉండుట వల్లనే ఇతర మంతయు తనకు ప్రేమ పాత్ర మగుచున్నది. జీవితములో ధనమైనా, భార్యాపుత్రాది బంధు వర్గమునైనా, గృహారామక్షేత్రాదులనైనా వదలుకొనగలడు గాని, స్వాభిమానము వీడలేడు. పైన పేర్కొన్న వాని వల్ల తనకు ఎంత మాత్రము సుఖశాంతులు లేవని గ్రహించి చివరకు వీనిని సన్యసించి, ఏకాకిగా నుండుటకైనా ఉద్యుక్తుడగు చున్నాడు. స్వాభిమానము ఎట్లు కలుగుచున్నది? దీనికి మూలకారణమేమి? తనకు మూలమైన బ్రహ్మాండమందు కూడా ఈ అభిమాన కారణమున్నదా? సృష్టి కారణమైన బ్రహ్మమందు కూడా ఎట్లు అభిమానము కలదు? విమర్శించవలసియున్నది.

అభిమానము అహంకారము యొక్క ఆది భౌతికమని ముందుగానే పేర్కొనియున్నాము. అహంకారమనగా "నేను" అని అర్థము కదా! ఈ నేననే గుర్తు ఎట్లు కలుగుచున్నది? ఈ "నేను" ను గూర్చి సంపూర్ణముగా విచారించి తెలియవలసియున్నదని శ్రీ రమణ మహర్షుల వారున్నూ సెలవిచ్చియున్నారు. ఈ నేను అనగా నెవరు? జవాబుకై ఆది నుంచి యా జిజ్ఞాస గావింపబడుచునే వున్నది. స్థూల శరీరము, ఇంద్రియములు, మనస్సు, బుద్ధి

వీటికాధారమగు అంతఃకరణము వీనిని గూర్చి విమర్శిస్తూ, ఇందేదియూ నేను కాననియు, వీనికి విలక్షణముగా నుండినది నేననియు, అదియే ప్రత్యగాత్మ అనియు, ఆ నేను సాన్నిధ్యమాత్రకర్తృత్వము కల్గి వ్యవహరించుచున్న దనియు, మత సిద్ధాంతంలందు నిర్ణయించియున్నారు.

ఈ నేను వ్యష్టియందు ప్రత్యగాత్మ గాను, సమిష్టియందు పరమాత్మగాను వున్నది. ఈ రెంటికి ఐక్యత సాధింపబూనుటకై సామ వేదాంతర్గతమగు చాందోగ్యోపనిషత్తు నుండి "తత్వమసి" మహావాక్యము గైకొనబడి వాక్యములోని తత్త్వంపద పదార్థములు అన్వయ వ్యతిరేక యుక్తులచే శోధించి వాక్యార్థ జ్ఞానమును పొందవలసియున్నది. "తత్వమసి" ఉపదేశము పొందిన శిష్యుడు "అహం బ్రహ్మాస్మి" అని మనము చేయుటకుపక్రమించి, అహం లక్ష్యార్థమగు ప్రత్యగాత్మను సాక్షాత్కరించుకొనుట కుపక్రమించుచున్నాడు. కాని ఇది అంతయు సామాన్యుడు గాక పండితుడు మాత్రమే గ్రాహ్యము చేసికొనగలడు. అట్లుగాక సామాన్యునికి కూడా అందుబాటులో నుండి వారి అభ్యున్నతికి కూడా, వస్తు నిశ్చయ పద్ధతిగా ప్రబోధ విధానము గల సిద్ధాంతమే ఈ మత సిద్ధాంతములు కన్నా ఉత్తమోత్తమమైనదని నిస్సందేహముగా చెప్పవచ్చును. అట్టి వస్తునిశ్చయ జ్ఞానబోధ పద్ధతి పరిపూర్ణ సిద్ధాంతమునందు మాత్రమే నిర్ణయించబడియున్నది.

"నేను" అను వస్తువును నిర్ణయించుటలో అన్నపు సూక్ష్మాంశమైన మనస్సు జల సూక్ష్మాంశమైన ప్రాణము ఈ రెండు కలిసి 'నేను' అనే అహం, లేక గుర్తు కలుగుచున్నదని స్థూలముగా చెప్పవచ్చును. ఈ 'నేను'కు హృదయ స్థానము నిర్ణయము ఇట్లు చెప్పినచో దాని అఖండ వ్యాప్తికి భంగము కలుగును. మేను ఎంత ఆవరించియున్నదో, నేను కూడా అంతా ఆవరించుకొనియున్నదని అచల ఋషులు చెప్పు నిర్ణయమే సమంజసముగా నుండును. ఈ రెంటిని గూర్చి గురుముఖతాః వస్తు నిశ్చయ పూర్వకంగా వినవలసి యున్నది. వ్యష్టియందు మనఃప్రాణములు చేరికలో 'నేను' కలిగనట్లే బ్రహ్మాండమునందు కూడా పరమాత్మకు సమిష్టి మనఃప్రాణముల చేరికలో సమిష్టి అహంకారము లేక మహదాహంకారము కలుగుచున్నదని తెలియవలెను. వ్యష్టి అహంకారముల కెల్ల ఇది మూలమగుటచే సమిష్టి అహంకారముగా చెప్పబడినది. ఈ వ్యష్టి సమిష్టి అహంకారముల రెంటికి సృష్టికారణమైన బ్రహ్మము ఆధారము, అధిష్టానముగా నిర్ణయింపబడినది. సృష్టి కారణమైన బ్రహ్మమునందు కూడా నేను అనే అహంకారము కలదా? అన్నచో తప్పక కలిగియున్నదని చెప్పవలెను. కారణమందు ఏ లేశమాత్రంగానైనా లేకున్నచో కార్యము ఏర్పడుటకు అవకాశము లేదుకదా! సృష్టికి పూర్వము తాను తానైయున్న బ్రహ్మమునందు నేను అనే గుర్తు అణిగియుండి అహం స్ఫురణ కలిగి "సోమఅకాయత బహుస్యాం ప్రజాయేయ" అను సంకల్పము కలుగుటతో

త్రిగుణాత్మకమైన ప్రకృతిగా విజృంభించి, జీవేశ్వర జగత్తుగా పరిణమించినది. ఈ సృష్టికి నేను కర్తను అను కర్తృత్వము గల్గి బ్రహ్మాండమందు సమిష్టి అహంకారము గాను, పిండాండమందు వ్యష్టి అహంకారముగాను వ్యవహరింపబడుచున్నది. ఈ నేను యొక్క వాస్తవిక స్థాన, స్వరూప, స్వభావములను గూర్చి వివరముగా సద్గురువుల చెంత సత్ శిష్యులు వస్తు నిశ్చయముగానే ఆరూఢ పరుచుకొనవలసియున్నది. **"బ్రహ్మణోన్యంనకించన"** సర్వంఖల్విదం బ్రహ్మ" అనే శ్రుతుల నిర్ణయానుసారంగా సర్వ వ్యాపకమైయున్న "నేను"తో ఐక్యత సాధించవలెననుట నిజముగా హస్యాస్పదమే కాగలదు. ఖండత్వము సోపాధికము. ఖండా ఖండములుగా గానవచ్చుచున్నదే గాని వస్తుతః అఖండముగానే యున్నది. కనుక ఐక్యత కొరకు ప్రాకులాడక వస్తునిశ్చయ పద్ధతిగా ఆరూఢపరుచుకొనవలసియున్నది. అధిష్టాన చేతనమే "నేను" అని చెప్పవలెను. స్వాభిమానము. స్వ అనగా తాను పరమాత్మ స్వరూపుడే కదా! తనయందుగల అభిమానమే. ఇతర అభిమానములన్నింటికి, ఆధారభూతమగు చున్నదని స్పష్టముగా తెలియుచున్నది. "ఆత్మ వస్తుకామాయ సర్వం ప్రియంభవతి" అని యీ భావమునే బృహదారణ్యకోపనిషత్తు నిరూపించుచున్నది. కనుక యీ అభిమానము వల్లనే అభిమానములన్నియు ఏర్పడుచున్న వని తెలియుచున్నది. యీ స్వాభిమానమే అనేక అనర్థములకు హేతుర్భూతమగుచున్నది. నేను బ్రాహ్మణుడనని విద్వాంసుడనని, ధనవంతుడనని వ్యష్టి అభిమానము చేతను, నేను సర్వకర్తను, నేను బ్రహ్మమును అనే సమిష్టి అభిమానము చేతను, నేను ఆత్మ స్వరూపుడననే పరిపక్వ అహంకారము చేతను, మానవుడు బంధింపబడి, సుఖ దుఃఖములు పొందుచున్నాడు. కావున అభిమాన రాహిత్యము సిద్ధించినగాని, మానవునికి శాశ్వత సుఖశాంతులు కలుగజాలవు.

యీ స్వాభిమానము లేక మహదహంకారము ఎట్లు, ఏ విధమున నాశనము కాగలదు? పరిపూర్ణ బోధయందు ఈ అభిమాన రాహిత్యము ఎట్లు సిద్ధించునో వివరింపబడినది? భగవద్గీతయందు శ్రీకృష్ణుడు, స్వాభిమాన పూరితుడై, మోహగ్రస్తుడైయున్న అర్జునునికి, అహంకార నిరసనతో కూడిన పరిపూర్ణ బోధను ఎరుక పరచి కర్తవ్యనిష్ఠుని ఎట్లు కావించెను? మతముల నిర్ణయమేమి? పరిపూర్ణ బోధయందు అహంకార రహిత రూప అశరీర పద్ధతిలో పరిపూర్ణ భావజ్ఞుని ఆచరణమెట్లుండును? అభిమాన రాహిత్య మెట్లు సిద్ధించును. వ్యష్టి అభిమానము ఒక్క గురుసేవ చేత మాత్రమే రహితముగా గలదా? ఎట్లు? తదాచర విధానమేమి? అభిమాన రాహిత్యము ద్వారా గురుపుత్రుడుఇతరాభిమానముల నుండి ఎట్లు విముక్తి చెందగలడు? గీతోపదేశముతో మోహగ్రస్తుడై స్వాభిమానపూరితుడై,రథముపై చతికిలబడి కింకర్త వ్యతామూఢుడైయున్న నరునకు, నారాయణుడు నిర్దేశించి, కర్తవ్యోన్ముఖుని గావించిన రహస్యమేమి? అతడు అభిమాన రహితుడా? మున్నగు

విషయములు చక్కగా విచారించవలసియున్నది.

ఉపదేశ కాలమందు ముముక్షువు తనతనుమన ధనములు త్రికరణ శుద్ధిగా గురుమూర్తికి అర్పణ చేయును. ఆ విధంబున తన సర్వస్వము అనగా తన స్థూల,సూక్ష్మ, కారణ, మహాకారణ శరీరములను గురువునికొసగి, శరణాగతి చెందిన గాని, గురుమూర్తి, ఉపదేశమొసిగి, అభయ ప్రధానము చేయునా? ఈ విధమైన పద్ధతిలో ఇక శిష్యునికి నా అనే వస్తువు లేదు అది సమూలముగా గురువునకు అర్పింపబడినది. ఇక "గురువాక్యం యధాతదా" అనే నిర్ణయానుసారంగా గురుమూర్తినిర్దేశించిన మార్గమునందే తన త్రికరణములను ప్రవర్తింపచేయును. సర్వము గురుమయముగా భావించును. "గురుసాక్షాత్ పరబ్రహ్మ" అనే విధంగా గురువు నరుడనే భావన తొలగిపోయి పరుడే అనే భావన పెంపొంది, చతుర్విధ శ్రూశ్రుషల యొక్క వాచార్థ్య, లక్ష్యార్థముల నెరిగి వానిని తూచ తప్పకుండా ఆచరించుచూ రాగా, వ్యష్టి అభిమానము రహితమై సర్వం గురుమయంగాతో చి, య దృచ్ఛా లాభసంతుష్టితో విషయములందు గలుగు తొట్రుపాటు తాకిడికి, అభిమానరహిత పద్ధతిలో ప్రవర్తించుచూ పారమార్థికాభివృద్ధికాభ్యున్నతి గాంచగలడు. తన యందలి స్థూల, సూక్ష్మ, కారణ, మహాకారణ శరీరములు ఏ విధంబున గురుమూర్తికి భావన రూపంలో అర్పించ వలసియున్నదో, గురుగీత ప్రథమోధ్యాయ యందలి లమిత్యాది పంచ పూజల నిజాభిప్రాయమును గురుమూర్తి ద్వారా విచారించిన ఇంకనూ స్పష్టము కాగలదు. ఒక్క గురుసేవ, గురుభక్తి వల్లనే వ్యష్టి అభిమాన రహితం కాగలదని గ్రహించవలెను.

ఇక పరిపూర్ణ బోధ యందు సర్వాభిమానములకు మూలకారణమైన స్వాభిమాన రహిత మెట్లు పొందుపరచబడినది? స్వ+ అభిమానం = స్వాభిమానం స్వ అనగా తాను పరమాత్మ స్వరూపుడే కదా! తన యందలి అభిమానము చేతనే ఇతరములన్నియు ప్రేమ పాత్రమగుచున్నవని తెలియవలెను. "ఆత్మ వస్తుకామాయసర్వం ప్రియం భవతి అని శ్రుతి నిర్ణయించుచున్నది. స్వాభిమాన రాహిత్యము సిద్ధించిన గాని మానవునికి శాశ్వత సుఖ శాంతులు కలుగబోవని తెలిసికొన్నాము కదా!

పరమాత్మ సృష్టియందు సర్వులు సమానులే. కులము, జాతి మానవుడే సృష్టించుకొన్నవే గాని, వేరు గావు. గురుముఖతః తన నిజరూపమైన ఆత్మయొక్క స్థాన, స్వరూప, స్వభావములు గుర్తించి **"మమాత్మా సర్వభూతాంతరాత్మ"** అనే నిర్ణయ పద్ధతిగా ఆత్మ దృష్టితో వ్యవహరింప గలిగినచో శరీర కులాభిమానములు నశించి సర్వులు తానే అనే సమిష్టి దృక్పధముతో సర్వమానవ సౌభ్రాతృత్వము ఏర్పడగలదు. అట్టి వస్తు నిశ్చయ

పద్ధతి ఒక్క పరిపూర్ణ బోధయందే నిర్ణయింపబడి గురుపుత్రుని కర్మయోగిగా నొనర్చి అనుష్ఠాన వేదాంత పద్ధతిని నిర్దేశించుచూ సర్వసమత్వ భావము పెంపొందింప చేసి సంఘ జీవనము సుఖశాంతిమయము చేయు బోధ విధానము నిర్ణయింపబడియున్నది.

సర్వమతములు "మతి" అనగా బుద్ధి చేతనే నిర్ణయింపబడినవి. "బుద్ధిగ్రాహ్యమతీంద్రియం" అనే గీతా నిర్ణయానుసారముగా బుద్ధికి మాత్రమే గోచరించగలది ఆ పరమాత్మతత్వము. కావున అదికూడ దృశ్య కోటిలో చేరిపోవును. "యద్దృశ్యం, తన్నశ్యం" అనే నిర్ణయానుసారంగా మతములచే నిర్ణయింపబడి, మోక్షస్థానమని వన్నెకెక్కిన బ్రహ్మము కూడా నశ్వరమే అగుచున్నది. దానియందు ద్వయ దోషపద్ధతి కలదు. సర్వద్వంద్వ రాహిత్యమైనది ఒక్క పరిపూర్ణ పరబ్రహ్మమే. అది సర్వలక్షణ విలక్షణమైనది. అది మతి అనగా బుద్ధిచేత గాని, దాని కారణమైన జ్ఞానము లేక ఎరుకచేతగాని తెలియబడనిది. అది ఎరుకలేకనే సేవించదగినది. మత నిర్ణయములన్నియు ఒకే నిర్ణయ విధానమును నిర్దేశించిన విభిన్న రూపముగానుండి, వేరువేరు ఆచార విచారములు కలిగి మత దురభిమానము ప్రబలి సంఘశ్రేయస్సు ఎట్లుకుంటుపడినదో ముందు విచారించియే వున్నాము. వస్తుతః అంతా పరమాత్మ రూపమే. అట్టి ఆత్మను గుర్తించి, సమిష్టి అంతఃకరణ వృత్తి విధానముతో ప్రవర్తించ గలిగినచో మత దురభిమానము సమసిపోగలదు. శ్రీకృష్ణదేశికేంద్రులు మతనిరసన గావిస్తూ, "మతముల వారలు తమ సమ్మతమైన శాస్త్ర మర్యాదలచే మితమేరుపరుచుకొని బహుగతులను కలంహింతురటి.| గతినీకేమీటికి చపలత చెందే స్థితినీ కేమిటికి" అని ప్రశ్నిస్తున్నారు. వేమన కూడా మతములందు ముక్తి వెదకిన లేదయా" అని ఉద్ఘాటించి యున్నాడు. మతములన్నియు బుద్ధి నిశ్చయ జ్ఞానమునే ప్రసాదించ గలవు గాని వస్తువు నిశ్చయ జ్ఞానమును గలిగింప లేవు. ఇదిగాక మత నిర్ణయములలో శాశ్వత సుఖము, అత్యంత దుఃఖ నివృత్తిని సంపూర్ణ మార్గమును నిర్దేశించ లేదు. "అహం బ్రహ్మాసి" అనే అద్వైత భావనయున్ను, దాసోహం అనే విశిష్టా ద్వైత భావనయున్ను సర్వభ్రాంతి రాహిత్యము కల్గించదు. ఇవి అన్నియు ఎరుక నిర్ణయములే" ఏ నిర్ణయము చేయని పరిపూర్ణ పద్ధతి నొక్క శివరామ దీక్షితులువారు తాము రచించిన దీక్షితీయ గ్రంథములో మత నిర్ణయ విధానమును క్రింది విధంగా నిరసించియున్నారు. "బ్రహ్మమన్నా సుఖ దుఃఖాలు తప్పలేదు. దాసుణ్ని అన్నా సుఖదుఃఖాలు తప్పలేదు. భ్రాంతి రహితం బ్రహ్మత్వం చేతా కాదు. దాసత్వం చేతా కాదు. రెండు అహంకారమే . యీ మూలంలేని గుర్తెరిగే శరీరమే. అహంకారమనిన్ని, అహంకారంవల్లనే అన్ని భూతాలు కలిగిన, వని న్నీ, అహంకారములేని గురువు కావలెనని న్నీ, అహంకారము వల్లనే అన్ని మతములు కలిగిన వనిన్నీ కైంకర్యము చేతగాని అహంకారం

వదలదని, అభిమానమే అని సిద్ధాంతీకరించి యున్నారు. కనుక సర్వనిర్ణయములకు భ్రాంతులకు మూలమైన ఎరుకను గురుబోధచే విడిపించుకొన్న గాని భ్రాంతి రహితము కాదు. తాను పరమాత్మ స్వరూపుడనే అభిమానము అన్ని అభిమానములకు కారణమగు చున్నది. ఈ స్వాభిమానము ఒక పరిపూర్ణ బోధచేతనే రహితము కాగలదు. పరిపూర్ణ మెరుకలను రెండిని వస్తు నిర్ణయముగా గుర్తించి గుర్తెరిగే తన తెలివిని లేకుండా చేసు కొనుటయే కదా పరిపూర్ణ బోధ. పరిపూర్ణ పరబ్రహ్మమందు ఎరుకపుట్టనే లేదు అనే భావన క్రమశః ఆరూఢమగుచున్న కొలది అంతఃకరణ నిర్వీర్యమై సర్వాభి మానములు రహితము కాగలిగి అశరీర పద్ధతి ఏర్పడగలదు. ఎరుకను విడిపించే గుట్టు గురుమూర్తి వద్దనే కలదు. ఈ భావమునే శ్రీకృష్ణదేశికేంద్రులు "ఎరుక తనకు తాపీడిపోదు, ఎరుకను విడిపించ లేరు ఎవ్వరు ధాత్రిన్ గురుడొకడుతప్ప" అని గురువు ఆధిక్యతను నిరూపించియున్నారు. ఒక్క గురుకృప వల్లనే పరిపూర్ణబోధ అరూఢము కాగలదని ముఖ్యముగా గ్రహించవలసియ్యున్నది. గురుమూర్తి సర్వాభిమానములకు మూలమైన మూలములేని గుర్తెరిగే శరీర మందలి భ్రాంతిని రహితముగావించగలరు. ఏ నిర్ణయము చేయని పరిపూర్ణస్థితి అనగా అశరీర పద్ధతిని ప్రసాదించి, కర్తవ్యనిష్ఠుని గావించగలడు. అశరీర పద్ధతి అననేమి? తదాచరణ విధానమేమి? అనే అంశములు విచారించుటకు ముందుగా గీతారహస్యమును తెలియవలసియున్నది. కురుక్షేత్ర సంగ్రామంలో ఏకైక వీరుడైన నరుడు తన సోదరులను, తండ్రులను, తాతలను, బంధువులను చూచి, అభిమానగ్రస్తుడై మోహమున చిక్కి యుద్ధము చేయనని, అడవికేగి కందమూలాదులు భుజించెదనని గాండీవమును విడిచి రణరంగమునుండి నిష్క్రమించుటకు ద్యుక్తుడు కాగా, శ్రీకృష్ణుడు వానికి సాంఖ్య యోగమునందు పరిపూర్ణ భావమును, స్థిత ప్రజ్ఞ లక్షణములను ఎరుక పరచి లోకమందు గల ఇతరమైన కర్మ, భక్తి, జ్ఞాన మార్గములను నిర్దేశించుచూ చివరకు స్వధర్మమును ఎరుకపరచియున్నాడు. చిట్టచివరి శ్లోకములో "సర్వధర్మాన్ పరిత్యజ్య" అంటూ సమస్త ధర్మాధర నిర్ణయములను వదిలి ఏ నిర్ణయము పూనక గురువునగునన్నే ఆశ్రయించుమని అనగా గురుమూర్తికి నీ ఎరుకను దక్షిణగా నొసగి, నీవు లేని పరిపూర్ణమున అంతఃకరణేలేని అశరీర పద్ధతిలో సహజరూప కర్మానుష్టాన పరుడవై కర్మాచరణగావించుమని, అట్టి స్థితి యందు పుణ్యపాప రూప సంస్కారములు నిన్నంటవని, కనుక ఎరుకను వీడి అశరీర పద్ధతిలో తన నిర్ణయా నుసారముగా ప్రవర్తించమని బ్రహ్మోపదేశము చేసియున్నాడు. గీత యందలి రహస్యమిదియే. ఇట్టి పూర్ణ భావమును సూచించక, వారి మత నిర్ణయములే సరిపెట్టుకొనుట కడు శోచనీయము. అశరీర పద్ధతి అనగానేమి? పరిపూర్ణ భావజ్ఞుడు అభిమాన రహితులా,

సహితులా? విచారించవలసియున్నది.

శ్లో ॥ అశరీరం సర్వదా అస్తి శరీరరహితంసదా
అయమేవ సద్యోముక్తి, రన్యథాభ్రమకారణం॥

అనగా అశరీర రూపముగా అనగా ఆవరణ రహితమైన కేవల పరిపూర్ణ పరబ్రహ్మమే వున్నది: దానియందు లేక తోచుచూ, శరీర రూపమైయున్న (ఆవరణ రూపమై)మూలములేని గుర్తెరిగే శరీరము ఏమియు లేదు. ఇట్లు తెలియుటయే ముక్తి. మిగిలిన మార్గములన్నియు బ్రాంతిరూపకములే. శరీరమనగా నేమి? అన్నచో సమస్తమును గుర్తెరుగునదియును, సమస్త వ్యవహారములకు అత్యంతమూల కారణమైనదియును ద్వయదోషసమీతమైనదియును అగు ఎరుకయే అని తెలియవలెను.

శ్రీ దయానంద పొన్నాల రాజయోగీంద్రులు రచించిన "నిజప్రబోధవిధానము" అను గ్రంథమందు అశరీర నిర్ణయమును క్రింది విధముగా నిర్ణయించియున్నారు. "అచల పరిపూర్ణ పరబ్రహ్మమునకు మూలములేని గుర్తెరుగు శరీరమునకు, ఏలాంటి సంబంధము లేదని తెలియుట మాత్రమే ఆశరీరస్థితియని, అశరీరపద్ధతిని వివరిస్తూ" ఈశ్వరుడు జీవులొనర్చు కర్మానుసారముగా ఫలములనొసగి తానకర్తగానుండునట్లు, పరిపూర్ణస్థితి గల అశరీరి లోకహితమునకు సర్వకర్మలొనర్చి అకర్తగానుండును. అని శలవిచ్చియున్నారు.

శ్రీభాగవత కృష్ణదేశి కేంద్రులవారు తాము రచించినకందార్థ కంద పద్యములలో ఆ శరీర పద్ధతిని నిర్ణయించియున్నారు. అందు ముఖ్యముగా "కలనెడ బాసిన మనుజులు" అనే కందార్థములో అశరీర పద్ధతిని విపులీకరించియున్నారు. కల అనగా నరస్వప్నముగాక సురస్వప్నమునే గ్రహించవలెను. పరిపూర్ణములో లేక తోచిన ఎరుకేకలః "హరియందుతోచు విశ్వము నరస్వప్నమువంటిదనిరి. నానాజనముల్ సురస్వప్నము వంటిది అనెస్థిరమతి శివరామనామదీక్షితుల్ ధరన్" అని కందపద్యములో శలవిచ్చియున్నారు. కలనెడబాయుట అనగా కలతోచిన విధముగా గుర్తెరుగు శరీరము తోచుచున్నది గాన గురుమేల్కచే గురుబోధ మెలుకువ పొందుటయే కలనెడబాయుటకదా కలలోపలి పనులు అనగా నేమి? అన్నచో నేను అనే గుర్తుతో చేయు సమస్త కర్తృత్వరూపకర్మలు అని తెలియవలెను.

గురుకృపచే తాననే తెర, తొలగించుకున్న మనుజులకు, ఇక తమచేజరుపబడు పుణ్యాపాప ఫలితములుండునా? తానే లేడు గనుక తానుగా చేయవలసిన పనులేమియు లేవు. నేను, నాది అను అహంకార, అభిమానములు లేవు. ఇక అతనికి కర్తవ్యమేమి? అన్నచో నేను అనే గుర్తును విడిచి వ్యవహరించుటయే అని గ్రహించవలెను. కలనుండి మేలుకవ పొందినవారు మరల కలలోపలి పనులు చేయగలరా అని దేశికేంద్రులు ప్రశిస్తున్నారు.

జవాబుగా కలవారు కారని నిరూపిస్తూ వారలవలె ఎరుకనే కలను, గురుకరుణచే వదలి అనగా గురుబోధచే **మేల్కనుపొందవలెనని నిర్ణయిస్తు,** అంతటితో ఆగక "ఎరుకలో నా గల పని చేయవలదే" అని కర్తవ్యమును నిర్దేశించుచున్నారు. ఎరుకను విడిచిన తరువాత ఇక ఎరుకలోగల పనిచేయుట ఎట్లు? కావున ఎరుకను వీడి ఎరుకలోగల పనిచేయుట పొసగునా? అను శంక కలుగక మానదు. "ఎరుకతో వచ్చిన విశ్వము ఎరుకతో జనుగాని నిల్వదు, అని తననుంచైనది కనుక తాను విశ్వము కనుపించుటుళక్కి అనిన్ని, నిరూపించిన విధముగా తాను, తననుంచి వచ్చిన సమస్తము తానులేకపోయినప్పుడు అన్నియు లేక పోవును. ఎరుకను వీడిన పిదప, ఎరుక లోగల సమస్త పనులు లేవు. అనగా నేను అనే గుర్తుతో సమస్త వ్యవహారములు లేవు. అనగా ఇక ఏ విధమైన నాదనే వస్తువు లేదు తద్వారా కర్తవ్యం లేదు. "నేను" గురుమూర్తికి అర్పణగావింపబడినది. దానిని ముట్టక వ్యవహరించమని అనగా అది కేవలము గురుసొత్తునియు, తానొక ధర్మకర్తగా మాత్రమే వ్యవహరించువలెనని, గురు ఆజ్ఞాపాలనయే తన కర్తవ్యమనియు, భావించుచూ ఎరుకలోగల పనులు చేయుచున్నచో, అవి నూతన సంస్కారోత్పత్తికి హేతువులు కాబోవు. ఇది అతికష్టసాధ్యమైన స్థితి లక్షణము. సామాన్యముగా అలవడుట కష్టసాధ్యము. అత్యంత గురుకృపా పాత్రులకు సుసాధ్యము. ఎరుకను వీడి, నేను, నాది, అను అహంకార మమకారములు వీడి, గురువు నిర్దేశించిన మార్గములో పయనించినచో వారు మేల్కలోవారే కాని, కలవారు కారు. వారు కలలో పనులు చేయువారు కాదుకదా! ఈ విధముగా ఎరుకను వీడి, తిరిగి ఎరుకలోగల పనులు కర్తృత్వరహితముగా చేయుచున్న వారు కలవారు కారనియు, కలవారని పలికిన వారికి పాపముతొలగదనియు నిర్ణయించినారని తెలియవలెను. అంతేగాని, నేనే లేను గనుక నేనే పనియు చేయనని కర్మ సన్యాసము చేయరాదని ముఖ్యముగా తెలియవలెను.

"జగము వలన సంకల్పము" అనే కందార్థంలో " మృగజలమగు పద్ధమిధ్యం చెరిగిన మాడ్కి" అని నుడివియున్నారు. ఎండమావులలో నీరుతోచుచూన్ననూ అది నీరు కాదనియు, దానివల్ల దాహోపశాంతి కలుగ జాలదనియు ఎండమావులు అగుపడటమే గాని వస్తువు నిజముగా లేనట్లు అని తెలిసి ఎండమావులందు భ్రాంతి వుంచని యట్లు, దానియందు ఎట్టి భ్రాంతి లేక వ్యవహరించమని నిర్దేశించుచున్నారు.

పరిపూర్ణ పరబ్రహ్మమందు ఎరుక పుట్టనే లేదు ఈ భావము ఒక్కసారిగా ఆరూఢమగుటకష్టము "ఎరుకనే కల నీకు ఎప్పుడుతోచితే ఎరుకలేందను మేల్కనెరుగుము అప్పుడే చాలు" అని దేశికేంద్రులు శలవిచ్చిన విధముగా ముందుగా అంతఃకరణయందు పై భావమును

16. అంతఃకరణము

అంతఃకరణమనగా లోపలి పనిముట్టు అని శబ్దార్థము. దానిని శాస్త్రములు అద్దముతో పోల్చినవి. అద్దమెంత చిన్నదైన పెద్దదైన పర్వతము (లేక ఆకాశం) కూడా అందు ప్రతిబింభించగలదని వేమనార్యులు చెప్పియున్నారు. అంతఃకరణమునకు ఒక ఆవరణము లేక పరిమితి కల్గియున్నది. ఇది వ్యష్టి సమిష్టి రూపములుగా నున్నది. వ్యష్టి అంతఃకరణము మిక్కిలి సంకుచితమై ఒక చిన్న ఆవరణ (శరీరం) లో నున్నది. దానియందు కర్తచేయు సమస్త వ్యవహారములు సంస్కారములై బీజమందలి అంకురమువలెనుండును. అది అసలు పరిశుద్ధమైనను వాసనలు (సంస్కారములు) దానిని మలినమొనర్చినవి. సమిష్ట్యం తఃకరణము నందు సమస్తజీవోపాదుల యొక్క కర్మవాసనలు చేరుచుండును. తిరిగి యే జీవోపాధి కర్మఫలమును ఆ జీవోపాధికి కాలానుసారముగా చేర్చుచుండును. ఈ సమిష్టి అంతఃకరణయే కూటస్థమని, అక్షర పురుషుడని చెప్పబడుచున్నది. అంతఃకరణము మనఃప్రాణ వాక్కులు యొక్క సమిష్టి అయి వున్నది వ్యష్టి యందు కర్త యొక్క మనః ప్రాణవాక్కులు చేయు కర్మ సంస్కారములు పునర్జన్మకు పునాది వేయుచున్నవి. కనుక ఆధ్యాత్మిక సాధన చేయువాడు సత్వ గుణప్రధానమగు కర్మలను మాత్రమే చేయుచు తన ప్రవర్తన పట్ల అతిజాగ్రత్త వహించవలసియుండును. కర్మ నుంచి జన్మ జన్మ నుంచి కర్మయు, కార్యకారణ రూపంగా జన్మ పరంపరలకు హేతుభూతములై యున్నవి. దీనిని సంసారమనవలెను గాని, గృహస్థుని యొక్క భార్యబిడ్డలు, ఆస్తిపాస్తులతో గూడినది సంసారం కాదు.

నానా కర్మ వాసనాన్వితమైన అంతఃకరణతోనే జీవిపుట్టుచున్నాడు. ఈ వాసనాక్షయమైనగాని అంతఃకరణ పరిశుద్ధికాజాలదు. ఇందుకు సత్కర్మానుష్ఠానము, గురుమంత్రానుష్టానాది సాధనలు అవసరములు. అట్టి శుద్ధాంతఃకరణమునందు మాత్రమే మంత్రార్థ స్వరూపమగు వస్తువును ప్రవేశపెట్టుటకు సాధ్యమగును.

వ్యష్టి అంతఃకరణమునందున్న మనస్సు "మనోహిజతువత్" అని చెప్పబడినది. అనగా లక్కవంటిది. కరిగించి యే మూసలోపోస్తే తదాకారం వహించును. అదేప్రకారం మనస్సు గూడ ఏ వస్తువు మీద లగ్నమైతే ఆ వస్తు స్వరూపము చెందును. కనుక ఆత్మ స్వరూపమనే మూసయందు ప్రవేశింపచేసిన యెడల ఆ స్వరూపమును చెందగలదు.

తాను వేరు, ఆ పరమాత్మ వేరు అనుకొనుట భ్రాంతియే తానే గాదు, సమస్త చరాచర జగత్తున్ను ఆ పరమాత్మయే గాని అన్యంగాదు. "సర్వం ఖల్విదం బ్రహ్మ" అని శ్రుతి తెల్పుచున్నది.

“యథామృణ్మయోకుంభః తద్వత్ దేహోపి చిన్మయః” అని ఆదిశంకరులు అన్ని దేహములు గూడ, (జడములని కొందరు చెప్పుచున్నప్పటికి) చిన్మయములే అనగా ఆత్మ స్వరూపమే అని ఉద్ఘాటించి యున్నారు. ఆత్మ దృష్టితో చూచినచో అమృత, అమేధ్యములు రెండు కూడా ఆత్మయే. అన్నము పరబ్రహ్మ స్వరూపమైతే, అమేధ్యం కూడా పరబ్రహ్మ స్వరూపమే. అన్న పరిణామమే అమేధ్యము. భుజించిన అన్నము యొక్క సూక్ష్మము మనస్సునకు, మధ్య భాగము మాంసమునకు పుష్టి కలిగిస్తే కనిష్ఠాంశము మలరూపంగా విసర్జింపబడుచున్నది. దానివి అపరిశుద్ధ పదార్థమని యెంచినను, అది క్రిములు సూకరాదులు మున్నగు ప్రాణులకు తిరిగి ఆహారమగుచున్నది. పనికిరాని పదార్థము వెదకి, తెమ్మని జనకుడాజ్ఞాపిస్తే, శుకుడు మలమును తెచ్చెననీ, దానిని అగ్నియందభిమంత్రించి హోమం జేస్తే, దాని నుండి మానవ వైఖరీ వాక్కులో “నా పూర్వరూపము పంచభక్ష్య పరమాన్నములైనా, యీ మానవుని గర్భమును చేరుటతో నాకీ రూపం సిద్ధించినది. కనుక నాకన్ననూ యీ మానవ శరీరమే హేయ్యము” అని వినవచ్చెనట.

అంతఃకరణము సూక్ష్మశరీరమునకు, సంబంధించినది. వ్యష్టియందీ సూక్ష్మ శరీరాభిమాని తైజసుడనీ, సమష్టియందు హిరణ్యగర్భుడనీ పేర్లు పొందినాడు, వ్యష్టి అంతఃకరణముతో గూడి జీవుడనీ సమష్టి అంతఃకరణతో గూడి ఈశ్వరుడనీ జీవేశ్వర నామములున్న ప్రసిద్ధిచెంది, కార్యకారణోపాధులుగానున్నవి. “కార్యోపాధికరయంజీవః కారణోపాధిరీశ్వరః కార్యకారణతాం హిత్వా పూర్ణబోధావ శిష్యతే” ఇదే ఉపాధి ద్వయము దీనికి పురుషోత్తముడే ఆధారము అధిష్ఠానము అయి యున్నాడు. ఈ సర్వము నందు భ్రాంతి రహిత స్థితి చెందినప్పుడే పరిపూర్ణ పరబ్రహ్మ నిశ్చయము కాగలదు.

17. వస్తు నిశ్చయము - ఎరుకను విడుచుట

ఎరుకనగా యేదో తెలియకుంటే ఎరుకను విడుచుట యెట్లు? పరిపూర్ణమును, యెరుకను, యెరిగి యెరుకవీడుమని పరిపూర్ణ బోధ, వస్తు నిర్ణయము లేకుంటే యెట్టి అనర్థములు కలుగునో ఈ క్రింది కథ నిరూపింపగలదు.

ఒక గ్రామమున వ్యవసాయ వృత్తితో నొక గృహస్తు నివసించుచుండెను. అతనికొక పాడిగేదె కలదు. ఒకరోజు సాయంత్రము వారింటిని దూరపు బంధుఒకడు చుట్టపుచూపుగా వచ్చెను. ఆ వ్యవసాయదారుకి భార్య అతనిని ఎంతో ఆదరించి తన భర్త పొలమునుంచి వచ్చె సమయమైనదని చెప్పి అతనికి విందు భోజనము సమకూర్చుటలోనిమగ్నమయ్యెను. ఇంతలో పొలమునుంచి గేదెను తోలుకుంటూ ఆ గృహస్థు ఇంటికరుదెంచెను. చుట్టమును చూచీ అతనితో ఇష్టా గోష్టి సలుపుచునుండెను. గేదె దొడ్డిలోనికి పోయెను. గేదె విషయము

జ్ఞాపకము వచ్చి భార్యను పిలిచి "చుట్టమును త్వరగా కట్టివేసి, దయ్యమును వదలి దుడ్డుకర్ర నా చేతికీయ మని ఆజ్ఞాపించెను.

ఈ మాటలను విని వచ్చిన బంధువు, భయసంభ్రమములతో తటాలున వీధిని బడి, తన ఊరివైపు పరుగిడసాగెను. తన్ను బంధించి దయ్యమును మీదకు వదలి దుడ్డుకర్రతో తన్ను చావగొట్టుదురని అతని అపోహ, ఇట్లు తమ బంధువు పారిపోవుచుండగా యిట్లా ఎందుకు పారిపోవుచున్నాడో ఏమి కోపము వచ్చినదో బ్రతిమాలి తిరిగి యింటికి తీసుకొని రావలెనని అతని వెనుక పరుగిడసాగెను.

తన్ను పట్టుకొని యింటికి తీసుకొని పోయి భాదిస్తారేమోనని మహాభయముతో బంధువు వేగము హెచ్చించి చిక్కకుండా పారిపోయెను. వ్యవసాయదారుడు చేయునది లేక యింటికి తిరిగి వచ్చెను.

ఐతే ఆ దంపతులు తమ గేదెకు, చుట్టమనియు, ఆ గేదె దూడకు దయ్యమనియు, పాలచెంబుకు దుడ్డుకర్రయనియు, ముద్దు పేరు పెట్టుకొన్న సంగతి పాపమా బంధువుకు తెలియకపోయెను. కనుక యెరుకయనే పదమున కర్థమేమో తెలియకపోతే యెరుకను విడుచుట యెట్లు సాధ్యం? పరిపూర్ణ భావజ్ఞులు ఏ వస్తువునకు యెరుకయని పేరు పెట్టుకొనిరో, దాని స్థాన స్వరూప స్వభావము లయేమో ముందుగా తెలుసుకొనని యెడల పై కథలోని బంధువు వలె మోసపోవుట నిశ్చయము.

18. ప్రాణము ఆత్మకాదు

1. జాగ్రత్స్వప్న సుషుప్తలనే అవస్థాత్రయములయందు ప్రాణము ఉచ్ఛ్వానిశ్వాస రూపంగా పనిచేయుచున్నది. మిగితా ఏ యింద్రియములు పనిచేయక నిద్రించినా ప్రాణము మాత్రము మేల్కొనియే యున్నది. 2. మంచి వాయువును లోనికి గ్రహించి చెడ్డగాలిని బైటికి పంపివేసి రక్తమును శుభ్రపరుచుటకు ప్రాణము ముఖ్యావసరం. ఈ ప్రాణమే పంచప్రాణ రూపముగా శరీరములో పనిచేసి దేహమును ధరించి భరించుచున్నది. ప్రాణము లేనిచో దేహము వెంటనే శిథిలమైనశించుచున్నది. కనుక ప్రాణవాయువు లోనికి పంపి దేహమును కొంత కాలము నిలుపుచున్నారు డాక్టర్లు. 3. ప్రాణము సమస్త ఉపాధుల యందునూ ఉండియున్నది. ఉపాధులు లేనిచోటున కూడా ప్రాణము ఉండి ఉపాధులన్నిటిని హారములో దారమువలె చేర్చి సూత్రాత్మయని పేరుతో వ్యవహరింపబడుచున్నది. 4. హారములోని ఏ పూస పగిలి పడిపోయినా, లేక ఏ క్రొత్త పూస గ్రుచ్చబడినా దారము మాత్రము పోకుండా యెట్లున్నదో అట్లే, దేహములు వచ్చినా పోయినా తాను మాత్రం స్థిరంగానుంటున్నది. 5. ప్రాణమున్న చోటనే తెలివి ప్రకాశించు చున్నది. ఈ కారణములను

బట్టి ప్రాణమే ఆత్మ అని స్థూల దృష్టికి తోచుచున్నది.

కాని 1. ప్రాణము స్వత:హాగా జడ స్వరూపము. తెలివిహీనమైనది. స్థూల రూపమైయున్నది. ఇంద్రియములకు గోచరించు చున్నది. 2. నిరంతర చలన స్వభావము కల్గి అచలస్థితియే మాత్రము లేకుండా యున్నది. 3. ప్రాణమును ప్రాణాయామాదిక్రియలచే బంధించుటకు సాధ్యమైయున్నది. 4. జాగ్రదాది అవస్థాత్రయమునందే వ్యవహరించుచున్నది గాని తురీయము నందు ప్రాణవ్యవహారము లేదు. 5. సుషుప్తి అవస్థ యందు ఉచ్ఛ్వాసనిశ్వాసరూపంగా రోద చేయుచు ప్రాణము సంచరించుచున్న దొంగలింటిలో ప్రవేశించి తనవంటి మీద వస్తువులను తీసుకొని పోవు చున్నా గుర్తించుట లేదు. యిట్టి తెలివిహీనమైన ప్రాణం ప్రజ్ఞానఘనమైన ఆత్మయెట్లు కాగలదు?

ప్రాణము ఆత్మ కాదు. కాని అచలస్థితిలో నుండే ఆత్మ కారవణ భూతమైయున్నది. ఆత్మయే చలన రూపమగు ప్రాణముగా తొలి పరిణామం చెందినది. ఆత్మసత్తా లేనిచో ప్రాణచలనమే ఉండదు. ఆత్మ సూక్ష్మము. ప్రాణము స్థూలము. ఈ స్థూల, సూక్ష్మములుగా, ప్రాణ ప్రజ్ఞల రూపములుగా ఒకే ఆత్మఉంటున్నది. ఆత్మ కానిది ఏదిలేనేలేదు. కనుక ప్రాణము ఆత్మయే అంటే తప్పులేదు. కాని ప్రాణమే ఆత్మయని అనరాదు.

ఆత్మ సత్తా చేతనే ప్రాణము చలించి జీవునికి చేతనము కలిగించి ఇంద్రియముల ద్వారా విషయగ్రహణ గావించి స్థూల శరీరముచే సకల క్రియాకలాపములు చేయించుచున్నది. ఆత్మ సత్తా లేనిచో తృణమైన కదులదు. విశ్వాతీతముగానూ విశ్వాంతర్గతము గాను ఉండునది, ఆత్మ త్రికాల బాంధ్యమైనది. ఆత్మయొక్క సద్రూపము దాని ప్రథమ చలనముతో ప్రాణోత్పత్తి అయినది. కనుక ప్రాణమునకు పూర్వా పరముల యందు కూడా నున్న ఆత్మకున్ను ప్రాణముకున్ను తేడా గమనించవలెను. మరణ కాలము ప్రాణముతో పాటు ఆత్మకూడా బైటికి పోదు. ఆత్మ లోపలా బైటా నిండియే యున్నది. ప్రాణముతో పాటు బైటికి పోయేది మనస్సుగాని ఆత్మగాదు. ఈ విధంగా విమర్శించి ఆత్మ ప్రాణముల కుండే భేదమును గమనించవలెను.

19. ఆవరణ - నిరావరణములు

సృష్టిలోగల సమస్త వస్తువులకు స్థూలమగునొక అవరణ అంటూ వుండక తప్పదు. ఆ ఆవరణయందు తత్వరూపంగానో శక్తిరూపంగానో లేక గుణరూపంగానో ఆవస్తువు యొక్క సూక్ష్మం యిమిడియే వుంటూ వున్నది. "ఆ బ్రహ్మాస్త్రంభ పర్యంతం పరమాత్మ స్వరూపకం" అని చెప్పబడింది అంటే, ప్రతి వస్తువునందు సూక్ష్మరూపంలో పరమాత్మ వ్యాపించి యున్నాడన్న మాట "జీవోబ్రహ్మైవనాపరః అన్నపుడు దేహాదుల యందు ఆ పరమాత్మే

జీవరూపంగా నున్నాడన్న మాట. కనుక సూక్ష్మరూపంలోనున్న ఆ పరమాత్మకు సమస్త దేహములున్ను వస్తువులున్ను స్థూలరూపములే అనవచ్చు. అనగా ఆవరణములనే అనవచ్చును.

అపుడిక భగవంతుడు సాకారుడా నిరాకారుడా అనే సమస్య తేలిపోయినట్లే. సాకారుడూ అతడే, 'నిరాకారుడూ అతడే. మొదటిది అతని స్థూల రూపము రెండవది అయిన సూక్ష్మరూపం. మందాధికారుల సౌలభ్యమునకై "ఉపాసకానాం, హితార్థాయ **బ్రహ్మణోరూప** కల్పనా" అని విగ్రహారాధనలు ఏర్పడియున్నవి. దేనిని నామ రూపకల్పనతో సామాన్యులు ఉపాసించుచున్నారో దానినే జ్ఞానులు నిరాకార వస్తువుగా ఉపాసిస్తున్నారు.

కనుక ఆ ఒక్క పరమాత్మయే సాకారముగా చూచు వారికి సాకారముగానూ, నిరాకారముగా చూచువారికి నిరాకారుడుగాను, సర్వత్రా చూచువారికి సర్వత్రాను కనుపించును. సృష్టికి పూర్వయుండిన రీతిగా జగత్కారణ వస్తువు కనుపించును. ఆత్మజ్ఞాని తెలుసుకొనగోరును. అట్టి అతీత స్థితిలోనున్న పరమాత్మకే పురుషోత్తముడని పేరు. ఆ పురుషోత్తము డుండుటకు ఒక స్థానమని గాని లేక లోకమని గాని నిర్ణయించవచ్చునా? అలా వుంటే ఏక దేశీయుడు ఖండ స్వరూపుడే అగును. గాని అఖండ స్వరూపుడెట్లౌతాడు. సంపూర్ణముగా విచారించినచో తానుపురుషోత్తముని కంటె భిన్నుడను గానని తెలియవచ్చును. యిందుకు సాధనా రూపంగా ఉత్తరగీత "ఖమధ్యే కురుచాత్మానం, ఆత్మమధ్యేచ ఖంకురు" అని ఆదేశిస్తున్నది. గురు ముఖతః విచారించి గుట్టు తెలుసుకొన్న వారు గాని యీ సాధనయందు కృతార్థులగుట కష్టము. మన ఉహ కందే సమస్తమునకు ఆవరణమున్నదని చెప్పాలి. ఐతే జీవేశ్వరులకున్ను ఆవరణలుకలవా? అంటే, తప్పకుండానున్నవి. స్థూల సూక్ష్మ కారణ శరీరములు మూడున్ను, జీవేశ్వరులకు ఆవరణములై యున్నవి. కనుకనే "మరుపన తొలిమేనులు మూ డెరుకన నాల్గవ శరీరమీ రెండొకట" అన్నారు శ్రీకృష్ణదేశి కేంద్రులవారు. ఈ శరీర త్రయములో స్థూల దేహమునకు సూక్ష్మ శరీరమున్నూ సూక్ష్మ శరీరమునకు కారణ శరీరమున్నూ కారణశరీరమునకు మహాకారణ శరీరమున్నూ కారణములై వున్నాయి. ఆవరణములై వున్నాయి. మహకారణ శరీరమే ప్రత్యగాత్మ. యిదే సమిష్టియందు పరమాత్మ అయివున్నది కదా! కారణ శరీరముచే ఆవరింపబడిన ప్రత్యగాత్మకే జీవుడని పేరు, ఐతే కారణశరీరమంటే ఏమి? అనే ప్రశ్న వస్తుంది. అజ్ఞానమే, లేక అవిద్యయే కారణ శరీరము. యిదే మిశ్రమ సత్వప్రధానమగు ప్రకృతి. కనుక జీవునికి అజ్ఞానమే కారణం లేక ఆవరణమైయున్నది. యిట్లే విమర్శించినచో శుద్ధ సత్వ ప్రధానమగు మాయ లేక అవిద్యయే ఈశ్వరునికి కారణ శరీరము. యింకనూ యీ విచారణ పొడిగించినచో మూల ప్రకృతియే. సృష్టి కారణమగు పరమాత్మకు ఆవరణముగా తెలియచున్నది. అవిద్యావరణము, విద్యావరణము, ప్రకృత్యావరణములను

ముఖ్యమగు, మూడావరణములు పరిపూర్ణ పరబ్రహ్మమును తెలియుటకు అవరోధములు గానున్నవి. కనుకనే భగవద్గీతయు " అజ్ఞానేనావృతం జ్ఞానం తేన ముహ్యంతి జంతవః" జీవుల అజ్ఞానావరణమున మునిగి ఏ రీతిగా మోక్షము చెందగలరు? అని దీని భావము. ఈ ఆవరణలన్నియు ఏట్లున్నవంటే ఒక ఉదాహరణ వల్ల దీనిని తెలుసు కొనవచ్చును. ఒక మహా సముద్రములో గాజువరలతో ఒక పెద్ద ఆవరణను ఏర్పరచి యీ ఆవరణలో మట్టివరలతో ఒక చిన్న ఆవరణను ఏర్పాటు చేసినవిధముగా నున్నవి. ఈ మట్టి వరల ఆవరణలో నొక కప్ప యున్నదనుకొనుడు. దానికి మహా సముద్రము చూడవలెననియిచ్ఛ కల్గింది కాని తానున్నదే మహా సముద్రమని దానికి తెలియదు. కారణమేమి? ముందుగా మట్టివరలు, ఆ పైన గాజువరలు దాని దృష్టికవరోధములు కప్పయే జీవుడుగా నున్నది. మట్టివరలే అంతఃకరణము (లేక అవిద్యావరణము) గాజు వరలే మాయావరణము యీ రెండావరణములు సమిష్టియే ప్రకృత్యావరణం. త్రికరణ శుద్ధి పూర్వకమగు సత్కార్మానుష్ఠానమున్ను, ధారావాహికమగు గురుపాసన చేతను అవిద్యావరణ రూపమగు మట్టివరలు పలచబడిపోయినచో మాయావరణరూపమగు గాజు వరలు మాత్రమే శేషించును. కాని నిరావరణ రూపమగు పరిపూర్ణ సముద్రము యొక్క అఖండ స్వరూపము చక్కగా గోచరించుచునే యుండును. యిదియే ఆవరణముననే నిరావరణమును జూచు పద్ధతి. ఈ విధముగా సాధకుడు ఆత్మదృష్టి సాధించి గురుకృపాపాత్రుడై ఆ పిమ్మట జన్మకారణమగు ఎరుక రహిత స్థితి ఉండజూచుకొని జన్మ రాహిత్యమును సాధించగలడు.

20. ఏ ఆశ్రమం గొప్పది ?

బ్రహ్మచర్య, గృహస్థ, వానప్రస్థ సన్యాశ్రములలో ఏది గొప్పది? అను శంకగల్గి, తన్ని వృత్తి చేసిన వానికి చక్కని బహుమతి నొసంగెదనని గాంధార దేశము నేలు సుధర్ముడను రాజు తన రాజ్యమంతటా ప్రకటించెను. కొందరు సన్యాసము గొప్పదనియు, కొందరు గృహస్థమే గొప్పదనియు, అందుకనుకూలమగు యుక్తులచే రాజుగారిని సంతృప్తపరచ జూచిరి. వారి వాదములను అనుభవములో ఋజువు చేసి చూపుడని సుధర్ముడు వారిని కోరుచుండెను. పండితులు చేయునది లేక వెడలిపోవుచుండిరి.

ఇట్లుండ గృహస్థాశ్రమందుండి పరిపూర్ణ బోధనారూఢము చేసుకొన్న సుబుద్ధియను నాతడు రాజు కడుకు ఏ తెంచి యిట్లు ఉపన్యసింప సాగెను. సక్రమముగా నిర్వహింపబడినచో అన్ని ఆశ్రమములున్ను దేనికది గొప్పదే. కాని అన్ని ఆశ్రమములలోనూ గల ఉత్తమ ధర్మములను నిత్యజీవితంలో అనుసరించు రాజయోగ పద్ధతి ఉత్తమోత్తమము. బ్రహ్మచర్యము చేస్తూ గురుస్థానమందుండి గురుసేవ చేసుకొంటూ బ్రహ్మవిద్యా

రహస్యములను గురుముఖతః శ్రవణము చేయు బ్రహ్మచర్యాశ్రమము ప్రశంసనీయము ఐతే స్వకష్టార్జితముచే దేహపోషణ గావించుకొనక భిక్షాటన గావించి యితరులిడిన భిక్షాన్నము గ్రహించుట మంచిది కాదు. ఏలనన తాను స్వీకరించు భిక్షాన్నము పాపకర్మలచే సంపాదింపబడినదగుచో ఆ పాపమునందు తాను పాలు పంచుకొని తన అంతఃకరణను మలిన పరచుకొన్నవాడగుచున్నాడు. న్యాయార్జితముచే కుటుంబపోషణ గావించుకొన్నచు అతిథి అభాగ్యతుల యొక్కయు పేదసాదల యొక్కయు క్షుదశాంతి గావించుచూ తన బల ధన విద్యలచే ఇతరులకు సేవచేయు గృహస్థాశ్రమమున్ను గొప్పదే. కాని యీ ఆశ్రమమునందు స్వార్థపరత్వము పెంపొందుట అహంకార మమకారములు, కర్తృత్వ భోకృత్వములు, ఈషణత్రయము పెరుగుట కెక్కువ అవకాశములున్నవి. వానప్రస్థాశ్రమము అనగా భార్యను తీసుకొని ఆమెను మాతృవతుగా చూచుకొంటూ అడవులయందు కంద మూలాదులు మాత్రమే గ్రహించుచు తీవ్ర వైరాగ్యము పెంపొందించుకొనుట మంచిదే. కాని అడవుల యందు సర్వ సౌకర్యములు దాసదాసీలు సమకూర్చుకొని "కౌపీన సంరక్షణార్థం అయంపటాటోపః" అను న్యాయముగా ఒక క్రొత్త సంసారములో ప్రవేశించు అవకాశములుంటున్నవి. సర్వసంగపరిత్యాగము గావించి, గ్రామైకరాత్రముగా దేశాటన చేసి, అధికారులగు వార్కి బ్రహ్మ విద్యయందాసక్తి గలిగించి, లోకసేవా పరాయణమగు దివ్య జీవితము గడుపు సన్యాసాశ్రమమున్ను గొప్పదే. కాని ఒక ఆశ్రమం కట్టించెదనని ధనము స్వీకరించి బ్యాంకులలో అసలీ ఫాయిదాలు నిల్వలు పెంచి కట్టించిన ఆశ్రమములో సకల సౌకర్యములేర్పాటు చేసుకొని భోగపరాయణులై తాము చెడినదేగాక లోకమును చెరుచు సన్యాసులు పరమ భ్రష్టులు. కేవల సత్కారమాన పూజలొందుటకు దండకాషాయ ధారణ గావించు కీర్తికాములు వృద్ధిజెందు ఈ కలియుగమున సన్యాసము నిషేధింపబడినది. కనుక ఈ చతురాశ్రమములు యందు గుణదోషములు రెండునూ కూడియున్నవి. కేవల జన్మరాహిత్య రూపమోక్షమాసించి సద్గురువు నాశ్రయించి, ఉపదేశముగొని గురువును పరమాత్మ స్వరూపునిగా నుపాసించుచూ గురూపదిష్ట మార్గమందు మనశ్శుద్ధి గావించుకొని లోకసేవా పరాయణమగు దివ్య జీవనము గడుపు రాజయోగి ధన్యుడు. ఇతడే ఆశ్రమము నందున్న వాని జీవన విధానము, చూచువారలకు వాడున్నట్లు తోచువారలకు శృంగారముగా (ముద్దుగా)నే యుండును. రూపవతికి కురూపికి యిరువురకు మంగళసూత్రం పూజ్యార్హత కల్గించును గదా! కనుకనే "యతిర్భూపతిర్బ్రహ్మ చారీచ గేహి" ఇందెవరైనను లక్షణయుతులై గురుగీతా ధర్మము పాటింతురేని తప్పక జన్మరాహిత్యము పొందగలరు.

రాజయోగి గృహస్తుగా ఉండియూ ఈ చతురాశ్రమములలోని సధర్మములన్నియు పాటించును. ఎట్లనగా, గృహస్తుగా నుండియు, ఋతుకాల మందు తప్ప, భార్యను కలియక

బ్రహ్మ విద్యయందు కృషి చేయుటచే, అతడు బ్రహ్మచారియనవొప్పును. గృహస్తుగా నుండి కర్తవ్యకర్మలను కర్తృత్వరహిత విధానముగా స్వార్థము వీడి ఆచరించుచూ సర్వులకు ప్రేమ భావముతో తగిన సహాయం చేస్తూ న్యాయ సంపాదనతో కాలం వెళ్ళబుచ్చుచూ అతడాదర్శ గృహస్తుగా నుండును. భార్య ప్రక్కలో నున్ననూ నిగ్రహము కల్గి కనీస అవసరములు మాత్రం తీర్చుకొనుచూ వైరాగ్యపరుడై యుండి, వానప్రస్తుని వలె కాలక్షేపము చేయును. పరిపూర్ణ బోధరీత్యా సర్వకర్త పరమాత్మయే గాని, తనకుగాని పరిపూర్ణమునకుగాని యెట్టి కర్తృత్వములేదని తెలిసి, పరిపూర్ణమందు మూలమే లేని యెరుక సమస్త వస్తువులను గుర్తెరిగింప జేసి పంచతన్మాత్ర విషయములయందు రాగము పెంపొందింప చేయు చున్నందున, ఆ ఎరుక యందేమీ భ్రాంతి లేక దాని యందు ప్రేమాభిమానములను రాజయోగి వీడియుండును. కనుక అతడే నిజమగు వైరాగ్యపరుడు. అంతఃకరణ యందు యెట్టి భ్రాంతులు అతనికి లేవు. కనుక బాహ్యము నందు సకల కర్మలు చేయుచున్ననూ అతడు అంతరంగ సన్యాసి లోకుల దృష్టిలో మాత్రమే సంసారి. ఈ విధముగా చతురాశ్రమములు ఆదర్శగృహస్తునందే సిద్ధించుచున్నవి. కనుక రాజయోగి ఏ ఆశ్రమము నందున్నా ఒకటే ఆదర్శ పద్ధతిగా నడుపు ఏ ఆశ్రమమైననూ గొప్పదే. సుబుద్ధి చేసిన ఈ ఉపన్యాసము విని సుధర్మ మహరాజు మిక్కిలి సంతసించెను. కాని "నీ సిద్ధాంతము నాకు ప్రత్యక్షముగా ఋజువు పరచెదవా" యని సుబుద్ధుని యాతడు సవాలు చేసెను" "నాతో కూడ మారు వేషమున కొంతకాలము పర్యటించినచో అట్లే ఋజువు చేసెదను" అని సుబుద్ధి చెప్పగా సుధర్మ మహరాజు మారు వేషమున సుబుద్ధితో కలసి పోవుచుండెను. సుధర్మ, సుబుద్ధులిరువురూ ఒక రాజ్యము గుండా పోవుచుండిరి. ఆ దేశపు రాజకుమార్తెకు స్వయంవరము జరుగుచుండెను. అంతకు పూర్వమా రాజుకుమార్తెకు రెండు పర్యాయములు స్వయంవర మహోత్సవములు జరిగెను కాని ఏ రాజకుమార్డున్ను ఆమెకు నచ్చలేదు. ఈ మూడవ స్వయంవరంలో కూడా ఆమెకు రాజకుమారులెవరు నచ్చలేదు. కాని ఆ దారిని బోవుచున్న ఒక యువసన్యాసి యొక్క రూపసౌందర్యము ఆమెనెంతో ఆకర్షించగా ఆమె నాతని వరించి అతని మెడలో పూలహారము వైచెను. ఆ యువ సన్యాసి ఛీత్కారము చేయుచు తన మెడలో వేయబడిన హారమును తీసివైచి నేల పైగొట్టి వేగముగా తన దారిన బోవుచుండెను. అతనిని దప్ప మరి యెవరిని వివాహమాడనని అంటూ రాజకుమార్తె తనను ఆ రాజ్యమును గూడ నిరాకరించిపోవుచున్న ఆ సన్యాసి వెన్వెంట పోసాగెను.

ఏమి జరుగునో చూడదలచి సుబుద్ధి, సుధర్మలిరువురు రాజకుమార్తెను వెన్నంటి పోసాగిరి. ఆ యువసన్యాసి ఒక అడవిగుండా పోయి సూర్యాస్తమయ కాలమునకు ఒక పొదరింటి వెనుకకు పోయి కానరాకపోగా రాకుమార్తె చేయునది లేక ఒక చోట చతికిలబడి

దు:ఖించసాగెను. చీకట్లు దట్టముగా నలుముకొనుచుండెను. సుబుద్ధి సుధర్మలామెను ఓదార్చి, తెల్లవారిన పిదప తండ్రికడకు చేర్చెదమని ఆమెనొప్పించి ఒక చెట్టుక్రిందకు ముయ్యరును నిద్రించుటకై చేరిరి.

చెట్టుపైన ఒక పక్షిజంటయు మూడు పక్షిపిల్లలును కాపురము చేయుచుండెను. మగపక్షి ఆడపక్షితో నిట్లనెను "మన యింటికి అతిథిలువచ్చి ఆకలితోను శైత్యముతోను చెట్టుక్రింద బాధలుపడుచున్నారు. నీవు పోయి నిప్పు తీసుకొనిరా. నేనీలోగా యెండుటాకులు కట్టెపుల్లలువారి సమీపమున చేర్చెదను అని చెప్పగా ఆడపక్షి ఒక కొరవినిముక్కను కరచుకొని తెచ్చి ఆకులలో వదిలేసి రెక్కలతో విసిరి చలిమంట వేసెను. ఆగంతకులామంటధరికి చేరి చలిబాధనుండి విముక్తి పొందుచుండిరి, అయ్యో వీరికాహారము లేదే! నేనీమంటలో బడెదను కాలిన నా శరీరము వీరికాహారము కాగలదు అంటూ మగ పక్షి మంటలలో దూకి చనిపోయెను. తన పెనిమిటి శరీర భక్షణ వీరిముయ్యరకు క్షుధాశాంతి యెట్లగునని పల్కుచూ ఆడపక్షి తానుకూడ మంటలో పడి ప్రాణత్యాగము చేసెను. తల్లిదండ్రుల శరీరములు రెండునూ తిన్ననూ వీరి ఆకలి చల్లారునా అని ఆలోచించి పక్షి పిల్లలుమూడూ గూడ నొకదానివెనుక నొకటిగా మంటలో దూకిప్రాణములు కోల్పోయెను.

తమ ఆకలి తీర్చుటకై ఆ విధముగా పక్షికుటుంబము చేసిన పరమోత్కృష్ట త్యాగమున కచ్చెరువొంది ఆదర్శగృహస్థు ధర్మమెట్లున్నదో చూచితివా? అంటూ సుబుద్ధి సుధర్మ మహరాజునకు "అతిథి దేవోభవ" "అభ్యాగతి స్వయంవిష్ణు" అను ధర్మములు పాటించుట గృహస్తు యొక్క ముఖ్యధర్మము అని వివరించెను. రాచకుమార్తెను రాజ్యమును కాళ్ళతన్నుకొని పారిపోయిన యువ సన్యాసి, కామిని కాంచనముల యందెంత త్యాగబుద్ధి చూపెనో" అట్టి తీవ్రవైరాగ్య ముండుంటయే నిజమగు సన్యాసమగును.

యిందెవరి త్యాగము గొప్పది? గృహస్తునిదా! లేక సన్యాసిదా! రెండున్ను గొప్పవేగాని యీ రెండింటిలో ఏది గొప్పది అని సుధర్మ మహరాజు మరల ప్రశ్నించెను. ఓ రాజా! గృహస్తుని త్యాగము లోకమునకు మేలుచేయుచున్నది. సన్యాసి త్యాగము వలన లోకమునకు మేలుకలుగుట లేదు. అతడు లోకము నుండి పిరికితనముచే పారిపోయి లౌకికముగ మరణించిన వానితో సమానుడగుచున్నాడు కనుక గృహస్థాశ్రమమే గొప్పదని చెప్పక తప్పదు.

21. కందార్థ కంద పద్యములు - గూఢార్థములు

శ్రీ మద్రామడుగు శివరామ దీక్షిత పరిపూర్ణ బోధ సనాతనమై తన్నాశ్రయించినవారికి ముందుగా జన్మకారణ వస్తువును జన్మపరంపర కలుగు విధానమును, శాస్త్ర సమ్మతముగా ఎరుక పరచి, సత్కార్మా చరణము త్రికరణశుద్ధి, సమత్వయోగము, అంత:కరణ స్తిమితము, కర్మకౌశలముల యందు నిష్ణాతులుగా చేసి సర్వభ్రాంతులకు మూల కారణమగు అఖండ ఎరుక, పరిపూర్ణ పరబ్రహ్మము నందు లేనే లేదని సర్వభ్రాంతి రహితము చేయుట ద్వారా విశ్వకళ్యాణమునకు తోడ్పడుచు, మహాశక్తి వంతమై తేజరిల్లుచున్నది.

శ్రీ మద్భాగవత కృష్ణదేశి కేంద్రుల వారు రచించిన "శక్తిద్వయ నిరాసకంబైన, శుద్ధ నిర్గుణతత్వ కందార్థములుగాని, క్షరాక్షరోపాధి ద్వయదోష రహిత పరమతత్వ కందపద్యములుగాని వస్తు నిశ్చయముగా, పరిపూర్ణము, ఎరుకలను గుర్తించిన వారికి గాని శ్రవణము చేయుటకు అధికారము లేదు. పరిపూర్ణ బోధ ఆ విధముగా వస్తునిశ్చయముగా గురుముఖతా విన్నవారు గాని శ్రీ కృష్ణదేశి కేంద్రులవారి నిజాభిప్రాయమును గుర్తించలేరు. అట్టి అధికారులకు శ్రీ కృష్ణదేశి కేంద్రులు "మొదల చలము నెరిగించెద, విదితముగా లేని యెరుక వివరింతుపయిన్ తుద, కెరుకను విడిపించెద" నని ప్రతిజ్ఞ చేసియున్నారు. శ్రీ కృష్ణదేశి కేంద్రుల గ్రంధ నిర్మిత విధానము ముందుగా తెలిసినగాని, శక్తిద్వయమునగానేమో? అది నిరసించిన శేషించిన వస్తువేమో? కందార్థములతో సరిపుచ్చక కంద పద్యములు రచించిన కారణమేమో? పురుషద్వయ మందలి దోషమేమో? తెలియబడదు. ధర్మోపదేశము పొందిననాడే కందార్థములు చదువుట ప్రారంభించి "ఏ సాధన నీకెందుకు, వీసానికి పనికిరాదు" అని చెప్పుకొంటూ, "పాపములు పుణ్యములు భువిప్రాప్తించును ఎరుక చేత భ్రమసిన వారిన్, ప్రాపింపవు ఎరుక నెడసిన తాపసులను" అని యధేచ్ఛగా సంచరించుచూ తమకు తెలిసిన ఏ సాంప్రదాయ నిర్ణయములనో కందార్థముల భావము అని అనుకొనుచూ గ్రంధకర్తగారి అభిప్రాయములు తలక్రిందులు చేసి, తాము చెడినదేగాక, తమ్ము ఆశ్రయించిన వారిని కూడా భ్రష్టులుగా నొనర్చుచున్న గురువులు అనేకులు నేడు ఉండుట బహుశోచనీయము.

"గురుసూచనైన నరులను మరిమరి వినుమనుచు చదువుమా పద్యములన్ అని శ్రీ కృష్ణదేశికేంద్రులు హెచ్చరించియున్నారు. గురు సూచన అనగా పరిపూర్ణ పరబ్రహ్మమును, అందు లేకుండా తోచుచున్న ఎరుకను వస్తు నిశ్చయముగా గుర్తింపచేయుటయేగాని, మంత్రోపదేశము మాత్రము చేయుట కాదని తెలియవలెను "ఈ పరమ గోప్యము ఎవరెరుగరోయయ్యా నా పలుకు మదిలోన నాటిన వారికే ఇది నిజమయ్యా" అని కూడా దేశికేంద్రులు ఉద్ఘాటించియున్నారు. "నా పలుకు మదిలోన నాటినవారు" అనగా

గురుముఖతా పరిపూర్ణము లేని ఎరుకను వస్తు నిశ్చయముగా తెలిసికొని, ఆకళింపు చేసుకొన్నవారే అని గుర్తించవలెను. అంతేకాని కేవల వాచా వివేకత్వము మాత్రము కాదు. అట్లుగాక కనీసం తన నిజస్వరూపము నైననూ తెలిసికొనకనే, ఆచరణహీనుడై, మీద మిక్కిలి గురువైచెట్టు పేరు చెప్పుకొని కాయలు అమ్ముకొనుచు నిజ సాంప్రదాయమునకు కళంకమును తెచ్చుచున్న గురు శిష్యులను చూచి లోకము జుగుప్స చెంది ఏవగించుచున్న దనుటలో అతిశయోక్తి లేదు.

"మనసున, వాక్కున, తనువున, పని యొక్కటి జరుపునట్టి భక్తునకున్ దయన్, వినిపించుము వినుమని ఈ ఘనబోధను వానికి అతుకగలదుడుగకమీ" అట్టి త్రికరణ శుద్ధి లేనివారు గురుబోధను శ్రవణము చేయుటకు అధికారి కాడని శ్రీ కృష్ణదేశికేంద్రులు ఉద్ఘాటించు చున్నారు.

శ్రీ కృష్ణదేశి కేంద్రులవారు సర్వవేదోపనిషత్ శాస్త్ర సమ్మతముగా సకల మానవాళికి సులభముగా అర్థమగునట్లు తేట తెనుగులో గ్రంధము రచించినప్పటికి "ఇల మీద నెవరైన ఈ కందార్థము లోపల గూఢార్థము తెలియ భ్రమను చెందరువారు" అని సెలవిచ్చినారు, తేట తెలుగులో నున్ననూ అందు గూఢార్థములు ఇమిడియున్నవన్న మాట! అవి తెలియ వలెనంటె "ఈ బోధగల వారిచే బోధ పడయక, చేకొనదలిచితే తరమా ఇతరులకు" ఇట్టి గూఢార్థ విషయములు గురు గోప్యముగానే ఉంటూవున్నవి అందుకే "జతనముగ దాచి చదువుము" అనగా గురుగోప్యము కాపాడమని శ్రీ కృష్ణదేశికేంద్రులు హెచ్చరించుచున్నారు. మచ్చునకు కొన్ని గురుగోప్య విషయములు, గురుముఖతా మాత్రమే గుర్తెరుగ తగినవి ఈ క్రింద పేర్కొనబడినవి. 1. శక్తిద్వయము 2. లక్షణయుతుడెవరు? 3. ప్రాగర్థయోగము, చరమార్థయోగము ఏవి? 4. పిండాండము, బ్రహ్మాండము ఏవి? 5. సాధన చతుష్టయ సంపత్తి అని గాక సాధన సంపత్తి అనుటలో ఆంతర్యమేమి? 6. ఘోరసంసారమేది? 7. "మొదలచలము నెరిగించుట ఎందుకు?" 8. మొద్దులు ఎవరు? బద్ధులు ఎవరు? 9. ఆకాశాదికము అనగా నేమి? 10. మరుపుకు తన్మాత్రలు ఎట్లున్నవి? 11. నారి కేళమందు సలిలము ఎట్లు వచ్చినది? 12. "ఈ రెండెన్నడు కలియవో నాడె సున్న సుమి? యెరకమాట అన్నారు ఎప్పుడు కలియకుండా పోవుచున్నవి? 13. "మే నెరుకలు ఇప్పుడు దేనందున్నవో చూచి" అన్నారు దేనందు ఉన్నవి? 14. హృదయ పద్మము ఏది? 15. ఎరుకను కలలో పురుషుడు ఎవరు? 16. "గురుకృప ఉంటే బయలు అపరోక్షము అన్నారు" ఎట్లు? 17. "ఏపురుషుడు గురువర్యుని శ్రీ పాదము పట్టలేదో" అన్నారు. ఆ శ్రీ పాదము ఏది? 18. హృదయ గ్రంధి ఏది? 19. క్షరాక్షరోపాధి ద్వయదోషమన్నారు. ఆదోషమేమి? 20. సురస్వప్నము అనగా నేమి? 21. రెండు వస్తువులు నడుమ అఖండంబిదె గానుపించు

కదా! అన్నారు. ఆ రెండు వస్తువులు ఏవి? 22. అచలము, బట్టబయలు, పరిపూర్ణము అన్నియు ఒక్కటేనా తారతమ్యము ఉన్నాదా?

ఇట్టి గురుగోప్య విషయములు శిష్యులకు సంపూర్ణముగా చెప్పగలవాడే సాంప్రదాయక సద్గురువు, అట్టి సాంప్రదాయక గురువును ఆశ్రయించి వస్తు నిర్ణయముగా పరిపూర్ణము, ఎరుకను ఎరిగి, సర్వభ్రాంతి రహితము గావించుకొని భుక్తిముక్తి క్రియలందు పూర్ణయోగము పూని, రాజయోగ రీవితో మానవజన్మను సార్ధక మొనరించు కొనవలసి యున్నది.

22. అవశ్యమను భోక్తవ్యం

విద్యారణ్యుడు పూర్వాశ్రమమున బహు దరిద్రుడును, బహుళ సంతాన వంతుడును, అయివుండెను. దరిద్ర దు:ఖముతో భార్యాబిడ్డల లమటించుచుండిరి గాని ధనసంపాదనకై యెట్టి ప్రయత్నమును చేయక, జపతపాదులయందునూ శాస్త్రపరిశోధనయందునూ మాత్రమే ప్రొద్దుబుచ్చుచుండెడి భర్తను గాంచి, "ఏ రాజు కడకేగినా మీ పాండిత్యమునకు ముగ్ధులై బహుళ ధనధాన్యాసంపత్తిని ప్రసాదింతురుగదా! యేల మీకీ సోమరితనము?" అని ఆయన భార్య నిత్యమూ ఆయనను వేదించుచుండెను. ఆమె పోరు పడలేడు, "ధనమదాంధుకొలు వేల తాపసులకు" అనునది మరువలేడు. ఎట్టకేలకు ధనాదిష్టాన దేవతయగు లక్ష్మి అమ్మవారినే యుపాసించి దారిద్ర్యవిచ్ఛిత్తి గావించుకొందునని అతడు కృతనిశ్చయుడై సమీపారణ్యమున ఏకాంత స్ధానమున కూర్చునిశాస్త్ర విధిని అక్షరాలా పాటించుచూ ఆతడు లక్ష్మియ పాసన మారంభించేను.

ఆ మరునాడు సమీపముననే గోవుల మేపుకొని జీవించు బుక్కడను గొల్లవానికి లక్ష్మిదేవి సర్వాలంకారశోభితమై దర్శనమిచ్చి ఆ చెట్టుక్రింది తపస్సుచేయు బ్రాహ్మణున కపరాహ్ణము తిరుగుసర్కి అర్ధశేరు గుమ్మపాలు పితికి యిమ్మని ఆజ్ఞాపించి పోయెను. అట్లే బుక్కడు గావించుచుండుటయు విద్యారణ్యుడా క్షీరమును దైవదత్తముగా స్వీకరించి క్షుద్బాధ నివృత్తిగావించుకొనుచు అనతికాలములో దీక్షాపరిసమాప్తి గావించెను.

కాని లక్ష్మికటాక్షమే కలుగలేదు. "ఎట్టిలోపములేక శాస్త్ర విధిననుసరించి యుపాసన కావించితిఖే! ఫలితము లేదేమి?" శాస్త్రప్రమాణమును శంకింప నారంభించి కోపోద్రిక్తుడై లక్ష్మి అమ్మవారినే మారణహోమము చేసి వేతునని మారణ మంత్రముల పురశ్చరణ మారంభించెను. సగం సగం కాలిన కరచరణములతో అమంగళరూపమున లక్ష్మి బుక్కనికి ఆ మరునాడే తిరిగి సాక్షాత్కరించి ఈ దినము మొదలు ఆ గోక్షీరములను కాచిన పిదప విద్యారణ్యున కిచ్చుచుండమని బుక్కని శాసించెను. తపస్సు నుండి లేచి క్షీరప్రాసన చేయసమకట్టిన విద్యారణ్యునికి నాలుక చుర్రుమనెను. "ఏమిరా యిదేమి యీ దినము

పాలుకాచి యెందుకు తెచ్చితివి? అని ప్రశ్నించగా బుక్కడు "అయ్యా! నా నేరమేమి లేదు. గుమ్మ పాలిమ్మని ఆదేశించిన అమ్మయే పాలుకాచిమ్మన్నది. ఆ ప్రకారమే చేసితిని అని విన్నవించెను. విద్యారణ్యుడు క్షణములో ఆమె శ్రీమహాలక్ష్మియే అని గుర్తించి "రేపామెను నిటకు దీసుకొని రమ్మని" అజ్ఞాపించెను.

మరునాడు శ్రీమహాలక్ష్మి బుక్కనితో విద్యారణ్యుని మ్రోల సర్వాలంకారవిహీనముగ అమంగళ స్వరూపిణియై నిలచెను. "ఏమి తల్లీ! నీ కాటాక్షమున, కేల నేను పాత్రుడను కాలేకపోతిని? నా యుపాసనయం దెట్టి లోపమును గావించలేదే? శాస్త్రమే అబద్ధమా? అయినను మారణ మంత్రములయందైనను సత్యమున్నదేమోనని యీ పద్ధతి చేసితిని క్షమింపుము. **శాస్త్ర మసత్యముగాదని బుజువైనది.** కాని నీ కటాక్ష మెందుకు గలుగలేదో తెలుపుము తల్లీ! అని విద్యారణ్యుడామెను ప్రార్థించెను. "నాయనా! నీ యుపాసనావిధియందు ఎట్టి లోపమును లేదు. నీ యుపాసనా ఫలితముగ నదిగో, మహాపర్వతము వలె పుణ్యరాశి పేరుకొనియున్నది. కానీ నీకి జన్మలో ఆ పుణ్యఫల మనుభవించ వీల్లేదు. నీ దరిద్ర మవశ్యము ననుభవించి తీరవలసినదే" యని చెప్పుచూ నామె తిరోహితమయ్యెను?

విద్యారణ్యుడన్ని యాశలు అడుగంటగా ఇంటి ముఖము పట్టెను. కాని శ్రీమహాలక్ష్మి వాక్యములను స్మృతికి తెచ్చుకొని యీ జన్మయందు నాకు దరిద్రానుభవము తప్పదన్నది గదా! జన్మాంతర మందు ఐశ్వర్యము తప్పదు గదా కనుక నేనిప్పుడే జన్మను మార్చివైతను అని జంధ్యములు తెంపుకొని "సన్యస్తంమమ" అని ముమ్మారు పల్కి త్రికరణశుద్ధిగా నాటి నుండి సన్యాసాశ్రమమును స్వీకరించి తినని పల్కి నడచిపోవుచుండెను.

అంతకు పూర్వము సమీప రాజ్యమును పాలించు రాజు అకస్మాత్తుగా సంతాన విహీనుడై మరణించగా మంత్రులందరూ సమాలోచించి పట్టపుటేనుగునకు నొక పుష్పహారమిచ్చి పురవీధులలో వదిలిపెట్టి ఆ పుష్పహారము ఎవని మెడలో వేసి వరించునో అతనిదే రాజ్యాధిపత్యమని ప్రకటించిరి. ఆ కరీంద్రము జనపథముల గుమిగూడిన జనులనందరాని తప్పించుకొని, అడవి దారిని బట్టి వచ్చుచున్న విద్యారణ్యుని కెదురేగి అతని మెడలో నా పుష్పధానుముంచి తొండముతో నాతని బట్టి మూపుపై కూర్చుండబెట్టుకొని రాజధానికి తోడ్కొని వచ్చెను.

"మా పట్టపు టేనుగు మిమ్ములను వరించినది. మీరే మా ప్రభువులు సింహాసన మధిరోహించ ప్రార్థించుచున్నాను." అని పుర ప్రముఖులందరూ అనేక విధముల విద్యారణ్యుని వేడ్కొనిరి. "నేను సన్యసించితిని నాకు రాజ్యధిపత్యమా? తగదు. ఎంత మాత్రం తగదు" అని విద్యారణ్యుడెంత జెప్పినను లాభము లేకపోయెను. చివరకు "నేను రాజునని అంగీకరించితిరి. కనుక నా ఆజ్ఞయిది. సమీపారణ్యముననున్న బుక్కని రాజ

లాంఛనములతో గొని తెచ్చి సింహాసన మెక్కించుడు. నా ఆజ్ఞ ప్రకారమే రాజ్యాంగము నడిపించెదను." అని చెప్పి బుక్కని బుక్కరాయలు అను పేరుతో సింహాసనమెక్కించి రాజ్యము చేయించుచూ తన కుటుంబమున కన్నోదకముల కెట్టి లోపముల కలుగకుండా అగ్రహారయొకటి యిప్పించి తాను మాత్రము సన్యాసియై జీవిత శేషమును వెళ్ళబుచ్చెను. కనుక ప్రారబ్ధము ననుభవింపక తప్పదు. విద్యారణ్యుడెంత తపస్సు చేసినా, తుదకు తురీయాశ్రమ స్వీకారముచే జన్మనే మార్చు కొన్నా ఏమియు లాభము లేకపోయెను. కనుకనే "అవశ్యమను భోక్తవ్యం పూర్వకర్మ శుభాశుభం" అని పెద్దలన్నారు. యోగాదుల చేత, మంత్ర తంత్రాదుల చేత, ఇష్ట దేవతా వరప్రసాదము చేత, ప్రారబ్ధమును నతిక్రమించ యత్నించినా, తాతాచార్యుల వారి ముద్ర భుజము తప్పినా వెన్ను తప్పదన్నట్లు కాలాంతరమున, జన్మాంతరమున, లేక లోకాంతరముననైనా యా ప్రారబ్ధ రూప సుఖ దుఃఖములు అనుభవించి తీరవలసినదే. ఐతే దాని శక్తి కొంచెము క్షీణించినట్లు తోచవచ్చును. భరించరానిదైనను తితీక్షతో దాని ననుభవించు సహనము, దారుఢ్యము కలగవచ్చు. లేదా నాకేమియు లేదు. నేను నిత్య శుద్ధ బుద్ధ ముక్త స్వరూపుడను. అంతయు శరీరమునకే" అని మహావిలక్షణ స్థితిలో నుండి పోవచ్చునే గాని, శరీరమునకే" ప్రారబ్ధాధీనము గనుక దాని సుఖదుఃఖ లక్షణములు శరీరంపై ద్యోతకము గాక తప్పదు అని శ్రీ రామకృష్ణ పరమహంస, శ్రీ రమణ మహర్ష్యాదుల జీవితములు కూడా ఋజువు చేయుచున్నవి.

23. బలవాన్ ఇంద్రియగ్రామో విద్వాంస మపికర్షతి

వ్యాసభట్టారకుని శిష్యులలో జైమినీ ఒకడు. అతడు మహాతపోనిష్ఠాగరిష్ఠుడు. అస్ఖలిత బ్రహ్మచారి. వ్యాసుని రచనలలో ఒక చోట "బలవాన్ ఇంద్రియగ్రామో విద్వాంస మపికర్షతి" అను వాక్యము కనబడెను. "ఏమి! ఇంద్రియ విషయములు ఎంత బలీయములైననూ విద్వాంసుడైనవానిని సహితము నాకర్షింపగలుగునా? అసంభవము. పండితుడైన వాడు ఎంతమాత్రము ఎన్నడు చలించడు. ఇందుకు నేనే తార్కాణము" అని అనుకొనుటలో అహంకారముతో అతని అంతఃకరణము పెల్లుబికెను.

వెంటనే జైమిని తన గురువుగారైన వ్యాసభగవానుని కడకు పోయి ఆ వాక్యము చూపించి "అయ్యా! ఇట్లు వ్రాసితిరేమి? శబ్దాది విషయాకర్షణలకు అజ్ఞానియైన వాడెవడో అతడు మాత్రము లొంగిపోవునే గాని జ్ఞానియైన పండితుడు ఎట్లు లొంగును? ఇంత వయస్సు వచ్చిన నేనేమైన చలించితినా? కనుక ఈ వాక్యమును సవరించవలసియుండును. జైమిని వాక్యములలో అహంకారము తొణికిసలాడుచున్నదే అంతేకాదు. నేను ఏనాడో, శృంగార రసాధి దేవతయననొప్పు ఘృతాచి సౌందర్యమునకు ముగ్ధుడనై ద్రవీభూతమై పోయిన

వృత్తాంతమునకు జ్ఞప్తికి తెచ్చి నన్ను ఎత్తి పొడుచుచ్చున్నట్లున్నదే! చూతము" అని మనమున తలపోసి శిష్యునికి, తాను వ్రాసినది సత్యమేనని నచ్చజెప్పప్రయత్నించెను. కాని, ప్రయోజన మేమీ లేకపోవుటచే వ్యాస భగవానుడు అప్పటికి విన్నకుండెను. తనవాదనే జయించినదని జైమిని మరింత అహంకారముతో అటనుండి వెడలిపోయి ఆ వాక్యము "బలవాన్ యింద్రియ గ్రామో విద్వాంసం నాపికర్షతి" అని సవరించి వేసెను.

కొన్ని దినములు గడచిపోయెను. గురుశిష్యుల చర్చావృత్తాంతము విస్మృతి పథములో పడిపోయెను. వ్యాసుడు ప్రయాణ సన్నాహము చేసుకొని జైమినిని పిలచి "నాయనా! నేను గ్రామాంతరమునకు పోవలసియున్నది. అటనొక మహాక్రతువు నిర్వహింపజేసి పది దినములలో తిరిగి రాగలను. అంత వరకు ఆశ్రమమును కాపాడుచుండుము" అని ఎటో వెడలిపోయెను.

ఆ మరునాటి రాత్రే మహాభయంకరమగు ఒక తుఫాను రేగెను. వర్షపు జడులలో ఉరుములతో మెరుపులతో పిడుగులు ఫెళఫెళరటులతో మహావృక్షముల సహితము కూలిపోవుచుండగా నా కాళరాత్రి మహా భయంకరముగా వుండెను. రాత్రి పదిగంటలు అయినది. జైమిని ఆముదపు దీపము చెంత కూర్చుని ఏదో గ్రంథావలోకన గావించుచుండెను. ఇంతలో వున్నట్లుండి యెటనుండియో హృదయవిదారకమగు స్త్రీ యొక్క ఆర్తనాదము, ఆ మహాప్రళయధ్వనులను ఛేదించుకొనుచు వచ్చి జైమిని చెవులబడెను. "మహాకష్టములోనున్న ఒక స్త్రీ యొక్క ఆర్తనాదమువలెనున్నదే! పోయి చూతునా? " అని అతని అంతఃకరణమందొక సంకల్పము పొడజూపెను కాని అంతలోనే ఎవరు ఎట్లు పోయిననూ సర్వసంగపరిత్యాగినగు నాకేమి? అందునూ స్త్రీలతో నెట్టి ప్రసక్తి పనికిరాదు" అని అతడు తొలుత మిన్నకుండెను.

ఆర్తనాదము అంతకంతకు తీవ్రమై సమీపించుచున్నట్లు తోచుచుండెను. జైమిని అంతఃకరణమున "ఎంత నిస్సంగుడనైనను, స్త్రీ గాని పురుషుడుగాని, పశువుగాని; ఏ ప్రాణికైననూ దుఃఖ శాంతి కలిగించుట పరమ ధర్మము కదా! ఇంతలో ఏమి పోవును? అని ఎంచి తలుపు తెరచుకొని బైట కేగి అనతి దూరములో ఒక చెట్టును ఆనుకొని తడిబట్టలతో గజగజ వణికిపోవుచుండెడి ఒక యౌవ్వనాంగిని విద్యుత్కాంతిలో చూచి దరికేగి "అమ్మాయి వ్యాసాశ్రమము కలదు రమ్ము అందీ రాత్రికి తలదాచుకొనవచ్చును." అని పలుకగా ఆమె నాతనిననుసరించి ఆశ్రమమున ప్రవేశించి అగ్ని హోత్రపు గదిలోనికి వెళ్ళి తడిబట్టలను పెన్నెరులను ఆరబెట్టుకొనుమని చెప్పిన అతని మాటలనాలించి ఆమె యాయగ్ని హోత్రపు గదిలోనికేగి తలుపు గడియవేసుకొనెను.

జైమిని తిరిగి గ్రంథావలోకనలో పడెను. "ఆమె వచ్చి గంట అయినది. లోపల ఏమి చేయుచున్నదో? నవయవ్వనవతి మహాలావణ్యవతి అగునీమె యెవ్వరో! అర్ధరాత్రి వేళ ఈ అరణ్యము నందు ఈమె ఎట్లు చిక్కుబడిన దోడి వివాహమయినదో లేదో? ఇత్యాది ప్రశ్న పరంపరలు జైమిని అంతఃకరణమును కలచివేయుచుండెను. అయిననూ నాకేమి? ఈ విచికిత్స నాకెందుకు? అని పెల్లుబుకుచున్న సంకల్పతరంగములను అరికట్ట నాతడెంత ప్రయత్నించిననూ విఫలుడగుచుండెను. "అయిననూ అడిగినంతలో తప్పేమి? అని అతడు దిగ్గున లేచెను. గది తలుపులు తట్టెను. అంతా నిశ్శబ్దము. పిలిచిచూచెను. జవాబు లేదు. వెనుదిరిగి పోవుటకు ఉద్యమించెను. అంతలో మరలివచ్చెను. తిరిగి ప్రయత్నించెను. కాని ప్రయోజనము లేకపోయెను. గోడపైకి ఎక్కి లోనికిదిగెను. అగ్నిహోత్రము నివురుగప్పియుండుటచే అంతయు కటిక చీకటి, గాడాంధకారము. ఆమె ఎచటనున్నది? చేతులతో తడిమెను. ఒకచోట ఆమె శరీరము చేతికి తగిలెను. ప్రక్కన కూర్చొనెను. చేతులతో తడుపుచూ ప్రక్కనే పడుకొని పూర్తిగా వివేకము గోల్పోయి ఆమెను బిగియార కౌగిలించెను. ఆమె ముఖముపై ముఖము ఉంచుటలో బిరుసు గడ్డము, మీసము జైమినికి గ్రుచ్చుకొనెను. వ్యాసభగవానుడు పకపక నవ్వుచూ తన కౌగిలిలో చిక్కుబడియుండెను.

జైమిని రివ్వున లేచి గురువు గారి పాదముల వ్రాలి 'మహాపరాధము స్వామీ' "బలవాన్ యింద్రియగ్రామో విద్వాంసమపి కర్షతి కర్షత్యేవ, కర్షత్యేవ,కర్షత్యేవ" అని లెంపలు వాయించుకొనెను.

24. బంధమేది?

నీ యొక్క భావనా బలముచే దేనినైనను సాధించవచ్చును, నీమనస్సే నీకు బంధకారణము మోక్ష కారణము గూడ నగుచున్నది. కనుకనే " మనయేవ మనుష్యాణాం కారణం బంధమోక్షయోః" అని చెప్పబడినది. మనస్సనగా నేమి ? అది యెట్లు బంధమోక్షములకు కారణమగుచున్నది? విచారించి తెలుసుకొనవలెను.

ఎవరెవరు ఏఏ పూర్వకర్మలను చేసియున్నారో వారు వారు ఆ కర్మఫలములను అనుభవించుటకు యోగ్యమైన జన్మమునే పొందుదురని చెప్పబడినది. యిదియే కర్మ సిద్ధాంతము. ఐతే ఒక దుష్టకర్మగాని, సుకర్మగాని చేయుటకు ప్రవృత్తి ఎందుకు కలుగుచున్నది? అంటే, వానియొక్క అంతఃకరణయందు లేక మనస్సునందు ముద్రింపబడి యున్న సంస్కారములు లేక వాసనల వల్ల ఈ ప్రవృత్తి కలుగు చున్నది. కనుకనే "బుద్ధిః కర్మానుసారిణి" అని చెప్పబడినది అనగా నీ సంకల్పములకు నీ శుభాశుభ సంస్కారములే కారణమన్న మాట. యీ శుభాశుభ సంస్కారముల యొక్క కూడికకు లేక మూటకే మనస్సు

అను పేరు. కనుక సంస్కారమును బట్టి సంకల్పము కలుగుచున్నది. సంకల్పం వలన కర్మ చేస్తున్నావు. ఈ కర్మ తిరిగి రెండు రూపములగు ఫలములను ఇస్తుంది. ఒకటి దృష్ట రెండు అదృష్ట ఫలము. దృష్ట ఫల మాత్రము అందరికి సమానంగానే కలుగుచున్నది. ఉదా:- నిప్పు మీద చేయి వేస్తే అందరికి సమానంగానే కాలుతుంది. కాని అదృష్టఫలము మాత్రము నీవు ఏ సంకల్పముతో చేసినావో ఆ సంకల్పానుసారమే ఫలప్రాప్తి గలిగించుచుండును. ఉదా:- కాశీ విశ్వేశ్వరుని సేవిస్తూ కాశీలోనే ఉండి మోక్షం పొందుదామనియొకడు, కాశీపోయి యాత్రికుల వద్ద ధనము దోచుకుంటూ జీవితము గడుపుదామని యొకడు కాశీయాత్ర చేయుచుండగా దారిలో ఇరువురు మరణించిరి. వారిరువురు మనస్సుచే చేసిన కర్మ అనగా సంకల్పములు మాత్రం వేరుగానున్నవి. కాని కాయికముగ ఇరువురూ ఒకేకర్మ (కాశీయాత్ర) చేయుటకై బయలుదేరిరి. ఇర్వురకు ఒకే ఫలము గలుగదు కదా! కనుకనే "యాదృశీభావనాయత్ర తాదృశీభవతి నిశ్చయం" అన్నారు.

నీ సంకల్ప రూపమగు జ్ఞానము నీవు చేయు కర్మలకన్నిటికి కారణముగా నున్నది. సంకల్పము యొక్క మంచి చెడ్డల ననుసరించియే కర్మఫలమున్ను మారిపోవుచున్నది. కనుక సంకల్పమే జన్మహేతువు అన్నారు అంతేగాదు. "యాంతేమతి స్సాగతిః" అని కూడా చెప్పబడినది.

పశుపక్ష్యాదులు వాని ఉపాధిననుసరించి పరమాత్మ నిర్ణయానుసారంగా కర్మలు చేయు చున్నవి. అవి చేయు కర్మలు ఆయా ఉపాధులకు నిర్ణయింపబడిన నైజ గుణములు మాత్రమే కాని, ఆయా కర్మలు చేయునపుడు వాని కెట్టి ప్రత్యేక సంకల్పమును లేదు. ఉదా :- తేలుకుట్టుట ఎందుకు? అది దాని స్వభావమే గాని దానికి వీడు మంచివాడు, వీడు చెడ్డవాడు అను భావముండదుగదా! కనుక సంకల్ప రహితమైన స్వభావజన్యమైన అట్టి కర్మల వలన ఆగామిరూపమగు కర్మఫలము జీవించుట లేదు. సంకల్పించి చేయు కర్మ మాత్రమే ఫలప్రాప్తి కల్గించుటకు కారణమైయున్నది. కనుకనే సంకల్ప కారణముగానున్నది. మనస్సే బంధకారణముగా నున్నది. కనుక శ్రీ భాగవతుల కృష్ణదాసుగారు తమ కంద పద్యములలో

కం ॥ ముడిబడి కర్మము జ్ఞానము, విడువక నా రెండు
వెలసె విశ్వనునదే। కడువేడ్కు బయలుగనెనా
ఘడియైనను నిల్వలేక కల్లైపోవున్" అని సెలవిచ్చినారు.

ఈ కర్మజ్ఞాన రూపములుగా నున్నదానికే యెరుక అని అచల ఋషుల నామకరణం చేసినారు. ఇది తిరిగి యుపాధికి రాకుండా ఉండాలంటే, సంకల్పరహితంగా కర్మలు చేస్తే ఆగామియుత్పత్తికి హేతువు లేదు. ఇది యెట్లు సాధ్యము? నిష్కామ కర్మ చేయవలెనని

కొందరు అంటారు. కర్తృత్వరహితంగా "కరములు తమ పనులు తామె గడుపునట్లు" గా కర్మచేయాలంటారు పరిపూర్ణులు. అన్నిటికిన్నీ మనస్సుకున్ను కూడ మూలంగానున్న మూలంలేని యీ గుర్తెరిగే శరీరమే బంధము. ఇది పరిపూర్ణమందేమీ లేదు అనే భావమారుఢం చేసుకొన్నపుడే బంధవిముక్తి సాధ్యం.

25. నీచాశ్రయం కూడదు

కురు పాండవ యుద్ధములో అర్జునుని శరపరంపరా ఘాతములకు శరీరమందలి రక్తమంతయు బైటికి ప్రవహించిపోగా నిర్వీర్యుడై నేలగూలుటకు సిద్ధముగానున్న భీష్మునికి అర్జునుడు తన బాణముల చేతనే శయ్యను రచించినందు పరుండ చేసెను. అది దక్షిణాయనమగుటచే ఆ కాలములో శరీరమును వదిలిపోవుట కిష్టము లేక స్వచ్ఛంద మరణము పొందగల భీష్ముడు శుభసమయమునకై అట్లే అంపశయ్యపై వేచియుండెను. యుద్ధము ముగిసెను. ధర్మరాజాదులు మరణ శయ్యపైనున్న భీష్ముని పరివేష్టించి అతని వలన లౌకిక పారమార్థికములగు ధర్మములను వినుచుండిరి. అందరితోపాటు ద్రౌపదియు శ్రవణము చేసి చివరకు వికటముగ విరుగబడి పకపక నవ్వసాగెను. వక్తయగు భీష్ముడును శ్రోతలగు ధర్మరాజాదులును నిర్విణ్ణులైరి. ద్రౌపది యుక్తాయుక్త వివేకముగల విదుషీమణి, అకారణముగా యేలనవ్వెను? పూర్వమామె యొక్క నవ్వే కురువంశము కూకటి వేళ్ళతో నాశనము చేయుటకు కారణమయ్యెను. "అమ్మా! యేల నవ్వితివి? " అని భీష్ముడే యామెను ప్రశ్నించెను.

"స్వామీ! సమస్త ధర్మములను కూలంకుషంగా నెరిగియున్న తమరి వాగ్వైభవము, అలనాటి కౌరవ సభలో దిక్కులేక యొక పతివ్రత దుష్టులగు దుర్యోధనాదుల వలన మానభంగము పాలగుచుండగా ఏమైపోయినది? నేటి ధర్మపన్నము ఏకరుపెట్టుట చూడగా ఎంతటి మహాత్ములు ఐననూ స్వార్థరూపమగు తమ కౌటిల్యమును వీడజాలరు గదా! ఆచరణకు, వాచాడంబరతకూ, ఎంతో వ్యత్యాసమున్నది?" అని నిర్మొగమాటముగ తన అభిప్రాయమును బైటపెట్టెను.

"నిజమే తల్లీ! నాడు నా శరీరమందలి రక్త మాంసములు సంపూర్ణముగ కలుషితములు పాప సంకీర్ణములు, ఏలనన అవి, దుష్టుడగు దుర్యోధనుని పాపపు సొత్తు తినుట వలన యుత్పత్తి పొందినవై యుండెను. వాని సూక్ష్మాంశములగు నా ప్రాణ మనస్సులున్ను కలుషితములయ్యే యుండెను. కనుక నా కర్తవ్య నిర్వహణమునందు ఏమరుపాటు చెందితిని. తలంచినచో యిపుడు నాకే సిగ్గగు చున్నది. నేడో! అర్జునుని శస్త్ర ప్రయోగముతో పాపపంకిలమగు నా ప్రతి రక్తబిందువును బయటికి స్రవించి పోయినది. సుదీర్ఘోపవాస

క్లేశముచే మాంసమున్నుహరించి పోయినది. ప్రాణములు శల్యగతములై యున్నవి. అర్జునుని శరాఘాతములు నా శరీరమును క్షోభింప చేసినను మనోమాలిన్యమును పూర్తిగా క్షాళన మొనర్చినది." నేనిప్పుడు పవిత్రి భూతుడనై యున్నాను గనుక యీ ధర్మములను ప్రబోధింప గల్గితిని" అని భీష్ముడు మిన్నకుండెను.

దుష్టుని శరీర మనస్సులతో పాటు వాని ద్రవ్యమును దోషభూయిష్టమే. ఎవడెట్టివాడో గ్రహించుట కష్టసాధ్యము. కనుకనే "అపరి గ్రహము" ఒక నియమం ధర్మసూత్రముగా నిర్ణయింపబడినది. సత్వసంశుద్ధి (త్రికరణ శుద్ధి) గలుగ వలెనంటే ఆహార సంశుద్ధి కావలెను. కష్టార్జితమైన న్యాయమగు ద్రవ్యము చేతనే పొట్ట పోసుకొనవలెను. నీచుల నాశ్రయించి వారి సేవచేసి ద్రవ్యార్జన చేయరాదు. ఆ ద్రవ్యముచే పోషింపబడి సంపాదించిన శరీర బలము, కుక్క బలపుకంటే హీనమైనది.

26. గురువాక్యం యధాతధా

గోదావరి తీరమున నడిపూడి అను గ్రామము కలదు. అందు వెంకన్నయను హరిజనుడొకడు జన్మప్రభృతి కుష్ఠ వ్యాధిచే బాధ పడుచుండెను. ఆ గ్రామమునందే రామశాస్త్రి యనే సద్బ్రాహ్మణుడొకడు ప్రతినిత్యం నదీ స్నానమునకై గోదావరికి పోవుచుండెడివాడు. అట్లు నదికిపోవు రామశాస్త్రికి వెంకన్న ప్రతినిత్యము మహాభక్తితో నమస్కరించుచుండెడివాడు. కొన్ని సంవత్సరముల నుండి యిట్లే జరుగుచుండిన వెంకన్నకును రామశాస్త్రికిని ఒకరోజున యీ క్రింది విధముగా సంభాషణ జరిగెను.

రామశాస్త్రి : ఏమిరా వెంకా! ఎందుకురా ప్రతి నిత్యము నాకిట్లు నమస్కారము చేయుచున్నావు? దేవునికి నమస్కారము చేయరాదా? నీ కోరికేదో ఆ దేవుడు తీర్చాలి నా వల్ల నేమవుతుంది?" వెంకన్న (వినయవినమితగాత్రుడై) "ఏమో స్వామి! ఆ దేవుడెవరో నాకేం తెలియదు, తమరేనాకు ప్రత్యక్ష దైవము నా కోరిక తమ వల్లనే తీరాలి" రామశాస్త్రి "నీ కోరికేదో చెప్పరా అది నెరవేరే ఉపాయం ఏదేనా ఉంటే చెప్పుతా"

వెంకన్న : "నాకీ వ్యాధి నివారణ కావాలి" యిదే నా కోరిక.

రామశాస్త్రి : "ప్రతి నిత్యమూ నాకన్న ముందుగా గోదావరి స్నానము చేసి ఉదయించు సూర్యునికి నమస్కారము చేయి, ఆరు మాసములకు నీ వ్యాధి నివారణ కాగలదు.

వెంకన్న : చిత్తం స్వామి! అట్లే చేస్తాను. అది లగాయితు వెంకన్న, ప్రతి నిత్యము రామశాస్త్రి కన్న ముందే గోదావరి స్నానమాచరించి సూర్య నమస్కారం గావించి, అప్పటికి నదీతీరమునకు చేరుకొనే రామశాస్త్రికి భక్తితో నమస్కరించి పోవుచుండెడివాడు. ఆరుమాసములగు సరికి వెంకన్న వ్యాధి సంపూర్ణముగ నివారణై పోయెను.

రామశాస్త్రి తనలో తానిట్లు వితర్కించుకొనెను. "ఆహా! ఏమీ ఆశ్చర్యం! వెంకన్న ఏ మందు తిన్నాడు? ఏ మంత్రం జపించాడు ఏ యోగం అభ్యసించాడు? గురి ఉంచి నన్నే గురువుగా భావించి నే చెప్పినట్లు చేశాడు అంటే, "గురువాక్యం యాధాతథా" అన్నట్లుగా పెద్దల వాక్యం హృదయపూర్వకంగా విశ్వసించి అనుసరించి నాడేగాని, సూర్యుని తేజస్సునందు అంతటి ప్రాణసత్తాయున్నదని యెరుగడు. అట్టి అచంచల విశ్వాసమును ఒక వ్యక్తి యందు మరొక వ్యక్తి యీ కాలమందుంచి కృషిచేయుట సాధ్యము కాదు. కనుకనే గురుగోప్యమును గురుముఖతః సంపూర్ణంగా విమర్శించి తెలుసుకొనుట ముఖ్య కర్తవ్యమైయున్నది.

27. అతిథిదేవోభవ

పూర్వమొకప్పుడొక బాటసారి మహారణ్యము గుండా ప్రయాణమై పోవుచుండగా సూర్యుడస్తాద్రిగ్రుంకెను. అడవి దాటి పోవుటకింక మూడు మైళ్ళు మాత్రమేయుండెను. చీకటి బాగా వ్యాపించక పూర్వమే అడవి దాటిపోవలెనని యాపాంధుడు తన నడుక వేగమును హెచ్చించెను. కాని యింతలో గాఢాంధకారము నల్దిశలా వలయుకొనియెను. దారి సరిగా గానరాకపోవుటచే బాటసారి విధిగా చాలా మందగమనము పూనవలసిన వాడయ్యెను. అతని వాసన పసిగట్టి దారికొక్కింత పక్కనున్న, పొదలోని పెద్దపులి గాండ్రుమని అరచుచూ బైటికురుకుట గమనించి యాపాంధుడు పది గజముల దూరము పరుగిడి అక్కడున్న చెట్టు కెగబ్రాకి పులికందకుండా పై కొమ్మల మీదికెక్కి కూర్చుండెను.

పులియును అతని వెన్నంటి వచ్చి అతడా చెట్టెక్కియుండుట చూచి చెట్టెక్కుట చేతగానిదగుటచే చెట్టుక్రింద వేచియుండెను. తెల్లవారు వరకు యెట్లో చెట్టు పైనే ఉండవలసినదే, చెట్టు దిగిన మృత్యువేనని ఆలోచించుచూ పాందుడు. తన పరిసరములు నొకసారి కలయజూచుకొనుటలో నొక్క కొమ్మ మీద బ్రహ్మాండమైన కోతి యొకటి తనవైపే చూచుచుండుట గమనించి గజగజవణికి పోవుచుండెను. కోతి యాతనిని చూచి "ఓయీ నావల్ల నీకేమియు బాధలేదు. ఈ రాత్రికి నీవు నా అతిథివి. తెల్లవారితే పులి తన దారిని పోవును. అంతవరకు యీ చెట్టుపై విశ్రమింపుము. ఈ పండ్లు భుజించి ఆకలి బాపుకొనుము. అని రెండు దోర జామకాయలను కోసి యాతని కిచ్చెను. పాంధుడాకాయలను తిని ధైర్యము తెచ్చుకొని చెట్టు కొమ్మల నాధారము చేసుకొని నడుము వాల్చెను. ప్రయాణ బడలికి చెందినవాడగుటచే వెంటనే గాఢనిద్ర యాతని నలుము కొనియెను.

కోతిని చూచి పులి యిట్లనెను. "మన మందరము వన్యమృగములము. మానవులు ఎంత దుర్మార్గులో ఇంచుక యోచింపుము మనమెంత బలాఢ్యులమైనను, మానవుడు తన తెలివిచే మనలను పట్టి బంధించి నానావిధముల హింసించును. ఒకప్పుడు ప్రాణములనే తీయును.

ఇట్టి వారిని మనమెంతమాత్రము కరుణించరాదు. కనుక చెట్టుపై నుంచి ఆ మానవాధముని క్రిందికి నెట్టివేయుము. కడుపార భక్షించి నా యాకలి తీర్చుకొందును. నేను నీ కతిథిని. నన్నాదరించి పంపుట నీవిథి" అని యుక్తియుక్తముగా పలుకసాగెను. అందుకా కోతి " ఓయీ నా యింటికి భయ భ్రాంతుడై వచ్చినాడు అతడెట్టివాడైన నాకేమి? అతని కన్నివిధముల సహాయము చేయుటయే నాధర్మము. నీ మాటలింక కట్టిపెట్టి పొమ్ము. ఈ మహారణ్యములో నీ కాహారము దొరకక పోదు" అని కఠినంగా పల్కెను. కాని పులి మొండిగా చెట్టు క్రిందనే వేచియుండెను.

వేకువజామయ్యెను, సేదదేరిన బాటసారికి మెలకువవచ్చెను. ప్రక్క కొమ్మ మీద నున్న కోతిని, క్రిందవేచియున్న పులిని జూచి కోతితో "మిత్రమా! నీవింక నిద్రపొమ్ము, నాకిక నిద్రరాదు" అని చెప్పగా కోతి కన్నుమూసి పడుకొని వెంటనే గాఢ నిద్రావశురాలయ్యెను. అది గమనించి పులియా బాటసారితో "ఓయీ మానవోత్తమా! నిన్నే తినవలయునని నా కేమియు పట్టుదల లేదు. నీ వేమియు నాకపకారము చేయలేదు గదా! ఆకలిచే నా ప్రాణములు పోవుచున్నవి. ఆ కోతిని క్రిందకు త్రోచి వేయును. దానిని తిని నా దారిని నేను పోయెదను. నీవును హాయిగా నీ యింటికి పోవచ్చును" అని పలుకగా ఆ బాటసారి కోతిని క్రిందికి నెట్టివేసెను. క్రిందపడిన కోతి యెదురుగునున్న పెద్దపులి చేతికి చిక్కెను. అపుడా పులి కోతితో " చూచితివా, మానవుడెంత కృతఘ్నుడో! ఆతిధ్యమిచ్చి సర్వవిధముల కాపాడిన నిన్నే యా క్షుద్రమానవుడు నాశనమొనర్చ తలపెట్టినాడే, ఇట్టి వానినా నీవు జాలిదలచుట? నిన్ను నేను చంపివేయగలను. కాని మన శత్రువైన మానవుని వదలి మన మృగజాతిలో పుట్టిన నిన్ను చంపుట నాకిష్టము లేదు. విశేషించి నర మాంసమునకై చాలా కాలము నుంచి మొగమువాచియున్నాను. కనుక ఒక్క షరతుపైన ప్రాణములు కాపాడుదును. నీవు మరల నా చెట్టెక్కి ఆ దుష్ట మానవుని క్రిందకు పడత్రోయవలెను. నీకిష్టమేనా? ఏమందువు అనెను. చిత్తం, చిత్తం తప్పక, అట్లే అని నమ్మించగా వ్యాఘ్రము మా వాసరమును విడచిపుచ్చెను. చేసెదను చెట్టుపై నున్న పొందుడు గడగడ లాడిపోవుచుండెను.

బ్రతుకు జీవుడాయని ఆ కోతి ఒక్క గంతులో మరల చెట్టెక్కి స్థిమితంగా కూర్చుండెను. "ఏమీ ఆలస్యము? త్వరగా నాకృతఘ్నుని క్రిందికి త్రోసివేయు"మని పులి హెచ్చరించగా కోతి, "ఎన్నటికి ఆ పని చేయజాలను, ఎంత దుష్టుడైనా కృతఘ్నుడైనా, అతడు నా కతిథి, దైవ సమానుడు, పూజనీయుడు. అట్టివానికి బొందెలో ప్రాణముండగా కించిత అపకారమునూ, నేను చేయజాలను. కనుక నీవాశవదులుకొని పోవచ్చును" అని గంభీరముగా బల్కి మిన్నకుండెను.

ఇది కథే. నిజముగా జరిగినది కాదు. కాని మానవుడెంత నీచ ప్రవృత్తికి దిగజారగలడో ఒకవైపున ఋజువు చేయుచున్నది. మరొక వైపు ఆశ్రయము కోరివచ్చిన వారి నెట్లాదరించి రక్షించవలెనో విధించుచున్నది. గృహస్థాశ్రమములో నున్న వారే ఆశ్రితుల నాదరించగలరు. గాని అన్యులకు సాధ్యము. కాదు, కనుక గృహస్థాశ్రమము నందుండి కృషిచేయు పారమార్థికులు తమ గురువులకు గురుపుత్రులను మాత్రమే గాక చేతనైనంతలో సర్వులను దైవాత్మ స్వరూపులుగానే భావించి, పరోపకారపారాయణులై నిలయుదురుగాక! ఇదే భారతీయ సంస్కృతి. నేడు ప్రభుత్వము కూడా లక్షలాది శరణార్థులకు ఆశ్రయమిచ్చుట యీ సంస్కృతి విశేషము చేతనే అని యెరుగవలెను.

28. సన్యాసము - కాంతా, కనకములు

సన్యాసి కాంతా, కనకములను ఎంత మాత్రము దరిచేయనీయరాదని, రామకృష్ణ పరమహంస నొక్కి నొక్కి చెప్పుచుండెడివాడు. అంతే గాదు డబ్బు యొక్క స్పర్శ తగిలితే తన శరీరము భగ్గున మండి పోవునని కూడా అంటూవుండేవాడు. ఆయన ప్రబోధ వినుటకై వచ్చెడి నరేంద్రుడు (తరువాత వివేకానందుడైనాడు). ఆ మాటలు నిజమా లేక అబద్ధమా పరీక్షించవలెనని రామకృష్ణుడు పరుండ ప్రక్క క్రింద యెవరును చూడకుండా నొక రూపాయ నాణెమును యుంచెనట. కొంచెము తడవైన పిమ్మట రామకృష్ణ ప్రక్కపై మేను వాల్చి రెండు క్షణములలో అదిరిపాటుతో లేచి మంట, మంట శరీరమంతయు భగ్గున మండిపోవుచున్నది. అని గంతులు వేయుచుండెను. అక్కడున్న వారందరు ఏమి కారణమేమికారణమని, ఆందోళన పడసాగిరట. అపుడు నరేంద్రుడు అయ్యా! తమ వాక్యము యొక్క సత్యత్వమరయుటకై నేనే ఇట్లు చేసితిని తప్పు క్షమింపుమని చెంపలు వాయించుకొని క్షమాపణ వేడికొని తాను ప్రక్క క్రిందనుంచిన రూపాయిని తీసివేసెనట. అవును. గురువు యొక్క నిజాయితీని అట్లు పరీక్షించవలసినదే! అని రామకృష్ణ పరమహంస తిరిగి ప్రక్కమీద పడుకొని చంటి పిల్లవానివలె హాయిగా నిదురించెనట. అట్లే నిజమైన సన్యాసి కామినీ కాంచనములను వమనాన్నాము (కక్కిన కూడు) వలె దూరస్థ మొనరించవలెను. నరుడు పక్వాన్న తతిని కక్కి మరల నాకునె? యతి సంస్కృతి విడచి తిరిగి పూనునె..." అన్నారు శ్రీ కృష్ణదేశికులవారు.

శ్లో॥ ద్వావిమౌ పురుషా లోకే శిరశ్శూల సమౌను తే

గృహస్తశ్చని రారంభో, యతిశ్చస ప్రతి గ్రహః॥

తాత్పర్యం : ఏ పనియు చేయక, సోమరియై, తిరుగు గృహస్తున్ను ధనాదులను ప్రతిగ్రహించు సన్యాసియు యీ యిర్వురును, లోకమునకు బాధాకరులై ఎంతో శిరోవేదన కల్గించు వారైయున్నారు.

శ్లో॥ నరకాయతే మత్మి చేత్ పౌరోహిత్యం సమాచర
వర్షం యావత్ కిమన్యేన, మఠచింతాం దివత్రయం॥

తాత్పర్యం : నీకు నరకం కావాలంటే ఒక సంవత్సరం పాటు పౌరహిత్యం చేయి. అబ్బా! అంత కాలం ఎవనికి ఓపిక వుందంటావేమో, మూడు రోజులు పాటు మఠాన్ని గూర్చి (అనగా సన్యాసి నివసించుట కేర్పరచుకొన్న గృహము) ఆలోచిస్తే చాలు, అనగా తప్పులు చేయుటకు పురోహితులకు, సన్యాసులకు ఎంతో అవకాశమున్నది అన్నమాట.

శ్లో॥ యతిత్వం జీవనోపాయం కుర్వంతః కింనలజ్జిత్రారి।
మాతుః పుణ్యమి వాలంబ్యయ ధాకే చిత్ గతఘృణాంః॥

తాత్పర్యము : తన తల్లి పడుపువృత్తి చేయుచు సంపాదించు ధనముతో బ్రతుకువాడెంత సిగ్గుమాలినవాడు! అట్లే సన్యాసమును ధనార్జనోపాయముగా చేసుకొని బతుకువాడు మరియెుంతటి సిగ్గు మాలినవాడో వేరే చెప్పవలెనా? వాని యంతటి నిర్భాగ్యుడు మరెవడూ వుండడు.

ఇట్లనేకులు కాంత కనకముల ఆశవీడని సన్యాసులను నిందిస్తూనే వచ్చినారు "జిహ్వోపస్థ పరిత్యాగీ పృథివ్యాం కింప్రయోజనం?" కామినీ కాంచనములను పూర్ణముగా త్యాగము చేసిన వానికి యీ ప్రపంచంలో నేమిపని? యిదే విషయమును వేమన్నగారు "కాంతపైన యాశ, కనకంబుపై నాసలేనివాడు పుడమి లేనివాడు" అన్నారు. సన్యాసోపనిషత్, అవధూతోపనిషత్, పరమహంస పరివ్రాజకోపనిషత్, భిక్షకోపనిషత్ మొదలగు ఉపనిషత్తులు నిర్ణయించిన సన్యాసి నియమములను ధర్మములను ఎవరు నేడు నిజంగా పాటించగలరు? పాటించుట బహుకష్టము. కలియుగమున సన్యాసమందుకే నిషేధింపబడినది ఐనను సత్కారమాన పూజాధికములకై సన్యాసి వేషములను ధరించి పెద్ద పెద్ద పేర్లుపెట్టుకొని వేషధారులై ఆశ్రమముల పేరిట గృహరామ క్షేత్రాదులను సంపాదించుకొని భోగలాలాసులై, లక్షలాది ద్రవ్యమును బ్యాంకులలో నిల్వలు పెంచుకొనుచుండు సన్యాసి నామధేయుల వలన లోకమున కెంత కీడు వాటిల్లుచున్నాదో గృహస్థులు గమనించి జాగరుకులై మెలంగుదురు గాక!

29. తత్వములన్ని కలసియే యెరుక

ఒక గ్రామములోని రామన్న, భీమన్న అను మిత్రులు వాహ్యాళికై పోయి ఊరి బయటనున్న యిసక పుంతలో కూర్చుని యిష్టాగోష్టి జరుపుచుండురి. ఇంతలో రామన్న తను వైపుగా వచ్చుచున్న రెండెడ్ల బండిని చూపుచు భీమన్నా లే! బండివచ్చుచున్నది. దారి వదలాలి అని హెచ్చరించెను. భీమన్న చాలా యుక్తిపరుడు. నీమొఖము బండెక్కడ వస్తుంది. ఇటువంటి అసత్యాలు ఎప్పుడూ చెప్పవద్దు అని గద్దించెను. అందుకు రామన్న నీకు కళ్ళు లేవా? అదేమిటిరా 50 గజాలలోకి సమీపించింది కదా బండి అని తీవ్రముగానే పల్కెను. అందుకు భీమన్న "ఒరే, పందెం, బండి కనుక నిజంగా ఉంటే నా శిరస్సే ఇస్తాను. బండిలేకుంటే నీ శిరసిస్తావా? అని రామన్నను సవాలు చేసెను. తప్పకుండా యిస్తానని రామన్న ప్రతి సవాలు చేసెను.

భీమన్న బండికి ఎదురేగి భయంకరంగా గర్జించి ఎడ్లను ముందుగా విప్పివేసి, తనవద్దనున్న చాకుతో కాడిని, పోలుకర్రను కలిపికట్టిన మోకులు తెగకోసి చక్రములు తడికలు వగైరాల్ని దేనికది క్షణములో ఉడబెరికి రామన్నారా. ఇక చక్రాలున్నాయి. పోలుకర్ర ఉంది. ఇరుసు ఉంది. కాడి ఉంది. బండి ఏదిరా అని మందహాసము చేసెను. అవును నిజమే అన్నీ కలసి ఉంటే బండి గాని లేకుంటే బండి అనే వస్తువు వేరే లేదు గదా.

రామన్న తన ఓటమి నంగీకరించి మరునాడు తన శిరస్సును యిచ్చివేస్తానని దుఃఖాక్రాంతుడై ఇల్లుచేరి భోజనము మాని మంచముపై పరుండి యుండెను. రామన్న కుమార్తె చురుకైనది. వచ్చి తండ్రి దుఃఖ కారణం తెలుసుకొని నీ శిరస్సుపోకుండా ఉంటే ఉపాయం నేనెరుగుదును. రా,లే, భోజనం చేసి నిర్భీతిగా నిద్రపోమ్మని ధైర్యము చెప్పెను.

రామన్న పందెంలో ఓడిపోయి ఆ రోజున భీమన్నకు శిరస్సు యిచ్చి వేస్తున్నాడని గ్రామ మంతటా తెలిసి గ్రామస్తులు గ్రామ పెద్దలు అంతా రచ్చబండ వద్ద చేరిరి. భీమన్న కత్తి నూరుచుండెను. ఇంతలో రామన్న కుమార్తెతో కలసి ఆటకే తెంచెను.

అంత నా బాలిక భీమన్న నుద్దేశించి భీమన్న మామా! నా తండ్రి శిరస్సు నీకిస్తానన్నాడు. కనుక తీసుకో ఏమీ అభ్యంతరం లేదు. కాని నీవు చాలా జాగ్రత్తగా తీసుకోవాలి ఒక్క నెత్తురు బొట్టు కూడా తీసుకోరాదు. ఒక్క తల వెంట్రుక కూడా తీసుకోరాదు. చర్మము, కండ్లు, ముక్కు, చెవులు, పెదవులు, గడ్డము, చెంపలు ఏమీ తీసుకోరాదు సుమా! తీసుకొంటివా నీ తల యిక్కడ పెద్దలు వెంటనే యెగుర గొట్టెదురు ఏమందువు? అట్లా గుడ్లు మిటకరిస్తావేం. ఈ యుక్తి నీ వద్దనే నేర్చుకొన్నాను అని పకపక నవ్వసాగెను.

బాలిక తెలివికి జనమంతా జోహారులర్పించి ఎవరిండ్లకు వారేగిరి. అట్లే అన్నీ కలసియే **ఎరుక అన్న లేకపోతే** ఎరుకేలేదు. కనుక యెరుకన్న తత్వాలే సుమా!

30. విచిత్ర గణితం

ప్రశ్న : మూడింటిలో ఒకటి తీసివేసినచో మిగిలేది యెంత?

1వ జవాబు : మూడింటిలో ఒకటిపోతే యిక మిగిలేది ఒకటి మాత్రమే.

2వ జవాబు : మూడింటిలో ఒకటి పోనే పోదు.

3వ జవాబు : మూడింటిలో ఒకటిపోతే సున్న.

శిష్యుడు : స్వామి! యీ జవాబులెట్లు సరిపోవును. ఇందేది సత్యము. అన్నీ సత్యమా? లేక అన్నీ అసత్యమా?

గురువు : విమర్శించి చుద్దాము.

1వ జవాబు యొక్క అంతర్యమేమంటే ప్రతి బింబవాదము ననుసరించి బింబము అద్దము ప్రతిబింబము అను మూటిలో అద్దం ఒకటి తీసివేసినచో అద్దముతో పాటే ప్రతిబింబమునూ, పోవును కనుక మిగిలేది నిజబింబ యొక్కటే. అట్లాగే మాయా విద్యల రూపంగా నుండే అద్దం యొక్క దానిని తొలగిస్తే నిజబింబ స్థానీయమైన అధిష్ఠాన చేతన బ్రహ్మములో ప్రతిబింబ రూపుడైన జీవుడు బ్రహ్మైక్యము పొందగా పరబ్రహ్మ యొక్కటే శేషించును యిది అద్వైత వాదము. ఇక, రెండవ జవాబులో ఈశ్వర, జీవ, జగత్తునే తత్వత్రయములో అన్నీ నిత్యములే ఏదీ అనిత్యం కాదు. కనుక దేన్ని తీసివేయలన్నా ఏది పోదు. యిది త్రైత వాదము. లేక విశిష్టాద్వైత వాదము. మూడు, కంటికి మనస్సునకూ కానవచ్చేదంతా క్షణికమే.సర్వమూ శూన్యమే. సృష్టి అనేదే లేదు. సృష్టి కారణమూ లేదు కనుక ఒకటి లేదు. మూడు లేదు. మొత్తమంతా ఏమీ లేనపుడు దేనిని తీసివేసినా తీసివేయకున్నా ఎప్పటికి ఉండేది శూన్యమే. ఇది శూన్యవాదము. యీ వాదములన్నియ్యూ సత్యములే. అన్ని అసత్యములే. దృక్కోణములో గానవచ్చే భేదములే దృక్కు దృశ్యము,ద్రష్టరూపముగా కానవచ్చే త్రిపుటి ఎరుక రూపమే జీవేశ్వర జగద్రూపంగా గాన వచ్చేదంతా కలసి ఒకటిగా పూర్ణ వస్తువుగా నున్నది. ఏకంగా, ద్వంద్వంగా, అనేకంగా ఈ పూర్ణ వస్తువేగాన వస్తుంది. సర్వద్విపుటులుం త్రిపుటులుం యిదే అయివున్నది. దానినే పూర్ణమని కొందరు శూన్యమని మరికొందరూ పలుకుచున్నారు. దాని యొక్క అస్థి, నాస్తుల యందు అనగా ఆ వస్తువునకు పూర్వము నందు పరమందు వస్తు వున్నపుడూ ఉంటే పరిపూర్ణ పరబ్రహ్మము సర్వ పరిపూర్ణముగా నున్నది. అందుకే శ్రుతి.

"పూర్ణ మద : పూర్ణ మిదం పూర్ణాత్పూర్ణముదచ్యతే" పూర్ణస్య, పూర్ణ మదాయ పూర్ణమేవా వశిష్యతే అంటున్నది ఏమైనా సర్వ నిర్ణయములు చేయు యొరకయే లేనపుడు, యే నిర్ణయం చేసినా మహాపాపమేనన్నారు. శ్రీశివరామ దీక్షితులవారి సిద్ధాంతము ఇదే.

31. దత్తగురుని మహాత్మ్యము

లోకమునకు ఆది గురువుగా ప్రసిద్ధి పొందిన దత్తాత్రేయులవారి అవిర్భామును గూర్చి యిట్లు చెప్పబడినది. మహా పతివ్రతయగు అనసూయను పరీక్షించుటకు వచ్చిన త్రిమూర్తులను, ఆమె పాతివ్రత్య మహిమచే ఆమె యందు పుత్ర భావము పొంది మూడు శిరస్సులు గల ఏకాకారమగు పుత్రుడుగా ఆవిర్భవించిరనియు, ఆయనయే దత్తాత్రేయులనియు చెప్పబడుచున్నది. ఆయనకే గురువను ప్రసిద్ధనామము కలదు. గురువనగా, "గురుబ్రహ్మ గురుర్విష్ణు, గురుర్దేవో మహేశ్వరః, గురుసాక్షాత్పర పరబ్రహ్మ తస్మై శ్రీ గురువేనమః" అని చెప్పినట్లు తన బోధనా సామర్థ్యముచే జ్ఞానవృత్తిని పుట్టించుట, దానినిన పోషించుట తద్విరుద్ధమగు అసురీవృత్తుల నెల్ల లయము చేయుట, యను మూడు కృత్యములను చేయుటయే కాక, తాను మూటికి విలక్షణమగు అధిష్టాన బ్రహ్మస్వరూపుడుగా ఉండి, ఆశ్రయించిన శిష్యులను తన స్వరూపులుగానే చేయగలడు. బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులను ముగ్గురును ఒక్కొక్క కృత్యమునే నిర్వహించగలరు గాని, రెండవది చేయజాలరు. కాని గురుమూర్తి ఈ మూటిని నిర్వర్తించుటే కాక, మూటికిని అతీతమగు అఖండ స్వరూపునిగా కూడా చేయగలడు. దత్తాత్రేయ గురుడు కూడా ముగ్గురు మూర్తుల శిరస్సులు గలవాడగుటయే కాక, మూర్తి త్రయమును ఏకము చేసిన,అనగా మూడు శక్తుల కాధారము. అధిష్టానముగా నున్న బ్రహ్మమాత్రుడుగా నున్నందున సహజముగా ఆయనయే గురుసంజ్ఞచే చెప్పబడుచున్నాడు. ఆయన అనసూయ పాతివ్రత్యమును పరీక్షించుటకు మూడు మూర్తులుగా వచ్చి, పరిక్షించి, ఆమె యొక్క అచంచలమగు పాతివ్రత్యమునకు ఆశ్చర్యపడి తానే మూడు శిరస్సులతో ఆమెకు పుత్రుడుగా దత్తుడాయెను.

అనసూయ యనగా అనూయారహితుడగు జీవుడు. భగవద్గీత యందు 'ఇదంతుతే **గుహ్యతమం ప్రవక్ష్యామనసూయవే**'యని చెప్పుటచే అర్జునా! నీవసూయా రహితుడవగుటచే యీ రహస్యయుతమగు జ్ఞానమును నీకు చెప్పుచున్నానని పరమాత్మ సెలవిచ్చియున్నాడు. అంతే కాక, 'ఇదంతే నాతపస్కాయ, నా భక్తాయ కధాచన। నచాశుశ్రూషవే వాచ్యం, నచమాంయో భ్యసూయతి' అని చెప్పుటచే, అసూయగలవానికి, మాత్రము యీ విద్య నెపుడును చెప్పవద్దని చెప్పెను. కనుక గురుమూర్తికి అనుగ్రహము అసూయా రహితుని యందే కలుగును గాని అన్యుల యందు కలుగదు. ఆమె అనసూయ యగుటయే కాక పరమ పతివ్రత. ఆమె భర్త అత్రి మహర్షి. 'అత్రి' యనగా త్రిపుటికి మీరినవాడు. అనగా సృష్టి స్థితి లయమును, వాని అభిమానులగు బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులను, దేహత్రయములు, అవస్థాత్రయములు. త్రిగుణములు, జ్ఞాతృ జ్ఞాన జ్ఞేయములు, కర్త,

యాచకుడు తృప్తిగా భుజించి త్రేన్చెను. ఏం కావాలి బాబూ అంటూ రామశాస్త్రి లోపలినుండి హాలులోనికి వచ్చు సరికి బిచ్చగాడు లేడు. ఆ స్థానంలో తన గురుదేవుని రూపం రామశాస్త్రికి ప్రత్యక్షమయ్యెను. రామశాస్త్రి కంగారుపడుతూ గురువు గారి పాదములకు సాష్టాంగపడి లేచి చేతులు జోడించి "మహాప్రభో క్షమించండి. ధర్మసారము గ్రహించి ఆచరణ నుంచమని సోదాహరణ ముగ నిరూపించితిరి. ధన్యుడను, ధన్యుడను" అని మరల సాష్టాంగపడెను.

33. గురువాజ్ఞాపాలనము - ఏకలవ్యుడు

ఏకలవ్యుడు ఒక అరణ్య భాగమును పాలించు హిరణ్యధన్యుడనే నిషాదరాజు యొక్క కుమారుడు. కురుపాండు కుమారులకు ధనుర్విధ్యాగురువు ద్రోణాచార్యుల వద్ద ధనుర్విద్య నేర్వవలెనని యే తెంచి అర్థించినా **ద్రోణాచార్యులాతనికి విద్య** నేర్పుటకు నిరాకరించెను. మంత్రపురస్కారముగ, అస్త్రప్రయోగ ఉపసంహారములు గావించవలసియుండును. కనుక అట్టి మంత్రోపదేశమునకు హీనకులస్తుడగు ఏకలవ్యుడధికారి కాదని ద్రోణాచార్యులు భావించెను.

ఏకలవ్యుడింటి కేగి, మట్టితో ద్రోణాచార్యుల విగ్రహము నొకదానిని ప్రతిష్టించుకొని గురుభావముతో నర్చించుచు తత్సన్నిధానమున విలువిద్య నభ్యసింపసాగెను. అతని భక్తి విశేషముచే ధనుర్విద్యా కౌశలమంతయు నాతనికి కరతలామలకమయ్యెను.

ఒకనాడు కురుపాండు కుమారులందరూ పరివార సహితులుగా వేటకై ఆ అడవి ప్రాంతమున దిరుగాడుచుండిరి. ఒక వేటకుక్క ఏకలవ్యుడు ప్రతిష్టించిన విగ్రహము చెంతకు వచ్చి మొరుగుచుండగా ఏకలవ్యుడు గురిచూచి దాని లలాట స్థానమున ఏడు బాణములు నొకేసారి నాటించెను. కుక్క ఏడుపు విని ద్రోణాచార్యుల ప్రియ శిష్యుడైన అర్జునునితో సహా అందరువచ్చెను. ఇంత ప్రావీణ్యముగల విలుకాడెవరి శిష్యుడాయని అద్భుతాశ్చర్యములకు లోనై ధనుర్బాణములు ధరించియున్న ఏకలవ్యుని గాంచి నీ గురువెవరని ప్రశ్నించగా ద్రోణాచార్యులే నా గురువని యాతడు సమాధానము చెప్పి, తానారాధించు ద్రోణ విగ్రహమును చూపెను.

అర్జునుడు ద్రోణాచార్యులు వద్దకేగి, "స్వామీ! లోకములో నన్ను మించిన విలుకాడు లేకుండునట్లు విలువిద్య నేర్పెదనని తమరు ప్రతిజ్ఞ చేసినారే! నేనే కాదు ముల్లోకములలో ఏకలవ్యుని మించిన విలుకాడుండని నిరూపణ అయినది. తమరే యాతని గురువులట కదా!" అని ప్రశ్నించెను. ద్రోణుడును ఆశ్చర్యచకితుడై అర్జునుడు వెంటరాగా ఏకలవ్యుని కడకేగగా, అతడర్ఘ్యపాద్యాది విధులచే గురువు నర్చించి వినయ వినమిత గాత్రుడై నిలబడియుండగా "ఓయీ! నీకు నేను గురువునంటివే! నాకు గురుదక్షిణగా ఏమిత్తువు?"

అని ప్రశ్నించెను. అందుకు ఏకలవ్యుడు అంజలి ఘటించి పరమ సంతోషముతో "స్వామి యిదిగో నా శరీరము యిదిగో, యీ అరణ్య సామ్రాజ్యము. యిదిగో నా పరివార జనులు యిందేదైనగాని, అన్నియుగాని మీ పాద సన్నిధిని సమర్పించుకొనుటకు సంసిద్ధుడను ఆజ్ఞాపించమని " గురుని ప్రత్యుత్తరమునకై నిరీక్షించుచు నిలబడెను.

ద్రోణాచార్యుడు "ఐతే నీ కుడిచేతి బొటన వ్రేలిని ఖండించి గురుదక్షిణగా నాకిమ్ము యింకేదియు నాకు వలదు" అని అవనత శిరస్కుడై అర్థించెను. వెంటనే యేమియు సందేహించకుండా మొల నున్న కత్తిని తటాలున దీసి తన కుడిచేతి బొటన వ్రేలిని ఖండించి ఏకలవ్యుడు గురుపాదముల చెంత నుంచెను.

అర్జునుడు నిర్విణ్ణుడై గ్రుడ్లప్పజెప్పి, జూచుచుండెను. తొల్లియెప్పుడో వామనమూర్తి తన్నర్థించిన మూడడుగుల స్థలములో తన సర్వస్వము హరించగలడని బలి చక్రవర్తి యెరిగియు వామనుని కోర్కె సఫలీకృత మొనర్చి ధన్యుడయ్యెను. నేడు ఏకలవ్యుడు తనకుడి బొటన వ్రేలిచ్చుటతో తన విలువిద్యా నైపుణ్య సర్వస్వము హరించబడుచున్నదని యెరిగియు సంతోషముతో భక్తి పూర్వకముగ దానిని గురుమూర్తికి సమర్పించుకొనెను. ఆహా! ఏమి త్యాగ వైభవము. ఎంతటి భక్తి విశేషము.

ఈ కథా సంవిధానము మహాభారతమున చూపించుటలో వ్యాస భగవానుని యుద్దేశమేమి? అర్జునునికి యీర్ష్యాసుయలున్నవని చాటుటకా? నీచోన్నత కులములవారి అధికారి తారతమ్యము లుద్ఘాటించుటకా? విగ్రహారాధన వలన కలుగు ప్రయోజన విశిష్ఠతను చూపించుటకా? గురువులకు కూడా పక్షపాత బుద్ధియుండునని నిరూపించుటకా? గురువెట్టివాడైననూ శిష్య ధర్మము ఎట్టిదో ప్రబోధించుటకా? "ఇతిహాస పురాణాభ్యాం వేదార్థముసంబృహయేత్" అనగా యితిహాస పురాణములు వేదార్థమును విపులపరచు చున్నవి. అన్నప్పుడు యీ కథలో యే వేదధర్మము విపులపరచబడినది? అని ప్రశ్నించుకొంటే వ్యాసమహర్షి యొక్క నిజోద్దేశమును తెలుసుకొనవచ్చును.

ఏక లవ్యుడు గురువు యొక్క నామ రూపములను నిజాంతఃకరణమున నిల్పుకొని అందుకొక ప్రతీకను బాహ్యమందు కల్పించుకొని ఉపాసించి యిష్టార్థమును సాధించినాడు. కాన్నీ గుర్వువు నిజముగా అతని కెట్టి విద్యయూ గరుపనే లేదు. ఐనను తాను ఉపాసించిన నామ రూపములు ప్రత్యక్షముగా సజీవంగా తన యెదుట సాక్షాత్కారించగా, తన జీవిత ధ్యేయమైన ధనుర్విద్యాపాటవమునే, గురుని సంతృప్తి పరచుటకై సమర్పించుకొని ధన్యుడయ్యెను. **సచ్ఛిష్యుని** ధర్మముపదేశించుటయే యీ కథయొక్క ముఖ్యోద్దేశము గాని యితర విషయముల కేమియు ప్రాధాన్యత లేదనియు ప్రధాన విషయమును పోషించుటకే యీ

కథ భారతమున చొప్పించబడినదని తెలియవలెను. మానవ ప్రతీకరణము నందు గుణదోషములు రెండునూ యుండక తప్పదు. ప్రత్యక్షముగా గురుశిష్యులుగా వున్న ద్రోణ, అర్జునుల శీలములలో మానవ దౌర్బల్య లక్షణములు చిత్రించుటయే ఔచిత్యము ఏకలవ్యుని శీలచిత్రీకరణములో అట్టి మానవ సహజములగు దౌర్బల్య లక్షణములు గానరావు? అతని మానవాతీత లక్షణమే యీ కథయందు చిత్రీకరింపబడినది.

ద్రోణునకు సాక్షాత్ శిష్యుడైన అర్జునుడు గురుఋణ మెట్టతీర్చెనో చూడనగును. గురువునకపరాధ మొనర్చిన ద్రుపదుని యుద్ధమున నోడించి రథచక్రమునకు కట్టి తెచ్చి ద్రోణుని పాదముల కడబడవేసెను. గురువుతో యుద్ధమునకు ఢీకొననని వాగ్దానము చేసెను. కాని గురువు కోరికకు ఏకలవ్యునివలె తన జీవితాశయమునే త్యాగము చేయలేదు. గురువైన వైశంపాయుని యాజ్ఞను పాలించక ధిక్కరించి గురుడు నేర్పిన విద్యయంతయు యాజ్ఞవల్క్యి కక్కి వేసెను. గురు సంతోషమునకు ఏకలవ్యుడు హృదయపూర్వకముగ తన విలువిద్యానైపుణ్యము అంతయు వమ్ము చేసుకొని తన కుడి బ్రొటన వేలినే ఖండించి యిచ్చి మహాత్యాగము చేసెను. ఏకలవ్యుని గురుభక్తి అనుపమానము. ఐనను పరిపూర్ణ భావజ్ఞుల త్యాగముతో పోల్చినచో ఏకలవ్యుడు చేసిన మహత్తర త్యాగము కూడా అత్యల్పమే అని చెప్పవలసియున్నది. ఎట్లనగా ఏకలవ్యుడు తన స్థూల శరీరమందుగల బ్రొటన వ్రేలును తద్వారా లౌకికమగు కీర్తిప్రతిష్ఠలకు కారణమగు ధనుర్విద్యా కౌశలమును మాత్రమే త్యాగము చేసెను. కాని పరిపూర్ణ యోగులు తమ స్థూల సూక్ష్మ కారణ మహకారణ శరీరములన్నింటిని నిశ్శేషముగ గురుమూర్తికర్పించి ఆత్మరూపమగు మోక్షరాజ్యమునే కాలదన్ని జనన, మరణ భ్రాంతి నుండి విముక్తి చెందుదురు.

34. మంత్రవేత్త మరణము

ఎంత మంత్రవేత్తయైనా మహత్తులు గలవాడైనా, జ్ఞానియైనా యోగియైనా ఎప్పుడో యొకప్పుడు మరణించుట తప్పదు. పుట్టినది గిట్టక తప్పదనుట పరమ సత్యము. కొందరు జీవసమాధిలో యింకనూ సజీవంగానే వున్నట్లు చెప్పుటయేగాని వారు తిరిగి ఆ శరీరంతో వచ్చి కాయిక వాచిక కర్మలొనర్చుట కల్లగదా! అది మరణ సదృశమే.

గవర్రాజు ఎల్లప్పగారను యొక ఆర్వేల నియోగి బ్రహ్మణశాఖకు చెందిన గ్రామకరణముండేవాడు. ఆయన మహామంత్రవేత్త. తపశ్శాలి, ఏ కొద్ది ఘడియలో తప్ప మిగితా కాలమంతయు తపోనిమగ్నుడై యుండేవాడు. ఆ గ్రామము నేటి పశ్చిమ గోదావరి మండలము లోనిదే కాని నాడు నిజామ్ పరిపాలనలో యుండేది. ఆ గ్రామమున కొకప్పుడు **తహశీల్దారు అజమాయషికివచ్చి,** గ్రామస్థుల వలన,కరణంగారు మంచివారే కాని, ఎల్లపూడూ

తపశ్చర్యలోయుంటూ గ్రామలేఖ్ఖలు చూడడని తహశీల్దారు విని కోపోద్రిక్తుడై కరణంగార్కి కబురు పంపెను. తహశీల్దారు మహమ్మదీయుడు.

కరణంగారు వచ్చుటతోనే "ఏమయ్యో కరణంగారూ! మీరు ముక్కుమూసుకొని ఒక మూల కూర్చొండుటయేనా? గ్రామ నౌఖరీ యేమైనా చేస్తున్నావా లేదా? అసలు యీ గ్రామ సరిహద్దులైనా చూపగలవా నీవు?" అని ఎగతాళిగా మాట్లాడగా, చిత్తం ప్రభు ప్రభుత్వానికి సరిగా పన్నులు చేసి పంపిస్తున్నాము కదా! మీరు గ్రామ సరిహద్దులు చూడాలని వుంటే చూపించుట కేమీ అభ్యంతరం లేదు" అని కొంచెం కరుకుగా సమాధానం చెప్పెను. "సరే బాపనయ్యా! రేపు ఉదయం గం. 8.00లకు హాజరై గ్రామ పొలిమేరలు చూపించు అట్లు చూపలేనిచో నిన్ను కొరత వేయిస్తాను తెలిసిందా!" అని గద్దించెను. "చిత్తం, అంటూనే కరణం గారింటికి పోయి యింటి యిలవేల్పులైన భద్రకాళీ వీరభద్రుల నర్చిచుకొని మరునాడు ఉదయం 8 గంటలకు తహశీల్దారు కడకేతెంచెను. కరణంగారి ధీమా చూచి తహశీల్దారుగారు ఆదిలో "అవసరం లేదులే" అని చెప్పదలచెను. గాని గ్రామస్థుల యెడ తన అధికారము ప్రదర్శించుటకై సరే నడువుమని బయలుదేరెను.

పాపం! కరణంగార్కి నిజంగానే గ్రామ సరిహద్దులు తెలియవు కాని యిష్ట దైవమును తలచుకొని తూర్పుదిశగా బయలుదేరెను. భద్రకాళి ఒక్క కరణంగారికి మాత్రం కనుపిస్తూ దారి చూపిస్తూ ముందు నడుచుచుండెను. ఆ పిదప కరణం ఆయన వెనుక తహశీల్దారు ఆ వెనుక గ్రామస్థులు నడుచుచుండిరి. భద్రకాళి తూర్పుహద్దు వరకు నడచి అటనుండి ఉత్తర దిశగా నడచిపోయి ఈశాన్య మూల చేరి అటనుండి పశ్చిమ ముఖమయ్యెను. మనము యిపుడు ఈశాన్య మూల నున్నాము. యిక ఉత్తర సరిహద్దు చూపుతాను. అని కరణంగారు పలికిరి. అమ్మవారు ఒక ఫర్లాంగు దూరం నడిచేసరికి దారి కడ్డముగా యెన్మిది గజముల కై వారము గల పెద్ద మఱ్ఱి చెట్టుండెను. అమ్మవారు సమీపించే సరికి ఆ చెట్టు మొదలు నడుమకు రెండు చీలికలుకాగా ముందు అమ్మవారు, పిదప కరణం పిదప తహశీల్దారు ఆ వెనుక గ్రామస్థులు చెట్టు ఆవలికి నడచిపోయిన వెంటనే చెట్టు రెండు చీలికలు యధాప్రకారం చేరిపోయెను. ఈ వింత జూచి తహశీల్దారు, గ్రామస్థులు ఆశ్చర్య నిమగ్నులైరి. ఉన్నవి లేనివి కరణంగారి అలౌకిక మహత్తుల గూర్చి గ్రామస్తులు ప్రసంగములు గావించుచుండిరి. తహశీల్దారు ఆ మాటలు వింటూ భయక్రాంతుడై "అయ్యా! కర్ణంగారు యిక మాకు నడిచే శక్తిలేదు. మీరు యిక సరిహద్దులు చూపగలరని మాకు పూర్తిగా నమ్మకము చిక్కినది" రండు పోదాము అని బసకుమరలెను.

తహశీల్దాదారు తనలో తానిట్లు ఆలోచించసాగెను "ఆహా! ఈ బాపనయ్య ఎంతటి తపశ్శాలి! యెంత మహిమాన్వితుడు, ఇతడు తలచినచో నైజాము ప్రభుత్వమును తృటికాలములో

నాశనము చేయగలడనుటలో సందేహమేమీ లేదు. యిటువంటి వానిని బ్రతుకనీయరాదు. యిట్టి వాడుంటే నైజాము గారిని పొట్టనపెట్టుకోగలడు. యితనిని వెంటనే కొరత వేయించడమే ప్రస్తుత కర్తవ్యము. అని ఒక నిశ్చయమునకు వచ్చి భటుల కాజ్ఞాపించగా వారా కర్ణం యెల్లప్పగారిని కూర్చొండ బెట్టి బ్రహ్మ రంధ్రం నుంచి గుధస్థానముకుండా పోవులాగున ఒక శీల దిగకొట్టి కొరత వేసిరి. క్షణములో కరణంగారు యిష్టదైవమును స్మరించుకొంటూ ప్రాణములు వీడిరి. ఎలప్పగారి తల నుండి కొఱ్ఱు కొట్టబడిన గ్రామము "యెల్లప్ప కొఱ్ఱు" అయిపోయెను. ఆ పేరు క్రమశః వాడుకలో యిలపకుఱ్ఱుగా మారెను. గవ్రరాజు వారను పూర్వపు పేరు ఇలపకుర్తి వారని, ఎల్లప్ప వంశీకులు యింటి పేరున్ను యేర్పడెను.

35. చిత్ర విచిత్రాలు

(సూర్యారావు పడక కుర్చీలో విశ్రాంతి తీసుకొనుచుండగా రామారావు ప్రవేశం)

రామారావు : సూర్యం గారు శ్రీ గురుభ్యోనమః ఏమిటి ఒక్కరూ కూర్చొని ఏదో ఆలోచిస్తున్నారు?

సూర్యం : ఏం లేదు. రా, రా, కూర్చో

రామం : (ఏదో చెప్పబోవువాని వలె) మరి................

సూర్యం : ఏదో చిత్రకథ తీసుకుని వచ్చినట్లున్నావే? అదేదో చెప్పు ఆలోచిస్తావేం?

రామం : (చిరునవ్వు నవ్వుతూ) ఇట్టే కనిపెట్టేవే నువ్వు. అవి నిజంగా చిత్ర కథలేసుమా!

సూర్యం : ఉ... కాని చెప్పు! చెప్పు!!

రామం : మొన్న ఒక గ్రంథలో ఒక చిత్రం చూశాను? ఆ చిత్రం నిజంగా విచిత్రంగానే ఉంది.

సూర్యం : ఏమిటా గ్రంథం? ఆ చిత్ర మెవరిది?

రామం : గ్రంథం ఏముందిలే! ఏవో తత్వాలు వ్రాసిన గ్రంథం. చిత్రం మాత్రము సాందీప శ్రీకృష్ణుల చిత్రమట.

సూర్యం : శ్రీకృష్ణుని **చిత్రాలైతే** ఎన్నెన్నో ఉన్నాయి గాని, సాందీపుల చిత్రం ఎక్కడుంటాయి.

రామం : ఎక్కడా నేనూ చూడలేదు.

సూర్యం : మరి సాందీపుని చిత్రం అంటున్నావు? ఎలా ఉంది సాందీపుని చిత్రం?

రామం : (పకాపకా నవ్వుచూ) అదో గ్రుడ్డివాని చిత్రం. బోడిగుండు పిలకజుట్టు. కుడి చేతిలో తాంబూర, ఎడమ చేతిలో చిరతలు, భుజం మీదగా వంచాగుడ్డ మతం వేసుకొని కూర్చున్నట్లుంది.

సూర్యం : అదేమిటి సాందీపుడు గ్రుడ్డివాడా! తాంబూరా, చిరతలు ధరించిన భక్తుడా?
రామం : అదే విచిత్రం. భక్త సూరదాసు భజన చేస్తూ తన్మయత్వంలో నుండగా మనో వీధిలో బాలకృష్ణుడు ఎదురుగా కూర్చుని దర్శన మిచ్చినట్లు ఒక చిత్రకారు ఊహించి వ్రాసిన చిత్రమది.
సూర్యం : ఓహో! గ్రుడ్డి సూరదాసును, సాందీప మహర్షిగా చిత్రించేరన్నమాట. చిత్రానికి పేరేం పెట్టరు?
రామం : సాందీప శ్రీకృష్ణులుగానే సూచించినారు.
సూర్యం : లోకం ఎంత గ్రుడ్డిదైనా అతడు సాందీపుడు అని ఎట్లా మోసపోతుంది? ఎవరా వ్రాసిన మహానుభావులు ?
రామం : ఎవరైతే ఏంలే, " అస్మద్గురు సమారంభాం కృష్ణ సాందీప మధ్యమాం....." అనుకుంటూ సాందీప శ్రీ కృష్ణులను గురు పరంపరా స్తోత్రములో చెప్పుకొనువారే.
సూర్యం : సిగ్గు! సిగ్గు! సాందీప శ్రీ కృష్ణుల బొమ్మలు కల్పించుట రీత్యా గ్రంథ ప్రతులు విరివిగా అమ్మి సొమ్ము చేసుకోవాలనేమో ? వారి ఉద్దేశ్యం ; ఇదేనా చిత్రం ? మరేమైనా చిత్రాలున్నాయా ?
రామం : మరోటుంది అది శ్రీ శివరామ దీక్షితుల వారి చిత్రం.
సూర్యం : కొంపతీసి ఇది కూడా ఏ గ్రంథంలో నైనా అచ్చువేసేరేమిటి ?
రామం : ఆహా! ఇది మరో తత్వాల గ్రంథలో వేసారు. పాత గ్రంథంలో క్రొత్త విశేషం.
సూర్యం : బాగు. బాగు ఈ చిత్రంలో విచిత్రం ఏమిటి ?
రామం : పోతులూరి వీరబ్రహ్మంగారి గురువు. పోతులూరయ్య గారి బొమ్మ సంపాదించి అదే దీక్షితుల వారి ఫోటో అని పేరు వ్రాసేరు.
సూర్యం : ఈ బొమ్మ ఎట్లా ఉంది ?
రామం : ఎట్లా ఉంటుంది ! తలపైన శిఖరంగా లేచిన జడలు చుట్టు వీభూతి రేకలు, దండ కాషాయ కమండలాలు. ఒక బైరాగి వేషం ప్రదర్శించేరు.
సూర్యం : భలే. భలే. ఎంతటి గొప్ప రూపకల్పనా!!!
రామం : సూర్యం ! నాకు తెలియక అడుగుతాను గాని పరిపూర్ణ గురువులని పేరు పెట్టుకొని ఈ లోకవంచన ఎందుకు చేస్తున్నారంటావు ?
సూర్యం : ఏమో ? వారికే **తెలియాలి**. బహుశా, "మేము చాలా కష్టపడి దేశమంతా తిరిగి ఇట్టి అమూల్య చిత్రాలు సంపాదించాం" అని లోకంలో పేరుసంపాదించటం కోసమేమో!
రామం : అయ్యవార్లంగార్లను చేయబోయి కోతులను చేసినారే!

సూర్యం : కాదు, కాదు కోతును ఎదుట బెట్టికొని, గురుదేవులని కొనియాడుతున్నారు.

రామం : ఇట్టి ప్రయత్నాలు ఇపుడు నూతనంగా ప్రారంభించేరా? ఇది వరకేమైనా చేశారా?

సూర్యం : పాపం, ఏవేవో వ్యర్థ ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు.

రామం : అవేవీ నేను గమనించనే లేదే! అవేవో కొన్ని చెప్పండి.

సూర్యం : వంశవృక్షం అంటూ వెనుక ఒకటి ముద్రించేరు. అందులో నిజమైన శాఖల్ని కొన్నింటిని చూపించుట మానివేశారు. పరంపరయే లేక ఒకటి సృష్టించుకుందామని తహతహలాడేవారి కొన్ని శాఖలను ఆ వంశవృక్షానికి అంటగట్టి, వంశవృక్షం కాపీలు అమ్ముకొని సొమ్ము చేసుకున్నారు. ఆ వంశవృక్షంముద్రిస్తా మంటూ ప్రయత్నాలు చేస్తున్నారు.

రామం : అంతేనా! ఇంకా ఏమైనా నూతన విధానాలు కనిపెట్టారా?

సూర్యం : యంత్రాలు, మంత్రాలు పొదిగిన యంత్రాలు చక్రాలు అనేక రకారకాలైనవి బయలుదేరుతున్నాయి.

రామం : పోనీలేవయ్యా, ఎవరి ఖర్మవారిది!!

సూర్యం : అట్లా అని ఊరుకోలేంకదా! లోకానికి వారి మోసం చాటి చెప్పవలసిందే.

రామం : మనబోటి వాళ్ళు ఇట్లా అనుకుంటూ ఉంటే సిగ్గుపడి ఇక ముందైనా ఊరుకుంటారంటావా?

సూర్యం : ఇల్లాలిని తిడితే ఇల్లు దూరుతుంది గయ్యాళిని తిడితే రచ్చకెక్కి గంతులేస్తుంది. బొమ్మలాటలో దిచ్చుబొమ్మ తానొకటి ఛీ పొమ్మని అనిన హాస్యమొనర్చదేకపోతే అంటున్నారు కృష్ణదేశికులు.

రామం : శాంతం పాపం! శాంతం పాపం!!

36. జ్ఞానేశ్వర మహారాజ్

వీరి పేరు ఎరుగని పారమార్థికులుండరు. శ్రీధర స్వామి వారికి పూర్వం ఉండిన పరంపర పురుషులలో వారు ఒకరు అని చెప్పబడుచున్నది. వీరి పుణ్య చరిత్రము తెలుసుకొని వీరు రచించిన జ్ఞానేశ్వరి అను పేరుగల భగవద్గీత వ్యాఖ్యనము చదివినచో ఉత్తేజము పొందుట తథ్యము.

మహారాష్ట్ర దేశమున పైఠన పుర క్షేత్రమునకు కొలది దూరమున నున్న " ఆపేగావు" వీరి స్వగ్రామము. జ్ఞానేశ్వరుల పితామహులు గోవింద్ పంత్ తండ్రి విఠోబా, తల్లి రుక్మాబాయి. వీరి కుటుంబము వారందరును ఆదినుండియు భక్తి పరాయణులు, విఠోబాకు సంతానము కలుగక పూర్వము, సన్యాసము స్వీకరించవలెనని కోరిక కలిగెను కాని సంతానము లేనివారు

భార్య అనుమతి లేనిదే సన్యసించుట నిషిద్ధము. అనుజ్ఞ ఇమ్మని పదేపదే అతడు రుక్మాబాయిని వేడుకొను చుండెను. కాని ఆమె అతని కోరికను నిరాకరించుచునే ఉండెను. ఒకనాడు ఆమె గాఢ సుషుప్తి యందుండగా అతడామెను తట్టి లేపి సన్యసించుటకు అనుజ్ఞ ఇమ్మని కోరెను. ఆమెకు పూర్తిగా మెలకువ రానందున నిద్రమత్తులో బద్ధకముగ ఊ అనెను. అదియే అనుజ్ఞగా గ్రహించి ఆ అర్థరాత్రి సమయముననే ఇల్లు విడిచి విఠోభా కాశీ నగరమునకై పయనమైపోయెను.

కాశీలో విఠోభా ఒకనాడు రామానంద ఆశ్రమము చేరి, అట శ్రీ పాదస్వామి అను సన్యాసి, గీతలో సన్యాసయోగమును బోధించుచుండగా శ్రవణము చేసి సన్యాస దీక్షను తన కిమ్మని ఆయనను అర్థించెను. శ్రీ పాద స్వామి నీకు స్వజనులు ఎవరైనా ఉన్నారా? అని ప్రశ్నించగా, తానేకాకిని అబద్ధమాడి సన్యాసదీక్షను స్వీకరించెను.

భర్త తనతో చెప్పకుండా ఇల్లు విడిచి పోవుటచే రుక్మాబాయి దుఃఖాక్రాంతయై అతడు శీఘ్ర కాలములో తిరిగి ఇంటికి రావలెనని కోరి అశ్వద్థ నారాయణుని దీక్షతో సేవించుచుండెను. ఆ అనుష్ఠాన బలమే అలంది క్షేత్రములో అశ్వద్థ నారాయణుని సన్నిధికి శ్రీ పాదస్వామిని చేర్చెను. అతడు అట కూర్చుండి అనుష్ఠానము చేసికొనుచుండ రుక్మాబాయి యే తెంచి ఆ మహాత్మునికి అనేక ప్రదక్షిణ నమస్కారములు చేసెను. శ్రీపాదస్వామి ఆమె భక్తికి సంతసించి 'అష్టపుత్ర సౌభాగ్యవతీభవ' అని ఆశీర్వదించెను. రుక్మాబాయి సంతసించుచు తన వృతాంతమంతయు అతనికి నివేదించెను. శ్రీ పాదస్వామి తాను దోషి అగుట తెల్సుకొని రుక్మాబాయిని కూడ తీసుకొని కాశీకి పోయి, విఠోభాను మందలించి సమాధాన పరచి గృహస్థ వేషము ధరింపచేసి మీకు త్రిమూర్తులు కుమారులుగను ఆదిశక్తి కుమార్తెగను జన్మించి లోలకోద్ధారణ చేయుదురని ఆశీర్వదించి పంపివేసెను.

స్వగ్రామము యేతెంచిన విఠోభా దంపతులను ఆ ఊరి బ్రహ్మణులు సంఘములో చేర్చుకొనక బహిష్కరించుటచే అరణ్యములో ఒక పర్ణశాలను నిర్మించుకొని అచట తీవ్రమగు అనుష్ఠానము చేయుచు బిక్షాటన వలన దేహపోషణ చేసికొనుచుండిరి. ఇట్లు 12 సంవత్సరములు గడచిన పిదప క్రీ॥శ॥ 1273 సంవత్సరమున ఈశ్వరాంశముచే నివృత్తి దేవుడును 1275 సంవత్సరంలో శ్రీ మహావిష్ణువు అంశమున జ్ఞానదేవుడును (జ్ఞానేశ్వర) 1277 లో బ్రహ్మంశయిన సోపాన దేవుడును 1279 లో ఆదిశక్తి అంశమున రుక్మాబాయియను జన్మించిరి.

ప్రాయశ్చిత్తము చేసి సంఘములో చేర్చుకొనుడని ప్రార్థించినను పండితులు వీరి ప్రార్థనలను నిరాకరించిరి. ఆ పిదప వారెల్లరును త్రయంబక క్షేత్రమున చేరి బ్రహ్మగిరి పర్వతమునకు ఆరు మాసములు, ప్రదక్షిణములు చేసిరి. ఒకనాడు నివృత్తి దేవుడు గైగునాధుడు అను

మహాత్ముని చేరి ఏడు దినములు అయినను సేవించి "రామకృష్ణ హరి" అని మంత్రము ఉపదేశము పొందెను. అందరును కలసి స్వగ్రామమునకు తిరిగి వచ్చి తమకు ప్రాయశ్చిత్తము చేసి శుద్ధులను చేయవలసినదిగా కోరిరి. దేహ త్యాగమే ప్రాయశ్చిత్తము అని ధర్మాధికారులు నిర్ణయించిరి. విఠోభా దంపతులు బిడ్డలను అచటనే విడచి ప్రయాగ క్షేత్రములో త్రివేణి సంగమున దేహ త్యాగమొనర్చిరి. బిడ్డలు నలుగురు పయిఠన పురమున ధర్మాధికారులను చేరి మాకు ప్రాయశ్చిత్తము చేయుడని ప్రార్థించిరి. అందుకు వారు "మీరు సన్యాసికి పుట్టిన బిడ్డలు, భ్రష్టులు, మీరా జన్మము బ్రహ్మచర్య దీక్షతో సర్వభూతములను ఈశ్వర స్వరూపముగా భజించుచుందురు" అని ఆదేశించిరి.

ఆ సోదరీ సోదరులు ఎంతయో సంతసించిరి. మీకేల యిట్టి పెద్దపెద్ద పేర్లు పెట్టిరి. అని ధర్మాధికారులు వారిని ప్రశ్నించగా తమ నామములోని విశేషములను జ్ఞానదేవుడు ప్రకటపరచెను. అప్పుడొక దున్నపోతు దారిని పోవుచుండగా దానిని చూపి దానికి జ్ఞానదేవుడని నేనెందుకు పేరు పెట్టరాదు. అని ధర్మాధికారులలో నొకడు ప్రశ్నించెను. అందుకు జ్ఞానేశ్వరుడు దానికిని నాకును భేదము లేదు. ఉభయులలోను ఆత్మ ఏకరూపమే అని జవాబిచ్చెను. అప్పుడా బ్రాహ్మణుడు ఒక కర్ర పుచ్చుకొని ఆ దున్నపోతు వీపుపై క్రూరముగా కొట్టెను. 'అబ్బా' అని అర్చుచూ జ్ఞానదేవుడు స్పృహ తప్పి క్రింద పడిపోయెను. జ్ఞానదేవుని శరీరము పరీక్షించగా ఆ దెబ్బలన్నియూ, జ్ఞానదేవుని వీపుపై పడినట్లుగా రక్తము చిమ్ముచుండెను. బ్రాహ్మణ సంఘమంతయు ఆశ్చర్య చకితులైరి. నీవు వేదములు నేర్చితివిగదా! ఆ దున్నపోతుచే వేదములు చెప్పించెదవా? అని జ్ఞానదేవుని వారు సవాలు చేసిరి. జ్ఞానదేవుడు వినయముతో లేచి అందరికి నమస్కరించి ఆ దున్నపోతు శిరస్సున చేయివుంచి "ఓ! మహిషమా!! నీ నోట ఈ పెద్దలందరు వేదము వినగోరుచున్నారు. కనుక వినిపింపుము" అని ఆ మహిషమును అజ్ఞాపించెను. అంత ఆ దున్నపోతు నాల్గు వేదములలోని భాగములను స్వరయుక్తముగా చదువసాగెను. అచటనున్న ప్రజలందరు యీ సంఘటనను చూసి సంభ్రమాశ్చర్యములకు లోనైరి. ఈ సోదరీ! సోదరులు మానవ మాత్రులు గాదని కేవలము అవతారమూర్తులని వారు చేయు వేదాంత పురాణ గీతోపన్యాసములకు ఎల్లరు హాజరై శ్రవణము చేసి ఆనందించుచుండిరి.

ఇట్లుండ ఒకనాడు వారు బసచేసియున్న బ్రాహ్మణ గృహములలో పితృకార్యము వచ్చెను. సన్యాసి సంతానమును కాపురం పెట్టుకొన్న ఆ ఇంటికి భోక్తలుగా వచ్చుటకు ఎవరును అంగీకరించలేదు. ఆ గృహస్థు ఎంతో దుఃఖంచ సాగెను. మీ రేమియు దుఃఖించ వలదు. మీ పితృ దేవతలనే నేను నియంత్రణము చేసి రప్పింతును. వారిని పూజించినచో వారే స్వయముగా మీ ఆతిధ్య సత్కారములను దక్షిణ తాంబూలములను గ్రహించి మిమ్ము

ఆశీర్వదించి పోవుదురు" అని ధైర్యము చెప్పి సకాలమునకు పితృదేవతల నాహ్వానించి ఆ గృహస్థు యొక్క పితృకార్యం యథావిధిగా సంపూర్తి గావించెను. ఈ సంఘటనతో వారికి విధింపబడిన సంఘ బహిష్కారమును తొలగించి బ్రహ్మణ సంఘమంతయు వారికి దాసానుదాసులైరి.

పిమ్మట జ్ఞానదేవుడును, సోదరులను యావద్భారతమంతయు తీర్థయాత్రలు చేసికొని తిరిగి వచ్చిరి. జ్ఞానదేవునకు 21 సంవత్సరములు వయస్సులో శరీరము చాలించవలెనను సంకల్పము కలిగి ఒక పుణ్యదినమున ప్రజలందరు చూచుచుండగా జీవసమాధిలో ప్రవేశించెను.

37. మహాత్ములకు భ్రాంతిచెందకు

ప్రపంచంలో కొంతమంది మహత్తులు, మహిమలు, సంపాదించి తద్వారా ధన, కీర్తి ప్రతిష్టలు సంపాదించవలెనని మంత్ర, తంత్రయోగాది సాధనలు చేసి తమ అమూల్య జీవితము వ్యర్థపరుచుకొని భ్రష్టులై అధఃపతనము చెందుచున్నారు. వారికి ఎంతమాత్రము పారమార్థిక అభ్యున్నతి కలుగజాలదు. వారిని చూచి లోకులు గొప్ప మహాత్ములనియు, అవతార పురుషులనియు, మోసపోయి వారిసేవచేయుచూ ధన, కనక, వస్తువాహనములను వారికి సమర్పించి ఇహపరముల రెంటికి చెడిన వారగుచున్నారు. ఆ విధముగా మహిమలను ప్రదర్శించువారు తాము చెడినదియే కాక లోకులను చెరుపుచూ లోకహాని కలిగించుచున్నారు. ఆదిలో మోక్షమునే ఆశించి అందులకై ఏదియో సాధనచేస్తూ సాధనాకాలమునందు తమకు ప్రాప్తించిన చిల్లర మహిమలకు ఉబ్బితబ్బిబ్బై పోయి వానిని లోకమున ప్రదర్శించి తద్వారా లభించిన కీర్తులకు వ్యామోహము చెంది తాము ఆదిలో ఆశించిన అభ్యుదయపథమునందు పురోగాములు కాకుండ పోవుచున్నారు. ఆ విధముగా మధ్యలో చేకూరు మహత్తులకు లొంగిపోరాదని హెచ్చరించుచూ శ్రీ స్వామీ వివేకానంద యీ క్రింది కథను చెప్పియున్నారు.

ఒక నగరంలో ఒక పేదవాడు బహుళ సంతానవంతుడై భార్యబిడ్డలను పోషించుటకై ప్రతిదినము సమీపారణ్యమునకు పోయి కట్టెలు కొట్టి తెచ్చి వాని విక్రయము వల్ల వచ్చిన ధనముతో కుటుంబమును పోషించుచుండెను. యింకొక వృత్తివాడు ఎరుగడు. ఇట్లుండు వర్షాకాలము ఏ తెంచి అధిక వర్షములు కురియసాగెను. పచ్చి కట్టెలు ఎవరును కొనరుకదా! ఎండుకట్టెలకై వెదకుచు అతడు అరణ్యమున గొడ్డలి భుజముపై వేసుకొని అరణ్యమంతయు సాయంకాలము వరకు దిరిగెను. ఎండుకొమ్మకూడా అతనికి లభింపలేదు. అతడు అలసిపోయి ఒక చెట్టుక్రింద చతికిలపడి రేపటికి నా కుటుంబమునకు పస్తులే కదా? అని వలపించసాగెను. కొంత సేపటికి ఒక మహాత్ముడు ఆదారిని పోవుచూ, నీవు యిట్లు దుఃఖించుటకు కారణమేమి? అని ప్రశ్నించగా తన దుఃఖకారణము సవిస్తరముగా

విన్నవించుకొనెను. నీవు ఏమియు దుఃఖించనవసరము లేదు. ఉత్తరదిశగా పొమ్ము, నీకు దరిద్ర విచ్ఛిత్తి కాగలదు. సందేహింపకుము అని చెప్పి ఆ మహాత్ముడు తనదారిని పోయెను. ఆ బీదవాడు ఆ మాటలకు ధైర్యము తెచ్చుకొని గొడ్డలి భుజాన్ని వేసుకొని ఉత్తరదిశగా 1,2 ఫర్లాంగులు మాత్రం వెళ్ళెను. అద్భుతము అతనికి అక్కడ ఎండిపోయిన చెట్లతో కూడిన వనము ఒక్కటి కాననయ్యెను. అతడు పరమానందము నొంది ఒక చెట్టును నరుకుటకై గొడ్డలిని ఎత్తెను. కాని అంతలో మహాత్ముని మాటలు స్ఫురణకు వచ్చెను. నీకు దరిద్రవిచ్ఛిత్తి కాగలదు అని మహాత్ముడు చెప్పినాడేగాని ఎండుకట్టెలు దొరుకునని చెప్పలేదే. నేను మోయగలిగినన్ని ఎండు కట్టెలు తీసుకొని పోయినను నాకు దరిద్రవిచ్ఛిత్తి ఎట్లు కాగలదు? కనుక మహాత్ముని మాటలలో ఏదో విశేషమువున్నది అని అతడు యోచించి యింకను ఉత్తరదిశగా పోసాగెను. మరల 1,2 ఫర్లాంగులు పోయెను. అతని కట్టెదుట చందనవన మొకటి ప్రత్యక్షమాయెను. ఒక్క కొమ్మనరికి తీసుకొని పోయినచో ఒక ఏడాది గ్రాసము అతనికి లభించును. అయిననూ శాశ్వతముగా దరిద్రవిచ్ఛిత్తి ఎట్లు కాగలదు? అని యోచించి అతడు యింకను ఉత్తరదిశగా నడచిపోయెను. మొదటి రాగి గనులు, పిమ్మట వెండి గనులు. అటుపై బంగారు గనులు అతనికి ప్రత్యక్షమగుచున్నది. కాని అతడు ఆగలేదు. తుట్టతుదకు అతనికి వజ్రాల గని కానవచ్చెను. యీ వజ్రములలో పెద్ద వజ్రములు 2,3 తీసుకొని పోయినచో నిజముగా అతనికి దరిద్ర విచ్ఛిత్తి అయి 7,8 తరముల వరకు ఎట్టిలోపముండదు. కనుక అతడు మూడు పెద్ద వజ్రములను ఏరి గొడ్డలిని అటు పారవైచి ఆ వజ్రములను అమ్ముకొని అతడు మహా ధనవంతుడై కుటుంబముతో సర్వసౌఖ్యములు అనుభవించసాగెను.

ఎండు చెట్లవనము చందనవనము, రాగి, వెండి,బంగారు గనులు సాధకునకు తన సాధనలో లభించు అవాంతర ప్రయోజనములు వంటివి వాని యందు దేని కాసించిననూ వాని సాధన అంతటితో సమాప్తమై చరమ లక్ష్యమును సాధించలేడు. కనుక, యోగాది సాధనలలో అవాంతరముగా ప్రాప్తించు మహత్తులకు సాధకుడు ఎన్నడునూ వ్యామోహము చెందరాదు. పరమపురుషార్థమైన జన్మరాహిత్య మొక్కటే అతని చరమ లక్ష్యముగా ఉండవలయును.

38. శ్రీకృష్ణార్పణమస్తు

పూర్వజన్మలలో చేసిన సుకృతదుష్కృతముల ఫలమిప్పుడు అనుభవించు చున్నామని, యిపుడు చేయు కర్మఫలితము రాబోవు జన్మకు కారణమై అనుభవించవలసిన కర్మఫలముల కనుగుణ్యమైన శరీరమందు పుట్టెదమనిన్ని, మరల ఆ శరీరముతో నూతన కర్మలొనర్చి మరల జన్మను ఎత్తుతామనిన్ని కనుక కర్మవలన జన్మ, జన్మవలన కర్మ యిట్లనంతముగా యీ సంసార చక్రమునందు పుట్టు చావులయందు తిరుగుచుండునని హిందువుల కర్మ సిద్ధాంతమైయున్నది. ఈ జన్మపరంపరలో జీవుడు అనేక దుఃఖములననుభవించుచూ, యీ దుఃఖము నుండి శాశ్వతముగా ఎట్లు విడుదల లభించునాయని యనాదికాలము నుంచి మానవుడు మార్గాన్వేషణ గావించుచున్నాడు. అన్వేషణా ఫలితములు ప్రస్థానత్రయమని పేరుగాంచిన 1. ఉపనిషత్తులు 2. బ్రహ్మసూత్రములు 3. భగవద్గీత. ఇందు భగవద్గీత సూచించిన మార్గములలో ఈశ్వరార్పణ బుద్ధితో కర్మాచరణచేయుట ఒక మార్గమైయున్నది. యిట్టి కర్మాచరణయందు కర్మఫలములు తన్నంటజాలవని, ఆ విధంగా ఆగామికర్మ పుట్టజాలదని ప్రారబ్దము యీ జన్మయందు అనుభవం చేత నశించునని, సంచితము తత్వజ్ఞానముచే నశించునని, యీ విధంగా కర్మత్రయ నాశనంకాగా జన్మ రహితము సిద్ధించునని చెప్పబడినది.

ఈ సిద్ధాంతమును హృదయపూర్వకముగా విశ్వసించి ఆచరణ యందుంచిన ఒక వృద్ధురాలు ఏపని చేసినా శ్రీకృష్ణార్పణం అని త్రికరణశుద్ధిగా కర్మఫలములను ఈశ్వరార్పణ గావించు చుండెను.

ఆమె పేడతో ప్రతిదినం ఇల్లలుకొనుచు చేతిలో మిగిలిపోయిన పేడను పారవేస్తూ శ్రీకృష్ణార్పణం అంటూ విసరివేయుచుండెను. ఆమె యింటి ప్రక్కనే దేవాలయమూ అందు శ్రీకృష్ణ విగ్రహమూ ఉండెను. దేవాలయార్చకుడు గర్భగుడి తలుపులు తీసేసరికి శ్రీ కృష్ణ విగ్రహము పేడతో మలామా చేసినట్లు ఉంటూ ఉండెను. అతడెంతో కష్టబడి విగ్రహ మంతయు కడిగి ప్రతినిత్యమూ శుభ్రపరచుచుండెను. రాత్రి తాళములు వేయబడిన దేవాలయంలోనికి యెవరు ప్రవేశించలేరు గదా యిది ఎట్లు జరుగుచున్నదో ఎవరికి అంతుపట్టలేదు. గ్రామమంతయు అట్టుడికి పోవుచుండెను.

ఒకనాడొక బాటసారి ఈ విషయమంతయు విని గుడికి అరఫర్లాంగు దూరము వరకు యీ వృద్ధురాల్లిలు తప్ప యితరయిళ్ళే లేవు. ఆమె యింటి నుండియే యీ అపచారము జరుగుచున్నదేమో గనిపెట్టవలెనని సూర్యాస్తమయమునకు పూర్వమే వెళ్ళి రాత్రి ఆ యింటి అరుగు మీద పరుండుటకు అనుమతి కోరి అరుగు మీద కూర్చొని వృద్ధురాలిని పరీక్షించుచుండెను. ఎవరామెకి చ్చినా, ఆమె యెవరికేమిచ్చినా ఆమె శ్రీకృష్ణార్పణం అంటూ

ఉండేది. మరునాడుదయం ఆమె అరుగులు పేడతో నలికి మిగిలిన పేడముద్దను శ్రీకృష్ణార్పణం అంటూ వీథిలోనికి విసరివేయుట చూచెను. కాని ఆ ముద్ద విసరినవైపు చూడగా అదియెక్కడా క్రిందపడిన జాడ కనుపించలేదు.

మరికొన్ని నిమిషములలో తలుపులు తెరుచుటకు, అర్చకుడు రాగా, బాటసారి కూడా అతని వెనుకనే లోనికేగిచూడ, విగ్రహము యొక్క ముఖమునకు పేడముద్ద అంటుకొని యుండెను. ఆ పేడముద్ధ వృద్ధురాలు విసరిన పేడముద్ధ ప్రమాణములోనే యుండుట చూచి బాటసారి తన ఊహ సరి అయిన దేనని గ్రహించి, అయ్యా! మీరా పేడను కడిగి వేయకుడు. ఒక గంట వరకు మరల తాళము వేసి ఉంచుడు, తరువాత తల్పులు తీసేసరికి పేడంత కడిగివేయ బడియుండును. చూచుకోండి అని చెప్పి వృద్ధురాలి కడకు వచ్చెను. ఆమె నలుగు స్నానము చేయుచుండెను.

తల్లీ శ్రీకృష్ణార్పణం అంటూ స్నానం చేయవేమి? ఆ మాటలు విని కృష్ణార్పణం అంటూ ఆమె నాలుగు బాల్చీలు నీళ్ళు తలమీద మొఖం మీద పోసుకొనెను. వెంటనే బాటసారి గుడితలుపులు తీయించి చూడగా విగ్రహం పైనున్న పేడ అంతయు నీటితో శుభ్రముగా కడిగివేయబడియుండెను.

త్రికరణ శుద్ధిగా ఆ వృద్ధురాలు శ్రీకృష్ణార్పణం అనుచుండుటచే నిజముగా ఆమె యిచ్చినవీ పుచ్చుకొన్నవీ శ్రీకృష్ణునకే చేరుచుండెను. వృద్ధురాలికి యిచ్చువాడు పుచ్చుకొనువాడు తాను దృశ్యప్రపంచమూ సర్వమూ శ్రీ కృష్ణుడే అను భావమారూఢమై యున్నందుననే యిది సాధ్యమయ్యెను. తాను వేరు ఈశ్వరుడు వేరు అనుకొన్నంత వరకు ఈశ్వరార్పణ బుద్ధితో కర్మలాచరించినను ఫలానుభవము తప్పదు. సర్వాత్మాభావము ఆరూఢమగుటకు యిది సాధన కావచ్చును. యిది సిద్ధించువరకు తాను చేయు కర్మల ఫలం తనకే చెందుచూ ఉండుట తథ్యము.

39. గురుకృపా సంసిద్ధి

పరమాత్మ సృష్టియందలి 84 లక్షల జీవోపాధులలో మానవోపాధి దుర్లభమైనదని సర్వులకు విదితము "దుర్లభంమానుషం దేహం, వివేకమతి దుర్లభం" అనే న్యాయంగా మానవోపాధికి వచ్చినా వివేకము కలిగియుండుట మరీ దుర్లభము మానవ జన్మయెత్తినందుకు జన్మరహితమునకు కృషి చేయుట, పరమధర్మమైయున్నది. ప్రపంచమునందు గల సర్వమతములు జన్మకారణ వస్తువేదైవమనీ, మోక్షస్థానమునీ, నిర్ణయించు చున్నవి. శ్రీ శివరామ దీక్షిత సిద్ధాంత పరిపూర్ణ బోధయందే జన్మరాహిత్య విధానము చక్కగా నిరూపింప బడినది. పరిపూర్ణ బోధను గూర్చి దాని నిర్మిత విధానము, ఆరూఢ విధానములను గూర్చి పెక్కు పర్యాయములు వివరించుట జరుగుచునే వున్నది. మరల దాని విషయమై

చర్చించుట వల్ల చర్వితచర్వణ దోషము కలుగదా అని శంకించనవసరము లేదు. విశేషించి పునర్విమర్శ ద్వారా సిద్ధాంతమందలి ఆధిక్యత యందలి లోతుపాతులు హెచ్చు అవగాహనకు రాగలవు.

పరిపూర్ణ బోధ ఆరూఢమగుట ఎట్లు? దీనియందలి లోతును గ్రహించి, ఉత్తీర్ణులగుటకు ఆచరించ దగిన ఆచరణ విధానమేమి? అని ప్రశ్న కలిగినచో ఒక్క గురూపాసన, గురుకృప అని చెప్పక తప్పదు. ఒక్క గురూపాసన, గురుకృపల ద్వారానే సర్వార్థ సిద్ధికాగలదు. గురువు అనుగ్రహించ గల ఉత్తమోత్తమఫల ప్రాప్తి యేదో అది గురుకృపా విశేషమనదగును ఇతరులకు తెలియరానిది గురువు వద్ద గుహ్యాతిగుహ్యాముగా నున్న రహస్య జ్ఞానమేమి? అదే స్వరూప జ్ఞానము. అదే ఆత్మరూపం గురురూపం తన నిజరూపమున్ను అయివున్నది. అది "గురున్ముఖే జ్ఞాతవ్యం నాన్యథా గ్రంథ కోటిభిః" ఐననూ గురుబోధ రీత్యా ఆ వస్తువునందు బుద్ధి నిశ్చయము కలిగినను గురుకృపలేనిచో ఆత్మనిశ్చయము కలుగజాలదు అట్లు ఆత్మ నిశ్చయము కలిగించిన వెనుకగాని సద్గురువు పరిపూర్ణ బోధ శిష్యునికి అనుగ్రహించడు.

పారమార్థిక సంబంధమైన ఏ సాధనా సిద్ధికైనా ముందుగా శిష్యునికి అంతఃకరణశుద్ధి కావలెను. ఏకాగ్రత అత్యంత ఆవశ్యకము. సత్కర్మా చరణ వల్ల అంతఃకరణ శుద్ధి కల్గును. ఏకాగ్రత గురూపాసన వల్లకల్గును. ఏకాగ్రతతో చేసిన సాధన అత్యంత శక్తివంతము కాగలదు. గురుకృప కలుగుటకు గురుమంత్రానుష్టానం అత్యంత ఆవశ్యకము. గురుమంత్ర నిర్మాణములో గురుమంత్రము దేనికొరకు జపించవలెనో నిర్ణయింపబడినది. "శ్రీ గురుకృపా ప్రసాద సిద్ధర్థే జపేవినియోగః" అనగా ఒక్క గురుకృపా ప్రసాదసిద్ధికొరకే అని నిర్ణయింపబడియున్నది. గురుమంత్రమునకు సాక్షాత్ శ్రీ గురు పరమాత్మయే అధిష్టాన దేవతయైయున్నాడు. మంత్రమును విడచి వేరే మంత్ర అధిష్టాన దేవత ఉండడు. గురుమంత్రమందే గురు స్వరూపము ఎట్లు నిండియున్నదో సాంప్రదాయక గురువల చెంత శిష్యులు వస్తు నిశ్చయముగా విచారించవలసియున్నది. గురుమంత్రానుష్టానము వల్లనే గురుపుత్రుడు ఆత్మసాక్షాత్కారము పొందవలసియున్నది. గురువు మంత్రమును మాత్రమే ఉపదేశించి ఊరుకొనునా? అంటే తదాచరణ విధానము. అనగా వాచక, ఉపాంశు, మానశిక, అర్థభావన, ధ్యాన పద్ధతులను సాంగోపాంగమున గురువు తెలియచేయును. ప్రారంభంనందు వాచక జపము, తదుపరి ఉపాంశ, పిదప మానసికము. క్రమేణ అభ్యాసము చేయవలసియున్నది. ఇట్లు క్రమేణ అభ్యాసము చేయుటలో మానసిక ఏకాగ్రత లభించి తీరును. మానసిక జపముచే మంత్రశక్తి ఉత్పన్నమగును. ఏలనన మనస్సు ఇటునటు పరుగిడక కేవలము మంత్రాక్షారములపై కేంద్రీకరింపబడును. గురుమంత్ర సిద్ధే గురుకృప అని చెప్పవలెను. మానసిక జపము చేయుచు గురుముఖతః వస్తు నిశ్చయ పూర్వకముగా గురుమంత్రార్థమును గ్రహించి అనగా గురుమంత్రాధీష్టాన దేవత యొక్క స్థాన, స్వరూప, స్వభావమును విని

స్వరూపనిర్ణయమునందే ఏకాగ్రత చెందునట్లు మనస్సును ప్రయత్న పూర్వకముగా ప్రవేశపెట్టి ధ్యానములో సాక్షాత్కారానుభవము పొందవలసియున్నది. అంతరంగ సాధనలో ఎట్టి ఉపేక్షయు పనికిరాదు. పరమాత్మ లేక గురుస్వరూపము ఒక్క మనస్సు చేత మాత్రమే చూడదగినదని, వినదగినదని శ్రుతులు ఘోషించుచున్నవి. "మనసైవాను ద్రష్టవ్యం మనసైవాను శ్రోతవ్యం", అనిన్ని 'ఆత్మావారే ద్రష్టవ్యో, శ్రోతవ్యో, మంత్రవ్యో, నిధి ధ్యాస తవ్యం" అనిన్ని "బుద్ధి గ్రాహ్యమతీంద్రియం" అనిన్ని నిర్ణయించుచున్నవి. మనోపరిపక్వత లేని సాధన వ్యర్థము కాగలదు. పరిపూర్ణ సిద్ధాంతములో గురుపుత్రులు ఉత్తీర్ణుటగుటకు ముఖ్యముగా మూడు మార్గములు నిర్దేశింపబడియున్నవి.

1. అనుష్టానము 2. ఆచరణ 3. విచారణ. ఇచ్చట అనుష్టాన మనగా గురుమంత్రానుష్టాన మనియే తెలియవలెను. అభ్యాసంలో అనేక మానసిక ఆందోళనలకు గురికాగల అవకాశమున్నది. అందువలననే గురూపదిష్ట మార్గములోనే అభ్యసించవలసియున్నది. "నానాయుక్తోపదేశేన తారితా శిష్యసంతతిః" అని గురుమూర్తి కీర్తింపబడుచున్నాడు. ఆచరణ అనగా త్రికరణశుద్ధిరూపకమైన ప్రవర్తన. త్రికరణశుద్ధి ప్రవర్తన వలననే అంతఃకరణ శుద్ధి అయి అంతఃకరణ ఆత్మగా మారగల శక్తి ప్రాప్తించగలదు. అందున పారమార్థిక సంబంధమైన ఆత్మశుశ్రూష అనంబడు పారమార్థిక త్రికరణశుద్ధిని, గురుపుత్రుడు తూచతప్పకుండా పాటించవలసియున్నది . ఇక విచారణ అనగా గురుముఖత, సాంఖ్య, తారక,అమనస్క, మహావాక్య, వార్తిక సిద్ధాంతములు విచారణచే తానే ఆత్మ స్వరూపమును బుద్ధరూప నిశ్చయము పొందవలెను. పిదప గురుమూర్తి ఆత్మ స్వరూపమును వస్తు నిశ్చయ పూర్వకముగా శిష్యునకు ఎరుకపరచి దానిని ధ్యాన్నపద్ధతిలో ఎట్లు ఆరూఢ పరుచుకొనవలెనో ఎరిగించును. అనుష్టాన, ఆచరణ, విచారణలు సరిగా ఏకబాటలో ప్రవేశపెట్టి కృషిచేయు సాధకుడు నిస్సందేహముగా స్వరూప సాక్షాత్కారము పొందగలడు. ఆత్మ సాక్షాత్కారానుభవము కలుగు పర్యంతము అంతఃరంగసాధన (అనగా శ్రవణమనన నిధి ధ్యాసలు) విడువరాదు. అఖండ ఎరుక నిర్ణయము ఎరిగిన నరునికి మాత్రమే పరిపూర్ణ బోధ విషయంలో గురుమూర్తి" ఏసాధన నీకెందుకు వీసానికి పనికిరాదు" అని అన్నారే కాని, ఇతర విషయం కాదని ముఖ్యముగా గ్రహించవలసియున్నది. ఈ అనుష్టాన ఆచరణ, విచారణలు ఎంత కాలము ఎక్కువగా చేయవలెను? అన్నచో ప్రతి నిత్యము నిదురవచ్చినదనక, చచ్చిన దనక చేయుచునే యుండవలెననీ, తెలియవలెను. అనుష్టానము హెచ్చుగా చేయుచున్న కొలది, మానసిక విశ్రాంతి కలిగియుండుట గురుముఖతః తాను విన్న విచారణ జ్ఞప్తికి వచ్చి అందలి విషయము అమూలాగ్రముగా ఆరూఢూమై సందేహ నివారణ తనంతతానుగానే అగుట విషయము లందు వైరాగ్యము, అంతఃకరణ ప్రశాంతి, మున్నగునవి కలుగగలవు. ఈ విధమున పరిపక్వము చెందిన మనస్సే గురుమూర్తినిర్దేశించిన ధ్యాన్న మార్గము ద్వారా

తానే ఆత్మస్వరూపము అనే అఖండ జ్ఞాన సిద్ధిగాంచగలదు. గురుకృప, లౌకిక ప్రయోజనముకై గురుపుత్రుడాశించరాదు. జన్మరాహిత్య రూప పరిపూర్ణబోధ స్థితిని పొందుటకు ఒక్క గురుకృపయే పరమాధారమను విషయము ప్రతిక్షణము గుర్తించిత దాచరణకు వలయు సాధనలు, అనగా గురుభక్తి, గురుసేవ, గురునిష్ఠ, అనుష్టాన, ఆచరణ, విచారణలు చతుర్విధ శుశ్రూషలు మొదలగునవి అత్యంత శ్రద్ధతో అవలంబించవలసియున్నది. సగుణ రూపముతో నున్న గురుమూర్తి అనుగ్రహించి బోధయందలి మర్మములు ఎరుకపరిచినను, అంతరంగ సాధనలచే పరిపక్వమై అనుష్టాన సిద్ధిరూపమైన ఈశ్వరకృపను పొందనిచో ఆరూఢము కాజాలదు. గురుముఖతః తాను విన్న అఖండ ఎరుక యొక్క స్వరూప స్థితియందు తన మనస్సే ఆత్మయై నిలవగలగుటయే గురుకృపకు పరమ తార్కాణము. ఇది అనుభవనీయము. ఇది అంతయు గురుకృప వలననే లభింపగలదు. గురుస్వరూపమే తానై నిలుచుటయే గురుకృప, ఇట్టి అనుభవమును పొందిన వానికి ఇక ఐహికా ముష్మికములందు కోరదగినది లేదు. పరిపూర్ణ బోధయందు జన్మరాహిత్య రూప, సర్వభ్రాంతి రాహిత్య స్థితిని పొందదలచిన గురుపుత్రుడు ప్రప్రధమములో ఇట్టి అఖండ జ్ఞాన సిద్ధిని పొంది తీరవలసిన దేనని చెప్పక తప్పదు. ఈ భావమునే గురుగీత ఈ క్రింది శ్లోకములో ఉద్ఘాటించుచున్నది.

శ్లో॥ స్వయం బ్రహ్మ మయోభూత్వాతత్పరం చావలోకయేత్॥
పరాత్పరతరం నాన్యత్ సర్వగం తన్నిరామయం॥

తా॥ జనుడు తాను బ్రహ్మ స్వరూపియై పిమ్మట దానికిపరమైన కేవలాత్మను గ్రహించును. పరస్వరూపమగు పరిపూర్ణం కంటె అన్యమేమీ లేదు. అది అంతటను నిండి దేనికి ఆధారముగాక నిరామయమైనది.

అఖండ ఎరుక నిర్ణయము ఎరిగిననే కాని పరిపూర్ణ బోధచెప్పరాదు. గురుకృపచే అఖండ యెరుక ఆరూఢుడైన వానికి మాత్రము ఇక సాధనలు పనికిరావని, ఏ సాధనలు లేని పరిపూర్ణ బోధను గురూపదిష్ట మర్గమందే కృషి సల్పమని గురుమూర్తి నిర్దేశించి నారని తెలియవలెను. శ్రీభాగవతుల కృష్ణదేశి కేంద్రులు తాము రచించిన కందార్థములలో గురుకృపను ఇంకను విశేషముగా నిర్వచించి, నిరూపించియున్నారు. "అపరోక్షమౌనె మనుజలకు" అనే కందార్థములో ఈ భావమును వ్యక్తపరచి యున్నారు. పరిపూర్ణ బోధను క్లుప్తముగా చెప్పవలెనంటే పరిపూర్ణమును ఎరుకను ఎరిగి ఎరుకు మానుటయే. ఇక్కడ ఎరుగుట యనగా కేవలము వినుట మాత్రవే కాదు. వాటినిగూర్చి వన్నత నిర్ణయముగా ఆరూఢపరుచుకొనుటయే అని తెలియవలెను. ఈ భావమును కృష్ణదేశి కేంద్రులు ప్రధమంలో "పరిపూర్ణమనే దొకటి లేనిరుకనేదొకటి పరిపూర్ణ మెరుకల నెరిగి ఎరుకనుమాను. అని ఉపదేశము కూడా చేసియున్నారు. అయితే అవి ఏవిదంబున తెలియబడగలవు? అను

ప్రశ్నకు జవాబుగా శ్రీ దేశికేంద్రులు తమ కందార్థములలో సెలవిచ్చియున్నారు. "అపరోక్షమౌనే మనుజులకు పరోక్షంబైన బయలుగురు. కృపలేకన్, **అపరోక్షమౌను** మనుజులకు పరోక్షం బైన బయలు గురుకృప కలుగా, కీలిదేలేని ఎరుకతా తొలుగ విపరీతమౌ బుద్ధి విడిచినీ ఎప్పుడు ఉపచారములు చేయుచుండుము అని నుడివి యున్నారు. దీని భావమేమనగా మనోవాక్కులకందక, శుద్ధనిర్గుణమైయున్న పరిపూర్ణ పరబ్రహ్మము తెలియబడవలెనన్నను, ఎరుకను వీడవలె నన్నను ఎరుకను వీడి అశరీర పద్ధతిలో **కర్తృత్వరహిత కర్మాచరణ ద్వారా** అస్పర్శ యోగ పద్ధతి అలవడవలెనన్నను ఒక్క గురుకృప చేతనేననియు, అట్టి గురుకృప కలుగుటకు, తగు విధమైన ఉపచారములు చేయుచుండుమని నిర్దేశించియున్నారు.

ఉపచారములు చేయు చుండు మా గురుకృప కలుగా అని గురుకృప సిద్ధించు మార్గము కూడా సూచించినారు. ఉపచారము అనగా నేమి? సేవయనియు గంధాదులర్పించు పంచోపచారములు ధ్యాన్నావాహనాది షోడశోపచారములు, ఆవాహనము స్వాగతాదులతో సహా అష్టాదశోపచారములు 18ను సుగంధతైలాభ్యంగనాది చతుష్షష్టి 64 ఉపచారములు అని అర్థములు గలవు. "గురు శుశ్రూష నొనర్చుట నెరిగించెదనెట్లనన్న యేర్పడవినుమానరు లిష్టదైములుఖున్ పరిచర్యయొనర్చునట్లు" అని కందార్థములో పరిచర్య అన్న శబ్దము పయోగింపబడినది. షోడశోపచారములు మొదలగు యుపచారములు యిష్టదైవములకు పరిచర్యయేయగును. కనుక సగుణరూప గురుపూజా విధాన మందీ ఉపచారములన్నియు, చేయతగినవి. శుశ్రూష యనగా సేవయనియే అర్థము. స్థాన, ఆత్మ, అంగ, భావశుశ్రూషలు చేసుకొనుటయే నిజమగు గురుసేవ ఇవిస్వోద్ధరణకు తన అంతఃకరణ పరిశుద్ధికి అత్యంతావసరము. కనుక గురుభక్తులు సగుణరూపంలోను నిర్గుణ రూపంలోను గురుమూర్తిని ఉపాసించుట ముఖ్యకర్తవ్యము. యిట్టి, గురుసేవ వలనే గురుకృపావిర్భావము కాగలదు. ఆ పిదపగాని యెటువంటివాడయినను పరిపూర్ణ యెరుకలనెరుగ జాలడు. ఎరుకనువీడి భ్రాంతి రహితుడు కాజాలడు. గురుకృప పారమార్థికాభ్యున్నతికే గాక, ప్రాపంచికమున గూడ ఎనలేని మేలు చేకూర్చును. శ్లో॥ మూకంకరోతి వాచాలం పంగులంఘయితే గిరిం॥ యత్కృపా మహం వందే పరమానంద మాధవం పరమాత్మయగు మాధవుని కృపయున్నచో మూగివాడు మహోపన్యాసకు డగును. కుంటివాడు కొండలను దాటగలడని భావము. ఆదిశంకరులు శిష్యుడగు పద్మపాదుడు నది ఆవలియొడ్డుకు పోవ సంకల్పించి నపుడు అడుగడుగును అతని పాదములాన్చుకొనుటకు నదిలో పద్మములు మొలవగా వానిపై పాదములాన్చుచు మోగాలైన చెమ్మకాకుండా ఆవతలి ఒడ్డుకు నడచిపోయెనట. యీ విధముగా గురుకృప ఐహిక జీవితము నందు ఎంతో సహాయము గాలదు. గురుకృపా సిద్ధికై గురూపాసన గావించువాడు జీవితములో ప్రారబ్ధానుసారం ప్రాప్తించు సుఖదుఃఖములకు పొంగక కృంగక అంతఃకరణ స్థిమితమును గోల్పోక సదాశాంతుడై యుండును. కనుక ఐహికాముష్మిక సుఖసంతోషములకు చతుర్విద పురుషార్థసిద్ధికి గూడ గురుకృపా సంసిద్ధి అత్యంత అభిలషనీయమైయున్నది.